# తిక్కన భారత దర్శనము

ర చ యి త

**డాక్టరు నండూరి రామకృష్ణమాచార్య, M. A., Ph. D.**

**ప్రకాశకులు**

**నండూరి రామకృష్ణమాచార్య సాహిత్య పీఠం**

ప్లాట్ నెంబర్. 423, రాజరాజేశ్వరీ నగర్, కొండాపూర్, హైదరాబాదు - 500 084.

ఫోన్ నెంబర్ : 9440495887,9866115177

# తిక్కన భారత దర్శనము

(Tikkana Bharata Darsanamu)

{A Book of Thesis for Degree of Philosophy}

by **Dr.Nanduri Ramakrishnamacharya**

ప్రథమ ముద్రణ : 1969 (1000 ప్రతులు )

**డిజిటలీకరణ** (Digitization) : 2026

**డిజిటలీకరణ** పర్య వేక్షణ : నండూరి గోవింద రాజు

ప్రతులకు : 1. నండూరి గోవింద రాజు, ప్లాట్ నం .:423,
రాజరాజేశ్వరి నగరు, కొండాపూర్,
హైదరాబాద్ -500084.

Cell -9440495887.

: 2. నండూరి విద్యారణ్య స్వామి , ప్లాట్ నం.:154,
స్ప్రింగ్ విల్లా, జర్నలిస్ట్ కాలనీ, నిజాం పేట
హైదరాబాద్ -500090.

Cell -9391028231.

వెల : రూ.500/-.

సర్వ హక్కులు (Copy Rights ) : నండూరి రామకృష్ణమాచార్య సాహిత్య పీఠం

కవుల కంటె తుహిన కర్పూర నిభకీర్తి
తెచ్చిరెవరు నీకు తెలుగు తల్లి!
సాహితీ తరంగ సంగీత రసధుని
దేశభాషలందు తెలుగు లెస్స

పూర్వాంభోనిధి కాళహస్తి నగరీ శ్రీమన్న హేంద్రాచల
శ్రీశైలప్రముఖ త్రిలింగ శిఖరీ ప్రాతర్నవోషస్వినీ !
కృష్ణాకంకణ కింకిణీ ఝుణ ఝుణద్ గోదావరీ కాంచికా
ద్రాక్షాపేశల వాఙ్మయా విజయతాం త్రైలింగ పృథ్వీస్థలీ

ధర్మతత్త్వజ్ఞులు ధర్మశాస్త్రంబని
అధ్యాత్మ విదులు వేదాంతమనియు
నీతివిచక్షణుల్ నీతిశాస్త్రంబని
కవి వృషభులు మహాకావ్యమనియు
లాక్షణికులు సర్వలక్ష్యసంగ్రహ మని
యైతిహాసికు లితిహాస మనియు
పరమ పౌరాణికుల్ బహుపురాణ సముచ్చ
యంబని మహి కొనియాడు చుండ

వివిధ తత్త్వవేది వేదవ్యాసు
డాదిముని పరాశరాత్మజుండు
విష్ణుసన్నిభుండు విశ్వజనీనమై
పరగుచుండఁ జేసె భారతమ్ము

**— నన్నయ**

*విద్వత్సంస్తవనీయ భవ్యకవితావేశుండు విజ్ఞాన సం*
*పద్విఖ్యాతుడు సంయమిప్రకర సంభావ్యానుభావుండు కృ*
*ష్ణద్వైపాయనుఁ డర్థి లోకహిత నిష్ఠంబూని కావించె ధ*
*ర్మాద్వైతస్థితి భారతాఖ్యమగు లేఖ్యంబైన ఆమ్నా యమున్*

**— తిక్కన**

# తిక్కన భారత దర్శనము

## మున్నుడి

ఆంధ్రవాఙ్మయమున ప్రాంతఃస్మరణీయులు కవిత్రయము. ప్రథమకావ్యముగ భారతము చిరస్మరణీయము.

తిక్కన భారత దర్శనము 'ప్రౌఢ నిర్భరవయః పరిపాకములో' వ్రాసిన గ్రంథము. ఇప్పట్టున ఆంధ్రవిశ్వకళా పరిషత్తులో గురుదేవులు శ్రీ పింగళి లక్ష్మీకాంతముగారి దేశికత్వము, కీర్తిశేషులు శ్రీ కట్టమంచి రామలింగారెడ్డిగారి తోడి పరిచయ భాగ్యము, రెండేండ్లు 1943 నుండి 1945 వరకు చెన్నపురి విశ్వకళా పరిషత్తులో 'రిసర్చి స్కాలరుగ' చేసిన పని, తదుపరి మైసూరు విశ్వకళాపరిషత్తు యాజమాన్యమున సల్పిన కృషి నా యీ తిక్కన భారతదర్శన గ్రంథమునకు భవ్యకవితా వేషము కల్పించిన ఆద్యప్రకృతులు.

తిక్కన భారత దర్శనము సహృదయుల కేమాత్రము ఉపకరించిననూ రచయిత ధన్యుడు.

**నండూరి రామకృష్ణమాచార్య**

# About the Author :— Dr. N. V. R. KRISHNAMACHARYA

*Extract from "Contemporary Indian Literature" published by the SAHITYA AKADEMI-NEW DELHI in 1955*

## THE NEO-CLASSICISTS

Within recent years, one notices the beginning of a new movement, the return to classicism. If the Leftists and Surrealists rebelled against the romanticism of the earlier decades of this century, the neo-classicists like Nanduri Krishnamacharyulu, Jandhyala Papayya Sastri and G. Joshua are questioning the value of the Surrealism of the years from 1935 to 1960. Harmony, instead of strife, is their ideal. In the post-war world an equilibrium has to be achieved between matter and spirit, between idealism and realism. Krishnamacharyulu and his fellow poets claim that they are effecting this reconciliation. The neo-classicists are anxious to regain for poetry its dignity as the symbol of all that is beautiful and true.

తెలుగు వికీపీడియా

ఈ పుస్తకం మహాభారతాన్ని ఆంధ్రీకరించిన కవిత్రయంలో ఒకరైన తిక్కన సోమయాజి గారి రచనా శైలి, కవితా వైశిష్ట్యం, మరియు ఆయన భారతంలో ప్రదర్శించిన లోకజ్ఞత, ధర్మ సూక్ష్మాలను విశ్లేషిస్తూ వ్రాయబడిన ఒక ప్రముఖ పరిశోధనాత్మక గ్రంథం. తిక్కన గారి "ధర్మాద్వైత స్థితి" మరియు ఆయన కావ్య శిల్పాన్ని అర్థం చేసుకోవడానికి తెలుగు సాహిత్య పరిశోధకులకు ఇదొక ప్రామాణిక గ్రంథంగా ఉపయోగపడుతోంది. పాలమూరు విశ్వవిద్యాలయం వంటి పలు యూనివర్సిటీల తెలుగు ఎం.ఏ. (M.A. Telugu) సిలబస్‌లో కూడా ఈయన విశ్లేషణలను భాగంగా చేర్చారు.

# కృతికర్తకు సుహృదభినందనములు

ఎవ్వాని గళములో నవ్వు కొన్నది నంద
నారామ ఫుల్ల మందార వల్లి
ఎవ్వాని కలములో నివ్వటిల్లెను విశ్వ
భారతీ మంజు మంజీరరవము
ఎవ్వాని చెలిమిలో నివ్వాళు లెత్తెను
పర్దాలు లేని సౌహార్దలక్ష్మి
ఎవ్వాని కలిమిలో పవ్వళించెను సుప్త
గుప్తదాన వ్రతప్రాప్త తృప్తి

ఆతడు, నండూరి వంశ పయః పయోధి
చంద్రముడు; రామకృష్ణమాచార్య సుకవి;
గద్యపద్య తారాతోరణాద్యనేక
కావ్య నిర్మాణ చాతురీ సవ్యసాచి.

**కరుణశ్రీ: శ్రీ జంధ్యాల పాపయ్యశాస్త్రి**

ధైర్యము రొమ్ము విచ్చినది; ధర్మము త్రాసున తూగె, అంచితో
దార్యము వ్రేళ్ళు పాతుకొనె; దక్షతపీఠము వైచి నిల్చె, స
త్కార్య వి నిర్వహమ్మొయిలు గట్టి వసించెను రామకృష్ణమ
చార్యుల గుండె లోతుల ప్రసన్నతలో మధురానుభూతిలో.

**శ్రీ గాడేపల్లి కుక్కుటేశ్వరరావు**

నీ వొక సాహితీఖనివి; నీ సహవాసముచే అపూర్వమౌ
భావములన్ సృజించి నవ వాఙ్మయవీధుల సాహితీ ప్రియం
భావుక సార్వభౌములయి వర్ధిలు శిష్యుల గాంచినావు; పూం
భావ సరస్వతీ తెలుగు భాసకు దిద్దుము తీరుతీయముల్.

**శ్రీ పోలాప్రగడ సత్యనారాయణమూర్తి**

హృదయ మమృత సముద్రము; వదనము కవి
తాలతాంగికి నర్తనశాల; సదన
మతిథి కోటికి నాటి ఋష్యాశ్రమము; వి
శాల వసుధాకుటుంబి నీ సాటి నీవె.

మాదేశిక స్వామి మత్తేభ గమనమ్ము
ఛాత్రపాళికి సదాచార శిక్ష
మాదేశిక స్వామి మంద్ర కంఠధ్వని
శిష్యరాజికి సుఖాసీన ముద్ర
మాదేశికస్వామి మధురాను రాగమ్ము
కావ్య పాఠికి ధైర్యకంచుకమ్ము
మాదేశికస్వామి మంగళా శీరేఖ
కవి కుమారులకు మార్గప్రదర్శి

మా గురుస్వామి శుభాంఘ్రి మండలములు
శిష్యతతి మౌళులకు సుమశేఖరములు;
సహృదయుడు రామకృష్ణమాచార్య గురుడు;
సాటిలేనట్టి కవితా కిరీటధారి.

**శ్రీ శనగన నరసింహస్వామి**

గురువమొకింతలేదు; అధికారినటంచు బడాయిలేదు; సం
బరపడిపోవు చిత్తము స్వభావము తియ్యని పాలమీగడే;
సరసతమూర్తి దాల్చిన వచస్వి, మనోజ్ఞ రసజ్ఞ మానసాం
తరముల సాహితీద్యుతి సుధాకవిరా డజరామరుండహో.

**శ్రీ జంధ్యాల వేంకటేశ్వరశాస్త్రి**

తెలుగు వనాన బుట్టి నలుదిక్కుల కొమ్మలు సాచి పూత పిం
దెల యొలపూప ప్రాయమున నింగికి తారలతోరణమ్ము వె
న్నెల లొలికించి సత్కృపులనేకుల కాశ్రయ కల్పవృక్షమౌ
కులపతి రామకృష్ణు కృతి గుచ్ఛము వొల్చు మహోన్నతిన్ సదా.

**శ్రీ మానప్రగడ సుబ్బారాయకవి**

కానిమ్మోయి కవీంద్ర నీ యతిథి సత్కారమ్ము నీయింటిలో
వాణీ పాదగలంగలన్నధుర నిక్వాణమ్ముతో ఇందిరా
పాణి ప్రస్ఫుట పద్మగర్భ మధు సంపాతమ్ముతో, నిత్య క
ల్యాణమ్ముల్ మరి పచ్చతోరణముగ ఆచార్య మిత్రాయికన్.

**శ్రీ ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రి**

# సూ చి క


| | |
|---|---|
| తిక్కన వ్యక్తిత్వము | 1 |
| తిక్కన వంశం | 2 |
| తిక్కన పేరు | 4 |
| నిర్వచనోత్తరరామయన రచన కాలము | 6 |
| తిక్కన వ్యక్తిత్వములో నేర్పడిన పరిణామ వికాసము | 9 |
| తిక్కన ధర్మాద్వైతము | 10 |
| తిక్కన మతము | 11 |
| తిక్కన హరిహర నాథోపాసన | 14 |
| తిక్కన వేదాంతము | 18 |
| అహంభావము - వినయము | 22 |
| దారిద్ర్య ము - ఐశ్వర్యము | 23 |
| పెద్దన మహాకవి | 24 |
| సాహిత్యము - సమన్వయము | 25 |
| హృదయము - మెదడు | 37 |
| ప్రతిభ - వ్యుత్పత్తి | 38 |
| కావ్యము - కవి జీవితము | 39 |
| తిక్కన రాయబారము | 39 |
| కవిత శిల్పము - విరాటోద్యోగ పర్వములు | 60 |
| భారత రచన | 67 |
| సంస్కృత మహాభారతము | 68 |
| దుర్గాస్తవము విడిచిపుచ్చుట | 73 |
| పాండవుల గుప్త నామములు | 75 |
| తిక్కన - విరాట పర్వము | 78 |
| యుద్ధ పర్వములు | 162 |
| శాంతి సప్తకము | 236 |
| అంగిక స్వాతికాభి వర్ణనము - చిత్తవృత్తి నిరూపణము | 305 |
| తిక్కన నాటి తెలుగుసంఘము | 323 |
| "రస" శబ్ద ప్రయోగము | 336 |
| నవ్వులు | 339 |

# తిక్కన భారత దర్శనము

కవికి, కావ్యమునకు బింబప్రతిబింబభావ ముండుట సహజ ము. "ఈ సూక్తిని యథాక్షరముగ అన్వయించినచో అపార్థ మేర్పడ గలదు. కవి ఆకారరేఖలు కావ్యములో ప్రతిఫలింపవు. కాని కావ్యము కవి అంతరాత్మ ధరించు విశ్వరూప ప్రదర్శనమే. తిక్కన వ్యక్తిత్వ మును గూర్చి తెలిసికొనుటకు మనకుగల ఆధారములు ౧. చరిత్ర ౨. ఐతిహ్యము 3. అతడు కృతిపొందిన కేతన దశకుమార చరిత్రము ౪. అతని కృతులు - నిర్వచనోత్తర రామాయణము – భారతము విరాటాది పదునైదు పర్వములు. ఇందు చరిత్ర వివాద గ్రస్త విషయములతో నిండియుండునది. ఐతిహ్యములలో చెప్పు విషయములు చాలవరకు కడుపులో నుంచుకొనదగునవిగాని నెత్తి మీద పెట్టుకొనదగునవి కాజాలవు. మూడవది, కేతన దశ కుమార చరిత్రము ప్రత్యక్ష ప్రమాణము. అందును కావ్యోచితమైన అతిశ యోక్తికి తావు లేకపోలేదు గాని, అంతర్లీన మైన సత్యము మాత్రము స్వయంప్రకాశమానమైనదే యనుట సహృదయవేద్యమే. ఇక అత ని కృతులు, నిర్వచనోత్తర రామాయణము, విరాటాది పదు నైదు పర్వములు గలవు. ఇందు పీఠికలోని విషయములు అతని వ్యక్తిత్వము ప్రతిఫలించుచున్న స్ఫటిక శిలా హర్మ్యములు. "కథా భాగమునందు గూడ, కవికాలము నాటి సామాజిక స్థితిగతులు కావ్య మునందు ప్రతిఫలించుట సహజము" అను సిద్ధాంతములోని సత్యము సహృదయు లెరుగ నిది గాదు. కాని ఇది సాధ్యమైన గవేష ణము పండితుడు - కన్నులలో వత్తులు పెట్టుకొని గాలించవలసిన పని. ఈ అన్వేషణలో అనేక విషయములు దృష్టిదోష దూషిత ములు గావచ్చును. వీనితోపాటు అజ్ఞాన పతితములైన దోషములు కొన్ని, ప్రమాద పతితములు మరికొన్ని చేరక తప్పదు. మీదు మిక్కిలి, తిక్కన రెండు కృతులు నిర్వచనోత్తర రామాయణము - భారతము గూడ అను వాద గ్రంథము లగుటచే, వాల్మీకికి, వేద వ్యాసునకు చెల్లింప వలసిన కప్పము తిక్కనకు చెల్లించుట కావచ్చును. అందుచే ఈ సమస్య మరింత జటిలమైనది. అయిన నూ దోషములకు భయపడి అన్వేషణ మానుట అన్యాయము. జిజ్ఞాస ఈ అపరాధసుంకమును అవశ్యము చెల్లింపవలసినదే.

## తిక్కన వంశము

తిక్కనకు సమకాలీనుడై అతనిని ప్రత్యక్షముగ చూచిన కేతన దశకుమార చరిత్ర పీఠికలో తిక్కన వంశవర్ణనము గలదు. అందతడు కుల క్రమాగతమైన మంత్రి పదవి యందుండె ననువర్ణన గలదు

తిక్కన తండ్రి కొమ్మనమంత్రి; తల్లి అన్నమ. అప్పటి కాతడు మనుమ సిద్ధి మహారాజు దగ్గర మంత్రి.

**'అందలంబు గొడుగు లడపంబు మేల్కట్టు**
**చామరములు జమిలి శంఖములును**
**గంబగట్లు భూమి కానిక గాగ( బెం**
**పెసగు రాచపదవు లెల్ల( బడసె'** అని కేతన వ్రాసెను.

అందలము-జమిలి శంఖములు మున్నగు రాజలాంఛనములు పడసిన మంత్రి తిక్కన. తిక్కన యింటిపేరు కొట్టరువు వారు.

**'మనుమసిద్ధి మహేశ సమస్త రాజ్య**
**భారధౌరేయు డభిరూప భావభవు(డు**
**కొట్టరువు కొమ్మనామాత్య కూర్మిసుతుడు**
**దీనజనతానిధానంబు తిక్కశౌరి' — ద. చ.**

తిక్కన తరువాత ఆ ఇంటిపేరు పాలూరి వారైన దనుట సుప్రసిద్ధము.1 తిక్కన తాతగారు మంత్రి భాస్కరుడు. నిర్వచనోత్తర రామాయణములో ---

**'సారకవితాభిరాము గుంటూరు విభుని**
**మంత్రి భాస్కరు మత్పితామహుని( దలచి**
**యైన మన్నన మెయి లోక మాదరించు**
**వేళ నా కృతి గుణములు వేయునేల?'** అని తిక్కన చెప్పుకొనెను.

మంత్రి పదవి మాత్రమే గాక కవిత్వము గూడ తిక్కనకు కులక్రమాను గతముగ సంక్రమించిన వారసత్వమే. ఈ సార

1 . ఆంధ్రకవితరంగిణి

కవితాభిరాముడైన మంత్రి భాస్కరుడు తిక్కన నాడు పై పద్యమును బట్టి సుప్రసిద్ధకవియై యుండు ననియే తోచుచున్నది. అయిన అతని కృతులెవ్వి?

భాస్కరరామాయణ కృతికర్తయైన భాస్కరుడే తిక్కన పితామహుడని కొందరూహించు చున్నారు.2 శ్రీ చాగంటి శేషయ్యగారు వాదోపవాదములను సమీక్షించి భాస్కర రామాయణ కృతికర్తలలో నొకరైన భాస్కరుడే తిక్కన పితామహుడని తీర్పు చెప్పినారు. కాని ఆ తీర్పును శిరసావహించుటకు ప్రతిబంధకములు లేకపోలేదు. తిక్కన ఆ మాట స్పష్టముగ చెప్పలేదు. ఆతని సార కవితాభిరాముడని నుతించెనే గాని పూర్వరామాయణమును వ్రాసెనని చెప్పలేదు. అది అందరకు తెలిసిన విషయమే గావున పునరుక్తి దోషము లేకుండ తిక్కన వదిలెనని సమాధానము చెప్పచున్నారు.

ఉత్తర రామాయణము నేల వ్రాయవలసి వచ్చినదను ప్రశ్నమును తిక్కనయే యూహించుకొని సమాధానముగ

**'ఎత్తుటనైనను ధీరో**
**దాత్త నృపోత్తముడు రామధరణీపతి స**
**ద్వృత్తము సంభావ్య మగుట**
**ను త్తరరామాయణోక్తి యుక్తుడ నైతిన్.'**

అని చెప్పి ప్రసక్తి వచ్చినపుడు గూడ పితామహుని పూర్వ రామాయణ రచనను జెప్పకపోవుట భాస్కర రామాయణ కృతికర్త తిక్కన పితామహుడు గాదను ఊహకు దోహద మొసగుచున్నది.

పూర్వ రామాయణ కీర్తి తాతగారికి, ఉత్తర రామాయణ కీర్తి మనుమనికి గట్టి పెట్టుటచే( కథ రక్తి కట్టవచ్చును గాని సత్యము మాత్రము గాదను వాదము గూడ నున్నది.3 ఎట్లయినను తిక్కన పితామహుడైన భాస్కర మంత్రి ఆ నాడు సుప్ర సిద్ధ కవియై యుండుననుట నిర్వివాదము.

---

2 . ఆంధ్రకవితరంగిణి ;

3. శ్రీ పింగళిలక్ష్మీకాంతంగారు—గౌతమవ్యాసములు

# తిక్కన పేరు

నెల్లూరు రాజధానిగ పరిపాలించిన తెలుగు చోడుల వంశమునకు చెందినవాడు మనుమసిద్ధి. ఈ రాజు వంశము దక్షిణ దేశమును పాలించిన చోళ వంశ శాఖయే. వీరు గూడ కావేరికి ఆనకట్ట గట్టించిన కరికాల చోడుని మూలపురుషునిగ పేర్కొనినారు. మధురాంతక పోత్తపి చోడ గండ గోపాల బిరుదులతో శాసనములు వేసినారు. మనుమసిద్ధి మహారాజు తండ్రి తిక్కనృపతి, మహావీరుడు. 'నిజ పరాక్రమమున రాజ్యమువిస్తరించెను. శంభు రాజాది ప్రశస్తారి మండలమును నిగ్రహించి పురమేలెను. కర్ణాట సోమేశు దుర్దమ దోర్గర్వము రూపుమాపి చోళ రాజునకు సాయమొనర్చి 'చోళ రాజ్య స్థాపనాచార్య' బిరుదు గైకొనెను. తిక్కన్నృపతి శాసనములు కంచిలో గూడ గలవు. తిక్కన తండ్రి కొమ్మన తిక్కన్నృపతి దగ్గర మంత్రి. ఈ తిక్కన్నృపతి పరాక్రమ ప్రాభవములు తిక్కన నిర్వచనోత్తర రామాయణ పీఠికలో ఉగ్గడుపుగ నుగ్గడించెను. దక్షిణా పథ రాజ్యరంగమున నిర్వక్ర పరాక్రమ ప్రాభవముతో వెలిగిన తన యేలిక తిక్కన్నృపతి పేరును కొమ్మన మంత్రి తన కొడుకునకు పెట్టుకొనెనని యూహింప వచ్చును. తిక్కనకవి నామధేయమునకు మాతృక తిక్కన్నృపతి పేరే.

ఖడ్గతిక్కన తిక్కనకు వేలువిడిచిన అన్నగారు. ఖడ్గతిక్కన తండ్రి సిద్ధయ, తిక్కన తండ్రి కొమ్మన, ఏకోదరులు. సిద్ధయ గూడ తన కొడుకును తిక్కన యనియే సుగృహీత నామధేయుడైన యేలిక పేరు మీదనే పిలిచెనని యూహింపవచ్చును. ఏక వంశములో ఒకే పేరు గల భిన్న వ్యక్తులను గుర్తు పట్టుట కనువుగ సమకాలీనులు ఇరువురకు ఖడ్గ తిక్కన, కవి తిక్కన యని పౌరుష నామధేయములు బహుకరించిరి. ఖడ్గ తిక్కన గూర్చి జనశ్రుతిలో ప్రచారములోనున్న చాటు పద్యములవలన అతని ఆత్మీయత కొంతవరకు అవగత మగుచున్నది. అతని నిత్యజీవితము నభి వర్ణించు చాటువు ---

**వీరనినాదంబు వేద నినాదంబు.**
**పాయక యే ప్రొద్దు మ్రోయుచుండు**
**భూసురప్రకరంబు సేసలు చల్లంగ(**

**బాయ కెన్నియొ కుటుంబములు బ్రదుకు**
**బ్రాహ్మణావళికి ధారలు పోసిన జలంబు**
**సతతంబు బ్రముంగిట జాలువారు**
**రిపుల కొసగిన పత్రికల పుత్రికలను**
**బాయక కరణముల్ వ్రాయుచుంద్రు**

**మాన ఘనుడైన తిక్కన మంత్రి యింట**
**మదన సమనుడైన తిక్కన మంత్రి యింట**
**మహిత యశుడైన తిక్కన మంత్రి యింట**
**మంత్రి మణియైన తిక్కన మంత్రి యింట**

కేతన దశకుమారచరితమున ఖడ్గ తిక్కన అభివర్ణనము గలదు.

**వేడిన నర్థార్థి వృథపుచ్చనేరని**
**దానంబు తనకు బాంధవుడు గాగ**
**నెదిరిన జమునైన బ్రదికి పోవగ నిని**
**శౌర్యంబు తన కిష్ట సఖుడు గాగ**
**శరణు చొచ్చిన శత్రువరునైన రక్షించు**
**కరుణయే తనకు సంగదము గాగ**
**బలికిన( బాంధవ ప్రభునైన మెచ్చని**
**సత్యంబు తనకు రక్షకుడు గాగ**

**జగతి నుతికెక్క రాయు వేశ్యా భుజంగ**
**రాజ్యరత్నాకర సూర్తి రాజమూర్తి**
**గంధవారణ బిరుద విఖ్యాత కీర్తి**
**దినపతేజుండు సిద్ధయ తిక్క శౌరి.**

కేతన దశకుమారచరిత్ర నాటికి తిక్కన మనుమసిద్ధి మంత్రి మాత్రమేగాక యుభయకవిమిత్రుడు.

**అభినుతుడు మనుమ భూవిభు**
**సభ దెనుగున సంస్కృతముల జతురుండై తా**
**నుభయకవి మిత్ర నామము**
**త్రిభువనముల నెగడ మంత్రి తిక్కడు తాల్చెన్.**

కాని అతడు రచించిన కృతులను కేతన పేర్కొన లేదు.

దశకుమారచరిత్ర నాటికి తిక్కన భారతము రచింపలేదని నిష్కర్ష గ జెప్పవచ్చును. దశకుమారచరిత్రలో భారత్రప్రశంస లేదు.1 నిర్వచనోత్తర రామాయణ ప్రసక్తి గూడ లేదు గాని అప్పటికి తిక్కన ఆ కావ్యమును వ్రాయుచుండ వచ్చును. దశకుమారచరిత్ర నిర్వచనోత్తర రామాయణమున కద్యతన భూతమునందు విర చితమై యుండును. రెండును, పీఠికలందు వర్ణింపబడిన విషయ ములను బట్టి చూచిన ఇంచుమించు సమకాలీనములని తేలును.

## నిర్వచనోత్తర రామాయణ రచనాకాలము

తిక్కన్నృపతి క్రీస్తు శకము ౧౨౫౮ వరకు రాజ్యము చేసెను. అంతవరకు అతని శాసనములు గన్పించు చున్నవి.2

అతని తరువాత మనుమసిద్ధి రాజ్యమునకు వచ్చెను. మనుమసిద్ధి శాసనములు క్రీ.శ. ౧౨౫౮ నుండి కన్పించుచున్నవి. కావున నిర్వచనోత్తర రామాయణ కృతికాలము క్రీస్తు శకము ౧౨౫౬ తరువాతనే యుండుననని యూహింపనగును. ఈ విషయమే నిర్వచనోత్తర రామాయణమందలి ఆంతరంగిక సాక్ష్యము బట్టి నిర్ణయింప వచ్చును. అవతారికలో తిక్కన, కృతిపతి మనుమసిద్ధి పరాక్రమ విజయములు వర్ణించెను. అందు బేర్కొనిన విషయములు కవి కాలానుక్రమముగ గూర్చినట్లు తోచును.

అవతారిక చివర

**'శృంగారంబు నలంగదేమియును బ్రస్వేదాంకుర శ్రేణి లే
దంగంబుల్ మెరుగేదనించుకయు మా హరాష్ట్ర సామంతు సా
రంగున్ దోలి తురంగముంగొనిన సంగ్రామంబునం ధృష్ట స
ప్తాంగ స్ఫార యశుండు మన్న విభు పంపై చన్న సైన్యంబునన్.'**

అను పద్యమున్నది.

ఇందలి సారంగుడు అద్దంకి సీమకుఁ బాలకుడు. ఇతని పేరు శిలాశాసనములు సారంగపాణి అని కానవచ్చుచున్నది.

---

1. వావిళ్ళవారి ముద్రిత ప్రతిలోగల భారత ప్రశక్తి వాక్యములు సంపాదకుడు చేర్చినవే యని ఆ ప్రతి పీఠికయందె గలదు.
2. Nellore Inscriptions Venugopal & Butterworth.

మాధవ నాయకుని అనంతరము సింగళదేవ మహారాజు క్రీస్తు శకము ౧౨౫౪ సంవత్సరము వరకు రాజ్యము చేసెను. సింగళదేవ మహారాజు తరువాత సారంగుడు రాజ్యము సల్పెను. క్రీస్తు శకము ౧౨౫౫ నుండి సారంగపాణి శాసనములు కన్పించుచున్నవి. కావున నీ సారంగుని పేర్కొనిన నిర్వచనోత్తర రామాయణము క్రీ.శ. ౧౨౫౫ తరువాతిదై యుండవలెను. మనుమసిద్ధి క్రీ.శ. ౧౨౬౦ వరకు పరిపాలించెను. అందుచే నిర్వచనోత్తర రామాయణ రచన క్రీ.శ. ౧౨౫౫-౬౦ మధ్య జరిగియుండవలెను. అనాటికి మనుమసిద్ధి రాజుగ, తిక్కన మంత్రిగ నుండుట సిద్ధించుచున్నది.

దశకుమారచరిత్రలో గల ప్రత్యక్షవర్ణనము బట్టి తిక్కన మూర్తి మత్త్వము సాహితీ ప్రియంభావుకుల మనఃఫలకములందు నేటికిని సాక్షాత్కరించు చున్నది.

**సుకవీంద్రబృంద రక్షకు డెవ్వడనిన**
**వీడను నాలుకకు దొడవైనవాడు**
**చిత్త నిత్యస్థిత శివు డెవ్వడనిన**
**వీడను శబ్దమున కర్థమైన వాడు**
**దశ దిశా విశ్రాంత యశుం డెవ్వడనిన**
**వీడని చెప్పుటకుం బాత్రమైన వాడు**
**సకల విద్యాకళాచణు డెవ్వడనిన**
**వీడని చూపుటకు గురి యైన వాడు**

**మనుమసిద్ధి మహీశ సమస్త రాజ్య**
**భాగ్య ధౌరేయు డభిరూప భావభవుడు**
**కొట్టరువు కొమ్మనామాత్యు కూర్మి సుతుడు**
**దీనజనతానిధానంబు తిక్కశౌరి.**

దశకుమారచరిత్రము నాడు తిక్కన, మంత్రి, కవి; సోమయాజి కాలేదనియే తోచుచున్నది. అయిననూ అతడు బహు విధ యాగములు సల్పినట్లు అందు గలదు.

**సరసకవీంద్రులు సత్ప్రబంధము లొప్ప**
**గొనునను టధిక కీర్తనకు దెరువు**
**లలితనానాకావ్యములు చెప్ప నుభయ భా**
**షలయందు ననుట ప్రశంస త్రోవ**
**యర్థిమై పెక్కుకళ్ళ నగ్రహారంబులు**
**గా నిచ్చుననుట పొగడ్త పొలము**
**మహిత దక్షిణలైన బహువిధ యాగంబు**
**లొనరించుననుట వర్ణనము దారి**

**పరుని కొక్కని కిన్నియు బ్రకటవృత్తి**
**నిజముల పెంపు సొంపార నెగడునట్టి**
**కొమ్మనామాత్యు తిక్కన కొలది సచివు**
**నింక నొక్కరుఁ డెన్నంగ నెందు గలడు.**

నిర్వచనోత్తర రామాయణము నందలి అశ్వాసాంత గద్య "ఇది శ్రీమదుభయ కవిమిత్ర కొమ్మనామాత్య పుత్ర బుధారాధన విధేయ తిక్కన నామధేయ ప్రణీతంబైన యుత్తర రామాయణము." తిక్కన, సోమయాజియైనట్లు లేదు.

నిర్వచనోత్తర రామాయణమునందు తిక్కనలో గన్పించు చున్న ఆత్మప్రత్యయము గుర్తింప దగినది.

**"అమలోదాత్త మనీషనే సుభయ కావ్యప్రౌఢి( బాటించు శి**
**ల్పమునం బారగుడం గళావిదుడ నాపస్తంబ సూత్రుండ గో**
**తమ గోత్రుండ మహేశ్వరాంఘ్రికమల ధ్యానైకశీలుండ న**
**న్నమకం గొమ్మన మంత్రికిన్ సుతుడ( దిక్కాఖ్యుండ సన్మాన్యుడన్."**

అంతేగాదు తిక్కన మనుమసిద్ధి మహారాజునకు కృతి యిచ్చుటకు ఉపస్కారముగ

**ఏ నిన్ను మామ యనియెదు.**
**దీనికి( దగనిమ్ము భారతీకన్యక నా**
**కి నర్హుడ వగు దనినను**
**భూనాయకు పల్కు చిత్తమున కింపగుడున్.**

అను పద్యము చెప్పెను. కృతి ప్రధాన సమయమున తిక్కన పలుకులలో గన్పించు ఠీవి రాజసము తెలుగు కవుల కెల్లరకును గర్వ్యాకారణమైనది.

నిర్వచనోత్తర రామాయణము నాడును దశకుమార చరిత్రము నాడును తిక్కన శైవుడే.

**"మహేశ్వరాంఘ్రి కమలధ్యానైక శీలుండ" — ని రా.**
**"చిత్త నిత్యస్థిత శివుడు" — ద. కు. చ.**

## తిక్కన వ్యక్తిత్వములో నేర్పడిన పరిణామ వికాసము

కవితాకళకు ప్రాచీనాలంకారికులు ప్రతిభా వ్యుత్పత్తులతో పాటు అభ్యాసమును గూడ పేర్కొనినారు. తిక్కన ఉభయభాష లందును కృతులు చెప్పినట్లు దశకుమారచరిత్రలో నున్నది. ఆ కృపి యంతయు నిర్వచనోత్తర రామాయణ రచనకు అభ్యాస ప్రాయమైనట్లే— నిర్వచనోత్తరరామాయణము భారత రచన కభ్యాసప్రాయమైనది. తిక్కన 'నిర్వచన' వ్రతము భారతమునకు వర్తింపదు. ఈ కవిత్వములో వచ్చిన యీ పరిణామము అతని వ్యక్తిత్వములో గూడ గాన నగును.

నిర్వచనోత్తర రామాయణము నాడు తిక్కన శైవుడు. తిక్కన కవ్యవహిత పూర్వము తెలుగు దేశమున దక్షిణా పథమున వీర శైవము విజృంభించినది.

మహాభారత రచనము నాడు తిక్కన శివకేశవుల కభేదము సాధించిన హరిహరనాథోపాసకుడు. మతమునందు వచ్చిన ఈ మహత్తరమైన మార్పు గమనింపదగినది. తిక్కనలో వచ్చిన ఈ బహుముఖ పరిణామము కేవలము యాదృచ్ఛికమును గాదు. హఠాత్తుగ వచ్చిన విపరిణామము గాదు. అది తిక్కన అంతరాత్మలో విర్పడిన క్రమపరిణామ వికాసమే.

నిర్వచనోత్తర రామాయణ కాలమున 'అమలోదాత్త మనీషనే సుభయకావ్య ప్రౌఢిబాటించు శిల్పమునన్ బారగుడ( గళావిదుడ' నను అహంభావము భారతరచన నాడు తత్త్వపరిపూరితమైన వినయమై వెల్లి విరిసినది.

**కూర్పుట నూత్న రత్నమునకుం గనకంబునకుందగున్ జనా**
**భ్యర్చితమైన భారత మపార కృపాపరతంత్రవృత్తిమై**
**బేర్చిన దేవదేవునకుం( బ్రీతిగ నిచ్చుట సర్వసిద్ధి, నా**
**నేర్చిన భంగి( జెప్పి వరణీయుడ నయ్యెద భక్తకోటికిన్.**

**భా. విరాట. అవతారిక**

తిక్కన వ్యక్తిత్వములో నేర్పడిన మహత్తరమైన ఈ బహుముఖ పరిణామ వికాసమును ప్రసరించిన అంతర్లీనముగ నొక సువర్ణ సూత్రము గోచరించును.

వేదవ్యాసుడు "ధర్మాద్వైతస్థితి" నిరూపించుటకే భారతము వ్రాసెనని తిక్కన చెప్పెను.

## తిక్కన ధర్మాద్వైతము

తిక్కన భారతారంభమునందు ప్రార్థన శ్లోకము వెనువెంట చెప్పిన పద్యము ఆతని అంతరాత్మను ప్రతిఫలించుచున్నవి.

**విద్వత్ సంస్తవనీయ భవ్య కవితావేశుండు విజ్ఞాన సం**
**పద్విఖ్యాతుండు సంయమిప్రకర సంభావ్యానుభావుండు గృ**
**ష్ణద్వైపాయనుం( డర్థి లోకహితనిష్ఠం బూని కావించె ధ**
**ర్మాద్వైతస్థితి భారతాఖ్యమగు లేఖ్యంబైన ఆమ్నాయమున్."**

"అనన్య సామాన్య కరణంబును పరమధర్మప్రకారంబు" తిక్కన గుర్తించెను. ప్రాచీన గీకు సప్తర్షులలో నొకడగు క్లియోబ్యులసు గూడ పరస్పర వైరుధ్యము గల ధర్మముల సమన్వయించి జగత్తుకు ధర్మాద్వైతప్రాయమైన (Golden mean) సువర్ణ సూత్రము ప్రతిపాదించెను. సర్వధర్మముల మాధ్యస్థమే సువర్ణ సూత్రము అని క్లియోబ్యులసు సుభాషితము. తిక్కన వ్యక్తిత్వములో నేర్పడిన బహుముఖ పరిణామ వికాసమునకు అంతర్వాహినిగ నైక్యము చేకూర్చి సమన్వయము సల్పుచున్నదీ ధర్మాద్వైతమే. మహాభారతమునందుగూడ తన జీవిత వేదాంతమే ప్రతి ఫలించు చున్నదని తిక్కన గుర్తించెను.

**వేదములకు నఖిల స్మృతి**
**వాదములకు బహుపురాణ వర్గంబులకున్**
**వాదైన చోటుల దా**
**మూడల ధర్మార్థకామమోక్ష స్థితికిన్.**

భారతముగూడ సమన్వయ వేదాంతమునే బోధించుచున్నదని తిక్కన వాదము. తిక్కన సమన్వయ వేదాంతి; బహుముఖముల సమన్వయము సాధించిన తాత్త్వికుడు.

## తిక్కన మతము

తిక్కన నిర్వచనోత్తర రామాయణకాలమునందు శైవుడు. "మహేశ్వరాంఘ్రికమల ధ్యానైకశీలుడన" ని అతడే చెప్పుకొనెను. శైవము గూడ భిన్న యుగములలో పరిణామ విపరిణామముల నందినది.

నన్నయభట్టును భారతము నాంధ్రీకరింపుమని తొలుత అభ్యర్థించిన రాజరాజ నరేంద్రుడు శైవుడు. పార్వతీపతి పదాబ్జ ధ్యాన పూజానిరతుడు. చాళుక్య రాజుల కాలమున వెలసిన శివాయతనములు అసంఖ్యాకములు. రాజరాజ నరేంద్రుని తండ్రి విమలాదిత్యుని కాలమున( గూడ ఆంధ్రదేశమున జైనమత ప్రాబల్య ముండెడిది. రాష్ట్రకూట రాజులు దక్షిణాపథమున సల్లేఖన వ్రతముచే ప్రాణములు త్యజించిన జైన చక్రవర్తు లెందరో యుండిరి. అహింసావ్రతమువలన పరాక్రమ ప్రతిష్ఠ తగ్గను. రాజ్యరక్షణకు అది విపత్తు. అందుచే ఆంధ్రదేశమున శైవము రాజమతమైనది. సంస్కృత మహాభారతము నందలి ఆధ్యాత్మిక గీతలు ఈ అహింసా వాదమును ఖండించునట్టివే. ఇతివృత్తము గూడ పౌరుష ప్రధానమైనది. వీర రస భూయిష్ఠమైనది. ఆ కారణము చేతనే రాజరాజ నరేంద్రుడు జైన బౌద్ధవాదములకు ప్రతికూల మైన శైవమును ఆర్ష మత పునరుద్ధరణమున కనువగు మహాభారత మును అభిమానించెను. ఆ కాలమున పరరాజ్య దండయాత్రల నెదుర్కొనుటకు ప్రజల నాయత్తపరచుటకు శైవము; మహా భారతము గూడ ఆవశ్యకమయ్యెను. అందుచే విశ్వశ్రేయము నాపాదించునదే కావ్యమైనది. నన్నయ భారతము రచించుట 'జగద్ధితంబుగన్' అని చెప్పుకొన గలిగెను.

కాని నన్నయ తరువాత యుగమున వీరశైవులు విజృంభించిరి. వీరశైవుల కాలమున జైన బౌద్ధములు మొదలగు అంతచ్ఛిద్రములు మాత్రమే గాదు నాటి సంఘము నెదుర్కొనినవి. నన్నయ నాడే ఉత్తరాపథమున ఇస్లాము దండయాత్ర ఆరంభమైనది. గజనీ మహమ్మదు సోమనాథ దేవాలయముపై కడపటి దండయాత్ర క్రీ.శ. ౧౦౨౬ సంవత్సరము జనవరి నెలలో జరిగినది.1 అనగా రాజరాజనరేంద్రుడు రాజ్యమునకు వచ్చిన నాలుగు సంవత్సరములకు. కాని ఆ దండయాత్రల లక్ష్యము ఇస్లాము మతాభినివేశము; రాజ్యసంపాదనముకంటె ధన సంపాదనమే ముఖ్యమైనది. అయిననూ ప్రతికూల సభ్యతా ఝుంఝూ మారుతముల కదే నాందియైనది. ఇస్లాము మతము నందలి ప్రధాన సూత్రము దేవుడొక్కడే. మహమ్మదతని చిట్టచివరి ప్రవక్త. ఈశ్వరుడు విశ్వపిత అయిన అతని భక్తులందరు సోదరులే. ఈ ఏకేశ్వరోపాసనకు అనుషంగిక సిద్ధాంతము విశ్వమానవ సౌభ్రాతృత్వం. ముక్తికి భక్తి ముఖ్యము.

సనాతన హిందూమతమునకు ఏకేశ్వరోపాసన, భక్తి క్రొత్తవి గావు. భగవద్రామానుజులు ఆ యుగమునందే[2] వైష్ణవ మతము ద్వారా ఏకేశ్వరోపాసన భక్తిపారమ్యమును ప్రబోధించెను.

గజనీ మహమ్మదు దండయాత్రలవలన భారతభూమిని ఇస్లాము వేరు ద్రొక్కుకొని నిలువలేదు.3 కాని గోరీ మహమ్మదు దండయాత్రతో పరిస్థితులు తారుమారైనవి. క్రీ.శ. ౧౧౯౨ లో స్థానేశ్వర యుద్ధమున పృథ్వీరాజును జయించి అతడు అజ్మీరు నాక్రమించెను. క్రీ.శ. ౧౧౯౩ లో అతని సేనాని ఇఖియార్ ఖిల్జీ విశ్వవిఖ్యాతి నార్జించిన నాలందా విశ్వవిద్యాలయమును ఏడంతస్తుల పుస్తక భాండాగారములు రత్నోధధి రత్నసాగర రత్నగర్భ లను నేలమట్టము గావించెను. ౧౧౯౯లో జయదేవ కవి కాశ్రయప్రదాతయైన లక్ష్మణ సేనుని గూడ అతడు జయించుటచే వంగదేశము గూడ తురుష్కాక్రాంతమైనది.

1.రాజరాజ నరేంద్రుడు క్రీ.శ. ౧౦౨౨ ఆగష్టు ౧౬వ తేదిన పట్టాభిషిక్తుడయ్యెను.
2.గజనీ మహమ్మదు దండయాత్ర నాటికి రామానుజులు ఇంచుమించు ౨౨ యేండ్లవాడు.

ఉత్తరాపథము దాటి దక్షిణాపథమునకు గూడ 'ఇస్లాము' అవతరించు తరుణ మాసన్నమైనది. ఆనాడు హిందూమత మంతయు బహు దేవతోపాసనతో కుల విభేదములతో నిండి యుండెను. వీరశైవ ముద్భవించి కులమత విభేదములకు స్వస్తిచెప్పి ఏకేశ్వరోపాసన, శివపారమ్యము ప్రబోధించినది. భక్తి, ముక్తి కేకైక మార్గము. ఆనాడు పండితారాధ్యుని వంటి బ్రాహ్మణ పండితులు"భక్తిమీది వలపు బ్రాహ్మ్యంబుతో పొత్తు వదలలేను నేను బసవలింగ" అని చెప్పియు చివరకు వీరశైవులైరి. దక్షిణాపథమున వీరశైవ సామ్రాజ్యము విస్తరిల్లినది. వీరశైవులైన కాకతీయవీరులు త్రిశూల ఖడ్గధారులై దక్షిణాపథమునంతయు ఏకోన్ముఖము చేసిరి. కాని వీరశైవము ముదిరి "బ్రాహ్మణ గార్ధభముల"ను అద్వైత విమూ ఢులను దుమ్మెత్తిపోసిరి. దీనితోపాటు వైష్ణవులకు వీరశైవులకు వేదాంతములో గల విభేదము కంటె సాంఘిక విభేదములు పెచ్చు పెరిగినవి. ఉభయులకు ముక్తి మార్గము భక్తియే. ఇక ఆ దేవుడు విష్ణువా శివుడా అను నదియే సమస్య. కుత్తుకలు తరుగుకొనుట కది చాలినది. ఆ ఉన్మాదము కనులారా గాంచిన తిక్కన అశ్రువులు రాల్చెను. తాను శైవుడే. అయిన నేమి? అతనికి జ్ఞానోదయమైనది.

**"శ్రీ యన గౌరి నా బరగు చెల్వకు చిత్తము పల్లవింప భ**
**ద్రాయతమూర్తియై హరిహరంబగు రూపము దాల్చి విష్ణురూ**
**పాయ నమశ్శివాయ యని పల్కెడు భక్త జనంబు వైదిక**
**ధ్యాయిత కిచ్చమెచ్చు పరతత్త్వము గొల్చెద నిష్ఠ సిద్ధికిన్**

అని యెలుగెత్తి చాటినవాడు తిక్కన. మతమునందు తిక్కన ఇటు వైష్ణవమునకు అటు వీరశైవమునకు సమన్వయము సాధించిన ధర్మాద్వైతమూర్తి.

---

3. గజనీ మహమ్మదు సోమనాథ దేవాలయముపై దండెత్తి నపుడతని భోజరాజు ఎదిరించెను. భోజుని ఉదయపుర ప్రశస్తి యతడు తురుష్కులను జయించినట్లు పేర్కొనుచున్నది. మహమ్మదు వచ్చిన దారినిగాక సింధు ఎడారి దారిని బట్టి ఎన్నో అగచాట్లుపడి గజనీ చేరినట్లు అతని ఆస్థాన చరిత్రకారుని కథనము.

తొలినాడు శైవుడైనను మలినాడు "విష్ణురూపాయ నమ శ్శివాయ" అని అనగలిగిన మహోదారుడు తిక్కన. గాంధీ

మహాత్ముడు "ఈశ్వర అల్లా తేరేనామ్" అని అన్న వాక్యము తిక్కన విష్ణురూపాయ నమశ్శివాయ అను మాటకు కాలానుగుణమైన భాషాంతరీకరణమే.

తిక్కన సమన్వయదృష్టి "సర్వధర్మేషు మధ్యస్థ మిత్తమమే" అను సువర్ణ సూత్రము అతడు ప్రతిపాదించిన మతము నందు, హరిహర నాథోపాసనలో ప్రత్యక్షముగ సాక్షాత్కరించుచున్నది.

## తిక్కన హరిహర నాథోపాసన

తిక్కన ఉపాసించిన యీ హరిహరనాథు దెవ్వడు? "అని పూని యీ దృశంబులగు పుణ్యప్రబంధంబులు దేవసన్నిధిం బ్రశంసించుటయు నొక్క యారాధన విశేషంబుగతం జేసి" అను తిక్కన వాక్యముల నాధారముగ గైకొని నెల్లూరిలో నాడు హరిహరనాథ దేవాలయ ముండెడిదని కొందరు చెప్పుచున్నారు. తిక్కన హరిహరనాథుని "పరతత్త్వము" గనే పేర్కొనెను.1 ఇప్పుడెచ్చటను నెల్లూరులో హరిహరనాథ దేవాలయముగాని శిథిలావశేషములు గాని లేవు. కొందరు ఆ యాలయము పెన్నలో గలిసి పోయినదని సమాధానము చెప్పుచున్నారు. కాని తిక్కన రచించిన ఆశ్వాసాద్యంత పద్యములలో నెచ్చటను హరిహరనాథుని పెన్నా తీర వాసునిగ( జెప్పలేదు. "హరిహరనాథునకు భక్త పరతంత్రునకు" "ఏను విన్నపంబు సేయు తెరంగుగా నంతస్సన్నిధిం గల్పించుకొని, యమ్మహా కావ్యంబు నర్థంబు సంగతంబు సేసెద" అని వ్రాసెను. తిక్కనవలెనే హరిహరనాథునకు కావ్యముల నంకిత మొనర్చిన కవులు నాచనసోముడు; వెంకటనాథుడు. ఆ యిరువురును నెల్లూరు వారు గారు. నెల్లూరులోని హరిహర దేవాలయమును ప్రస్తావించలేదు.

నాచనసోముడు "హరి మేలంచు హరుండు మేలనుచు నాహాకొందఱు పొందెరుంగరు." అని శివకేశవులకు అభేదము కల్పించుచు సమన్వయ వేదాంతము ప్రతిపాదించుటకే హరి

1. భారతము విరాటపర్వ అవతారిక.

హరనాథోపాసన సల్పుచున్నట్లు స్పష్టముగ ప్రకటించెను. నేటి రంగనాథ దేవాలయ స్థానమున పూర్వము హరిహరనాథాలయ ముండెడిదని మరికొందరి యూహ. తిక్కనకు బూర్వము నుండియు నెల్లూరులో రంగనాథాలయ మున్నది.1

తొలుత శైవుడైన తిక్కన యీ హరిహరనాథోపాసన సల్పుటకు కారణము స్వస్థానము నందలి దేవాలయము గాదు. అది అతని మనస్సులో మతములో ఏర్పడిన పరిణామ వికాసము. హరిహరనాథుడు ధర్మాద్వైతమునకు తిక్కన సృష్టించుకొనిన అధిష్ఠాన దైవతము.

హరిహరనాథ పురము లేక హరిహర్ లేక కుడలూరు అను పట్టణము తుంగభద్రా హరిదానది సంగమ స్థానమున గలదు. ఈ పట్టణము పద్మపురాణ ప్రసిద్ధమైన తీర్థయాత్రా స్థలము.

కన్నడదేశ మందలి హరిహర క్షేత్రమును ఉద్ధరించి గోపుర ప్రాకారమండ పాదులను గట్టించిన వాడు తెలుగు సేనానియైన పోలాళ్వ దండనాథుడు. అతడు క్రీ.శ. ౧౨౨౪ సంవత్సరమున గోపురము కట్టించి నట్లతని శాసనము పలన తెలియుచున్నది. ఈతడు హరిహర చరిత్రము అను గ్రంథము రచించెననియు, సంగీత సాహిత్య ప్రియుడని తెలియుచున్నది.

పోలాళ్వధండనాథుడు హొయసాల వంశస్థుడైన నరసింహరాజు సేనాపతి. ఈతడు క్రీ.శ. ౧౧౯౧ సంవత్సరమునుండి మొదట వీరబల్లాలుని యొద్దను తరువాత అతని కుమారుడు వీరసింగరాజు దగ్గరను దండనాథుడై యుండి అనేక విజయములు సాధించినట్లు అచ్చటి శిలాశాసనములను బట్టి తెలియుచున్నది.[1] దీనిని బట్టి నారాయణ పురవాసియైన ఆంధ్రుడు పోలాళ్వ దండనాథుడీ దేవాలయము వినిర్మించెనని తేలుచున్నది. ఈ దేవాలయ పునర్నిర్మాణము తిక్కన నిర్వచనోత్తర రామాయణమునకు ఇంచుమించుగ సలుబది సంవత్సరముల పూర్వము జరిగినది.

---

1. Nellore Inscriptions.

ఆంధ్రదేశము నందలి అనంతపురమండలము నందలి కళ్యాణదుర్గ సమీపమందలి తూముకంట్ల గ్రామము నందును హరిహరాలయ మొకటి గలదు. అది ఈ హరిహర్‌కు అడ్డదారిని సుమారు ఏబది మైళ్ల లోపుగ నున్నది. తూముకంట్లలోని హరిహరనాథ విగ్రహమునకు హరిహర్ లోని విగ్రహమునకు గల సామ్యము గమనింపదగినది. హరిహర్ లోని హరిహరనాథుడే తూముకంట్లలోని హరిహర విగ్రహమునకు ప్రాతిపదిక కావచ్చును. హరిహరనాథుని తత్త్వము తిక్కనకు పూర్వమే కన్నడదేశమున నున్నట్లు దీనివలన ఋజువగుచున్నది.

పాల్కురికి సోమనాథుడు తిక్కనకు అర్వాచీనుడను వారి వాదమునకు ఉపస్కారకముగ సోమనాథుడు హరిహర నాథోపాసనపై సల్పిన విమర్శ నెత్తి చూపుదురు.2 కాని తిక్కన నిర్వచనోత్తర రామాయణ పీఠిక సోమనాథుని గ్రంథముల పై పరోక్ష విమర్శ అను వాదమును గలదు. అట్లైన తిక్కనకు ప్రాచీనుడైన పాల్కురికి సోమనాథుడు సల్పిన విమర్శ, తిక్కనకు పూర్వమే కన్నడమున నున్న హరిహరనాథోపాసనకే అన్వయించును.

హరిహర క్షేత్రమను పేరుగల సోనేపురు పట్టణ మింకొకటి గంగా గండకీనది సంగమమున గలదు. ఇది వరాహ పురాణ ప్రసిద్ధమగు క్షేత్రము. గాంధీ మహాత్ముడు సనాతనమైన అహింసా సిద్ధాంతమునకు తిరిగి ప్రాణప్రతిష్ఠ సల్పినట్లు తిక్కన గూఢ పురాణ ప్రసిద్ధమైన హరిహరనాథోపాసనకు భారత రచనము ద్వారా పునరుజ్జీవము గల్పించినట్లెంచ వచ్చును.

---

1. వార వధూ కనత్క్వణిక కంకణ ఝుంకృతితో మదేభ పుం
టారుతితో రసమ్మొనగ పాడెడు గాయక బృంద భవ్య గీ
తారుతితో జగత్ ప్రజకు రాగ మొసంగి సుఖమ్ము కెప్పు డున్
కారణమౌచు నారణ పురమ్మొగిరంజిలు నాంధ్ర భూమిలోన్
ఇది కన్నడ వృత్తమునకు తెల్లుసేత. కన్నడ పద్యమును యథాతథముగ సంచుటకై యతి పాటింపలేదు. క. యస్. కోదండరామయ్య, ఎం. ఏ., బి. టి., ఆంధ్ర దిన పత్రిక—15-3-59.

2.హరిహరనాథ దేవాలయమున- పందిని చెక్కవలెనా -నందినా ? మొదలగునవి.

తిక్కన హరిహరనాథుని ధర్మాద్వైత వేదాంతమూర్తిగ మాత్రమే గాక ఉభయ మతములలోని పరదైవతములను సమన్వయించి అధిష్ఠాన దైవతముగ చిత్రించెను. హరిహరనాథుడు 'కేవల భావానందమయుడు.' అస్థిమాల కౌస్తుభము — ఏ అలంకారము అతనికి రుచించును? కాలకూటము యాశోదాస్తన్యము— ఏది అతనికి స్వాదువు.[2]- అని తిక్కనయే ప్రప్రథమమున ప్రశ్నించుకొనును. కాని అతనికి ఉభయమములును రుచించునవే. తిక్కనకు స్వప్నమున హరిహరనాథుడు సాక్షాత్కరించెను.

**కరుణా రసము వొంగి తోర( గెడు చాడ్పున**
**శశిరేఖ నమృతంబు జాలువార**
**హరినీల పాత్రిక సురభి చందనమున**
**గతి నాభి ధవళపంకజము మొఱయ**
**గురి యైన చెలుపున నెఱసిన లోక ర**
**క్షణ మనంగ గళంబు చాయదోప(**
**బ్రథమాద్రి( దోతెంచు భానుబింబము నాను**
**రమ్మన కౌస్తుభ రత్న మొప్ప**
**సురనదియును గాళిందియు( బెరసినట్టి**
**కాంతిపూరంబు శోభిల్లు శాంతమూర్తి**
**నా మనంబు నానంద మగ్నముగ( జేయ**
**నెలమి సన్నిధి సేసె సర్వేశ్వరుండు.**

ఇక ఆశ్వాసాధ్యంత పద్యములలో తిక్కన ప్రతిపాదించిన హరి హర తత్త్వము మతపరిధి దాటి వేదాంత వీధుల విహరించు నట్టిది.

---

2. "కి మస్తి మాలాం కిము కౌస్తుభం వా పరిష్కృయాయాం బహుమన్యసే త్వమ్,
కిం కాలకూటః కిము వా యశోదా స్త న్యం తవ స్వాదు వద ప్రభో మే."

# తిక్కన వేదాంతము

తిక్కన సమన్వయ వేదాంతి. తిక్కన వేదాంతము నొక్క మాటలో సంక్షేపింప వలెననిన ధర్మాద్వైతము అని చెప్ప వచ్చును. భారతము నందలి వేదాంతము ఈ ధర్మాద్వైతమని తిక్కన కంఠోక్తిగ చెప్పెను. కృష్ణద్వైపాయనుడు, ధర్మాద్వైతస్థితి భారతాఖ్యమగు లేఖ్యంబైన ఆమ్నాయమును రచించెను.1

దీనినే విస్తరించి, "వేదములకు" "అఖిల స్మృతి వాదములకు" బహుపురాణ వర్గములకు వాద్రైన చోటుల మూదలగ భారతమును గ్రహింపవలెనని తిక్కన చెప్పెను. ధర్మము ద్వైతమగునా ? పైకట్లు భాసింప వచ్చును.

వేదము లొకటి చెప్పవచ్చును. పురాణము లింకొకటి చెప్పవచ్చును. ఇట్లు విప్రతిపన్నములుగ భ్రమను గొల్పుచున్న వేద పురాణవాక్యములలోని వైరుధ్యము, పరమధర్మమును గుర్తించిన సమసిపోవును. 'సత్యం వద' 'అహింసా పరమో ధర్మః' ఇత్యాది ధర్మములు వేదోపనిషత్ ప్రోక్తములు. అహింసావ్రతము పాటించునపుడు సత్యవ్రతమునకు భంగమేర్పడ వచ్చును. 'ధర్మము బహు మార్గదృష్టంబు.' ధర్మసూక్ష్మ మెరయుట కష్టము. అట్టి యెడ మహాభారతమే పరమధర్మమును బోధించు ధర్మాద్వైత బోధకమగు పంచమ వేదము.

ఒక అరణ్యము. ఒక ఋమిపవాటిక. అరణ్య మార్గమునం( బోవు గృహస్తును సంహరించి ధనమునపహరింప దొంగలు అతని వెంటాడుదరు. గృహస్తు ఆశ్రమము నందలి ఋమి మరుగు చేరును. వెంబడించిన . దొంగ లా గృహస్తు ఏనికి పట్టుల గూర్చి ఋమిని ప్రశ్నించెదరు. సత్యంవద అన్న వేదవాక్యము పాటించిన 'అహింసా పరమోధర్మః' అన్న ఉపనిషత్ వాక్యమునకు భంగము కలుగును. ఇచ్చట ఋమి కర్తవ్యమేమి? ఇచ్చట ధర్మము ద్వైతముగ భ్రమ గొల్పుచున్నది. కాని పంచమ వేదము ధర్మాద్వైత పరిష్కారము సూచించుచున్నది. "భూతహితంబుగా పలుకు

---

1. భారత విరాటపర్వ అవతారిక

బొంకును సత్య ఫలంబు నిచ్చు తత్పూత భయాస్పదంబుగా ప్రభూతపు సత్యము బొంకునట్లు ప్రాణాతురుడైనచో పరిణయంబున యందున పల్కు బొంకు సత్యాతిశయంబ యంద్రు మహితాత్మక యుక్తివి ధర్మ సూక్ష్మముల్."

రెండు ధర్మములు విప్రతిపన్నములై యున్నపుడు దేని ననుసరింప వలెను ? అందేది పరమధర్మమో దాని ననుసరింప వలెను ? అప్పుడు రెండవ ధర్మమునకు ఉపహతి కల్గినను, నిచమునకు ఆచరించినది ధర్మమే. ఇట్లే స్వార్థమును కుటుంబము కొరకై, కుటుంబమును దేశము కొరకై, దేశమును విశ్వమానవ శ్రేయస్సునకై త్యజింపవలెను. దేశశ్రేయస్సు కొరకై పాటుబడునపుడు కుటుంబమునకు ఉపహతి కల్గినను అది అధర్మము కాజాలదు. ధర్మమునకు అధర్మమునకు వైరుధ్యమేర్పడి నపుడు ధర్మముననే స్వీకరింపవలెను. అది సులభ పరిష్కారమే. ఇక రెండును అధర్మములే అయిన ఉభయములను త్యాజ్యములే. ఇక రెండును ధర్మములైన ఆ రెంటికి సంఘర్షణ ఏర్పడిన కర్తవ్యమేమనునదే ప్రశ్న. విప్రతిపన్న ధర్మములకు విర్పడిన సంఘర్షణలను ఇతివృత్తముగా స్వీకరించుటచే మహోజ్జ్వలమైన ప్రాచీన గ్రీకునాటక వాఙ్మయమేర్పడినది. విప్రతిపన్న ధర్మములకు సంఘర్షణ లేకుండ శాంతి సౌఖ్యపూరిత జీవితమును ప్రదర్శించుట మూలముననే విశ్వసాహితీ జగత్తులో మంగళాంత కావ్యము లేర్పడినవి. సంఘర్షణ, సుఖశాంతికి సమన్వయము గల్పించి విప్రతిపన్న ధర్మములకు ధర్మ వికల్పములకు సమన్వయము గల్పించి, పరమధర్మమును నిర్వచించు ధర్మాద్వైత తత్త్వమును నిరూపించు పంచమవేదమే మహాభారతము.

ఆచరణ సాధ్యములు గాని ఆదర్శములు "అహింస" ము న్న గువానిని అనుష్ఠాన వేదాంతములోనికి అనువదించి చూపించి నది మహాభారతము.

శాంతి, అనుశాసనిక పర్వములందు గల ఆధ్యాత్మిక తత్త్వ మును బట్టి సంస్కృత మహాభారతము గూడ జైన బౌద్ధ మతముల కు పూర్వపక్షముగా నుద్భవించిన గ్రంథ మనుట నిర్వివాదము.

తిక్కన గూడ బౌద్ధులను వాదమున జయించినట్లు సోమదేవ రాజీయ కథనము. హనుమకొండ నివాసులైన బౌద్ధులతో కాకతీయ చక్రవర్తి గణపతిదేవుని సమక్షమున తిక్కన వాదము నెరపి జయించినట్లు అందున్నది. హనుమకొండలో అప్పుడున్నది జైనులు. అందుచే గ్రంథకర్త జైనులనుటకు బదులు బౌద్ధులని చెప్పియుండ వచ్చును. సలిలము లుర్వి ఆకసము సర్వము జంతుమయము. హలికుడు నాగలితో పొలము దున్నుచున్నప్పుడు, మానవుడు నీరు త్రాగుచున్నప్పుడు గాలి పీల్చుచున్నప్పుడుగూడ అనేకప్రాణి కోటులు నశించును. అందుచే "హింస చేయని వాడు లేడిజ్జగమున." ఓపినంత వరకు హింసకెడగల్గి బ్రదుకుటయే అహింస యని భారత సమన్వయము.[1] యథాకరముగా అన్వయించినచో అహింస అర్థరహిత మగును. అతివాదులు యథాక్రమముగా స్వీకరించు వారు జైనులు నేటికి కొందరు లేక పోలేదు. కాని అట్టిది అనుష్ఠాన వేదాంతము కాదు. అందుచే సల్లేఖన వ్రతముచే భూలోకము నుండి తొలగిపోవుటయే వారికి మోక్షమార్గము. మరి భూలోకవాసులకు ఆచరణ సాధ్యమైన ఆదర్శములను అనుష్ఠింపదగిన ధర్మమును చూపించునదే పంచమ వేదమాయి మహాభారతము. పంచమ వేదమైన మహాభారతము ఈ క్రియాశూరతనే ప్రబోధించుచున్నది.

ఈ ధర్మాద్వైత తత్త్వము సమన్వయ వేదాంతము తెలుగు భూమిలో నుండి ఆంధ్ర వాఙ్మయమునుండి వెలువడుటలో ఔచిత్యమున్నది. తెలుగుదేశము భారతదేశమున ఉత్తర దక్షిణములకు మధ్య నున్నది. కవయిత్రి సరోజినీదేవి అన్నట్లు ఆంధ్ర సంస్కృతి భౌగోళిక స్థితిని సార్థకమొనరించుచున్నది. ఉత్తరాహుల ఆవేశము దాక్షిణాత్యుల ఆలోచన; అటు భావ శబలత, ఇటు క్రియాశూరత; అటు భక్తి; ఇటు జ్ఞానము తెలుగు సీమలో సంగమించుచున్నవి.[2]

కర్మ సన్యాసమా? లేక కర్మాచరణమా? భక్తియా లేక జ్ఞానమా యేది కర్తవ్యము? ఏది తరణోపాయము. తిక్కన సమన్వయ వేదాం

---

1. అరణ్య పర్వము — ధర్మ వ్యాధోపాఖ్యానము.

2. ఔత్తరాహ రసార్ద్ర హృదయం దాక్షిణాత్య విదగ్ధమేధా తవ శుభ గళే తరళ మంగళ సూత్ర యుగళ దళే.

— తెలుగుతల్లిని గూర్చి తారాతోరణములో

తి. తిక్కనకు స్వీయ హృదయమే, ప్రతిఫలించి మహాభారతము నందు కన్పించినది.

**కేవల నిష్కర్మత మౌ**
**క్త్యావహ మగునేని గిరులు నవనీజములున్**
**భావర ముక్తిం బడయం**
**గావలవదె యడవి నునికి కైవల్యధమే.**

కేవల సన్యాసమే మోక్షావహ మగుననని భారత మాదేశింప లేదు. అయిన కేవలము ఐహిక కర్మ లోలత్వమే మోక్షమని నిర్దేశిం పలేదు.

**ఫలముల యెడ బ్రహ్మార్పణ**
**కలన పరుండగుచు కార్య కర్మము నడపన్**
**వలయం దత్త్వ జ్ఞానము**
**దలగొనినం గర్మ శమము దానై కలుగున్**

అని తిక్కన సమన్వయము.

తిక్కన మహాభారతము చేపట్టుటకు కారణము, భారత వే దాంతము స్వీయ జీవిత వేదాంతము, అభిన్న మగుటయే. జీవిత ము నుండి తరించుటకు మార్గము జీవిత నిర్వహణమే. జీవితమొ క కురుక్షేత్రము. కురుక్షేత్రము ధర్మ క్షేత్రము. ఇహ సాధనము మా త్రమే ధ్యేయముగా గలవి చార్వాకాది దర్శనములు. పరసాధనము మాత్రమే ధ్యేయముగా గల దర్శనములు మరికొన్ని. అట్టివి క్రైస్తవ మతము హిందూమతములోని కొన్ని తెగలు. అయిన భారతము సమన్వయమును ప్రబోధించునది ఇహ పరసాధకమైన అనుష్ఠాన వేదాంతమును బోధించునది.

అయిన కర్మానుష్ఠానమునకు కర్తవ్య నిర్ణయమునకు జ్ఞాన ము అవసరము. అందుచే తిక్కన జ్ఞాన యోగమునకు కర్మకే యె క్కువ ప్రాధాన్యము నిచ్చెననియు, పోతన భక్తి యోగమునకు ఎక్కు వ ప్రాధాన్యము నిచ్చెననియు చెప్పుచున్నారు. కాని యెక్కడ కూడ తిక్కన సమన్వయ వేదాంతియే. అందుచే భక్తిపారమ్యము ప్రబో ధించు వైష్ణవులు గూడ మార్జాల కిశోర న్యాయమును మర్కట కిశోర న్యాయమును ప్రస్తరించిరి.

పోతన భక్తి యోగము కేవల భక్తి యోగము. అందు విశ్వాసము ప్రధానము. ప్రహ్లాద భక్తి, గజేంద్రుని భక్తిని బట్టి భగవంతుడు భక్త పరాధీనుడు అని భాగవతము చాటుచున్నది.

దైవమా? పురుషకారమా? దేనికి పారమ్యము నొసంగవలెను. భక్తుని గాచుట భగవంతుని కర్తవ్యమే. అది కేవల భక్తి యోగము. అందును అరబ్బులవలె భగవద్భక్తి కలిగియుండి ఒంటె కాలికి త్రాడు గట్టుము అనువారు కొందరు. అనగా దైవమును నమ్మి పురుషకారము చేయవలెనని భావము.

హరినామ సంకీర్తనమే సర్వపాపముల సంహరించుననను విశ్వాసము ఒక రకమైన భక్తియోగము. పోతన—

**కమలాక్షు నర్చించు కరములు కరములు**
**శ్రీనాథు వర్ణించు జిహ్వ జిహ్వ**

అని పరవశత్వముతో పాడును. ఇందు విశ్వాసము కరడు గట్టినది. అయిన తిక్కన జ్ఞాన యోగము భక్తి యోగమునకు విరుద్ధము గాదు. జ్ఞానము వలన కర్తవ్యము నెరుగవలెను. తదనంతరము కర్తవ్య నిర్వహణము. అదే కర్మయోగము. అయిన పురుషకారము చాలదు. ఆ పురుషకారమును అహంకారబుద్ధితో గాక "భక్తితో" నెరపవలెను. "నా నేర్చిన భంగి చెప్పి వరణీయుడ నయ్యెద భక్తకోటికిన్" అను నెడ ఈ నిష్కామ కర్మయోగమునే తిక్కన అనుసరించెను. కర్మయోగమునకు - కర్మ సన్యాసయోగమునకు మధ్య నిలిచి సమన్వయ సూత్రమైన నిష్కామ కర్మయోగమునే తిక్కన ప్రతిపాదించెను. తిక్కన భక్తియోగము, నిష్కామ కర్మ యోగము జ్ఞానయోగమునకు సమన్వయమే.

## అహంభావము — వినయము

తిక్కన జీవిత వేదాంతములో గూడ ఈ సమన్వయ భావమే పండినది. "అమలోదాత్త మనీష నేనుభయ కావ్య ప్రౌఢి పాటించు శిల్పమునం బొరగుడ, కళావిదుడ" నను అహంభావము "నా నేర్చిన భంగి చెప్పి వరణీయుడ నయ్యెద" నను వినయముగా పండినది. మానవ జీవితమును క్షీరసాగరమువలె మధించిన భర్తృహరి

"విద్య యొసగును వినయంబు" అని సూక్తీకరించెను. తిక్కన విద్య వంతుడు.

**తెలివి యొకింతలేని యెడ తృప్తుడనై కరిభంగి సర్వమున్**
**దెలిసితి నంచు గర్విత మతిన్ విహరించితి తొల్లి యిప్పు డు**
**జ్జ్వలమతులైన పండితుల సన్నిధి యించుక బోధశాలినై**
**తెలియని వాడనై మెలగితిం గతమయ్యె నితాంత గర్వమున్.**

అను పద్యమునకు తిక్కన జీవద్భాష్యము సల్పెను. అయిన తిక్క న పురుష కారమును విస్మరింప లేదు.

**కావున భారతామృతము కర్ణ పుటంబుల నార్లోలి యాం**
**ధ్రా వళి మోదమము బోరయు నట్లుగ సాత్యవతేయ సంస్కృతి**
**శ్రీ విభవాస్పదంబైన చిత్తముతోడ మహాకవిత్వ దీ**
**క్షావిధి నొంది పద్యముల గద్యములన్ రచియించెదం గృతుల్.**

ఇందు తిక్కన లక్ష్యము ఆంధ్రావళి మోదముం బొరయుట. తాను మహాకవిత్వ దీక్షావిధి నొందినాడు. పదునైదు పర్వములు రచించు టకు ఈ మహాకవిత్వ దీక్షావిధి అవసరము.

భక్తిజ్ఞాన కర్మయోగములకు ముయ్యోలగుట్ట తిక్కన హృద యము.

## దారిద్ర్యము - ఐశ్వర్యము

**ఇమ్మను జేశ్వరాధముల కిచ్చి పురంబులు వాహనంబులున్**
**సొమ్ములు కొన్ని పుచ్చుకొని చొక్కి శరీరము వాసి కాలుచే**
**సమ్మెట పోటులం బడక సమ్మతితో హరికిచ్చి చెప్పె ఈ**
**బమ్మెర పోతరాజొకడు భాగవతంబు జగద్ధితంబుగన్.**

అని నరాంకితము గాకుండ ఈశ్వరాంకితము చేసి స్వచ్ఛందము గా దారిద్ర్యమును వరించిన పోతన మహాకవికి తెలుగువారు యుగ యుగాంతములలో పులకాంకుర ప్రకరములతో కర్పూర నీరాజన మెత్తుచున్నారు.

రాగద్వేషాతీతుడైన మహానుభావుని నోటినుండి ఇమ్మను జేశ్వరాధముల మాట వెలువడి నప్పుడు ఆ వాక్యార్థ్యము ఆ మహా పవిత్రతకు గులాబిమొగ్గల వలె తోచును.

# పెద్దన మహాకవి

నిరుపహతిస్థలంబు రమణీయ ప్రియదూతిక తెచ్చియిచ్చు కప్పుర విడె మాత్మ కింపయిన భోజన ముయ్యెల మంచ మొప్పు తత్పరయు రసజ్ఞు లాత్మ సఖులై రసవత్కవితా విశేషముల్ దొరకిన గాక యూరక కృతుల్ రచియింపు మటన్న శక్యమే.

అని పెద్దనగారికి భవ్యకవితావేశము కల్పించునవి—

**ఎదురైనచో ధన మద కరీంద్రము డిగ్గి**
**కేలుత యొసగి యొక్కించుకొనియొ**
**మనుచరిత్రం బందుకొను వేళ పురమేగ**
**పల్లకి తనకేల పట్టి యెత్తె**
**బిరుదైన కవిగండ పెండేరమున కీవె**
**తగుదంచు దాన పాదమున దొడిగె**
**గోకట గ్రామాద్య నే కాగ్రహారంబు**
**లడిగిన సీమలయందు నిచ్చె**

**ఆంధ్ర కవితా పితామహ అల్లసాని**
**పెద్దనార్య యనుచు నన్ను బిలుచు నట్టి**
**కృష్ణరాయలతో దివికేగ లేక**
**బ్రదికి యున్నాడ జీవచ్ఛవంబ నగుచు.**

అని వాపోయెను. "చెప్పకు మిట్టి తుచ్ఛ సుఖముల్ మీసాలపై తేనియల్" అన గలిగిన మహాకవి.

**ఎవ్వడు మీదురుంగక యధేచ్ఛ సుఖైకరతం జరించునో**
**అవ్వెడ గమ్యనుష్యపశువయ్యవివేకి చెడున్"**

అన గలిగిన మహాకవి చివరకు తానే "జీవచ్ఛవంబు" నైతినని "హంసగీతి" పాడెను. ధూర్జటి మహాకవి

**"రాజుల్ మత్తులు వారి సేవ సరకద్రాయంబు వారిచ్చు అం**
**భోజాక్షీ చతురంతయాన తురగీ భూషాదు లాత్మవ్యథా**
**బీజంబుల్ తదపేక్ష చాలు పరితృప్తిం జెందితిన్ జ్ఞాన ల**
**క్ష్మీ జాగ్రత్ పరిణామ మిమ్ము దయతో శ్రీ కాళహస్తీశ్వరా"**

అనెను.

ఇందులో గూడ రాజుల్ మత్తులు. వాక్పారుష్యము ద్వం ద్వాతీతు డైన మహాయోగి నోటికి అపశ్రుతియె యనుట సంస్కార వంతుల కనుభవ సిద్ధమే. దారిద్ర్యమునకు తలయొగ్గక యెదిరిం చి నిలిచిన మహనీయు లున్నారు. కాని ఐశ్వర్యమును జయించి నిలిచిన వారరుదు.

దారిద్ర్యమును జయించుట కష్టమే. పోతన మహాకవిపై ప్ర జానీక మునకు గల సహజ సానుభూతికి అది యొక హేతువు. దారి ద్ర్యము పాడుచేయలేని వారిని గూడ ఐశ్వర్యము జయించ గలదు. పెద్దన వంటి మహాకవి జీవచ్ఛవమై నిలిచెను.

తిక్కన మహాకవి ఇటు దారిద్ర్యమునకు అటు ఐశ్వర్యము నకు గూడ దూరముగా నిలువగలిగెను. అతడు ద్వంద్వాతీతుడు. పూరిగుడిసెలో నుండియు అది మహారాజ సౌధ మనుకొన గలిగిన వాడు నిస్సందేహముగా మహానుభావుడు. అయిన మహారాజ సౌధ ములో నుండియు అది పూరిగుడిసెగ భావింప గల్గినవాడును మహా ను భావుడే. జనసామాన్యమునకు దారిద్ర్యము యొక్క దారుణ వినా శక శక్తి తెలిసినట్లుగ ఐశ్వర్యము యొక్క అతిదారుణ వినాశక శక్తి తెలియదు.

తిక్కన అంతరంగములో రాజస తామస వాసనలు లేవు. అంతరంగము యొక్క మహత్తునకు విలువ గట్టగలిగిన వారికి "నా నేర్చిన భంగి చెప్పి వరణీయుడ నయ్యెద భక్తకోటికిన్" ఆనగలిగిన తిక్కన అంతరాత్మ, శుద్ధ సత్త్వ తేజస్సుతో స్వయంవ్యక్తమగును.

## సాహిత్యము — సమన్వయము

తిక్కన, సమకాలీనులలో ఉభయకవిమిత్ర బిరుదమూ వ హించి నట్లు కేతన దశకుమారచరిత్రము వలన తెలియుచున్నది.

**అభినుతుండు మనుమ భూవిభు**
**సభ దెనుగున సంస్కృతమునఁ జతురుండై తా**
**నుభయకవిమిత్ర నామము**
**త్రిభువనముల నెగడ మంత్రి తిక్కడు తాల్చెన్.**

తిక్కనకుగల సమన్వయప్రతిభ భారతరచనకు ముందే గన్పించు చున్నది. మనుమసిద్ధి ఆస్థానమున తెలుగు సంస్కృత కవుల కుభ యులకు సామరస్యము ఘటించిన సమన్వయమూర్తి తిక్కన. తి క్కనలో గల సహజ సిద్ధమైన యీ ప్రతిభ, సమన్వయ వేదాంతమే ఆత్మగా గల, భారతము చేపట్టుటతో సార్ధకమైనది.

ఇంతేగాక, ఆ కాలమున సాహిత్యములో గూడ భిన్నవాదములు గల వు. తిక్కనకు పూర్వయుగమున శైవకవులు విలసిల్లిరి. నన్నయ ఆ రంభించిన మహాభారతము రెండు శతాబ్దుల వరకు అసంపూర్తిగ నిలిచిపోయినది. నన్నయ తరువాత ఈ రెండు శతాబ్దులలో కవులే పుట్టలేదా? మహాభారత మేల అసంపూర్తిగ నిలిచియుండెను? ఈ ప్రశ్నలకు సమాధానము నన్వేషింపవలెను. నన్నయకు తిక్కనకు మధ్యకాలమునఁ దెలుగున కవు లెందరో యుద్భవించిరి. నన్నె చో డుడు, పాల్కురికి సోమనాధుడు, పండితారాధ్యుడు ఈ మధ్యకాల మున నున్నవారే. వీరెవ్వరు భారతము పూరించుకుండుటకు గల ముఖ్యకారణము వారు భిన్నమతమునకు చెందుట మాత్రమేగాక సారస్వతములో గూడ భిన్నవాదమునకు జెందినవారగుట గమ నింప దగినది. వీరశైవుల మతావేశము భవికవుల దర్శనస్పర్శ నా దులు పరిహరించు నంతవఱకు బోయెను.

**భవి కృతారంభ సంభవ ధ్యానినిచయు**
**భవి నిరీక్షణ రసపాక వితాన**
**భవి హస్తగత ఫలపత్ర శాకాది**
**భవి గృహ క్షేత్రాంఘ్రిపధన వర్జితుండ**
**భవి జన దర్శన స్పర్శ నాలాప**
**వివిధ దానాదాన విషయ దూరగుండ.**

అని పాల్కురికి సోమనాధకవి పండితారాధ్య చరిత్రమున జెప్ప కొనెను. సమాజములో వీరశైవులు గొప్ప విప్లవమును నెలకొల్పి నట్లే, నాటి సారస్వతములో గూడ శైవకవులు గొప్ప పరివర్తనము సంఘటించిరి.

శివకవు లందఱూ వీరశైవులు గాకపోవచ్చును. కాని వారం దఱకు సారస్వతమునఁ జాల సమానధర్మములు గలవు. శివపార మ్య ప్రబోధము, శివభక్తి, యందఱకుఁ బ్రధానసూత్రములు. వీరి

దృష్టిలో మతము ప్రధానము. సారస్వతము గౌణము. వీరు మత ప్రబోధమునకే సారస్వతసృష్టికిఁ బూనుకొనిరి. తెలుగు వారికిఁ దెలుగు భాషలో శివభక్తిప్రాధాన్యము, శైవమత ప్రాశస్త్యము బోధించుటయే వారి సంకల్పము. కావున వారి కావ్యములు స్వమతస్థాపన పరమత ఖండనలతో నిండిపోయి సార్వజనీనములు గాలేకపోయినవి. వీరి గ్రంథముల నుత్తమోత్తమ కవితయని చెప్పదగిన మహోదార భావములు నుత్కృష్టసృష్టి యనిపించు సన్నివేశములు నెన్నియో కలవు. కాని సాహితీలోకములో వీరికి రావలసిన కీర్తి రాలేదు. చారిత్రకముగా వీరు నన్నయ తిక్కన మహాకవుల మధ్య నున్నారు.

ఇటు చంద్రాస్తమయమును, అటు సూర్యోదయమునకు మధ్య, శుక్రుని యలఁతి యలఁతి కాంతులెంత నిసర్గరమణీయములైనను లోకము చక్కగా దర్శింపలేదు.

శివకవులు సారస్వతమునకుఁ జేసిన సేవ, "జాను తెనుఁగు" నకు, "దేశికవిత" కు వారు కల్పించిన ప్రాముఖ్యము; స్వతంత్రమైన యీ సారస్వతోద్యమమే వారిని నన్నయ నుండి వేరుచేసినది. శివకవులు భారతరచనకు దూరమైరి.

**"మునుమార్గకవిత లోకం**
**బున వెలయఁగ దేశికవిత బుట్టించి తెనుం**
**గును నిలిపి రంధ్రవిషయం**
**బున జన చాళుక్యరాజు మొదలుగఁ బలువుర్."**

అని నన్నెచోడుడు దేశికవితను వివరించెను. నన్నెచోడుని కాలములో నాంధ్రసాహితి లోకములో, "మార్గ" "దేశి" యను భిన్న వాదములు గన్పించుచున్నవి. "మార్గ" "దేశి" పదములు సంగీత నాట్య పరముగ నలంకార గ్రంథములలో గన్పించుచున్నవి. "మార్గదేశి విభాగేన సంగీతం ద్వివిధం మతం"—శాస్త్రబద్ధమైన సంగీతము. 'మార్గ'; యథేష్టాచరణ, నియమ రహితమైన సంగీతము 'దేశి'. అట్లే నృత్యనృత్తములు గూడ. కవితాపరముగ గూడ నీ శబ్దములకిట్లే యర్థవివరణము చెప్పకొనవచ్చును. నన్నెచోడుడీ శబ్దముల నే యర్థమునఁ బ్రయోగించెను? ఈ ప్రశ్నకు సమాధానము చెప్పుటలో పండితులలో నేకవాక్యత కుదురుట లేదు. నన్నెచోడుడే

**"మార్గకుమార్గము దేశియ**
**మార్గము వదవంగఁ దమకు మది వదలక దు**
**ర్మార్గపదవర్తులన దగు**
**మార్గవు లం దలప నలంతి మహి సుకవులకున్."**

అని వివరించెను.

"మార్గ - సంస్కృత కవిత్వము; దేశి - తెలుగు దేశ భాషా కవిత్వము" అని శ్రీ మానవల్లి రామకృష్ణకవిగారు కుమార సంభవ ములో నర్థము వ్రాసియున్నారు. పూర్వోదాహృతమైన చాళుక్య ప్రశంసనుబట్టి నన్నెచోడుని దేశికవితాభిమానము నిర్వి వాదాంశము. కాని, 'దేశి కవిత' యనిన దేశభాషాకవిత్వ మని, యనగఁ దెలుగు కవిత్వమని యర్థము చెప్పినచో చాళుక్య వాఙ్మయమునకు ధ్వజప్రాయమైన యాంధ్రమహాభారతమును గూర్చి గాని, తత్కర్త యైన నన్నయ భట్టును గూర్చిగాని, నన్నెచోడుడు గాని, తిక్కన శివకవులు గాని, పూర్వకవి కావ్య ప్రశంసా పూర్వకముగ నొక్క మాటైనఁ బ్రసక్తి వచ్చి నపుడు గూడ బలుక కుండుట వింతలలో వింత. లేక శివకవులు నన్నయ భారతమును స్వచ్ఛదేశికవితగఁ బరిగణింప లేదా?

నన్నెచోడుడు పొగడిన 'దేశి'చాళుక్యవాఙ్మయ మేది? చాళుక్య రాజ శాసనములలో నన్నయకు ముందే తెలుగులో బద్య రచన కన్పిం చుచున్నది యుద్ధమల్లని బెజవాడ శాసనము, పంద్రంగుని య ద్దంకి శాసనము మున్నగునవి నిదర్శనములు. ఈ శాసనములలో దరువోజలు మధ్యాక్కరలు సీసములు, నాటి వెలదులు తేటగీతు లు కన్పించుచున్నవి. యతిప్రాసాత్మకమైన తెలుగు ఛందస్సు, సంస్కృతములోని ఛందస్సుకంటె విలక్షణ మైనది. వీనిలో సం స్కృత గురుత్వము కంటె దేనుగుఁ దనమే యెక్కువ. ఇవిగాక తుమ్మెద పదములు వెన్నెల పదములు, రగడలు, ద్విపదలు మున్నగు పదవాఙ్మయము మెండుగా యుండె డిదని పండితారా ధ్యచరిత్ర మున్నగు గ్రంథముల వలన నూహింపవచ్చును. ఇట్టి వాఙ్మయవికాస మంతయు "దేశి" శాఖకుఁ జెందినదే గాని "మార్గ" కవితా వర్గమునకుఁ జేరినది గాదు. చాళుక్య రాజ్యారంభము నుండి తెలుగు వాఙ్మయము క్రమపరిణామ

వికాసబద్ధమై యున్నది. నన్నె చోడుని కుమారసంభవములోని చాళుక్యరాజుల దేశికవితా సేవా ప్రశంస యీ వాఙ్మయ వికాసమునకంతటికి నన్వయింప వలె నే మో!

చాళుక్యులలోఁ జివరిరాజు రాజరాజ నరేంద్రుడు. ఆకాలము నాటి కి నన్నయ మహాభారత రచనకు బూనుకొనెను. నన్నయ ప్రయో గించిన భాష — తత్సమకాలీన శాసభాషతోఁ బోల్చి చూచిన చో, "వి పులశబ్దశాసనుడ" ను బిరుదునకు సార్థకత గోచరించును. నన్నయ ప్రయోగించిన భాషలో జాలవఱకు సంస్కృత మర్యాదలు జా తీయములు యథాతథముగ దేనుగులో గనిపించును. నన్నయ వాడుకలోనున్న శబ్దజాలమును సంస్క రించి వాడినాడని చెప్పవ చ్చును. సంస్కృత వ్యాకరణ విరోధ ప్రయోగములు శివకవుల కావ్య ములలో నాటి శాసనములలో గన్పించినట్లు, నన్నయ భారతము నఁ గన్పింపవు. నన్నయ కాలములోని శాసనము అందలి భాష యథాతథముగ గాక, సంస్కార రూపమున నన్నయ కావ్యమున గోచరించుచున్నది. నన్నయ సల్పిన యీ శబ్ద సంస్కారమే యత నికి 'విపుల శబ్దశాసనుడ' ను బిరుదును సంపాదించిపెట్టి యుండు ను. నన్నయ భారతమున నితివృత్తము, భాష, ఛందస్సు సంస్కృత ప్రభావమునకు లోబడినవే. నిర్ణీత నియమబద్ధమైన యతని సం స్కారపద్ధతి 'మార్గ' కవితయే యని శివకవుల మతము గావచ్చును. అందుచేతనే యాదికవియైనను నన్నయ మహాకవిని శివకవులెవ్వ రు స్మరింపలేదు. దేశభాషాకవితా ప్రపంచమున నగ్ర గణ్యమైన న న్నయ భారతమును శివకవు లెల్లరు స్మరింపకపోవుటకుఁ గారణ ము భిన్నమత ప్రవృత్తియే కాక భిన్నసారస్వత దృక్పథము గూడ నని చెప్పవచ్చును.

సంఘమున నొక ప్రత్యేక మతమును వెలయించినట్లే శైవు లు వాఙ్మయమునఁ నొక స్వతంత్రసారస్వతోద్యమమును నెల కొ ల్పినారు. "గద్యపద్య సంస్కృత భూయిష్ఠ ప్రబంధ రచన, మానుగ సర్వసామాన్యంబు గాద" ని పాల్కురికి సోమనాధుని ప్రవచనము. ఈమాట నన్నయ నెత్తిపొడుపు. తిక్కన తన తొలికావ్యమగు నుత్తర రామాయణమును నిర్వచనముగనే రచించెను.

**"ప్రాసమైనను యతిపై వడియైన**
**దేసిగా నిలిపి యాదిప్రాసనియతిన్**
**దప్పకుండగ ద్విపదలు రచియింతు"**

ఇది పండితారాధ్య చరిత్ర యవతారికలో సోమనాధుని ప్రతిజ్ఞ. తె లుగు కవితకు ముఖ్యలక్షణములు యతిప్రాసలు. తెలుగు ఛంద స్సునకుఁ బ్రత్యేకత నిర్దీత గురులఘు పరంపరానుపూర్వ్య సంకలి త మగు గణములు గాక మాత్రాబద్ధము లగు గణములు. తెలుగు యతి సంస్కృత యతికంటె విశిష్టము. సోమనాధుడు, 'ప్రాసము, యతి 'దేసి' గా నిలిపి, యని యర్ధవంత మైన వాక్యము ప్రయోగిం చెను. విరామపూర్వకమైన సంస్కృత యతి గాక వర్ణ సాజాత్యపూ ర్వకమైన తెలుగు యతితో తదనుగుణ ముగ వ్రాయుట 'దేశి' కవిత. 'దేశి' కవితాశాఖ సంస్కృతవాఙ్మయ మర్యాదకు లోబడదు. ప్రాసని యతి సంస్కృత వృత్తములలో లేదు. అది తెలుగు కవితకుం బ్ర త్యేక భూషణము. నన్నయ సంస్కృతములోని ఛందస్సులను గ్ర హించి వానికిఁ దెనుగు యతి ప్రాసలు చేర్చి భారతములో వాడెను. కాని శుద్ధదేశికవితా వాదులగు సోమనాధాదులకిది నచ్చలేదు. వా రు శుద్ధదేశీయమైన ఛందస్సు లో ద్విపదలో వ్రాసినారు. మాత్రా గణబద్ధములైన పద్యములు జాతులు. "జాతులు మాత్రానుసంధాన గణవినీతులు గాన" మాత్రా గణబద్ధమైన ద్విపదలో శుద్ధదేశిగ కావ్యము లల్లెదనని సోమనాధుని ప్రతిజ్ఞ.

**"ఉరుతరగద్యపద్యోక్తులకంటె**
**సరసమై పరగిన జాను తెనుంగు**
**చర్చింపగ సర్వసామాన్య మగుటఁ**
**గూర్చెద ద్విపదలు గోర్కి దైవార."**

"ఉరుతరగద్యపద్యోక్తులు"—నన్నయవని గుర్తింప వచ్చును. శివ కవుల కాలమున కవి సర్వసామాన్యము గాకపోయినవి. భాషాప్రయో గమున శివకవులు ప్రతిపాదించిన కొత్త సూత్రము "జాను తెనుం గు." "సరళముగాఁగ భావములు జాను తెనుంగున నింపు పెంపుతో బిరిగొన"—వ్రాయవలె నని కుమారసంభవ పీఠికలోని మాట. సోమ నాధుడు పండితారాధ్యచరిత్రమున "జాను

తెనుంగు విశేషము ప్రసన్నతకు" అని ప్రతిపాదించినాడు. సోమనాథుడే వృషాధిప శతకమున జానుతెనుంగున కుదాహరణ ప్రాయముగ వ్రాసిన పద్యము.

**"బలు పాడ తోలు సీరయును బాప సరుల్ గిలుపారు కన్ను వె**
**న్నెల తల సేదు గుత్తుకయు నిండిన వేలుపు తేరు వల్లు పూ**
**సలు గల రేని లెంక వని జాను తెనుంగున విన్నవించెదన్**
**వలపు మదిన్ దలిర్ప బసవా బసవా బసవా వృషాధిపా!"**

ఈ పద్యమును బట్టి జాను తెనుంగన సచ్ఛతెనుంగని కొందఱర్ధ ము తీయుచున్నారు. కాని యీ నిర్వచనమునకు గుమారసంభవ మే గాక యీ సోమనాథుని బసవపురాణము పండితారాధ్య చరిత్ర ము గూడ నపవాదములే. నన్నెచోడుడు సోమనాథుడు వారి జాను తెనుంగు కావ్యములలో సంస్కృత సమాసములు కుప్పతిప్పలుగఁ బ్రయోగించినారు. మఱికొందరు జానుతెనుంగనఁ దేటతెనుంగని యర్థము నిచ్చుచున్నారు. 'జానుతెనుంగు' 'తేటతెనుంగు'—మాట ల రెంటిని విడివిడిగా సోమనాథుడే ప్రయోగించినాడు. జాను తెను గు, తేట తెనుగు అనగా సులభముగా నర్థమగు తెనుగు— అని సూ ర్యరాయ నిఘంటువులో వివరణము గలదు. కాని, శివకవుల జాను తెనుగు కావ్యములలో సులభగ్రాహ్యములు గాని సంస్కృత సమాస ములేకాక, కన్నడ భాషాపదములు శ్రుతి స్మృతి వాక్యములు, పె కుక్కలు గలవు.

శివకవులు వాడిన భాషకుం గొన్ని ప్రత్యేక ధర్మములు గల వు. వారి దృష్టిలోఁ దెనుగు భాషను శాసించుటకు సంస్కృత వ్యాక రణమునకు హక్కు లేదు. తెలుగు భాషలో సహజసిద్ధముగ వాడుక లో నున్న పదములు, సంస్కృత వ్యాకరణ సమ్మతములు గాకపో యినను, శివకవులు కుప్పతిప్పలుగ వాడినారు.

**"నల్లవే బసవన్న నందీశమూర్తి"**
**"నల్లవే బసవయ్య ముల్లోకవంద్య"**
**"కట్టితి సర్వాంగ కచ్చడం బనుచు"**
**"శ్రీ మహాదేవుండన్నామంబు లున్న**
**వే మహి నెటువంటి యితరవెల్పులకు"**

— బసవపురాణము

"నిత్యపడి, పుడమిశ, భక్తకూటువలు, సద్భక్తసమూహి." ఆ కాలపు తెలుగు శాసనములలో, నంతకు ముందు శాసనములలో గూడ నిట్టి సమాసములు గానవచ్చుచున్నవి. శివకవుల ప్రయోగసరణి సమకాలీనశాసనములలో గన్పించుటచే నట్టి పదము లాకాలము నఁ దెనుగు నాలుకలపై నలుగుచుండెనని యూహింపవచ్చును. సహజసిద్ధముగ దెనుగువారు వాడు పదములు కావ్యములలో వా డు కొనవచ్చు నని వారి యాశయము. జాను తెనుఁగన నిసర్గమైన తెనుఁగు. అందు సంస్కృత పదములుండ వచ్చును. ఆ సంస్కృ తము సంస్కృతపు ఠీవితోగాక తెలుగు నుడి నను సరించి చేరును. శివకవులు నన్నయ 'విపుల శబ్దశాసన' త్వము సంగీకరింపలేదు. శివకవులు, నన్నయ "గద్య పద్యప్రబంధ భూయిష్ఠ రచన, యురు తరగద్య పద్యోక్తులు, శబ్ద శాసనత్వము" పైఁ బూర్వపక్షమును నెల కొల్పి, సర్వతంత్ర స్వతంత్రమగు నూత్న సారస్వతోద్యమమును నెలకొల్పిరి. నన్నయ యారంభించిన యాంధ్రమహాభారత మసం పూర్ణముగ నిలిచి పోవలసి వచ్చినది.

శివకవులు ప్రతిపాదించిన సారస్వతోద్యమము సార్వ జనీనము గాలేదు. సాహిత్య ప్రపంచమున భిన్నవాదములు చెల రేగినవి. శైవయుగములోఁ జిట్టచివర నుద్భవించిన కావ్యము రంగ నాథ రామాయణము. రంగనాథరామాయణ కర్త శివకవులను బూర్తిగ ననుసరింప లేదు. ఛందస్సు శుద్ధదేశియగు ద్విపద యేగాని యితి వృత్తము సంస్కృత రామాయణమే. భాషాప్రయోగ స్వాతంత్ర్యము ను బట్టి చూచినను శివకవులవలె విశృంఖల విహారము సలుప లేదు. ఈ కావ్యము వీరశైవమత క్షీణదశను సంస్కృత సాహిత్య గౌ రవ పునరుద్ధరణాభిమానమును వ్యక్తము చేయుచున్నది. రంగనా థరామాయణము తిక్కన మహాయుగమునకు వేగుచుక్క. ఇట్టి స్థితి గతులలో నన్నయ యారంభించిన మహాభారతమును బూరింప సాహసించు మహాకవి లేకపోయెను. ఈ యుగమందే వేములవాడ భీమకవి సాహసించి భారతమును బూరింప సమకట్టియు విఫలుడై యుండ వచ్చును. వేములవాడ భీమకవి విరాటపర్వము నుండి కొన్ని పద్యములు అలక్ష్యగ్రంథములందుదాహరింపఁ బడినవి. భారతమువంటి మహేతిహాసరచనకుం గవులందఱు నధికారులు

కారు. అదియొక సామాన్యకవి కసాధ్యమైన పని. ఒక సారస్వత పరిషత్తు లేదా పరిషత్తు వంటి యొక మహాకవి సాధింపవలసిన కర్తవ్యమది. రాజరాజ నరేంద్రుని తరువాత వేంగీదేశమునకువీరవిజయాదిత్యుండు పరిపాలకుండయ్యెను. రాజరాజనరేంద్రుని యాశ్రయమునఁ బొంపొందిన 'రాజమహేంద్ర కవీంద్ర సమాజమున'కు రాజాశ్రయము తప్పినది. ఇక వ్యక్తు లెవ్వరు భారత రచనకుం దలపెట్టలేదు. అంతలో శివకవులు చెలరేగి, దేశికవిత, జాను తెనుగు వాదములతో నన్నయ భారత వాఙ్మయముపై దండెత్తిరి.

రెండు శతాబ్దుల తరువాత తిక్కన మహాకవి తిరిగి మహాభారత రచనకుం బూనుకొనెను.

"అల్పాక్షరంబుల ననల్పార్థ రచన", జాను తెనుగు, దేశి కవిత "ద్వి పదరచన" యను సిద్ధాంతరాద్ధాంతములేగాని వాని యంతస్తత్వ మెట్టిదో, యవి యెంతవరకనుసరణీయములో చూపిన మహాకవి మాత్ర మంతవరకెవరు లేకపోయెను. అస లంతరార్థము గుర్తింపక, వృథావాగ్వివాదములలోఁ బడిన సారస్వతోపాసకులందరు, నేకో న్ముఖము చేసి యన్ని వాదములలోఁగల సత్యమును సమన్వ యించి చూపిన సారస్వతాచార్యుడు తిక్కన. నిజమునఁ కుత్తమ సాహిత్యగౌరవ మౌచిత్య పరిపాలన, భావనా పాటవము రసప్రతీతి పైనను, గావ్యమున కంగభూతములైన జాతీయము పలుకుబడి ను డికారముపైన నాధారపడి యుండును. వీనిలోనే యేకదేశమునో గ్రహించి, ఛందస్సుపైననే, భాషపైననే యధికనిష్ఠ చూపిన కవికి సాహితి సృష్టిలో నేకదేశసిద్ధి మాత్రమే లభించును. అట్లుగాక, పరి పూర్ణసిద్ధి పొందిన మహాకవి తిక్కన. ఈ సత్యమునే తిక్కన తన తొ లికావ్యమైన నిర్వచనోత్తర రామాయణ పీఠికలో నాచార్యుడై కవితా లోకమునకుపదేశించినాడు. ఈ ప్రబోధము సమకాలీన సాహిత్య మీమాంసలపై విమర్శ. శివకవులు ప్రతిపాదించిన 'జానుతెనుగు, దేశికవిత, యల్పాక్షరంబుల ననల్పార్థరచన, మున్నగు సిద్ధాంత ములపై నిర్వచనోత్తర రామాయణ పీఠిక సాహిత్య సమీక్ష. అంత మాత్రమేగాదు. చిరానుభవముచే దాను గళాధర్మము లని గ్రహించి న సూత్రములఁ దిక్కన యాంధ్ర సారస్వతజగత్తున కుపదేశించి నాడు. నిర్వచనోత్తర రామాయణ పీఠిక యొక్కటే తిక్కనకుఁ దెనుగులో నాలంకారిక సంఘమున నగ్ర

గౌరవము నందింప గలదు. ఆ నాడు తిక్కనకుం గవిగానే గాక కవితాశిల్పవేత్తగ గూడ బ్రఖ్యాతి గలదు. సమకాలీన సాహిత్య వాదములపై సుకుమారనిశిత విమర్శ, నిర్వచనోత్తరరామాయణ పీఠిక యను విషయము, శివకవుల కావ్య పీఠికలు, తిక్కన కావ్య పీఠికతోఁ బోల్చిచూచినచో స్వయంవ్యక్తము కా గలదు.

**"సరళముగాఁగ భావములు జాను తెనుంగున నింపు పెంపుతోఁ**
**బిరిగోన వర్ణనల్ ఘటిత పేర్కొన నర్థము లొత్తగిల్ల బం**
**ధురముగఁ బ్రాభమల్ మధుమృదుత్వరసంబునఁ గందళింప న**
**క్షరములు సూక్తి లార్యులకుఁ గర్తరసాయన లీలఁ గ్రాలగన్"**

కుమారసంభవములోని పై పద్యములోని, 'ఇంపుపెంపు' నకుఁ దిక్కన నిర్వచనోత్తరరామాయణ పీఠికలో బూర్వపక్షమును నెల కొల్పుచు

**"ఎట్టి కవికైనఁ దనకృతి యింపుఁ బెంపుఁ**
**జాలుఁ గావునఁ గావ్యంబు సరసులైన**
**కవుల చెవులకు నెక్కిన గాని నమ్మఁ**
**డెందు పరిణతి గల్గు కవీశ్వరుండు."** — అని వ్రాసినాడు.

**"జాత్యముఁగామి నొప్పయిన సంస్కృత మెయ్యెడఁ జొన్ప, వాక్య సాంగత్యము చేయుచో నయిన గద్యము తోడుగఁ జెప్పి వెట్టదౌ ర్జత్యము దోఁప భాషముఁ బ్రకారము వేఱుగ నక్షరంబులన్ శుత్యనురూప మంచు నిడ, సూరుల కివ్విధ మింపుఁ బెంపదే"**

— నిర్వచనోత్తర రామాయణము

"జాత్యముఁగామి నొప్పయిన సంస్కృత మెయ్యెడఁ జొన్ప"--అను ప్రతిజ్ఞ శివకవు లధిక్షేపించిన "సంస్కృత భూయిష్ఠ రచనకు సమాధానము". వాక్యసాంగత్యము చేయుచో నయిన గద్యము తోడుగఁ జెప్పివెట్ట"--అను వాక్యము శివకవుల 'ఆరూఢ గద్య పద్యరచనకు' 'ఉరుతర గద్యపద్యోక్తులకు' ప్రత్యుత్తరము. 'ప్రాసము ప్రకారము వేఱుగ నక్షరంబు శుత్యనురూపమంచు నిడ', అనునది శివకవుల నెత్తిపొడుపు.

**సర్వజ్ఞభక్తి విరహితు డెవ్వాఁడు నుత్కృష్టభాతుఁ డేటికిఁ గొఱయే.**

—శివతత్త్వసారము.

ప్రాసమున శివకవులు కతిపయహల్ సామ్య మున్న సరిపడిరి.

**అలవడ సంస్కృత శబ్దము**
**తెలుగు బడి విశేషనంబు తేట పడంగా**
**బలుకు నెడ లింగవచనం**
**బులు భేదింపమికి మెచ్చు బుధజనము కృతిన్.**

అని నిర్వచనోత్తరరామాయణ పీఠికలో తిక్కన పేర్కొనిన కావ్య దోష ములు శివకవులపైనఁ బరోక్షవిమర్శయే. తిక్కన, నిర్వచనోత్తర రా మాయణ పీఠికలో "పలుకుల పొందులేక రసభంగము సేయుచుఁ బ్రాత పడ్డ మాటలఁ దమ నేర్పుచూపి" అని కుకవి నింద సల్పి నా డు. తిక్కన పద ప్రయోగకౌశల మొక లలితకళ. ఈ కళావైదగ్ధ్యము న కతని రెండు కావ్యములు ఉదాహరణములే. తిక్కన 'రసభంగ ము' గర్హించి పదముల కూర్పుపైఁ దన యభిప్రాయము వెల్లడించెను.

**"లలిత పద హృద్య పద్యం**
**బులన కథార్థంబు ఘటిత పూర్వాపరమై**
**యలతి యలతి తునియలు గా**
**హాళ సంధించిన విధమున న మరగ వలయున్"**

అలతి యలతి తునియలు పూర్వాపరముగఁ గాహాళ నిర్మించి నట్లు పదములను బ్రయోగింపవలెనని తిక్కన యాదేశము. అటు ప్రాత వడ్డ మాటలు గాని, యిటు వ్యవహారమున నలిగిన మాట లన్నియు ను యథాతథముగఁ బ్రయోగార్హములని తిక్కన చెప్ప లేదు. కవితా ర్థమును గంధవహుఁడు పుష్పదళంబుల సౌరభ మిచ్చు చందము న వికసింపఁ జేయవలెనని తిక్కన యాశయము.

నిర్వచనోత్తరరామాయణము అను పేరు గూడ తిక్కన సమ న్వయ దృష్టికి నిదర్శనము. "ఆరూఢ గద్యపద్య సంస్కృత భూయి

ష్ఠ రచన" కు, ఇటు కేవలము దేశియైన ద్విపద రచనకు తిక్కన వేసిన "మధ్యమార్గము".

"జానుతెనుగు" ధనము యథార్థమునకు కావ్యము నందలి అంత స్తత్త్వముపై నాధారపడును. అది భాష, ఛందస్సు, గద్య ప ద్య విభేదముల కతీతమైనది. తిక్కన భారతమును నిర్వచనముగ వ్రాయ లేదు. గద్యములోఁ గూడ కవిత యుండవచ్చును.[1] గద్యప ద్యములకు సమన్వయము గావించి భారతమును ఇంపువుగనే తి రిగి రచించెను. ఇంతేగాక తిక్కన భావము భాషకు సమన్వయ ము సాధించిన మహాకవి. కవులలో చాలమంది భాష పైననో లేదా బావ ము పైననో అధిక నిష్ఠ చూపుదురు. కాళిదాసు మహాకవి మాత్రము

**వాగర్థా వివ సంపృక్తౌ వాగర్థ ప్రతిపత్తయే**
**జగతః పితరౌ వందే పార్వతీ పరమేశ్వరౌ**

అని అర్ధనారీశ్వరుని అవినాభావ సంబంధముతో గూడిన దాంప త్యమును శబ్దార్థముల కలయికతో పోల్చెను. కొందరు "పార్వతీ పర మేశ్వరౌ" అని కాళిదాసు గూడ హరిహరాద్వైతమును సూచించెన ను వారున్నారు. అప్రజ్ఞావాదముల కేమిగాని తిక్కనగూడ కాళిదా సు వలె భాష భావముల అవినాభావ సంబంధము గుర్తించి, రెంటి పై సమనిష్ఠ చూపి సాహిత్య సమన్వయము సాధించినకవి. ఇట్లే భావోచితభాష వాడ గలిగెను. అవసరమైన చోటుల

**భీష్మద్రోణకృపాది ధన్వి నికరాభీలంబు దుర్యోధన**
**గ్రీష్మాదిత్య పటుప్రతాప విసరాకల్పంబు శస్త్రాస్త్ర జా**
**లోష్మస్ఫార చతుర్విధోజ్వల బలాత్యుగ్రంబుద్రగ్ ధ్వజా**
**ర్చిష్మత్త్వాకలితంబు సైన్యమిదియే చేరంగ శక్తుండనే.**

అని సంస్కృత సమాస జటిలముగను, లేదా

**కని యుత్తరుండు గరు పా**
**యిన మేనును దలంకు మనము తెచ్చ వడిన చూ**
**పున్నె తొట్రుపడుచుని**
**ట్లనియె దిగులు సొచ్చి యా బృహన్నలతోడన్**

---

1. గద్యం కవీనాం నికషం వదంతి.

అని అలతి అలతి పలుకుల కాహళ సంధించిన విధమునఁ జాను తెలుగు పలుకుబడులతో కవిత చెప్పగలడు. సామరస్య సంధాత గనే పద ప్రయోగమునందును తిక్కన గోచరించును.

## హృదయము - మెదడు

కవులలో హృదయాళువులు కొందరు, మేధావులు మరి కొందరు. ఇట్లనిన హృదయాళువులకు మెదడు కొరవడినదని గాని మేధావుల కు హృదయము కొరవడినదని గాని చెప్పట కాదు. ప్రాధాన్య వివక్ష చే దిఙ్మాత్రముగ నీ విభజన చేయవచ్చును.

పోతన మొదలైన కవులు హృదయాళువులు. పింగళి సూర న మొదలైనవారు మేధావులు. హృదయాళువులలో ఆవేశ మెక్కు వ. మేధావులకు ఆలోచన అధికము. తిక్కనలో మెదడు హృదయ ము సమానమైన పాళ్లలో మేళవించినవి.

హృదయాళువులైన కవులలో భావశబలత, మేధావులైన వారిలో వాస్తవికత గోచరించును. హృదయాళువులు భావుకులు. మేధావులు ఇంగితజ్ఞులు. భావుకత ఇంగిత జ్ఞానము తిక్కనలో మేళవించినవి.

తిక్కన స్వీయజీవితమునందును సమన్వయముననే సా ధించెను. తిక్కన లౌకికుడు. మంత్రిపదవి నిర్వహించినవాడు. రా యబారిగ అతనికిగల ప్రజ్ఞ అసాధారణమైనది. అయినను అతడు తన్ను గూర్చి హరిహరనాథుడే చెప్పినట్లు వ్రాసిన పద్యము నర యదగినది.

**వైదిక మార్గ నిష్ఠమగు వర్తనమున్ దగ నిర్వహించుచున్**
**భేదము లేని భక్తి మతి నిర్మల వృత్తిగఁ జేయుచుండు మ**
**త్పాద నిరంతర స్మరణ తత్పర భావము కల్మి నాత్మ స**
**మ్మోదముఁ బొంద గావ్యరసమున్ గొనియాడుచునుండు డెప్పుడున్.**

అందుచేతనే భారతరచనకు పూర్వము పంచమవేదము ననువ దించుటకు యజ్ఞము చేసి సోమయాజియై అధికారి యయ్యెను. ఇటు లౌక్యము అటు వైదికము రెంటికి తిక్కన సమన్వయము సాధింప గలిగెను.

# ప్రతిభ - వ్యుత్పత్తి

ప్రాచీనాలంకారికులు ప్రతిభా వ్యుత్పత్తులను కవితా హేతువులుగ పేర్కొని యున్నారు. కవులలో కొందరిలో ప్రతిభ అధికము. మరి కొందరిలో వ్యుత్పత్తి అధికము. ఇది సహృదయ హృదయైక వేద్య మైన విషయము. తిక్కన మహాకవి వ్యక్తిత్వము లోని విశేషము ప్రతి భా వ్యుత్పత్తులు సమానిష్పత్తిలో రాశీభూత మగుట. ఇక్కడను తిక్కన సమన్వయసంధాతగనే సాక్షాత్క రించును. అంతేకాక తిక్కన మహాకవి వ్యక్తిత్వములో మరియొక విశేషమున్నది. రాజశేఖరుడు కావ్యమీమాంసలో ప్రతిభను ప్రస్త రించి భావయిత్రి, సమాధి, కార యిత్రి అను మూడువిభాగము లేర్ప రచెను. భావయిత్రి అచ్చపు కవితాశక్తి. రవి కాంచనిచో కవిగాంచగల దివ్యదృష్టి. ఇక కారయిత్రి. కవి తన దర్శనమును ప్రదర్శింపగల నేర్పు. ఇవి కారయిత్రి; బావ యిత్రి కవితా కళలోని స్త్రీ పురుష యోగములు. కాని కవి తాను ద ర్శించిన అతిలోకసౌందర్యమును లేదా సత్యమును వాచామ గోచ రమైన దానిని అనిర్వచనీయమైన దానిని వాక్కులో ప్రతిపాదింప వలయును. ఇది లౌకికదృష్టితో చూచిన స్వవచోవ్యాఘాతపూరిత మైన సిద్ధాంతము గావచ్చును. గాని కవితాజగత్తులో స్వయంవ్యక్త మగుచున్న విచిత్ర విరోధా భాసము. కవి తన దర్శనమును వెను వెంటనే ప్రదర్శనము లోనికి అనువదించడు. అతని దర్శనము సమాధిబద్ధము కాపలేను. రాజశేఖరుడు కనిపెట్టిన యీసత్యమునే యాంగ్లమున వర్డ్స్‌వర్త్ కవి గూడ గుర్తించి, అనుభవించిన భావావేగ మును అనుస్మరణ పూర్వకముగా పునశ్చరణము చేయుటయే కవి తాకళ యని వచించెను. ఈభావనిగ్రహమే కవిని మహాకవిని చేయు చున్నది.[1]

1.యస్. వి. రామమూర్తిగా రొక సభలో ఉపన్యాసకులు. ప్రార్థనతో సభ ఆరంభించి నది. ఒక అమ్మాయి మా తెలుగుతల్లికి మల్లెపూదండ పాట పాడినది.

గలగల కృష్ణమ్మ కదలిపోతుంటే

బిరబిరా గోదారి సాగిపోతుంది - బంగారు పంటలే పండుతాయి

ముత్యాల మురిపాలు నిండుతాయి—అని అలపించింది.

రామమూర్తిగారు లేచి. గలగల గోదారి కదలిపోతుంటే బిరబిరా కృష్ణమ్మ సాగిపోతుంటే కాదు ముత్యాలు పండేది బంగారు నిండేది. వాటికి అనకట్టవేసి - రామపాదసాగర్ - నాగార్జునసాగర్ కడితే అప్పుడు సస్యశ్యామలం అవుతుండి దేశం అని కూర్చున్నారు.

ఉత్తమ కావ్యసృష్టి ఉత్తమ భావయిత్రికి నిదర్శనము. కా ని అధమ కావ్యసృష్టికి అధమ బావయిత్రి కారణము కాకపోవచ్చును. అది సమాధిలోని లోటు కావచ్చునని మిల్లరు మహాశయుడు వ చించెను. భావోద్వేగము లేకున్న కవియే కాలేడు. భావోద్వేగము జీ వనది వంటిది. దానికి ఆనకట్ట కట్టుకొనినప్పుడే కవి మహాకవి కాగల డు. అప్పుడే 'విశ్వశ్రేయం కావ్యమ్'. తిక్కనలో గల యా నిగ్రహము సమాధి ఇతరుల కందునది గాదు.

నిగ్రహమే జగత్తులో కవితా జగత్తులో మానవుని యోగిగ కవిని ఋషి గ చేయ గలుగుచున్నది.

## కావ్యము — కవి జీవితము

కొందరు కవులు గొప్ప కావ్యములను వ్రాయగలరు. శృంగార రసప్ర ధానమైన కావ్యమును వ్రాసిన కవి జీవితములో శృంగార రసాను భూతి లేకపోవచ్చును. బుద్ధుని జీవిత చరిత్ర వ్రాసిన వారందరు భూతదయాపరులు కాకపోవచ్చును. లేక పోయిన మగవారెవ్వరు ప్రసవవేదన మాట వ్రాయుటకు వీలు లేదు. కాని ఉత్తమోత్తమ కవి త యెప్పుడును స్వీయ హృదయ నివేదనమే. అనుభూతి లేని రచన చేటపెయ్య యనియు, అనుభూతియే కవిత కు ప్రాణప్రతిష్ఠ యనియు చెప్పవచ్చును. తిక్కన మహోదార జీవి తము నెరపిన వాడు. అతని కవిత్వము జీవితము గూడ మహో దారములే. కావ్య మునకు కవిజీవితమునకు గల ఈ సామరస్యము తిక్కన వ్యక్తిత్వ మునకు మెరుగు పెట్టుచున్నది.

## తిక్కన గణపతిదేవ చక్రవర్తియొద్ద నెరపిన రాయబారము

అక్కన్న బయ్యన్నలు, దాయాదులు మనుమసిద్ధి నోడించి రాజ్యము గైకొనిరి. మంత్రి తిక్కన కాకతి గణపతిదేవ చక్రవర్తి కొలు వుకూటమున కేగి, యాతని సాయమున మనుమసిద్ధి మహారాజును సింహాసనమునఁ బునఃప్రతిష్ఠితుని చేసెననని జనశ్రుతి.

తిక్కన మంత్రి మనుమసిద్ధి మహారాజునకు రాయబారియై గణపతిదేవ చక్రవర్తి కొలువుకూటమునకుఁ జేరుటకు ముందే తిక్క

న కవి యశస్సు చక్రవర్తి వీనులు సోకినది. గణపతి దేవ చక్రవర్తి మహాకవి కెదురేగి స్వాగత మిచ్చినాడు. కవిపూజ సలిపినాడు. తిక్కన వలన భారతామ్నాయము విని, మెచ్చి కవిని వరము కోరు కొనుమనినాడు. మంత్రి తిక్కన మనుమసిద్ధి మహారాజును సింహాసనమునఁ బ్రతిష్ఠింప వేడికొన్నాడు. చక్రవర్తి అనుగ్రహించి, స్వయముగా సేనాపతియై తరలి కవి కోర్కి తీర్చినాడు. కథ రక్తి కట్టినది. ఇందు తిక్కన గొప్పతనము గణపతిదేవుని రసజ్ఞత ఆంధ్ర మహాభారత మహిమ స్వయంవ్యక్తమై, కావ్యకల్పనవలె నున్నది. ఇందలి చారిత్రక సత్యమేమి? అను ప్రశ్న వచ్చుచున్నది.

సిద్ధేశ్వరచరిత్రమను ద్విపదకావ్యమున నీ కథ గలదు.

**సారె సారెకుఁగేరి సన్నుతుల్ చేయ**
**సార పారావార సరస గంభీర**
**సారుడై కీర్తివిస్తారుడై యలరు**
**నా రీతి గణపతి నటు చూచు వేడ్క**
**దిక్కన సోమయా జక్కడ కొకట**
**దిక్కు దిక్కులనుండి తెరలి విద్యార్థు**
**లక్క డక్కడను గావ్యముల శ్లోకార్థ**
**మొక్కొక్క విధమున నెగి వినిపింప**
**జక్కన వినుచును నొక్క యందలంబు**
**నెక్కి తిక్కన సోముఁడక్కడ డేతెంచె**
**నా రీతిగ సోమయాజుల రాక**
**వారక చని పణిహారులు దెల్ప**
**అట్టి మహత్ముకని నా సోమయాజి**
**నెట్టన నెదురేగి నేర్పుతోఁ రాజు**
**తెచ్చి యర్ఘ్యాసనస్థితునిగఁ జేసి**
**మెచ్చి తాంబూలాదు లెచ్చుగా నిచ్చి**
**అగు భారతాఖ్యాన మా వీరవరులు**

**తగఁ జేసి నట్టి యుద్ధప్రకారములు**
**వినియు సంతోషించఁ గని నట్లు చెప్ప**
**అంతఁ దిక్కన సోమయాజికి మెచ్చి**

వింత వస్త్రంబులు వివిధభూషణము
అత్యంతభక్తితో నప్పడిచ్చుడును
సత్యసంధుండు సభ్యవర్తనుండు
నగు సోమయాజి తా నా రాజు కనియెఁ
దగు మాట వినుమొక్క ధర్మకార్యంబు
సూర్యవంశంబున సాబ గొందు నట్టి
యార్యపూజితవర్య డా మన్మసిద్ధి
రాజు దా నెల్లూరు రమణతో నేల
అక్కన్న బయ్యన లధికబలిష్టు
లక్కట సిద్ధిరాయునిఁ బాఱద్రోలి
దక్కిన రాజ్యంబు తామె యేలుచును
నొక్క కాసైనను జక్కగ నీరు
వారల దండించి వారి నెల్లూరు
వారి కిప్పింపు మవారణ ప్రీతి
నని గణపతి రా జట్టు కా ననుచు
వెడలి గణపతియు విజయంబునకును
గుడి యెడమల నేన కొలిచి యేతేర
వెలనాడు చేరియు వీడెల్లఁ గాల్చి
వెలనాటి రాజును వెస గెల్చి వాని
యప్పనంబుల గొని యటుఁ జని రాజు
గుప్పన నెల్లూరు కూఢ నేతెంచి
యక్కన బయ్యన నచటి సాధించి
నెల్లూరి ప్రజలకు నేర్పు వాటిల్ల
జెల్లించె నట మన్మసిద్ధి రాజునకు
నెల్లూరు పట్టంబు నేర్పుతోఁ గట్టి
సల్లలితాద్యుతి సమదర్గములను
నలువ దెనిమిదియు నగు పట్టణముల
నరు దొంద సాధించి యా మన్మసిద్ధి
రాజు కిచ్చియుఁ దన తేజంబు దిశలఁ
బూజ లెక్కఁగ ఘనరాజితయశుడు
ఘనతటాకంబుఁ దాఁ గట్టించె నచటఁ

**గొనఁగొని నెల్లూరఁ గొన్నాల నుండి**
**మనుమసిద్ధి రాజ్యమహిమలు దెల్పె.**

సిద్ధేశ్వరచరిత్ర వ్రాసిన కాసె సర్వప్పకవి క్రీస్తుశకము ౧౪౦౦ సం. ప్రాంతమువాడు. అనగా తిక్కనకు సుమారు నూరెండ్ల తరువాతి వాడు. జరిగిన సన్నివేశమునకు సుమారు నూట యేబది సంవత్సరముల తరువాత వ్రాసినవాడని చెప్పవచ్చును.

ఈ కథనే కూచిమంచి జగ్గకవి తన సోమదేవరాజీయము నందు చెప్పియున్నాడు.

**"చేయఁ దక్కువ యైన దేవాయతనము**
**లపుడు పూర్తిగఁ గట్టించి యలరు చున్న**
**చోటనొక నాడు తిక్కన సోమయాజి వచ్చె**
**నెల్లూరునుండి భువరుని కడకు;**
**వచ్చిన యయ్యార్యవర్యు నెదుర్కొని**
**వినయసంభ్రమ భక్తు లినుమడింప**
**నతిథిపూజ లొనర్చి యతనిచే భారతా**
**ర్థమును ద్వైతాద్వైతతత్త్వములును**
**విస్మృతిచిదచిద్వివేక లక్షణములుఁ**
**బ్రకటధర్మాధర్మ పద్ధతులును**
**రాజనీతి ప్రకారంబును భారత**
**వీరుల మహిమంబు వినుచు నుండి**
**యనుమకొండనివాసులై నట్టి బౌద్ధ**
**జనుల రావించి వారిఁ దిక్కన మనీషి**
**తోడ వాదింపఁ జేసిన దొడరి వారిఁ**
**జులకగ సోమయాజులు గెలుచుటయును.**

అప్పుడు దేవాలయంబులగూలం ద్రోచి గణపతిదేవరాజు సోమయాజుల పటువాక్శక్తికి మెచ్చి యతనిని బహుప్రకారంబులఁ బూజించి యెనిమిది గ్రామంబు లొసంగి యతడు వచ్చిన కార్యంబడిగిన నా భువరునకుఁ గవివరుం డిట్లనియె.

**ఇనకులోద్భవుఁ డైనట్టి మనుమసిద్ధి**
**రాజు నెల్లూరు పాలించుచోఁ జెలంగి**

యతని దాయాదు లతని నుక్కరగఁ బట్టి
యునిచి రాజ్యంబు దమ రేలుచున్నవారు.
కావున మీరిపుఁ డచటికి వే
వేగం గదలి వచ్చి విడకుండఁగ నా
భూవరుఁ బున రభిషిక్తు నిఁ
గావింపగ వలయు ననగ గణపతి విభుడున్."
అట్టకాక యనుచు నా పని కొడఁబడి
యత్యుదారగుణసమ్రుఁ డగుచుఁ
దనివి యప్ప డొక్క నవలక్షధనమును
యజ్ఞకుండలములు నతని కిచ్చె.
పనుచు నెడఁ దిక్కమఖి యా
జనవరు సింహాసనమున సచివాగ్రణియై
తనరెడు శివదేవయ్యన్
గనుఁగొని యా రాజుతోడఁ గడకం బలికెన్.
వసుమతీనాథ ! యీతఁడీశ్వరుండ గాని
మనుజమాత్రుండు గాఁడు పల్మారు నితని
యనుమతంబున నీవు రాజ్యంబు నెమ్మి
నేలు మని చెప్పి యా ఘనుఁ డేగుటయును.
గణపతి దేవుఁ డా ఘను ననుమతిఁ గాంచి
యతిసత్వరమునఁ బ్రయాణ భేరి
వేయించి చతురంగ పృతనా సమేతుఁ డై
తరలి మున్నేలనాటి ధరణిపతుల
గెలిచి వారలచేత విలనప్పనమున్ గొని
వారి నందఱఁ దన వశము చేసి
కొని చని నెల్లూరుఁ గొబ్బున జొచ్చి య
క్కనయు బయ్యనయు నన్ ఖలులఁ ధఱమి
మనుమసిద్ధిరాజు బునరభిషిక్తుఁగా
వించి మించి రెండు వేలు నైదు
నూఱు గ్రామములు మనోవృత్తి కతనికి
నిచ్చి కడమఁ దాను బుచ్చికొనియె.

కాని ఈ కథను యథాతథముగ స్వీకరించుటకు కొన్ని చిక్కులున్నవి. గణపతిదేవ చక్రవర్తి క్రీస్తు శకము ౧౨౬౦ సంవత్సరము వఱకు రాజ్యము సల్పెను. అప్పటికి తిక్కన మహాభారతము నారంభింప లేదని నిశ్చయముగఁ జెప్పవచ్చును. సోమయాజి యయ్యెనో లేదో! అయినను తిక్కన నోట భారతార్థమును ద్వైతా ద్వైత తత్త్వములు గణపతిదేవుఁడు వినుటెట్లు పొసగును? "అందు చేత సోమదేవరాజీ యాదులందు చెప్పఁబడిన భారత శ్రవణ కథ కవి కల్పితమనుట కు సందేహము లేదని" శ్రీ వీరేశలింగముగారి అభిప్రాయము.

మనుమసిద్ధి రాజ్యభ్రష్టత, తిక్కన రాయబారము, కాకతి గణపతి భా రత శ్రవణగాథతో నన్వయించుట పొసగదు. తిక్కన, తన బ్రదుకు మలి సంజ వెలుఁగులలో నిష్కామకర్మగ భారతమును హరిహరనా థున కారాధన విశేషముగ సమర్పించెను.

తిక్కన వార్ధకములోఁ గన్నులు కనుపించని దినములలో భారత ము కుమ్మరి గురునాథునిచే వ్రాయించెననని ఐతిహ్యము. పదునై దు పర్వములు ముగించుట కెంతయో కాలము పట్టి యుండును. నిర్వచనోత్తర రామాయణము తిక్కన నడిమి పయస్సులో క్రీ. శ. ౧౨౫౮ ప్రాంతమున రచించెనని చెప్పిన భారతము వార్ధకములోఁ బదుమూడవ శతాబ్ద్యంత్యమున గాని, ముగించి యుండునని యూహింపవచ్చును.

అయిన తిక్కన రాయభారము, భారతశ్రవణగాథ కేవలము కవి కల్పితములా? కావు.

చారిత్రకముగఁ జూచిన, మనుమసిద్ధి కాకతిగణపతిదేవుని కరుణను కాంక్షించుచున్నట్లు ఒక శిలాశాసనమువలన తెలియుచున్నది.[1]

అక్కన్న బయ్యన్నలు మనుమసిద్ధిరాజ్యమును నపహరించుట గూడ యథార్థసంఘటనమే. గణపతిదేవ చక్రవర్తి నెల్లూరు రాజుతో చేసికొనిన యొడంబడిక ప్రకారము నెల్లూరు తగుల బెట్టి అక్కన్న బయ్యన్నలను జయించినట్లు గుంటూరు మండలము

1.౧౯౦౭ సం. ౫౮౦ సంఖ్య గల శాసనము. 2. ౧౯౨౨ సం. ౮౬౯ సంఖ్య గల శాసనము.

నందలి నాయనపల్లిలోని శిలాశాసనమున గలదు.[2] కాని ఆ శాసన మున శక వర్ష ముల అక్షరములు అరిగిపోయినవి.

తిక్కన రాయబారము మనుమసిద్ధి పునఃప్రతిష్ఠా కాలము నిర్ణయించుటకు ప్రత్యక్షసాక్ష్యము లేదు. అయినను మార్గాంతర మున నిర్ణయింపవచ్చును. తెలుగు చోడులు దక్షిణచోళులకు సామంతులు. దక్షిణచోళుడైన వీరరాజేంద్ర చక్రవర్తికి మనుమసిద్ధి సామంతుడై యున్నట్లు శిలాశాసనము గలదు.[3] ఆ శిలాశాసనము వీరరాజేంద్రు ని పదమూడవ రాజ్య సంవత్సరమునాటిది. అతడు క్రీ. శ. ౧౨౪౬ లో రాజ్యమునకు వచ్చెను. అతని పదుమూడవ రాజ్య సంవత్సర ము క్రీ. శ. ౧౨౮౮ వఱకు మనుమ సిద్ధి దక్షిణ చోళులకు సామం తుడు. గణపతిదేవ చక్రవర్తి క్రీ. శ. ౧౨౬ ౦ లో మరణించెను. కావు న మనుమసిద్ధి క్రీ. శ. ౧౨౫౮ లో గాని ౧౨౫౯ సంవత్సరమున గాని పదభ్రష్టుఁ డయ్యెననివిశ్వసింప వచ్చును.

శ్రీకృష్ణుని రాయబారము భారతములో నత్యద్భుతముగఁ జిత్రించు నేర్పు తిక్కన స్వానుభవముచే గడించెను. తిక్కన రా యబారము నెరపి గణపతిదేవుని మెప్పించి మనుమసిద్ధికి రాజ్య మిప్పించెను. నాటినుండి తెలుగు చోడులు కాకతీయ సామ్రాజ్య ములోఁ జేరిరి. కాకతీయుల వెల్లగొడుగు నీడ పెన్నానదీజలముల లోఁ బ్రతిఫలించినది.

తిక్కన గణపతిదేవునకు వినిపించినది సంస్కృతభారతా మ్నాయ మై యుండవచ్చును. నాటికే భారతముమీద తిక్కనకు గల అధికా రము జగద్విదితమై యుండును. భారత నీతికి జీవ ద్వ్యాఖ్యానము ప్రసాదించిన మహామంత్రి చిరంతనమననముచే మహాభారతాం ధ్రీ కరణము నకు నధికారము సంపాదించుకొనెను. మహేతిహాస ర చన సలుపుటకు మహోదారజీవితమును నెరపిన మహా కవికే య ధికారము కలదు. అయిన మహాభారతమును నాం ధ్రీకరించుటకు తిక్కనకు, కవిత్రయమునకు తెలుగు వారి అదృష్ట వశమువలన నా యధికారము సమగ్రముగ లభించినది. రాయబారిగ గణపతిదేవు నాస్థానమున కేగిన అనుభూతి శ్రీకృష్ణుని రాయబారమును చిత్రించునప్పు డుపకరించినది.

---

3. ౧౯౦౭ సం. ౫౮౦ సంఖ్య గల శాసనము.

**ధర్మరాజు శ్రీకృష్ణునితో—**

> **ఆపద గడవం బెట్టగ**
> **నోపి శుభంబైన దాని నొడగూర్పను మా**
> **కీ పుట్టువునకుఁ బాండు**
> **క్ష్మాపాలుఁడు నిన్నుఁ జూపి చనియో మహాత్మా.**

పాండుక్ష్మాపాలుడు కృష్ణుని జూపి చనియెనో లేదోగాని తిక్కనృపతి మనుమసిద్ధికి తిక్కనను జూపించియుండును. మనుమసిద్ధి మహా రాజు తిక్కనను మామామాయని సంబోధించి మన్నించెడువాడు. ధర్మరాజు శ్రీకృష్ణునితో—

> **మమ్మెరుగుఁ దెదిరి నెరుగుదు**
> **నెమ్మిఁ యెరుగుఁ ధర్మసిద్ధి నెరి యెరుగుదు వా**
> **క్యమ్ముల పద్ధతి నేఱుగుదు**
> **పొమ్మెవ్వఁడ నేను నీకు బుద్ధులు సెప్పన్-**

అని వీడ్కొలుపును.

మనుమసిద్ధి మహారాజు తిక్కన మహామంత్రిని గణపతిదేవ చక్ర వర్తి కొలువుకూటమునకు రాయబారిగఁ బంపినపుడిట్టి మాటలనే యనెనేమో! ఈ మాటలలో ఆత్మవృత్తము జీవనాడివలె స్పందిం చుచున్నది. ఈ పద్యములోని ప్రత్యక్షరము వెనుక రక్తపు ఆటుపో టుతోఁ గూడిన గుండె సవ్వడులు వినిపించుచునే యుండును.

తిక్కన పూర్ణపురుషుడు. తిక్కన మనుమసిద్ధికి మంత్రి య జ్ఞ మొనరించి వైదిక మార్గనిష్ఠమగు జీవితము నెరపిన సోమయాజి. కేతన దశకుమారచరిత్ర ప్రకారము చమూపతి. రాయబారము నెర పి విజయము సాధించిన లౌకికుడు. సమన్వయ వేదాంతి. ఇట్టి బ హుముఖ ప్రజ్ఞావంతుడు. పూర్వపురుషాయుష మనుభవించి రచిం చిన గ్రంథము భారతము. భారతము విప్రతిపన్న వివాదములకు శ్రుతిస్మృతులకు మూదల. నన్నయ గూడ ఈ విషయమునే విపులీ కరించెను.

**ధర్మతత్త్వజ్ఞులు ధర్మశాస్త్రంబని**
**అధ్యాత్మ విదులు వేదాంతమనియు**
**నీతివిచక్షణుల్ నీతిశాస్త్రంబని**
**కవి వృషభులు మహాకావ్యమనియు**
**లాక్షణికులు సర్వలక్ష్యసంగ్రహ మని**
**యైతిహాసికు లితిహాస మనియు**
**పరమ పౌరాణికుల్ బహుపురాణ సముచ్చ**
**యంబని మహి కొనియాడు చుండ**

**వివిధ తత్త్వవేది వేదవ్యాసు**
**డాదిముని పరాశరాత్మజుండు**
**విష్ణుసన్నిభుండు విశ్వజనీనమై**
**పరగుచుండఁ జేసె భారతమ్ము**

—ఆం. భా. ఆదిపర్వ అవతారిక

పూర్వపురుషాయుష మనుభవించి జీవితమును సాంగోపాంగముగా అర్థము చేసికొనగలిగిన వారికే భారతము రచించుటకు అధికారము గలదు.[1] రాజరాజనరేంద్రుడు నన్నయ భారతమును బట్టి ఘోరాజి ముఖోలబ్ధ విజయ ప్రమదాశ్రిత బాహు దండుడు. కలిదిండి శాసనమును బట్టి అక్కడ మృత వీరుల స్మారకచిహ్నాములుగా కట్టించిన రాజరాజేశ్వ రాలయమును బట్టి రాజరాజు అనేక యుద్ధము లోనర్చి తల నెరిసిన వృద్ధ వీరుడని తెలియును. కురుక్షేత్ర యుద్ధానంతరము ధర్మ రాజు హృదయమువలె రాజరాజ నరేంద్రుని హృద యము గూడ కరిగినది. అందుచేతనే అతనికి "భారత శ్రవణా సక్తి" భారత మహేతిహాస నిష్ణాతుడైన నన్నయ అతనికి అను రక్తుడు. అందుచే తెలుగులో మహాభారత మవతరించినది.

1. నన్నయ గూడ జీవితమునందు అపరసంధ్యా సమయమునందే భారతము నారంభించెను. రాజరాజనరేంద్రుడు క్రీ. శ. ౧౦౨౨ ఆగష్టు ౧౬ తేదిన పట్టాభిక్తుఁడయ్యెను. అతనికి అనరక్తుడైన నన్నయ గూడ ఇంచుమించు సమవయస్కుడని భావింపవచ్చును. నందంపూడి శాసనము క్రీ. శ. ౧౦౫౪ నవంబరు ౪వ తేది అనగా రాజరాజు రాజ్యమునకు వచ్చి 3౨ సంవత్సరముల తరువాత భారత రచనము. నన్నయ "గత కాలము మేలు వచ్చు కాలముకంటెన్" అను వార్ధకదశలో నుండెను.

అట్లే తిక్కనగూడ తన కన్నుల యెదుట నొక అపర కురు క్షేత్ర యుద్ధమును జూచెను. అది కాటమరాజు యుద్ధము.

మనుమసిద్ధి యువసానకాలమున జరిగిన యుద్ధము. కాట మ రాజు కథగ ద్విపదలోఁ బ్రతిష్ఠితమైనది. ఆ ద్విపదపంక్తులు నా టి సాంఘిక రాజకీయస్థితిగతుల ప్రతిఫలించు అద్దాల మేడలు. ఆ యుద్ధమును గూర్చి, ఆ యుద్ధమునఁ బాల్గొనిన మహావీరుల గూ ర్చి, దేశములో వ్యాపించిన చాటువులు తిక్కన నాటి వీరపురుషుల యుగము కన్నులఁ గట్టునట్లు వర్ణించుచున్నది. కాటమరాజు కనిగి రి సీమలోని యెఱ్ఱగడ్డపాడున కధిపతి. పెద్దిరాజు కొడుకు. యాదవ వంశీయుడు. ఇతడు అనావృష్టికారణమున దక్షిణమున నున్న మ నుమసిద్ధి యడవుల పుల్లరి చెల్లించి పశువుల మేపు కొనుటకుఁ బొ చ్చు కొనెను. కాని, కాటమరాజు పుల్లరి చెల్లింప లేదు. మనుమసిద్ధి అన్నంభట్టును రాయబారిగా బంపి పుల్లరి చెల్లింపఁ గాటమ రాజు నడిగెను. కాటమరాజు, మనుమసిద్ధి శత్రువులతోఁ గలసి పుల్లరి చె ల్లింప నిరాకరించెను. మనుమసిద్ధి మహారాజుగారి వేశ్య పెంపుడు చిలుకను కాటమరాజు పసువుల కాపరులు పట్టుకొని యుల్లరి చేసి రని జనశ్రుతి కలదు.

ఇట్లు కాటమరాజు కథ చిన్నతగవుగ నారంభమై చివరకు మహారణముగ పరిణమించినది. తిరునామాల తిప్పరాజు, శ్రీకంఠ రాజు, పెద వేగి చొక్కరాజు, పెదవరదరాజు, అర్లుకొండ అచ్చిరాజు, ఆదివన్నె మాదిరాజు, గయకొండ గంగరాజు, ఉర్లకొండ సోమన్న, ఉదయాద్రి అమ్మయ్య, చెన్నపట్టణము చంద్రశేఖరుడు, దేవమని వెంగళయ్య, పట్టుకోట బసవరాజు, కాళహస్తి పాప తిమ్మరాజు, వెల కంచి వెంగళపతి రాజు, ప్రభగిరి పట్టణము పద్మశేఖరుడు, మున్న గు వీరులు మనుమసిద్ధి పక్షము చేరిరి. మనుమసిద్ధి సేనలను ఖ డ్గ తిక్కన సేనాపతియై నడిపించెను. ఖడ్గతిక్కన కవితిక్కన పెద తండ్రి సిద్ధన మంత్రి కొడుకు.

కాటమరాజు పక్షమునఁ గూడ పల్నాటి ప్రభువు పద్మ నా యుడు; పల్లికొండ ప్రభువు చల్ల పిన్నమనాయుడు, దోన కొండ అయితమరాజు, ఎఱ్ఱయ్య, భట్టావుల రాజు, కరియావుల రాజు, వ

ల్లభన్న, నాలకాళ్ల నాయుడు, ముమ్మయ్య నాయుడు, పుత్త రాజు మున్నగు వీరులు చేరిరి.

కాటమరాజు సేనలకు సేనాధిపతి బ్రహ్మరుద్రయ్యను నారాధ్య బ్రాహ్మణుడు. ఉభయ సైన్యములు పాలేటియొడ్డున నున్న పంచలింగాలకడ నెదుర్కొనినవి. ఘోరయుద్ధము జరిగినది. ఇరుపక్షముల భటులు, వీరులు మరణించిరి.

చిట్టచివరకు మనుమసిద్ధి పక్షమున, యుద్ధభూమిని ఖడ్గతిక్కన యొక్కడే మిగిలియుండుట పిన్నమనాయుడు గాంచి

**"పోరు నిలుపుమోయి భూసురోత్తముఁడ**
**సరిగాదు మాతోఁడ సమరంబు చేయ**
**అగ్రజుల్ మీరు యాదవులము మేము**
**ఉగ్రము మా మీఁద నుంపంగరాదు."** అని పలికెనని కథ.

ఖడ్గతిక్కన చేయునదిలేక, గుఱ్ఱమును మరలించి యిల్లు చేరి నంత, వీరపత్నియగు నాతని భార్య, యతనికి స్నానోదముల తోపాటు పసుపు ముద్దనుఁ బెట్టి నులకమంచము చాటుంచి —

**పగఱకు వెన్నిచ్చినచో**
**నగరే నిను మగతనంపు నాయకులందున్**
**మగు రాడు వారమైతిమి**
**వగపేటికి జలకమాడవచ్చిన చోటన్.** అని అధిక్షేపించెనట.

వీరమాతయగు తల్లి అన్నము పెట్టుచు విరిగిన పాలుపోసి—

**అసద్దృశముగ నరివీరులఁ**
**బసమీరగఁ గెలువలేక పంద క్రియన్ నీ**
**వనివైచి విఱిగి వచ్చిన**
**బసులున్ విరిగినవి తిక్క పాలున్ విరిగెన్.**

అని పరిహసించెనట.

అటు పిమ్మట, ఖడ్గతిక్కన యేకాకియై యుద్ధభూమిని జేరి వీరస్వర్గ మలంకరించెననని చెప్పుదురు. ఆ యుద్ధము, ఖడ్గతిక్కన పరాక్రమము, ఆనాడు మిక్కిలి ప్రఖ్యాతి వహించి, ప్రజల మనస్సులపై

మిక్కిలి ప్రభావము వహించె ననుటకు, చాటు పద్యములు నిదర్శ నములు. ఖడ్గతిక్కన మరణము గూర్చి

**ధైర్యంబు నీ మేనఁ దగిలి యుండుటఁ జేసి**
**చలియించి మంధరాచలము తిరిగె**
**గాంభీర్య మెల్లఁ నీ కడన యుండుటఁ జేసి**
**కాకుత్స్థునకు వార్ధి కట్టు వడియె**
**జయలక్ష్మి నీ యురఃస్థలినె యుండుటఁ జేసి**
**హరి పోయి బలి దాన మడుగుకొనియె**
**నాకార మెల్ల నీయందె యుండుటఁ జేసి**
**మరుడు చిచ్చునఁ బడి నుడిసి చనియె**

**ఖడ్గదండనాథ దేవేంద్రపురికి నీ**
**వరుగు తెరిగి, సగము తిరుగు టుడుగు**
**సభి కట్టు విడుచు, నచ్యుతు కొధ మాను,**
**మరుఁడు మరలఁ గలుగు, మగలరాజ**

అని యొక కవి చెప్పిన చాటుధార. ఖడ్గతిక్కన భార్య సహగ మన ము సల్పి, వీరస్వర్గ మలంకరించిన భర్త ననుగమించెన నని కథ.

కాటమరాజుతో జరిగిన యుద్ధము తరువాత తిక్కన మన స్సు కురుక్షేత్ర యుద్ధానంతరము వేదవ్యాస మహర్షి మనస్సు వలె నుండెను. ఇంతేగాదు, కాటమరాజు కథలోని ప్రధాన పాత్ర వహిం చిన ఖడ్గతిక్కన తిక్కన వంశములోని వాడు — అతనికి వేలు విడి చిన సోదరుడు. వీరపత్నియైన వదిన గారిని వీరమాతయైన పెత్తల్లిని మహావీరుడైన సోదరుని స్వగృహము నందే ప్రత్యక్షముగ చూచిన తిక్కనకు వీరవృత్త మైన మహాభారతము రచించుటకు ఉత్తమోత్తమాధికారము లభించినది. ద్రౌపది పాత్ర చిత్రణమునకు వీరపత్ని ఖడ్గ తిక్కన భార్య తిక్కనకు మేలుబంతిగ నిలిచియుం డె నేమో. అంతేగాక తిక్కన యుద్ధవర్ణనము పరికింపదగినది.

తిక్కన యుద్ధ భూమిని కన్నులకు గట్టినట్లు వర్ణించును. "దారుణ ప్రియదర్శనంబయ్యె" "రమణీయ భయానకమయ్యె" "నె త్తుట దోగిన మేని కమనీయ రుచి" మున్నగు అతని ప్రయోగముల

ను చూచిన అతనికి యుద్ధభూమి, సుందర దృశ్యముగనే కన్పిం చుట విశేషము. మరణించిన అభిమన్యుడు

**"ఉన్నతగతి సెడి యుర్వీపైఁ గడు విన్న**
**నై పడియున్న సుధాంశు భంగి" నుండెను.**
**నెత్తుటి దోగి నేల యెరనింగి తెరంగున నుండె నక్కమా**
**రోత్తముఁ డందు జంద్రు క్రియ నొప్పి సితాయుధఖండ భూషణో**
**దాత్తమణి ప్రతానములు, తారల చందము నొంది యుందమై**
**యత్తఱి నులసిల్లె వసుధాధిప చూపరపిండు చూడ్కికిన్.**

**కరికళేబరములు ధరణీధరములు**
**తురంగ గాత్రమ్ములు గ్రాహసమితి**
**నరశరీరములు మీనములు గొఁ క్షేయక**
**క్షురికాది శస్త్రంబు లురగ కులము**
**రుధిరార్ద్ర శరములు రుచిరప్రవాళముల్**
**ప్రేవులు ప్రోవులు ఫేనతతులు**
**నెత్తురు వెల్లువ నీళులు భూషణ**
**స్తోమాస్తి చయముల తుమురు లిసుక**

**గాగ నంబురాశి కరణి సంగ్రామ భూ**
**భాగమొప్పు మిగుల భవ్యయోగ**
**నిద్ర నున్న విష్ణునకుఁ బాటియగుచు శో**
**భిల్లె నమ్మురారి యల్లుడందు.**

అభిమన్యుడు గూలినప్పుడు గూడ నంత అందమైన యుద్ధభూమి తిక్కనకుఁ గనుపించినది. యుద్ధభూమిపై తిక్కనకు మక్కువ యెక్కువ. జీవితములో నెప్పుడును యుద్ధభూమిని చూడని వారి వ్రాతలు వేరుగ నుండును.[1]

మహాభారతములోని యితివృత్తమును బ్రస్తరించిన ౧. వీరరస ము; ౨. రాజనీతి 3. బ్రహ్మవిద్యోపదేశముగ విడివడును. తిక్కన దం డనాథుడు. వీరులవంశములో మద్భవించినవాడు. మంత్రి – రాజ నీతి సాంగోపాంగముగ నెఱిగిన వాడు మాత్రమే గాక రాయ బారము

1. దుశ్శాసనుని జంపి నెత్తురు ద్రావుచున్న భీమసేనుడు "రక్తంబు బాయు దలిర్పం దనువుగ్ర సుందరముగా నేతెంచెనని" వర్ణనము.

అట్లే తిక్కనగూడ తన కన్నుల యెదుట నొక అపర కురు క్షేత్ర యుద్ధమును జూచెను. అది కాటమరాజు యుద్ధము. తిక్కన మహాకవి నన్నయభట్టు మహాకవిని అవతారికలో మిక్కిలి భక్తితో స్మరించెను. గ్రంథాది యందు అతడు మొట్టమొదట హరిహ రనాథుని తరువాత కృష్ణద్వైపాయనుని వెనువెంట నన్నయభట్టు ను స్మరించెను.

**ఆవరణీయసార వివిధార్థ గతిస్ఫురణంబు గల్గి యా**
**ష్టాదశ పర్వ నిర్వహణ సంభృతమై పెనుపొంది యుండ నం దాదిఁ**
**దొడంగి మూఁడు కృతు లాంధ్రకవిత్వ విశారదుండు వి**
**ద్యాదయితుండొనర్చె మహితాత్ముఁడు నన్నయభట్టు దక్షతన్.**

తిక్కనదృష్టిలో నన్నయ మహితాత్ముఁడు; విద్యాదయి తుఁడు. ఈ పద్యములోని "మూఁడు కృతులు" అను మాట నాధారముగ జేసికొ ని నన్నయ ఆది సభాపర్వముల నిశ్శేషముగ రచించెననువారును గలరు.[1]

తిక్కన మూడుకృతులు అని సమూహముమీద చెప్పెనుగాని రెం డుకృతుల పై చిల్లర యని చెప్పవలెనా? అదియునుగాక, తిక్కన నాటికున్న యరణ్యపర్వము, నెబది సంవత్సరముల లోపున నె ఱ్ఱాపెగ్గడ కాలము నాటికి అంతరించిపోవునా? ఒక్క ప్రతిలో నటు లనే అగుగాక, యావదాంధ్రమునఁగల ప్రతులన్ని యు నేక కాల ములో శారదరాత్రులను పద్యము తరువాత మాత్రమేపోవునా? లే దా, ఎఱ్ఱాపెగ్గడ పూరించుటయే యసత్యకథనము కావలె; చరిత్ర యంతయు దీనికిఁ బూర్వపక్షమే.

తిక్కన మహాకవి, నన్నయభట్టు మహాకవిని, అవతారికలో మిక్కిలి భక్తితో స్మరించెను. "అంధ్రకవిత్వవిశారదుండు విద్యాద యితుండు మహితాత్ముఁడు" నన్నయభట్టు. కొందఱు తిక్కనకు నన్నయభట్టు నెడ గల భక్తిని శంకించుచున్నారు. ఇట్టి కుశంక ఉభయకవులకుఁ ద్రోహము. మహితాత్ముడైన నన్నయభట్టు మీద గాని ఆ విద్యాదయితుండు తెనిగించిన కృతులమీద గాని గౌరవ ము తిక్కనకు లేనిచో నతఁడ దామూలాచూడముగ భారతము తెని

1. శ్రీవేదాల తిరువేంగళాచార్యులవారు — భారతోపన్యాసములు

గించి యుండును. పదునైదు పర్వములు తెనిగించిన తిక్కన మహా కవికి మఱి మూఁడు పర్వములు బరువా!

తిక్కనకు నన్నయ మహాకవి యోడ, ఆ మహాకవి రచించిన భారత భాగముపై మిక్కిలి గౌరవ మనుటకు సారస్వత సాక్ష్యము న్నది. "అనుకరణమే యే రచయిత యోడనైనను ప్రదర్శింపగల అత్యుత్తమ గౌరవము" అని యొక ఆంగ్ల సుభాషితము గలదు. తిక్కన ఎన్ని యో చోట్ల నన్నయ ననుకరించి ఆ మహాకవికి మన్ననఁ దెలిపెను. నన్నయ దిద్దిన యురవడినే యనుసరించి, తిక్కన మహాభారత ము తెనుగు భాస వినిర్మింపఁ బూనెను. కవిత్రయము వారి యాంధ్ర మహాభారతము వ్యాసమహాభారతమునకు కేవలాను వాదము గాదు. యథోచితానుసరణము.

తిక్కన ఉత్తరరామాయణము నిర్వచనముగ వ్రాయుటకు గద్యపద్యసంస్కృత భూయిష్ఠరచన సర్వసామాన్యము గాదను శివ కవుల యాక్షేపఁ ప్రభావమే కారణము. కాని, నన్నయ మహాకవి ప్ర భావము తిక్కనపై భారతరచననాడు సంపూర్తిగఁ బ్రస రించెను. తిక్కన మహాకవి భారతమున నన్నయ 'చంపు' పద్ధతినే యనుసరించి, "పద్యముల గద్యములన్ రచియించెదన్ కృతుల్" అని నిర్వచన ధోరణి మార్చుకొనెను.

అంతియ గాక శివకవుల ప్రచారసాహిత్యదృష్టిని మార్చి, నన్నయ సాహిత్య దృష్టినే తెలుగు నాట పునఃప్రతిష్ఠ గావించెను. తిక్కన కృ త్యాదిని గావించిన వేదవ్యాసమహర్షి స్తోత్రమునకు నన్నయ కావిం చిన వేదవ్యాసప్రశంసయే మేలు బంతి. నన్నయ జనమేజయసర్పయాగ ఘట్టమున ఆస్తీకునిచేఁ బల్కించిన పద్యము.

**"విద్వన్ముఖుఁడు వేదమూర్తి త్రిజగద్విఖ్యాతతేజుండు కృష్ణద్వైపాయనుఁ డేగుదెంచి సుతశిష్యబ్రహ్మసంఘంబుతో సద్వంద్యుండు సదస్యుఁ డయ్యె ననినన్ శక్యంబె వర్ణింప సాక్షాద్విష్ణుండవ నీవు భూపతులలోఁ గౌరవ్యవంశోత్తమా !"**

తిక్కన కృత్యాదిపద్యమున నన్నయ వాడిన "ధ్వ" కారప్రాస మును శార్దూల వృత్తమును గ్రహించి, కృష్ణద్వైపాయన ప్రశంస సల్పెను.

**విద్వత్సంస్తవనీయ భవ్యకవితా వేశుండు విజ్ఞాన సం పద్విఖ్యాతుండు సంయమిప్రకరసంభావ్యానుభావుండు కృ ష్ణద్వైపాయనుఁ డర్థిలోకహిత నిష్ఠం బూని కావించె ధ ర్మాద్వైతస్థితి భారతాఖ్యమగు లేఖ్యంబైన యామ్నాయమున్.**

దీనిని బట్టి నన్నయపద్యము తిక్కన యంతఃకరణము నావేశించి, యెట్లు పునరవతారము నెత్తెనో స్వయంవ్యక్తమగు చున్నది.

నన్నయ సభాపర్వమున దుశ్శాసనుండు ద్రౌపదికి సల్పిన పరాభవమును

**"ఆ వనజాననం గురుకులాపశదుండు కడంగి రాజసూ యావబృథంబునందు వసుధామరమంత్రపవిత్రవారిధా రాఫలిఁ జేసి పావనములైన శిరోజములం దేమల్చి పా పావహుఁడిదిచ్చి తెచ్చె సభ కందఱు సంభ్రమ మందిచూడఁగన్."**

అని వర్ణించిన పద్యము తిక్కన మనఃఫలకముపై నెట్టు హత్తుకొనె నో గుర్తింపవచ్చును. తిక్కన యా సన్నివేశమునే ద్రౌపది నోట శ్రీకృ ష్ణునకు జెప్పించిన పద్యము స్మరణీయము.

**నీవు సుభద్రకంటెఁ గడు నెయ్యము గారవమున్ దలిర్ప సం భావన సేయు దిట్టి నను బంకజనాభ యొకండు రాజసూ యావభృథంబునందు శుచియై పెనుపొందిన వేషిఁ బట్టి యా యేవురుఁ జూడఁగా సభకు నీడ్చె కులాంగన నెట్లోనర్తురే.**

ఇందలి వకార ప్రాసము, 'రాజసూయావభృథంబునందు' శుచియై పెనుపొందినవేణి మున్నగు పదగుంఫనములు ప్రాతఃస్మరణీ యుం డైన నన్నయకు తిక్కన దెలిపిన మన్నన.

రాజరాజ నరేంద్రుడు నన్నయభట్టును మహాభారతమును తెలుగు న వినిర్మింపుమని కోరినపుడు దాతడు చెప్పిన సమాధానము పరిశీ లింప దగినది.

**"అమలిన తారకా సముదయంబుల నెన్నను సర్వవేద శా స్త్రముల యశేషసారము ముదంబునఁ బొందను బుద్ధిబాహువిక్ర మమువ దుర్గమార్థజల గౌరవ భారత భారతీ సము ద్రము దరి యంగ నిదను విధాతృన కైనను నేరఁబోలునే."**

నన్నయ మహాకవి మహాభారతరచనము నారంభింతుటకు ముందే సుస్పష్టముగ తాను ఆ భారతభారతీ సముద్రము దరియం గ నీదలేనని చెప్పెను. అంతేగాక అట్లీదుట విధాతకు గూడ తర ము గాదనినాడు. ఇది తెలుగు నానుడిగ గోచరించును.[1] కాని ఒకవే ళ ఆ భారతభారతీ సముద్రము నీదు బ్రహ్మయున్న అతడు కవి బ్రహ్మయే కావలెను. తన తరువాత రెండు శతాబ్దుల పిమ్మట కవి బ్రహ్మయైన తిక్కన యుద్భవించు ననియు, ఆ కవిబ్రహ్మ పదునై దు పర్వములు వ్రాసినను భారత మింకను అసంపూర్తిగనే నిలు చుననియు నన్నయ మహాకవి వాక్కు ధ్వనించు చున్నట్లున్నది. అంతేగాక నన్నయ పద్యము తిక్కన చదివియుండునుగదా. తాను పదునైదు పర్వములు వ్రాసినను భారతభారతీ సముద్రము దరి యంగ నీదుటకు వీలులేదని అది మహాకవి వాక్కని సరిపెట్టు కొని యుండెను కాబోలు. అరణ్య పర్వము ఇదివరకే రాజరాజ నరేంద్రు నకు కృతిదత్తము. దత్తశేషము ఈశ్వ రార్పణ చేయగూడ దని తి క్కన తలపోసి యుండవచ్చును.

నన్నయ మహాకవి ఆర్ష వాక్కు భవభూతి చెప్పినట్లు[2] భవి ష్యద్వాణియైనది. తిక్కనను అపరవేదవ్యాసునిగ ఐతిహ్యము చి త్రించు చున్నది. మహాభారతరచనలో వేదవ్యాసునకు గణపతి లే ఖకుడు. అట్లే అపర వేదవ్యాసుడు తిక్కనకు కుమ్మరి గురునా థం అపర గణపతి లేఖకుడుగ దొరికెను. గంట మాగకుండ కవిత చెప్ప వలయు ననుట తుల్య సమయము. వ్యాసుడు గణ పతిని శ్లోకము ల నర్థము చేసికొనిన పిమ్మటనే వ్రాయు మనె నట. అందుచే నెడ నెడ వ్యాసఘట్టములు, దురవగాహములు సంస్కృత భారత మున నున్నవని పండితుల కథనము. వానిని గణపతి అర్థ మొనరించు కొను లోపల వ్యాసుడు కవిత చెప్పుచుండువాడు. తిక్కన వార్ధకము న గురునాథమునకు భారతము నాశువుగ జెప్పెనని జనశ్రుతిలో నొ క కమ్మని కథ ప్రచారములో నున్నది. తిక్కన భారతము నాశువుగ గురు నాథు గంటమాగకుండ చెప్పెడి వాడట.

---

1. నేనే గాదు బ్రహ్మదేవుడు గూడ చేయలేడు. ఆంధ్రదేశవ్యవహారికము.

2. ఋషిణాం పునరాద్యానాం వాచమర్థోఽనుధావతి

కురుక్షేత్ర యుద్ధానంతరము పదునొకం డక్షౌహిణులు స మసిపోయిన పిమ్మట తిక్కన దుర్యోధనుని స్థితి సంజయుని నోట ధృతరాష్ట్రున కెరింగించుచు

**పలపలని మూకలోఁ గాల్**
**నిలువక గుట్టంబు డిగ్గి నీ కొడుకు గదా**
**కలిత భుజుండై యొక్కడుఁ**
**దొలగి చనియె —**

అని కందపద్యము మూడున్నర పాదము చెప్పి కథ పూర్తి కాగా—ఏమియు తోచక "ఏమి జెప్పుదము గురునాథా" అని ప్రశ్నించె ననియు గురునాథము మాత్ర మది గుర్తింపక వంచిన తలయెత్త కుండ - గంటమాపక 'ఏమి చెప్పుదం గురునాథా' యని వ్రాసెననియు అది కురునాథుడైన ధృత రాష్ట్రునకు సంజయుని సంబోధనగ కథతోపాటు కంద పద్యములో గూడ నతికిపోయినదని చెప్పుదురు. ఇందలి సత్యాసత్యము లెట్లున్నను కథ మాత్రము రక్తి కట్టినది.

మనుమసిద్ధి రాజ్యభ్రష్టత, తిక్కన రాయబారము కాకతి గణపతిదేవ చక్రవర్తి సాయము, అన్నంభట్టు రాయబారము ఏకై క వీరుడు ఖడ్గతిక్కన యొక్కటి పోరు వీరపత్ని ఖడ్గ తిక్కన భార్య, వీర మాత ఖడ్గతిక్కన తల్లి గాథలు మున్నగు నవి మహాభారతవీర యుగమును స్ఫురింపజేయు సన్నివేశములు.

ఈ విధముగ కవికి కావ్యమునకు కవికాలమునకు కావ్య యుగమునకు బింబప్రతిబింబ భావము సమకూరినది. తిక్కన మహాభారతము నందిట్టి ఆత్మనివేదనమే సలిపెను. అందుచే ఆంధ్రమహాభారతము స్వతంత్ర సృష్టియై దేశ భాషల నెనలేని స్థానము నాక్రమించినది. తిక్కన అపర వేదవ్యాసుఁడయ్యెను.

తిక్కన మహాభారతము ననువదించుటకు ఉద్భవించిన కారణజన్ముడు. తిక్కన కృతికర్తయగుటతోపాటు కృతి భర్తయు కేతన దశకుమారచరిత్రము కృతి బొందెను. కేతన దశకుమార చరిత్రమునే గాక ఆంధ్రభాషాభూషణమను లక్షణ గ్రంథమును విజ్ఞానేశ్వరీయమను న్యాయశాస్త్ర గ్రంథమును రచించెను. విజ్ఞానేశ్వరీయము అనునది మితాక్షరి అను పేరుతో యాజ్ఞవల్క్యస్మృతికి వి

జ్ఞానేశ్వరుడు రచించిన వ్యాఖ్యానము. వ్యాఖ్యానసహితమైన యా స్మృతిని కేతన తెనిగించి విజ్ఞానేశ్వరీయమని పేరు బెట్టెను. హిందూ "లా"కు అధికారిక గ్రంథములలో నేటికిని మితాక్షరి[1] యొక్కటి. ఇందు ఆచార కాండము ప్రాయశ్చిత్త కాండము, వ్యవహార కాండము అను మూడు కాండలు గలవు.

ఈ గ్రంథము ప్రభుత్వ పరిపాలనకు మూలాధారములలో ముఖ్య మైనది గావున, నది ప్రజలకందుబాటులో నుండుట మంచి దని కేతన తెనిగించి యుండును. కేతనకు మంత్రి యైన తిక్కన తో సన్నిహిత సంబంధములేనిచో విజ్ఞానేశ్వరీయము[1] తెలుగున నవతరించి యుండెడిదిగాదు. నిత్య వ్యవ హారమున కుపయోగ ప డు గ్రంథము గావున దానికి జనరంజ కత్వము ఆనాడుండియుం డును. ఆ కృతికి భవ్యకవితా వేశము గల్పించినది తిక్కనయే.

కేతన దశకుమార చరిత్ర పీఠికలో తన్ను, తిక్కన సత్కరించిన విధానమును బేర్కొనెను.

---

1.మితాక్షరికి ఆంగ్లానువాదము గలదు — ఆంధ్రకవితరంగిణి.
2. విజ్ఞానేశ్వరీయము
పుత్త్రులు లేరు నాకు నిది పుత్రిక దీని సలంకరించి నీ
క్షేత్రముగాగ నిచ్చెద నకల్పిత మానస నీకు దీనికిం
బుత్త్రుడు పుట్టగా నతడు పుత్త్రుడు నాకని పల్కి కొన్న యా
పుత్త్రుడు సౌరసుండు సరి పుత్త్రులకెల్లను బెద్ద
—ఆచార కాండ యిద్ధరన్.
అంగవిహీనునైన వికలాంగునినైనఁ ప్రసిద్ధరోగ దు
ష్టాంగునినైనఁ జూచి చెడనాడుటఁ యొప్పునివానిఁ జూచి సౌ
మ్యాంగుఁ డితండు వీనిఁ కెన యన్యులు లేరని గేలి గొంట త
ప్పంగట మూడు రూకలును నడ్డుగ దండుగ వానిపైఁ బడున్
—ప్రాయశ్చిత్త కాండ
జనకుండు తనుఁ జదివించక
జనకునిధన మైన గుడిచి చదువక తనయం
తన కుడిచి చదివి వడసిన
ధనముం బాలడుగ లేదని దాయాదులకున్

**"ఆత్మాదరంబున రావించి యాసనార్ఘ్యపాద్య తాంబూలాం బరాభరణ దానాద్యుపచారంబులఁ బరితుష్టహృదయం జేసి నీవు సంస్కృతాద్యనేక భాషాకావ్య రచనా విశారదుం డగుట జగత్ప్రసిద్ధంబు గావున నొక్క కావ్యంబు రచియించి నన్నుఁ గృతిపతిఁ జేయవలయుననని సగౌరవంబుగఁ బ్రార్థించిన నేనును మత్కావ్య కన్యకకుఁ దగు వరుండగు నతని మనోరథంబు సఫలంబు గావింపం దలచి"** అని వ్రాసెను.

**"ఆర్థిమైఁ బెక్కు ళ్ళ నగ్రహారంబులు**
**గా నిచ్చు ననుట పొగడ్త పాలము "**

అని చెప్పెను. తిక్కన తాను కృతికర్తయై, కృతిపతియై కవుల కనేకా గ్రహారముల దాన మొసంగినవాడు.

తిక్కన ప్రభావము ప్రత్యక్షముగా సోకిన మఱియొక కవి మా రన. "శ్రీ మదుభయకవిమిత్ర తిక్కన సోమయాజి ప్రసాద లబ్ధ సర స్వతీ పాత్ర తిక్కనామాత్యపుత్ర మారయ నామధేయ ప్రణీతంబైన మార్కం డేయ పురాణము". మార్కండేయ పురాణము ప్రతాప రు ద్రుని సేనా పతులలో నొకడైన గన్నయ కంకితము.[1] అందుచే నీ మార్కండేయ పురాణము క్రీ. శ. ౧౩౨ 3 లోపుగ రచింపబడి యుం డును.

మహాభారతము, కవి వృషభులు కావ్యమనియు, ఆధ్యాత్మ వాదులు వేదాంతమనియు, నీతివిచక్షణులు నీతిశాస్త్ర మనియు, మఱియు బహుపురాణ సముచ్చయమని కొని యాడు విశ్వజనీన మైన విజ్ఞాన సర్వస్వము. అల్లే నీతి శాస్త్రము, మున్నగు వివిధాం గములు సంగమించిన పూర్ణపురుషుడు తిక్కనకవి, ఉభయకవి మి త్రుడు. కృతికర్త; కృతి భర్త; మహామంత్రి; మనుమసిద్ధి మహారాజు నకు మామ; లౌకికుడు; సోమయాజి. విజయము సాధించిన రాయ బారి. శివకేశవాభేదము ప్రతిపాదించిన హరిహరనాథ మత ప్రవక్త. ధర్మాద్వైత తత్త్వము ప్రతిపాదించిన మహావేదాంతి. పంచమ వేద మును తెనుగులో వినిర్మించిన మహాకవి. తిక్కన వ్యక్తి మాత్రుడు గా డు. ఆతడొక వ్యవస్థ.

---

1. ఈతడే తరువాత ఇస్లాము మతము స్వీకరించి "మల్లిక్ మక్బూల్" నామముతో గుజరాతుకు రాజ్యప్రతినిధి యయ్యెను. తొలుత తుఘ్లక్ నొద్ద, తరువాత జలాలుద్దీను నొద్ద — దండనాథుడుగా నుండెను.

తిక్కన వ్యక్తిత్వమున మకుటాయమానముగ వెలుగొందునది అతని హరిహర నాథోపాసన. హరిహరనాథ తత్త్వము తిక్కనకు సహజ పరిణత సిద్ధమై యేర్పడిన నిసర్గ ప్రజ్ఞయే. అతడు దశకు మార చరిత్రము నందే ఉభయ కవి మిత్రుడైన సమన్వయ సంధా త. భారతము, స్వీయ వేదాంతము బోధించు వెన్నెల దేవళముగ నే తిక్కనకు సాక్షాత్కరించెను.

హరిహరనాథుని తిక్కన 'వేదవ్యాస వ్యంజిత విహార' యనియు

**జనవినుత బాదరాయణ మునీంద్ర వాగమృత నిధి సముద్భూతా హ్లా దన కీర్తి సుధా కిరణా**

యనియు, పలుమారులు పర్యాయార్థక సమాసములతో సంబోధిం చును. ద్రోణ పర్వమున, సైంధవ వధకు బూర్వపు రాత్రి అర్జును డు స్వప్నమునఁ గైలాసమున కేగిన కథ గలదు. కృష్ణార్జునులు పర మేశ్వరుని సన్నిధి కేగుదురు.

"అని మఱియు ననేక ప్రకారంబుల నవాఙ్మానసగోచరుండ గు నప్పర మేశ్వరుం బ్రస్తుతించి రప్పు డచ్యుతుండు పార్థునిం బా శుపతం బర్థింపు మని కఱపిన నతండవ్వరంబు వేడుటకై విశ్వేశ్వ రుం దప్పక చూచి తాను మున్ను ముకుందునందు సమర్పించిన నిశాసమయపూజాద్రవ్యంబు లగు మాల్యానులేపనంబు లద్దేవుని దివ్యదేహంబునఁ గాంచి యచ్చెరువంది యమ్మురహర పురహాతు లయే కత్వంబు మనంబునఁ గొనియాడి దేవా భవదీయ దివ్యాస్త్రం బు దయ సేయు మని విన్నవించుటయు భక్తవత్సలుం డగు శక్తి నాథుండు గృష్ణ లిరువురను దరహాసంబుతో నవలోకించెను. "

ఈ హరిహరా భేదము తెలుగు భారతములోఁ తిక్కన క్రొత్తగ కల్పించినది గాదు. సంస్కృత భారతము నందు గూడ ఇట్లే యు న్నది. — తిక్కన హరిహరనాథోపాసన భారత రచన అతని ఆత్మీ యతకు వైలక్షణ్యము నాపాదించు సమన్వయ వేదాంతముతో అ తికిపోయినది. మహాభారతము ధర్మాద్వైత వేదాంతము. తిక్కన ధర్మాద్వై తమూర్తి. అదృష్ట వశమున కవికి కావ్యమునకు అభేదాధ్యవ సాయము సిద్ధించినది.

# కవితాశిల్పము — విరాటోద్యోగపర్వములు

తిక్కన నిర్వచనోత్తర రామాయణము రచించు నాటికే యు భయ కవి మిత్రుడుగ లభ్యప్రతిష్ఠుడు. నిర్వచనోత్తర రామాయణ పీఠిక అలనాటి సారస్వతోద్యమములపై పరోక్షవిమర్శ. తిక్కనకుం బూర్వము సుమారు రెండు వందల యేండ్ల నుండి విస్తరిల్లిన శైవ వాఙ్మయము తరువాత తిరిగి స్వతంత్ర వాఙ్మయ సృష్టికి మార్గద ర్శకుండైన యుగపురుషుడు తిక్కన. తిక్కన సల్పిన ఈ సారస్వత కృపికి నాంది నిర్వచనోత్తర రామాయణమే.

నిజమునకు నిర్వచనోత్తర రామాయణమే ఆంధ్రప్రబంధో దయమునకు వేగుజుక్క. నిర్వచనోత్తర రామాయణము సంస్కృత మూలమునకు అనువాదము గాదు. తిక్కన నిర్వచనోత్తర రామాయ ణము నొక ప్రబంధముగ తీర్చిదిద్దెను. అర్వాచీన ప్రబంధములలో గన్పించు అష్టాదశ వర్ణనములకు తిక్కనయే తన నిర్వచనోత్తర రామాయణమునందు మేలు బంతుల తీర్చిదిద్దెను.

నిర్వచనోత్తర రామాయణమున సంస్కృత మూలములో ప్రధాన కథతో సంబంధము లేని యవాంతర గాథల నన్నిటిని తి క్కన వదలి పెట్టెను. మూల సంస్కృతోత్తర రామాయణము మహా రణ్యము. తిక్కన నిర్వచనోత్తర రామాయణము ఉద్యానవనము. చంద్రోదయ చంద్రికా వర్ణనములు, వన విహార పుష్పాపచయ వర్ణ నములు మున్నగునవి తిక్కన తరువాతి ప్రబంధ కవులకు పెట్టిన భిక్ష. మూలములో లేని చంద్రోదయ చంద్రికాభివర్ణన ములు- తి క్కన స్వకపోల కల్పనములు ప్రబంధోదయమునకు దారి తీసినవి.

నిర్వచనోత్తర రామాయణమునందలి చంద్రోదయ వర్ణన ము ఉదాహరణప్రాయము.

**చిత్తజు చిగురులం జ్రితంబుగా నిడ్డ**
**లలిత తమాల పల్లవ ఘనంగ**
**రతిపు మాణిక్యదర్పణమున నూనిన**
**కమనీయ మృగమదకణ మనంగ**
**వెడవిల్తు లీలారవిందంబు మీఁదికిఁ**
**దివుటమై యరిగిన తేటి యనగ**

**వలరాజు సిందూర తిలకంబులో జెలు**
**వొందు కాలాగరుబిందు వన(గ**
**నుదయరాగమహిమ నుజ్జ్వలంబైన బిం**
**బంబు నడుమ లాంఛనంబు చెన్ను(**
**జేయ( బూర్వశైలశిఖరదేశంబున**
**నిందు( డొప్పె భువన మెలమి మిగుల.**

కాని తిక్కన చూపిన సంయమము ప్రబంధ కవులు పాటింపక పోవుట శోచనీయము. మూలములోని కథ విషాదాంతము. సంస్కృత రామాయణము సపరివారముగ శ్రీరాముడు సరయూ ప్రవేశ మొనరించి నిర్యాణ మొందుటతో ముగియు చున్నది. తిక్కన నిర్వచనోత్తర రామాయణము కుశలవులు రామునితో( జేరి రాజ విద్యల నేర్పుట తో ముగియు చున్నది. కావ్యమర్యాద ననుసరించి తిక్కన నిర్వచనోత్తర రామాయణ మును మంగళాంతము సల్పెను.

మూలములో( గల నరక వర్ణనము, అహల్యాకథ, భృగు శాప కథనము మున్నగునవి నిర్వచనోత్తర రామాయణములో లేవు. మఱియు మూలములో( గల అవాంతర గాథ లన్నిటిని తిక్కన వదిలి పెట్టెను. నృగరాజకథ తిక్కన యొక్క పద్యమున సంక్షేపించెను. శ్రీరాముని వీడ్కొని జనకాదులు తరలుట మూలములో నాలుగు సర్గలు తెలుగులో కొన్ని పద్యములు మాత్రమే. మూలమున రావణ బలి సమాగమము మున్నగు గాథ లైదు సర్గలు. అధిక పాఠములు గలవు. అట్టి వాని నెల్ల తిక్కన తెనిగింపక వదలెను.

తిక్కనకు( గల స్వతంత్రత నిర్వచనోత్తర రామాయణము నందే అంకురించినది. మూలమున సీతాపవాదమును శ్రీరాముడు హాస్యగాండ్ర వలన( దెలిసికొనును. నిర్వచనోత్తర రామాయణమున సీతాపవాదము శ్రీరామున కెరింగించినది, నర్మ సచివు(డైన భద్రు(డు.

నిర్వచనోత్తర రామాయణ కథ అయోధ్యా వర్ణనముతో నారంభించుచున్నది. ఈ వర్ణనము సంస్కృత రామాయ ణములో లేదు. సంఘమునకు సారస్వతమునకును బింబ ప్రతిబింబ బావము గలదను దృష్టితో( జూచినచో నిర్వచనోత్తర రామాయణము

లోఁ దిక్కన నాటి యాంధ్ర సాంఘికవృత్తముల నక్కడక్కడ ఛాయా మాత్రముగ గుర్తింప వచ్చును.

తిక్కన యయోధ్యాపుర వర్ణన యొక యాదర్శప్రాయమైన ఆంధ్ర మహానగర వర్ణన. పదుమూడవ శతాబ్దిలో నాంధ్ర దేశములో శత్రుదుర్భేద్యమైన యొక కోటను తిక్కన రామాయణ కాలమునాటి యయోధ్యపురికిఁ జేర్చినాడు. ఆ విశాల పరిఖ, ఉన్నత వప్ర గోపుర ములు, బహురత్నోత్కీర్ణశాలభంజికలు రత్న ఖచిత హర్మ్య రేఖ లు, మత్తేభగర్జిత స్ఫారరవంబులు బృంహిత నాదములు, పవన జవనాశ్వములు — ఇవి యానాటి కోటలలోఁ దిరుగుచుఁ దిక్కన స్వయముగఁ జూచినవే. వానిని గూర్చి వాల్మీకి, యొక్క ముక్క గూడ సంస్కృత రామాయణమునఁ జెప్పలేదు. ఇంతే కాదు.

**మవ్వంపు మేనుల జవ్వనంబుల కింపు**
**మిగిలిన చెయ్యుల మెఱుఁగు వెట్ట**
**నల్లన మధురంపు సల్లాపరచనకు**
**లేత నవ్వున నునుఁ బూత పూయ**
**నిడు వాలుఁ గను దోయి నినుపారఁ గాంతికిఁ**
**గలికి క్రేగన్నుల నలుపు మిగుల**
**లలితంబులగు చిత్తముల చతురతలకు**
**సరసంపు నడవడిఁ దెరలు వుచ్చ**

**వెరవు గల్గి మనోభవు వీరరసము**
**నిరతముగ నేర్పు వాటించి కరుపు గట్టి**
**పోసి చేసిన రూపుల పోల్కి వార**
**వనిత లొప్పదు రప్పుర వరము నందు.**

వాల్మీకి దేవలోకములో రంభాది వేశ్యలను గూర్చి చెప్పినాడు గాని భూలోకములో వేశ్యలగూర్చి, యందులో నయోధ్యాపురీ వేశ్యల గూ ర్చి ప్రస్తావింపలేదు. మొన్న మొన్నటి వరకు ఆంధ్రదేశ మంతటఁ దిక్కన వర్ణించిన వేశ్య లుండె ది వారని వేఱుగఁ జెప్పనక్కరలేదు. ఘనసార కర్పూర పరిమళములు చందన గంధములు గాలి వీపు లో గుబాళించు చుండెడివి. గంధవహుని పరిమళములోఁ దిక్కన యానాటి విటుల రసికతను మనోజ్ఞముగ వర్ణించినాడు. ఈ విటులు,

సంస్కృత రామాయణమునందలి యయోధ్యలో, నేటి తెలుగు నాట లేకున్నను, తిక్కన నాడును, దర్వాత విద్యానగర విథులలో గంధవహునితో గలసి మెలసి తిరుగుచుండెడి వారనుట తథ్యము. యువతుల శృంగారము తిక్కన లలితముగ వర్ణించినాడు. ఆ యువతు లుత్తర దేశమందలి యయోధ్యాపుర వాసినులు కారు. ఆంధ్ర యువతు లేనాడు మేలి ముసుగు నేరుఁగరు. "పయ్యెద దూలించుట" యే నాటికి నేటికిఁ దెలుగు పడుచుల యనవరత శృంగారము. చందనగంధములు మైపూతలు నవతంస మంజరులు నాడు గలవు. ఆనాడు మెలతల చెక్కుల మెఱుఁ గు వింతగ నవతంస మంజరులు గాలిలోఁ గదలుచుండెను. "శుకపిక సంకులత్వమున సుందరసాంద్ర లతాంత పల్లవ ప్రకర బహుచ్ఛవిమ్ బురవరంబు విహా ర వనంబు లొప్పు"నట. ఆ విహారవనము లలనాటి యయోధ్యలోఁ గలవో లేవో చెప్పలేముగాని, తిక్కన నాటి తెలుగు రాజధానులలోఁ గల వని చెప్పవచ్చును.

ఉపవనములను వర్ణించునపుడు తిక్కన యుప్పొంగి రచించెను. మత్తాళి పుష్పితనవలతాపుంజములోపల విహరించుచుండెడిది. ఉన్మద కలకంఠ కుమారుడు సహకార పల్లవ సమితి కదల్చుచుండెడివాడు. మందమారుతము లా పుష్పవనములలో విహరించుచుండెడివి. ఉద్యానవనములలో లతామండపము లుండెడివి. రాజాంతఃపురములలో నుద్యాన వనము క్రీడారంగము. సీతారాముల వనవిహార వర్ణనమును మూలములోఁ గంటెఁ బెంచి తిక్కన వర్ణించుటబట్టి నాంధ్రరాజుల రాణుల కేళీ విలాస విహారములకు నుద్యానవనములే యాటపట్టులని తెలియుచున్నది. ఇట్లే జలక్రీడలు : ఉపవనములలో జలక్రీడలకు సుందర తటాకములుండెడివి.

సీతకు మూలములోఁ జెలికత్తెలు కన్పింపరు. నిర్వచనోత్తర రామాయణమున లెక్కకు మిక్కిలి చెలికత్తెలు గలరు. ఈ చెలికత్తియ లందఱు తిక్కనమహాకవి సీతకు ధర్మముగ నొసగిన పరివారము గాదు. ఆనాడు తెలుగు రాణులకు అంతఃపుర వాసినులైన పరిచారికా బృందము లెక్కకు మించి యుండెడిది. అంతఃపురోద్యాన విహార జలక్రీడాదులు తిక్కన కాలమునాటి తెలుగు నేలనే గాక

తరువాత విద్యానగర సామ్రాజ్యమునఁ గూడఁ గల యాచారములు. ఈ విషయము విద్యానగరము సందర్శించిన విదేశ యాత్రికుల వ్రాతలవలనఁ గూడఁ దెలియుచున్నది. తిక్కన పురవర్ణనము చదివిన తర్వాత ఓరుగల్లు కోటలోని నేటి శిథిలావ శేషములను జూచినప్పుడు, పఠిత స్వప్నములోఁ జూచిన దానిని సరిపోల్చు కొనుచున్నట్లు విస్మితుఁడగును.

రామాయణములో కుబేరుని దూత రావణు సందర్శించుట గలదు. కుబేరుని దూత సభలో రావణునిజూచి "జయ" అని పలికినాడు. సమయోచితముగ రాయబారమును నెరపినాడు. ఈ ఘట్టములో తి క్కన పంపిన దూత యక్షదూత కాదు. తెలుగు దూతయే. అతడు చనుదెంచి ముందుగ విభీషణుని జూచినాడు. విభీషణు డు 'వచ్చిన కార్య మరసి' 'దానవేశ్వరుని' 'చెచ్చెర గాని పించి' వా డు ఎడసేయక అప్పుడు దూత 'వినీత వేషుడై చొచ్చి,' ధరాత లంబురము సోకగ నానతుఁడై యుపాయనం బిచ్చి, కర ప్రదర్శిత మహిన్ సంకుచితోప విష్టుఁ డైనాడు. దూతకు వినీత వేషము తిక్కన క్రొత్తగ వేసినదే. దూత రాజుగారికంటె ముందు రాజసోదరుని దర్శింపవలెను. అతడు దూతను రాజునకు సమర్పించును. దూత ధరాతలము సోకగ సాష్టాంగదండప్రణామ మాచరించి రాజుగారు చేసన్నతోఁ జూపిన చోట నొదిగి కూర్చున వలెను. ఇవి తిక్కన కాలము నాటి రాజాస్థాన మర్యాదలు.

మూలములోన విష్ణుదేవునకు రాక్షసులకు మధ్య జరిగిన ఘోర యుద్ధములు కలవు. తిక్కన తెలుగులో ఆ యుద్ధములను వర్ణించినాడు. అందఱి భటులు దేవతలును గారు రాక్షసులును గారు. వారు

**"కాలిన వారిఁ జూచి వెడగొంకిన మొచ్చక మున్నుఁ వెన్నుఁగా**
**నేలకుఁ జొచ్చువారుఁ దమ నెయ్యుర కడ్డము వచ్చువారు ను**
**క్కీ లయి  నేర్పులేక తమకించి పయింబడి నొచ్చువారు మున్**
**వాలిన మచ్చరం బగుట వారణ సేయక వ్రచ్చువారునై"**

పోరాడినారు. ఇట్టి వారు సంస్కృత మూలమున లేరు. "ఉక్కిలయి నేర్పులేక తమకించి పయింబడి నొచ్చువారు" ను గల రట. శక్తి;

యుక్తి; కత్తి; కలము, తిక్కననాటి తెలుగు భూమిలో వియ్య‌ మంది నవి. యుక్తి లేని శక్తి, కత్తి నెరుగని కలము నాటి వారికి నచ్చవు.

కుబేరుఁ డోడిపోయిన పిమ్మట యక్షులు చెల్లా చెదురై కాంది శీకు లయిరి. ఓటమి విషయము సంస్కృత రామాయణమునఁ గలదు. గాని, "కాందిశీకుల" వర్ణనమందుఁ గానరాదు. నిజమునకు కాంది శీ కులయినది యక్ష ప్రజలు కాదు. తిక్కన కాలము నాటి రాజు లన్య రాజుల జయించి నప్పుడు విరోధి రాజధానుల దగులపెట్టి, తదాశ్రి తులఁ బారద్రోలు చండెడి వారని సమకాలీన శిలా శాసనములు లే క పోయినను మన మీ విషయమునఁ జారిత్రకముగ నంధకార స ముద్రమున మునిగిపోయెడి వార మనుకొన నక్కర లేదు. అద్దము లో వలె బ్రతిఫలించి, యలనాటి కాంది శీకుల కష్టములు నిర్వచ నోత్తర రామాయణమునఁ గన్పించు చున్నవి.

**కాలుకొన్నంతయుఁ బాఱి**
**  కనుకని దేసలందుఁ గాడు పడియుఁ**
**జాఱఁ బాలక ముట్ట బడి జాడఁ దప్పంగఁ**
**  దొలగి పెల్లొందులఁ దూఱఁ బడియుఁ**
**దలలుఁ జీరలును గంపలు పట్టికొని గాని**
**  గ్రామగ్గు టడవులఁ గాటు పడియుఁ**
**గాఁకులఁ జేతులఁగా నెట్టకేలకుఁ**
**  జఱు తెక్క లోయలఁ జాగఁ బడియు**

**బయలి మొనలు గోఁట కట్టిన పెల్లున**
**వీటి ప్రజయు నొక్క మాట యురలఁ**
**దెరలి యుద్ధఁ ఔక్క తెరువునఁ బోవక**
**యాకులతను గాందిశీకులైరి.**

రాజు అన్యరాజ్యంబులు జయించి నపుడు తిక్కన కాందిశీకుల క ష్టములు కనులారఁ గాంచియుండును. ఈ వర్ణన యేతదను భూతి పరిణామమే. నాటి తెలుగువారి కష్టము లన్నియు పాపము రామా యణ కాలము నాటి యక్షులకుఁ దెచ్చి పెట్టినాడు మంత్రి తిక్కన. "పయనము చాటుఁ బంచి సులభంబుగఁ బారియు నీరు వంటకట్టి యలునుగల్గు చోట్లను గడించి మగల్ దగు నొక్క ళంబుగా భయమ

ను పేరు లేక నిరపాయముగ విడియించుచున్" రావణుఁడు సేన ల నడపెను. ప్రపంచము నంతయు జయించుచు నాకాశమార్గము నఁ బోవుచు యథేచ్ఛగమన శీలులగు రాక్షసులు గాదు పూరి, నీరు, వంట కట్టెలు గల చోట్లు తంటాలు పడి వెదకి విడిసినది. వారు తి క్కన కాలము నాటి తెలుగు భటులే.

'చామర గ్రాహిణీకర చారుకటక రశ్మిరాజ నీరాజితుండు' 'నృపకో టియు, మంత్రి కదంబకంబు,' 'కవీంద్రులు, వంది జనంబు లిష్ట భృత్యులు మొదలైన వారలు' బలసి ముదంబునఁ గొలువ రామ భూవిభుండు కొలువు దీర్చినట్లు నిర్వచనోత్తర రామాయణ వర్ణ నము. ఈ వర్ణనకు మూలము తిక్కన "అనుదినము" చూచిన మనుమసిద్ధి కొలువుకూటమే.

**పౌరజాన పదాభిభాషణంబులు దగ**
**  నయ్యె తెరంగుల నాదరించు**
**నుత్తమ హయదంతిసత్తమ రథరత్న**
**  ములు సూచి సవరణ లలవరించు**
**యోధవీరప్రకారోక్తి నిరూఢస**
**  ముద్ధతి కెడఁదలో నుల్లసిల్లు**
**నిఖిలవిద్యా గమనిపుణవిద్వజ్జన**
**  సంభావనంబుల సంతసిల్లు**

**ననుదినంబు నిట్టు లభిమతబహువిధ**
**సముచితప్రవర్తనము లొనరుచ**
**చతివిభూతిఁ నుండి కతిపయదినములు**
**వోవుటయును రామభూవిభుండు.**

సంస్కృతరామభూవిభుఁ డీ రాజ్యకార్యములు తీర్చినట్లు వాల్మీకి చెప్పలేదు.

# భారత రచన

నిర్వచనోత్తర రామాయణ రచన నాటికే తిక్కన కవితా కళలోసిద్ధ హస్తుడుగ లభ్య ప్రతిష్ఠుడైనను భారత రచన నాటికి అతని వ్యక్తి త్వము పండినది. ప్రౌఢ నిర్భరవయః పరిపాకమున నిర్వచనోత్తర రామాయణ రచనకు భారత రచనకు మధ్య కొంత వ్యవధి యున్న దనుట తిక్కన ఆత్మీయతలో నేర్పడిన పరిణామ వికాసమును గమ నించిన సహృదయులకు తెల్లము. తొలినాటి అహంభావము మలి నాడు వినయముగా పక్వమైనది.[1] ఐతిహ్యము, తిక్కన, భారత రచ న నాటికి పండు వృద్ధని చెప్పుచున్నది. జనశ్రుతిలోని (కుమ్మరి) గురునాథము కథ పై విషయమునకు బలము చేకూర్చునదే.[2]

జ్ఞానవయోవృద్ధుడయి, బ్రదుకు వెలుగునీడలను పడుగు పేకలుగ విడదీసి, చూచి ముక్కాకలు తీరిన ముదిమిలోనే తిక్కన మహాభారత రచన కుపక్రమించినట్లు — అక్షరముల వెనుక నుండు భావములకు వయసు కట్టగలిగిన అనుభవజ్ఞులు గుర్తింపగలుగునదే.

"అమలో దాత్త మనీష నే నుభయకావ్య ప్రౌఢిఁ బాటించు శిల్పమునం బారగుడ గళావిదుడ" అన్న తిక్కన మంత్రి "నా నేర్చిన భంగి చెప్పి వరణీయుడ నయ్యెద భక్తకోటికి న్" అన గలిగిన తిక్కన సోమయాజిగా మారుటకు ఒక అర్ధరాత్రి చాలదు. అంతేగాక

"మహేశ్వరాంఘ్రి కమల ధ్యానైక శీలుడు" నగు తిక్కన "విష్ణురూపాయ నమశ్శివాయ" అన గలుగుటకు, కొంత కాలము పట్టియుండును.

మహాభారతమునందలి ఆశ్వాసాంత గద్యకు నిర్వచనోత్తర రామాయణము నందలి దానికి గల భేద మరయ దగినది. "ఇది శ్రీమదుభయ కవిమిత్ర కొమ్మనామాత్య పుత్ర బుధా రా ధన విరాజి తిక్కన సోమయాజి ప్రణీతంబైన శ్రీ మహాభార తంబు నఁ ..." అని భారతమునఁ గలదు.

---

1. మొదటి అధ్యాయమున ఈ విషయము సవిస్తరముగ నుదాహృతము.

2. "స్వర్గారోహణము" స్వర్గావరోహణము అను మహాకావ్యములను మిల్టను కవి ఏనుబది యేండ్ల వయస్సులో తన పుత్రికలకు ఆసువుగ చెప్పెనందురు.

నిర్వచనోత్తర రామాయణ గద్యము నందు "తిక్కన నామ ధేయ ప్రణీతంబైన" అని మాత్రమే గలదు—

తిక్కన నామధేయుడు తిక్కన సోమయాజియై మహా భారతము తెలుగున వినిర్మించుటకుం బూనెను.

తిక్కన ఆంధ్రమహాభారతము తిక్కన దృష్టిలో కేవలాను వాదము గాదు. పారాశర్యుని కృతి పంచమ వేదము.

**"తెనుగు బాస వినిర్మింపఁ దివురు టరయ**
**భవ్య పురుషార్థ తరు పక్వ ఫలము గాదె"**

అని విరాటపర్వ పీఠికలో హరిహరనాథుడే స్వప్నమున వచించి నట్లు తిక్కనయే చెప్పకొనెను.

## సంస్కృత మహాభారతము

ఏక లక్ష శ్లోక సంభృత మహేతిహాసము సంస్కృత మహాభా రతము. గ్రంథకర్త వేదవ్యాసుడు. "వైయాసికి" అను నామాంతరము పురస్క రించుకొని యా గ్రంథమంతయు వ్యాసప్రోక్త మని విశ్వసిం చువారు కొందరు గలరు. ఈ విషయమున పరిశోధకులలో నేకవాక్య త కుద రలేదు.

వేదవ్యాసుడు భారతమునందలి ఆంతరంగిక సాక్ష్యమును బట్టి మహాభారత యుద్ధమునకు సమకాలీనుడు. అతడు వ్రాసిన కావ్యము జయ. జయ చిన్న కావ్యము. వేదవ్యాసుని శిష్యులైన పైల, శుక, జైమిని, సుమంతు, వైశంపాయనులు ఐదుగురును పంచ భార తములు వ్రాసిరి. ఆశ్వలాయన గృహ్య సూత్రములలో పంచ భార తముల ప్రసక్తి గలదు. ఇప్పటికిని జైమిని భారతము అశ్వమేధ ప ర్వము ప్రచారము లో నున్నది. జనమేజయుని సర్ప యాగమున వైశంపాయ నుడు పఠించిన భారతము, ఇరువదినాలుగు వేల శ్లోకములు గలది. చిరకాలము ప్రచారములో నున్న పంచ భారత ములను, అనేక వేదాంత దర్శనములను వివిధ నీతి కథలను క్రోడీ కరించి, ఒక సమగ్ర గ్రంథముగ నిర్మించ వలసిన అవశ్యకత యేర్పడినది. ఆ పని యొక్కడు చేయగల్గునది గాదు. ఒక రోజున జరుగునది కాదు. మహాభారత కథనము బట్టి ఆ బృహత్కార్యము

పం(డెండు సంవత్సరములు పట్టినట్లూహింప వచ్చును. నైమి శారణ్యమున శౌనకాది మహర్షులకు సూతుడు ఉగ్రశ్రవనుడు చెప్పిన భారతమే యేక లక్ష శ్లోక సంభృత మహేతిహాసమని విశ్వ సింపవచ్చును. అందుచే ఆదిలో జయగ నుద్భవించిన చిరు కావ్యము, జనమేజయుని సర్ప యాగమున వైశంపాయన ప్రోక్తమైన భారతముగ రూపొంది చివరకు మహాభారత మైనది. మహా భారత ములో చేరిపోయిన పంచ భారతములు వివిధోపాఖ్యానములు - గీతలు – మున్నగున వన్నియు ఏక కాలికములునుగాని ఏక కర్తృక ములు గాని కావనియే అధ్యతన పరిశోధకులలో అధిక సంఖ్యాకుల మతము.

భారతీయ సాహిత్యము అను గ్రంథము నందు "వింటర్ నిట్జ్" వాక్యములు ఉదాహరింప దగినవి.

"హైందవుల విశ్వాసపూరితమైన దృష్టితో గాక చారిత్రక పరి శోధన దృష్టితో చూచినచో మహాభారతము ఏకకర్తృకమని చెప్పుటకు వీలు లేదు. అంతేగాక—విచక్షణ గలిగిన ఒక సంపాదకుఁడో లేదా తెలివిగల ఒక సంగ్రథనకర్తయో చేసిన పని యని గూడ ననలేము. మహాభారతము మొత్తము మీద ఒక మహాసాహిత్య బ్రహ్మారాక్షసి. పరస్పర విరుద్ధములైన దర్శనములను, విభిన్నాభి ప్రాయము లను ఒకచోఁ సంగ్రథించు ఆ అసాధ్య కృత్యమునకు పృథివిలోనే ఏ మానవమాత్రుడును ప్రయత్నించి యుండలేదు. కవితాశక్తిలేని పౌరాణికులు, వ్రాయసగాండ్రు, వివిధ భాష్యకారులు, యుగ యుగాం తములనుండి వచ్చుచున్న సారస్వత ఖండములను ఆధ్యాత్మిక విషయములను అన్యోన్య విరుద్ధాంశములను నొకచోఁ చేర్చుటకు, సాహసించినారు. కాని—ఈ మహా కవితారణ్యములో, అమర కవిత భావములు అద్వితీయ జ్ఞానరత్నములు దేదీప్య మానముగ శాశ్వత ముగ మిరుమిట్లు గొల్పు చుండును."

ప్రపంచ వాఙ్మయమున అద్వితీయములని చెప్పదగిన వీర కథలు, ఆధ్యాత్మిక గీతలు, నీతికథలు కవితాభావములు ఇందు పడుగు పేకగా కలసిపోయినవి.

క్రీస్తు శకము మొదటి శతాబ్దినాటికే యేక లక్ష శ్లోక సంభృత మైన సంస్కృత మహాభారతము భారతదేశమున ప్రచారములో నున్నది. డాన్ క్రిసోస్తమ్ అను గ్రీకు యాత్రికుడు, "హిందూదేశ ములో యేక లక్ష శ్లోకములను రచించిన హెూమరు గలడు" అని చెప్పెను.

జయ - భారతము - మహాభారతము అను మూడు ప్రధానా వతారములతోపాటు - మహాభారతేతివృత్తము ఎత్తిన వనేకావతా రములు గలవు. అందు చేరిన ప్రక్షిప్తములు, అవాంతర గాథలు ప్రస్తుతము విడదీసి ప్రస్తరించుట అసాధ్య కృత్యము. "వింటర్ నిట్జ్" అభిప్రాయ మీ పట్టున ఉదాహరింపదగినది. "ఈ ప్రాచీన భారతేతిహాసమును పునర్నిర్మించి, తొల్లిటి రూపమును ప్రస్తరింప జూచుట పాక్షికత్వముతో కూడిన విఫల ప్రయత్నమే కాకమానదు. అట్టి దానికి ఆత్మాశ్రయమైన ఊహాకుండు విలువయే కట్టదగును."[1] సంస్కృత మహాభారతమునకు ప్రస్తుతము ప్రచారములోనున్న పాఠభేదములను సూక్తాంకరు పండితు డీ క్రింది విధముగ వంశ వృక్షము నిచ్చియున్నాడు.

ఔత్తరాహ ప్రతికి, దాక్షిణాత్య ప్రతికి, ఎన్నో పాఠభేదములు కన్పించుచున్నవి. శ్లోక సంఖ్యలో, శ్లోకములలో, అధ్యాయములలో, ఇతి వృత్తములో, పేరులలో అసంఖ్యాక భేదములు గోచరించును. ఇవి రెండును ఒకే ఇతివృత్తమును స్వీక రించిన భిన్న గ్రంథములా యని సందేహము కల్గించు తావులు అనేకములు. కాని ఈ రెంటికి కొన్ని శతాబ్దుల క్రిందట ఆధార గ్రంథ మొక్కటే యనుట యొక్కటి దక్క, ఏక గ్రంథ మని పిలుచుటకు మరియే యాధారమును లేదు. ఉత్తర పాఠమునకు దక్షిణపాఠమునకు భేద సామ్యముల పరి కించిన సామ్యముల కంటె భేదములే యెక్కువ. ఇక, ఔత్త రాహ ప్రతులలో గూడ భేదము లున్నవి. దాక్షిణాత్య ప్రతులలో తెలుగు, గ్రంథాక్షర మళయాళ ప్రతుల భేద మటుంచి తెలుగు ప్రతులలోనే గల భేదము అరయదగినవి. అట్లే గ్రంథాక్షర మళయాళ ప్రతులును.

---

1. Every endeavour to reconstruct the ancient Indian National epic itself in its original shape will always be attended with so great an element of arbitrariness that it can only have a purely subjective nature.

# వంశ వృక్ష చిత్రము — Genealogy diagram



ఇట్టి యెడ భండార్కరు పరిశోధక సంస్థవారు, సమస్త పాఠ భేదముల సమీక్షించి సమన్వయ ప్రతి నొక దానిని ప్రచు రించు చున్నారు. వారి కృషి అభినందింపదగినదే గాని, తెలుగు భారత మునకు ఆధారమైన ప్రతిని నిర్ణయించుటకే మాత్రము ఉపకరింప జాలదు.

కవిత్రయము వారు ఏ ప్రతి ననుసరించిరి? తిక్కన యే ప్రతి ననుసరించెను? ఇది చిక్కు సమస్య.

ఈ సమస్య మరింత జటిల మగుటకుఁ గల కారణము అచ్చు ప్రతులు వచ్చిన తరువాత భారత దేశములోఁ ఆంధ్ర దేశములో ప్రచారములో నున్నవి, ఔత్తరాహ ప్రతులగుట. వావిళ్ల వారు ప్రప్రథమమున తెలుగు లిపిలో ప్రచురించిన మహాభారత మున ౮౪౭౭౦ శ్లోకము లున్నవి. ఇది ఔత్తరాహప్రతియే. ఔంధే సంస్థానము నందలి స్వాధ్యాయ మండలి వారు ప్రచురించిన ప్రతిలో ౮౪౦౬౩  శ్లోకములని యున్నది. హరివంశము భారత మునకు ఖిల పర్వమని సంప్రదాయము గనుక భవిష్యత్పర్వము హరివంశము కలిసి ౧౮౧౦౦౯ శ్లోకములు. వానిని కలిపిన లక్ష సంఖ్య దాటిపోవును.

నన్నయభట్టు ప్రకారము ౧౦౦౦౭౮ శ్లోకము లుండ వలెను. మహాభారత గద్యమున శతసాహస్ర్యాం సంహితాయాం అని యున్నది. మహాభారతమునందు అధిక భాగము అనుష్టుప్ఛం దములో నున్నది. కావున లక్ష అనుష్టుపు లుండ వలెనని కొందరి మతము. కాని అది కుదరదు.

మహాభారతమున ఛందో వైవిధ్యముతో పాటు అనేక గద్య భాగము లను గలవు.

మహాభారతమును తిరిగి ఆమూల చూడముగ ఆంధ్రీకరిం చిన కవిసార్వభౌమ శ్రీ శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రిగారు అనుసరించిన ప్రతి గూడ ఔత్తరాహ ప్రతియే. ప్రతాప చంద్ర రామ్ గారు ఆంగ్ల వచ నములోని కనువదించినదియు ఔత్తరాహ ప్రతియే.

సంస్కృత మహాభారతమునుగూర్చి వ్రాయు వారికి, ఆంధ్ర మహాభారతమును విమర్శించు వారికి, ఈ సమస్య యెదు రగుట సహజము. విమర్శల చేయువారు చూచిన ప్రతుల లోని భేదముల ననుసరించి విపరీత వాదములు తలనూపుట సహజము.

శ్రీ శ్రీపాద కృష్ణమూర్తిశాస్త్రిగారు యథామూలముగా అనువ దించి రనియు కవిత్రయము వారు చాల వరకు స్వతంత్రించి రనియు లోకములో నొక అభిప్రాయమున్నది.

శ్రీకృష్ణ భారతమునందలి విరాట పర్వమునకు ఉపోద్ఘాత ముల నున్న విమర్శ గమనింప దగినది. "భారత కవిత్వమునకుం బ్రారంభ మవుటం జేసి కాబోలు 'ఆరంభ శూరత్వమ' ను నట్లు విరాట పర్వము మూలాతి భిన్నముగ బెక్కు స్థలములు ఆది యందు స్వవిషయ కథనము, అరణ్య పర్వాంతమందు జెప్పదగిన ధౌమ్య ప్రబోధమిందు చెప్పుట, కీచకుడు ద్రౌపదిఁ జూచి నపుడును ద్రౌపదిని గూర్చి సుదేష్ణతో ముచ్చటించునపుడును మోహాతి రేకమున బరితపించి నపుడును మఱియు ననేక స్థలముల యందును అనేక విషయము లనేక వర్ణనములు చేర్చి పెంచి పెద్దదిగఁ జేసి కావ్య మనిపించినాడు. అట్లు చేసెను గాని మూలమున నున్న దుర్గాస్తవములోనగు ననేక విషయములు విడిచియే యున్నాడు."

మిగిలిన విషయముల, ప్రస్తుత మటుంచి, ముందు రెంటిని గూర్చి ప్రస్తావించవలసి యున్నది.

అరణ్య పర్వాంతమునఁ జెప్పదగిన ధౌమ్య ప్రబోధము తిక్కన విరాటపర్వమునే వ్రాయుట

## దుర్గాస్తవము విడిచిపుచ్చుట

పి. పి. యస్. శాస్త్రిగారి సంపాదకత్వమున వావిళ్లవారు నాగర లిపిలో దాక్షిణాత్య ప్రతిని ప్రచురించి యున్నారు. శ్రీ శాస్త్రిగారు గ్రంథాక్షరములలో మళయాళ లిపిలో తెలుగు లిపిలోనున్న ప్రతులను సేకరించి యే ప్రతిలోని వానిని విడువక బృహత్పాఠ ముగనే స్వీకరించి యున్నారు.

దాక్షిణాత్య ప్రతులన్నిటిలో[1] ధౌమ్య ప్రబోధము విరాట పర్వాదియందే గలదు. దుర్గాస్తవము దాక్షిణాత్య ప్రతులలోఁ గాన రాదు. కావున, శ్రీకృష్ణ భారతము విరాటపర్వ భూమికలోని విమర్శన మునకు తావు లేదు. ఇది, విమర్శకుల దోషము గాదు. ౧౯౩౦ సంవ త్సరమున వావిళ్లవారు నాగరలిపిలో దాక్షిణాత్య ప్రతిని ప్రచు రించినారు. అంతకుముందు దేశములో ప్రచారములో నున్నవి ఔత్తరాహ ప్రతులే. ఇట్లే తిక్కన భారతముపై వెలువడిన పత్రికలలో వెలువడిన విమర్శలు భిన్నప్రతులను జూచి చేసినవే.

కవిత్రయము వారు ముగ్గురును ఒకే పాఠమును అను సరించి యుండరనుటలో విప్రతిపత్తి లేదు. "ముగ్గురు కవులును భిన్న కాలమువారు కావున వారికి లభించిన ప్రతులు భిన్నముల నుటలో సందేహము లేదు.[2]

శ్రీ పాదవారి విరాటపర్వమున భీముడు అజ్ఞాతవాసమున దాల్చిన గుప్తనామధేయము "వల్లభుడు". తిక్కన భారతములో అప్పటి అతని పేరు వలలుడు. దాక్షిణాత్య ప్రతులన్నిటిలో వల లుడని యున్నది. ఔత్తరాహ ప్రతులలో మరియు శ్రీ పాదవారి భారతములో వల్లభుడని యున్నది.

శ్రీ పాదవారి భారతములో ద్రౌపది భీముని అనంతరము విరాటనగరము చేరును. "ఈ ప్రవేశము తిక్కన సోమయాజి భారతమునందు మాత్రమిట్లుగాక అన్నదమ్ములు నల్వురునైన పిమ్మట ద్రౌపది వచ్చినట్లున్నది. అన్ని సంస్కృత ప్రతులందు నిట్లున్నది. దీనికి కారణ మూహింప నై యున్నది" అని శ్రీ పాదవారు వారి భారతమున నప్పట్టున అధోభాగమున నక్షత్ర గుచితమైన ఆశంక సూచించి యున్నారు. కాని, ఔత్తరాహ ప్రతులలో అట్లున్న మాట నిజమే కాని అన్ని సంస్కృతప్రతులలో నట్లులేదు. దాక్షిణాత్య ప్రతులలో తిక్కన వ్రాసినట్లే గలదు.

---

1. శ్రీ కొరాడ రామకృష్ణయ్యగారు - ఆంధ్ర మహాభారత కవితా విమర్శనము.

2. పి. పి. యస్. శాస్త్రిగారి నాగరలిపిలోని సంస్కృత మహాభారతము— వావిళ్లవారి ప్రచురణ ౧౯౩౦ సం. నాటిది.

# పాండవుల గుప్త నామములు

ధర్మజ - భీమ - అర్జున - నకుల - సహదేవ

ఔత్తరాహ ప్రతి  కంక - వలల - బృహన్నల-గంధిక- తంత్రీపాల.

దాక్షిణాత్య ప్రతి కంక - వల్లవ-బృహన్నల-దామగంధి-తంత్రీపాల.

దాక్షిణాత్య ప్రతిలోని నామములే తిక్కన భారతము నందును గన్పించుచున్నవి.

ఔత్తరాహ ప్రతులలో లేకపోయినను దాక్షిణాత్య ప్రతులలో నున్న అనేక విషయములు తెలుగు భారతములో గన్పించు చున్నవి. మొత్తము మీద దాక్షిణాత్యప్రతులలోని శ్లోకముల సంఖ్య అధికము. ఔత్తరాహ ప్రతులలోనున్న కొన్ని విశేషములు దుర్గా స్తవము మున్నగునవి, దాక్షిణాత్య ప్రతులలో గన్పింపక పోయినను, దాక్షిణాత్య ప్రతులలోని పెక్కు విశేషములు ఔత్తరాహ ప్రతులలో గన్పించుట లేదు.

తిక్కన దాక్షిణాత్య ప్రతినే అనుసరించెనని చెప్ప వచ్చును. అయిన తిక్కన అనుసరించిన ప్రతిని నిష్కర్ష గ నిర్ణ యించలేము.

మరి కొందరు, తిక్కన అనంతరము అయా భాగములు కొన్ని సంస్కృతీకరింపబడి దాక్షిణాత్య ప్రతులలో, ఔత్తరాహ ప్రతులలో, చేరియుండరాదా? అని యెదురు ప్రశ్నించు చున్నారు. మళయాళమున దొరికిన ప్రతులు, తమిళ దేశమున గ్రంథాక్షర ములఁ ప్రతులు, తెలుగుదేశములోని బహు ప్రతులు ఇంచుమించు నొకేతెన్నున నున్నప్పుడు ఆ శ్లోకములను ప్రక్షిప్తము లనుకొనుట ప్రజ్ఞావాద మగును. కాని, తిక్కన భారతమును చదివిన పిమ్మట సంస్కృత మూలమున దాక్షిణాత్యప్రతిని అనుశీలించినచో అతడు దాక్షిణాత్యప్రతినే అనుసరించెనని తోచును. తిక్కన యేదో ఒక ప్రతిని మాత్రమే చూచి యుండలేదనియు బహు ప్రతు లను జూచి యుండుననియు నెంచవచ్చును. ఔత్త రాహ ప్రతిని తిక్కన అనుసరింపకపోయిననూ అసలే చూడ లేదని చెప్పుట సాహస మగును. విరాటపర్వమున, ద్రౌపది భీమునితో కీచక విషయము

ప్రస్తావించు పట్టున అరణ్యావాసమున కేగునప్పుడు కుంతీదేవి సహదేవుని తన కప్పగించెనని చెప్పను.

**ఏనును మీరుఁ గానలకు నేఁగునెడన్ నను జేరి యెంతయున్**
**దీనత దోఁప గుంతి సహదేవుని నిల్లడ వెట్టి నాకు న**
**మ్మా నిను నమ్మి చాల విషమంబగు నిమ్వనవాస మేత్తడుం**
**బూనఁగ నియ్యోకొంటి నని బోరన సఖులు గ్రమ్మ చుండగన్.**

మఱియును.

**కడుంబసిబిడ్డ వీఁ డొకటిగా ధవు నా నెఱుంగండు ముంద రె**
**య్యెడ నొక పాటెరుంగ డెద యెంతయుఁ గోమల మెప్పుఁడైన నే**
**గడువగఁ బిల్తుఁ గాని తనకుం గల యాకటి ప్రొద్దుఁ రుంగఁ డీ**
**కొడు కిటు వోకకున్ మనము గుందెడు నిన్ గని యూఁర డిల్లెడున్.**

పై పద్యములకు దాక్షిణాత్య ప్రతిలో మాతృక మృగ్యము. కాని ఔత్తరాహ ప్రతిలో నున్నది. దీనిని బట్టి, తిక్కన ఔత్తరాహ ప్రతిలో గూడ చూచియుండునని తోచుచున్నది.

తిక్కనకు, హృదయంగమైన చిత్తవృత్తి వర్ణనమనిన గాఢ ప్రీతి. అందుచే దీనిని ఆ ఔత్తరాహ ప్రతినుండి పరిగ్రహించె నని యెంచవచ్చును. మఱియును భారతేతివృత్తముపై నేడు మనకు లభ్యమానములు గాని యే యే రచనలను తిక్కన చదివియుండెనో మనము చెప్పలేము.

అన్ని పర్వములయందును ఆయాపట్టుల తిక్కన ప్రదర్శించు ప్రత్యేకతను గమనించినచో అతని స్వీయప్రతిభ వ్యక్తము గాక తప్పదు. సంస్కృతభారతము పలుచోటుల యందు సంభాషణ రూపమున సాగినది. మూలమున ఉత్తరః, భీమః, ధౌమ్యః, అని మాత్రమే యుండి వారి సంభాషణమున కథ సాగును. తెనుగులో తిక్కన అట్టిచో ఆ ఉత్తమపురుషకు బదులు ప్రథమ పురుషలో నొక కందపద్యములో గాని గీత పద్యములో గాని యాంగికాభినయ పూర్వకముగఁ జెప్పెను. ఇది తెలుగు భారతములో సర్వత్ర గానుపించు చుండును. ఇల్లే తిక్కన అనువాద విధానమునందలి ప్రత్యేకత గుర్తింప వచ్చును.

ఆంధ్ర మహాభారతము మూలమును మించెననియు, విశేషించి తిక్కన సంస్కృత భారతములోని దోషముల పరిష్కరించి మెఱుగులు పెట్టి వేదవ్యాసు మించెనని పొగడెడువారు గలరు.

కవిత్రయమునకు వచ్చిన కీర్తి యంతయు వారు కేవలము భారతము చేపట్టుటచే యాదృచ్ఛికముగ వచ్చినదే యనియు, నిజమునకు ఆ కీర్తి యంతయు మూలమైన సంస్కృత భారత మునకు, తత్కర్తయైన వేదవ్యాసునకుఁ జెందవలెనని వాదించు వారును గలరు.

మూలములో గల మహోదార తాత్విక విషయములను, మనోహరమైన ఉపమాన పరంపరలను, జగదాశ్చర్యకరమైన సుభాషితములను ఎన్నిటినో తిక్కన వదలి, దూరముగ నిలిచి నమస్కరించి తెనుగునఁ దన దారిని పోయిన పట్టు లెన్నియో యున్నవి. అత్యద్భుతముగఁ గనిపించు భావములు చాలవరకు మూలములోనఁ గన్పించుచున్నవి. నేటి తెలుగు విమర్శకులు తిక్కననుఁ పొగడుచున్న భావములకు మాతృకలు మూల భారతములో గనుపించుచున్నవి. మఱియును మూల సంస్కృత భారతముపై తిక్కనకు గల గౌరవము అపారము. 'కావున భారతామృతము కర్ణపుటంబుల నార గ్రోలి' 'భారత సంహితఁ జెప్పఁగంటి నా పుట్టు కృతార్థతం బొరసె' మున్నగు ప్రయోగము లతో, మహా భారతమును, విద్వత్ సంస్తవనీయ భవ్యకవితా వేశుండు విజ్ఞాన సంపద్వి ఖ్యాతుడు సంయమి ప్రకర సంభావ్యాను భావుండు అని వేదవ్యాసుని తిక్కన పులకాంకుర ప్రకరములతో స్మరించి కవితా కర్పూర నీరాజనము నెత్తెను. అందుచే వేదవ్యాసుని కంటె తిక్కన అధికుడను మాట వేదవ్యాసునికే గాక తిక్కనకు గూడ అపచారమే. ఇక ఆంధ్ర మహాభారతము అనువాద గ్రంథము. స్వతంత్ర కవుల కుండ వలసిన ప్రతిపత్తి కవిత్ర యమునకు లేదను వాదము సత్యదూరమే. మూల భారతములో ఔత్తరాహప్రతులలో గాని, దాక్షిణాత్య ప్రతులలో గాని, లేని భావములు, వర్ణనలు ఎన్నో తిక్కన భారతమున గలవు. నిర్వి వాదముగ, నిస్సందేహముగ సర్వతంత్ర స్వతంత్ర మని చెప్ప

దగిన భాగములు, భావములు సన్ని వేశము లెన్నో తిక్కన భారత మున గలవు. ఈ చేర్పులకు తోడు కొన్ని చోట్ల తిక్కన మూల భారతమును అతిక్రమించి, చేసిన మార్పులును గలవు. అయిన ఈ మార్పులు చేర్పులు తిక్కన స్వాతిశయము నకు హేతువులు గావు. కేవలము అంధానుసరణము బానిసల ప్రవృత్తి. తిక్కన సల్పిన, స్వతంత్రతతో కూడిన అనుసరణమే, వ్యాసునకు నిజమైన గౌరవము. తిక్కన స్వతంత్రించి చేర్చిన మూలములో లేని వర్ణన ములు, తిక్కనకు ఆంధ్రవాఙ్మయము నందే గాక, ప్రపంచ వాఙ్మయ ము నందుగూడ మహోన్నత స్థానము లభింపజేయగలవు. విప్రతి పన్నములైన పై రెండు వాదములు సత్యదూరములే.

## తిక్కన — విరాట పర్వము.

తిక్కనకు విరాట పర్వముపై ప్రత్యేక నిష్ఠ గలదు.

**హృదయా హ్లాది చతుర్థ మూర్తితకథోపేతంబు నానారసా**
**భ్యుదయోల్లాసి విరాట పర్వ మట యుద్యోగాదులం గూడఁగా**
**బదియేనింటి దెనుంగుభాస జనసంప్రార్థ్యంబు లై పెంపునం**
**దుది ముట్టన్ రచియించు చెప్పు బుధసంతోషంబు నిండారగన్.**

అని విరాట పర్వ పీఠికలో గలదు.

తిక్కన దృష్టిలో భారతము "ప్రబంధ మండలి". అందు విరాట పర్వము, హృదయాహ్లాది, ఊర్జితకథోపేతము. తిక్కన విరాట పర్వమునకు మఱియొక విశిష్టత గలదు. మిగిలిన పర్వ ముల న్నిటిలో తిక్కన అవలంబించిన అనువాద విధానమును ఒక్క మాటలో చెప్ప వలెననిన "సంక్షిప్తానువాదము." విరాట పర్వములో అవలంబించిన పద్ధతి, సవిస్తరానువాదము. అట్లనిన తిక్కన పర్వములలో తిక్కన విస్తరించిన పట్టులును, విరాటపర్వములో సంక్షేపించిన ఘట్టములును లేవని చెప్పుట గాదు. విరాట పర్వము నందు విడిచిన పట్టులున్నట్లే అన్ని పర్వము లందును గలవు. విరాటము నందు సంక్షేపించి నట్లే తిక్కన అన్ని పర్వముల లోని పట్టులను సంక్షేపించెను. కాని, విరాటములో స్వకపోల కల్పనలు చేర్చినట్లు మరి యే పర్వము నందును చేర్చలేదు. కథా భాగమున కు చెందిన పట్టుల విస్తరించుట, ఆధ్యాత్మిక భాగముల కుదించుట,

ఉపమాన పరంపరలను, బహుళ వర్ణనలను పరిహరించుట; తిక్కన వైలక్షణ్యము. అందుచే అనుశాసనిక, శాంతి పర్వములలో కథాభాగము తక్కువ గావున అచ్చట కుదింపు మఱింత ప్రత్యక్ష ముగ గోచరించు చున్నది. విరాటపర్వమున కథాభాగ మెక్కువగుట ఈ విస్తరణకు కొంత వఱకు హేతు భూతమైనది. మిగిలిన పర్వములలో తిక్కన ప్రత్యేకత లేక పోలేదు. గాని, ప్రాయికముగా ఆ పర్వము లన్నియు, మూలమునకు దాక్షిణాత్య ప్రతికి సంక్షేపా నువాదములే. అందుచే తిక్కన కవితా శిల్పము నందలి వైలక్షణ్యము ననుశీలించువారికి విరాట పర్వమే శరణ్యము. విరాట పర్వము తరువాత కథా భాగము ఎక్కువగా గన్పించునది ఉద్యోగము. అందును తిక్కన విశిష్టత కొన్ని పట్టుల స్వయంవ్యక్త మగుచున్నది. కాని, అచ్చట కూడ సంక్షిప్తానువాద పద్ధతియే యెక్కువగ ప్రస్ఫుటమగును. యుద్ధపంచక ముందు తిక్కన యీ సంక్షిప్తానువాద పద్ధతినే అనుసరించెను. స్త్రీ పర్వమునందు గన్పించు ఛందో వైవిధ్య మరయ దగినది. మిగిలిన పర్వము లందును తిక్కన, మూలమునకు సంక్షిప్తాను వాదమునే సల్పెను. కాని, ఈ పర్వము నందును, తిక్కనకు ప్రియమైన పాత్రోన్మీలనము, ఆంగికాభినయ వర్తనము, సంభాషణ చారిమ, నవ్వులు చిత్రించు ట, భావోచిత భాషవాడుట, చలద్ భంగిమలనే వర్తించుట, అలతి అలతి తునియలుగా కాహళ సంధించినట్లు కందపద్యములలో తెలుగు నుడికారపు సొంపులు తామర తంపరలుగా కురిపించుట, మొదలగునవి కనిపించుచునే యుండును. ఉద్యోగపర్వమునందు సంజయుని రాయబారమున, ద్రౌపది శ్రీకృష్ణునితో దన భంగ పాటును జెప్పు నపుడును తిక్కన వ్రాసిన పద్యములకు మాతృకలు మూలములో గన్పించుచున్నవి. అందుచే నేటి విమర్శకులు తిక్కనకు ఆపాదించుచున్న గొప్ప తనములో జాలభాగము వ్యాసునికే చెందవలసి యుండును. కాని, విరాటపర్వమున తిక్కన చేసినన్ని మార్పులు, చేర్పులు, ఇతర పర్వములందు గానరావు. తిక్కన మూలమును అనుసరించిన పట్టు లందు గూడ, యథాక్ష రానువాదముగాక యథాచితాను వాదమే సల్పెను. అది భాషాంత రీకరణము గాక భావాంతరీకరణమే యని చెప్పనొప్పును. మూలమున, జనమేజయః

**కథం విరాటనగరే మమ పూర్వ పితామహాః**
**అజ్ఞాతవాసముపితా దుర్యోధన భయార్దితాః**
**పతివ్రతా మహాభాగా సతతం ధర్మచారిణీ**
**ద్రౌపదీ సా కథం బ్రహ్మన్నజ్ఞాతా దుఃఖమావసత్**

అను సంస్కృత శ్లోకములను

**మహితసముజ్జ్వలాకృతులు మానధనుల్ జనమాన్యులంగనా**
**సహితముగాగ నేమి గతి సమ్యగుపాయ నిరూఢ వృత్తిమై**
**నహితుల కప్రభేధ్యముగ నా పదమూడగు నేడు మత్పితా**
**మహులు చరించి రంతయు క్రమంబున నాకెఱుగంగ జెప్పుమా**

అని తెనిగించెను. మూలమును అనుసరించిన పట్టుల నెట్లే తిక్కన తెనిగించెను. మూలము నత్రికమించిన పట్టులు చేర్పులు అనేకములు.

సంస్కృత భారతము సంభాషణ రూపమున నడిచినది. అందుచే మూలమున జనమేజయః వైశంపాయనః ధౌమ్యః యుధిష్ఠిరః అర్జునః అని ఒక్కొక్క మాటతో చెప్పినది తిక్కన పలు మారులు ఒక్కొక్క పద్యమున విస్తరించెను.

పైన జనమేజయుని ప్రశ్నకు సమాధానముగా "వైశంపాయనః" అని అతడు చెప్పిన శ్లోకములు గలవు. వైశంపాయనః అను ఆ ఒక్క మాటను తిక్కన కందపద్యములో విస్తరించి కథా కథన ధోరణిలో చెప్పెను.

**"అని యడిగిన వైశంపా**
**యనుఁ డమ్మనుజేంద్ర చంద్రు నధి కౌత్సుక్యం**
**బున కలిమికిదన హృదయం**
**బున గాఢాదరము భరితముగ నిట్లనియెన్."**

అరణ్యవాస ఖిన్నుడైన ధర్మరాజును ధౌమ్యుడూరార్చును. కలఁక దేసిన ధర్మరాజునకు భీముడు ఉత్సాహము కల్పించును. మూల మున

**భీమః:-అవేక్షయ మహారాజ తవ గాండివ ధన్వనా**
**ధర్మానుగతయా బుద్ధ్యా నకించిత్ సాహసం కృతం**

అను దానిని

**భవదాజ్ఞాదృఢబంధ సంయమిత శుంభద్వేగమై కాక నా**
**డవలీలన్ మన యర్జునద్విపము గ్రోధావేశ దుర్దాంత ద**
**ర్పవిలాసోద్భటభంగి నే పడరి కౌరవ్యాంబుజ శ్రేణి జి**
**క్కు వడం జేయడె యొక్క వ్రేల్మిడిన నీకున్ వేడ్క సంధిల్లగన్.**

అని తెనిగించెను.

హరిహరనాథుడు స్వప్నమున తిక్కనతో పారాశర్యుని కృతియగు పంచమవేదమును

**"తెనుగుభాష వినిర్మింప దివురుటరయా**
**భవ్య పురుషార్థ తరుపక్వఫలముగాదె"** అనును.

తిక్కన లక్ష్యము సంస్కృత భారతమును తెలుగున వినిర్మించుటయే గాని మక్కికి మక్కి అనువదించుట గాదనుట సుస్పష్టము.

"ప్రత్యువాచ యుధిష్ఠిరః" అను మూలమును తిక్కన

**అనినం దమ్మని నెమ్మన**
**మున బుట్టిన వగపు భావమున నెఱిగియు గీ**
**టున బుచ్చుచు బ్రస్తుత కా**
**ర్యనిరూపణదశయ మెఱయ నత డిట్లనియెన్.**

అని తెనిగించెను.

అట్లే మూలమున "భీమసేనమువాచహ యుధిష్ఠిరః" అను దానికి "యనిల తనయు నిరీక్షించి తత్కాల జనితం బయిన ఖేదంబునం దొరగ సమకట్టు బాష్పజలంబులు మగుడ నింకించుచు నిట్టూర్పు లడంచి ధైర్యం బవలంబించి యిట్లనియో" అని తెనిగించెను. మూలములో చాలచోట్ల పునరుక్తులు గలవు. భావములు, ఘట్టములే గాక శ్లోకములు శ్లోకములే యట్టివి గోచరించును. అట్టి వానిని తిక్కన పరిహరించును. మూలములో నున్న దీర్ఘవర్ణ

నలను, ఉపమాన పరంపరలను తిక్కన సంక్షేపించును. మూలములోని పునరుక్తులు సంస్కృత సాహిత్యమున కనుగుణమగు నుడి కారపు సొంపుతో భాసించు పదగుంఫనములు, ఐతిహాసిక శోభ నినుమడింపజేయును. "ధర్మరాజో యుధిష్ఠిరః సాలస్కంధో మహాభుజః భీమః శస్త్రభృతాం వరః భీమకర్మా వృకోదరః; మొదలగున విట్టివే. విశేషణము లేకుండ మూలములో ముఖ్యపాత్రను వివరణముండదు. అది సంస్కృతమున సహజ మనిపించినను తెలుగున కృతక మనిపించును. అట్టి వానిని తిక్కన తెనిగింప లేదు. అంతేగాక మూలములోని ఉపమాన పరంపరలను, దీర్ఘ వర్ణ నలను తిక్కన సంక్షేపించెను.

ధర్మరాజు, అజ్ఞాతవాసమును అర్జునుడు ఎట్లుగడుప గలడా? యని చింతించు ఘట్టమును తిక్కన ఒక పద్యములో సంక్షేపించెను.

**ఖాండవ మేర్చె దేవతలుం గానని యీశ్వరుం గాంచె దోర్బలో**
**ద్దండమహాసుర ప్రతతిదర్ప మడంచి ప్రియం బొనర్చి యా**
**ఖండలుం దున్న గద్దియ సగంబున నుండె మహానుభావు డీ**
**తం డొకమర్త్యు జేరి యనుదాత్తత నెమ్మెయిం గొల్చువాడొకో.**

కాని మూలమున అర్జునుని ప్రశంస విశేషముగా గలదు. మూలమున ధర్మరాజు అర్జునుండు సల్పిన వీరకృత్యములు నభి వరనించి అతడు సింధువులలో సముద్రము, శైలములయందు హిమవంతుడు, దేవతలయందు దేవేంద్రుడు, దానవులలో బలి, గజములలో సుప్రతీకము, యక్షులలో కుబేరుడు, మృగములలో కేసరి, రాక్షసులలో దశగ్రీవుడు, దైత్యులలో శంబరుడు, రుద్రులలో కాపాలి...ఇట్లు స్తుతించును.

**సముద్ర ఇవ సింధూనాం శైలానాం హిమవానివ**

**మహేంద్ర ఇవ దేవానాం దానవానాం బలిర్యథా**

**సుప్రతీకో గజానాం చ యుగ్యానాంతురగో యథా**

**కుబేర ఇవ యక్షాణాం మృగాణాం కేసరీ యథా**

**రాక్షసానాం దశగ్రీవో దైత్యానామివ శంబరః**

**రుద్రానామివ కాపాలీ విష్ణురర్వలవతామివ**

**రోషామర్ష నమహాయుక్తో భుజంగానాంచ తక్షకః**

**వాయువేగ బలోద్భూ తోగరుడః పతతామివ**

**తపతా మివ చాదిత్యః ప్రజానాం బ్రాహ్మణో యథా**

**హ్రదానామివ పాతాలం పర్జన్యోదధతామివ**

**ఆయుధానాంతరో వ్రజః కకుద్మాంశ్చ గవాంవరః**

**ధృతరాష్ట్రస్చ నాగానాం హస్తి షైవారావతోవరః**

**పుత్రః ప్రియాణామధికో భార్యాచ సుహృదాం వరా**

**గిరీణాం ప్రవరో మేరుర్దేవానాం మధుసూదనః**

**గ్రహాణాం ప్రవరశ్చంద్రస్సరసాం మానసంవరం**

**యద్రైతాని విశిష్టాని స్వజాత్యాం వృకోదర**

**ఏవం యువా గుడాకేశ శ్రేష్ఠ స్సర్వధనుష్మతాం**

**ధార్తరాష్ట్రవినాశాయ పాండవానాం జయాయచ**

**యంమస్యే ద్వాదశం రుద్రం అదిత్యానాం త్రయోదశం**

ఇట్లే పలుతావుల మూలములోగల ఉపమాన పరంపరలను, తిక్క న తెనిగింపలేదు. కొన్ని మనోహరమైన ఉపమానములనుగూడ నిర్లిప్తముగా వదలిపెట్టెను. ఉత్తర రామాయణము నందలి మనో హరమైన ఉపమానములను గూడ తిక్కన విడిచి పుచ్చి యుండెను. తిక్కన కొన్ని యుపమానములను క్రొత్తగా తెలుగు భారతమున జేర్చియుండెను గాని విడిచిపుచ్చినవే బహుళము.

మహేతిహాసమునకు వైలక్షణ్య సూచకము ఉపమాలంకార ప్రయోగ బాహుళ్యము. సంస్కృతభారతములో ఉపమలు తామర తంపరలు. ఒక్కొకచో నొకే యుపమేయమునకు అనేకోపమాన ములు వాడుట కద్దు. విరాటుడు ధర్మరాజును జూచి, రూపుగన్న క్షాత్రమని చెప్పినను తనివితీరక, ఏనుగు, పెద్దపులి, ఆబోతుతో నొకేచోట పోల్చెను,

**"క్షాత్రంచ రూపంహి బిభర్త్య యం భృశం**
**గజేంద్ర శార్దూల సమర్ధభోపమః"**

ధర్మరాజు స్వర్గమున, బృహస్పతి ఇంద్రుని జేరినట్లు విరాటుని జేరెను.

**"బృహస్పతిశ్చైక మివ త్రివిష్టపే"**

ధర్మరాజు రూపము విరాటునకు వ్యాఘ్రముపలె సింహము వలె ఆబోతువలె గోచరించెను.

**"తుల్యం హి రూపం ప్రతి దృశ్యతేస్య**
**వ్యాఘ్రుస్య సింహస్య తథర్ష భస్య"**

అట్లే అర్జునునిగూర్చి "శిఖీవ యజ్ఞేషు ఘృతేన సిక్తః" మున్నగు వానిని తిక్కన విడిచిపుచ్చెను.

సుదేష్ణ తన దగ్గర ద్రౌపదిని "భూరితరాదరరేఖ నిందు రమ్మనవుడు నంతనంత ద్రుపదాత్మజ సేరి వినితి నిల్చినన్" అని తిక్కన వ్రాసెను. మూలమున గూర్చిన విపులవర్ణన, ఉపమాన పరంపరలతో గలదు.[1]

## ద్రౌపది

సంస్కృత భారతమున విరాటుని కొలువుకూటమున నిగూఢ తేజస్సుతో పాండవులు నిప్పుగప్పిన నిప్పులవలె నుండిరి మనోహరమైన యీ యుపమానమును తిక్కన వదలివేసెను.

**ఏవం విరాటే న్యవసంత పాండవాః**
**కృష్ణా తథాంతః పురమేత్య శోభనా**

---

తాం మృగమివ విత్రస్తాం యూథభ్రష్టామివ ద్వీపాం
లక్ష్మీమివ విశాలాక్షిం విద్యామివ యశస్వినీం
రోహిణీ మివ తారాణాం దీప్తా మగ్ని శిఖామివ
పార్వతీ మివ రుద్రాణీం వేలామివ మహా దధేః
సులభా మివ నాగినాం మృగీణా మివ కిన్నరీం
గంగా మివ విసుద్ధాంగీం శారద మివ శర్వరీం
తామ్ చింత్య తమాంలోకే ఇలామివ యశస్వినీం
సావిత్రీ మివ దుర్ధా ర్ధం బ్రాహ్మహ్మ్య చా లక్ష్మయా నమన్వితామ్

**అజ్ఞాతచర్యాం ప్రతిరుద్ధ మానసా**
**యథాగ్నయో భస్మనిగూఢ తేజసః**

నకులుడు తాను "అశ్వశిక్షకుడై" విరాటుని గొలిచెదనని చెప్పును

**గోడిగ జాతిలో గొదమ పెంటుల నేర్చి**
**మావుల హత్తించు మార్దవంబు**
**ద్రాక్షం బట్టింపంగ దర్రి యైన**
**కొదమల సంచంబు లెరిగి శిక్షించునేర్పు**
**గళ్యాల బదిలంబు గాని గుర్రంబుల**
**గోత్ర ముట్టున కియ్యకొలువువెరవు**
**బెసగు శూకలముల బిరుదుతనంబుల**
**జలము డింపక తీర్ప జాలుటయును**

**నలవరించినవాడ లాయముననున్న**
**యపుడు దొడకించుకయు యట్లుగాగ**
**మాటిమాటికి బరికించి మందడీల**
**కెల్ల నూఅట యగుచు వర్తిల్లనేర్తు.**

తెలుగు నకులునకు గల ఆశ్వికపరిజ్ఞానము సంస్కృత నకులున కున్నట్లు దోపదు.

మూలమున విస్తరించియున్న ధౌమ్యనీతిని తిక్కన సంక్షేపించెను. ధౌమ్య ప్రబోధము ఔత్తరాహప్రతులలోకంటె దాక్షిణాత్య ప్రతులలో నే విస్తరించి యున్నది. తిక్కన నాడును దాక్షిణాత్య ప్రతులలో ధౌమ్య ప్రబోధము సవిస్తరముగా నున్నదనియే యూహింప వచ్చును. తిక్కన, తెలుగు భారతమున ధౌమ్యనీతిని బుద్ధిపూర్వకముగనే సంక్షేపించెను. ఏలన, "రాజులం గొలిచి యెమ్మెయినయినను బ్రదుకు జనంబులు గీడునం బొరయ కుండునట్టి సాధారణ నీతి సంక్షేపరూపంబున నెఱింగించెద, సావధానులరయి వినుండు" అని వ్రాసెను. నీతి ప్రబోధములు,

---

1. కుశలో స్వ్య శ్మయశ్వ శిక్షాయాం తథైవ శ్వా చికిత్సితే
ప్రియశ్చ నతతం మే శ్వాః కురురాజ యథా తవ
నమామ్ పరిహరిష్యంతి కిశోరా బడబాస్తథా
నదుష్టాశ్చ భవిష్యంతి పృష్ఠే ధురిచ మధ్యతః॥ నకులః

గీతలు, విపులవర్ణనలు సంక్షేపించుట తిక్కన ఆంధ్రీకరణములోని యొక వైలక్షణ్యము.

**వసుమతీశు పాల వర్తించు నేనుంగు**
**తోడనైన దోమతోడనైన**
**వైర మగు తెరం గు వలవదు తారెంత**
**పూజ్యులైన జనుల పొందు లెస్స.**

అను పద్యమునకు మాతృక సంస్కృత భారతములో లేదు. మిగిలిన ధౌమ్య ప్రబోధము నంతటిని సంక్షేప రూపమున తిక్కన తెనిగించెను.

కాని ధౌమ్య ప్రబోధము నందు అల్పాక్షరముల అనల్పార్థ రచనలని చెప్పదగిన సూక్తులను, "దుఃఖేన సుఖ మన్విచ్ఛేద్" "సమః పూర్ణతులేవ స్యాత్" అను వానిని ఎందుచేతనో తిక్కన తెనిగింపక విడిచి పుచ్చెను.

ధౌమ్య ప్రబోధానంతరము పాంచాలీ పాండవులు విరాట నగరోన్ముఖులై నడువసాగిరి. ద్రౌపది దస్సినది. ఆమెను మోసి తెమ్మని ధర్మరాజు నకులు నడుగును. సంస్కృతభారతమున నకులుడు తానును డస్సితినని బదులు చెప్పి నిరాకరించును.[1] తెలుగు ధర్మ రాజు ఇంగితజ్ఞుడు. తెలుగు భారతమున -

**అకట మనము వచ్చినది గడు దవ్వనే**
**డప్పురంబు సొత్తమని తలంచి**
**తఱిమి వడిచితిమి లతాతన్వి యిది వడ**
**గొనియె మోచి తెమ్ము కొంత దవ్వ**
**అనిన విని పూని గ్రక్కున**
**జనుదేరమి నతడు దస్సె జాలం దని నె**
**మ్మనమున నెఱింగి యాతని**
**యను జన్మనిం బనిచె** " అని గలదు.

---

1. సోఽహం ధర్మాభితప్తో వై
నైనా సామాదాతు ముత్సహే

మాటాడకుండగనే మనుష్యుల మనస్సుల గనిపెట్టగలిగిన తెలివితేటలు తెనుగు ధర్మరాజుగారికి తిక్కన వలన లభించిన వర ప్రసాదములే.పాండవులు శమీవృక్షమును జేరిరి. మూలములో శమీ వృక్షము భీమశాఖ. దురారోహ. కాని, తెనుగులో శమీతరుచక్రవర్తి వర్ణ న మొక సీసపద్యము నిండినది.

**నెగసినకోన లేచి నింగి యంతంతకు**
**నవులం డ్రోవవ దనరారు దాని**
**జాగిన శాఖలాశాచక్రమునకొలం**
**దులు బారవెట్టంగ బోలుచు దాని**
**గవట లొండొంటితో గదియుచు నెడములు**
**మింగి ప్రబ్బగ సొంపుమిగులుదాని**
**లోని జొంపము పవలును బెనుజీకటి**
**నెదవించి పొదలంగ నెప్పదాని**

**గనియె బవమాన వివిధ నర్తనకళాను**
**వర్తి గాకఘూ కారవస్ఫూర్తిజాత**
**భీతిపరిసరవర్తి నాభీలభుజగ**
**చండమూర్తి శమీతరుచక్రవర్తి.**

ఆయుధములను శమీవృక్షమున బెట్టునపుడు, మూలమున ధర్మరాజు తన తమ్ముల పరాక్రమకృత్యములు వేర్వేఱ బొగడును. తిక్కన అందరను గలిపి యొక సీసపద్యమున సంక్షేపించెను.

**సైంధవ యక్ష పాంచాల త్రిగర్తుల**
**దీవన యొర్చితి మానధనుడ**
**సౌరాష్ట్రనాధాదిశత్రులు దీనిచే**
**గాదె మర్దితు లైరి ఘనభుజుండ**
**కాళింగపాండ్యమాగధుల నిర్జించుచో**
**నిదియ కైదువు నీకు విదితయశుడ**
**యని క్రమంబున వార లందఱ విండ్లులు**
**పెంపెసలార వేర్వేఱ పొగడి**

**గొనయములు వదల్ప ననుమతి సేయుడు**
**వారు నట్లు చేసి తేర జాప**
**ములును దోనలు వర్మములు నసిముధ్గారా**
**ద్యాయుధములు గూడ నతడు గట్టె**

ఆయుధములను శమీవృక్షముపై బెట్టిన పిమ్మటు ధర్మరాజు---

**నరునకు నాకుం దక్కగ**
**నోరులకు మీ రూపు సూపకున్నది, విష వి**
**స్ఫురిత భుజగ భంగి భయం**
**కర మూర్తులు దాల్పియుండగా వలయు జుడీ**

అధోరేఖాంకితమైన భాగము తిక్కన అధికముగా జేర్చినదే. ఉత్తరునకు, భుజగభంగి, ప్రకరణాంతరమున గన్పించుటకు ఉపపత్తి గల్పించుట కిట్లు తిక్కన చేర్చెను.

ధర్మరాజు, సన్యాసివేషమున జేర వచ్చినపుడు "దైవ యోగంబున విరాటుండు వచ్చి బయలి కొలు విచ్చుటం జేసి తదాస్థానంబు సేరం బోవ నప్పుడు" అని వ్రాసెను. ఈ "బయలి కొలు విచ్చుట" తిక్కన క్రొత్తగ జేర్చినదే. "దవ్వుల జూచి" యతీంద్రుని సార్వభౌమ పదవికి దగినవాడని గుర్తించుట కనువుగ మార్పు చేసెను.

బృహన్నలకు నప్పగించుటకై విరాటుడు ఉత్తరను రావించెను.

ఇట్లు రావించిన---

**అల్లదనంబున యనువు మైకొన జాచు**
**నడపు కాంతికి వింతతోడవు గాగ**
**వెడవెడ నూఁ గారి వింతయై యేర్పడు**
**దేరనివళులలో నారు నిగుడ**
**నిట్టలు ద్రోచుచు నెలవుల కలమేర**
**లెల్లను బిగి యొక్క యేర్పడంగ**
**దెలుపును గప్పును వెలయంగ మొరుగె కుక్క**
**తారకంబుల గర్కితనముదొడర**

**జరణములును నడుమ జన్నులు**
**జవ్వనంబు చెన్ను నివ్వటిల్లు**
**చునికి దెలుపుచుండ నుత్తర సనుదెంచె**
**నలరు విలుతు పువ్వుటమ్ము వోలె.**

**వచ్చి కొలుపు సొచ్చి నెచ్చెలిపిండు నం**
**తంత నిలువఁ బనిచి యుల్లనల్ల**
**గదిసి ప్రౌఢవనిత కై వడి ముద్దియ**
**ముద్దు పుట్ట దనకు మ్రొక్కుటయును**

**తిగిచి కవుం గిలించి జగతీవిభు డక్క మలాయుతాఁకి నె**
**మ్మొగము మొగంబునం గదియ మోపుఁ గరాంగుళలం గపోల మిం**
**పుగ బుడుకం బొరిం బొరిన పూర్వవిలోకన మాచరించుఁగ**
**ప్పగు మృదుమౌళి నుజ్జ్వల నఖాంకురచేష్ట మొనర్చు నర్మిలిన్.**

ఈ వర్ణన మంతయు తిక్కన క్రొత్తగ జేర్చినదే.

నకులుడు విరాటునితో దనకుగల ఆశ్విక పరిజ్ఞానము తెలుపును.

దామగ్రంధి యనువాడ నాకు నశ్వవిషయం బయిన విచక్షణత్వం బెల్లనుంగల దవధరింపుమని యిట్లనియె.

**అవయవ లక్షణంబాయుః ప్రమాణంబు**
**గర్భంబు లింగితాకారములును**
**మాత్రాంతరము వయోమానంబు దేశకా**
**లోచితాహారప్రయోగభంగి**
**జాత్యనురూపశిక్షావిధి క్రమగతి**
**వ్యాయామసాత్మ్య ప్రవర్తసంబు**
**ప్రమదవిపాదాదిబహువిధచిత్త ధ**
**ర్మము పోషణప్రకారము చికిత్స**
**పరిచితము ధరిణిపాల నీముందట**
**రూపురేఖ మెఱయుఁ జూపనేర్తు**
**బవరమైన నాకుఁ బని యేమి యనఁ జేతి**
**బలిమి కలిమి నెఱపఁ దలపు గలదు.**

మూలములోని నకులునకు ఇంతటి సవిస్తర జ్ఞానము లేదు. ద్రౌపది సుదేష్ణను జేరునప్పుడు తెలుగు భారతమున

**పఱమొయిల్ గప్పిన బాడఁరి నును గాంతి**
**గదలిన యమృతాంశుకళయు బోలెఁ**
**బెనుమంచు మీదఁ బర్విన వికాసము దప్పి**
**చెలువు గుందినసరోజిని విధమున**
**ధూమంబు వొదివిన దుఱగలి మొరుగులు**
**నలఁగి మాసిన దీపకళిక పగిది**
**ధూళిపైఁ బొరిసినఁ దొంగలించుట మాని**
**లావణ్య మెడలిన లతిక భంగి**
**గంధకారికా వేషంబు కతన మూర్తి**
**యుజ్జ్వలత్వంబు మఱువడి యుండఁ బాండు**
**తనయమహిషి యంచితగతిఁ జనగ రాజ**
**వీధిఁ బౌరజనంబు లవ్వేలఁదిఁ జూచి.**

పై వర్ణనము మూలములో లేదు.

మూలమున సుదేష్ణను గూర్చిన విస్తర వర్ణన గలదు. తిక్కన వర్ణన పరిహరించి ద్రౌపదినే వర్ణించెను.

**పదతలంబుల కెంపు పరగిన తలము కుం**
**కుమలిప్తమైన చందము వహింప**
**నంగంబు నునుగాంతి యుడరిన గోడలు**
**వేదులు మణిమయవిధము నొందఁ**
**గనుఁగవ మెఱుగులు గదిరిన ముందర**
**పుష్పోపహారంబు పొలుపు దాల్ప**
**వేనలికప్పు పర్విన మీదు నీలదు**
**కూలంబు మేల్కట్టు కొమరు వడయఁ**

---

1. మాతలిరివ దేవ పతే
ర్దశరథ నృపతే స్సుమంత్ర ఇవయంతా
సుమహా ఇవ జామదగ్నే
స్తద్వైవ తప శిక్షయామ్యస్వాన్
తిక్కన వర్ణ నలు తరువాతి కవులకు ఒజ్జబంతు లైనవి.

**దాను జొచ్చిన కతన మత్స్యక్షితీశు**
**నింటనిమ్మెయిఁ గ్రొత్త యొప్పెసకమైసఁగ**
**నమ్మహాదేవి యున్నెడఁ కల్లనల్ల,**
**బాండురాజతనూభవపత్ని యరిగె.**

తెలుగు భారతమున ద్వితీయాశ్వాసమునుండి కీచకవధ ఆరంభించుచున్నది. తిక్కన ఈ ఘట్టమును విస్తరించెను. ఘట్టము మూలమున సుమారు ౭౫౦ శ్లోకముల కథ. ఇందెన్నిటినో తిక్కన సంక్షేపించెను. పరిహరించెను. మిగిలిన వానికి ఈ స్వేచ్ఛాను వాదము సల్పెను. తెలుగు భారతమున కీచకవధ చతుశ్శతాధిక పద్యములైనవి. ఈ సంఖ్యలో సీసములు వృత్తములు గద్యములు చేరియున్నవి.

'పాండవులు పాంచాలీ సహితంబుగా విరాటు నగరంబున వర్తించుచు గతిపయదినంబులు గోరంతగా నేఁడు కాలంబు' గడిపిరి.[1] ఇట్టిచో నొక్కనాడు సింహబలుడు "తన యప్ప సుదేష్టకుఁ బ్రొక్కం జనువాఁ డద్దేవి కనతిదూరమున నున్న ద్రుపదరాజ నందనం గనుంగొనెను." కీచకుని కనువేదురు మరణాంత మైన మహాగాధగ బరిణమించినది.

కీచకుని విరహమే తరువాతి తెలుగు ప్రబంధములలోని దుర్భర విరహవేదనలకు ఒజ్జబంతి.

**"ఈ నెలతఁ గన్నమన్మధు**
**డైనఁ జిగురు గొడుగుఁ బువ్వుటమ్ముల పొదులున్**
**లోనుగ సెజ్జలు సేయం**
**దా నియమింపండె విరహతాపము పెర్మిన్.**
**తన్వంగి మువ్వంపుఁ దనులత నెసఁగెడు**
**నునుగాంతి వెల్లువ మునుగఁ బాఁర**
**గిసలయహస్త కెంగేల నెపారుక్రో**
**మ్మిం చనులే యొంద మిగులఁ బర్వ**
**గమలాస్య ముద్దు మొగంబు లే మెరుగుల**
**మొత్తంబుపరి చుట్టు ముట్టికొనఁగ**

1. మూలములో పది నెలలు.

**ధవళాక్షి తొంగలి తఱచు రెప్పల చెన్ను**
**కప్పను చీఁకటి గవియుదేర**
**బెగ్గలం బంత కంతకు నగ్గలింప,**
**నొదవు చెమటతోఁ జిత్తంబు సెదరి యెందు**
**మెలగఁ దలఁ పేది యా సింహబలుఁ డనంగు**
**పట్టి యాడెడు జంత్రంబు పగిది నుండె."**

పై పద్యములు కీచక విరహమునకు మచ్చు తునకలు.

విరహార్తుడైన కీచకుడు 'నిజ సహోదరివలన నక్కోమలి కలరూపు దెలియం దలంచి....చని యద్దేవికిం బ్రణమిల్లును.

**కాంచనపీఠము వెట్టఁగ**
**బంచి ప్రియము చూడ్కి మునుఁగువడఁ దను సంభా**
**వించు నెడ నాతఁ డప్పుకు**
**బాంచాలిం జూపి వేగపడి యిట్లనియెన్.**

సింహబలుని అక్కగారు తమ్ముని రాకకు సంతోపించుట సహజము. అతఁడు, 'రాజను నెపంబున విరాటునకుం దగఁ గూడు వెట్టెదన్' అను నంతటి మదోన్మత్తుడు. అతని బలమే విరాట రాజ్యమునకు శ్రీరామరక్షయని అక్కగారికిం దెలియునిది గాదు. తమ్ముఁడు వచ్చి ప్రణమిల్లి నపుడు "ప్రియము చూడ్కి మునుగు వడ" సంభావించి కాంచన పీఠము వెట్టఁగ బంచె నను తిక్కన వర్ణన మిక్కిలి మనోజ్ఞము.

అతఁడు సూటిగా "ఇయ్యరవిందగంధి కుల మేమి? చరిత్రము చంద మెట్లు?" అను ప్రశ్నల వర్ష ము గురిపించెను. చివరకాతఁడామెకు తన వలపు నెఱింగించును. ఇచ్చట మూలమున సుధేష్ణ పాత్రమునకును తెలుగున సుదేష్ణ పాత్ర చిత్రణమునకును భేదమున్నది.

సంస్కృత భారతమున సుదేష్ణ కీచకుని వారింప జాచును. అక్కడ ఆమె గంధర్వుల సంగతి చెప్పి తమ్ముని నివారింప జాచును. సమాధానముగా కీచకుడు

**గంధర్వాణాం శతం వాపి సహస్రమయుతానివా**
**అహ మేకో హనిష్యామి గంధర్వాన్ పంచ కిం పునః**

తెనుగులోగూడ నిది యిట్లే యున్నది.

**వనితా యే నొక పల్కు వల్కెదన్ చతుర్వారాశిమధ్యంబునన్**
**ఘనబాహుబల మొప్ప నన్ను నెదురంగా నొక్కడున్ లేమి యె**
**వ్వనికిం దెల్లము గాదె దాని మగలన్ వజ్రా హతిం గూలుఁ శై**
**ల నికాయం బన మధ్యుజా సమవ శీలన్ గీట డంగించెదన్.**

అక్కగారైన సుధేష్ణకు, తమ్ముఁడైన సింహబలునకు సంస్కృతమున, తెలుగున, కొంత వాగ్వాదము నడచినది.

సంస్కృతమున సుధేష్ణ తమ్ముని నివారింప దలపోసి, "విరాటుడు గూడ ఆమెను కామించి యుండెననియు, తాను నివారింపగా గంధర్వ భయముచే నిగ్రహించుకొనె ననియు చెప్పను.[1]

తిక్కన ఈ విషయమును బరిహరించెను. దీనికి సంస్కృత కీచకుడు చెప్పిన పచ్చి బూతుల సమాధానము గూడ నట్లే తిక్కన పరిహరించెను.

**"పుత్రం వా కిల పౌత్రం వా భ్రాతరం వా మనస్వినమ్**
**రహసిహ నరం దృష్ట్వా నానాగంధ విభూషితమ్**
**యోని రుత్స్విద్యతే స్త్రీణాం అసతీనామితి శ్రుతమ్"**

అని అసతీపరముగఁ జెప్పినను, ఇది అనౌచిత్యమేగాక స్త్రీజాతి యెడ క్షమింపరాని అపచారము. సంస్కృత భారతమునందు స్త్రీజాతిపై మరియొకచో గూడ నిట్టి చిన్న చూపే గనుపించుచున్నది.[2]

---

1. రాజాచైవ సమీక్షయ్యాయి నాం సమ్మోహం గతవానిహ
మయాచ సత్యవచనై రసునితో మహిపతిః
సోప్యే నామనిశం దృష్ట్వా మనసైదాభ్యవందత
భయాత్ గంధర్వ ముఖ్యాహం జీవితస్యాపఘాతినామే

2. కీచకునిచే పరాభవము చెంది విరాటుని సభ యెదుట నిలిచిన ద్రౌపది నుపాలంబించుచు ధర్మరాజు స్త్రీ జాతి, స్వాతంత్ర్యమునకు అనర్హమైన దని శాసించును.
"పితా రక్షతి కౌమారే భర్తా రక్షతి యౌవనే
పుత్రస్తు స్థవిరే భావే న స్త్రీ స్వాతంత్ర్య మర్హతి."
భారతీయ సాహిత్యమునకు సంస్కృతికి కళంకము సాపాదించు భావమని ఆధునాతన విమర్శకు అధిక్షేపించు ఈ శ్లోకమును తిక్కన తెనిగింపలేదు.

తిక్కన పై శ్లోకమును తెనిగింప లేదు.

తెలుగు భారతములో సుదేష్ణ తమ్ముని వారించుటకు వేరు విధముగ బ్రయత్నించినది.

సుధేష్ణ,

**"రాగరసమగ్నుడయ్యె సైరంధ్రి జూచి**
**యకట దీన నింకేమి యపాయమగునొ**
**వలదు తగ దన్న నుడిగెడు వాడె వీడు**
**మాయదైవమ యే నేమి సేయుదాన."**

అయిన నానేర్చుకొలందీ దగిన తెఱంగున వారించి చూచెదం గాక యని యూహించి యిట్లనియె.

**లలితంబులగు మట్టియల చప్పు డింపార**
**నంచ కైవడి నడ నల్ల వచ్చి**
**యెడమేని నెత్తావి సుడియంగ బయ్యెద**
**సగము దూలించి పై మగుడ దిగిచి**
**సోలెడు నెలదీగ లీల గ్రాలుచు వింత**
**చెలువంబు దలకొన జేరి నిలిచి**
**తెలి గన్నుఁగవకు నెచ్చెలి యైన లేఁతన**
**వ్వొలయంగ సరసంపు బలుకు పలికి**

**మెఱయు చెయ్వుల రాగంబు మెఱుఁగొనంగ**
**నెడఁద సొగయించుమాటల నెలమి మిగుల**
**నిన్ను ననురక్తఁ గొలుచు నన్నెలత లుండ**
**నీరసాకార సైరంధ్రి గోరదగునే.**

అని మఱియు

**ఆయురైశ్వర్యకీర్తుల నపహరించు**
**పరసతీసంగమము ధర్మపథమునందుఁ**
**బరఁగు వారలు పరిహరింపంగఁ గనియు**
**వినియుఁ దెలియవే యుది దుర్వివేక మగుట.**

**పతి యెరింగిన దన ప్రాణంబుపై వచ్చు**

**నను భయంబున నుల్ల మదరుచుండఁ**
**జనులు గాంచిన మానుషము దూలుఁదనకను**
**పుయిలోటమున మోముఁ బుల్లగిలఁగ**
**బోటికిఁదోఁచిన బోలియుఁ దేకువ యను**
**వెగడున జెయ్యువలు వీడుపడఁగ**
**బంధుల కగపడ్డ బాయు నన్వయ మను**
**కలకమైఁ జెమటలు గ్రమ్ముఁదేర**

**గ్రీడదెసఁ గౌతుకం బురి యాడ రతుల**
**చవులు గొనియాడ నేరని జార పొందు**
**హృదయమున కింపు సేయమి నెఱుక గలుగు**
**వారు దీని సుఖంబుగాఁ గోరరెందు.**

అని చెప్పెను.

కులపాలికయైన అక్కగారు ఎంతటి తమ్మునితో నైనను నిట్టి మాటలు మాటాడుట అధునాతన విమర్శకుల అభిరుచికి అనుకూలింపదు.

అక్కగారి మాటలకు కీచకుడు సమాధానము చెప్పెను.

**గండు మీలకుఁ బుట్టి కాము బాణములతోఁ**
**గలిసి యాడెడునట్టికన్నుఁగవయు**
**బిస కాండముల శిక్ష బెరిగి లే దీగల**
**మెచ్చక యున్నట్టి మృదు కరములుఁ**
**జిగురులతోఁ సంధి సేసి యంబుజముల**
**పైనెత్తి చనునట్టి పద తలములుఁ**
**గలకంఠములచేతఁ గఱచిన విద్య వీ**
**అల కిచ్చు నట్టి తిన్నని యేలుంగు**

**న తెఱంగున రేఖయు న వ్విధంబు**
**గఱువ చందంబు నమ్మెయి కలికి తనము**
**నట్టి చెన్నును సైరంధ్రియంద కాక**
**కలవె యొరులకు నెఱుఁగక పలికి తబల.**

ఇది కీచకుని స్వగతమా ?
అక్కగారితోఁడనా యిట్టి మాటలు !
కీచకుడు కామాతురుడని సరిపెట్టుకొందుము గాక.
మూలమున సుదేష్ణ 'తుష్ణో భవ కులక్షయాత్' అని చెప్పి చివరకు తమ్మునికి లొంగిపోయినది. తెలుగు సుధేష్ణ, ఇంగితజ్ఞురాలు. ఎంత చెప్పిన లాభములేదని గ్రహించి,

**"ఇంత తలర నేల యెమ్మెయి నైనను**
**గొమ్మ నలవరించి కూర్చుటరుదె"**

అని అతని నూరార్చి పంపించినది.

కీచకుఁడింటికిఁ బోయి విరహతాపముతోఁ బరితపించును. తెలుగు కీచకునకు విరహతాప మెక్కువ.

**లీల నాముందట నా లేమ వోలసినఁ**
**జూఁడ్కికి జుబ్బన చూఁర గాదె**
**కను విచ్చి నన్ను నా తనుమధ్య సూచినఁ**
**దనువున కమ్మృత సేచనము గాదె**
**చిఱునవ్వు బెరయ నచ్చెలువ నాతోడఁ బ**
**ల్కిన జెవులకు రసాయనముగాదె**
**యెలమి సమ్మోలత నన్నెలయింపఁ దివిరిన**
**నెడద కానందంబు నిక్కగాదె**
**యా వితంబిని మక్కువ ననఁగి పెనఁగి,**
**యింపు పొంపిరివోవ న న్నేలికొనఁగఁ**
**దలఁచి పొందిన నది జన్మ ఫలముగాదె,**
**యనుచు వలరాజు బారికి నగ్గమయ్యె.**

"అక్కడ పాంచాలి రావించి సుధేష్ణ తృష్ణ భావించుచు
కీచకుని యింట నెప్పుడు
వాచవియగు బహువిధములఁ వారుణి గలుగున్.
వే చని యచటికి గొనిర
మ్మా చూతము గాని నీ గమన వేగంబున్."

అనవుడు ద్రౌపది డోలాందోళితమానసయై ఆ పనికి నింకొకతె నియోగింపుమని చెప్పను.

మూలమున సుధేష్ణ నతడు తన తమ్ముడనియు శంకించ నవసరము లేదనియు సైరంధ్రితో జెప్పను.

**అనిన విని యనుచితంబున**
**కనయము శంకించియును లతాంగి మదిం ద**
**మ్ముని వలవంత దలఁచి యి**
**ట్లనియెం బాంచాలితోడ సాదర వృత్తిన్.**

**అక్కట యేను వేఁడ్కపడి యానెడునాసవ మర్థిఁ దేరఁగా**
**నొక్క నికృష్టుఁ బంచుటకు నోపక చెప్పిన దీని నీవు గో**
**సెక్కగఁ జేసి నిన్ను నతిహీనవిధాన నియుక్తఁ జేతఁగా**
**నిక్కమ యుమ్మలించి తిది నెయ్యము తియ్యము గల్మి యే సఖీ.**

**అది లాఁతి యిల్లె నిను దమ**
**హృదయంబుల నెవ్వరేని నెఱుఁగరె యేఁ జె**
**ప్పుదు నీదు పెంపు నిను గ**
**న్నది మొదలుగ నెల్లవారి కయ్యై భంగిన్.**

**అని మఱియుఁ బెక్కు భంగులఁ**
**దనుఁ బ్రార్థింపంగ ద్రుపదతనయకుఁ జిత్తం**
**బున నింకఁ బెద్ద పెనఁగఁ**
**జన దీయమతోడ ననువిచారము పుట్టెన్.**

సుధేష్ణ మాట నేర్పు గలది. ద్రౌపది నిరాకృతికి ఆమె కంట గించుకొనక, ఆమెను 'ఇది నెయ్యము తియ్యము కల్మియే' సఖీ' అని లాలించును. ఇక్కడ సఖీ సంబోధనములోని తియ్యదనము, సహృదయులకు సుగమము. సముచిత సంభాషణాచారిమ తిక్కన మహాకవిలోని విశిష్టత. తెలుగుసుదేష్ణ సంస్కృత భారతములోని సుదేష్ణకంటె గడుసరి.

ద్రౌపది చేయునది లేక కీచకు నింటికి బయలుదేరుచు "మహాపదలకుం బరిహరణంబు హరిస్మరణంబ యని తన హృదయ పుండరీకంబునం బుండరీకాక్షు నిక్షేపించుకొని సుధేష్ణ మందిరంబు వెలువడి దినకరుం గనుంగొని", ప్రార్థన సల్పును. సంస్కృతమున ద్రౌపది, అనేక దేవతలను ఇంద్ర, యమ, దివాకర, మారుతాశ్విని దేవతలను వరుణ కుబేరాదులను ప్రార్థించును.[1] తెలుగున ఈ బహుదేవతోపాసనకు బదులుగా సూర్యనారాయణో పాసన గలదు.

తిక్కన అనువదించిన పద్ధతిబట్టి అతఁడు అనుసరించి నది దాక్షిణాత్యప్రతి యనియు, నాప్రతి యించుమించుగ నేటి దాక్షిణాత్యప్రతివంటిదే యని ఊహింపవచ్చును.

ద్రౌపది కీచకుని యిల్లు బెబ్బులియున్న పొదరు లేడి చంద మున జొచ్చినది.[2] అతడు కాముక సంభాషణ కుపక్రమిం చును. ఆమె

"మదిర వోయింపఁ డద్దేవి యెదురుచూచు" ననిన

సింహబలుండు తమకంబున దన్నుఁ దా నెఱుంగక పయింబడి పట్టుకొనిన, ఆమె తప్పించుకొని పాఱిపోవును.

పాఱిపోవుచున్న ద్రౌపదిని పట్టుకొనుటకు రహస్యప్రకాశ విభేదము దక్క గర్వోన్మత్తుడైన కీచకుడు వెంబడించుటను తిక్కన సీసపద్యములో వర్ణించెను.

---

1. అకీర్తయత సుశ్రోణీ ధర్మం శక్రం దివాకరం
మారుతం చాశ్వినౌ దేవౌ కుబేరం వరుణం యమం
రుద్రమగ్నిం భవం విష్ణుం స్కంధం పూషణమేవచ
సావిత్రీసహితంచాపి బ్రహ్మాణం పర్యకీర్తయత్.
2. తాందృష్ట్వా భిమసేనస్య క్రోధాద్రసమ వర్తత
ధూమోచ్చ్వాసస్సమ భవన్నేతేచ్చిత పక్షిణీ
నస్వ్వేదా భ్రుకుటి చోగ్రాతే సముపవర్తత
తస్య భీమోపధ ప్రే పృః కీచకస్య దురాత్మనః
దంతోదంతాస్తదా రోషా న్నష్పి వేష మహామనాః

**సమద వారణము జంగమ లత వెనుకొని**
**సరభసంబునఁ బట్టఁ జను విధమునఁ**
**గ్రూర దానవుడు భూచారి నిర్జర కాంతఁ**
**బోదవ రయమ్మున బోవు భంగి**
**ఘోర గృధ్రము సుకుమార నాగాంగనఁ**
**బటుగతి నొడియంగఁ బాఱు కరణి**
**బ్రబల బిడాలంబు బాల శారికమీఁద**
**నడరి సత్వరముగ నరుగు మాడ్కి**

**సింహబలుడ డత్యుగ్రగతఁ జిగురుంబోడి**
**పజ్జఁ గడువడిఁ దగిలి కోపంబు గదుర**
**నోడిచి తలపట్టి తిగిచి మహోగ్రవృత్తిఁ**
**గొంకు కొసరించుకయు లేక కూలఁ ద్రోచె.**

పై వర్ణనకు మాతృక సంస్కృత భారతమున లేదు. మూలములో ఉపమాన పరంపరల ననేక పర్యాయములు తెనిగింపక విడిచిన తిక్కన యీపట్టున మూలములో లేని యుపమాన పరంపరలను వాడెను.

"దైవయోగంబున విరాటుం డప్పుడు కొలువునికిం జేసి" ఆమె "తత్సభా భాగంబు దెసకు వెనుబారిన, ఆ యాస్థానమున నున్న పవన తనయుడు మనోవల్లభ యువమానము నా సింహబలుని మద విజృంభణమును జాచెను.

**కనుగొని కోప వేగమునఁ గన్నుల నిప్పులు రాల నంగము**
**ల్గనలఁగ సాంద్ర ఘర్మ సలిలంబులు గ్రమ్మ నితాంత దంతపీ**
**డన రటదాస్యరంగ వికటభ్రుకుటి చటుల ప్రవృత్త న**
**ర్తన ఘటనా ప్రకార భయద స్ఫురణా పరిణద్ధమూర్తియై.**[1]

1 ఈ వర్ణ నమునకు సంస్కృతమున మాతృక గలదు. తిక్కన అను వాద విధానమున కీ పద్య ముదాహరణ ప్రాయము.

**నేలయు నింగియుఁ దాళముల్ గాఁ**
**జేసి యేపున రేగి వాయించి యాడఁ**
**గుల పర్వతంబులు గూల్చి యొండొంటితోఁ**
**దాఁకంగ వీఁకమైఁ దన్ని యాడ**
**నేడు సాగరములు నిక్కడక్కడఁ బెట్టి**
**పలుచని రొంపి మై నలఁదికొనఁగ**
**దిక్కులు నాలుగు నొక్క చోటికిఁ దెచ్చి**
**పిసికి పిండలిఁ సేసి పిడుచ గొనఁగ**
**మిగిలి బ్రహ్మండ భాండంబు పగుల వేయ**
**నప్ప ళించుచుఁ బ్రళయకాలనలమున**
**గండరించిన రూపంబు కరణి భీముఁ**
**డతిభయంకరాకారత నతిశయిల్లె.**

పై సీసపద్యమంతయు తిక్కన క్రొత్తగ చేర్చినదే. కాని, భీముని కోప మును ధర్మరాజు ఉపశమింపజేసిన పద్యము ఆంధ్ర సారస్వతము లో ఉత్తమధ్వని గర్భితమైన మనోజ్ఞ ఖండికలలో నొకటి.

"ఇట్లు పేర్చిన కోపాటోపంబున వృకోదరుండు అచ్చేరువు నున్న యున్నత వృక్షంబు నిరీక్షించి యాననంబు పల్లటిల్ల ధర్మ తనయుం గనుంగొనిన నతండు దన నయనాకారంబున వారించి యిట్లనియె.

**వలలుంఁ డెక్కడఁ జూచె నొండెడ నసేవ్యక్ష్మాజముల్ పుట్టవే**
**ఫలితం బై వరశాఖ లొప్పఁగ ననల్ప ప్రీతి సంధించుచున్**
**విలసచ్ఛాయ నుపాశ్రితప్రతతికిన్ విశ్రాంతి గావింపగఁ**
**గల యూ భూజము వంటకట్టియలకై ఖండింపగా నేటికిన్.[1]**

సంస్కృతమున నొక్క శ్లోకములో విరాటుని సభ జేరి నిలిచి న ద్రౌపది వర్ణన గలదు.

---

1. కంకః:-- సూద మా సాహసం కార్షీహ్ ఫలితోయం వనస్పతిః
నాఽత్ర సుష్కాఽణి కాష్ఠాని సాధనీయాని కాని చిత్
అను మూల శ్లోకమును తిక్కన మనోజ్ఞముగ వ్యాఖ్యానప్రాయముగ ననువదించెను.
ఈ పద్యము గూడ తిక్కన సముచితానువాద పద్ధతికి ఉదాహరణము.

**కీచకే నానుగమనాత్ కృష్ణా తామాయతేక్షణా**
**సభాద్వార ముపాగమ్య రుదంతీ వాక్య మ్రబ్రవీత్**

అను శ్లోకమునకు తిక్కన వ్యాఖ్యానప్రాయమైన ఆంధ్రీకరణము సల్పెను.

**ఎలదీగఁ గప్పిన లలితపరాగంబు**
**క్రియ మేన మేదినీరేణు వొప్పఁ**
**జంపకంబున నవసౌరభం బెసఁగెడు**
**కరణి నాసిక వేఁడిగాడ్పు నిగుడఁ**
**దోయజ దళముల తుది మంచు దొరఁగెడు**
**గతిఁ గన్నుఁగవ నశ్రుకణము లురల**
**నిందుబింబముమీఁది కందు చందంబునఁ**
**గురులు నెమ్మొగమునఁ నెరసి యుండ**

**సర్వజనవంద్య యైన పాంచాలి సింహ**
**బలునిచే నివ్విధంబున భంగపాటు**
**దనకు వచ్చిన నెంతయు దైన్య మొంది**
**య వ్విరాటునిసభఁ జేర నరిగి నిలిచి.**

పరాభవఖిన్నయైన ద్రౌపది దీర్ఘోపన్యాసము వినిన పిమ్మట సంస్కృతమున విరాటుని సమాధానము కీచకునే సమర్థించు నట్లున్నది. సంస్కృత విరాటుడు పరోక్షముగా జరిగిన వారిరువురి సంఘర్ష ణ తనకు తెలియదనియు, కాన తానేమియు తీర్పు చెప్పలేనని ఒక్క ముక్క ఖండితముగఁ జెప్పివేసెను.

**"పరోక్షం సాభిజానామి విగ్రహం యువయోరహం**
**అర్థతత్త్వమవిజ్ఞాయ కిం స్యాదకుశలం మమ"**

అని మూలమున గలదు.

తెలుగు భారతమున, సంస్కృత భారతమున గూఢ ద్రౌపది నిశిత ప్రశ్నల నడిగినది. 'ఎవ్వరి యాండ్రు రింక బరిభవంబునఁ బొందక బ్రదుకువారు?' అనియు 'ఇందఱు జూడగా' పతివ్రతను కీచకుడు బహిరంగముగా పరిభవించెను.

అయిననను సంస్కృత విరాటుఁడు, పక్షపాత బుద్ధి నవలంబించెను. దానికి కారణము అతని దుర్బలత్వము, కీచకుం గిని యగ సత్త్వము లేకపోవుట యని తిక్కన వివరించి, విరాటుని పాత్రమునకు మెఱుగులు దిద్దెను. తెలుగు విరాటుడు పరాభవ ఖిన్నయైన ద్రౌపదిపై సానుభూతి చూపి ఆమె ననునయించిన ఆర్ద్రహృదయుండు మాత్రమేగాడు ఆ కీచకుని మది కుందువాపి ఆతనిగూఢ నివాస భూమికిఁ బంపిన చతురుడు.

**అనుడు విరాటుఁ డుల్లమున నక్క టికం. బోలయంగ నంగనం**
**గనుఁగొని కీచకం గినియగా దగు సత్త్వము లేమిఁ జేసి సాం**
**త్వనములు వల్కి రపభరితస్థితిఁ గంపితమూర్తియైన యా**
**తని మది కుందు వాపిన నతండును బోయె నివాసభూమికిన్.**

సంస్కృతమూలములో లేని యీ సామరస్య సంధాన చాతుర్యము తెలుగు విరాటునకు తిక్కన ప్రసాదించినదే.

పరాభవఖిన్నయైన ద్రౌపది రాత్రి సమయమున సుప్తుండైన వృకోదరు కడకం జనును. నిద్రాముద్రితుండైన వృకోదరుని మేల్కొల్పుటకు మూలభారతమున ద్రౌపది చను ఘట్టము ఐతిహాసిక ఠీవితో అద్భుత రమణీయముగ నడచినది. మూలమున ద్రౌపది నిరుపపదమముగ ప్రయుక్తము గాదు. మృగశాభ క్షిసు శ్రోణీ, ధర్మచారిణీ అని విశేషణములను జేర్చినను అది సంస్కృత భాషలో పునరుక్తి యనిపించదు. అట్టి విశేషణ ప్రయోగ పౌనః పున్యము, ఐతిహాసిక గాంభీర్యమునకు అపరిహార్యము. తెలుగు కవితా శిల్పము, తెలుగు బాస నుడికారము వేరు.

సంస్కృతమున పాంచాలి, భీముని మత్తేభమును జేరెడి అడ యేనుగువలె సమీపించును.

**సాతై మహానసం ప్రావ్య భీమసేనం శుచిస్మితా।**
**ఉపాసర్పత పాంచాలీ వాశి తేవ మహాగజం॥**
**సర్వశ్వేతేవ మాహేయీ వనే వృద్ధా త్రిహయనీ।**
**ఉపాతిష్ఠత పాంచాలీ భీమం కౌరవ మచ్యుతం॥**

**మృగగర్వ్య భం యథా దృష్టం ఆర్ధిని వన నిర్ఘరే।**
**సుప్రసుప్తం తథాఽస్థానే మృగరాజ వధూరివ ॥**
**అభిప్రసార్య బాహుభ్యాం పతిం సుప్తం సమాశ్లిషత్।**
**సుజాతం గోమతీతీరే సాలం వల్లీవ పుష్పితా ॥**
**పరిస్పృశ్య చ పాణిభ్యాం పతిం సుప్త మబోధయత్ ॥**
**శ్రీరివాస్యా మహోత్సాహం సుప్తం విష్ణుమివార్ణవే।**
**క్షా మావదాతే శయనే శయానమ్‌ఋషభేక్షణం ॥**
**యథా శచీ దేవరాజం రుద్రాణి శంకరం యథా**
**బ్రాహ్మణ మివ సావిత్రీ యథా షష్ఠిర్గుహం తథా**
**దిశా గజ సమాకారం గజం గజవధూరివ**
**భీమం ప్రాబోధయత్ కాంతా లక్ష్మీర్ధామోదరం యథా**

ఈ శ్లోకములను తిక్కన తెనిగింపలేదు.

భీమునితో ద్రౌపది తన భంగపాటును తెల్పుట మూలము నందువలె తెలుగున సవిస్తరముగ నున్నది. కాని తెనుగున మూలములో లేని పాత్రోన్మీలనము కాననగును. మూలమున ద్రౌపది ధర్మరాజును నిందించును.[1] తెలుగులో నీ ఘట్టమున---

**అకట యాఁడు కూయు నాల కూయును లాఁతి**
**వారికైన నరయ వలయు ననిన**
**నన్ను గీచకుండు దన్నుఁగ నెట్టులు**
**సూఁడ నేర్చె ధర్మ సూనుఁ డపుడు.**

అనిన విని యతం డిట్లనియె.

**కీచకుఁడట్లు మీఁదు పరికింపక నిన్నుఁ బరాభవింపగఁ**
**జాచి మహోగ్రకోపవివశం డగు నన్నును జాచి ధైర్య హే**
**మాచలుండైన ధర్మసుతు డమ్మెయి వారణ సేయకున్న నే**
**నీచత వాని మత్స్యవిభునిం బరివారము నుగ్గు సేసినన్.**

---

1. అశోచ్యతా కుతస్త స్యా యస్యా భర్తా యుధిష్ఠిరః - మొదలగు 75 శ్లోకములు గలవు.

ఆ సంరంభంబున సమయభంగంబుగా జనంబులు మనల నెఱింగిరయేని

**ముందటి భంగిన కానల**
**యందు వసింపంగ వలదె యది నీవును నే**
**నుం దెచ్చిన యాపదగా**
**నిందింపరె యొల్లవారు నీరజవదనా ?**

కావున సత్యవతనిష్ఠుండగు యుధిష్ఠిరుండు పోగట్టకుం దగువాఁడు గాని దూరువడ నర్హుండు గాఁడని వెండియు నిట్లనియో.

**పరిభవకరుఁ డగు కీచకుఁ**
**బరిమార్చుట యెపుడు గడవబడియెనెయుమ్మోఁ**
**దురపిల్ల నేల వ్రేల్మిడి**
**బొరిగొని నీ మనమున కలక పుత్తు లతాంగీ**---అని గలదు.

భీముఁడు సహజముగా నుద్రేక స్వభావము గలవాడే. కాని ఆ యుద్రేక మణిగినపుడు మాత్రము అందరి యట్టివాడే. అతని నోట తిక్కన,

**"అది నీవును నేనుం దెచ్చిన యాపదగా**
**నిందింపరె యొల్లవారు నీరజవదనా..."** అని అనిపించెను.

ఉద్రేక స్వభావులు గూడ ఉద్రేకము చనిన పిమ్మట ప్రశాంతులే. తిక్కన జీవత్పాత్ర చిత్రణము, ఇంగితజ్ఞత అతని కవిత శిల్పమునకు వన్నె బెట్టుచున్నవి. ఆవేశము తగ్గిన తరువాత భీమసేనునిలోగూడ ధర్మరాజులో గల వివేకము ప్రశాంతతగలదు.

తిక్కనకు గల మానవ మనోధర్మ పరిజ్ఞానమువలన అతడు పాత్రలకు ప్రాణప్రతిష్ఠ చేయగలిగెను.

ద్రౌపదిగూడ చతురయే. ఆమె వెనువెంటనే ధర్మరాజును పొగడ నారంభించినది. మూలమున ధర్మరాజును గూర్చిన

పోగడ్తకు తెలుగులోని పోగడ్తకు భేదము గలదు.[1] మూలములో ధర్మరాజుగారి విభవమంతయు శతసహస్ర దాసీ స్త్రీ, దంతి రథ సంఘములతోఁ గూడి యున్నది.[2]

తెలుగు ధర్మరాజు విభవము ఒక సీసపద్యము నిండినది.

**ఎవ్వని వాకిట నిభమదపంకంబు,**
**రాజభూషణ రజోరాజి నడఁగు**
**ఎవ్వని చారిత్ర మెల్లలోకములకు,**
**నొజ్జయై వినయంబు నొఱపు గఱపు**
**నెవ్వని కడకంట నివ్వటిల్లెడు చూడ్కి,**
**మానిత సంపద లీనుచుండు**
**నెవ్వని గుణలత లేడు వారాసుల,**
**కడపటి కొండపై గలయఁ బ్రాఁకు**

**నతఁడు భూరి ప్రతాపమహా ప్రదీప**
**దూరవిఘటిత గర్వాంధకార వైరి**
**వీరకోటీర మణిపుష్పివేష్టి తాంఘ్రి**
**తలుఁడు కేవలమర్త్యుడే ధర్మసుతుఁడు.**

మూలములో గూడ వర్ణితమైనది ధర్మరాజు ప్రాభవమే. తెలుగులో గూడ అదే వర్ణ నవిషయము. ఇదికేవలము అను వాదము గాదు. సంస్కృత మహాభారతమును తెలుగున వినిర్మించుటయే.

ధర్మరాజును గూర్చి ప్రకరణాంతరమున తిక్కన యిట్టి సీస పద్యముననే వ్రాసెను. అజ్ఞాతవాసము ముగిసినది. పాండవులు విరాటుని సభ జేరి కొలువు దీర్చిరి. యథాప్రకారము సభకు వచ్చి, కంకుడు సింహాసనమున గూర్చుండి యుండుటఁ జాచి, విరాటుడు

1. పురా శతసహస్రాణి వంతిసాం హేమమాలినాం
యం యాంతా మసుయాంతి స్మ సోఽయం ద్యూతేన జీవతి
శతందాసీ సహస్రాణాం యస్యనిత్యం మహానసే
పాత్రహస్తం దివారాత్రం అతిథీన్ భోజయత్యుత
2. రుక్యం హిరణ్యం వాసాంసి యానం యుగ్య మజానికం
అశ్వాశ్చ రథసంఘాశ్చ సజాతు క్షయమాప్రజేత్

**ఇది యేమి కంక నీవు**
**నృదపవృత్తిని శంక దక్క నాగద్దియపైఁ**
**బదిలంబుగఁ గూర్చుండితి**
**వదియును గా కిపుడు డిగవహంకారమునన్.**

అనిన విని మందహాసంబు సేసి సంక్రందనందనుం డతని కిట్లనియె .

**నడ దీవియలు నేసె నగరికి మాణిక్య,**
**మకుటముల్ పూనిన మనుజపతులఁ**
**దగు నాజ్ఞ సూయాఽణముగ నొనరించె మం**
**చిగ నేలనాలుగు చెఱఁగులకును**
**బ్రీతార్థి జనుల సచేతనత్యాగధ్వ,**
**జములుగ నన్ని దేశములఁ బఱపె**
**దికుౕర లన్నింటను దెలుపారుపూఁత గా**
**వించె నుజ్జ్వలయశోవిభమంబు.**
**రాజసూయాధ్వరప్రవర్తకుఁడు నిత్య**
**సత్యభాషామహవ్రతశాలి పాండు**
**రాజదుగ్ధపయోనిధిరాజు ధర్మ**
**రాజు సుమ్ము మత్స్యావనీరమణ యితఁడు.**

మూలములోగూడ అర్జునుడు ధర్మరాజును విశేషముగా వర్ణించును. సంస్కృత భారతములోని శ్లోకములకు తిక్కన సీస పద్యము అతని స్వేచ్ఛానువాద పద్ధతికి నికషోపలము.

అర్జునః:---

**ఇంద్రస్యార్థాసనం రాజన్నుయ మారోఢు మర్హతి**
**బ్రహ్మణ్యశ్రుతవాంస్త్యాగీ సర్వ లోకాభ పూజితః।**
**అయం కురూణా మృషభః కుంతీ పుత్రో యుధిష్ఠిరః**
**యస్యకీర్తి స్సి_తా లోకే సూర్యస్యేవో ద్యతః ప్రభా**
**సంసరంతి దిశస్సర్వా యశోఽస్య గభస్తయః।**

ఆదిత్యస్యేవ సూర్యస్య తేజసో ను గభస్తయః
ఏవం త్రింశత్సహస్రాణి కుంజరాణాం తరస్వినాం
అన్వయుః పృష్ఠతో రాజన్ యావదధ్యావసత్ కురూన్
త్రింశచ్చైవ సహస్రాణి రథానాం రథినాం వరం
సదశ్వైరు పపన్నాని పృష్ఠతోను యయుః పురా
వాణీనాంచశతం రాజన్ సహస్రాణ్యయుతం తథా
ఇమమష్టశతం శూరాస్సమృష్టమణికుండలాః
తుష్టుపుర్మాగధైస్సార్ధం సూతాశ్శక్ర మివర్ష యః
ఇమం నిత్యముపాతిష్ఠన్ కురవః కింకరా యథా।
సర్వే చైవ నృపా రాజన్ ధనేశ్వర మివామరాః॥
విష సర్వాన్ మహీపాలన్ కరవాహరయత్ తదా।
వైశ్యానివ మహారాజ వివశాన్ స్వవశానపి॥
అష్టాశీతి సహస్రాణి స్నాతకానాం మహాత్మనాం।
ఉపజీవంతి రాజానం ఏనం సుచరిత వ్రతం॥
విష వృద్ధాననాథాంశ్చ వ్యంగాన్ పంగూంశ్చ వామనాన్।
పుత్రవత్ పాలయామాస ప్రజాధర్మేణచ ప్రజాః॥
విష ధర్మే దమే చైవ దానే సత్యే రతస్సదా।
మహప్రసాదో బ్రహ్మణ్యస్సత్యవాదీచ పార్థివః॥
శ్రీ ప్రభావేణవై యస్య తప్యతేవై సుయోధనః।
సగణస్సహ కర్ణేన సౌబలేనచ వీర్యవాన్॥
నశక్యంతే గుణాస్తస్య సంఖ్యచాతుం నరేశ్వర।
ఏష ధర్మపరో నిత్యం అనుశంసీచ పాండవః॥
ఏవం యుక్తో మహారాజః పాండవః పరవీరహా।
కథం నార్హతి రాజర్హం ఆసనం పృథివీపతిః॥

పై తెలుగు సీసపద్యములో భావము — భాష జోడు గుఱ్ఱముల పరుగువలె, నొకే శృతిలో నడచినవి. సీస పద్యములో ప్రతి చరణ మును భావమున స్వయంసంపూర్ణముగ నుండి, ఓయెల తూగుతో నడచుట— శ్రీనాథ మహాకవి చేతిలో సిద్ధి పొందినది. శ్రీనాథుని సీసములకు ఒజ్జబంతులు తీర్చినది తిక్కన మహాకవియే.

మూసకట్టులో మాత్రమే గాక, భావ, భాషాగతులలోగూడ తిక్కన సీస ములు తరువాతి ప్రబంధకవులకు మేలుబంతులైనవి.[1]

ఇట్లే మూలములో లేకపోయిననూ తిక్కన క్రొత్తగ చేర్చినవి సూర్యోదయ సూర్యాస్తమయ వర్ణనలు. తిక్కన తన భారత మును ప్రబంధ మండలిగ సంకల్పించుటచే నెడనెడ నష్టాదశ వర్ణ నములఁ జొప్పింప జాచెను "ప్రాతరుద్ధాయ కీచకః" అను మూలమును బురస్కరించుకొని తిక్కన విరాటపర్వమున ద్వితీయాశ్వాసమున "ప్రభాతకాల వర్ణ నము" చేర్చెను.

**ద్రుపద నందన పరిభవ దుఃఖమునకు**
**నుల్లమున దురపిల్లుచు నున్న నరసి**
**వేఁడినిట్టూరుపో యన వెడలెఁ గ్రొత్త**
**తావి మూతులు విచ్చు నెత్తమ్మివిరుల.**

ఇట్టి హేతూత్ప్రేక్షలు అధునాతనులకు కృతకములుగా గన్పించి ననను తరువాతి కవు లందరకు మేలుబంతులైనవి. ఇట్లే, సూర్యోదయ వర్ణ నము తరువాతి ప్రబంధ కవులకు మేలుబంతియైనది.

**నీరజాకరములు నిష్ఠమై జేసిన**
**భవ్యతపంబున ఫల మనంగ**
**దివసముఖాభినందితచక్ర యుగ్మకం**
**బుల యనురాగంపుఁ బ్రోవనంగ**

---

1. పెద్దన మనుచరిత్రలో రాయలవారిని గూర్చి వ్రాసిన సీసమునకును ఈ తిక్కన సీసమునకు గల బింబ ప్రతిబింబ భావము సుస్పష్టము.

ఉదయాచలేంద్రమ్ము మొదల నెవ్వాని
  కుమారతకుఁ గ్రౌం చాచలరాజ మయ్యె
నావాడపతిశకంధరసింధు రాధ్య క్షు
  లరిగాపు లెవ్వాని ఖరతరాసి
కాపంచగోడధాత్రిపదం బెవ్వాని
  కసివారుగ నేగు నట్టి బయలు
సకలయాచకజనాశాపూర్తి కెవ్వాని
  ఘనభుజాదండంబు కల్పశాఖి
ప్రబలరాజాధిరాజ వీరప్రతాప
రాజపరమేశబిరుదవిభ్రాజి యెవ్వ
డట్టి శ్రీకృష్ణదేవరాయాగ్రగణ్యు
డొక్క నాడు కౌతూహలం బుప్పతిల్ల.

**హరిహరబ్రహ్మ మహానుభావంబు లో**
**కొక్కటి గాగ గరగిన గుటిక యనగ**
**నతుల వేద త్రయ లతికా చయము పెను**
**పొందc బుట్టెడు మూల కంద మనcగ**
**నఖిల జగముల కన్దెఱ యగుచు జనస**
**మాజకరపుట హృదయ స రోజములకు**
**ముకుళనంబును జ్రంభణంబును నొనరిచ్చ**
**భాను బింబంబు పూర్వాద్రి పై వెలింగె.**

ఇట్టి సూర్యోదయ సూర్యాస్తమయములకు కథతో పోరాని సంబంధ ముండదు. అందుచే ఆ వర్ణ నలు కావ్యమున నందదుకులుగనే నిలిచిపోవును. ప్రతిప్రబంధమునందును ఈ సూర్యాస్తమయ సూర్యోదయ వర్ణ నములు వచ్చుచో కథ కొంతసేపు ఆగిపోయి, వానిని ముందు పంపించి, తరువాతనే కదలవలసి యుండును. "మందరీ రైలుబండి పోవువరకు రోడ్డు కట్టముగ గేటు మూసి, నిత్యవ్యవహారము కొంతసేపు ఆగవలసినదే."

తిక్కన స్వభావముచే స్వభావోక్తి ప్రియుడు. అతని కవితా శిల్పమునకు వైలక్షణ్యము చేకూర్చున దాతని వాస్తవిక చిత్రణము. పై కృతక వర్ణనలను అనుకరించి అతనిని మీరిన వారున్నారు గాని ఆంగికమైన అవస్థను వర్ణించుటలో అతని ననుకరించి కృతకృత్యు లైన వారరుదు.

తిక్కన విరహార్తుడైన కీచకుని దుర్విలాసముల నభివర్ణిం చును. ఉదయమే అతడు "సమయసముచిత కరణీయంబులు నడపి, వేగిరపాటుతో సింగారించుకొని ద్రౌపదియున్న తావు చేరెను.

**చనుటయు ద్రౌపది యతనిం**
**గనియుం గానని విధంబు గైకొని చిత్తం**
**బున బెదరక తన ముందటి**
**పని వెరపున నుండె భీము పలుకుల యూcతన్,**

అట్టియెడ.

**ఎవ్వరితో నైన నెలుఁ గత్తి యొక్కింత**
**పని లేనివెంగలి పలుకు పలుకు**
**మట్టియ లొండొంటి బిట్టు దాఁకగ నేల**
**నందంద మునిగాళ్ళ నప్పళించుఁ**
**గడు వికారంబుగ నేడ లెల్ల విఱచుచు**
**మలఁగి రిత్తకురిత్త సెలఁగి నవ్వ**
**దాళంబుగా గర తలమునఁ బెలుచఁ గం**
**బంబు వ్రేయుచు వెడపాట పాడు.**
**మలయు నంతంతఁ జేరువఁ బొలయు నింతి**
**దన్నుఁ జూడమి కొంతయుఁ దల్లడిల్లు**
**నిక్కడక్కడఁ బడుఁదగు లినుమడింపఁ**
**జూచు నత్తన్వి బొరిఁబొరి గీచకండు.**[1]

ఇట్లు బహుప్రకారంబు లగుదుర్విలాసంబులు సేయుచు నద్దు రాత్ముండు ద్రుపద నందన డాయం బోవును.

సైరంధ్రి నర్తనశాల సంకేత స్థలంబుగఁ జెప్పి, కీచకుని వంచించును. కీచకుడు రాత్రి యగు వరకు వేచియుండ వలసి వచ్చినది. కామాతురుడైన అతని హృదయములో రేగిన విరహ వేదన, అతడు ధ్యాన వనమున విహరించుట, భావరతంబుల శిశిరోపచారములఁ బ్రొద్దు పుచ్చుట మూలములో లేకపోయిననూ కడుంగడు విస్తరించి తిక్కన వ్రాసెను.

**వామాక్షి రుచిరలావణ్యంబు భావించుఁ**
**దన్వన్గిరూపు చిత్తమున నిలుపుఁ**
**గంబుకంధర చెన్ను కైవడి దలపోయు**
**నంగన సౌకుమార్యము దలంచు**
**భామిని సహజవిభ్రమ మెదఁ గీలించు**
**బడఁతి చెయ్వులు మదిఁ బట్టుకొలుపు**

---

1. తెనాలి రామకృష్ణుడు ఈ బొమ్మకు బోరుసుగా విరహార్త్యైన కాపు కోడలిని పాండురంగమహాత్మ్యమున వర్ణించెను.

**మానిని గరువంపు మాట పొందూహించు**
**దళితాబ్జముఖి తిన్నఁదనము మెచ్చు**
**నడరి కోర్కులు చిట్టముల్రాడ వేడగు**
**పడిన యుల్లంబు పట్టున బరుపదనకు**
**వశము గాకున్న నెంతయుఁ వంతఁ బొందు**
**జింతయెనకంబు వడికొని చిక్కువరుప.**

తరువాత నాతఁడుద్యానవనము చేరును.

ఇత్తెఱంగున నొక్కయెడ నయినను గాలూఁదక లీలోద్యానంబు గలయం గ్రమ్మరుచు

**ఇంపైన ప్రియ కాన నిచ్చి నిల్చిన మధు**
**వాదట నాను మత్తాలివిభుని**
**జెట్టుపల్ పచరించి చుట్టుం గ్రుమ్మరి మనో**
**రమ నియ్యకొలుపు మరాళవిభుని**
**ఫలరస మొండెంటి కెలమిఁ జంచుల నిచ్చు**
**మెయిన చొక్కడు శుక మిథునములను**
**గమిఁబాసి తలిరు జొంపమునకు మెయి మెయిఁ**
**దాఁకంగఁ జను పికదంపతులను**
**జాచి చూచి యుల్లంబున నేచికొర్కు**
**లడర జడిముడిపడు మ్రానుపడు వెడంగు**
**పడు వెనుంబడుఁ దల్లడపడు దురంత**
**చింతబారికి నగపడు సింహబలుడు.**

అసలే యీ కథ రసాభాసము. దానికి తోడు తిర్యగ్జంతుగతమైన శృంగార వర్ణనము దీనికి తోడు సూర్యాస్తమయము విధిగా కలిసి వచ్చినది.

**"కను విచ్చుటయును మోడ్చుట**
**యును సరిగఁ దమము పర్వె నుర్విం దోఁడ్తోన్"**

అను సహజమైన వర్ణనకు ముందు విల్లు నెక్కుపెట్టి చక్రవాకముల యిక్కలు రోయు మన్మథుడు ప్రత్యక్షమైనాడు. ఇంతలో జారచోర జనంబుల మనంబులలరు జంద్రాస్తమయమైనది. భీముఁడు

**గమనము వీక వేరొక వికారము పుట్టక సంగరోత్సవో**
**ద్యమ రభసాతిరేకము బయల్పడు టించుక లేక రోష సం**
**భ్రమ మొకయింత యైనఁ బరభావ నిరూప్యము గాక ద్రౌపదీ**
**రమణుడు వోయె విక్రమ ధురంధరతం దగ నాట్యశాలకున్.[1]**

చని వివేక రహితు హృదయంబునుంబోలెఁ దమోఽదూషితం బును విదగ్ధవనితా ప్రేమంబునుంబోలె దుర్నిరూపంబును ఘోరాట విభాగంబునుంబోలె నిర్మనుష్యంబును గాపురుషలక్ష్మీ విలాసంబు నుంబోలె ననుపయోగ్యంబును ననభ్యస్తశాస్త్రంబోలె దుర్గమంబు ను స్వప్నలబ్ధపదార్థంబునుంబోలె నదృష్టిగోచ రంబును విషమ కావ్యంబునుంబోలె నస్పష్టాలంకారంబును బాలిశు రాజ్యంబునుం బోలె జారచోరహృద్యంబును నైన యా నర్తనాగారంబు ముఖభాగ స్థలంబు సేరి.

ఈ ఉపమాపరంపర లన్నియు మూలములో లేవు.

**ధ్వాంతాకారిత కుడ్యకుట్టిమ ఘనస్తంభావలీ రూపమున్**
**భ్రాంతాది ప్రవిభాగ బోధరహిత ప్రా గ్ద్వా రముం గాతర**
**స్వాంతత్రాసకరంబు నై దురభివేశం బైన యా లోను ని**
**శ్చింతుండై సతికేలు పట్టికొని చొచ్చెన్ భీముఁ డత్యుగ్రతన్.[2]**

'స్వాంతము బాహుగర్వ ఘన సంతమసాంధము గాగ' శంకలేక అచ్చటికి వచ్చిన కీచకుని బట్టి భీముడు సంహరించును.

ఇచ్చట ఈ భీభత్స సన్నివేశమున తిక్కన హాస్యము చొప్పించెను.

**కీచకాధముండు గిమ్మీరవైరిపైఁ,**
**గేలు సాఁచి యా విశాలనయన**
**గాఁ దలంచి మేను గరుపార నిల్లను**
**మదనఘూర్ణ మాన హృదయుఁ డగుచు.**

---

1. ఏవముక్త్వా మహాబాహుస్త త్ర పాండవనందనః
అర్ధరాత్రే తదోత్థాయ సత్యవాన్ భీమవిక్రమః
సంస్కృతమూలములో లేని నిగ్రహము గాంభీర్య ముద్ధ తెలుగు పద్యములో స్ఫురించు చున్నది.
2. మూలమున "ద్రౌపదీం పృష్ఠతః కృత్వా" అని మాత్రమే గలదు.

**వనిత మనోహరంబు లగు వస్తువు లెల్లను వేడ్క నేరి నీ**
**కని నియమించి తెచ్చితిఁ బ్రియంబునఁ గైకొను మెప్పు వంగనా**
**జనములు నన్నుఁ జూచి మరుసాయకముల్ దమచిత్త వృత్తు లే**
**చినఁ గొని వచ్చి యిత్తురు విశిష్టధనంబులు నాకు లంచముల్.**

కీచకునకు అంగనాజనములు లంచమిచ్చుట మూలములో లేదు.

అంతేగాక సంస్కృత భారతమున భీముడు కీచకుడును ఆ అర్ధరాత్రి గర్జించుచు శార్దూలములవలె పోరిరి.

"శార్దూలా వివ గర్జంతౌ తార్క్ష్య నాగావివోద్ధతౌ"[1] ఉభయులు మల్ల యుద్ధము సల్పిరి. తెలుగులో

**తన యగపా టోరు లెఱుగుదు**
**రని సూతుఁడు సమయభంగమగుటకు భీముం**
**డును గొంకుచుఁ జప్పుడు సే**
**యని గూఢవిమర్దన ప్రహారములఁ దగన్.**

మల్లయుద్ధము సల్పిరి.

అట్లు సింహబలుని సంహరించిన భీముని యుత్తమ నాయ కత్వ మహిమను ద్రౌపది ప్రశంసించును.

**కొలుపు లోపల నిన్ను కోప మల్లెత్తినఁ**
**దలఁకక నిలిచిన ధైర్య మహిమ**
**నే దిందుఁ జనుదెంచి నిర్వికారతఁ బ్రజ**
**కన్నులు గప్పిన గౌరవంబు**
**మనవారిలోన నొక్కని నైనఁ బిల్వక**
**త్యాహంబు సేసిన సాహసంబు**
**లోకదుర్జయుఁ డగు నీ కీచకునినిపే**
**ల్మిడి రూపు మాపిన కడిమిసొంపు**
**సూడఁ దలపోయ మెచ్చ సంస్తుతి యొనర్ప**
**నా దలంపే నీ యుత్తమ నాయకత్వ**

---

1. స్పర్ధయాచ బలోన్మత్తౌ తావుభౌ భీమ కీచకౌ
నిష్కబ్ధం పర్య కర్షేతాం అన్యోన్యస్య వినిర్జయే అని గూఢ గలదు గాని- ఈ వైరుధ్యము తెలుగు భారతములో లేదు.

**మెఱిఁగి నినుఁ గొనియాడ నే నెంతదాన**
**మహిత విస్మయానంద నిర్మగ్న నైతి.**

ఈ ప్రశంస మూలములో లేదు.

ఉపకీచకులు కీచకునకు దహన సంస్కారము నెరపువారై తమ అన్నగారి మృతికి మూలకారణమైన సైరంధ్రిని అతని చితిపై బెట్టి దహింప సమకట్టి, రాజానుమతి నర్థించిరి. మూలమున విరాటుడు సూతుల పరాక్రమ మెరిగినవాడగుటచే అందులకు సమ్మతించెను.[1] కాని, తెనుగున తిక్కన విరాటుని శీలము నుద్ధ రించుటకుఁ బ్రయత్నించెను.

"అతండును దనమనంబున నియ్యుపకీచకులచందంబు సూడ నేను వారించితినేనియు నుడుగం గలవారు గారనియు గంధర్వులు బలవంతులు గావున దద్రక్షితమైన సైరంధ్రి కపాయంబు వొందదనియు నూహించి వారలం గలయం గనుఁగొని యట్లకాక మీకుం బోలిన తెఱంగు సేయుం దనిన నదియ యనుమతిగఁ గైకొని" "సూతుని పీనుగుమీదఁ బాండు పుత్రాంగనఁ బెట్టి కట్టిరి."

సంస్కృత భారతమున పౌరులు సైరంధ్రి మూలమున పురమంతయు భయాందోళితమై యున్నదని మొరపెట్టుకొనిరి. ఆ నివేదన తెలుగు భారతములో లేదు. విరాటుడు సుధేష్ణతో ద్రౌపది నెచ్చటకేని పొమ్మని చెప్పమనును. ఈ సందర్భమున తెలుగు భారతములో విరాటుడు సుదేష్ణతో పౌరు ఉపయోగించిన భావములను గలిపి చెప్పను.

**ఆ కమలాక్షి రూపమహిమాతిశయంబు మనోహరంబు భో**
**గైకపరాయణుల్ పురుష లంగజుఁ డప్రతికారచేష్టిత**
**స్వీకృతలోకుఁ డ ట్లగుటఁ జేటు పురంబునవారి కెప్పుడుం**
**గా కెటు లుండు నిట్టి యువగాఢ ఫుఁ బొత్తు మనంగ వచ్చునే.**[2]

---

1. పరాక్రమంతు సూతానాం జ్ఞాత్వా రాజా ప్రవమన్యత
సైరంధ్రి సూత పుత్రేణ సహవృద్ధా జనాధిపః
2. తతస్సైవ కన్యాభిర్ద్రోపది రాజవేశ్య తత్
ప్రవివేశ సుదేష్ణాయ వస్మీపము పలాలితా

మూలమున, విరాటుడు

**"తథా రూపాచ సైరంధ్రీ గంధర్వాశ్చ మహాబలాః**
**పుంసా మిష్టశ్చ విషయో మైథునాయ నసంశయః"**

అని పచ్చిగఁ జెప్పిన మాటను, తిక్కన తెనుగులో మృదుమధుర ముగ మార్చి చెప్పెను. విరాటుని మాటలనే సుధేష్ణ సైరంధ్రితో జెప్పినపుడు మరింత నాజూకుగఁ జెప్పించెను.

**నీవు చక్రనిదానవు నెలత, ధైర్య**
**రహితచిత్తులు మగవారు రాజు దీనిఁ**
**దలఁచి భయ మంది నిన్ను నీ వలచు నెడకు**
**నరుగు నట్లుగఁ బ్రార్థించి యనుపు మనియొ.**

కీచకవధానంతరము ద్రౌపది తిరిగి అంతఃపురమును జేరు కొనును. అక్కడ సుదేష్ణ సహోదర మరణశోకాతుర. గండము గడచి బయట పడినను మహావిపత్తు ననుభవించిన సాధ్వి సైరంధ్రి. ఇరువురు నొకరి మొగము నింకొకరు చూడజాలనివారు. మూలమున ద్రౌపది రాజవేశ్యమున సుదేష్ణను సమీపించుట ఒక్క శ్లోకములో నున్నది.[1]

తెలుగులో కీచక సంహారానంతరము ద్రౌపది తన సంతోష తన్మయత్వము నణచుకొని, ఎట్లు తన సమ్మదపూరమునకు బలితంపు గట్టవెట్టి, సహోదర మరణశోకాతురయగు సుదేష్ణను సమీపించినదో తిక్కన మనోజ్ఞముగ నభివర్ణించెను.

అనుచుం గన్యాకాజనపరివృతయై యరిగి యంతః పురంబు సొచ్చి సహోదర మరణశోకాతుర యగు కైకేయికడకుం జను నప్పుడు,

---

1. బహునా కిం ప్రలాపేన యతో ధర్మస్తతో జయః

**ముదమున నెలమి సొం పొదవి నెమ్మొగముఁన**
**దోఁపంగ వచ్చిన ద్రోచి ద్రోచి**
**లలి నుల్లసిల్లుచు లలితలోచనదీప్తు**
**లడర నుంకించిన నాఁగి యాఁగి**
**సంతసంబున బాలిశము లగు చెయ్వులు**
**దొడరఁ బూచినఁ జేయ కుడిగి యుడిగి**
**మనమున నుబ్బు మై మాట నాలుకకు రా**
**గడఁగిన నాడక కడపి కడపి**
**ధీరయై యిట్లు సమ్మ్రదపూరమునకు**
**గఱువతనమును బలితంపుఁగట్టవెట్టి**
**వెలఁది యొరు గనియదివోలె వికృతి లేక**
**యల్ల నెప్పటియట్టుల యరుగుటయును.**
**భయశోకంబులు దనదుహృ**
**దయమునఁ బిరిగొన విరాటధరణీనాథ**
**ప్రియసంభావన సేసె వి**
**నయపూర్వము గాఁగ ద్రుపదనందనకుఁ దగన్.**

తిక్కన గన్పించు భావనిగ్రహము, రాజశేఖరుడు ప్రవచించిన సమాధికిని, వర్డ్సు వర్తు మహాకవి కళా రహస్యముగ ప్రతిపాదించిన భావోద్వేగ పునస్మరణమునకు నుదాహరణ ప్రాయము.

అజ్ఞాతవాసము పూర్తికావచ్చు సమయమున చారులు పాండవుల జాడ తెలియక తిరిగి వచ్చిరి. మూలమున చారుల నివేదనము సువిస్తరముగ గలదు. తిక్కన యథాప్రకారము చారనివేదనము సంక్షేపించెను. తరువాత దుశ్శాసన కర్ణ భీష్మ ద్రోణుల ప్రసంగములను నట్లే సంక్షేపించెను. భీష్మ ప్రసంగము నందు మూలమున మహాభారతమునందలి చిరస్మరణీయసూక్తి, 'యథా ధర్మస్తతో జయః' గలదు.[1]

1. శుత్వాతు వచసం తేషాం గోపాలానా మరిందమః
సరాజా మహతీం సేనాం మాత్స్యానాం సమవాహయత్
మొదలైన శ్లోకములు విరాటుడు కూర్చిన సేనను వర్ణించునవే మూల మున గలవు.

తిక్కన, దానిని గూడ తెనిగింప లేదు. ఈ సుభాషితము భారతమునందు పలుతావుల పునరుక్త మైనది. విరాట పర్వము నందు కీచకవధ తరువాత, తిక్కన అధికముగఁ జేర్చినవి మొత్తము మీద తక్కువే. మూలములో ౭ అధ్యాయములో ౭0ం శ్లోకములను తిక్కన తెలుగులో సుమారు ౭0 పద్యములలో సంక్షేపించెను.

సుశర్మ దక్షిణ గోగ్రహణము సల్పిన సంగతి గోపాలురు విరాటునకు నివేదింతురు.

తెలుగున విరాటుడు రోషముతో విజృంభించును.

అనిన విని విరాటుం డదరిపడి.

**ఏమీ నిక్కమే మున్నొఱుంగడె త్రిగర్తేశుండు మద్గోధన**
**స్తోమంబుం గొనిపోవు తెంపునకు నుద్యోగించెనే మేలు మే**
**లామై తోడనె పోవు గాక యని విరాలాపముల్ పల్కియు ద**
**ద్ధా మక్రోధశిఖాకలాపవిక టో ద్య ద్భ్రుభ కుటిస్ఫూర్తియై.**

**సచివులఁ జాచి యిప్పుడ వెసన్ మనమొద్దుక తిక్కనం బసు**
**ప్రచయము దప్పిపోవు దుది భంగము సేగియు వచ్చు గాన మీ**
**రుచితవిధాన సత్వరత నుద్ధత యోధసమగ్రవాహినీ**
**ప్రచలితభూమిభాగముగఁ బన్నుఁగఁ బంపుడు దండనాథులన్.**

అని నియోగించి.

**యానప్రక్రమసూచకంబులగు తూర్యంబుల్ దిశాపాటన**
**ధ్యానస్వైరవిహారకల్పితసముద్ర క్షోభముల్ గా ధరి**
**త్రీనాధుండు రణోచితోద్యమము సంధిల్లంగ శస్త్రాస్త్రవ**
**ర్యానీతిక్రమదక్షులం బనిచె నయ్యై వారికిన్ గ్రక్కునన్.**

**సారథిఁ జాచి నీవు రథ సంబునఁ బూన్పుము ఘోటకంబులం**
**దేరఁ దదియవర్మము లతిస్ఫుటబంధమగాఁగ, బెట్టు నీ**
**వీరవచోవిలాసములు విందుము మున్నిదె వచ్చె గయ్యమే**
**పారఁగఁ జూపు నీ దగు నహంకృతికిం దగుధైర్య మియ్యెడన్.**

విరాటుని రోషవాక్యములు మూలభారతమున లేవు.[1]

---

1. వావిళ్ళవారి తెలుగు భారతము ౧౯౪౨ ముద్రణ విరాటపర్వ ప్రతిలో 90వ పుటలో "మదిరాక్షున్డు" అను మాటను నక్షత్ర ఖచితము చేసి అధోభాగమున "మది రాక్షున్డు" నం. బా. అని వివరించి యున్నారు.

ఇక మూలభారతమున రెండు శ్లోకములు విరటుని తమ్ము లైన శతానీకుడు, మదిరాశ్వుడు యుద్ధ సన్నద్ధులగుటను వర్ణించు నవి గలవు.

**ధృథమాయస గర్భం తు కవచం తప్త కాంచనం।**
**విరాటస్య ప్రియో భ్రాతా శతానికోఽభ్యహరయత్॥**

అను శ్లోకమునకు తిక్కన తెలుగు సేత

**లోకస్తుత్యవిభూతి నన్యపృతనాలుంటాక బాహాబల**
**శ్రీకల్మీన్ రథ దంతి ఘోటక భటశ్రేణీ సముద్దాంతసే**
**నా కల్పధ్వజ విభ్రమంబున సుహృద్య ప్రోద్యముండై శతా**
**నీకుం డుద్ధతి నేగుదెంచె నఖిలానీకంబు నుప్పొంగగన్.**
**సర్వభార సహం వర్మ కల్యాణపటలం దృఢం**
**శతానీకాదవరజో మదిరాశ్వోఽభ్యహారయత్**[1]

అను శ్లోకమునకు తిక్కన తెలుగు సేత

**ఆతని తమ్ముడైన మదిరాశ్వుడు గర్వ ఝుళం ఝుళా సము**
**ద్ధూతబలోత్తరేణు పరిధూసరితాంబర మైన వారణ**
**వ్రాతము గోల్చి రా గడఁగి వచ్చె సముజ్జ్వల హేమవర్మని**
**ర్యా తరుచిచ్ఛటాపటల రంజిత హేతి మహోగ్రసైన్యుడై.**

పై శ్లోకములను పద్యములను అనుశీలించినచో తిక్కన భారతము కేవల మొక అనువాద గ్రంథ మనుకొనుట పొసగదు.

**ఇట్లే, శంభో విరాటపుత్రస్తు మహేష్వాసో మహాబలః**
**వినిఘ్నన్ సమరే శత్రూన్ ప్రవివేశ మహాచమూమ్.**

అను శ్లోకమునకు తిక్కన తెనుగు సేత

**అప్పుడు శంభుఁ డెంతయుఁ బ్రియంబునఁ బెండ్లికిఁ బోవునట్లు మో**
**మొప్పఁగ వస్త్రశస్త్రముల యుల్లసనంబున శత్రునేత్రముల్**
**గప్పఁగఁ జీకటుల్ రణముఖంబు సమస్తముఁ దానయో రథం**
**బుప్పర విధిఁ దోలికొని యుగ్రగతిం బఱతెంచి తాఁకినన్.**

---

1 దాక్షిణాత్య ప్రతిలో 'మదిరాశ్వో అభ్యహరయత్' అనియో గలదు. వితత పరిష్కర్త వావిళ్ళవారే ప్రచురించిన దాక్షిణాత్య ప్రతిని చూడలేదని యోంచ వచ్చును.

ఉభయ పక్షములను చీకటి పడువరకు పోరిరి.

**వెలుఁగు గని కడఁగి యురువాఁ**
**గులుఁ బోరికి జొచ్చె మత్స్య కుంజరుడును న**
**గ్గల మగుమగఁ టిమిసొంపున**
**దలపడియె సుశర్మతోడ దదనుజుతోడన్.**

ఇట్టి వర్ణనలు తరువాతి తెలుగు ప్రబంధములలో కొల్లలు. చంద్రుని వెన్నెల అతని మనుమలగు పాండవులకే గాక యుద్ధ భూమియందలి వీరులందరకు సాధారణమైనదే. మూలభారతము లోని వర్ణ నమే సహజముగ దోచును.

**తతోఽన్ ధకారం ప్రణుదన్నుదతిష్ఠని శాకరః**
**కుర్వాణో విమలాం రాత్రిం నందయన్ క్షత్రియాన్ రణే.**

నిజమునకు చంద్రు డప్పుడు రణమునందలి క్షత్రియు లందరకు ఆనందదాయకుడే తిక్కన క్వాచిత్కముగ వాడిన నీ కృతక హేతూ త్ప్రే క్షలు ప్రబంధ వాఙ్మయమున నిత్యములైనవి.

యుద్ధవర్ణనయందు తిక్కనకు గల ఆభినివేశమునకు విరా ట పర్వమునందలి దక్షిణగోగ్రహణ ఘట్టమే నాంది. మూలములో లేని పోలికలను వర్ణ న తృతీయాశ్వాసాంతమునందు గనవచ్చుచున్నది.

"గుత్తుల కొలందికి గృత్తంబులయి పడియున్న పాదంబుల వలనం గెందలిరుల సెజ్జల చందంబులగు చోట్లును దునిపి చిక్కు వడియున్న యూరుకాండంబులవలన మదగజంబులు సాచ్చిన కదలీవనంబులంబోని యెడలును బ్రోవులు గొనియున్న ప్రేవుల వలన లావుగల యంచపిండు పేరాకలి వరిమురిం బెరికిన గురు కులు గట్టిన మృణాలనాళంబుల నొప్పు కమలా కరోద్దేశంబులఁ గ్రేణిసేయు ప్రదేశంబులును నంగుళీయకరుచు లడర నెరిం జాఁగి పడియున్న బాహుదండంబులవలన నురగ నివాసంబుల నను

కరించు తలంబులును గీలాలజలంబుల పయిం దేలుచు నవ్వి నట్లున్న శిరంబులవలన వికచారవిందదీర్ఘి కల విడంబించు తావులును నవయువభేదంబు లడంగునట్లుగా దుత్తు నియలై పడి యున్న గాత్రంబుల వలన గ్రుతాంతమహానసశాలల పగిది నొప్పు పట్లును గలపాలిగలను గలయంగనుంగొనుచు వెడలి చంద్రికా సుందరంబగు నొక్క సైకతస్థలంబున నారాత్రి" పుచ్చిరి.

"నవ్వినట్లున్న శిరంబులవలన వికచారవింద దీర్ఘికల విడంబించు ఠావులు" గల యుద్ధభూమిని జూడ గలిగిన అభినివే శము తిక్కనకు గలదు.

ఉత్తర, బృహన్నలను అన్నగారికి సారథిగఁ దోడ్కొని తెచ్చుటకుఁ బోవును.

**అడుగుల నునుగాంతి నయ్యోడ పద్మ రా**
**గంబుల నెలకట్టు కరణి నొప్ప**
**బాలిండ్లు దనువేద బ్రాలింపఁ జెన్నొందు**
**నసదుఁగౌదీగ యల్లాడుచుండఁ**
**దఱివేచి వెనువెంట దగులు కామాంధకా**
**రముఁలీలఁ గ్రొవ్వేద గొమరు మిగుల**
**గర్ణ భూషణ మౌక్తిక ప్రభాడోలన**
**మీక్షణ దీప్తుల నినుమడింప**
**నందియల మొరపంబున కరుగుదెంచి**
**ప్రోది రాయంచ రయమున బోవు నవ్వి**
**ధంబు దగ నభ్యసించు చందములఁ దోన**
**చనఁగ నుత్తర నర్తనశాల కరిగె.**

**మెఱుగు మొగిలు సొచ్చు తెఱగున నాట్యమం**
**దిరమసొచ్చి తనదు గురువు కడకు**
**నరిగి నెమ్మి నిట్టులను నింతి ప్రార్థనా**
**వినయసంభ్రమములు పెనఁగొనంగ.**

మూలమున వర్ణన తెన్ను వేరు.[1] సంస్కృతమునందలి ఉత్తర, హాటక రత్నభూషిత, వ్రజముక్తామణి హేమకుండల; పద్మా నన; పద్మదళాయతాక్షి; మృదుమంద్రలోచన మాల్యధారిణి.

**నిష్క శత శుద్ధ హేమంబు నిర్మలోజ్వ**
**లాఽఽఢ్యవైడూర్యములుఁ దురగాఽఽఖ్య రథముఁ**
**గరటి దశకంబు నొక యూరుఁ బురము సొచ్చి**
**నపుడ యిచ్చెద నీ కను నార్త౯ డగుచు.**

పై సీస పద్యములోని ఆంగిక సాత్వికాభివర్ణ న మంతయు తిక్కన క్రొత్తగ తెలుగు భారతమునఁ జేర్చినదే.[2]

---

1.సా ప్రాద్రవత్ కాంచన మాల్యధారిణీ
జ్యేష్ఠేన భా త్రా ప్రహితా యశస్వినీ
భ్రాతుర్నియోగం చ నిశమ్య సుభ్రూ
శ్చ్న భాసనా హాటక రత్న భూషితా
సా వజ్ర ముక్తా మణి హేమకుండలా
మృదు భ్రాతుఽనియోగచోదితా
ప్రదక్షిణా వర్త తనుఃశ్శి ఖండినీ
పద్మాననా పద్మదళాయతాక్షి
తన్వీ సమాంగీ మృదు మంద్రలో చనా
మాత్స్య స్వరాజ్ఞో దుహితా విలాసినీ
సా నర్త నాగారమరాళ ప క్ష్మా
శత హ్ర దా మేఘమి వా న్వ పద్యత
సానాగనాసో పమసంహితో రూ
రనిందితా వేది విలగ్న మధ్యా
అసాధ్యత స్థౌ వరమాల్యధారిణీ
పార్థం సుబా నాగవధూరివ ద్విపమే

2. ఎత్తు గీతికి మాత్రము మూలము గలదు.
ఉత్తరః:
సువర్ణ మణి ముక్తానాం యద్యదిచ్ఛసి దద్మ్యతత్
హస్తినో ఽశ్వాన్ రథాన్ గాఽవ స్త్ర స్రి యశ్చ సమలం కృతాః
శాతకుంభస్య శుద్ధస్య శ్రేష్ఠస్య రజతస్యచ
దదామి శతనిష్కం తే ముం చ మాం త్వం బృహన్నలే
మణీ స స్థాచవైడూర్యాన్ హేమబద్ధాఁ మహాప్రభాఃఽ
హేమదండ ప్రతిచ్ఛన్నం రథం యుక్తం తు వాజిభిః
మత్తాంశ్చ దశమా తంగాఽ ముంచమాంత్వం బృహన్నలే

తిక్కనకు స్థిరభంగిమలను గాక చలత్ భంగిమలనే చిత్రించుట యం దభినివేశ మెక్కువ. క్షణక్షణ పరివర్తమానమైన ఆంగికాభివర్ణనము కన్నుల గట్టినట్లు వర్ణించు నేర్పులో ఆంధ్ర సాహిత్యమందేగాక ప్రపంచ వాఙ్మయములో తిక్కనకు సాటియైన కవులరుదు.

ఉత్తరుడు శమీవృక్షము నధిరోహించి, "బహువిధంబులగు నాయుధంబు లుపలక్షించి వేఱువేఱ వాని చందంబు లుపన్యసించి యివి యెవ్వ రెవ్వరి వని" యర్జును నడుగును. సంస్కృత భారతమున గల ఆ యా యుధముల విపులవర్ణన తిక్కన యొక్క ముక్కతో సంక్షేపించెను.

అర్జునుఁడు దేవదత్తము నొత్తెను.

**కలగెం దోయధిసప్తకంబు గిరివర్గం బెల్ల నూఁటాడె సం**
**చలతం బొందె వసుంధరావలయ మాఽశాచక్ర మల్లాడెఁ గొం**
**దల మందం త్రిదశేంద్రు పట్టణము పాతాళంబు ఘూర్తిల్లె నా**
**కులమయ్యెన్ గ్రహతారకాకులము సంకోభించె నవ్వ్యోధయున్.**

ఈ వర్ణ న మూలములో లేదు.

మూలమున ద్రోణుడు కౌరవ సేనలో బుట్టిన దుర్నిమి త్తములనేకరువు పెట్టును. తిక్కన ఒక పద్యములో సంక్షేపించి చెప్పెను.

తెలుగు ఉత్తర సోయగము వేరు. సంస్కృతమున ద్వీపమును జేరు కరణివలె ఉత్తర అర్జునుని జేరినది. పితృతుల్యుఁడైన అర్జునుని ఉత్తర జేరునప్పడా ఉపమానమును తిక్కన పరిహరించెను. తన్నట్లు చేరవచ్చిన ఉత్తరతో అర్జునుడు,

**నగుచు బృహన్నల యిట్లను**
**జగతీశ్వరపుత్రి నాకు సారథ్యము నే**
**ర్పు గలదె నీ మాటకు నే**
**మిగులంగ వెఱతుఁ బోధము మీ దట్లుండెన్.**

**భవదీయ ప్రార్థనచే**
**దివిరి పరమదుష్కరములు దీర్చి యయిన ను**
**త్సవ మొనరించెద సార**
**థ్వ వి ధం బొక డనఁగ నేల యంబుజవదనా.**

మూలములో లేని ఈ మాటలు, తిక్కన సంభాషణ చాతుర్యమునకు వికషోపలము. బృహన్నల మాటలలో నున్న గుణీభూత వ్యంగ్యము తిక్కన కవితా శిల్పములోని మహోజ్వల రేఖలలో నొకటి.

బృహన్నల రథము నాపక కౌరవసేన వైపునకు రయమునఁ బోనిచ్చుచుండ, ఆననంబు పల్లటిల్ల మానసంబు తల్లడిల్ల నా భూవల్లభ కుమారుండు

**దవ్వుల విరిగినఁ బోరులు**
**నవ్వు దు రకె మేలు మేలు నను నాఁగకు నీ**
**క్రొవ్వురు గ దేనిఁ దలపడు**
**మెవ్వి ధి జనితేని ననుచు నెత్తిన ఖితిన్.**

**శరములు శరాసనమ న**
**య్యరథముపైఁ దిగ్గవిడిచి యతిరభసమునన్**
**ధరణికి లంఘించి వె సం**
**బురి దెసకును లజ్జ వీటిఁ బోవం బారె న్.**

"పురహూత పుత్రుండు పదశతమాత్ర ప్రదేశ పలాయితుండగు నా భూమింజయు నెయిది పట్టుకొనిన నతండు

**వెలవెల బాఱుచు వెగడొందుఁ బెదఁవు ల**
**తడి యూఱ నెంతయుఁదల్లడిల్లు**
**జల్లన నంగంబు లెల్లనిండ జెమురుచ్చ**
**బదములుఁ గరములుఁ గుదియవడకు**

**హృదయంబు తటతట నధరంగఁ బెలుకుఱు**
**దీనదృష్టుల మోముఁ దేటి చూచు**
**నెలుఁగు గద్దదికఁ దోఁటిల నెడ్చు విడుమని**
**ప్రార్థించు మాటఁ గీడ్వాటు దోఁప**
**మన మొనల దుర్నిమిత్తము**
**అనేకములు పుట్టఁ దొడఁగ నట్టగుట జయం**
**బనుమానం బోకకార్యము**
**వినుడా మీ కెల్లం జూడవెర వగునేనిన్.**

అట్లే మూలమున దుర్యోధనుడు అనుకూల శకునములు గలిగిన వని విస్తరించి చెప్పెను. ఆప్రసంగమునుగూడ తిక్కన సంక్షే పించెను.

అశ్వత్థామ కర్ణు నధిక్షేపించి పలుకు ఘట్టమునుగూడ తిక్కన సంక్షేపించెను. మూలములోఁ గల ధర్మబోధ తెలుగులో లేదు.

**"అరుదుగ నిట్టు లెక్కనికి నంతబలంబునకున్ మహోగ్రసం**
**గర మగుడున్ మనంబతుల కౌతుక మొంది కనుంగొనన్"**

సురేశ్వరుడు సుదర్శన విమానమెక్కి వచ్చెను. అతనితోపాటు స్వర్గ ము నందలి రాజులును వచ్చిరి. ఆ వచ్చిన రాజులలో మూలమున "పాండు శ్చయి వ" అని మాత్రమే గలదు.[1]

1. మూలమున స్వర్గములోని రాజు లెందరో వచ్చినట్లు విపుల వర్ణ న గలదు.

తత్రా జర్ణ యశ్చయివ సమారూఢా దివౌకసః।
శ్వేతోరాజా పసుమనాఽస్త ధా భద్రః ప్రతర్దనః।
సృగో యయాతి ర్నహుషో మాంధాతాభరతః కురుః।
అష్టకశ్చ శిబి శ్చై వ సచ రాజా పురూరవాః।

..............
పాండు శ్చై వ మహాబాహు శ్చా మర వ్యజనాయుతః।
............... మొదలగు శ్లోకములు.

పై శ్లోకముల నన్నిటిని తిక్కన ఒక పద్యములో

స్వర్గమున నున్న రాజులుఁ జక్రవర్తు
లను యథోచితవృత్తంబులను నిజార్హ
చామరంబులుఁ జెలువొందఁ జారులీలఁ
గొలిచి యుండిరి వేడ్కలు గొనలు నిగుడ

అని సంక్షేపించెను. కీచక వధానంతరము తిక్కన దృష్టి సంక్షేపించుటపై మరలినది.

**పాండు మహీపాలుం డా**
**ఖండలు చేరువన పెద్దగద్దియ నమరీ**
**మండలి వీచోపు లిడఁగ**
**నుండి కనుంగొనుచు నుండె నుజ్జ్వల భంగిన్.**

పాండు మహీపాలునకు దేవేంద్రుని ప్రక్క పెద్ద గద్దియ వేయించి నది తెలుగున తిక్కనయే.

మడువులు గట్టు శోణితంబు నీళ్ళ నందుఁ బడితేలాడు వెలి గొడుగులు పుండరీకంబులును, వింజామరలు మరాళ పుంజంబును నై కొలంకుల చందంబునొంద వాని కెటింగెడు కొదమ తుమ్మెద పదుపులపగిది దొరఁగు నాఖండలతనయ ఖండిత పరవీరకాలా యసనారాచ శకలంబుల వలనను గిరీటిశరపాటవ పరిస్ఫోటిత రిపుకపాల గళిత మస్తిష్క పలలపంకంబునను నలుదేసల నంతం తఁ గదియం జాఁగిపడిమున్న కృతకరచరణంబులను వెదపదనికి రొంపి గలంచి వరుజలు పదిలంబుగ నమర్చిన కేదారంబు తెరం గు దోఁచుటకు నీడై చతురహాలికుండు సల్లు పరువంపు మొలకల చెలుపునఁ బెల్లుడుల్లు ఫల్గునాసుగ సంతాడనవి కీర్ణ శత్రుశేఖర వజ్రవజంబులవలనను సంగ్రామం బభిరామం బయ్యును ఘోర ప్రకారం బయ్యెను.

యుద్ధభూమిని తిక్కన 'అభిరామంబని' వర్ణించును. పైవర్ణ నము మూలములో లేదు.

యుద్ధవర్ణనమునందు తిక్కన యథామూలముగనే సంక్షే పించి వర్ణించినను, యథాక్షరానువాదము సలుపలేదు.

మూలమున భీష్మార్జునుల యుద్ధ మభివర్ణితమైనది.

**"ఆయాంత మర్జునం దృష్ట్వా భీష్మః పరపురం జయః**
**ప్రత్యుజ్జగామ యుద్ధార్థీ మహా ర్ణ భమివర్ణ భః"**

పై శ్లోకమునకు తిక్కన తెలుగు సేత

**శాంతనవుండు నప్డు నిజ శంఖము గౌరవరాజ సైన్యముల్**
**సంతస మంద నొత్తుచు ససంభ్రమ లీల నెదుర్కొనంగ ధ**
**ర్ధాంత భుజా బలప్రకట దర్పమెలర్ప నరుండు నొ త్తెది**
**గ్దం తి నికాయ కర్ణ పుట దారణ విత్త ము దేవదత్తమున్.**

**మలసి అంకెలు వైచుచు మాఱుకొనిన**
**వృషభములభంగి నక్కురువృషభు లిట్లు**
**సమదగతిఁ జేరునెడఁ జూచి రమరు లర్థి**
**ననిమిషత్వంబు దమ కప్పు డచ్చుపడఁగ.**

అమరులకు ఆనిమిషత్వము సార్థకమైన దనుట తిక్కన చేర్చినదే.[1] తాత మనుమల యుద్ధమునకు ఉద్దీపన విభావముగ, ఉభయులు శంఖము లొత్తుట వర్ణించి తిక్కన యుద్ధమున కనువగు వాతావరణము గల్పించెను.

ఇట్టి వాతావరణ కల్పనము తిక్కన కవితా శిల్పములోని నొక ఉత్తమ లక్షణము.

ఉత్తర గోగ్రహణ యుద్ధానంతరము అర్జునుడు కురువీరుల నోడించి, కొండొకదవ్వు వెన్నడిం దటిమి మఱలును. అప్పుడు

---

1. మూలమున దేవతలు ఉభయులను అగ్గించుట విస్తర వర్ణన గలదు. ఆ వర్ణన మంతయు తిక్కన ఒక్క పద్యములో సంక్షేపించెను.
దేవాః
యదర్జునః కురూన్ సర్వాన్ ప్రాక్రుంతచ్ఛ్రస్ట తేజసా।
కురుశ్రేష్ఠావి మౌ వీరౌ రణే భీష్మధనంజయౌ॥
సర్వా స్త్రకుశలో లోకే ఏతా పతి రధావుభౌ।
ఉభౌ దేవ మను ష్యే షు విశ్రు తో స్వపరాక్రమైః॥
సమాగతౌ నర వ్యా ఘ్రౌ వ్యా ఘ్రా వివ తతస్విన్హౌ
ఉభో సదృశ కర్మాణౌ సూర్యస్యాగ్నేశ్చ బారత
వాసుదేవస్య సదృశౌ కార్తవీర్యస్య సమావుభౌ
ఉభో విశ్రుత కర్మాణావుభౌ శూతౌ మహాబలౌ

**కాలు తక్కు వ వారలు గలయుఁ జెదరి**
**వెనుకఁబడి పోవునెడఁ దన్నుఁగని భయమునఁ**
**బ్రాణదానంబు వేఁడిన బార్థుఁ డభయ**
**హస్తమిచ్చుచు దయ పెనుపారఁబలుకు.**

ఇట్లు నానావిధదీనదశాదందమానులగు కృపణులందన కృపామృతంబునఁ దడిపినందేరి వారు దీవించుచుం బ్రణమిల్లు చుం బొగడుచుం బోవుచుండ ధనంజయుండు భూమింజ యుం జాచును.

అర్జును దయాళుతకు నిదర్శనమై అతని శీలమునకు మెఱుగు పెట్టుచున్న పై పద్యములు తిక్కన తెలుగున క్రొత్తగ చేర్చి నవే.

కురుసేనను జయించి వచ్చిన ఉత్తరు నెదుర్కొనంబోయి

**మంగళ తూర్య రవములు సె**
**లం గఁగ మౌక్తిక విమిశ్ర లలితాక్షత వృ**
**ష్టిం గురిసిరి విప్రులుఁ బు**
**ణ్యాం గనలును భద్రవాక్చ యం బులతోడన్.**

**అత్తఱిఁ గన్యకాజనసహస్రముఁ దానును జేరి వేడ్కమై**
**నుత్తర చందనార్ద్ర కుసుమోత్కరమున్ నవరత్న సంచయో**
**దాత్త సువర్ణ పుష్పములు దందది చల్లె గిరీటిమీఁదఁ న**
**య్యుత్తరుపైఁ బ్రమోద కలనోత్కట సంమ సంభృతంబుగన్.**

ఈ వర్ణన యథామూలమైనదే.

తన్ను ప్రశంసించువారల, 'యొక్కుడు మాట కోరువక'

**కురుబలమున్ జయించుటయు గోవులఁ దెచ్చుటయున్ బృహన్నలా**
**స్ఫురిత భుజాబలంబునన చూవె నిజం బిది నాక యేల యె**
**వ్వరికిని నెవ్వరిం గెలువ వచ్చున యిట్టి సహాయసంపదం**
**బోరయక యున్న మీ కెఱుగఁ బోలునె నాబ్రదు కెట్టిభంగియో**

అని సారథ్య ప్రశంసా ప్రకారంబుగా, అర్జును బ్రశంసించెనని తిక్కన గల్పించెను. ఉత్తర కుమారునకు ఈ వాక్చాతుర్య మంతయు తిక్కన నేర్పినదే.[1]

ధర్మరాజు మొగము నందలి గంటి సూచిన పిమ్మట భీముఁడు కోపించును.

**అని చెప్పి గంటి సూపిన**
**ననిలతనూభవుఁడు గనలి యా దుష్టాత్మున్**
**దనయాదిబంధుయుతముగ**
**ననిచెద జముప్రోలి కనియో నంగము వొంగన్.**

మూలమున భీముని కోపము మిక్కిలి విస్తరించి యున్నది. తిక్కన భీముని కోపము నంతయు నొక్క పద్యములో సంక్షే పించెను.

ధర్మరాజు వారిని అనునయించుట తెలుగులో మనోజ్ఞముగ నున్నది.

**అనవుడు నాతఁడిట్టు లనఁ కర్రట యుంతకు ముంద రేమియున్**
**మనల నెఱుంగఁ దవ్విభునిమాటున బానికి దీర్చికొంటి మా**
**తని కొక యోగ్య సేత యుచితంబే యొఱింగెడునట్టు గాఁగం బో**
**యిన గనియున్ దురుద్ధతి వహించినఁ జాతముగాక పిమ్మటన్.**

ధర్మరాజుగారికి యీ వాక్చాతుర్యము తిక్కన ప్రసాదించి నదే. సంభాషణ చారిమ తిక్కన కవితా శిల్పమునకు వైలక్షణ్యము నాపాదించుచున్నది.

కంకుడే ధర్మరాజని తెలిసిన పిమ్మట విరాటుడు

---

1. ప్రహస్యమానస్తు జయేసత్తర
పుత్రో విరాటస్య న హృష్యతిష
సంభాష్యమానస్తు జయేన తేన
సో అర్జునేఃపాండవ మిక్షమాఽఽహ.

**ధరణియుఁ బట్టణంబు హయదంతిరథంబులు గోపులన్ భటో**
**త్కరము నమాత్యవర్గమును గాగల రాజ్య మితంద యేలు ని**
**ర్భరమున నేనుఁ బుత్రులను బంధులుఁ దమ్ములు గొల్చియుండెదం**
**గరిపురి కెత్తునట్టి పని గల్గిన నేపిన యంత సేసెదన్.**

**అన విని యుత్తరుండు దగ నజ్జనపాలకుతోడ నిల్లను నృన**
**కొక రాజ్యమమం గలదె నన్నును నిన్నును నిన్న మొన్న**
**ప్రరనితరసాధ్యశత్రువిజయంబునఁ గాచినయప్పు గల్లఁ జే**
**సినయది దక్క దాని ముఖ సెప్పఁగనేటికి నింత వింతగన్.**

మూలములోలేని ఈ సంభాషణ చారిమ యంతయు తిక్కన తెలుగున గల్పించినదే.

ఉత్తరాభిమన్యుల వివాహము, మూలమున మూడు శ్లోకము లతో ముగిసినది. తిక్కన, ఉత్తరాభిమన్యులకు అచ్చ తెలుగు పెండ్లిచేసి మిక్కిలి పెంచి వ్రాసెను. పెండ్లికూతురు, పెండ్లికొడుకు కు మధ్య తెర యెత్తుట, వధూవరులు తలంబ్రాలు పోసికొనుట, అల్లునకు విరాటుడు అరణము నిచ్చుట, మున్నగున వన్నియు ఆ పెండ్లిలోని తెలుగు దనమునకు మచ్చుతునకలు. నృత్యగీతాది వైచిత్ర్య మనోహర వారనారీజనంబులను గూడ ఆ వివాహ మహో త్సవమున తిక్కన చేర్చెను.

"మంగళ తూర్యంబులు సెలంగ నత్తెర యొత్తించిన"

**వీనులఁ దియ్య మెక్కమును విన్క బరస్పరరాగవృత్తిలో**
**మానినఁ జాచు వేడుకల నువ్విళూరేడు నెమ్మనంబు ల**
**చ్చొవ్వ నొక్క యింత సేపు నెడసొ చ్చుట కోర్వక యుండ నున్న య**
**మ్మానినియుం గుమారుండును మారవికారము లంకురింపఁగన్.**

తలంబ్రాలు వేసికొనుట వివాహ ఘట్టమున తెలుగుదేశము నందు సాక్షాత్కరించు రసవత్తట్టము.

**ఒండొరుల దోయిళుల నినుపొందఁ జేయు**
**నక్షత్రప్రకరంబు లన్యోన్యమస్త**
**కములఁ బోసిరి మందార కల్పలతలు**
**విఖులు గమియ నొండొంటిపైఁ గురియు నట్లు.**

విరాటపర్వము తిక్కన సంకల్పించిన "ప్రబంధ మండలి లో" మొదటి ప్రబంధము. "నానారసాభ్యుదయోల్లసియై" కావ్య మర్యాద ననుసరించి, కల్యాణాంతమైనది.

అభిమన్యు వివాహానంతరము, "దిన చతుష్టయానంతరము న" ధర్మరాజు విశాలరమణీయం బగు విరాటు కొలువు కూటమున సభ దీర్చెను. మూలమున ఆ సభలోనున్న వారిని గూర్చిన విపుల వర్ణన గలదు. తిక్కన తెలుగులో 'పరిణయ సమాగ తాఖిల ధరణీశులు' బలిసియుండ ధర్మరాజు కొలువు దీర్చెనని సంక్షే పించెను. శ్రీకృష్ణుడు, " ఎదిరి మతం బెఱుంగక యెట్టి కార్యంబు నిశ్చయింప నెరవగునే కావున నియ్యవసరంబునం దగిన మానిసి నందులకుఁ బుచ్చవలయుననని సూచించును. బలరాముఁడు శ్రీకృష్ణుఁడు చెప్పినట్లు తగిన రాయబారిని బంపవలెనని సూచించుచు, "అతని యందును గోరంతలేదని" దుర్యోధనుని సమర్థించును. మూలములో, బలరాముని దుర్యోధన పక్షపాతము సూచించు మాటలు, సవిస్తరమైనను తిక్కన తెలుగులో సంక్షే పించెను. మూలమున బలరాముడు దుర్యోధనుని అగ్గించుటయే గాక, అతని పక్షమునందున్న భీష్మ ద్రోణ కర్ణాది యోధుల బలపరా క్రమములను ప్రశంసించెను.

మూలమున బలరాముని మాటల నధిక్షేపించుచు సాత్యకి " భీమార్జునులకు రణమునందే మగలను బ్రతియె" అని కవలను ద్రౌపదేయులను వృష్ణివరులను ప్రశంసించును. తెలుగున తిక్కన,

> **ఈ మత్స్యపతి సహాయము**
> **గా మాకుం దీర్ప రాని కార్యము గలదే**
> **సామాద్యుపాయపరుడు**
> **ద్దామ భుజా బలయుతం డితండు కేవలుండే."**

అని సాత్యకి నోటఁ బలికించును, అందరిని పొగడి, అతిథేయుఁడైన విరాటుని వదలుట అనుచితమని తిక్కన పై కందపద్యమును అధికముగా జేర్చియుండును. "ఉచిత పరులైన నరపతులు తొలుతఁ జెప్పిన వారికి సహాయత్వంబుజేయం జాతురు. మనము వెసగల కాలరుల వేగంబ పుచ్చి శల్యకేకయధృష్టకేతు జరాసంధ తనయ ప్రభృతులైన భూపతులకు వారివారి బంధుమిత్ర జనంబు

లకు నెఱింగించి పుచ్చుట కార్యంబని" ద్రుపదుడు చెప్పెను. తెలుగులో ప్రభృతులైన భూపతులని తిక్కన ఆ రాజుల పట్టికను సంక్షేపించెను. మూలములో శక పల్లవ దరదాదులతో పాటు అనేక రాజుల విపుల వర్ణన గలదు.

దుర్యోధనుడు, పాండవుల జేరవచ్చుచున్న శల్యునకు మార్గ మధ్యమున గౌరవమర్యాదలు గల్పించెను.

**అరు దారుమేలుక ట్టాయితం బై చూడ**
**నొప్పారి తను పగుచప్పరములు**
**బర పైన చెలువంబు గరగరికయు దియ్యు**
**తెలినీరు గలిగిన దీర్ఘి కలును**
**బొడవైన మువ్వంచఁ బొలుచు నట్లుగ నేనుఁ**
**గులకు గుర్రములకుం గొట్టములును**
**ముందర బయలైన చందంబుఁ జతురాభి**
**మతమైన యాస్థాన మండపములు**

**బియ్యములును నేయుఁ బెరుగును గూరగా**
**యలును వంటకట్టియలును గడ్డి**
**కవణములును బెల్లుగా నొడఁగూర్చి ని**
**గూఢవృత్తిఁ దానుఁగూడ నడచె.**

మూలమున శల్యునకు దుర్యోధనుడు సమకూర్చిన మర్యాదలు అభివర్ణితమైనవి. అందు "త్రతత మాల్యాని మాంసాని భక్ష్యం పేయం చ సంస్కృతం" అని గలదు. తిక్కన మాంసమును వర్జించి, శల్యునకు దుర్యోధనునిచే తన కాలమునాటి బ్రాహ్మణ భోజనమునే పెట్టించెను. పిమ్మట శల్యుడు ధర్మరాజు కడకేగి,

**ఇమ్మహి యొల్లను నీ మది**
**యుమ్మలికకు జాల నొచ్చె నుర్వీవర నీ**
**విమ్మెయి నిప్ప డఖిల దురి**
**తమ్ములు గడచుటకు సమ్మద మ్మున బొదలెన్.**

అని యుచిత సంభాషణంబులు సేసి దుర్యోధనునకుఁ దా నిచ్చిన వరము వివరించెను.

మూలమున శల్యుని మాటలు సవిస్తరముగ నున్నవి. తిక్కన ఆ శ్లోకము లన్నింటిని, "అని యుచిత సంభాషణంబులు సేసి" అని ఒక్క ముక్కతో సంక్షేపించెను.

శల్యుడు ధర్మరాజునకు చెప్పిన వృత్రాసురగాథ, నహుషో పాఖ్యానము, మూలములో విపులముగ నున్నవి. తెలుగున తిక్కన సంక్షేపించెను. కట్టకడపట, యిట్లు సెప్పి శల్యుండు సభాసదులం గలయం గనుగొని—

**కౌరవనాథుఁ డా నహుషు కైవడి నాశము బొందు వాసవ**
**శ్రీరమణీయుఁడై జయము సేకొని ధర్మజుఁ డంబురాశి వే**
**లా రసనా సముజ్జ్వల విలాస మనోహర మేదినీ వధూ**
**సార సమగ్ర భోగముల సన్నుతి కెక్కెడు దానుఁ దమ్ములున్.**

అని ధర్మరాజు నూరడించును.

ఉద్యోగ పర్వమునందు, ముఖ్యముగా నెన్నదగినవి రెండు రాయబారములు. ధృతరాష్ట్రునికి దూతయై సంజయుడు పాండవుల కడ కేతెంచును. పాండవ దూతగా శ్రీకృష్ణుడు కౌరవులకడ కేగును. ఇందు శ్రీకృష్ణుని రాయబారము సంజయుని రాయబారముకంటె ఎక్కువ ప్రసిద్ధికెక్కినది. కాని ఈ రెండు సన్నివేశములను మూలమునందు మిక్కిలి మనోహరములుగ అభివర్ణితమైనవి. ఈ ఘట్టములను తిక్కన యథామూలముగనే తెనిగించెను, గాని పలుతావుల సంగ్రహించెను. కొన్నిచోట్ల, స్పష్ట ప్రతిపత్తి కొఱకు వ్యాఖ్యానప్రాయముగు వివరణలను, మఱికొన్ని చోట్ల పాత్రచిత్రణమునకు ఉన్మీలనము కల్పించు స్వకీయ కల్ప నలను జేర్చెను. కాని యీ స్వకీయ కల్పనములు విరాట పర్వ మునందువలె విస్తారములుగ గాక క్వాచిత్కములుగనే గోచ రించు చున్నవి. తెలుగు ఉద్యోగపర్వములో తిక్కన వాడిన కొన్ని సమాస ములు, నుడికారములు, బహుళాంధ్రోక్తిమయ ప్రపంచమున చిర స్మరణీయములై నిలిచినవి. సంస్కృత భారతమున గన్పింపవు.

<u>సంజయుని రాయబారము</u>

సంజయుని రాయబారము శ్రీకృష్ణుని రాయబారము నంతగ లోకప్రసిద్ధి నార్జించుకొనలేక పోయిననూ, అంతర్యమున నంత

కంటె క్లిష్టమైనది. సంజయుడు నిర్వహింపవలసి వచ్చిన భూమిక శ్రీకృష్ణుడు ధరించిన పాత్రకంటే కష్టతరమైనది. శ్రీకృష్ణుడు స్వచ్ఛందముగ రాయబారియైనాడు. తాను పాండవ దూతయైనను సర్వతంత్ర స్వతంత్రుడు. సూటిగ రాజ్యభాగము నడుగుట అతని యేకైక లక్ష్యము. అన్నిటికంటె తాను ధర్మపక్షము స్వీకరించితి నను ఆత్మప్రత్యయము అతనికి గలదు.

ఇక సంజయుని భూమిక మిక్కిలి దయనీయమైనది. అతనికి పాండవులపై మిక్కిలి గౌరవము గలదు. కాని తాను ధృతరాష్ట్రునికి దూతయై వెడలక తప్పినదిగాదు. వహింపవలసి వచ్చినది అధర్మపక్షము. అయినను శక్తివంచనలేకుండ సంజయుడు తన విధ్యుక్తధర్మమును నిర్వహించెను. ఏ మొగము పెట్టుకొని అతడు ధర్మరాజును జూడగలడు? ఏమని చెప్పగలడు? రాయబారులు తమ భావములను వ్యక్తము చేయుటకుగాక దాచు కొనుటకే భాష నుపయోగించెదరను సుభాషితము సంజయుని రాయ బారమున సార్థకమైనది. భారతమునందేగాక విశ్వసాహితీ జగత్తులో సంజయుని రాయబారము వంటి ఘట్టములు మృగ్యములని చెప్పవచ్చును. తిక్కన ఈ ఘట్టమును మూలమునందలి వన్నెకగ్గకుండ, అద్భుతముగ తీర్చిదిద్దెను.

**పాండు నరపాలసుత ఉపప్లావ్యమునకు**
**వచ్చియున్నారు నీ వేగి వాసుదేవ**
**సహితముగ వారిఁ గని తద్విషా ద మేమి**
**భంగి మాను నమ్మెయిఁ దగఁ బలుకవలయు.**

అని ధృతరాష్ట్రుడు సంజయుని కాదేశించును.

సంజయుని నెత్తిన బడినది, అధికారము లేనిబాధ్యత.

**నెయ్యము నాటించి కడుం**
**దియ్య మెసగ నలుక లెల్లఁ దీఱు నటులుగఁ**
**గయ్య మను తలఁపు లోనుగ**
**నయ్యమనందనుడు మానునట్టి తెఱగుగాన్.**

శాంతి ప్రకారంబునం గార్యంబు నడపి రమ్మని పంపును. అంతేగాని, అతడు పాండవులతో రాజ్యభాగము మాట మాత్ర మెత్తు

టకు వీలులేదు. అయినను సంజయుడు రాయబారియై ఆ అసిధారావ్రతమును మిక్కిలి సమర్థతతో నిర్వహించెను.

తిక్కన ధర్మరాజు పాత్రమున కున్మీలనము గల్పించెను. సంజయుని కుశల ప్రశ్నమునకు సంస్కృతమునగల సాధారణ సమాధానమునకు తిక్కన మొరుగు పెట్టి "ఆ రాజు కారుణ్యము కతమునను సుఖంబున నిట్లున్నారమను" ధర్మరాజు సమాధానముల తెలుగుదనముతోపాటు ఎత్తిపొడుపు గూడ గర్భితమై యున్నది.

అట్లే ధర్మరాజు కర్ణుని గూర్చి అడిగిన కుశల పరామర్శన ము సంస్కృతములో గంటె తెలుగులో ఎక్కువ ' ఘాటుగ ' నున్నది.

**దుర్యోధను నింటం దగు**
**కార్యమునకు ఖడ్గమునకు గలవాడై చా**
**తుర్యంబు మొఱయు కర్ణుని**
**యార్యత్వము సెల్లుచున్న యదియే నెమ్మిన్.**

మూలమున ధర్మరాజు యుయుత్సుడు మున్నగువారు యోగక్షేమములచే బేరుపేరున అడుగును. తిక్కన కొన్నిటిని వదలి సంక్షేపించెను. సమాధానముగ సంజయుడు,

**ధృతరాష్ట్రభూపతికి వృ**
**ద్ధతకతమునఁ జిత్త మొకవిధముగామి సుతో**
**ద్ధతి మాన్పఁడ నాడు మనః**
**క్షతి పిదపం బుట్టి యిపుడు శాంతుండయ్యెన్.**
**ఇట్టి చందంబు లెల్లను నీవు పుణ్య**
**చిత్తవృత్తిమై సైచిన జెల్లవచ్చు**
**నీయజాతశత్రుత్వంబు నిఖిలలోక**
**విశ్రుతము గాదె ధర్మప్రవీణహృదయ.**

అని పలుకును.

కౌరవులు సగపాలొసంగక పోయిననూ అజాతశత్రువు గనుక ధర్మరాజు సైరణ చేయవలసినదే!

అంతేగాక

**మడుగుఁ జీరయందు మసి దాకినట్లు మీ**
**సత్కులమునఁ గల్మషంబు గోర**
**వేంద్రుకతనఁ బొందె నింతయుం బాపంగ**
**నీవ నేర్తు కార్యనిపుణహృదయ.**

అని సంజయుండు ధర్మరాజును లాలించును.

**ద్రోణుడు భీష్ముడుం గృపుడు ద్రోణసుతుండును గర్ణశల్యులుం**
**బ్రాణము లా సుయోధనుని పాలిన యంత్రు నిజానుజన్మ ల**
**క్షీణపరాక్రముల్ సుతు లజేయులు బాహ్లిక సోమదత్తు లా**
**స్థానున కైన నోడరు వశంబె జయింపగ వారి నేరికిన్.**

అని హెచ్చరించును. ఇందంతర్గర్భితముగా నున్న బెదిరింపును గుర్తింపకపోలేదు.

**నెయ్యము దప్ప నెం డొకటి నీ చెవి సోకెనె నాదుపల్కు లం**
**దియ్యెడ సంజయా యనికి నిమ్మెయి నల్కెదు నీవు మాకు దా**
**గయ్యము దక్కి మన్కి తగు కార్యము గాదొకొ పోరితంబు లే**
**కయ్యెడు నర్థసిద్ధి వెడగైనను నొల్లక యొందు సేయునే.**

అని ధర్మరాజు మెత్తగఁ బల్కె.

**ఎదిరించి తమ యట్టుల కా**
**మది దలచినఁ బోసగుగాక మాకుం గుడు మిం**
**దిదె మీరు ప్రక్క గొనుడని**
**చదు రడిచిన మనసు పొందు చక్కంబడునే.**

అని సమాధానము చెప్పెను. మాట నేర్పున సంజయునకుం దీసిపోలేదు ధర్మరాజు. అంతేగాక, అంతర్గర్భితమగు సంజయు బెదిరింపునకు సరియైన సమాధానము చెప్పకుండ విడువలేదు ధర్మరాజు.

**మును మమ్ముఁ బొగడి పదపడి**
**యని వారల గెలువ నరిది యని పొత్తుగఁ జె**

**ప్పిన మాటకు నే నొడఁబడ**
**వినుఁ సంజయ పక్షపాత వృత్తి విడువుమీ.**

**రణమున వారలఁ గెలువ రాదన పల్కులటుండ నిమ్మఁస**
**ద్గుణుఁడవు నీవు వచ్చితి ప్రకోపశమంబుగ బల్కి తింక సై**
**రణ దగఁ జేయువారము పరాభవ మొందియు మున్ను వారి దు**
**ర్గుణములు సైచు దీవు నొక కొంత యొఱుంగుదు వింత యేటికిన్.**

అని ఖండితముగఁ జెప్పి వేయును.

అయినను సంజయుడు తన వాక్చాతుర్యమును తిరిగి ప్రయోగింపక పోలేదు.

**నావిని సంజయుండు నరనాథున కిట్లను నెట్టి తప్పులున్**
**బోవఁగఁ ద్రోచి తాలిమియు పూనుదు గావున నన్నిమాట లి**
**ట్లీవు వినంగ నాడియును నే దనివోవక విన్నవించెదన్**
**నీ విభవం బహింసయు ననింద్యచరిత్రమ కాక యన్యమే.**

అని సంజయుండు ధర్మరాజు అహింసా వ్రతము నుగ్గడువుగ నుగ్గడించు వ్యాజమున స్వార్థమును సాధింపఁ జూచును. అంతేగాక, కౌరవులు "పాలీక దుశ్శీలత్ జెడ దలచిరేని" "రుధిరాభిలాన్నము నకంటె భిక్షాన్నమే మేలని" గూడ ఉచితముగ ఉపదేశము సల్పెను. తిక్కన తెలుగున రుధిరాభిలాన్నముకంటె భిక్షాన్నము మేలని సంజయుని నోట సుకుమారముగ బలికించెను గాని మూలమున "మహాస్రావం జీవితం చాప్య నిత్యం" "అల్ప కాలం జీవితం యన్నను స్యే మహాస్రావం నిత్య దుఃఖం చలం చ" "భిక్షా చర్యమంధక వృష్టిరాజ్యే శ్రేయో మన్యే నతు యుద్ధేన రాజ్యం" అని వేదాంతము బోధించుటయే గాక, ఆ భిక్షాటనము గూడ కౌరవ రాజ్యమున గాక అంధకవృష్టి రాజ్యముల సలుపు మని చెప్పెను.

కౌరవులు ఆ అజాతశత్రునకు బిచ్చము వేయకపోయిననూ, అప్పులు గనుక అంధకవృష్టి రాజులు ఆ మాత్రము సాయము చేయకపోరు గద. ఉచితముగ సలహాలు నొసంగుటలో సంజయునిదే అందవేసిన చేయి.

సమాధానముగ ధర్మరాజు "నీ చెప్పెడి ధర్మంబులు గౌరవులకం జెప్పవలవదా? అని యెదురు ప్రశ్నవేసి సంజయుడు నోరెత్తకుండ జేసెను.

సంజయుని రాయబారము యొక్క సారాంశము శుష్క ప్రియములు శూన్యహస్తములు. ధర్మరాజు, సంజయుని మాటలలో ననే చెప్పవలెననిన "మెత్తని పులి". మూలములో లేని యీ ఉపమా నము తిక్కన ధర్మరాజు పాత్రమున నెట్లు తీర్చి దిద్దెనో స్వయం వ్యక్తము చేయుచున్నది. చివరకు అర్జునుడు సంజయునితో —

**బాలసఖుండవు నాకును**
**నీ లెస్సదనంబు నేము నీతి విడిచి దు**
**శ్శీలుర మగుటయు శైశవ**
**లీల మొదలు గాగ మును దెలియదే నీకున్.**

అని పలికి ధర్మతనయానుమతంబున సంజయునకు సపరివారం బుగ సముచిత ప్రకారంబున మజ్జన భోజనంబు లొనరించి మాల్యాను లేపనాద్యుపచారంబులు సేయించి మణిభూషణ చిత్రాంబరంబు లొసంగి వీడుకొల్పిన నతండును బాంధవులను వాసుదేవుని వీడ్కొని చనియె.

సంజయునకు మజ్జనభోజనంబులు మణిభూషణ చిత్రాంబ ర ప్రదాన మర్యాదలు సలుపుట సంస్కృత భారతమున లేవు. ఈ మర్యాద లన్నియు సంజయునకు తెలుగు భారతమున జరిగినవే.

సంజయుడు పాండవుల కడనుండి ధృతరాష్ట్రుని జేరి జరిగిన దంతయు నివేదించును.

**వారెల్లను భవదీయ**
**స్ఫారబలము గారణముగ సౌఖ్యంబున ను**
**న్నార మని పలుకుదురు నిజ**
**మారయగా నట్ల కాదె యది జననాథా.**

ధర్మరాజు పలుకులలోని ఎత్తిపొడుపు సంజయుని మనస్సున బాగుగ నాటుకొనినది. మఱియు

**వినుము యుధిష్ఠిరు సైరణ**
**మనవారలు వెఱపుగా సమర్థింతురు డీ**

**కొనఁగాఁ దగ రని వాసినఁ**
**గని యోటమి వెట్టినట్లు కౌరవనాథా.**

**అనుజులకు నడ్డపడి యే**
**మిని జేయఁగ నీమిఁ జూచి మెచ్చితిగఁ కీ**
**వును సాధు రేగెనేని**
**న్నీను తలపాలముననె కాని నిలువదు సుమ్మీ.**

అని చెప్పి, "ధర్మసూతి మెత్తని పులి" అని సూత్రప్రాయముగా చెప్పెను. పై రెండు పద్యములకు— "మెత్తని పులి" అను పద గుంఫనమునకు సంస్కృత భారతమున మాతృకలు లేవు.

మఱునాడు సంజయుడు సవిస్తరముగ ధృతరాష్ట్రునకు నిండు పేరోలగమున తన రాయబారమును వివరించును. సంజయుడు మొదట వాసుదేవార్జునుల గాంచును.

**తానును సత్యభామయును ద్రౌపదియున్ నరుడున్ రహస్యగో**
**ష్ఠి నిరతాత్ములై సుతులుఁజేరని చెందని యట్టి చోటఁ గాం**
**తా నివహంబు గొల్వఁ బ్రమదస్థితి నుండియుఁ బిల్వఁ బంచెన**
**న్నా నలినోదరుండు హృదయంబున నీదెస కూర్మి యెట్టిదో.**

అట్టి స్థితిలో గూడ సంజయునకు శ్రీకృష్ణార్జునుల యొద్దకు ప్రవేశము లభించినది.

సంస్కృత భారతమున రాయబారి యగు సంజయుడు ధర్మరాజును గాంచినట్లున్నది. కాని ధృతరాష్ట్రునితో నచటి వృత్తాంతము చెప్పు పట్టున కృష్ణార్జునులను గాంచినట్లున్నది. ఈ వ్యత్యాసమును పరిహరించుటకు తిక్కన తెలుగు భారతమున మొదట సంజయుడు, 'ఉపప్లావ్యంబు సొచ్చి మాధవు మంది రంబున కరిగి... మఱునాడు ధర్మతనయు నొడ్డోలగంబున్న సమయంబు వేచి సముచితంబుగా నతనిం' గనెనని చేర్చెను.[1]

సంజయుడు శ్రీకృష్ణుని మాటలుగఁ జెప్పిన

**"అయ్యజాత శత్రుఁ డలుగుట నీళ్ళుల**
**నగ్ని పుట్టినట్టి దయ్యె మీకు**
**నార్ప వెరవు లేదు నెప్పుమై నింకగా**

**వింపలయు పనులు వినుఁడు మీరు."**

అను పద్యమునకును మాతృక లేదు.

ఉద్యోగ పర్వమునకు విశిష్టత చేకూర్చు ఘట్టములలో విదురనీతి యొకటి. మూలమునందలి వన్నె దరుగకుండ తిక్కన విదురనీతిని తెనుగున ననువదించెను. మూలమునందలి శ్లోకముల అలతి అలతి మాటల కాహళ సంధించిన విధమున తేట తెలుగు నుడికారములతో తిక్కన కందపద్యములలో నను వదించెను. అందుచే విదురనీతి పద్యములలో తెలుగు దనము కరడుగట్టినది. ఇవి ప్రకరణానుబద్ధములు గాక పృథక్ ప్రయో గార్హములగుటచే తెలుగుదేశమున విరివిగ ప్రచారమునంది జన రంజకములైనవి. నిరతిశయ స్వాభిమాన ధురంధరుడైన కవి చౌడప్ప తిక్కన కందపద్య ప్రఖ్యాతిని పేర్కొనక తప్పినదిగాదు. రాయబారిగా పాండవుల పాలి కరిగి వచ్చిన సంజయుడు " చాల దూఱి రేపచ్చటి విశేషములు చెప్పవాడ" ని చనియెను. ధృతరాష్ట్రున కారేయి నిదుర రాలేదు. విదురుని పిలిపించి అతని హితోపదేశము నర్థించును. విదురుడు చెప్పిన మాటలు, మానవ జీవిత క్షీరసాగరమును మథించి మథించి సాధించిన అమూల్య రత్నములు.

అవి భారతమునకే గాక, భారతీయ సాహిత్యమునకును వెలలేని గౌరవము నొసంగుచున్నవి. వానిని తిక్కన తెలుగు దనముతో తొణికిసలాడు చక్కని చిక్కని కందపద్యములలో నను వదించెను.

**బలవంతుఁడు పై నెత్తిన**
**బలహీనుఁడు ధనము గోలుపడిన యతడు ప్రము**
**చ్చిల వేచువాఁడు గామా**
**కులచిత్తుఁడు నిద్ర లేక కుందుదు రధిపా.**

**కోపము నుబ్బును గర్వము**
**నాపోవక యునికియును దురభిమానము ని**
**ర్వ్యాపారత్వము నను నివి**
**కాపురుషగుణంబు లండ్రు కౌరవనాథా.**

---

1. ఉద్యోగపర్వము ౧వ ఆశ్వా. ౨౭౨ గద్యము తిక్కన అధికముగఁ జేర్చినదే.

**ధనమును విద్యయు వంశం**
**బును దుర్మతులకు మదంబుఁ బొనరించును స**
**జ్జనులైన వారి కడకువ**
**యును వినయము నివియ తెచ్చు నుర్వీనాథా.**
**క్షమియించు వారిఁ గని దా**
**లమి వెట్టుదు రైననుం  దలంప ననూన**
**క్షమయ కడు మెరయు తొడవు**
**త్తమ రూపము గొరువారు దాల్తురు దానిన్.**
**చెల్లియుండియు సైరణ సేయునతఁడు**
**బేదవడియును నర్థికి బ్రియముతోడఁ**
**దనకుఁ గలభంగి నిచ్చునతండు బుణ్య**
**పురుష లని చెప్పి రార్యులు కురువరేణ్య.**

ఇట్టి పద్యములు తెలుగు వారికి ఆబాల్యపరిచితములు.

**య యీ ర్ష్యం పర విత్తేషు రూపే వీర్యేకులాన్వయే**
**సుఖ సౌభాగ్యసత్కారే తస్య వ్యాధిరనంతకః**

అను శ్లోకమును

**పరుల ధనమునకు విద్యా**
**పరిణతికిం దేజమునకు బలమునకు మనం**
**బెరియగ నసహ్యపడు న**
**న్నరుడు దెప్పులు లేని వేదనం బడు నధిపా.**

అని తిక్కన అనువదించెను.

విదురనీతి మూలమున విస్తరించియున్నది. అందు మహోదారభావము లనేకము లిమిడి యున్నవి. అయినను తిక్కన సంగ్రహించి అనువదించి అనేక మూల శ్లోకములను అనువదింపకుండ వదలి వేసెను.

ఉద్యోగ పర్వమున విదురనీతి వెనువెంటనే సనత్సుజాతీయము కలదు. తిక్కన దానిని తెనిగింపక వదలి పెట్టెను. సనత్సుజాతుండు అధ్యాత్మ విషయములగు వివిధ వాక్యంబుల సోపాన ప్రకారంబున నంతకంతకు సూక్ష్మంబులగు నర్థంబులు సమర్థిం

చుచు నందు బ్రహ్మచక్షుండెయ్యది యేర్పడ నడిగే నది యెల్ల వివరించుచు హృదయ పుష్కర కలితంబగు పరతత్త్వంబు ప్రసాదించునట్టి గూఢోక్తులను గ్రహించుచుండ నెట్టకేలకు బ్రభాతంబగుటయు ధృతరాష్ట్ర విదురుల నామంత్రణంబు సేసి యద్దేవముని యంతర్ధానంబు నొందె."

అని తిక్కన ఒక్క వాక్యములో సనత్సుజాతీయమును సంగ్రహించెను.[1]

"మూలమున వ్యతీయామ శర్వరీ" అను ఒక్క ముక్క పురస్కరించుకొని తిక్కన తెలుగులో ప్రాతఃకాల వర్ణనము నధికముగఁ జేర్చెను.

**తనకులంబునఁ బుట్టిన ధార్తరాష్ట్రు**
**లన్నదమ్ములతో విగ్రహంబు గొనుట**
**కుమ్మలించి వివర్ణత నొందినట్లు**
**గంది యెంతయుఁ జెలు వేదఁ జందురుండు.**

**ఊర్వీధరంబుల వొప్పెడుజేవురు**
  **జరులకాంతికి నును మొరుగు వెట్టి**
**ధరణీజ గుల్మ లతా వితానము పల్ల**
  **వములకు గట్టెర్ర వన్నె యొసఁగి**
**యరుణాంబుజంబుల యంతర్దళంబుల**
  **తళ తళ యను జిగి దళముకొల్పి**
**చక్రవాకద్వయసంతతి యొఱకల**
  **కొమరారు కెంజాయఁ గ్రొత్త సేసి**

**తనదు బాలబింబ మనుపమేయ ప్రభా**
**పటల జటిలగగనభాగ మగుచు**
**నుల్లసిల్లి జగము లెల్లను విలసిల్ల**
**బూర్వశిఖరిమీదఁ బొడిచె నినుడు.**

1. మూలమున ౫ ఆశ్వాసములు సుమారు రెండువందల శ్లోకములు గలవు.

మున్నగు వర్ణనములు ప్రబంధోదయమునకు దారి చేసినవి.

శ్రీకృష్ణుని రాయబారము

ఉద్యోగపర్వమున జనరంజకమైన ఘట్టము శ్రీకృష్ణుని రాయబారము. తిక్కన మంత్రియై రాయబారము లనేకములు నడపిన సిద్ధహస్తుడు. శ్రీకృష్ణుని రాయబారమును రచించుటకు ఉత్తమోత్తమ మాధికారి. ఈ ఘట్టమును తిక్కన మూలమునందలి వన్నె తగ్గకుండ అనువదించుటయే గాక, యెడనెడ పాత్రచిత్రణ మున మెఱుంగులు దిద్దెను. ఈ ఘట్టమునందును తిక్కన సంక్షే పించిన తావులు గలవు. మూలములోని మూడు నాలుగు శ్లోకములకు, స్వేచ్ఛానువాద ప్రాయమైన ఒక కందపద్యముతో సరిపెట్టుటకద్దు. తిక్కన అదనముగా చేర్చినవి మిక్కిలి తక్కువ. "అల్పాక్షరముల అనల్పార్థరచనకు" తిక్కన శ్రీకృష్ణుని రాయబార మును ఉదాహరణప్రాయముగ నెన్నవచ్చును. మూలములో లేకపోయినను తిక్కన ప్రయోగించిన కొన్ని సమాసములు గంభీర భావ నిర్భరములు.

ధర్మరాజు, భ్రాతృ పరిజన సహితుండై మాధవు మందిరము న కరిగి అతని రాయబారిగ కౌరవ సభ కరుగ ప్రార్థించుచు చెప్పిన తొలి పద్యము తెలుగుదేశమున సుప్రసిద్ధము.

**ఆపద గడవం బెట్టఁగ**
**నోపి శుభంబైన దాని నొడఁగూర్పను మా**
**కి పుట్టువునకుఁ బాండు**
**క్ష్మాపాలుడు నిన్నుఁ జూపి చనియె మహాత్మా.**

ఈ కందపద్యము తిక్కన కవితాశిల్పమునకు నికషోపలము. అలతి అలతి మాటలతో కాహళ సంధించినట్లు తెలుగుదనము తొణికిసలాడు కందపద్యమున తిక్కన ఆత్మీయతాముద్ర జీవనాడివలె స్పందించుచున్నది.

పాండుక్ష్మాపాలుడు పాండవులను శ్రీకృష్ణున కప్పగించి చనియెనట. ఈ భావము మూలములో లేదు. తెలుగు ధర్మరాజులో కన్పించు ఆర్ద్రత, వాక్చాతుర్యము తిక్కన తీర్చిదిద్దినదే.[1]

పిమ్మట మూలమున ధర్మరాజు చెప్పిన మాటలను తిక్కన తెనుగులో సంక్షేపించెను. మూలమున ధర్మరాజు యుద్ధ విముఖత్వము మఱింత ప్రస్ఫుటముగనున్నది.
ధర్మరాజు హృదయవేదన నంతను తెనుంగున ఒక పద్యములో తిక్కన సంగ్రహించెను.

**అక్కట లాతు లైన బగఱైనను జంపన కోర నేల యొం**
**డొక్క తెరంగు లేదె యది యొప్పదె బంధుసుహృజ్జనంబు లా**
**దిక్కున మన్నవారు గణుతింపక సంపదకై వధించి దూ**
**ఱెక్కుటదోషమందుటను నీ దురవస్థల కోర్వవచ్చునే.**

చివరకు ధర్మరాజు స్వార్థపరితుండై శ్రీకృష్ణుని ఒంటరిగ కౌరవ సభ కంపించుట యుక్తము గాదని సంకటపడును.

**నీవు సుయోధను పాలికి**
**బోవఁగ వల దనియు నొక్క బుద్ధి వొడమెడున్**
**గోవింద యతడు మంత్రులుఁ**
**గావరములు చక్క వినరు కార్యవచనముల్.**

**కుటిలమతు లవినీతులు క్రూరకర్మ**
**లట్టి నీచుల కడకు నిన్నను పజాల**
**నీవు సంకటపడియెడు దేవపదవి**
**యైన నే నొల్ల నొంటి యందరుగ టుడుగు.**

---

1. జయం సకలస్సం ప్రాప్తో మిత్రార్థే హి జనార్దన
నచ త్వదన్యం పశ్యామి యో న ఆపత్సుతారయేత్
త్వాం హి మాధవ మా శ్రిత్యాపా నిర్భయా మోహదర్పితం
ధార్తరాష్ట్రం సహామాత్యం స్వమంశ మను యుధ్యమ్ హే
యుధాహి సర్వాస్వాతత్సు పాసి వృష్ణినరిందమ
తథాతే పాండవా రక్ష్యాః పాహ్యస్మాన్ మహతోభయాత్.

"నీవు సంకట పడియెడు దేవపదవి యైన నే నొల్ల నొంటి యందరుగుటుడుగు మని " ధర్మరాజుచే తిక్కన పల్కించి యతని పాత్రమునకు గల్పించిన యున్మీలనము ఆరయ దగినది.

శ్రీకృష్ణుడు చెప్పిన సమాధానము గూఢ ధర్మరాజు ఉదాత్త తకు తగినట్లున్నది.

**అనవుడు గృష్ణుఁ డిట్లనియె నా ధృతరాష్ట్రుడు నట్టివాడ**
**త్త నయుండ యేల నీ పలుకు తథ్యము నీతలంపే నెఱింగితిన్**
**మనమున శంక దక్కు ము వినన్ వలతె విను మేను నిక్కమ**
**ల్గిన నచటం గలండె రణ కేళికి మార్కొన నొక్కడేనియున్.**

చివరకు ధర్మరాజు సమీక్ష అతని తొలిపలుకుల కెనయైనదే.[1]

**మ మ్మె రుగు దెదిరి నెరుగుదు**
**నెమ్మి యెరుగు ధర్మసిద్ధి నెరి యొరుగుదు వా**
**క్యమ్ముల పద్ధతి నెఱుగుదు**
**పొ మ్మెవ్వడ నేను నీకు బుద్ధులు సెప్పన్.**

మూలమున గల ౫ శ్లోకములను తిక్కన ఒక కంద పద్యము లో చక్కగ సంక్షేపించెను.

తరువాత భీముడును శ్రీకృష్ణునితో సంధి సలుప వేడును.

**అని యెవ్విధమున నైనను**
**వనజోదర సంధి సేయ వలయుం దగ నే**
**మును వారును గలయుట భూ**
**జనులకు నెల్లను హితంబు సౌఖ్యకరంబున్.**

**అనుటయుండ బిన్ననవ్వు నగి యంబుజనాభుండు పల్కు నెన్నడున్**
**విననివి భీము పాల గడు వింతలు వింటిమి మాట లగ్గి స**
**ల్ల నగుట భూరిభూధరము లాఘవ మొందుట గాదె యివ్విధం**
**బున నిత డిష్టు మార్దవము బొందుట యిం కిట సెప్ప నేటికిన్.**

మూలమున శ్రీకృష్ణుడు పలికిన పై మాట లన్నియు వైశంపాయను డన్నట్లే యున్నవి.

---

1. యుధిష్ఠిరః
అస్మాన్ వేత్త పదాన్ వేత్థ వేత్థార్థాన్ వేత్థ భాషితం
యద్యాదస్మాద్ధితం కృష్ణ తత్తద్వాచ్య సుయోధనః

భీమసేనుని పురికొల్పుటకు మూలమున విస్తారముగ నున్న శ్రీకృష్ణుని వాక్యములను తిక్కన ఒక్క పద్యములో సంక్షేపించెను.

**యుద్ధముమీఁది వేడ్కయు మహోగ్రవిరోధుల నల్లఁ జేయుద**
**రొద్ధతియున్ సుయోధనుని యున్నతి సైపని యేపు రాజ్యసం**
**సిద్ధి నిజాగ్రజన్మునకుఁ జేయు తలంపును గల్గు నీ వసం**
**బద్ధములైన వాక్యములు వల్కుటయొప్పునె కీచకాంతకా.**

మూలమున శ్రీకృష్ణుని వాక్యములు సుమారు ఇరువది శ్లోకములు. ఒక అధ్యాయము. ఇందలి కీచకాంతకా యను సమ్యక్సంబోధనము, తరువాత

**వేఱు పెట్టిదియో యెన్నడు**
**నెఱుగని నీ యట్టివాని కెవ్వరొకో యా**
**పిరికితన మింత యలవడఁ**
**గరపిన వా రనుచు శౌరి కలకల నవ్వెన్.**

అను పద్యము, శౌరి కలకల నవ్వుట, తిక్కన అదనముగఁ జేర్చినదే.

అట్లే తిక్కన అర్జున నకుల సహదేవుల వాక్యములను సంక్షేపించెను.

ద్రౌపది శ్రీకృష్ణునితో దను మున్ను పడిన భంగపాట్లు సెప్పుట భారతమునందలి హృదయ విదారక ఘట్టములలో నొకటి. మూలమున "అశ్రు పూర్ణేక్షణా వాక్యం ఉవాచేదం మనస్వినీ" అను శ్లోక ఖండికను తిక్కన—

**ధర్మనందను పలుకులు దనకు హృదయ**
**తాప మొనరింప మోమున దైన్య మొంద**
**నున్న పాంచాలి యిట్లని యొయ్యఁ బలికెఁ**
**గనలి శౌరితో గద్గద కంఠి యగుచు.**

అని ప్రవర్తించెను.

**అంతట సేసి పో నడిచి యక్కట సంజయుచేతం జెప్పి పు**
**త్తెంతు రె యిట్టియురట మదిం ప్రియమంది యుధిష్ఠిరుండు దా**
**నంతన యూళు లేవురకు నైదు సుయోధను దిచ్చునొక్కొయీ**
**కంత కృపావిహీనమతి నాతడు నేచునె యన్నదమ్ములన్.**

"ఈ కంత కృపావిహీనమతి నాతడు నొంచునె యన్న దమ్ములన్" అని తెలుగున గల ఎగతాళి మూలములో లేదు. అట్లే

**ఓట మొకింత యేనియు సుయోధను చిత్తమునందు లేదు నీ**
**మాటలఁ బోవునే దురభిమానము యొక్కడు పూనుఁగాక య**
**చ్చోటన సంగరంబులగు చెప్పులు వుట్టిన నైనఁ బాండవుల్**
**పోటున కిచ్చగింతురొకొ పోదురొ కానల నుండ నచ్యుతా.**

అసలు, దుర్యోధనుడు యుద్ధమునకే సిద్ధమైనను, పాండవులు "పోటున కిచ్చగింతురొకొ పోదురొ కానల నుండ" ముందు తెలిసికొనిన పిమ్మటనే సంధికి బొమ్మని ద్రౌపది నిశిత ముగఁ బల్కిన మాటయు మూలమునందు లేదు. తిక్కన ద్రౌపది పాత్రకు కల్పించిన ఉన్మీలనరేఖలలో నిది యొకటి అంతటితో నాగక

**ద్రౌపది బంధురం బయిన క్రొమ్ముడి గ్రమ్మన విడ్చి వెంద్రు కల్**
**దా వలచేతఁ బూని యసితచ్ఛవి బొల్చు మహాభుజంగమో నా**
**విలసిల్లి వ్రేలగ మనంబునఁ బొంగు విషాద రోషమల్**
**గావఁగ లేక బాష్పములు గ్రమ్మఁగ దిగ్గన లేచి యార్తయై.**

గోవిందు ముందటం బెట్టి యిట్లనియె.

**ఇవి దుస్స సేను వ్రేళ్ళం**
**దవిలి సగము ద్రెవ్వి పోయి దక్కినయవి కౌ**
**రవులకడ దీరు మాటల**
**యవసరమునఁ దలఁపవలయు నచ్యుత వీనిన్.**

హృదయంగమమైన పై వర్ణనమునకు మాతృక సంస్కృత భారతమున గలదు.[1]
పిమ్మట ద్రౌపది—

---

1. వైశంపాయనః

ఇత్యుక్త్వా మృదుసంహారం అంచితాగ్రం సుదర్శనం
సునీల మసితాపాంగి సర్వ గంధాధి వాసితం
సర్వలక్షణ సంపన్నం మహాభుజగ వర్చనం
కేశపక్షం వరారోహా గృహ్య సవ్యేనపాణి నా
పద్మాక్షి పుండరీకాక్షం ఉపేత్య గజగామిని
ఆశుపూర్ణేక్షతౌ కృష్ణా కృష్ణం వచస మబ్రవీత్.

**నెట్టన యట్టియల్క మది నిల్పితి రక్కె సతాల్మి జిచ్చో డిం**
**గట్టినయట్లు పెద్దయును గాలము దీనికి నాఁరు టెన్నడుం**
**బుట్టదు దుష్ట నిగ్రహము పూని జగంబులు గాచునట్టితో**
**బుట్టువు నీవు దేజమునఁ బోల్చిన భర్తలుఁ గల్గ నచ్యుతా.**

"చిచ్చొడిం గట్టినయట్లు"[2] "రక్కెస తాల్మి " అనునవి తిక్కన క్రొత్తగఁ జేర్చినవే.

శ్రీకృష్ణుడు ధృతరాష్ట్రుని మందిరమునకుఁ బోవునపుడు "రాజ మార్గంబున నరుగు నవసరంబున మౌక్తిక మిళితంబులు బహుగంధ లుళితంబులు నగు నక్షత ప్రకరంబులును బుష్పనికరంబులునుం జల్లుచు సంతసిల్లుచు మ్రొక్కుచు జోక్కుచు నిరుగెలంకుల రమ్య హర్మ్యంబులపైఁ నిలిచి పాలిచి కనుంగొను నంగనా జనంబులు తమలోన

**ప్రాణంబుతోఁ గూడ రక్కసి చన్నుల**
   **పాలు ద్రావిన ప్రౌఢ బాలుఁ డితఁడె**
**వేల్మిడిఁ జాణూరు విఱిచి లోకముల మె**
   **చ్చించిన యా జగజెట్టి యితఁడె**
**దుర్వృత్తుఁడగు కంసు దునిమి యాతని తండ్రి**
   **బట్టంబు గట్టిన ప్రభు వితండె**
**సత్యభామకు బారిజాతంబుపైఁ గల**
   **కోర్కి దీర్చిన రసికుం డితండె**

**వెన్నలును గోపికా చిత్తవృత్తములును**
**నరసి ప్రుచ్చల నేర్చిన హరి యితండె**
**శుతిశిరోభాగముల దన సుభగచరణ**
**సరసిజా మోదమును గూర్చు చతురుఁ డితండె.**

అని సంభావించి రట.

ఈ వర్ణన మూలమున లేదు.[1]

ధృతరాష్ట్రుడు శ్రీకృష్ణునకు సల్పిన అతిథి మర్యాదలలో తెలుగులో గల అర్ఘ్యపాద్యమధుపర్కా ద్యుపచారములతో పాటు,

1.మూలమున
నిధాయ హృదయే మన్యుం ప్రదీప్త మివ పావకం - అని యున్నది.
2. ఈ సీస పద్యము తరువాతి కవులెందరో అనుకరించిరి.

సంస్కృతమున గోవుల నిచ్చినట్లున్నది. శ్రీకృష్ణుడు ధృతరాష్ట్రు పనుపునం దెచ్చి పెట్టిన యున్నత కనకాసనంబున నాసీనుం డయ్యె. సరనాథుండును దొరలును నిజోచితాసనంబుల నుండిరి.

కొలువెల్లను సూర్యోదయ సమయంబునఁ గమలాకరంబు విధంబున వికసించియుండె. మూలములో లేని యీ యుపమాన ము, కృష్ణుడు 'ధర్మనందను వచనంబులుగా నాంబికేయునకుం దగు వారలకుం బ్రణామ  పరిరంభ ప్రముఖ సముచిత సంభా వనంబులు వలుకుట' తిక్కన క్రొత్తగఁ జేర్చినవే.

పిమ్మట శ్రీకృష్ణుడు విదురుని సదనమున విడిసెను. అప్పు డాతడు అచ్చటనే యున్న కుంతీదేవిని కలినికొనును. ఆ ఘట్టము మూలములో సవిస్తరముగ గలదు. తిక్కన మూలమునే అను సరించినను, కుంతి పాత్రమునకు మెఱుగులు దిద్ది, ఆమె మాతృ హృదయమును హృదయంగమముగ వర్ణించెను.

కుంతిదేవి కొడుకులను జూచి పదమూడేండ్లయినది. ఆమెయు నతని తోడు నీడయుంబోని తన కొడుకులం దలంచి, యడలు పుట్టిన నమ్మాధవు మెడపట్టుకొని యేలుంగెత్తి యేడ్చినది. పాండవులు "నిర్జనంబైన కానలోనన యొట్లు నిలిచిరి. ఏను వడ్డింపంగ నింపార గుడిచి మెత్తని శయ్య నిదించినవారు, కంద మూల ములాహారములుగఁ బోదలఁ బుట్టల పడి" రని కుంతి వాపోవును.

మూలమున "మయా సతత లాలితాః" అని గలదు. తెలుగు న కుంతి తన బిడ్డలకు అన్నము వడ్డించుట తలపోసినది. మూలమున 'సింహవ్యాఘ్ర గజాకులమైన కాననముకంటె నిర్జన కాననమే యెక్కువ భయంకరముగఁ బొడగట్టినది. లేని తండ్రి లేనే లేదు. ఉన్నతల్లికి గూడ దూరము కావలసివచ్చినది పాండవులు. "తండ్రి లేని ప్రజలు తల్లిని బాసి పెద్దయును గాల మివ్వ్యధమున భంగపాటు పడిరి." అని కుంతీదేవి వాపోవును.

మూలమున కుంతీదేవి అందరి కుశలమును పేరు పేరున సవిస్తరముగ నడుగును. తిక్కన తెలుగులో కుశల ప్రశ్న పరంపరలను ఒక్క పద్యములో సంక్షేపించెను.

**దానదయాపరుం డయిన ధర్మతనూభవు సేమ మెట్లు పం**
**చాననవిక్రమం దగు బకారికి భద్రమె యస్త్ర శస్త్ర వి**
**ద్యా నిపుణుండు క్రీడి సుఖియా వినియాభరణుల్ కవల్ సమా**
**ధాన సమేతులే యకట ద్రౌపది సాధ్వి సుఖంబె దానికిన్.**

మూలమున కుంతీదేవి ద్రౌపదిని గూర్చి విశేషముగ సంప్రశ్నించును. తెలుగులో కుంతీదేవి కోడలిని గూర్చి చెప్పిన పద్యము. ఆమె శీలమునకు ఉన్మీలనము గల్పించును.

**కొడుకులకంటె నయ్యెను గు గోడలి కెక్కుడు గూర్తు గోడలున్**
**గుడుకులు సేయు భక్తి కట కోటిమడుంగులు భక్తినాకు నె**
**ప్పుడు దగఁ జేయుచుండు నది పుణ్యచరిత కులాగ్ర గణ్యక్రొ**
**త్తడి సకలంబుఁజోడ సభ దైన్యముఁ బొందుట సూచి పొక్కితిన్.**

చివరకు ఆమె వీరమాతగ పుత్రులకు అందించిన సందేశము తెలుగున సంగ్రహముగ నున్నను హృదయంగమమైనది.

**వేడికొని కృపణు లైకను**
**పోడిమి యది యేల రాజపుత్రులు దమమై**
**వాడిమి దప్పిన నిప్పులు**
**వేడిమి సెడినట్లు జనులు విని యులుకుదురే.**

**కొడుకు గాంచు రాచకూతు రెద్దానికి**
**నట్టి పనికి నుచితమైన సమయ**
**మొదవె దడయు టింక నొప్పదు జనములు**
**నట్టుగాని పురుషు లనరు మిమ్ము.**

"నిప్పుల వేడిమి సెడినట్లు" అను ప్రయోగము మూలములో లేదు.

శ్రీకృష్ణుడు విదురుని విందారగించెను. పిమ్మట విదురుడు అతనితో సంధి పొసగదనియు నా వ్యర్థ ప్రయత్నము విరమింపఁ బ్రబోధించును. పాండవుల దిగ్విజయ యాత్రలో అలనాడు ఓడి పోయిన రాజు లందరు ఈ నాడు దుర్యోధనుని పక్షమున జేరి పూర్వపరాభవమునకు ప్రతికారము నుద్యోగించుచున్నారు.

దానికి సమాధానముగ శ్రీకృష్ణుడు

**ఎఱుఁగుదు నేను సుయోధను**
**కొఱగామియు నతనితోడ గూడినన్నృ పు లం**
**దఱుఁ బగ మనమున నిడికొని**
**యఱిమిటయును సంధి పొ సఁగ దనియు మహాత్మా.**

అంతియె గాక

**పుడమి యెల్ల నొడ్డగెడవయి గజవాజి**
**యుతముగా గడంగి యుగ్రమృత్యు**
**ముఖము మొరఁగఁ దివురు మూర్ఖత మాన్చుట**
**యధికమైన పుణ్య మనఘచరిత.**

శ్రీకృష్ణుడు విదురునితోఁ బలికిన పలుకులు ప్రపంచమును పూర్ణాహుతి కాకుండ తప్పింప నెంచు శాంతి ప్రియు లందరు వీను లొగ్గి వినవలసిన విశ్వజనీన సందేశము.[1]

శ్రీకృష్ణుడు మఱునాడు ధృతరాష్ట్రుని కొలువుకూటమున కరిగి

**ఆ కొలువువారు గర మచ**
**లాకృతి నొక పలుకు లేక యందఱు వింజం**
**బాకిడిన కరణి నవశము**
**దాకారిత చిత్తవృత్తులై యుండంగన్.**

**జలదస్వన గంభీరత**
**నెలుఁగొప్పఁగ దంతదీప్తు లెసఁగ మకుందుం**
**డలరు చెవుల నఖిల జనం**
**బులు విన ధృతరాష్ట్ర భూవిభున కిట్లనియెన్.**

వింజం బాకెడిన కరణి యను ఉపమానము తిక్కన క్రొత్తగఁ జేర్చినదే. మూలమున,

**"వాక్య మభ్యాదదే కృష్ణ స్సుధంష్ట్రో దుందుభిస్వనః**
**జీమూత ఇవ ఘర్మాంతే సర్వాం సంశ్రావయన్ సభాం**
**ధృతరాష్ట్ర మభి ప్రేక్ష్య సమభాషత మాధవః"**

అని గలదు.

---

1. పర్యస్తాం పృథివీం సర్వాం సర్వాన్ సరథకుంజరాం
యో మోచయేన్ మృత్యుపాశాత్ ప్రాప్నుయాద్ధర్మముత్తమం.
— మూలము.

మూలములోని దుందుభి స్వనము తెలుగున జలదస్వన ముగ మారినది. మర్మాంత మేఘము జలదస్వనములో గతార్థమే. ధ్వని ప్రధానమైన నీలమేఘశ్యామలత దంతదీప్తికి ఉద్దీపనము గల్పించును. శరీరము నీలమేఘచ్ఛాయ. స్వరము జలద స్వన ము. ఆ నలుపు మధ్య తెల్లని దంతముల కాంతి. హృద యంగమ మైన తిక్కన వర్ణనకు మాత్రుక మూలమునందు గలదు.

అట్లే, శ్రీకృష్ణుని వాక్చాతుర్యమునకు ఉదాహరణప్రాయమైన

**జననాథ నీ యెరుం గని**
**పనులు గలవె యైనఁ దగvu బరమహితంబుం**
**దనవారికిఁ జెప్పన తగు**
**నని వచ్చితి భారతాన్వయము ప్రియ మొందన్.**

అను పద్యమునకు మూలమున మాత్రుక గలదు.[1]

మూలము నందలి వన్నె తరుగకుండ తిక్కన తీర్చిదిద్దిన ఘట్టములలో శ్రీకృష్ణుని రాయబారము ఎన్నదగినది.

మూలమున

**"ఇదం హృద్యకులం శ్రేష్ఠం పృథివ్యాం సర్వరాజ సు**
**శ్రుత వృత్తోప సంపన్నం సర్వైస్స ముదితం గుణైః**
**కృపాను కంపా కారుణ్యం అనృశంస్యంచ భారత**
**తథా ఆర్జవం సత్యం కురుష్వేవ విశేషతః "**

అను శ్లోకములను

**భరతకులంబు ధర్మమును బాడియు సత్యముఁ బొత్తు బెంపునుం**
**గరుణయుం గల్గి యుండు ననఁగా నుతిఁ గన్నది యందు సద్గుణో**
**త్తరుల నీవు నీ యనుఁగు దమ్ముఁడు నీతనయుల్ యశోధురం**
**ధర శుభ శీలు రీ సుచరితక్రమ మిప్పుడు దప్ప నేటికిన్.**

అని తెనిగించెను.

శ్రీకృష్ణుని పలుకులను తిక్కన మూలానుసారముగనే రచించెను.

1. రాజన్ నాన్యత్ ప్రవక్తవ్యం తవ నైశ్రేయసం వచః
విదితం హ్యేవతే సర్వం వేది తవ్య మరిందమ.

తిక్కన అదనముగా జేర్చిన పద్యము—

**వీరును వారుఁ బండితులు విక్రమవంతులు బాహుగర్వ దు**
**ర్వారులు లోని రిత్త బవరంబున నాఁడిఁ బావం బోవ నే**
**ట్రూరక యుండ వచ్చుఁ గడు నొప్పెడు మేనులు వాడికైదువుల్**
**గూరఁగ నాటినం బుడమిఁ గూలుట కక్కట యోర్వ వచ్చునే.**

శ్రీకృష్ణుని వాక్చాతుర్యమున కనుగుణముగనే యున్నది. శ్రీకృష్ణుడు సభాసదుల కర్తవ్యము గూడ ప్రబోధించును.

**యత్ర ధర్మో హ్య ధర్మేణ సత్యం యత్రా నృతేన చ**
**హన్యతే ప్రేక్షమాణానాం హతాస్తత్ర సభాసదః.**

తిక్కన తెనుగు సేత పై మూలశ్లోకములోని దీప్తి తగ్గి పోకుండ భద్రమొనర్చినది.

**సారపు ధర్మమున్ విమల సత్యమున్ బాపముచేత బొంకుచే**
**బారమున్ బొందలేక చెడ బాలివియైన యవస్థదక్షు లె**
**వ్వార లుపేక్ష సేసిరది వారల చేటగు గాని ధర్మ ని**
**స్తారక మయ్యు సత్యశుభదాయక మయ్యును దైవ ముందెడున్.**

చివరి మాటగ—

**వారలు శాంతసూరులు భవచ్చరణంబులు గొల్వఁబూని యు**
**న్నా రటుఁగాగ మీ కది మనంబున కప్రియ మేని నింతకున్**
**బోరికి వచ్చుచుండుదురు భూవర రెండు దెఱంగులందు నీ**
**కారయ బధ్య మేది యగు నవ్విధ మేర్పడ నిశ్చయింపుమా.**

అని హెచ్చరించెను.

పై పద్యమునకు మాతృక యనదగిన శ్లోకము

**స్థితాశ్శు శ్రూషితం పార్థాః స్థితాయోద్ధు మతింద మాః**
**యత్ తే పథ్యతమం రాజన్ స్తస్మిం స్తిష్ఠ పరంతప.**

అను శ్లోకములో "వారలు శాంతసూరులు" అను పదగుంపనమునకు గాని అందలి విరోధాభాసమునకు గాని మాతృక గన్పింపదు. అట్లే మూలమునందలి వన్నె కగ్గకుండ

**దద్యాకర్యం పార్థివాస్సర్వే హృదయోస్తమ పూజయన్**
**నత్రతత కశ్చిదవ్యక్తం హై వాచం ప్రాక్రామద్రతః.**

అను శ్లోకమును తిక్కన

**అనవుడు రోమహర్ష ణము లంగముల బొడమన్ సదస్యు లె**
**ల్లను బ్రియమంది నెమ్మనములం బురుషోత్తముడింత యొప్పఁబ**
**ల్కు నెమరు మాటలాడ నయకో విదుఁ డెవ్వఁడు ధీరుడెవ్వఁడిం**
**దనువరి యెవ్వఁ డంచు నచలా కృతులై నెఱి నూరకుండఁగన్.**

అని తెనిగించెను.

పిమ్మట జామదగ్న్యుడు, కణ్వుడు మొదలగు మహామును లు దుర్యోధనునకు జేసిన హితబోధ చెప్పిన ఉపాఖ్యానములు మూలములో సవిస్తరమైన వానిని తిక్కన సంక్షేపించెను. ప్రధాన కథతో అవినాభావసంబంధము లేని ఉపాఖ్యానములను సంక్షే పించుట తిక్కన అవలంబించిన అనువాద విధానమునందు సాధారణసూత్రము. మూలములో శ్రీకృష్ణుడు చెప్పిన దేవాసుర గాథను తిక్కన వదలిపెట్టెను.

అట్లే స్రుంజయోపాఖ్యానమును తిక్కన ఒక్క వాక్యముతో విడిచిపుచ్చెను. ధృతరాష్ట్రు ని కొలువుకూటము నుండి శ్రీకృష్ణుడు కుంతీదేవికడ కేగి జరిగిన వృత్తాంతము వివరించును.

సంస్కృత భారతములోని

**కౌరవసభఁ దా నాడిన**
**గౌరవ వాక్యములుఁ గార్య ఖడ్గ క్రమ వా**
**క్పూరములు సుయోధనుఁ డు**
**ప్రా రంభము నల్పవచన పద్ధతిఁ జెప్పెన్.**

మూలములో విస్తరముగ నున్న బహు ఘట్టములను తిక్కన "అల్ప వచన పద్ధతిలో" సంక్షేపించెను. "పాండు కుమారుల పాలికిం బోయి వచ్చెద వారికిం దగిన బుద్ధు లానతిమ్మన నద్దేవి విక్రమోప జీవితులయిన ముచుకుందుండును, స్రుంజయుండు ను నను తొంటి నరపతుల చరిత్రంబులు యుధిష్ఠిరుండు వీరిని వినండో కాక యని పలికి," నట్లు వ్రాసి తిక్కన ఆ కథ లను విడిచి

పుచ్చెను. మూలములో గల వీర గాథలలో స్రుంజయోపాఖ్యానము మనోజ్ఞమైనదని విన్టర్ నిట్జ్ పండితుని అభి ప్రాయము. ఆ గాథ భారత గాథలలో ప్రాచీనతమమైన దనియు విన్టర్ నిట్జ్ వ్రాసెను. సంస్కృతమున వీరమాతయైన కుంతి ముఖమున వెల్లివిరిసిన వీరగాథను తిక్కన నిర్వికారముగ వదలి పెట్టెను. ఉద్యోగ పర్వమున తిక్కన సంక్షేపించిన లేక విడిచి పుచ్చిన ఉపాఖ్యానములు అవాంతరగాథలు ఇంచుమించు మూడవవంతుకు పైబడి యుండును. శ్రీకృష్ణ నిర్గమనానంతరము భీష్మద్రోణు లిరువురు కలిసి దుర్యోధనునకుఁ జేసిన హితబోధను తిక్కన సంక్షేపించెను.

మహాభారతము నందలి అద్భుత సన్నివేశములలో బేర్కొన దగిన రహస్య సమావేశములు మూడు. కృష్ణ కర్ణ సంవాదము. కుంతి కర్ణ సమావేశము భీష్మ కర్ణ సమావేశములు. మొదటి రెండును ఉద్యోగ పర్వము నందలివి.

శ్రీకృష్ణుడు రాయబారము నెరపి తిరిగిపోవుచు "ధృతరాష్ట్రా దుల పిలువంబనిచి రథారోహణంబు సేసి కర్ణు దెసం గనుంగొని నన్ననిచివత్తుగాని రమ్మని కరంబు సాచి చేయువట్టి తన యురథం బెక్కించుకొని" పురంబు నిర్గమించెను.

**అంత నక్కడ నచ్యుతుం డరిగి యరిగి**
**యధిక సంప్రీతి దలకొన నర్క తనయు**
**నాననంబు వీక్షించి యుట్లనియె నెమ్మి**
**నన్యు లెవ్వరు వినకుండ నతనితోడ.**

శ్రీకృష్ణుడు కర్ణుని "నీవు వృద్ధ జనోపసేవివి ధర్మసంవేదివి" అని పొగడి, కుంతీ సుతుడవని చెప్పి, పాండవులజేరి సార్వ భౌముడవగు మని ఆహ్వానించును.। మూలమున శ్రీకృష్ణుని పలుకులు సుమారు ౨౫ శ్లోకములు. తిక్కన వానిని మూడు పద్యములు మధ్య నొక గద్య సంక్షేపించెను. చివరకు—

**పాంచాలరాజపుత్త్రి యు**
**నంచితముగ నిన్నుఁ బొందు నార్యు రవరుసన్**
**సంచితపుణ్యుఁ డ నీ వొక**
**యించుకయును వేరు సేయ కే తెమ్మె లమిన్.**

శ్రీకృష్ణుని నోటనే ఎంతటి మాట!

"షష్ఠే త్వాం చ తథా కావే దౌపద్యుపగమిష్యతి" అని దీనికి మూలము. ఈ వాక్యము శ్రీకృష్ణుని రాజనీతికి పరాకాష్ఠ, కర్ణునికి అగ్ని పరీక్ష.

కాని కర్ణుఁ డు, "మది గడు వాడి గలదె నీకు వారి జనాభా" యని శ్రీకృష్ణుని సంభావించి తాను దుర్యోధను పక్షము విడలేనని తన నిశ్చయమును తెలుపును. మూలమునందు కర్ణుని సమాధానము ౨౫ శ్లోకములు గల ఒక ప్రత్యేకాధ్యాయము. తెలుగున ఈ భాగ మును తిక్కన మిక్కిలి సంక్షేపించినను మూలమునందలి వన్నె దగ్గకుండ సారాంశమును సంగ్రహించెను. ఈ సన్నివేశమున కర్ణుని పాత్రము అత్యద్భుతముగ గోచరించుటకు అతని స్వామి భక్తి, దుర్యోధనుని యెడ గల మైత్రి మాత్రమే గాదు. వ్యక్తిగతముగ అతనికి శ్రీకృష్ణుని యెడ అపార గౌరవము గలదు. అంతే గాదు

**హిత ముపదేశించితి నీ**
**వతి నిర్మలబుద్ధి వగుట నైనను నిది నా**
**మతి సారదు రహస్యము ర**
**క్షితముగ( బాటింపుమయ్య చిత్తములోనన్.**

అది యేమిటికంటే ని

**ధర్మతనయుండు దాను నా తమ్ము( డగుట**
**యెరిగె నేనియు స్వామ్రాజ్య మేల పూను**
**నట్టి ధార్మికుం దాధిపత్యంబుం జేయ**
**వలవదే శాశ్వతంబుగ వసుధ యెల్ల.**

శ్రీకృష్ణుని హృదయమును శంకింపని ఔదార్యము కర్ణుని పాత్రమునకు సహజ కవచ కుండలములు లేని లోటు దీర్చి, దీప్తి కల్గించుచున్నది. "హిత ముపదేశించితివి. నీ వతి నిర్మల బుద్ధి వగుట" అని కర్ణుడు శ్రీకృష్ణు నభినందించును.

---

1.మూలమున

ఉపాసితాస్తే తాధేయ బ్రాహ్మణాః వేదపారగాః అని మాత్రమే గాక, త్వమేవ కర్ణ జానాసి వేదం వేదాంగ సంహితం

తిక్కన కర్ణుని వేదవేదాంగ పరిజ్ఞానమును వదలి ధర్మంవేదివి అని మాత్రమే వ్రాసెను.

కర్ణుడు కౌంతేయుడగుట తెలిసినచో దుర్యోధనుని మనస్సు నొచ్చును. అందుచే ఈ రహస్యము రక్షితముగం బాటింపుమని కర్ణుండు క్రృష్ణుని గోరుట లేదు. ఆ సంగతి బయలు వడినచో ధర్మ తనయుడు రాజ్యము నొల్లడు. అందుచే శ్రీకృష్ణుడు గూఢ రహస్య గోపనము చేయక తప్పదు. ఆ విషయమును, హెచ్చరించుటలో రాజకీయ చతురత కంటె, కర్ణుని పలుకులలో ధర్మరాజు ధార్మి కత్వముపైననే యొక్కువ గౌరవము తొలుకాడు చున్నది. "ఎల్ల భంగులం బాంధవులు గెల్తుర" ను కర్ణుని పలుకులలోం గల ఔదార్యము అతని పాత్రమున కున్మీలము గల్పించుచున్నది.

"ఈ సమర సముద్రంబు దరియనీది నిన్నుం గనియెద గాదేని నూర్ధ్వ లోకంబునం గాంచెద నీ వింక నేమియుం బలుక కుము పని వినియెదనని కౌగిలించు కొనిన నట్లకాక పొమ్మని" శ్రీకృష్ణుండు వీడుకొల్పెను. రాధేయుండు రథావతరణంబు సేసి కనక రత్నమయంబగు తన యరదం బెక్కి కరిపురంబున కరిగె. మూలమున కర్ణుడు ఈ సమావేశానంతరము

**"తతస్స్వ రథ మాస్థాయ జాంబూనద విభూషితం**
**మహత్మావై నివవృతే రాధేయో దీనమానసః"**

దీనమానసుడై తిరిగిపోయినట్లున్నది. ఈ సన్నివేశమును సహృదయులు గరుదాల్పక అనుశీలింపలేరు. ఇట్లే కుంతీ కర్ణ సమావేశము. కుంతి

**తమవారికై సిరికై వధించు టిది సద్ధర్మంబె యక్లేశ కృ**
**త్యమెతా గయ్యము ద్రోణ భీష్మ కృప కర్ణాటోపముల్ మాన్చుట**
**ల్పముల దీరునె యందు నర్కజుని యుల్లం బెప్పుడుం గ్రోధ దీ**
**ప్తము భీమాదులమీద దక్కురుల కుత్సాహంబు లే దాజికిన్.**

అని యితరంగున బెక్కులు చింతించుకొని కర్ణునకుం బుట్టువు దెలిపి సహోదర స్నేహం భావహించెద నని నిశ్చయించి నది. మూలమున గల కుంతి హృదయ మధనమును తిక్కన ఒక్క పద్యముతో, "ఇత్తెరుంగుణ బెక్కులు చింతించుకొని" యని సంక్షేపించెను.

కర్ణుడు అనుష్ఠానార్థము భాగీరధికిం జనును. కుంతీదేవి అచ్చట అతనిం గలిసికొనును. "అమ్మహ దేవిం గాంచి కానీనుండు సంభ్రమ వినయంబుల తోడంజేరి సూతగోత్రంబును రాధేయ నామంబునుం జెప్పి యభివాదంబు సేసి నీవు విజయం చేసిన కార్యంబేమి నాకుం జేయం గలవని యెయ్యది యానతిమ్మనును." మహాభారతమునం గర్ణుని గాధయే అద్భుతమైనది. సహజకవచ కుండలములతో ఉద్భవించిన సుతుని కుంతి చేతులార గంగ కర్పింపవలసివచ్చినది. సూర్యసుతుడు సూతసుతుడై, రాధేయు డయ్యెను. అతడు, దుర్యోధనుని ప్రాణసఖుడై, పాండవులకు అజన్మవిరోధి కావలసి వచ్చినది. ఎంతటి విధివిలాసము. ఒకనాడు చేతులార గంగపాలు చేసిన సుతుని చేరి కుంతీదేవి తాను తల్లినని చెప్పుకొనవలసి వచ్చినది. ప్రపంచ సారస్వతమున ఇట్టి అద్భుత సన్నివేశము లెన్నియో గన్పింపవు. కర్ణ కుంతీ సమావేశ మౌచిత్య మునకు మేలు బంతి.

**వినుము సూతాన్వయంబున నీవు పుట్టుట**
**బోం కేను మాకుంతి భోజునింట**
**గన్నియనాడు భాస్కరుని రావించితి**
**వర మంత్ర బలమున వచ్చి యతండు**
**పంప్రీతి నొసగంగ జన్మించినాడవు**
**నాకు గావున బాంధునందనుండ**
**వగుదు ధర్మస్థితి నట్టి నీ వితరులం**
**గొలువ నెటికిం గురుకులవరేణ్య**

**ధర్మతనయాదు లైన నీ తమ్ములకును**
**ధార్తరాష్ట్రులకును నీవ తగు విభుండ**
**వేలు మీ లోక మెల్ల నీ కేల రాధ**
**కొడు కితం డను తక్కువ కొడుకుగుర్ర.**

ఈ మాటలను కుంతి ఇంతకు ముందెప్పుడు నేల చెప్ప లేదు? కర్ణుడిట్టి ప్రశ్నలనే వేయలేదు. "నీ మాట తథ్య మగున నొక్కటి చెప్పెద నవధరింపుమ" నును. ఏ నవశ్యంబును దుర్యోధ నునకై నీకొడుకులతోడం బెనంగుదు.

**నీ పలు కెంత వోలినను నిర్ణయ మిట్టిద కాని యొండు లే**

**దీ పనిమీది భారమున నీ విట వచ్చితి గాన పాండవుల్**
**సేపడిరేనీ జంప నఱ సేయక చెప్పెద సవ్యసాచివై**
**గోపము పెద్ద వాడు సమకూరిన బిట్టర జంపుదుంజుమీ.**

కుంతి కూడ "దైవ సంఘటన మక్కట యెట్లును దప్ప నేర్చునే." అని మరలిపోవును. ఈ సన్నివేశము మూలములోని వన్నె తఱుగకుండ తిక్కన సంక్షేపించెను.

సంధి విఫలమైనదని ధర్మరాజు మిక్కిలి పరితపించును.

**కురువంశము ద్రుంచుటకుం**
**జొర జాలక నా మనంబు సుడివడియెడు నే**
**వెరవును దొరకొనదు గదే**
**సరసీరుహనాభ పొందు సంపాదింపన్.**

పాండవులు ధృష్టద్యుమ్నునకు సేనాధిపత్యంబు గట్టి యుద్ధోన్ముఖులగుదురు. ఈ ఘట్టమును తిక్కన సంక్షేపించి తెనిగించెను. పాండవ సైన్యము గదలునప్పుడు ప్రస్థానభేరి మ్రోగించిరి. మూలమున విపులముగనున్న సైనిక సన్నాహము నంతయు సంక్షేపించిన తిక్కన ప్రస్థానభేరి వర్ణనమును పెంచి అధికముగా జేర్చెను.

ఇట్లు గాంభీర్యమాధుర్యధుర్యంబైన యుధిష్ఠిరుండు వరిష్ఠ ప్రభువుల చిత్తంబు లారాధించి సర్వజనసమ్మతంబుగా సమరోత్సాహంబు సేసి మహోల్లాసంబునం బ్రస్థానభేరి సరవం బంచిన-

**బీరెండతాకున బీటలు వాఱిన**
**పచ్చి గోడల మాడ్కి బగిలె దిశలు**
**కాఁగిన యెసరుల కరణి బొరింబొరి**
**శరనిధు లుప్పొంగి పొరల బడియె**
**గలముపై గీలించి గాలి కెత్తిన చాప**
**వోలె మిన్నంతయు బూరటిల్లె**
**గులపర్వతావళి కులిశభయంబున**
**బెదరి వాపోవు నట్లెదురు సెలగె**

**ధాత్రి కుమ్మరిసారెవిధమునం దిరిగె**
**జిత్ర రూపులభంగి నిశ్చేష్టితంబు**

**లయ్యె సర్వభూతములు బ్రయాణభేరి**
**భూరినిష్ఠుర ఘోరభాంకార మడరి.**

మూలమున శంఖ దుందుభి ఘోష గలదు గాని పైపద్యము నకు మాతృక మృగ్యము. అట్లే—

**మనుమని జయ ప్రయాణం**
**బను మోదింపంగ నా సుధాంశుడు చనుదెం**
**చినకరణి గొడుగు కుంతీ**
**తనయాగ్రజు మ్రోల నతిసిత ప్రభ నొప్పెన్.**

అను వర్ణనమునకు మూలమున మాతృక లేదు.

తిక్కన తరువాతి కథ నంతయు యథామూలముగనే యనువదించెను గాని, సంక్షేపించలేదు.

మూలమున కర్తవ్యమూఢుడైన ధర్మరాజునకు శ్రీకృష్ణుడు యుద్ధమే అవశ్యకర్తవ్యమని ఉపదేశించును. తిక్కన దానిని వదలిపెట్టెను.

బలరాముడు యుద్ధమున నే పక్షమునను జేరుట కిచ్చగిం పక తీర్థయాత్రలకుం బోనుంకించి పాండవుల వీడ్కొన వచ్చును.

"దామోదర భీమార్జున నకుల సహదేవుల యభివాదనంబు లాదరించి యా దొరలతో తాత్కాలయోగ్య మిత్ర సంభాషణంబులు" సేసెను. మూలములో విపులముగానున్న సంభాషణమును "మిత మొనరించుట" తిక్కన ఉద్యోగపర్వమునుండి పాటించిన సూత్ర ము లలో నొకటి. ఇచ్చట ఆ మిత సంభాషణము గూఢ వివరింపక "మిత సంభాషణంబులు" సేసెనని తేల్చి వేసెను.

అట్లే, దుర్యోధనుడు పాండవుల కడకు నులూకు బంపి, "వాసుదేవు సన్నిధిని బాంచాల విరాట ప్రముఖులు వినం బలుకు మని పరుసని మాటలు గఅపి పుచ్చెను.

మూలమున నులూకుఁ డాడిన పరుషవాక్యములు విపుల ముగా గలవు. వానిని తిక్కన సంక్షేపించెను.

తరువాతి పర్వములలో గోచరించు తిక్కన సంక్షేపానువాద పద్ధతికి ఉద్యోగపర్వమే పునాదియైనది.

తిక్కన కీచకుని గూర్చి

౧. "అన్నరాధముడు" — విరాట. ద్వి. అశ్వా. 33 పద్యము.
౨. "అరిగి యిట్లను నక్రిచకాధముండు" — విరాట ద్వి. అశ్వా. ౨౨ పద్యము.
3. "కీచకాధముడు కిమ్మీరవైరిపై కేలుసాచి" — విరాట. ద్వి. అశ్వా. 333 పద్యము.

ఇట్లు వాచ్యముగా అధముడని కీచకుని నొక్కి వక్కాణింప ననవసరమని కొందరు విమర్శకు లనుచున్నారు. ఇట్లు కీచకుని ప్రత్యక్షముగా కవియే అధముడనుట నవీన విమర్శకుల అభిరుచికి సరిపడదు.

'సమః పూర్ణ తులేవ స్యాత్' మహాభారతములోని విదుర నీతి జగత్తునకనే గాక సాహితీ జగత్తున గూఢ అర్థవంతమైనదే. కవి పాత్రల యెడ తాదాత్మ్యము గాని, రాగ ద్వేషములు గాని ప్రదర్శింపరాదు. భగవంతుండు గూడ, 'ఇందు గలం దందు లేదని సందేహము వలదు' అని చెప్పబడి నప్పటికి 'కలడు కలండనెడి వాడు కలడో లేదో' అనిపించును. అట్లే కవి తాను సృష్టించిన కావ్య జగత్తులో, సర్వత్ర అంతర్లీనమై యున్నను, ప్రత్యక్షము నెక్కడను బట్టువడ గూడదు. తిక్కన, షేక్స్పియరు మహాకవివలె తా నెల్లడ తటస్థుడై యుండును. పై మూడు చోటులు మాత్రమే పై సూత్రమునకు అపవాద ప్రాయములు. ఆ అపవాదములే సూత్ర మును బుజువు చేయగలవు.

కీచకుని విరహాతిరేక వర్ణనము మూలము కంటెను పెంచి వ్రాసి తిక్కన ఆ రసాభాస శృంగారమున కెక్కడలేని ప్రాముఖ్యము నిచ్చినాడనియు, చదువరులకు కీచకుని యెడ సానుభూతి

యేర్పడు ప్రమాదము గలదనియు కొందరు విమర్శకు లనుచున్నారు. అందుచేతనే తిక్కన ప్రత్యక్షముగ కీచకాధముడు, అన్నరాధముడు అని ప్రయోగించెనని తోచుచున్నది. ఇవి తిక్కన కవితా కళకు మచ్చలు గావు గాని, విరాటపర్వ ప్రబంధ సుభగ శరీరమున మాయక కనుపించు పుట్టుమచ్చలని అంగీకరింపక తప్పదు.

# యుద్ధ పర్వములు

భీష్మ పర్వము నుండి తిక్కన కథా ప్రధానముగ అనువదించెను. ఇందును తిక్కనకు ప్రియమైన ఆంగిక సాత్త్వికాభి వర్ణనము, నవ్వులు, మున్నగుసవి ఎడ నెడ జేరినవి. సంభాషణములు, వర్ణనములు మున్నగు వానిని ఉద్యోగ పర్వము నందు వలెనే సంక్షేపించెను. మూలములోని కొన్ని ఉపమానములు శకున వర్ణనములు పరిహరించెను.

భీష్మ పర్వారంభమున వేదవ్యాసుడు ధృతరాష్ట్రుని కడ కేతెంచి ప్రాప్త కాలంబై వచ్చిన భూప్రజాక్షయంబునకు వగవంబని లేదనియు ధర్మోజయతనుచు[1] నిశ్చింతంబుననుండు మనియు నుపదేశించి, సంజయుని నతనికి యుద్ధప్రకారంబు వినిపింప నియోగించును. వేదవ్యాసుడు సంజయున కొసంగిన వరములు గమనింప దగినవి. ఆ రెండు తెరంగుల వారి దివారాత్ర ప్రవర్తనంబులు గనునట్లును రహస్య ప్రకార భాషణంబులు వినునట్లును మనోవృత్తంబు తెఱంగునట్లునుంగా వరంబిచ్చి, యతి శీఘ్రగమనంబును సమర ధరణిం దిరిగినను శస్త్రాస్త్రము లెవ్వియు దాకకుండ నట్టి ప్రభావంబును బ్రసాదించెను. యుద్ధ వార్త నివేదన మెంత కష్ట సాధ్యమైనపనియో తెల్లమగును.

అప్పట్టుననే సాత్యవతేయుండు "అనేక దుర్నిమిత్తంబులు పుట్టుచున్న వని" తెలుగున ఒక్క ముక్కతో బోనిచ్చెను. సంస్కృతమున ప్రత్యేకముగా నీ దుశ్శకున వర్ణనమొక అధ్యాయమున గలదు. ధృతరాష్ట్రుడు గెలుపు, దెలుపు నిమిత్తంబు లెవ్వి యనినను తెలుగున వ్యాసుడు సంగ్రహముగా నొక వాక్య ములోం జెప్పెను. మూలమున నది యొక అధ్యాయము. భీష్మ పర్వమున తిక్కన అవలంబించిన అనువాద పద్ధతికి ఉదాహరణ ప్రాయముగ నీ క్రింది పద్యమును బేర్కోనవచ్చును. మూలమున ఆరు శ్లోకముల సారాంశమును ఒక పద్యములో సంగ్రహించెను.[2]

---

1. "యతోధర్మస్తతో జయః"—మహాభారతము నందు ఆద్యంతముల యందు కాని వికతారగ ప్రవహించు అంతర్వాహినియైన తత్త్వము.
2. ధృతరాష్ట్రః: సంజయే మే మహీపాలాః శ్శూరా యుద్ధాభినందినః

**భూమికిం గాగ బ్రాణములపోక దలంపక రౌద్రఘోరసం**
**గ్రామము సేయు చుండుదురు రాజులు దొల్లియు నెంతదీపకో**
**భూమి మునీంద్ర సంగతి సుబుద్ధము నీకు జగంబు నాకు నీ**
**భూమి తెరంగు సెప్పుము ప్రబోధ నిరూఢముగా సమస్తమున్.**

ఇట్లే సంజయుండు సమాధానముగ జెప్పిన భూపరిణామ వృత్తాంతము నంతయు తిక్కన సంక్షేపించెను. యుద్ధారంభ మున ఈ భూవృత్త కథనము "పిడకల వేట" వలె గన్పింప వచ్చును గాని మహాభారతమును సమకాలీన విజ్ఞాన సర్వస్వ ముగా నెంచదగినది. సంస్కృత భారతమునందలి భూవర్ణన భారత వర్ష వర్ణన, జన శ్రుతి శాస్త్రజ్ఞానముల కలగూర గంప. నేటి మాటకేమి గాని తన కాలము నాటికి పెరిగిన శాస్త్రజ్ఞానము చొప్పున తిక్కన మూలమును సంక్షేపించెనే గాని సంస్కరించుటకు బూనలేదు. మూలమున భారత వర్ష మందలి నదుల విపుల వర్ణ న గలదు. అందు "పెన్న" ను గూర్చిన ప్రస్తావన లేదు గాని తిక్కన సహజాభి మానముతో "గంగయు, తుంగభద్రయు, వేత్రవతియు, వేదవతియు, గృష్ణయు, బెన్నయు" నని పెన్ననుగూడ జేర్చెను. తిక్కన వేరెట్టిమార్పును జేయలేదు.

సంజయుండు ధృతరాష్ట్రునకు యుద్ధము సంగతి విని పించుటకు నాందిగ

**వేదవ్యాస మునీశ్వరు**
**పాదంబులు దలంచి మ్రొక్కి భక్తిరసైకా**

---

ఆన్యోన్య మభి నిఘ్నంతి శస్త్రై రుచ్చావచైతి థా !!
పార్థివాః పృథివి హేతో స్వ్వమత్త్యక్త జీవితాః
నచ ఉమ్యంతి నిఘ్నంతో వర్ధయంతో యుమక్షయం !!
భౌమ మైశ్వర్య మిచ్ఛంతో నమృష్యంతి పరస్పరం
మన్యే గుణాధికం భూమిం తన్యమాచక్ష్వ సంజయ !!.
బహూనిచ సహస్రాణి ప్రయుతాన్యర్బుదానిచ
కోట్యశ్చ లోకవీరాణాం సమేతాః కురుజాంగలే !!
దేశానాంచ పరిమాణం నగరాణాంచ సంజయ
శ్రోతు మిచ్ఛామి తత్త్వేన యుత ఏతే సమాగతాః !!
దివ్య బుద్ధి ప్రదీ ప్తేన యుక్తస్త్వం జ్ఞాన చక్షుషో
ప్రభావత్ తస్య విప్రర్షే ర్వా స స్వామిత తేజసః

**స్వాదన సుకరానందో**
**త్వాదన దివ్యమతి నగుచుం దగ నెఱిగింతున్.**

అని గలదు. దీనికి మూలము

**నమస్కృత్వా ప్రవక్ష్యామి పారాశర్యాయ ధీమతే**
**యస్య ప్రసాదాత్ ప్రాప్తం మే దివ్యం జ్ఞాన మనుత్తమం**

కాని "సంజయుండు

**ప్రాంశుం పయోదనీలతనుభాసితు నుజ్జ్వలదండధారు బిం**
**గాంశుజటాచ్ఛటాభరణు నాగమపుంజపదార్థతత్త్వ ని**
**స్సంశయకారు గృష్ణ మృగ చర్మ కృతాంబర కృత్యు భారతీ**
**వంశ వివర్ధనం ద్రిదశవందితు సాత్యతేయు గొల్చెదన్.**

అని పలికి పారాశర్యంబు జిత్తంబున నిలిపి" అను దానికి మూలమున మాతృక లేదు. ఈ పారాశర్యస్తుతి పద్యము తిక్కన స్వకపోల కల్పితమే.

ఇరుపక్షముల వారలు కురుక్షేత్రమున యుద్ధమునకుం జేరుట మూలములోని మనోహర వర్ణనము కగ్గిపోకుండ తిక్కన తెలుగున ననువదించెను. అనేక దేశాధీశులాత్మీయ చతురంగబల సమన్వితులు, నిజధ్వజ విరాజమానులు నానా భరణోజ్వలాంగులునై చేరి యున్నంత, కౌరవ సేనలో "పరిస్ఫీత వ్రజ రుచివ్యాప్త సువర్ణ తాళ మయచంచ త్కేతువుతో" గంగాసుతుండు సేనాపతిగ నిలిచెను.

**అమరు తోడవులవజ్రాంసు లంచపిండు**
**కరణి హరినీలముల జేర్చుకాంతి యళుల**
**పగిది మాణిక్యరుచి పద్మభంగి మెఱయ**
**గురుబలంబు గెందామరకొలని బోలె.**

యుద్ధమునకు ముందు ఆ సేన పరమాభీల సుందర సమ్మర్దంబయ్యెనని తిక్కన వర్ణించుటలో నాశ్చర్యము లేదు. యుద్ధమధ్యమున గూడ రణరంగము "పరమాభీల సుందర ముగనే" తిక్కన వర్ణించును. మూలమున గూడ నట్టి వర్ణనయే గోచరించును.

"ప్రముహ్య ప్రుధివి సర్వా మృత్యుపాశ వశీకృతా" యనునది ప్రజావాణి.[1] అట్లే "శూన్యా సీత్ పృధివి సర్వా బాల వృద్ధా వశేషితా" అని వైశంపాయ నుడును అనును. ఇట్టి జగత్ప్రళయమునకు సంసిద్ధులైన వీరుల మనస్తత్వము అనుశీలింప దగినది.

"ఇంటం దెవులున జచ్చుట కంటె "యుద్ధభూమిని మరణించి వీరస్వర్గమును జారకొనుటయే వీరుల ఆదర్శము.[2] "యుద్ధము లేనిచో బదికి యుందురె మర్త్యులు శాశ్వతమ్ముగన్?" అనునది వారి యెదురు ప్రశ్న.

పాండవులు యుద్ధమునకు వెడలుట తిక్కన మనోజ్ఞముగ వర్ణించెను. ఈ వర్ణ న మూలమునందును గలదు గాని, యీ కింది సీస పద్యమునకు మాత్రుక మూలమున మృగ్యము.

**ఏనిక మదమున కెలయుతేటుల మొత్త**
**ములు వెలిగొడుగుల చెలుపు గొలుప**
**దురగఖురోద్ధాతధూళి యప్సరసల**
**చిన్ని పువ్వులతోడ జెలిమి సేయ**
**గేతనంబుల మణి వాతంబు రోచులు**
**రవి కిరణంబుల నవల ద్రోవ**
**జైత్రభేరుల మహాస్వనములు సకల**
**పర్వతముల బ్రతివిరావముల నీన**

**సంబరము రథఘోషభీమాభిరామ**
**కింకిణీగణరుణరుణత్కృ తిమయముగ**
**బటుపదాతిహేతి ప్రభా పటలి యెల్ల**
**దిశలు వెలిగింప వెడలె యుధిష్ఠిరుండు.**

మూలమున

**" మహేంద్ర యాన ప్రతిమం రథంతు**
**సోపస్కరం హాటక రత్న చిత్రం**
**యుధిష్ఠిరః కాంచన చిత్రభాండం**
**సమాస్థితో నాగబలస్వమధ్యే"** అని యున్నది.

1. ఉద్యోగపర్వము. శ్రీకృష్ణుని రాయబారము విఫలమైనదని వినిస ప్రజల మాట.
2. భీష్మ పర్వ్వము—ప్రథమాశ్వాసము

అట్లే భీమార్జునులు యుద్ధమునకు వెడలుట మూలము నందలి తెన్ను వేరు. తెనుగు నందు భీముడు, "ప్రమదం భానన కాంతి కొత్తవఘపం" భాషణద్యుతి నికాయంబున్ గదాద్వాయుద్రోగ మరీచి ప్రకరంబునుం గలిసి చిత్రస్ఫూర్తి శోభిల్లగా సమరక్రీడకు వచ్చె".

**సహస్ర సూర్యశ్శత కింకిణీకః**
**పదార్థ్య జాంబూనద హేమ చిత్రః**
**తథోఽర్జున స్యాగ్నిరివ పదీప్తా**
**విభాజితో శ్వేతహయస్సు చక్రః**
**తమాస్థితః కేశవ సంగృహీతః**
**కపిధ్వజో గాండివ బాణపాణిః**

ఇది మూలమున నర్జునుని వర్ణన. తెలుగున తిక్కన స్వతం త్రించెను.

**దివ్యరథస్ఫారదీప్తి జాలంబులు పద్మరాగోజ్వల ప్రభలు గాగ**
**మహనీయరథ్యవిగహముల జిగి సొంపు ఘనవజ్ర వసుముత్కరము గాగ**
**నొగలపై నున్న క్రృష్ణునిమేనినుజాయ హరినీలకాంతి విస్ఫురణ గాగ**
**బ్రసీస్ఫతకేతనాగ్రస్థితకపిదేహరోచులు గరుడాశ్వరుచులు గాగ**

**నంప పొదుల నిగుడునంశువితానంబు**
**దీపమరకతములదీధితులుగ**
**దాలిమియును బెంపు దనకు నైజములుగ**
**విజయరోహిణాద్రి వెడలి వెలిగె.**

మూలమున ఉభయవీరులు యుద్ధమునకు వెడలుట రెండు చోటుల గలదు. తిక్కన యొకచోట నా వర్ణ నను సంగ్ర హించియు స్వతంత్రించి వర్ణించెను.

ధర్మరాజు, ఏకాదశాఽక్షౌహిణులతో నెంతయుం బెద్దగ గన్పించు "కురుబలము కనుంగొని కొండొక విన్ననై ",

**"ఘనమయి తోచుచున్న యది కౌరవసైన్యము చూడ్కికందు కొం**
**తనవుని తాలకేతన ముదగ్రత ముందట బొల్చె జూచితే"**

యని అర్జునుని హెచ్చరించును.

**"ఆనవుడు పిన్న నవ్వు నగి యున్నరు డన్న మొగంబు జూచి పలుమాటలాడగ గడంగగ నొల్లక యత్యు దాత్తతన్"**

సమాధానము చెప్పెను. మూలమంతయు సంవాద రూపముగనే యున్నది. తిక్కన సుదీర్ఘ సంభాషణలు సంక్షేపించుటకు హేతువు గ పలుమాటలాడగ గడంగగ నొల్లక యుండుట యుదాత్తతకు లక్ష ణమని సమర్థించెను.

ధర్మరాజు యుద్ధము నారంభించుటకు ముందు పాద చారి యై భీష్మ ద్రోణ కృప శల్యుల కడకేగి వారి ఆశీస్సుల నర్థించును. మూలమున ఆ ఘట్టమున భీష్ముడనిన మాటలనే ద్రోణ కృపులు గూడ అందురు. మూలమునందలి పునరుక్తిని పరి హరించుటయే గాక తిక్కన తెలుగున నా ఘట్టమును సంక్షేపించెను.

భీష్మద్రోణులు ధర్మం బేవలనం గలుగు నవ్వలన కృష్ణుండు గైకొనును నవ్వలినికి జయంబగు నందురు.

మూలమున ఇరువురును నీ విట్లు రాకయుండినచో నిన్ను శపించి యుండెడివాడనని పలుకుదురు.[1]

ధర్మరాజు భీష్మ ద్రోణ కృప శల్యులకు నమస్కరించి, అందఱ వీడ్కొని యనుజవర్గాను గతుండైమరలును. మూలమున

**అనుమాస్యాథ కౌంతేయో మాతులం మద్ర కేశ్వరం**
**నిర్జగా మహాసైన్యాద్ భ్రాతృభిః పరివారితః;**
**వాసుదేవస్తు రాధేయం అభగమ్యజగాదనై**

అని యున్నది.

భీష్ముని మీది కోపమున అస్త్రసన్యాసము చేసిన కర్ణుడు అప్పుడు యుద్ధమున చేరడు గద. కర్ణు డప్పు డచ్చట నుండెనా? తిక్కన వ్యాఖ్యాప్రాయమైన తెనుగు సేత అరయదగినది.

**మొనల వినోదంబునకుం**
**గనుగొన నేతెంచి యున్న కర్ణుని కడకుం**

---

1. శపేయం త్వా మహారాజ పరాభవాయ నిత్యశః

**జని హరి యిట్లను నొండొరు**
**గని యప్పటి యుచిత భంగి గడ తేర్పి తగన్.**

శ్రీకృష్ణుడు కర్ణునితో "భీష్ముండు సచ్చు నంత దాక బాండవు లకై కొంత సమత కేలి వేడుక జలుపుట వోలదొక్కొ. శ్రీకృష్ణుని రాజనీతి చాతుర్యమునకు హద్దున్నట్లు తోపదు. అతడు 'పాంచాల రాజ పుత్రి యు నంచితముగ నిన్ను జేరు నార్వ్వర వరుసన్' అని యిదివరకే కర్ణుని యూప చూచినవాడు. కాని 'దేవకి నందనునకు రాధానందనుం డిట్లనియె.'

**కినుక వొడమి గంగా పు**
**త్త్రు ని కయ్యము నప్పు డనికి దొలగితి నేనిం**
**జను గాకే గురుపతికి**
**చ్చిన ప్రాణం బొందు వలనం జేర్పం దగునె.**

అనవుడు నవ్వులుకులకు సంతోషపించిన వాడయి వాసు దేవుండు గొంతేయులం గూడ జనుదెంచె. ఈ క్రృష్ణ కర్ణ సంవాద ము ఎంతటి అత్యల్ప ఘట్టమైనను అత్యధిక భావ నిర్భరమైనది.

యుద్ధమునకు ముందు అర్జున విషాద యోగమును మూల మునందు వలెనే తిక్కన మనోహరముగ వర్ణించెను.

అప్పార్థుండు రెండు బలంబుల యందు నున్న సోదర సుతమాతులాచార్యాదులగు బంధు శిష్ట జనంబుల నాలోకించి యుట్లనియో,

**సరసిజనాభ బంధుజనసంతతి గయ్యపునేలం జూడంగా**
**విరవిర బోయి మేను నిడువెండుక వెట్టుచు గంప మొందె జే**
**నిరతము గాదు గాండివము నిల్వగ నేర్వదు గాళ్ళు నేను ని**
**స్ఫురతకు జాల నొల్ల నొకడున్ మహి యేలుట యేటి సౌఖ్యముల్.**

మున్నగు వాక్యముల నర్జునుండు తన మనస్తాపము వెల్లడించును.

**తాతల మామలన్ సుతుల దండ్రుల దమ్ముల నన్నలం గురువాతము శిష్టకోటి సఖివర్గము దుచ్ఛజనానురూపదు**
**ర్నీతి వధించి యే బడయుంనెత్తుటం దోగిన రాజ్య భోగముల్**
**పీతి యొనర్చునే యశము పెల్లడ గూర్చునె పెం పొనర్చునే.**

జగదేక వీరుడైన అర్జునుని పరాక్రమ విజృంభణమున కీ విషాదయోగము హృదయంగమైన నే పథ్యమును రచించు చున్నది.

ఇవ్విధంబున శోకసంవిగ్న మానసుండును విషాదవిహ్వ లుండును బరమ కరుణాభరితుండునై శరశరాసనంబులు విడిచి కన్నీరు దొరంగ నూరకున్న సవ్యసాచిం జూచి మధు సూదనుండి ట్లనియె.

**వగవగ నేమియుం దగనివారికి నై హృదయంబు గుందగా**
**వగచెదు బుద్ధిమాటలును వావిరి నాడెదు నిపు పండితుల్**
**వగతురె యున్న వారికి నవశ్య విధేయత జన్న వారికిం**
**దెగు పగ లెల్ల జిత్తము ప్రదీప్త వివేకమయత్వ మొందినన్.**

అని పలికి పార్థునిం బరమ జ్ఞానంబునకుం గారణంబు లగు వాక్యంబులు వినుటకుంజొనిపి యుద్దేహంబు నందు బాల్యంబు యౌవనంబు వార్ధకంబు ననంగలుగు నవస్థలం బొందినట్లు జీర్ణంబులైన వస్త్రంబులు విడిచి నూతనంబులైన వానిం గైకొనిన చాడ్పుననుం గాని దేహాంతరగమనం బాత్మహనిం జేయదనియు బుట్టువు జావునను నివి లేమింజేసి శరీరంబు వోలె శస్త్రచ్ఛేదనంబు మొదలైన వికృతి కారణంబులకు నాత్మ్కండు లోనుగాడనియు నప్పరుమండు నొప్పించువాడును నొప్పింపం బడియెడు వాడును గాడనియుం జెప్పి మఱియు ననేక వాక్యంబుల నాత్మకు నభావం బును శరీరంబునకు భావంబును గలుగమి దెలిపి యాత్మ తత్త్వం బు శాశ్వతం బగుట" యెఱింగించెను.

ఉపనిషత్సారమున ప్రశస్తి వహించిన శ్రీమద్ భగవద్గీతను తిక్కన ఏల తెనిగింపలేదను ప్రశ్న కలుగుట సహజము. తిక్కన ప్రధాన కథతో అవినాభావ సంబంధములేని అవాంతర గాధలను సంక్షేపించెను. ఉద్యోగపర్వమున సనత్సు జాతీయమును గూఢ నొక వాక్యముతో విడిచిపుచ్చెను.

**"ఫలముల యెడ బ్రహ్మార్పణ**
**కలనపరుం డగుచు గార్యకర్మము నడపన్**
**వలయుం దత్త్వ జ్ఞానము**

**తలకొనినం గర్మశమము దానై కలుగున్.**

అని మరియు నీదృశంబులగు వాక్యంబు లనేకంబు లనుగ్ర హిం చుచు వివిధ ప్రకారంబుల వికల్పించి విజయుం డడిగిన వానికెల్ల సదుత్తరంబు లిచ్చి సందేహంబు వాపును." అని బుద్ధి పూర్వక ముగనే సంక్షేపించి తిక్కన తాను వేసికొనిన ప్రణాలికనే యనుస రించెను. అతడు భగవద్గీత యందనాదృతి వహింపలేదని చెప్పవచ్చును. కథలో నంతర్భాగము గావున శ్రీకృష్ణుని విశ్వరూప ప్రదర్శనమును తిక్కన విడువక సంక్షేపముగ వర్ణించెను.

**భగవద్గీతకు వైష్ణవులు ప్రాణపదముగ నెంచు**
**'సర్వ ధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ'**

అను శ్లోకమునకు

**కందుకొను సర్వధర్మ వికల్పములను**
**నెడల విడిచి దృఢంబుగనే నొకండ**
**శరణముగ న్యాశయింపుము సకల ధురిత**
**ములకు దొలంగింతు నిన్నుం బమోద మొంద.**

అనునది తిక్కన తెలుగు నేత.

కురుక్షేత్రమున కురుపాండవ సేనలు తొలుదొల్త తలపడిన వర్ణనమున తిక్కన వాసిన సీస పద్యమునకు మూలమున మాత్రుక లేదు.

**కప్పారు రేణువు గమలాప్త బింబంబు**
**రాహుమండలమున రమణ గప్ప**
**దెల్లనిరజము శోభిల్లు సంగ్రామ రం**
**గమునకుం దగు మేలుకట్టునట్లు**
**ఖచర కాంతలయలకములందు గెందూళి**
**యళులపై పుప్పొడి ననుకరించు**
**నడరి పచ్చని పాంసు నమరు దిశాభిత్తి**
**తలముల గనకంపు దగడు పగిది**
**బాండవానీకమును గురుబలము నొక్క**

**పెట్ట రథ గజ హయ భటాభీలచటుల**
**గతిం బరిక్షుణ్ణసంగర క్షితితలముగ**
**వీక బెరసిన యత్తొలుతాకు నపుడు.**

ఖచర కాంతల యలకలు కెందూళితో నిండుట, ఆ దృశ్యము ఆళులపై పుప్పొడి ననుకరించుట మున్నగు వర్ణనలు తరువాతి ప్రబంధ కవులకు ఒజ్జబంతులైనవి.

మొదటి నాటి యుద్ధము సాయంకాల మగుసరికి ముగించిరి. అచ్చట సూర్యాస్తమయ చంద్రోదయ వర్ణనములు సల్పుచు తిక్కన ప్రయోగించిన హేతూత్ప్రేక్షలు ప్రబంధ ధోరణికి మార్గ దర్శకములు.

**శాంతనవుడు దేజోదు**
**ర్ధాం తుండైనా వెలుంగు ధర కెల్లను జా**
**లింతు నిను డస్తశైలో**
**పాంతమునకుం జనిన నేమి యని నట్లుండెన్.**

**సోమాన్వయ ప్రదీపకుం**
**డీ మెయిం దేజో విశేష మెసకం బెసగం**
**గా మెఱయుట గనుంగొని ని**
**గ్గై మఱువడిమాద్రిక్కి గుంకె నర్కుం డంతన్.**

**జలరుహంబులు పాండవు సైనికుల మొ**
**గంబులట్టుల విన్ననై కాంతి దఱింగె**
**వారి మనముల భీత్యంధకార మడరు**
**కరణి జీకటి యెడ నెడం గవియుదెంచె.**

మూలమున పై వర్ణనములకు మాతృక అన దగిన శ్లోక ములు గానరావు.[1]

---

1.తతస్సైన్యేషు భగ్నేషు మధితేషు చ సర్వశః
ప్రాప్తే చాస్తం దినకరే న ప్రాజ్ఞాయత కించన !!
అని మాత్రమే గలదు.

పాండవు లేర్పరచిన క్రౌంచ వ్యూహమును భీష్ముడు భగ్న ము చేయుట చూచి అర్జునుండు క్రుద్ధుడైనట్లు మూలమున గలదు.

**తతో ర్జునో వరవ్యాఘ్రూ దృష్ట్వా భీష్మం మహారథం**
**వార్ణేయ మబ్రవీత్ క్రుద్ధో యాహి యత్ర పితామహః:**

తిక్కన తెలుగు నేత

**రెక్కలు సించి కంఠమున రేకులు వాపి శిరంబు వ్రచ్చి పే**
**రుక్కున గొంచచంద మగునొడ్డు గలంగగ జేసి భీష్ముం డే**
**దిక్కున దాన యై దిశలు దీటుకొనన్ శరకోటి నింప గెం**
**పెక్కినకంటిక్రేవ చెలు వెక్కుడు సేయంగ గ్రీడి కృష్ణుతోన్.**

మూలమున భీముడు ఏనుగులతో యుద్ధము చేయుట విపుల వర్ణన గలదు. ఆ వర్ణన తిక్కన ఒక పద్యమున తెలుగు నుడికారపు సొంపులతో సంక్షేపించెను.

**కొన్నిటి హస్తముల్ సదియ కొన్నిటి గొమ్ములు దుమ్ము దూళిగా**
**కొన్నిటి గుంభముల్ వగుల కొన్నిటి గాళులు నుగ్గునూచగా**
**కొన్నిటి బార్శ్వముల్ నలియ గొన్నిటి వీపులు పిండుపీచుగా**
**నన్నిటి భీము డుద్భటగదాహతి నేనిక వేట లాడగన్.**

యుద్ధారంభమునందు కురుక్షేత్రము చారు భీషణముగ నున్నదను వర్ణనములు మూలమునందును తెనుగు భారతము నందును గలవు. అంతేగాక కొన్ని దినములు యుద్ధము కొనసాగిన పిమ్మట యుద్ధభూమిని ధరణిని గూర్చిన విపుల వర్ణనములు మూలమున గలవు. ఎనిమిదవనాటి సాయంకాలము మూలమున యుద్ధభూమిని గూర్చిన విపుల వర్ణనమును తిక్కన ఒక్క పద్య ములో సంగ్రహించెను.[1]

**ధరణి నెత్తుట దోగి యాభరణకాయ**
**శస్త్రఖండజాలంబులం జాల నొప్పె**
**బలుచగాకుండ గుంకుమ మలది పెక్కు**
**దెరగుతొడవులు దొడగిన తెఱవవోలె.**

---

1. నసైరాభరతైస్చ్ఛవ విబభౌతు తదామహీ
నానారూపైరలంకారై: పమదేవాభ్యలంకృతా
మూలమున ఈ వర్ణ నమున సుమారు ఇరువదియైదు శ్లోకములున్నవి.

బీభత్స భయానకమై రక్తసిక్తమైన సంగ్రామ భూమి ముత్తై దువవలె గన్పించిన వర్ణనయే ముఖ్యమని తోచినది తిక్కనకు.

ఎనిమిదవ నాటి రాత్రి దుర్యోధనుండు "మందాకినీ నందను మందిరంబు సేరంజనును. తెలుగున దుర్యోధనుండు సపరివారముగ రత్న ఖచితంబగు రథం బెక్కి పోవును. సంస్కృత దుర్యోధనుండు అశ్వారూఢుడై జనును.[1] తిరిగి భీష్ముని దగ్గర గుఱ్ఱము నుండి దిగినట్లును మూలమునందు గలదు.[2]

భీష్ముడు శరతల్పగతుండైన పిమ్మట కర్ణుండు గాంగేయు కడకుం బోయి భక్తి వినయంబులు దోపం బాద పణామం బాచరించి

**"అలుక దక్క నన్ను నధిక వాత్సల్యశ్శీ**
**తలముగాగ జూచి తగిన మాట**
**లాడవే మహాత్మ"** యని ప్రార్థించును.

గాంగేయుడు కర్ణుని ఒక్క కరంబు మలంచి గౌగిలించు కొని యచ్చటనున్న రక్షకాది జనంబుల నవులం బోవం బనిచి యతనితో మన్ననమెయి మాటాడును.

మహాభారతమున కర్ణుని పాత్రోన్మీలమున కుపకరించు రహస్య సమావేశములు మూడు. శ్రీకృష్ణ కర్ణ సమాగమము. కుంతీ కర్ణ సమావేశము, కర్ణ భీష్మ సమావేశము. తన్నర్ధ రథునిగా నెంచిన భీష్మునిపై రోషముతో తాత్కాలికముగ అస్త్రసన్యాసము సలిపి భీష్మ పతనము వరకు యుద్ధము విరమించుకొనిన కర్ణుండు పోయి శరతల్ప గతుడగు భీష్మునకు పాదనమస్కారము సల్పును!

కర్ణునకు ఆంతరంగికముగ భీష్మునిపై ఎంతటి గౌరవము! భీష్ముడు గూడ కర్ణుని

**నీ యుదయము దైవిక గ**
**ర్భా యత్తము నీకు మర్త్యులసదృక్షు లు గౌం**
**తేయుడవు గాని వినురా**
**ధేయుండవు గావు నీవు ధీరవిచారా!** అని ప్రబోధించును.

1. తతస్తం నృపశార్దూల శ్వార్దూలసమ విక్రమం
2. అవతీర్య హయాచ్చాపి భీష్మం ప్రాహ్య జనేశ్వరః:

ఇది క్రృష్ణద్వైపాయనుండు నాకు నేకాంతంబున నెఱిం గించె. నేనును భవదీయ తేజోవిశేషంబులననుం గనుంగొని యుండదు బాండు తనయుండ వగుటం జేసి నీయెడ వాత్సల్యంబ కాని మాత్సర్యంబు లేదొక్కటి సెప్పెద విను మేను గురుపాండవుల వైరం బుడిపి పుచ్చితి నప్పాండవేయు లజయ్యు లప్రమేయుం డగు క్రృష్ణుండు వారికి విధేయుండు గావున వారలతోడి విరోధం బొప్పదు నీవును నొందుదలంపు దక్కి యక్కుంతేయులం గలిసి యుండు మనెను.

కాని ఇదివరకే రెండు రహస్య సమావేశములలో కర్ణుని స్వామి భక్తి స్థిరసౌదామిని వలె వెలుగొంది నిల్చినది. "వారు మహ బలుల్ హరియు వారికిం బ్రాపుగలండు వారలన్ పోర జయింప రామియును బుద్ధి నెరుంగుదు" అని కర్ణుని సమాధానము. కర్ణుని స్వామి భక్తికి అతని ఔదార్యము మెఱుగు పెట్టినది. అతనికి శ్రీకృష్ణుని యెడను పాండవుల యెడను ఆంతరంగికముగ అపార గౌరవము గలదు. తాను యుద్ధము చేయుచున్నది జయాశతోగాక తన ధర్మమును నిర్వహించుట కొఱకే. "దైవాధినము సర్వమున్ మన మతిం దప్పింపగావచ్చునే నీ వింకన్ నను నొండు వల్కక పరానికంబుపైం బంపు మత్స్వాధర్మము నిర్వహించెద" నను. అంతేగాక బలోత్సేకంబు లోకంబునం భావింపన్ విహరించెదన్ మురరిపుం బార్థుం దలంకించెదన్." అని ఆత్మ ప్రత్యయముతో బలుకును. కర్ణుని మాటలకు భీష్ముడు చెప్పిన సమాధానము గూఢ మిక్కిలి ఉదాత్తమనిపించును.

**అన విని భీష్మ డిట్టు లను నంతకు జాలు టెఱుంగనే సుయో**
**ధనునకు నెప్పు నీదుభుజదర్పమ కాదె సహాయ మెద్ధి యా**
**తనికి బ్రియంబు దానిన యుదాత్తమతిం దగ నాచరింపు నీ**
**మనమున సంతసిల్లు మనుమానము దక్కు మనుజ్ఞయిచ్చితిన్.**

పై మూడు ఘట్టములును కర్ణుని పాత్రమునకు అత్యద్భుత మైన ఉన్మీలనము గల్పించినవి.

భీష్మపతనానంతరము పదునొకండవ దినమున కర్ణుడు యుద్ధ భూమికి వచ్చెను. 'నీ జయంబున వనవాసి నయ్యెద రిపుల్ నిను నోర్చిన వారి నోర్చెదన్' ఇది అర్ధరథుండని తన్నెంచిన భీష్మునితో కర్ణుడు పల్కిన ప్రతిజ్ఞా వాక్యములు. కాని పురంబు వెడలి వచ్చి యతండు కురుపతి కడ కేతెంచి ప్రీతుం డగు నతని చేత నభినందితుండై రాజలోకంబు నాలోకించి

**దమమును సత్యమున్ దపము దానము శీలము నస్త్రవీర్యశౌ**
**ర్యములును భీష్మసంద కల వట్టి మహాత్ముండు పోర నీల్గెనిం**
**క మనకు నేటి బాహుబలగర్వము లెక్కడి సేన లక్కటా**
**సమ సేనే కౌరవేశ్వరుని సంపద యంచు విషణ్ణమూర్తియై.**

**కన్నీ రొలుకగ వగచిన**
**నన్న రపతు లెల్ల నెడ్చి రార్తరవంబుల్**
**మిన్నంద నశ్రుజలములు**
**విన్న నివదనంబులందు వెల్లగొనంగన్.**

అప్పుడు దన్నుం దాన యుపశమించుకొని యుందర డెందంబుల యుమ్మలికంబులు వాయ రాధేయుం డిట్లనియె.

కర్ణుని నోటినుండి వెలువడిన భీష్మపశంస భీష్మునకుం గంటె కర్ణునకే యెక్కుడు గౌరవము కల్పించు చున్నది.

మూలమున కర్ణుండు సల్పిన భీష్మ ప్రశంస గలదు గాని, తన్నుం దాన యుపశమించుకొనిన సంగతి లేదు. కర్ణునకు ఈ నిగ్రహము తిక్కన గల్పించినదే. మఱియు, కర్ణుండు కౌరవసేనకుం గల్పించిన పోత్సాహము పేర్కొనదగినది.

**ధర్మజభీమపార్థులను దమ్ములు నుద్భటసంగర క్రియా**
**కర్మరు లచ్యుతానుజనిగర్వము దుర్వి పహంబు వారి మ**
**త్రాకర్ముకముక్త చండశరఖండిత దేహుల జేసి యిత్తు నే**
**బేర్మి గ గౌరవేంద్రున కభీష్టత రాజ్యరమావిలాసమున్.**

అని రథ మెక్కి నదీనందనుడున్న యెడకుం జేరంబోయి, అతని కడకు పాదచారియై యఱిగి వీరశయన మహనీయుడైన యమ్మహానుభావుని యడుగులపై గన్నీరు దొరగం బ్రణమిల్లి కేలు మొగిడ్చి వినయవినమితశరీరుడై,

**వచ్చితి రాధేయుడ గను**
**విచ్చి ననుం జూడు  భరతవీరాగ్రణి నీ**
**సచ్చరితము ఫలమే యి**
**ట్లిచ్చట నీ యునికి ధాత నెమన నేర్తున్.**

అని అనేక ప్రకారముల కర్ణుడు భీష్మునిం ప్రశంసించును.

ఎనిమిదవనాటి రాత్రి ఏకాంతమ్మున దుర్యోధనుండు దుశ్శాసన శకుని కర్ణులతో, గాంగేయ గురు కృపాశ్వత్థాములు మధ్యస్థులై పాండవ బలంబులం జెఱుచున్నట్టి సంరంభంబునకు జార కున్నారని చెప్పను. కర్ణుడు

**నరనాథ యింక భీష్ముని**
**దురమునకుం దేకు మేను దోర్బల విభవో**
**ద్ధురతం బాండు కుమారో**
**త్కరముం దత్సేనలన్ మదం బడగింతున్.**

అని ఉపదేశించి యుండెను. ఆ కర్ణుడే భీష్ముని అడుగులపై గన్నీరు దొరంగం బ్రణమిల్లెను. మానవమనస్తత్వములోని విచిత్ర విరోధాభాసమది. కథలో వివిధ పాత్ర చిత్రణమున అంతర్లీనముగ మానవ మానస క్షీర సాగర మథనము గన్పించును. ఒకనాడు కర్ణుని అర్ధరధుడని యెంచిన భీష్మడే అతనితో నాకు నీవును సుయోధనునట్లు, అంబష్ట విదేహ పౌంద్రాది దేశాధీశుల గెల్చి దుర్యోధనాధీన వర్తులం గావించిన నీకు నిట్లు సెప్పవలయునే కౌరవుల నడపికొని యమ్మహీ విభునకు విజయంబు గావింపుమ"ని ఆశీర్వదించును.

**ఆనరు నే నొకండన విషానలదుస్సహదృష్టిభీషణం**
**బైన మహాభుజంగమము నద్భుతమంత్ర  నిరస్తదర్పముం**
**గా నొనరించునట్లు భుజగర్వ మడంచెద నస్త్ర శస్త్ర  వి**
**ద్యానిపుణత్వసంపద నుదాత్త గుణోత్తర నీవు పంపగాన్.**

అని ఉత్సాహముతో బల్కును.[1]

మూలమున విపులముగానున్న కర్ణ భీష్మ సంవాదమును తిక్కన తెలుగున సంక్షేపించెను.[2]

మహాభారత యుద్ధము నందలి అద్భుత సన్నివేశములలో భగదత్తుడు—అతని యేనుగు సుప్ర తీకము నిర్వహించిన పాత్రము పేర్కొనదగినది. మూలమునందలి వన్నె తగ్గకుండ తిక్కన తెలుగు న సుప్రతీకమును వర్ణించెను.

**కినుకమై నిగిడినకనుగవ మొఱుగుల**
**గములు ముందట గెంపు గడలుకొలుప**
**జెవులు ముగ్గించి పూచినరౌ ద్ర తరరేఖ**
**వినువీధి జూపర వేడ్క బెనుప**
**గండున జాగినతొండంబు లయ సమ**
**వర్తిదండము లీల బట్టువరుప**
**గడుబెట్టిదపుటురవడి బదన్యాస మి**
**లాస్థలి గ్రక్కదలంగ జేయ**

**ననిల పుత్రు దెసకు నడరిన గని ధర్మ**
**తనయుసేన జనులు దల్లడిల్లి**
**చంపె జంపె భీము సామజం బనియొడు**
**నులివు గలయ జెలగ గలగిరధిప.**

మహాభారత యుద్ధమున జేరిన మహావీరు లందఱకు జయాపజయములు గౌణములు. ఏ పక్షమున నున్నను తమ తమ ప్రత్యేక సామర్థ్య ప్రకరర్షయే వారికి ప్రధానము. ఆ వీరులమన స్తత్వమును బట్టి మృత్యు ముఖము వివృతద్వారములతో స్వాగతము పలుకుచున్న వీరస్వర్గమునకు సింహద్వారము.

1. తిక్కన తెలుగు సేత మూలమునకుం కించిచ్ఛిన్నముగ నున్నది. మూలమున
అహం హ్యేకః పాండవం యుద్ధ శౌండం
అమృష్యమాణో భవతాను శిష్టః
ఆశీవిషం దృష్టివిషో యథోరగ
శ్శ క్యా మ్యేనం హ్యాస్త్రబలేన హంతుం అని గలదు.

2. 'అని పెక్కు మాటలాడిన విని' యనిమిష నదీ తనుజుడని తిక్కనయే వాయుటను బట్టి బుద్ధిపూర్వకముగనే యట్లోసర్చెననియు, తిక్కన చూచిన సంస్కృత ప్రతిలో గూఢ విపుల వర్ణన గలదనియు నెంచ వచ్చును.

ఇంట తెవులన మ్రగ్గి చచ్చుటకంటె యుద్ధరంగమున ప్రాణము లు వీడుటయే క్షాత్రమునకు పరమావధి. వృద్ధుడైన భగదత్తుడు గూఢ తన పరాక్రమమును సుప్రతీక మహత్మ్యమును జాటుటకే కురు క్షేత్రమును మహవకాశముగ స్వీకరించి వచ్చెను. వేరొకచో సంశప్తకులతో యుద్ధము చేయుచున్న అర్జునుండు గూఢ వీర మర్యాద నుజ్జగించి అచటి నుండి మరలి కొల్లలయైన పాండవ సేననురక్షించుటకు తిరిగి వచ్చెను. కాని, భగదత్తుడు, చేవద లిర్వ విక్రమ విశ్రుంఖలుడై విజృంభించెను.

**అలుగుటమ్ముల దాంకిన నలిగి భద్ర**
**కుంభిరౌద్రంబు సొంపారగొలిపె నతండు**
**వారి సేనల గోపికావరుండు నరుండు**
**దెగిరి తెగి రనుపలుకుల దిగులు వుట్ట**

చివరకు రభసోద్రగత, నిజాంకుశంబు నభిమంత్రించి అర్జు నునిపై ప్రయోగింప భూరిభయోద్రేక తరంగితంబై పాండవ సైన్య ము ఘూర్తిల్లెను. కాని " అప్పుడు శౌరిపార్దునకు నడ్డముగా దనమే నమర్చెను" అమ్మహాస్త్ర మందొప్పె, నవారుణాంబుజ కృతోజ్వల మాలికయై చిరస్థితిం జొప్పడి నూతనాభ్ర తల శోభితమైన మెఋంగు చాడ్పునన్. గండము తప్పిన అర్జునుడు గూడ, "ననుం జలుక జేసితి మాటలు వేయునేటికిన్" అని శ్రీకృష్ణునితో దిగులొంది పలుకును. కాని శ్రీకృష్ణుడది వైష్ణవాస్త్ర మనియు అన్యుల కోర్వ రానిదనియుం జెప్పి, విరోధిం జూపి వీడిప్పరమ సాధనంబు వృధ యగుటం జేసి వెఋగుపడియున్నవాడు విని బిలుకుమార్పుమని ఉత్సాహము గల్పించిన, బాణ విద్యాల సితుండు గ్రీడి భగదత్తుని కంఠ మకుంఠి తోద్ధతిని నర్ధచంద్ర పదరంబున ద్రుంచెను.

దోణపర్వమున మిక్కిలి ప్రసిద్ధికెక్కిన ఘట్టము అభిమన్యు వధ. ధృతరాష్ట్రుడు గూడ "బురుషసింహుని అత్యుత్తమ తేజు ఎట్టుత్తల పెట్టిరో పలువు రుగ్రమనస్కులు గూడ చిత్తము వొక్కెడు," నని అనును.

అభిమన్యుడు, " మన యరదంబు ద్రోణానీకంబుపైం బరపు మనగ," సారధి "బాలుడవు నీవు, బహువిధ సమరకర్కశులు వారు" అని తొలుతనే హెచ్చరించును. కాని, అతడు సారథి మాటలు పెడచెవిని బెట్టి, "అనన్య భేద్యంబగు నా పద్మ వ్యూహంబు భేదించి సొచ్చి, సౌభద్రుండు రౌద్రరసోల్లసిత మూర్తియై యందు మహా ర్ణవంబునం దిరుగు మందర నగంబు చందంబునం గాననంబునం జరించు తీవ్రానలంబు తెఱంగునం గాలపక్వజన సమాజ సంహ రణ క్రీడనంబు సలుపు శూలి పోలికం గేలిగతుల మెలంగెను.

కౌరవ సేన అభిమన్యుని తాకిడి కోర్వలేక దీనదశకు వచ్చుట చూచి దుర్యోధనుడు అతని తరిమి కవిసెను. ద్రోణుడా సన్నివేశము గాంచి రాజు నరసుతున కగ్గమయ్యోనని విడిపించు టకు వివిధవీరులం జేయెత్తి పిలిచి ప్రోత్సహించును.

**కృపుడు గురుసుతుండు గృతవర్మ గర్ణుండు**
**సామదత్తి శలుడు సౌబలుండు**
**పౌరవుండు మద్రపతి వృష సేనుండు**
**గౌరవేశ్వరుండు గడగి రపుడు.**

అభిమన్యుడు ఏకవీరుడై అందర కన్నీరూపులై యుద్ధ మొనరిం చెను.

**నిలు నిలు కర్ణ యోకృపుడ నీ విటు లేల కడంక దక్క సౌ**
**బల ధృతి దూల నేమిటికి బాహ్లిక యిత్తరి గౌరవేంద్ర నీ**
**బలమున్ జలంబు జూపి నిలుపం దగు సేనల నంచు బెక్కు భం**
**గుల బురికొల్పె నెవ్వరును గోల్తల సేయర యేమి సెప్పెదున్**

అని అభిమన్యుడు వారి నందరి వెన్నంటి తఱిమి తఱిమి కొట్టెను. అతనికి బాసటగా నిలుచుటకు పాండవులు పద్మవ్యూహ మును జొచ్చుటకు యత్నింప, సైంధవు డడ్డుపడెను. సైంధవుడు పాండవుల నాపివేయుట వింతలలో వింత. ఒకానొకప్పుడు అల్పు డుగా గోచరించు వాడును విజృంభించి అధికులను జయింప వచ్చును. ఈశ్వర వర సంజనిత్త శక్తిగ భారతకథలో ఆ సన్ని వేశము సమర్థింప బడినది. నిత్యజీవితమున గూడ అప్పుడప్పుడు సైంధవులు తారసిల్లుచుందురు. భారతము నందలి జీవత్పాత్రము

లలో సైంధవ పాత్ర మొకటి. సైంధవ విజృంభణమును తిక్కన మూలము నందలి వన్నె కగ్గకుండ నభివర్ధించెను.

**సింధుదేశోద్భవస్థిరవాహనంబుల బూనిన యురదంబు పాలుపు మిగుల**
**రత్నమయోగ్రవరాహధ్వజంబు నభస్థ్సలిం జంచల పభల మెఱయ**
**సాంద్రచంద్రాతపసదృశమై యుజ్జ్వల చ్ఛత్త్రచామరముల ఛాయ నిగుడ**
**వజ్రముక్తాఫలవ్రజకిరణావళి కలిత భూషణములు వెలుగు చుండ**

**జిత్తమున వరగర్వ్వంబు చిగురులొత్త**
**బాండుపుత్రుల దుర్దాన్ తబాహుబలము**
**మొనల పెల్లును సరకుగా గొనక యేచి**
**యార్చి వారికి నీయల్లు డడ్డ పడియె.**

సైంధవుడు పాండవులను బద్మవ్యూహము జొరకుండ నడ్డు పడెను. అటు అభిమన్యుని వీరవిహారమును గాంచి చివరకు కర్ణుడు గూఢ 'గాండీవి గలనం గదిసి యెఱుంగుదుమ గాదె యతనిచే ఇంత బెట్టిదంబు గాద' ని చెప్పిన ద్రోణుడు అల్లన నగి "చేత ధనువుండ నవ్వీరు జెనక వశమె దేవతలకు స్నానైన గావున నొక్కమై విల్లుద్రుంచి విరథు జేసి చూచికొందమని" పాపశంక దక్కి ఉపదేశించును.

కర్ణుడు భయంబెదగూరిన వాడ పోలె, పిరింది కొదిగి 'వంచనమెయి' అభిమన్యుని విల్లుదుంచును.

**గురు డశ్వంబులం గూల్చెను**
**సరభసముగ గృపుండు సంపె సారథి నమ్మె**
**నరసుతు డనాయుధుండును**
**విరథుండును నగుట సూచి వెఱపేది వడిన్.**

**శకుని క్రుతవర్మ శలభూ**
**ష్లిక గురుసుతు లాదిగా ననేకు లడరి య**
**స్త్ర కలాపంబుల శస్త్ర**
**ప్రకరంబుల నొంచి చిక్కు వఱచి యలచినన్.**

కాని అభిమన్యుండు విరథుడైనను యుద్ధము మానలేదు.

**గదగొని యశ్వత్థామం**
**గదియుడు దంభోలికొదమకైవడి మెఱుగుల్**
**వొదలించుదాని గని కడు**
**బెదరి యతడు రథము దిగ్గి పిరిదికి జనియెన్.**

చివరకు—

**వనగజ మంబుజాకర మవారణ జొచ్చి కలంచి యాడగా**
**మనమున గొంకు లేక క్రృపమాలినబోయలు ముట్టి చంపు చా**
**డ్పున భవదీయ సేన పొరిపుచ్చగ జుట్టును ముట్టి పార్థనం**
**దను నలయించి నిర్దయవిధంబున జంపి రనేక సైనికుల్.**

మృతుడై పడియున్న అభిమన్యుడు యుద్ధరంగమున, “ఊర్వీపై పడియున్న సుధాంశుభంగి” నుండెను.

**నెత్తుట దోగి నెల యెరనింగి తెరవంగున నుండె నక్కు మా**
**రోత్తమ డందు జంద్రు క్రియ నొప్పె సితాయుధఖండభూషణో**
**దాత్తమణి ప్రతానములు తారలచందము నొంది యందమై**
**యత్తరి నుల్లసిల్లె వసుధాధిప చూపఱపిందు చూడ్కకిన్.**

అభిమన్యుని మృతకళేబరముతో గూడిన యుద్ధభూమి “అంద మై” అత్తఱి నుల్లసిల్లెనను వర్ణనము మూలములో గూఢ గలదు. సంగ్రామ రంగమును దారుణ ప్రియ దర్శనంబను వర్ణనము పలుమారులు మూల ము నందును తారసిల్లును.

తిక్కన యుద్ధ వర్ణనము చాలచోటుల సంక్షేపించినను, దారుణ ప్రియదర్శన మను వర్ణనము విడువలేదు. అంతేగాక, ఇప్పట్టున మూల ములో లేని వర్ణనమును గూఢ అధికముగ జేర్చెను.

**కరికళేబరములు ధరణీధరములు దురంగగాత్రమ్ములు గ్రాహసమితి**
**నరశరీరములు మీనములు గౌక్షేయక క్షురికాదిశస్త్రంబు లురగకులము**
**రుధిరార్ద్రశరములు రుచిరప్రవాహముల్ ప్రేవులప్రోవులు ఫేనతతులు**
**నెత్తురు వెల్లువ నీళులు భాషణ స్తోమాస్తిచయములతుమురు లిసుక**

**గాంగ నంబురాశికరణి సంగ్రామభూ**
**భాగ మొప్ప మిగుల భవ్యయోగ**
**నిద్ర నున్న విష్ణునికి బాటి యగుచు శో**
**భిల్లె నమ్మురారి యల్లు డంచు.**

తిక్కన యుద్ధరంగమును ప్రేమించినట్లు కనుపించును.

అభిమన్యు మరణమునకు ధర్మరాజు శోకించుట—నారదుండు చెప్పిన మృత్యుదేవతా ప్రభావ వర్ణనము తిక్కన సంక్షే పించెను.

అభిమన్యు మరణ వార్తవిని సుభద్ర శోకించుట మూలములో వలెనే తెనుగున గూఢ హృదయవిదారకముగ నున్నది.

**మేను మృదుశయ్య సగమున నా మేనిమీద**
**సగము గా జేర్చికొని ముద్దు మిగుల నిద్ర**
**సేయునట్టి నీ విప్పుడు చేనటి నేల**
**దనువు వొందుట కోర్చితే తండ్రి చెప్పుమ.**

మాతృకలేని పై పద్యము మఱింత హృదయ విదారక మని పించును.

సైంధవ వధ ఘట్టము మూలములో మిక్కలి విపులముగ నున్నది. తిక్కన ఆ ఘట్టమును యధోచితముగ సంక్షేపించెను. సాత్యకి ధర్మజ పేరితుడై అర్జుననకు దోడ్పడ నేతెంచెను. అతనికి దుశ్శాసను డడ్డుపడి ఓడిపోయి పలాయితుడై ద్రోణుని మరుగు చేరును. సేనాపతి యైన ద్రోణుడు "ఏమి యువరాజా! విభునకు సేమమే? నీ వేమిటి కిట్లీ రధికస్తోమముతో విఱిగి తెందు జొచ్చెద వింకన్" అని యెత్తిపొడిచి,

**అడుకులు దిన్నట్లగునే**
**కడుపున గుట్టెత్తినపుడు గడు  బఱచితి నా**
**డొడ లెఱుంగక పాండుసుతుల**
**నుడిగి మడుగ వలసె  నిప్పు డొక సాత్యకిచేన్.**

అని చీవాట్లు పెట్టును. అంతేగాక "సిగ్గఱి తుది నిట్టులైతే తగు నక్కట తియ్యనగావె ప్రాణముల్" అని

**బదుక దలంచి తేని బాంధునందనులకు**
**నింక నైన బుడమి యిచ్చునట్లు**
**గాగ నన్నుతోడ గార్యంబు జెప్పు మ**
**వ్వెడగు భీష్మ బుద్ధి వినక చెడియయె.**

పాప మాతడా మాటల వినియు వినని చెవులు చేసి మగుడ విక్ర మమునకున్ గొనకొని యేమియు బలుకక చనియె.[1]

వీరకేతుడు ద్రోణునిచే గూలిన నతని యన్న దమ్ములు "ద్రోణ రథంబు బాణమయంబు సేసిన నతండు"

**వారలరథ్యంబుల ద**
**త్సారథులం బోడవడంచి ధర దొరగించెన్**
**వారిశిరంబులు పువ్వుల**
**వారణమెయి డల్చు గంధవహుడుం బోలెన్.**

ద్రోణుని పంచమ దివసమున రాత్రి గూడ పోరుసాగినది. చంద్రో దయము వరకు ఉభయసేనలు విశ్రమించి తిరిగి పోరున కుపక్రమింప వచ్చునని అర్జునుడు ఎలుగెత్తి చాటును. ఉభయ పక్షముల వారును విశ్రమించిరి. కొంతసేపటికి చంద్రోదయమైనది. మూలమున చంద్రో దయమైనట్లున్నది గాని తిక్కన చంద్రోదయము ప్రబంధోదయమునకు వేగు జుక్కయైనది.[2] దీనికి మూలమున మాత్రుక మృగ్యము.

**నలువ చెందోవలరేకులకు నన్నువు వెట్ట గోరి**
**కా వించినగుళిక యనంగ**
**నఖిల ద్విజ శ్రేష్ఠ మగు చకోరచయంబు**
**తపముసమల్లసత్ఫల మనంగ**

---

1. మూలమున ద్రోణుండు దుశ్శాసనుని ఉపాలంభించుట విస్తరముగా గలదు. తిక్కన సంక్షేపించెను.
2. తతః కుముదనాథేన కామిని గండపాండు సా
   నేత్రానందేన చందేణ మాహేంద్రదిగలం కృతా !!
   తతో ముహూర్తాద్భగవాన్ పురస్తాచ్ఛ లక్షణః
   ఆరుణ్యం దర్శయామాన గ్రసంజ్యోతిః ప్రబాం ప్రభుః

అను మూలశ్లోకములను ఇట్లు ప్రొఘండై కామినీగండ పాండుచ్ఛవిం దొట్టి కుముదంబులకు జగన్నేత్రంబులకు నానందంబు నాపాదించుచు జంద్రుండు మహేంద్ర ప్రముఖదిఙ్ముఖంబు అలంకరించెనని తరువాతి గద్యలో ననువ దించెను.

**జిగురుజొంపము నునుజిగియొప్ప నుదయాద్రిం**
**బొలుపారునవకల్ప భూజమనగ**
**బూర్వపయోరాశి పొంత గెంజాయచెన్నొదవిన**
**పవడంపు బోద యనంగ**

**నరుణిరుచి దనమండల మతిశయిల్ల**
**బొడిచి దివిబ్రాకి దీధితు లడర జేసి**
**యంత కంతకు నెక్కుచు సంతమసము**
**గాలుకొననీక చందుడు గ్రాలెనధిప.**

విరాట ద్రుపదులం జంపి ద్రోణాచార్యడు విజ్రుంభించెను. "ధర్మజ భీమసేన మాద్రీ తనయులు గూడికొని తమలోన, కరుళం గూల్చుచు దేరులన్ నఱకుచున్ గర్జిల్లి ఘోటమ్ములన్ నరులన్ నెత్తుట దేల్చుచు "దోణుడు విజ్రుంభించు చున్నవాడు. నరుండును ధర్మపరుండై యారకుండెనని చింతించెదరు.

శ్రీకృష్ణుడు

**అని మొన దేవదానవుల కైనను గెల్వ నశక్య మిమ్మహా**
**త్ముని నొకమందు సెప్పెద సుతున్ హతుడయ్యె ననంగవిన్నయం**
**తన యుత డా యుధంబు దిగ ద్రావి యచేష్టత బొందునప్పుడీ**
**తని బరిమార్చ వచ్చు నిది దప్ప నుపాయము గల్గ దెమ్మెయిన్.**

కావున నశ్వత్థామ సచ్చెనని యొక్కరుం డతనికిం జెప్పుట కర్తవ్యంబని నిర్వ్యచించును.

శ్రీకృష్ణుడు మనస్తత్వజ్ఞుడు. అతడు ద్రోణుని శీలమును అనుశీలించి ఆయువుపట్టును గుర్తించినవాడు.

ద్రోణుడు యాచ్ఞా దైన్యముతో ద్రుపదుని కడ నిల్చి పరాభూతు డగుటకు అతని "పుత్రేషణ" యే మూలకారణము. అశ్వత్థామను పాలుపోసి పెంచ దలపోసి, కందమూలముల భక్షించుచు అరణ్యములో నుండ వలసిన యాతడు రాజసభ కరిగెను. పిమ్మట, ధనార్థియై పరశురాముని కడ కేగును. ధనేషణ గాదు ద్రోణుని పురికొల్పినది. పుత్రేషణయే. పరశు రాముడు " కల ధన మెల్ల" జగన్నుత విప్రుల కిచ్చి, వార్ధిమేఖల నిఖిలోర్వి యంతయును కశ్యపుడను మునికిచ్చితిని నాదగ్గర శరీర శస్త్రము

లు మిగిలినవ" నును. పరశురాముని వచనములలో విప్రుడు జగన్నుతుడు గావలెనే గాని, ధనేషణ పెంచుకొనగూడదనియు, తాను గూఢ ధనము నుజ్జగించి, పరాక్రమోప జీవనము వదలి తిరిగి తపశ్చర్యకుపక్రమించితినని యు నను నంశములు ధ్వనించు చున్నవి. ద్రోణుండు గూడ, పరశురాముని "ఊర్వీనుత" యని సంబోధించి, ధనములలో నత్యుత్తమ ధనములు శస్త్రాస్త్రములే యని విద్యా ధనమునే యర్థించి కృతార్థుడగును. కాని—తిరిగి అతడు హస్తినాపురమున కేగి, కురుపాండవ కుమారులకు ఆచార్యుడై కొలువునకు గుదురుకొనును. తాను రాజగురువై ద్రోణుడు పుత్రుడైన అశ్వత్థామను రాజకుమారునివలెనే పెంచెను.

భీముడు గూడ, "అహింసా పరమో ధర్మః అని ఉపదేశించు విప్రుడవు—నీవు హింసా కర్మ కుపక్రమించి చ్యుతుడ వైనావు. బాహ్మణ చ్యుతితో క్షతియ చ్యుతి యేర్పడినది. అధర్మ యుద్ధమున నీవు కూడ పాపము పంచుకొనక తప్పదని" అధిక్షేపించును.

వేదవేదాంగ పారంగతుండు ధనురాచార్యుడు మహాను భావుడైన ద్రోణుని జీవిత చరిత్రను తీర్చిదిద్దినది అతని పుత్రేషణ. అతని ధర్మచ్యుతికి గూఢ ఆ పుత్రేషణయే మూల కారణమైనది.

తనకు బ్రాణము ప్రాణమైన ఆ అశ్వత్థామయే మరణించిన ఇక తానే లేడు. ఇంతవరకు అతడు గడపిన జీవితమంతయు వృథయే. మానవ మనస్సును క్షీరసాగరమువలె మథించిన శ్రీకృష్ణుని కా విషయము అవగతపూర్వ్వము. అందుచే అతడు ఆ సలహా నొసంగెను. శ్రీకృష్ణుని ఉపదేశము మనంబున నిడి భీముడు మాళవేంద్రుడగు నింద్రవర్మ వారణంబు నశ్వత్థామయను పేరిటిది చంపి, యది నెపంబుగ ద్రోణునితో 'అశ్వత్థామ' చచ్చెననని చెప్పను.

కాని ద్రోణుడు అశ్వత్థామ సామర్థ్యము దెలియనివాడు గాడు. అయినను, 'అజాతశత్రువులన నున్న రూపు దెలియువాడై అతని నడుగును.

భీముడు ధర్మరాజు నసత్యమాడ పేరేపించును.

శ్రీకృష్ణుడు గూఢ

**అడరి యా దివసమున పరాహ్ణ మునను**
**ద్రోణు డ ని సేసినక్లైన ద్రుంగిపోక**

**యుండ నేర్తురే యిక్కడి యోధు లెవ్వ**
**రైన వినుమతిగాదు సత్యమ్ము సుమ్ము.**

**మము నీతని కొప్పింపక**
**సమచితముగ గాచికొను మసత్యవచనదో**
**షము లేదు ప్రాణరక్షణ**
**సమయంబున నతని కొడుకు సచ్చె ననుమీ.**

అని పనిచెను.

ఈ వృత్తాంతము శ్రీకృష్ణ ద్రోణ ధర్మజ శీలములకు ముయ్యేల గుట్టయైనది, "యతోధర్మ స్తతో జయః" "యతో ధర్మ స్తతో కృష్ణః" ధర్మ సూక్ష్మమును శ్రీకృష్ణు డొక్కడే తెలిసిన వాడని సమకాలీనులలో ప్రశస్తి గలదు. ధర్మమనునది జడ సిద్ధాంతము గాదనియు నది నిత్యచైతన్య పూరితమైన అనుష్ఠాన వేదాంత మనియు నిరూపించిన వాడు శ్రీకృష్ణుడు.

**"మది నయ్యె రువురమాటలు**
**బదిలంబుగ బట్టికొనుటు బట్టియు నెట్లుం**
**దుది నది యట్టుల కాగల**
**యదియై యుండుటను దాని కథ దొడబడియెన్.**

ధర్మరాజు జరుగవలసినది జరుగక మానదను వేదాంతమునకు లోనయ్యెను. అందుచే తెగించి

**అనృత భయము నాజిజయము**
**గనియెడుతమకంబు పెంపు గుదియింపగ బాం**
**డునరేంద్రు నగ్ర తనయుం**
**డనుమానము వాయ బెట్టి యస్త్రగురునితోన్.**

**వలయుకొలాది నెలుం గెత్తి వర్గ సమితి**
**యచ్చు పడగ నశ్వత్థామ సచ్చెననియె**
**నని పదంపడి యల్లన యతని చెవికి**
**వినగ రాకుండ గుంజరమనియె నధిప.**

ఇవ్విధంబున బలుకుటయు

**నేలకు నల్లెడు పాడువున**
**గ్రాలుచు మును మెఱయు గురుని రథచక్రము ల**
**క్కాలంబున సమరజయ**
**శ్రీలోపము దెలియ నంటసిల బడియె నృపా.**

ఇప్పట్టున మూలము అనుశీలింప దగినది.

**తస్య తద్వచనం శృత్వాకృష్ణ వాక్యపచోదితః:**
**భావిత్వాచ్చ మహారాజ వక్తుం సముపచక్రమే !!**
**సో పృతధృభయే మగ్నే జయే సక్తో యుధిష్ఠిరః:**
**అశ్వత్థామా హత ఇతి శబ్దముచ్చైశ్చకార హ !!**
**అవ్యక్త మబవీద్రాజన్ హతః: కుంజర ఇత్యుత !!**
**తస్యపూర్వం రథం పృథ్వ్యాశ్చతురంగుళముత్తరః:**
**బభూవైవం తు తేనోక్తే తస్యవాహః: స్పృశన్ మహీం**
**యుధిష్ఠిరాత్ తు తద్వాక్యం శృత్వా ద్రోణో మహారథః:**
**పుత్రవ్యసన సంతప్తో నిరాసోఽజీవితే భవత్.**

ధర్మరాజు అశ్వత్థామ హతః అని పెద్ద యెలుంగున కుంజరః అని పిన్న యెలుంగున చెప్పిన మాట జగత్ప్రసిద్ధము. అతడు అసత్యమాడగనే అంతవరకు చతురంగుళములు పృథివికి పైన నంటకుండగ నుండిన అతని రథము అశ్వములతో భూమి నంటెను. యుధిష్ఠిరుని వాక్యములు విని దోణుడు పుత్ర వ్యసన సంతప్తుడై జీవితమునందు నిరాశుడయ్యెనని మూలభావముగ దోచుచున్నది.

కాని తిక్కన మాత్రము ధర్మరాజు, "ఇవ్విధంబున బలుకుటయు" గురుని రథ చక్రములు అంతవరకు భూమిపై నుండెడివి భూమిపై నంటసిలబడెనని తెనిగించెను.

ఇది ద్రోణపర్వములో తిక్కన చేసిన ప్రధానమైన మార్పు. ధర్మరాజు అసత్యమాడిన, ద్రోణుని రథ మేల క్రుంగవలె. "సమరశ్రీ జయలోపము దెలియ" అని తిక్కన సమర్ధనము. విప్రశాపముచే కర్ణుని రథమున కది వర్తించును గాని ద్రోణుని కట్టి శాపము లేదే. ఆదియును గాక అంతవరకు ద్రోణుని రథమేల చతురంగుళము లున్నతముగ నుండ వలె? ధర్మమూర్తి అజాత శత్రువునగు ధర్మరాజు రథము ఎల్లప్పుడు

భూమికి నాలుగంగుళములు పై నుండెడిదనియు అసత్యమాడగనే ఆ రథము నేల నంటెననెడి వర్ణనము అద్భుతావహమే గాక కవితాభావన పరాకాష్ఠ చెందిన మనోహర కల్పన.

తెలుగు దేశములోని భారతదేశమున వివిధ ప్రాంతములలో జనశ్రుతిలో ధర్మరాజు రథమును గూర్చిన కథయే ప్రచారమున ఉన్నది.

శ్రీ చక్రవర్తి రాజగోపాలాచార్యులుగారు ఆంగ్లమున వాసిన సంగ్రహ మహాభారతమున సత్యసంధుడనిపించుకొనిన ధర్మరాజు అసత్య మాడగనే అతని రథము—అంతకుపూర్వ్వము భూమి కంటక నాలుగంగుళములు సదా పై నుండినది, —భూమి నంటినదని వ్రా సినారు.

" When the words of untruth came out of Yudhistara's mouth, the wheels of his chariot, which until then always stood and moved four inches above the ground and never touched it, at once came down and touched the earth. Yudhistira who still then had stood apart from the world so full of untruth, suddenly became of the earth, earthly. He too desired victory and slipped into the way of untruth and so his chariot came down to the common road of mankind."

సంస్కృత మహాభారతమును ఆ మూల చూడముగ ఆంగ్లమున కనువదించిన శ్రీ పతాప చంద్రరాయ్ గారు కూడ " ఇటు జయాశ—అటు అసత్య భయముతో యుధిష్ఠిరుడు అశ్వత్థామ హతుడయ్యెనని ప్రస్పుటముగను, ఏనుగు అను మాట మెల్లగను వచించెను. అంతకు పూర్వ్వము "యుధిష్ఠిరుని రథము" భూమికి నాలుగంగుళముల పై విలసిల్లినది. కాని అతడా అసత్య వాక్యమును పలికినంతనే అతని రథ్యములు భూమిని తాకినవి" అని వాసిరి.

Fearing to utter an untruth, but earnestly desirous of victory, Yudhistara distinctly said that Aswathama was dead, adding indistinctly the word elephant (after the name). Before this, Yudhistara's car had stayed at a height of four fingers breath from the surface of the earth. After however he had said the untruth his (vehicle and) animals touched the earth.

By Pratap Chandra Roy, C. I. E.

మహారాష్ట్ర భాషలోనికి సంస్కృత మహాభారతమును గద్యానువాద మొనరించిన విష్ణువామన్ బాపట్ బాలచంద్ర శంకర దేవస్థలీ గారలు గూఢ యుధిష్ఠిరుని రథమే భూమి నంటిన దని వ్రాసిరి.

"అనే మొర్వ్యానే బోలూన్ కుంజర్ శబ్ద్ స్యానే అవ్యక్త ఉచ్చారలా. యా పూర్వీయుధిష్ఠిరాచా రథ్ పృథ్వీ పాసూన్ చాత్ అంగులే ఉంచే అసే పరంతుస్సానే అనే భాషణ్ కరతాంచ రథాశ్వ ఎకాయెకి భూమివత్ ఉభే రాహిలే."

కన్నడమున గద్యానువాదమున గూఢ ధర్మరాజు నోటి నుండి ఆ మాటలు రాగానే—అతని రథము అంత వరకు భూమికి నాలుగంగుళములు పై నుండెడిది—యీ అసత్య వాక్యము వలన రథాశ్వముల పాదములు నేలను తాకెను అని యున్నది.

**" ఒందు కడె జయాకాంక్షె ఇన్నొందు కడె అసత్యద భీతి**
**ఇవెరడరింద డోలాయమాన హృదయనాగి**
**అశ్వత్థామా హతః: ఎందు గట్టియాగి కూగిహెూళి**
**ఒడనయే కుంజరః: ఎంబ శబ్ద వన్ను**
**మెల్లగ నుడిదు మాతన్ను ముగిసిదను."**

ధర్మరాజున ముఖదింద ఈ మాతు పారడుపు దక్కె మొదలు అవన రథపు భూమి యింద నాల్కు అంగుళ గలిగె మేలే నింతిద్దితు. అవన బాయింద యీ సుళ్ళుమాతు హొరటొడనే అవన రథాశ్వగళ పాదగళు నెలవన్ను ముట్టిదుపు."

కాని శ్రీ శ్రీపాద కృష్ణమూర్తిశాస్త్రిగారు అనువదించిన శ్రీకృష్ణ భారతము నందు "క్షితిసురు" అరదమనియే యున్నది.

**అస్రుృత భయంబు జయాశయు**
**మనమున బెన గొనగ దెగువమై యమరాణ్ణం**
**ధను డశ్వత్థామ మడిసె**
**నని యేర్పడ బలికి హస్తి యని యల్లననెన్.**

అని పాండవాగ్రజుండు పలికి నంత

**చతురంగుళొన్నతంబై**
**క్షితిమీదం దెలియాడు క్షితి సురు నరదం**
**బతనికే నపజయమతికెడు**
**గతి క్రిందికి నంటసిల్లె గనుగొనుచుండన్.**

శ్రీ శ్రీపాదవారు గూడ మూలములో లేకపోయినను “అతనికి అపజయ మతికెడు గతి” అను మాట చేర్చుటచే—వారు ‘సమర శ్రీ జయ లోపము దెలియ’ అను తిక్కన గారి వ్యాఖ్యానము ననుసరించిరని తేలు చున్నది.

ద్విపద భారత కర్త గూఢ తిక్కననే యనుసరించెను.[1]

తెలుగు దేశములోని జనశ్రుతి—ఇతర దేశ భాషలు గూడ తిక్కన చేసిన ఇంతటి ప్రధానమైన మార్పునకు అనుకూలముగా లేవు.

కర్ణపర్వారంభము నందు తెలుగు భారతమున

“అట్లు మహాప్రాజ్ఞుండగు సంజయుండు దండున నుండి హస్తిపురంబున కరుగు దెంచి ధృతరాష్ట్రు మందిరంబు ప్రవేశించి యంతఃపురంబున నున్న యన్నరనాధుం గనుంగొని కృతప్రణాముం డగుటయు నతం డాదరించిన నాసీ నుండై” యని గలదు.

1. ద్విపద బారతము—తిమ్మకవి కృతబాగము.
వాయుసూతియుం బల్క వసుధేశుతోడ;
“వారణం బొకటి యశ్వత్థామ యనంగ
ఘోరాజి నా చేత గూలిన నేను
నాచార్యునకు దంతియునకు యీ వార్త
సూచింప నతండు నా సుద్ధి నమ్మకయయ,
నినునడ్గు చున్నాడు నీవును దంతి
మనమున నిడుకొని మాట యిట్లాడు,
హరిగల్ల మనకు దోపాదోష చింత
కురుపంశ్రలే” దన్నం గొంకుచు నతండు
సరి ననత్య భయంబు సమర భయంబు
“ నిరువంక దివియంగ నటు తొటువడుచు
దోణునితో బల్క” దురము లోపలను

....
హతుండయ్యె మఱియు నశ్వత్థామ యనును
నాతత ధ్వని నాడి యట్లని వెనుక
“ననుపగజ” మన నప్పిన్న మాట
వినక దోణుండు భీతి విల్లట్లు విడిచి
భూమికి మిన్నెత్తు పాడుపున వచ్చు
నే మఱపు రథమందు నిశ్శంక గుంగి
పుత్ర శోకాంధుడై బుద్ధిలో బాంధు
పుత్ర విరోధ మప్పుడు చక్కవిడిచి,
శత్రుని నెదుట ధృష్టద్యుమ్మునియు
నాతౌప మాగర్వ్వమాళ దొఅగి

సంస్కృత భారతము నందు సంజయుడు ధృతరాష్ట్రు నొద్ద కరుదెంచి నపుడెల్ల "సంజయోహం మహారాజ నమస్తే భరతర్షభ" అని పల్కుటచే వచ్చినది సంజయుడని అంధుడైన ధృతరాష్ట్రుడు గుర్తించుట కనువుగ నున్నది. అట్లే తెలుగున "ధృతరాష్ట్రుండు సంజయు దిక్కు మొగంబై" పలుకు ననియే - పలుమారులు తిక్కన ప్రయోగించును.

కర్ణుని మరణ వృత్తాంతమును సంజయుండు ధృతరాష్ట్రునకు వినిపించి, "శోకోప హతుండై సూతసూనుండు నిట్టూర్పు నిగిడించి డగ్గుత్తిక వెట్టి" దుశ్శాసన మరణ వార్త చెప్పును. మూలమున "సంజయః:" అని మాత్రమే గలదు. యథా ప్రకారము ఈ ఆంగికసాత్త్వికాభి వర్ణనము తిక్కన చేర్చినదే.

కర్ణుడు గూలుట "ఆబోతు బెబ్బులి కగ్గమైన పగిది పాండవులకును బగ యడంగే" నని ముక్త సరిగ తిక్కన తెనిగించెను. మూలమున ఉపమాన పరంపరలతో విపుల వర్ణన గలదు.

"శోషణం సాగరాణాం వా పతనం వా వివస్వతః:
విశీర్ణతా యథా మేరో కర్ణస్య పతనం తథా !!

ఇట్టి వర్ణన కర్ణుని గూర్చియేగాక, భీష్మ ద్రోణాది మహావీరులు గూలినప్పుడు గూడ సంస్కృత మహాభారతమున గలదు, పునరుక్తిని బరిహరించుటయో గాక సంక్షేప మొనర్పుటయు తిక్కన ఆశయముగావున ఆతడిట్టి వర్ణనలను వదిలి పెట్టెను.

ధృతరాష్ట్రుండు తన చిత్తము విభ్రాంతిలో మునిగినదని కయ్య మున నిరుపక్షముల చచ్చిన వీరుల బ్రదికి యున్న వీరులను వివరించి చెప్పు మని సంజయు నడుగును.

మూలమున ౧. పాండవుల బలమున చచ్చినవారు

౨. కురు బలమున చచ్చినవారు

3. పాండవుల బలమున బదికియున్నవారు

౪. కౌరవ బలమున బదికి యున్నవారు

అను నాలుగు తెరగుల వీరుల గూర్చి నాలుగు అధ్యాయ ములలో నున్నది. తిక్కన ఒక గద్యలో సంక్షేపించెను.

"మన యందు భీష్మ ద్రోణ కర్ణ విక్రర్ణ వృష సేన దుశ్శాసన లక్ష్మణాదులును వారలలోన విరాట శంఖోత్తర ద్రుపద ఘటో త్కచాభిమన్యు పాండ్య ప్రముఖులును వేరువేఱ నిట్టిట్టి వారిచేత నిట్టిట్టి

వారు తెగిరని యేర్పడ నెఱింగి" నని తిక్కన సంక్షేపించెను. తెనుగులో ధృతరాష్ట్రుడు కర్ణుని గూర్చి విలపించుచు

**ఆలలోని యా బోతును బోలె నెప్పు**
**గురుబలంబులో నున్నద ద్విరద మూర్తి**
**సింహసంహన నుండు నిస్సీమవిక్ర**
**మాభిరాముండు పోయెనే యక్కటకట.**

అని అనును.

**వృషభో వృషభ స్యేవయో యుద్ధేన నివర్తతే**
**శత్రోరపి మహేంద్రస్య సింహ సంహననో యువా !**

అని మూలము నందున్నది.[1] తిక్కన ఉపమాన ప్రయోగముల నెడనెడ స్వతంత్రించెను.

తెలుగున "అని పెక్కు భంగుల నివ్వటిలు నెవ్వగలు బయలు పడం బలుమాటలాడి రాధేయు తెగిన తెఱంగు తెలియ వినందలంచి యిట్లనియె" అని తిక్కన ధృతరాష్ట్రుని విలాపమును సంక్షేపించెను.

కర్ణ పర్వారంభమునందు దుర్యోధనుండు అశ్వత్థామాది దొరలతో నెవరిని సేనాపతిగా జేయదగుననని చర్చించెను.

అశ్వత్థామ

**మనము బలశౌర్యఘను గ**
**ర్ణుని సేనా ముఖము సేసి నూల్కొని యరిమ**
**ర్దన మొనరింత మితనియం**
**దనూనతం బొల్చు సద్గుణా వలియు నృపా.**

అని కర్ణుని పేరు ప్రతిపాదించును. అశ్వత్థామ నోట కర్ణునిలో సద్గుణావళి అనూనతం బొల్చునను మాట వెల్లివిరిసినది. మానవ జీవితములోని విచిత్ర విరోధా భాసములలో నది యొకటి.

1. ఉచ్చైః శవ వరో శ్వానం రాజ్ఞం వైశ్రవణోవరః
వరో మహేంద్రో దేవానం కర్ణః పహరతాం వరః!!

అని ధృతరాష్ట్రుని నోట మూలములోనున్న నిట్టి శ్లోకములు పెక్కంటిని తిక్కన తెలుగులో అనువదించలేదు. ఈ ఫనితి సంస్కృత మూలమున పలుతావుల గన్పించును. తిక్కన తెలుగున నీ ఫ నితినే విడిచిపుచ్చెను.

'ఉచితంబుగ దైవము తోడు పాటునుం గలిగెడు గాక యున్న రథిక ప్రవరుల్ దలపోయ నల్పులే' అని పోత్సాహ వాక్యములు పలుకును.[1]

దుర్యోధనుండు పీతుండై కర్ణుండు పాండవుల జయించునను నాస యగ్గలంబైన యంతరంగంబుతో నయ్యంగ పతిని సేనాపతిగ వరించెను. దుర్యోధనుండు 'హతే భీష్మే మృతే దోణే కర్ణో జేష్యతి పాండవాన్' అనుకొనెనని మూలము. భీష్మదోణులు చనిపోయినప్పటికి ఆశ అట్టిది. కర్ణుడు మరణించిన పిమ్మట గూడ పాపము దుర్యోధనుండు 'శల్యో జేష్యతి పాండవాన్' అను కొనునది భారతీయ సాహిత్య సంసారమున చిరస్మరణీయమైన సుభాషితమై జనశ్రుతిలో ఆశాపాశ మునకు పర్యాయపదమై నిలిచినది. 'భీష్ముడు ద్రోణుడు ఉపేక్షించిరి నీవయిన లీలన్ గెల్తు కౌంతేయులన్' అని దుర్యోధనుం డగ్గింప 'కర్ణుడు, భూలోక సంచారు లెల్లను గీర్తింపగ బాండు పుత్రుల మర్దింతు' నననును. మూలమున 'జితాన్ విద్ధి చ పాండవాన్' అను కూర్పు మిక్కిలి మనో హరము.

కర్ణుడు సేనాపతిగ యుద్ధమునకు వెడలుట మూలమున నున్నట్లే తిక్కన మనోజ్ఞముగ తెలుగున ననువదించెను.[2]

**తళతళ మనియెడు దంతప్రభలతోడ**
**ఘనకేతువున హస్తి కక్ష్య మెఱయ**
**హంసవర్ణ ములైన హయములపటుగతి**
**నర్క ప్రభంబగు నరద మొప్ప**
**దీప్త కాంచన రసలిప్తమై చెలు వొందు**
**సజ్య కార్ముకము హస్తమున వెలుగ**

---

1.మూలమున
సత్త్వేవ కార్యం నైరాశ్యం అస్మావిర్విజయం ప్రతి
సునితైరిహ సర్వార్థై దైవ మ్యసులోభృతే—అను పలుగులు మిక్కిలి హృదయంగమములు.

2. తత శ్వేత పతాకేన బలాకా వర్ణ వాజినా.
హేమ పృష్ఠేన ధనుషా హస్తి కక్ష్యేణ కేతునా !!
తూణీరశతపూర్ణేన సగదేన వరూధినా.
శతఘ్ని కింకిణీ శక్తి శూలతోమర ధారిణా !!
కార్ముకై రూప పన్నేన విమలాదిత్య వర్చసా
రథేనాపతతా తేన సూతపుత్రో వ్యదృశ్యత

**వీటికి సమర సమాటోప మొదవ నా**
**భీలశంఖము దనమ్రోలమ్రోయ**
**రణసముత్సాహలక్ష్మి వక్త్రమున వింత**
**చెన్ను వెలయింప నాప్తులు సేరి రెండు**
**పక్కియలయందు బవరంపు బలుకు లెసంగ**
**నడవ సాంపారికర్ణుండు వెడలె నధిప.**

రణ సముత్సాహ లక్ష్మి కర్ణుని వక్త్రమున వింత చెన్ను వెలయించె నను తిక్కన వర్ణన అమూలకము. 'హస్తి కక్షేణ కేతునా' అను మూలమునకు తళతళ మనియోడు దంత ప్రభలతోడ ఘనకేతువున హస్తి కక్ష్య మెఱయ 'అనువాదముగ్గడింప దగినది. ఇట్లు' ఎల్ల దొరలును దురంబునకు నడవం దొడంగిన

**తురగరింఖాముఖోద్ధతధూళిపల**
**లములు నల్దిక్కు లలంకరించె**
**మాతంగకటగళ న్మదజలబహుళప్ర**
**వాహవిలాసంబు వాని నడచె**
**బహువిధవాదిత్ర భైరవారావంబు**
**పెల్లంబరము పిక్క్రటిల్ల జేసె**
**శింజనీటంకార సింహనాదంబుల**
**పెక్కువ యామ్రోత బిలుచుకొనియో**
**రథిక భూషణముల రశ్మల గేతన**
**చ్ఛతచామరోపస్తమణుల**
**రుచుల సుభటహేతి రోచుల బవలింటి**
**దివియచందమయ్యె దినకరుండు.**

పై సీస పద్యమునకు మాత్రుక మృగ్యము.

'సుభట హేతి రోచుల బవలింటి చంద' మైనది ఆ దిన కరుండే గాదు. అమూలకములైన యిట్టి వర్ణన లనుశీలించిన పట్టుల మూల ఘట్టములును అంతియ యని అప్పుడప్పుడైన అనిపింప గలిగిన అభినివేశము తిక్కన కుండుట తెలుగుల అదృష్టము.

ఉభయ సైన్యములకు ఆరంభమున సందడి కయ్య మయ్యెను. కర్ణ పర్వమున తిక్కన సంకులసమరములను పది పంక్తులలో నొక

గద్యలో సంక్షేపించుట కద్దు. భీమ్కుడు క్షేమ ధూర్తిని జంపి విజృంభింప అశ్వత్థామ అతనిం దాకును. 'అశ్వత్థామ భీమసేనుల సంగ్రామంబు భీమంబయ్యో' నని తెలుగు. మూలమున 'యథా దైవాసురే యుద్ధే వృత్రవాసరయోరివ' అను ఉపమ కూడ అధికముగా గలదు.

**ఆనిలజు ఫాలము గురునం**
**దనుడు పటు ప్రదర కీలితము సేయుడు నా**
**తనినిటలంబున నతం డే**
**పున బాణత్రయము నాటె భూవరముఖ్యా.**

మూలము నందలి వర్ణన మిక్కిలి మనోహరము. అశ్వత్థామ, లలాటమున నాటిన బాణము, అరణ్యము నందలి ఖడ్గ మృగము మూతిపై కొమ్ము వలె భీముడు దాల్చెనట. తిరిగి భీముడు నాటిన మూడు బాణములతో అశ్వత్థామ లలాటము వర్షాకాలమున నీటితో కూడిన త్రిశృంగ పర్వతమువలె నుండెనట.[1]

నకులుడు సేనాపతియైన కర్ణుని దలపడి యోడిపోవును.

**మర్మభేదు లైన మార్గంబుల కోహ**
**టించి సిగ్గు జలము డిగ్గ దావి**
**యెల్లజనులుం జూడ బొల్లదనంబున**
**కోర్చి యక్కు మారు డోడి పారె.**

**వెనుకొని రాధేయుండు ని**
**ధను వాతని కంధరమునం దగిలిచి నలి బ**
**ట్టిన నిందచాప పరిగత**
**ఘనాకృతిని బొలిచె నతండు కౌరవనాథా**

మూలమున

**తతస్సశు శుభే రాజన్ కంఠ సక్తం మహాధనుః**
**పరివేషమను ప్రాప్తో నభసీవ తమోనుదః**

అను ఉపమానమును వదలెను.

---

1. లలాటస్థం తతో బాణం ధారయామాస పాండవః
 యథాశ్రుంగం వనే వృష్టః ఖడ్గో ధారయతే నృప
 తతో ద్రౌణిం రణో భీమో యతమానం పరాక్రమీ
 త్రిభిర్వివ్యాద నారాచైర్ల్లలాటే విస్మయన్నివ
 లలాటస్తై స్త్రిబిర్బాణై రశ్వత్థామా వ్యరోచత
 పావృష్టంబు పరిక్షిప్త స్త్రిశృంగ ఇవ పర్వతః

తరువాతి శ్లోకము నందలి యుపమానమునే తిక్కన పరిగహించెను.

"యథా చౌ వాసితో మేఘశ్చక్రచ చాపెన శోభతే" అని మూలమున గూఢ గలదు. తిక్కన మూలములోని ఉపమలను వదలుట, ఉపమా పరంపర ఉన్నచో నొక దానిని మాత్రమే స్వీకరించుట కద్దు.

దుర్యోధనుండు శల్యుని జేరి కర్ణునకు సారథ్యము సల్పు మని ప్రార్థించును. గురు భీష్మాదులు మరణించినను, "నిను కర్ణుని గాదె నమ్మితిన్" "నిన్ను వినతుండనై వేడికొని యెద" నని ప్రార్థించును. కాని శల్యుడు తాను, కర్ణుని కంటె నేమి దక్కువ యనియునది తన కవమానమనియు బలుకును.

**అనిన విని కెంపుసొంపున**
**గనుగవ యుగ్రముగ బొమలు గదియగ ఫాల**
**మ్మున జెమటవొడమనీసుతు**
**గనుగొని యిట్టనియె నతడు కటము లదరగన్.**

మూలమున గూడ శల్యుని ఆంగికాభివర్ణనము కన్నుల గట్టునట్లున్నది.[1] మూలమున శల్యుడు కులైశ్వర్య విద్యామదము లతో నిండిన వాడు.

శల్యుడు

**విను మేను విక్రమింపగ**
**గనుగొనియెడు నంతవాడు గలడే కుల శై**
**లనికాయంబు పగుల్తున్**
**వనినిధులు గలంతు ధరణి వృత్తుం గలయన్.**

అని ఆత్మ స్తవము సల్పును.

అతని ఆత్మాభిమానమునకు ధూపము వేయ నేర్చిన వాడు దుర్యోధనుండు. అతడు శల్యునకు ముఖస్తుతి సల్పి, 'ధనంజయునకు రధిక

దుర్యోధన వచశ్శ్రుత్వా శల్యః: కోధ సమన్వితః:
ధార్తరాష్ట్ర మధో వాచ సృక్విణీ పరిలే విహన్
ఏవ ముక్తస్తు నంక్రుధ్ధః: పదా స్పృష్ట ఇవోరగః:
తిశిఖాం భ్రుకటిం కృత్వా ధూన్వన్ హస్తం పున: పున:
క్రోధ రక్తే మహానేత్రే పరివృత్య మహాభుజః:
కులైశ్వర్య శ్రుతబలై ద్రుప్త శ్శల్యో ఽబ్రవీదిదం

**నను గృష్ణు కంటె నధికుం**
**డని యుమ్మనుజేంద్ర కోటి యాకర్ణింపం**
**గొనియాడితి విమలయశో**
**ఘ ను  దగు కర్ణునకు రథము గడ పెద నధిపా.**

అని కర్ణు సారథ్యమునం కొడంబడును. అసలు శల్యుడు పాండవ పక్షమును వీడి కౌరవ పక్షమును జేరుటకు అతనికి గల శ్రీకృష్ణమాత్సర్యము గూడ దోహదము కల్పించినది.

"అఖిల గుణంబులను సారథి రథికున కధికుండుగా వలయునను నీతి" దెల్పి దుర్యోధనుండు త్రిపురాసుర వృత్తాంతంబును బహ్మదేవుండు శివునకు సారథ్యము చేసిన విధమును వివరించి చెప్పను. యథా ప్రకారము తిక్కన  ఈ ఉపాఖ్యానమును సంగ్ర హించి తెనిగించెను.

శల్యు డు సారథ్యమున కంగీకరించిన పిమ్మట

**మెఱుగుతోడ లలిత మేఘంబు మీదికి**
**బోయి వెలుగు భాను పోలుపు దోప**
**మద రాజసహిత మహితమై యొప్ప న**
**త్తేరు కర్ణు డెక్కి తేజరిల్లె.**

మూలమున రథ వర్ణ నము విపులముగా గలదు.

కర్ణ  పర్వము ద్వితీయాశ్వాసము నుండి 'శల్య సారథ్య' మారంభమగును. శల్యుడు ఉద్యోగపర్వమునందే ధర్మరాబునకు కర్ణుని 'తేజోవధ' సల్పుటకు మాట యిచ్చును. ధర్మరాజు "కూడని పని యని తెలిసి గూడ నిన్ను అర్థించుచున్నాడ" నని శల్యుని వేడికొనును. శల్యుడు కౌరవ పక్షమున జేరుట కూడనిపనియే. శల్యుని మనస్తత్వము మిక్కిలి విచిత్ర మైనది. ధర్మరాజు తెలివికలవాడు గావున శల్యుని మనస్తత్వము గనిపెట్టి చక్కగ దాని వినియోగించు కొనగల్గెను.

విశ్వసాహితీ జగత్తులో శల్య సారథ్యమువలె మానవ మనస్సును మథించి చూపిన సన్నివేశము అరుదు. సారథ్యము నారంభించిన మరు క్షణమునుండి శల్యుడు, కర్ణుని తూలనాడుట— అర్జునుని, పాండవులను స్తుతించుట ఆరంభించును.

**వీనులకుం బలుకులు సే**
**దైనను జెప్పుచు హితంబులగు కార్యంబుల్**
**దానికి నోర్వగ వలయుం**
**గాని యలుక వలదు నీకు గర్ణున కధిపా.**

అని అతడు సారధ్యమునకు ముందే యేర్పరచుకొనిన సమయమము. పైగా తాను చేయుచున్న పని " హితకార్యమే యట!"

మూలమున శల్యుని పలుకులు సువిస్తరములు. ఆతడు చెప్పిన హంస కాకియోపాఖ్యానము దుస్సహము. ఆ యుపాఖ్యానము తిక్కన మిక్కిలి సంక్షేపించెను. ఒక సంపన్న వైశ్యుని యింట ఎంగిళులు కుడిచి మదించిన కాకి హంసతో పందెము వైచి యోడిపోవును. సులభ గ్రాహ్యమైనది యిందలి అంతరార్థము.

శల్యుని మాటలు విని కర్ణుడు కోపోద్రిక్తుడై అతనిని అతని మాద్ర దేశమును దూలనాడును. మూలమున ఈ నిందా వాక్యములు సవిస్త రముగ నున్నవి. మద్రకుడు 'చెలిక గీడొన రించు, అతికుటిలుండు' అని జనవాక్య మని కర్ణుడు శల్యు నధి క్షేపించుట తెలుగున నొక సీసపద్యము, మరియొక ఆటవెలది కందముతో ముగిసినది. కాని మూలము నందలి అధిక్షేపణము ఔచిత్యపు టవధులు దాటినది.[1]

మద్రకునితో నెయ్యము గాని వైరము గాని కూడదను మూల వాక్యము బాగున్నది గాని — మద్రక స్త్రీలు బట్టలు విప్పుకొని నాట్యము చేయుదురనుట నిలుచుని మూత్ర విసర్జన సల్పుదురనుట సౌవీరున దగిలిన మాద్రిక—పుత్రుని కోరుకొనిన ఇచ్చెదను, భర్త అడిగిన ఇచ్చెదను గాని సౌవీరు నడిగిన నిచ్చు నది లేదని చెప్పినదట. ఇవి అనుచితములు. తిక్కన ఈ అసం గత ప్రస్తావన నంతటిని విడిచి పుచ్చెను.

కర్ణ పర్వ మధ్యమున అశ్వత్థామ ధృష్టద్యుమ్నుని దాకును. వారి సంభాషణ హృద్యమైనది.

---

1. యేషాం గృహేష్వ శిష్టానాం సక్తు మధ్యాశినాం సదా
   పీత్వా శీధు సగోమాంసం క్రందంతి చ హసంతి చ
   వాసాం స్యుత్సృజ్య నృత్యంతి స్త్రియో మద్య విమోహితాః
   సా వీరకుని దగిలిన మాద్రిక చెప్పిన మాటలు—
   సమాం సౌవీరకం కశ్చిద్ యా చేత దయితంమమ
   పుత్రం దద్యాం పతిం దద్యాం నతద్దద్యాం సా వీరకం
   నా పివైరం న సౌహర్దం మదకేషు సమాచరేత్.

గురునందనుండు ద్రుపదనందనుం గవిసి బ్రహ్మఘ్న నిలు నిలు మేను గలుగ నెట్లు బదికెదవని పలికి వెండియు

**మా తండ్రి యెడం జేసిన**
**పాతకము కతంబు గాగ బాంచాల నికృ**
**షష్ఠా తునిమెద నిను నరు డి ట**
**యేతెరక బార కిపు నిలిచినన్.**

అన విని ధృష్టద్యుమ్నుం డతని కిట్లనియె.

**మీ తండ్రి కురికి నరికిన**
**హేతియ నీ కొఱకు నునిచి తిపుడ నటుకుదున్**
**నీ తులువ పలుకులకు నీ**
**డై తోచిన యుత్తరంబు నదియె దురాత్మా.**

అని అంత నిలువక

**వినుము బహ్మఘ్ను డన నీకు జనునే బాహ్మ**
**ణ బ్రువఘ్నుండనై సమున్నతి వహించు**
**నన్ను గిల్బిష పరు డను నిన్ను జనకు**
**కడకు బుచ్చెద వేగిర పడక నిలుము.**

పై సన్నివేశమును తిక్కన యథా మూలముగనే తెనిగించెను.

కర్ణుడు భార్గవాస్త్రము ప్రయోగించిన పాండవ బలంబు వెఱచఱచి మరలి పరచిన, వాని నాతడు వెంటం దగిలి పొగలేని మంట పగిది బ్రదీప్తుండగును. తదుత్సాహంబున కోటువడి యా సైన్య జనంబులు హాహా కారంబు లెసంగ దీనదశం బొంది ముకుంద పురందర నందనులం బేర్కొని యాక్రందించిరి. కాని అర్జును డప్పుడు కర్ణుని జూచి, అతనితో యుద్ధము చేయుట కది సమయము గాదని నిశ్చయించుకొనును.

**గాండివి శౌరి కిట్టు లను గర్ణుని జూచితె యెకవిక్రమో**
**ద్దండత దెం పు సేసి పటుదర్పము సూపుచు దేజరి చూడ రా**
**కుండెడు నట్లుగా నలుక నుగ్రత మండెడు నిప్డు నేర్పు పై**
**నుండక నీనునం దొడరి యోటమి దెచ్చి కొనంగ నేటికిన్.**

**చచ్చిన మఱిగెల్చు గొనన్**
**వచ్చునె తన యొడలు గలుగ వైరుల గెలువన్**
**వచ్చుం దఱి వచ్చిన నది**
**మెచ్చు జయార్థులకు మరుద మిత్రధ్వం సీ.**

**పట్టపగలింటి సూర్యుని పగిది గర్జు**
**డుగ్ర మూర్తియై వెలుగుచు నున్నవాడు**
**మనరథం బిప్డు మాధవ మరలనిమ్ము**
**బ్రతికి యుండిన శుభములు వడయవచ్చు.**

జగదేక వీరుండైన అర్జునుని శీలమున కీ సన్నివేశము న్యూనత నాపాదించు చున్నదని కొందఱి అభిపాయము. ఈ ఘట్టము తిక్కన యథా మూలముగనే తెనిగించెను. శౌర్యమన తలను గోడకు కొట్టుకొనుట గాదు. సాహసమును సకాలమునే ప్రదర్శించుట గూడ పరాక్రమములో నంతర్భాగము. కాదేని యది వృథా ఆత్మార్పణ మగును. పురుషకారము సమ్యక్కాల పచోదితమైనచో సఫలత గాంచును.[1] "ఉచిత కాల సంభావ్యమైన యత్న విధి." మాత్రమే సమగ్ర ఫలము నిచ్చునను నవి భారత సందేశము.[2] శత్రుభంజనమునకది అసమయమని గు ర్తించినవాడు అర్జునుండు. అట్లు గుర్తింపలేనివాడు భీముడు. అన్న దమ్ము లిరువురి శీలములోని తారతమ్య మది. ద్రోణ మరణానంతరము అశ్వత్థామ ప్రయోగించిన వైష్టవాస్త్రమును గూఢ భీము డట్లే మూర్ఖముగ నెదిరించెను. నిష్ప్రయోజనమగు పట్ల పరాక్రమింప బూనుట మూర్ఖతకు చేరువయగును గాని శౌర్యమనిపించు కొనదు. ఈ సన్నివేశము వలన అర్జును శీలమునకు అపకర్ష కలుగదు. అంతేగాక—మానవ మనస్సును మధించుటలో విశ్వసాహితీ జగత్తులో మహాభారతమునకే అగ్ర తాంబూ లము సమర్పింపవలసి యుండును.

పరాభవఖిన్నుండైన ధర్మరాజు అర్జునుని తూలనాడుట—అర్జునుడు అన్నపై నలిగి తిరిగి దుర్భాష లాడుట—మహాభారత ములోని అత్యద్భుత సన్నివేశములలో నొకటిగ నెన్నవచ్చును. పాండవుల సోదరత్వము జగత్ప్రసిద్ధమైనది. అర్జునుండంతటి వాడు గూడ <u>అన్నగారిని దుర్భాష లాడిన సన్నివేశము మహాభారతములోని మానవ</u>

1.Sucess is a Chemical compound of man with moment – Bernard shaw,

2.మార్జాలమాషిక సంవాదము—శాంతిపర్వము.

మానస మధనము పరాకాష్ఠ చెందిన ఘట్టములలో నొకటి. ఈ ఘట్టములో మరియొక విశేషము గలదు. ఇతివృత్త మంతయు నాటకీయముగ నడచినది. తిక్కన మూలము నందలి వన్నెకగ్గకుండ హృదయంగమముగ తెనిగించెను

ఆ ధర్మతనయుండు రథావతరణంబు సేసి మందిరంబు ప్రవేశించి సెజ్జ నొడలు సేర్చి నాటియున్న యమ్ములు పెఱికికొని హృదయంబున నమ్మోయి నున్న పరిభవంబు పీడ యొనర్ప విషాద వర్ణుం డగుచు శయనించి యుండెను.

ఆనాడు కర్ణుడు నకులుని యోడించి యవమానించి ధర్మరాజును జయించి విడిచిపెట్టి---విజ్రుంభింపసాగెను. సేనాపతి యైన కర్ణుని ఉత్సాహము పరాకాష్ఠ నొందిన తరుణమది. ఆ సమయమున పోగలేని మంట పగిది విజ్రుంభించుచున్న కర్ణుని జూచి, అది అతని నెదుర్కొనుటకు అదను గాదని సమయజ్ఞుడు ఉచితజ్ఞుడైన అర్జునుండు గుర్తించి

**పట్టపగలింటి సూర్యుని పగిది గర్ణు డుగ**
**మూర్తియై వెలుంగుచు నున్నవాడు**
**మనరథం బిప్డు మాధవ మరలనిమ్ము**
**బతికి యుండిన శుభములు వడయవచ్చు.**

అని మరలిపోవును. అంతకు ముందే ధర్మరాజు పరాజితుడై శిబిరమునకుం బోయి యుండెను. శ్రీకృష్ణుడు "మన మశ్వత్థామ తోడి పెనంకునం జిక్కిన సమయంబున ధర్మనందనుండు సూతనందనుని కగ్గమైయుండె నాతం డతని యమ్ముల నొచ్చెనో యని తలంచెద నయ్యవనీశు నవస్త యెఱింగి మరి నీ వయ్యంగ రాజు సమయింపం గలవాడ వనుటయు" నుభయులు ధర్మరాజు శిబిరమున కేగిరి.

ఆ ధరణీనాథుండు వారలు రాధేయు వధించి వచ్చిరకా దలంచి దెందం బలర మందస్మితంబుతో నభినందించును. ధర్మరాజు "సురలైనం జలమెత్తి కర్ణుని రణక్షోణిన్ జయింపంగ నేర్తురె" యని అతని నగ్గించి

**అట్టిబల్లిదు నని దెగటార్చి మీర**
**లేమియును గా వచ్చితి రింతసంత**
**సంబు దొరకొనునే నా మనంబు చింత**
**వంత యెల్లను జెడ నరవర్యు లారా.**

అని ఉప్పొంగి అర్జును నభినందించును.

నిజమునకు కర్ణుడు చావలేదు. అర్జునుడు కర్ణుని జంపకయే యుద్ధభూమి నుండి తొలగి వచ్చినవాడని విని ధర్మరాజు ఉగ్రుడయ్యెను. అర్జునుడు అన్నగారితో

**ధనురాచార్యుని చావు సూచి తగ రాధానందనుం డా సుయో**
**ధనునిం దమ్ముల వారి సైన్యములనుం దా గాచువాడై రణం**
**బునకం బూనుట నింత సేయ వలదే భూపాల యేపారి మం**
**డునె యారం గలదీప మట్లతండు మందుం గాక యే నార్చెదన్.**

ఆరిపోవుటకు ముందు ఎక్కువగ మండు దీపమువలె కర్ణుడు వెలుగుచున్నాడను మాట మూలములో లేదు. అర్జునుడు తాఁగ్రమ్మర పోయి సూతసుతుని దెగటార్చెద నని ప్రతిజ్ఞ సల్పెను. కాని—పరాభవ ఖిన్నుడైన ధర్మరాజు అర్జునుని తూలనాడును.

అతడు

**విను కర్ణున కే నోడితి**
**నన నేటికి నీవు వోడి తనిలజ మాద్రీ**
**తనయులు మున్నే యోడిరి**
**మనతో గూడంగ గంస మర్దియు నోడెన్.**

అని కెంజాయ రంజిల్లు కన్నుల నన్నరు నవలోకించి

**హరి గలుగంగ నేటికి భయంబున వచ్చితి నీదు గాండివం**
**బెరవుగ నిచ్చి నీవు నొగ లెక్కి హరిన్ రథి జేయ గన్న ని**
**ష్ఠురభుజవిక్రమోగ్రు డగు సూతతనూభవు దత్సహాయులం**
**బొరిగొనడే సుయోధనుని పోడిమి దూలగ నొక్క మాత్రలోన్.**

అని గాండివమును శ్రీకృష్ణున కిచ్చి అతనికి సారథ్యము సల్పుమని హెచ్చరించును.

అర్జునుడు గూడ ఆవేశ పూరితు డైనాడు.

**విను మొరులకు గాండివ మి**
**మ్ముము నన్నెవ్వండు వలికె నతనిశిరము గ**
**కుక్రన బగుల వేయుటకు జే**
**సిన వాడ బతిజ్ఞ నాదు చిత్తములోనన్.**

నాటకీయ మైన యీ సన్నివేశము యథామూలముగనే తిక్కన తెనిగించెను.

ఆ ఘట్టమున శ్రీకృష్ణుడు నిర్వహించిన పాత్ర ముగ్గడింపం దగినది. “అవమానము” మరణముతో సమానము గావున ధర్మ రాజును అవమానించి పలుకు మనియు అదియో అతని జంపి నట్లనియు శ్రీకృష్ణుడు అర్జునునకుం బ్రతిపాదించిన ధర్మసూక్ష్మము. ఆవేశ పూరితుడైన అర్జునుండు, శ్రీకృష్ణుడు చెప్పనక్కర లేకుండగనే ధర్మరాజును దూలనాడుట కారంభించెను. కాని అతనిలో గల సహజ శౌశీల్యము మరుక్షణములో పశ్చాత్తాపమునకే దారి తీసినది. అందుచే అతడు అన్నను జంపుటకు పెరికిన కత్తి చేతనే తన కుత్తుక సుత్తరించుటకు ఉద్యుక్తు డయ్యోను. శ్రీకృష్ణుడు తిరిగి తగవరిగ మధ్య నిలిచి, ఆత్మస్తుతి ఆత్మ హత్యా సద్రుశమని వింగడించి పలుకును. అంతవరకు పరనింద సల్పిన అర్జునుండు స్వోత్కర్ష వివరించుటకుం బూనుకొనును. దీని వలన అతనికి ఆత్మ ప్రత్యయము కలిగినది. చివరకు అర్జునుడు ధర్మ రాజు కాళ్లపై బడి క్షమాపణ వేడికొనును. ఈ ఘట్టము వలన సానబట్టిన వజ్రము వలె అర్జునుండు స్థిర సంకల్పముతో తిరిగి యుద్ధభూమికి వెడలును. మహాభారతములోని సజీవపాత్ర చిత్రణమున కీ ఘట్ట మొక యుదాహరణము. మానవ స్వభావమునకు మహాభారతము మణిదర్పణము నెత్తి పట్టుచున్నది.

దుశ్శాసనుడు భీమసేనునితో బోరి చచ్చుట మహాభారతములోని బీభత్స సన్నివేశములలో నెన్నదగినది.

‘నిన్నిటు సేరం దెచ్చుటం జేసి విధాత నాకుం గృప సేయుట గానంగ వచ్చె దమ్ముడా ’ అని భీమసేనుడు దరహాసమున గెంపు గదుర దుశ్శాసను దాకును. ఒండొరులకు కొంత వట్టు ఘోర యుద్ధము జరిగిన పిమ్మట, నుద్దండ గదా దండమున దుశ్శాసనుం బడగొట్టి అతడు నెత్తురు దొరగ ధరణిం బడిన

**లీలం గెల నమర్చి మత్తగజకేళీ సుందరోల్లాస మా**
**భీలత్వం బలరింప ద్రిప్పు జదలం బృథ్వీస్థలిన్ వైచు ముం**
**గాలం ద్రోచు మొగంబు వేయు దెస లుగ్ర స్ఫూర్తి వీక్షించు మో**
**కాలూదుం బయి గమ్మంగ మెడ చిక్కం దొక్కి నిల్చున్ నగున్**

ఇవ్విధంబున ఘోరవిహారంబు సల్పి భీమవిక్రమున డగు నాభీమ సేనుం డయ్యువ రాజు నానం బాలోకించి

**ఏ నురము వ్రచ్చి నెత్తురు**
**దేనియ యిదే ద్రావెదం గదిసి నను గడిమిన్**
**మానుప దిక్కు గలిగిన వ్రాని**
**మ్మెలుగింపు మీ మొనం గలవారిన్.**

అని 'సరసింహం డసురేంద్రు వ్రచ్చు కరణి' అతని యురము జీరి నెత్తురు ద్రావెను.

మూలములో లేని ఈ ఉపమానము సమ్యక్కు యుక్తము.

**గద సేతం గొ ని యంత్యకాల యమరేఖం బేర్చి రక్తంబు చా**
**య దలిర్పం దను వుగ్ర సుందరముగ నవ్వీరుఁ డేతెంచి యు**
**న్మ దమాతంగములీల దోప మనసేనం బోల్వరం దోలివే**
**పొదివెం గ్రమ్మర దుస్ససేను వికట స్ఫూర్తి స్ఫురన్మూర్తియై.**

అప్పడు భీమసేనుని తనువు "ఉగ్ర సుందరముగ" నున్న దను తిక్కన వర్ణనము అమూలకము. తెలుగున భీమసేనునకుఁ జిక్కి క్రిందపడిన దుశ్శాసనుడు అతనికి మారు పలుకడు.

సంస్కృత భారత కథనమున నీషద్భేదము కలదు. మూలమున, భీముడు దుశ్శాసనుని గదా ఘాతముచే గ్రిందికిఁ బడవేసి, యతనిపై బడును. కాని—మూర్ఛితుఁ డైన దుశ్శాసనుని చంపుటకు భీముని మనస్సు అంగీకరింపక అతనికి తన వస్త్ర ముచే గొంత సేపు వీచి, యతడు సేద దీరిన పిమ్మట ఉపాలంభ సమునకు ఉపక్ర మించును.[1]

పడిపోయిన దుశ్శాసనుఁడు భీమునిచేత జిక్కి గూడ అతనికి సమాధానము చెప్పుటకు జంకడు.

భీముడు, "ఏ చేతితో నీవు అలనాడు ద్రౌపది కొప్పు పట్టుకొని యుంటివో చెప్పుమని" గద్దించి అడుగగా దుశ్శాసనుడు సమాధానముగా," క్షత్రి యాంతకము గో సహస్ర ప్రదాతము, కరికరా కారమునగు ఈ చేతితో"

1. అచేతనస్య రుధిరం కథం పాస్యామహం రిపో:

అజానతోఽస్య పాపస్య దుర్మతేర్మిత్రఘాతిన: !!

ఏవం విచింతయన్ భీమో దదర్శాఽథ విచేతనం|

వస్త్రేణ వీజయచ్చైనం తేన సంజ్ఞామవాపస:

నని యెత్తిచూపును.[1] భీముడా చేతినే ముందు నరికి దాని తోడనే యతని తారన మొనర్చి విజృంభించును.[2] మూలమునందలి ఆ వివరములను తిక్కన విడిచి పుచ్చెను.

కర్ణార్జునుల యెక్కటి కయ్యము మూలములోని దీప్తి కగ్గకుండ తిక్కన తెనుగున ననువదించెను. కర్ణార్జునులు వివిధాస్త్రములతో నొండొరు మిక్కలి ఘోర యుద్ధ మొనర్చిరి. చివరకుఁ గర్ణుండు సర్ప ముఖాస్త్రంబు బ్రయోగింప సమకట్టును. శల్యుఁ డతనికి జిత్త వైకల్యం భాపాదింపం దలంచి 'యీ సంధానంబు మెడ దునుముట కనుగుణంబు గాదు నిపుణంబుగ నిరూపించి యొండు భంగి సంధింపు మనిన గర్ణుండు గనలునఁ గనుఁ గవఁ గెంపు గడలుకొన నమ్మద్రపతిం జూచురం జూచి

**నను బోటిజోదునుం గా**
**దని పలుకంగ నేర్పు నీకు నంత గలదెయ**
**ట్టును గాక వినుము కర్ణ్వం**
**డినుమా ఒక శరము దొడుగునే పరులు నగన్.**

అని పలికి కలుషంబగు చిత్తంబుతో నెలుంగెత్తి ఫల్గున ఫల్గున పొ లిసి తంచు నేసిన.

పలు దెస మంటలు ప్రబ్బగ
నలఘుస్ఫురణమున నిగుడు నయ్యస్త్రంబున్
జలజాక్షుడు గని పంచాం
గుళ మాత్రము రథము ధరణిఁ గ్రుం గ నదుముదున్.

అటు శల్య సారథ్యము, ఇటు కృష్ణ సారథ్యము ఈ సన్ని వేశము నందలి ప్రతియోగ కల్పన మిక్కిలి హృద్యమైనది. ఈ ఘట్టమును తిక్కన యథామూలముగనే అనువదించెను.

నెత్తుట దోగి మేను కమనీయ రుచిం గొమరార బాణ సం
పత్తి యుద్రగ్రతన్ మెఱయ భాస్వరుడై యరదంబు మీద భూ
పొత్తమ కర్ణుఁ డొప్పె నరుణోజ్వల మండల కాంతి పూరము
న్మో త్తపుదీప్తులుం దగ నిమం డపరాద్రి వెలుంగు చాడ్పునన్.

ఇంతలో కర్ణుని రథ చక్రము నేలం గ్రుంకినది. అది హృదయ విదారకమైన ఘట్టము—కర్ణుడు

1. దుశ్శాసనః: Vide page 40.

సోయం కరికరాకార: పీనస్తన విమర్దన: గోసహస్ర పదాతా చ క్షత్రియాం తకర: కర:
2. సమూర్ధితో సౌ తమతివరుష్ణ స్యంతాడయా మాస బుజేన తేన.

**ఆరదంబు చక్రంబు ధర జాలఁ గ్రుంగిన**
**నెత్తెద నంతకు నేయకుండు**
**మేను భూమిస్థుడ వీవు రథస్థుండ**
**వియ్యెడ దగ వగు నేయ కునికి**
**విరిదల వానిని విరథుని నాయుధం**
**బిడిన వానిని శూరు లేయ రెండు**
**మహిని శూరుడ వను మాత్ర గా దుత్తమ**
**కులుడవు రణధర్మ కోవిదుండ**

**విట్టి నీవు దగిన యట్టి భంగిన యని**
**సేయ వలయు నిట్లు సెప్ప నెల్ల**
**బాడి యేర్పడంగ బలుకుట గాని గో**
**విందునకును నీకు వెరచి కాదు.**

అనిన విని యచ్యుతం డతని కిట్లులనియె.

**ఏమీ తగవును ధర్మము**
**నీ మనమున నేడ పుట్టెనే గర్వ్వము ను**
**ద్దామ దురభిమానము నే**
**లా మఱచితి కర్ణ యా చలం బెట వోయెన్.**

అని శ్రీకృష్ణుని సమాధానము.

అర్జునుండు శ్రీకృష్ణ ప్రచోదితుడై కర్ణుని తల దునుమును.

**నిర్గతపాణు రాధేయు నిజకరముల**
**గరుణ పెంపున నంటుట కారణముగ**
**భావనస్నాన మొనరింప బోవునట్టు**
**లపరజలనిధిలోనికి నరిగె నినుడు.**

మూలములో మాత్రుకలేని ఈ పద్యము ఈ ఘట్టముపై తిక్కన వేసిన తెలుగు ముద్ర.

చివరకు శల్యుడు

ఇవ్విధంబున నరదంబు దోలికొని యఱిగి యమ్మద్రపతి బాష్పాకులలోచనుండును దీనాననుండును సుదీర్ఘతరనిశ్శ్వాసుండునై యున్న కౌరవేశ్వరుం జేరం జని యతనితో నిట్లనియె.

**నరవర యెందుఁ జూడమే రణంబులు గర్ణు ర్జునుండుసం**
**గర మొనరింతురే యటులు కౌర్యనిరూఢికి దివ్యు లొంది ర**
**చ్చెరు వది యట్టు లుండె విను చెప్పెద నెంతయుభీతిఁ బొందిరా**
**హరియు నరుండు గర్ణువడి కంత విధాత్రుడు దప్పె వానికిన్.**

అని తీర్పు చెప్పును.

నిజమే "అంత విధాత్రుడు దప్పె వానికిన్" అను శల్యు ని వాక్యములు మిక్కలి అర్థవంతములు.[1]

కర్ణ పర్వము చివర మూల భారతమున నొక ఫలశ్రుతి గలదు. భీష్మ ద్రోణ పర్వములందు మూలమున గూఢ నిట్టి ఫలశ్రుతి గన్పింపదు. తిక్కన మూలమునందలి ఫలశ్రుతిని మనోహరముగ తెనిగించెను.[2] ఈ పద్యము తిక్కన అనువాద పద్ధతికి ధ్వజపాయమైన ఉజ్జ్వలోదాహరణము. "జనమేజయు నకు వైశంపాయనుం డిట్లనియె "

**అనలుడు భాస్కరుండును సుధాంశుడు నధ్వరసంప్రవర్తకుల్**
**వినుము నరేంద్ర యీక్రతువు విష్ణుమయం బిది నిర్వహించి ర**
**ర్జునుండును గర్ణుడున్ సమర రూపమునం దగనీ ప్రబంధ మిం**
**పొనరం బఠించినన్ వినిన నొందు నరుం జిర సౌఖ్య సంపదల్.**

శల్య పర్వమునఁ గౌరవసైన్యము యుద్ధ సన్నద్ధమై వెడలు ట తిక్కన మనోజ్ఞముగ వర్ణించెను. మూలమున

**తతోబలం సమభవత్ క్షుబ్ధార్ణవ   సమస్వనం**
**సముద్ధత పదాత్యశ్వం ఉద్ధూత రథకుంజరం**

1. జగదేకవీరుడని ప్రసిద్ధికెక్కిన నెపోలియన్ వాటర్లూ యుద్ధమున నోడి పోవుటకుఁ గారణముగా, విజేతయైన వెల్లింగడన్ ను "ఆది అతని ప్రతికూల విధి యనియే" పేర్కొనెను.

2. ఏవం మహాయుద్ధ మిదం మహాత్మ నో
ర్ధనం జయ స్వాతి రథేశ్చ యః పఠేత్
న సమ్యగిష్టస్య ముఖస్య యత్ ఫలం
తదాప్ను యాద్ద్య స్ర్ము ఖ యాశ్చ నిత్యశః !!
ముఖోహి విష్ణుర్భగవాన్ సనాతనో
వహంతి యం చాప్యనవేందు బానవ:
ఆతోఽనసూయుశ్రుఖయాత్ పఠేచ్ఛయ
స్స సర్వలోకాంశ్చ జయేత్ సుఖీ భవేత్

అను శ్లోకములో నామమాత్రముగ నున్న అశ్వ పదాది రథ కుంజరముల యభివర్ణనము తెలుగులో దిక్కన అధికముగ గల్పించినదే.

**చంచరికావళి ఝుంకృతుల్ గల్పించు**
**కర్ణ ఝుళంఝుళాకలనములను**
**ధరణీ పరాగ సంతానంబు గబళించు**
**కరశీకరచ్ఛటాస్ఫురణములను**
**ఘుంటికాటంకృతి కాంతి సంభావించు**
**నిర్భర బృంహితనిస్వనములు**
**నంబరభాగంబు నల్పంబు గావించు**
**నున్నతగాత్ర సమృద్ధతులను**

**జారుభీషణ రేఖలు భూరిమదభ**
**రాభిరామయానంబులు నాహవోచి**
**తోగ్ర కల్పనాభంగులు నుల్లసిల్ల**
**గరులు ధాత్రీతలంబు గ్రక్కదల నడచే**

తురంగముల వర్ణనము

**గతిబహుతాలసత్ప్ర రవిఘుట్టిత మేదిని జీవితేశక**
**ల్పితనఖ రేఖలం జెలువు పెంపు వహించు పురంధ్రీ బోల మ**
**ద్ధతదృఢబంధురాంగలలితంబులు నూర్జితకింకిణీరుణ**
**త్క్రృతిపటు హేషలుం దగ నుదీర్ణ ములై నడచెం దురంగముల్.**

రథముల వర్ణనము

**మీఱిన యుబ్బున మీదికిఁ గాళులు**
**సాచురథ్యంబుల చటులతయును**
**లలి బెండ్లికినిం బోవు చెలువున విలసిల్లు**
**సూతజనంబు విస్ఫూర్జితంబు**
**జతనంబు మేలిమిం జారుఘోరము లగు**
**నవయవంబులవిభ వాతిశయము**

---

1. ప్రకరణాంతరమున మూలములో ఈ వర్ణ నకు మాత్రుక గలదు. "తేషాంతు వాజినాం భూమి: ఖురైశ్చాపిసంపతే ఆసోభతయధానారీ కరజైః క్షతవిక్షతా"

**బిరుదుల నుద్భటస్ఫురణంబు లైక్రాలు**
**కేతనంబులసముద్ద్యోతితంబు**

**సొంపు మిగులంగ జోదుల యంప పొదుల**
**దీప్తులును లేత నవ్వుల దీధితులును**
**హరిరశ్మలు గీడ్చె ర నగుచు వెలుగ,**
**దేరు లరిగె నుద్ధామత గౌరవేంద్ర.**

పదాతి వర్ణనము

**కడకయు లావునుం గరంగి గట్టిగం గూర్చి యొనర్చినట్టి పే**
**రొడళుల దాల్మియుం గడిమియుం గలయం బరికించియందు నే**

**ర్పిడుకొని గాఢభంగి రచియించిన చందము నెమ్మనంబులం**
**గడు జెలు వొంద నుప్పి వడి గాల్బల మేగె గరం బుదగ్ర తన్.**

అమూలకమైన యీ చతురంగబల వర్ణనమును శల్య పర్వమున తిక్కన అధికముగ జేర్చెను.

ఉభయ సేనలను యుద్ధ సన్నద్ధమగుసరికి ప్రభాత కాల మైనదని మూలమున గలదు.

"ఉపయాతామహావీరా: పూర్వాం సంధ్యాం ప్రతిప్రభో" తిక్కన, మూలములోని ఆ మాట పట్టుకొని ప్రభాతకాల సూర్యోదయ వర్ణనములు సల్పెను.

**ఒండొరులన్ జయించుమతి నుద్భటలీలల జాల నొప్పి య**
**ప్పాండవ కౌరవుల్ పెనగు భంగి గనుంగొనువేడ్క నొక్కు యి**
**తండు మహాద్రి నెక్కెనన దద్దయు జెన్నగుబింబకాంతి న**
**ర్కుం దభి రాముండై పొడుపు గొండపయిన్ వెలుంగొందె జూడగన్.**

**అరసి యనాగతం బెఱుగు నట్టి మనంబులు గల్గు పాండు భూ**
**వరసుత బంధుమిత్రకురు వర్గసుహృజ్జనకోటు లత్తఱిం**
**బోరసేనతి ప్రమోదమును భూరివిషాదమునాగ నంబుజో**
**త్కరము వికాస మయ్యె గుముదంబులు మీలన మొందె నెంత**
**యున్.**

సంప్రదాయ సిద్ధమైన వర్ణనముతోపాటు తిక్కన రచించిన సీసపద్య మీ పట్టున నుగ్గడింప దగినది.

**కుంజరనికురంబకుంభ స్థలిసంగ**
**సిందూరరుచులతో జెలిమి చేసి**
**కేతనవ్రాత సంకిలిత మాణిక్య**
**రశ్మల గెడ విహారంబు సలిపి**
**సైనికనికరవక్ష స్స్థలపరిలిప్త**
**కాశ్మీర దీప్తులం గౌగిలించి**
**దండనాథోత్ర్కర చండభావోద్వృత్త**
**చక్షుః ప్రభలు దారు సరస మాడి**

**యంశుజాలంబు లుభయ సైన్యంబులందు**
**బరగి బహువిధశస్త్రా స్త్రకిరణతతుల**
**బెరసి పరభాగలక్ష్మి దీపించి మెఱయ**
**బాల్య రమణీయు డగు చిత్రభానుండొప్ప**

ఇట్లు పూర్వసంధ్యాసమయంబున దార్కొని భేరీ ప్రముఖ తూర్యా నిస్వనంబులు నింగి వొంగ జెలంగెను.

తిక్కన భారతము "అనువాద" గంధమే గాని, స్వతంత్ర రచన కాదను వాదమునకు పై సీస పద్యముల వంటివి పూర్వ పక్షములుగా నెన్నదగును. అంతేగాక—తిక్కన విరాటోద్యోగ పర్వములపై జూపిన నిష్ఠ యితర పర్వములపైం జూపలేదను వాదము గూఢ పరాస్తము చేయుట కుపకరించు ఉజ్జ్వల ఘట్టము లెన్నిటినో యుద్ధపర్వములందు జూప వచ్చును.

శల్య పర్వమునందు తిక్కన సల్పిన సంగరాంగణ వర్ణ నము యథామూలమేయైనను అందు తిక్కన వేసిన స్వీయముద్ర గన్పింపకపోదు.

**'నెత్తుట దోగియు నిగిడి పోరెడు వీరులు**
**నడమోదుగుల విధమున నుండిరి.**[1]

1.తత్రయోధా మహారాజ విచరంతో హ్యభీతవత్
దృశ్యంతే రుధిరార్ద్రాంగా: పుష్పితా ఇవ కింసుకా: !
"నడమోదుగులు" తిక్కన అభిమాన కల్పనమే.

రక్తంబులై యున్న యట్టి బల్ దలలతోడ నిండిన యవని కెందామర కొలని పగిది యుండేను.

యథా పూర్వ్వము 'సంగరాంగణంబు రమణీయమును భీషణంబు నయ్యె' ననునది పునరుక్తియైనను, అందు తిక్కన ఆత్మీయతా ముద్ర మెఱయు చున్నది.

మూలమున శల్యుని యుద్ధ నివేశ వర్ణనము విపులముగ నున్నది. యుద్ధమున శల్యుడు బహుముఖ ప్రజ్ఞాధురీణుడు. తిక్కన మూలములో విపులముగ నున్న శల్యుని యుద్ధ వర్ణనము నొక సీస పద్యమున హృదయంగమముగ సంగ్రహించెను.

**కరులం దుంచెడు వేళ గిరుల దున్నాడుసం**
**క్రందను కైవడి గానవచ్చు**
**నరదముల్ దెరలించు సప్పుడు పఱిమొగుల్**
**విరియించుబంగాడ్పు విధము మెఱయు**
**హయముల జెండాడ నరుగు చొట్టను లేళ్ళ**
**గమి గిట్టుకొల్పులి కరణి యొలయు**
**భటులకు నరుగుచో బస లేని పెనుగాన**
**దరికొనుచచ్చు చందంబు గలుగు**
**గసి మసంగినయంతకు కరణి యంత్య**
**కాలరుద్రునిదర్ప మకాండమృత్యు**
**ముఖము నుగ్ర భావము దోచు మొనయు వీర**
**సమితి దెగటార్చునప్పు డాశల్యు నందు.**

శల్యుడు కౌరవ సేనాపతియైన సంగతి విని ధర్మరాజు శ్రీకృష్ణునితో దీనికి నెయ్యది సేయువార మీ వరయము కార్య వృత్తి హృదయంబున బాండవ రక్షణోత్సుకా యని అర్థించును. శ్రీకృష్ణుని సమాధానము శల్యుని సామర్థ్యము నుగ్గడువుగ నుగ్గడించుచున్నది.

*'శల్య నెఱుంగుదు-శౌర్య ధైర్యంబు లగ్గల మాతనికి!*

*గాంగేయ కుంభజకర్ణుల మిగిలెడు గాదేని సమడగు'*

*భీమునకు అర్జునునకు నెనయంగరాదు.*

సాత్యకి కోర్వరాదు.

పార్థతునకుం దత్సోదరులకు మార్కొని పెనగి బ్రదుక రాదు." ఇది 'జగత్సాకల్య వేది' యైన శ్రీకృష్ణుని తీర్పు మాటలు. అంతేగాక శ్రీకృష్ణుం డింకొక విశేషమును వివరించును. ఇంతవరకు శల్యుడు తన శక్తి సామర్థ్యములను బకటింపలేదు. దానికి గారణాం తరము లున్నవి. కాని యిప్పుడాతడే సేనాపతి. "కౌరవపతి మాన్యుఁ జేయుట నధిక విజ్రుంభణమ్ము జూపు" మానసిక తత్త్వవేత్త యైన శ్రీకృష్ణుడు ముందే శల్యుని విజ్రుంభణమును నిరూపింప గల్గి యుం డెను. కర్ణుడు, అర్జునునితోం దలపడుటకు ముందు, శల్యునితో 'అర్జునుండు నన్ను నోర్చిన యట్టు లైన నెట్లు సెప్పుమ' యనుడు, మద్రేశుడేను గృష్ణు లిద్దఱ నొక్కటం గిట్టి తీవ్ర బహుళ శరజాలముల పాలు పఱుతు" నను.

ఇది శల్య సారథ్యమున కనువైన మాటయేగాక, శల్యునకు గల ఆత్మ ప్రత్యయమును గృష్ణమాత్సర్యమును గూఢ నభివ్యక్త మొనర్చుచున్నది.

కౌరవ సేనలో జేరుటకు దోహద మొసగిన క్రృష్ణ మాత్స ర్యమే శల్యు ని 'అధిక విజ్రుంభణంబునకు' దారితీయును. కాని— ధర్మరాజే గనుక శల్యునిపై విజ్రుంభించినచో, నాతడు విజ్రుం భించుటకు మోమోట పడును. అసలే తాను కౌరవపక్షమునం జేరి పాండవులకుం దోహము చేసిన వానిగా లోలోపల గుములుచున్న యాతడు ధర్మరాజు నెదిరింప జాలడు. చిత్త శుద్ధి లేకపోవుట శల్యుని శీలములోని దౌర్బల్యము. దోషాంతరంగుడైన అతడు ధర్మరాజు నెదిరింపలేడని శ్రీకృష్ణునకుం దెలియును. అందుచే ధర్మరాజే శల్యు నిగ్రహింపవలెనని శ్రీకృష్ణు నిర్ణయములోని యంతరార్థము హృద్యము.

శల్యుడు సేనాపతియై విజ్రుంభించినపుడు పాండవ సైన్యము మోహరంబు దెరలి మరలి మరలి పఱవం దొడంగెను. ధర్మరాజు అదల్చి కరతలం బెత్తి నిలు నిలుమని నివారింప నిలువదయ్యె. అయ్యుధిష్ఠిరుండు పౌరుషంబు పెంపున దెంపు సేసి మామాయని పేరెలుంగ నెత్తి యా శల్యు ని దాకి దర్పంబు సూ పెను. ధర్మరాజు తేరికి నకులుండును సాత్యకియు వలపటను,

సహదేవుండును దృష్టద్యుమ్నుడును దాపటను గావలియై, వెనుకం గదిసి వివ్వచ్ఛుండును ముందటి కెలన మొనసి వడముడియును నడచిరి. ధర్మరాజు శల్యులకు ద్వంద్వ యుద్ధము జరిగినది. చివరకు ధర్మరాజు మహనీయశక్తి బుచ్చికొని, వైవ నుంకించెను. సంజయుని మాటలలో జెప్పవలెననిన—

**నెరయుకినుక బెన్వెడద యై నిప్పు లురలు**
**కన్నుగవ శల్యు జాచిన నున్న యునికి**
**నతడు నీఱు గా కుండుట యరిది యయ్యె**
**మాకు జూడంగ నప్పడు మనుజనాథ.**

అనిపించినదట. ఆ శక్తిపాతముచే

**క్షతమున ముక్కుం నం జెవులం గన్నుల నొ్ౖర్కడురక్త మంగమా**
**ప్లుతము గ జేయగా నతడు బోరగిలం బడియెన్ దరం గర**
**ద్వితయము సాచి ధర్మజుని దిక్కు శిరంబుగవజ్ర దారుణా**
**హతి బడుభూరిభూధర మహా త్తర శృంగముభంగి భూవరా.**

శల్య పతనానంతరము పాండవసేన విజ్రుంభించి కౌరవసేనను నిశ్శేషముగ నంతమొందించిరి. అందు బ్రదికి బయటపడినవారు రధికత్రయము అశ్వత్థామ కృతవర్మ కృపాచార్యులు. ఆకుర్రు రాజు తన చుట్టును బయలగుటం గలయం జూచి-

**పలపలని మూకలో గాల్**
**నిలువక గుర్రంబు డిగ్గి నీ కొడుకు గదా**
**కలితభుజం డై యె క్కడు**
**దొలగి చనియో నేమి చెప్పదుం గురునాథా**[1]

అంతటితో గురుక్షేత్ర సంగ్రామము ముగిసినట్లే. తిక్కన, దుర్యో ధనుడు గదా కలిత భుజండై యొక్కడు దొలంగి చనియెనని కంద పద్యము మూడున్నర పాదములు ముగించి లేఖకుడైన కుమ్మరి గురునాథమను నుద్దేశించి, “యేమి చెప్పదుం గురునాథా” అనిన మాట కురునాథుండైన ధృతరాష్ట్రుని సంబోధనముగా

1. మూలమున దుర్యోధనుని గుర్రము గూడ చచ్చినది. గుర్రము గూడ చనిపోవుటచే, పాపము దుర్యోధన సార్వభౌముడు గద భుజమున నెత్తికొని పదాతియై కాల్నడక పట్టవలసి వచ్చినది. “హతం స్వహాయము స్తృ జ్య” అని మూలము.

కథతోపాటు కందపద్యముతో గూడ నతికిపోయినదను జనశ్రుతి యిట అనుసంధేయము.

“ఏకాదశాక్షౌహిణీశుడై పెంపునం బొంపెరి పోవు నప్పుడమి రేడు వెనుక నొక్కరుడును జన లేక యెకాకియై పోయె” నను మాట చదువునపుడు సహృదయుల కన్నులు చెమ్మగిలక మానవు. ‘దైవం హి బలవత్తరం’ అను మూల వాక్యమే యిట శరణ్యము.

ఇంతటి విషాద వాతావరణమున జరిగిన లఘుసంఘటన పేర్కొన దగినది. ‘పెనుగాలింబడిన పేరడవి పగిదిం’ గానంబడిన పాలికలని మధ్య సంజయుని బట్టుకొని సాత్యకి, తల నరుకుట కుద్య మించును.

దృష్టద్యుమ్నుడు

**వీని నేటికిం బట్టితి వీడు బ్రతికి**
**యిచట వర్తించి మనకు నెగ్గేమి సేయు**
**నప్రయోజన మిది విడు మనిన నేల**
**విడుతు నీదోహి దలదగ నడుతు ననుచు.**

సాత్యకి వాలు పెఱికి వేయం జూచునంత వేదవ్యాసుడు ప్రత్యక్షమై సంజయుని సంరక్షింపవలసి వచ్చినది.1

సంజయుం డచ్చటినుండి ద్వైపాయన హ్రదమునకేగి, యందు దాగిన దుర్యోధనునితో మాటాడును. దుర్యోధనుని శోచ నీయమైన యా దురవస్థ మూలమున విపులముగా వర్ణితమైనది.

“చతుస్సాగర పర్యంత పృథివీస్థలి శాసించి మూర్ధాభిషిక్తులచే గొలువ బడిన దుర్యోధన సార్వభౌముడు ఏకాకియై మడువున నణగి యుండెను. హస్తినా పురమున భవనము నుండి భవనమునకు, దేవాలయము నుండి దేవాలయమునకుం బోవు నపుడు అతనికి

---

1. ‘అనుజ్ఞాతోహ్యహం తేన న్యస్త వర్మా నిరాయుధం’ మూలములో ప్రకరణాంతర సంజయుని వాక్యము చొప్పున సంజయుడు కవచమును దాల్చి, ఆయుధమును గూఢ ధరించియే యుద్ధ భూమిని తిరుగాడె నని యెం చవచ్చును.

హిరణ్మయమైన పథము కల్పింప బడెడిది. తిక్కన, ఆ వర్ణ నము నంతటిని నుజ్జగించెను.[1]

పాండవులు, ద్వైపాయనహ్రదములో దాగిన దుర్యోధనుని జేరి, యుద్ధమున కాహ్వానించెదరు.

---

1. ఇప్పట్టున మూలమున

చతుస్సాగర పర్యంత పృథివీ రత్నభూమితా:

కర్ణ నైకేన యస్యార్థే కరమాహారితా పురా !!

అని చెప్పబడినది. కర్ణుడు ఒక్కడే దుర్యోధనుని కొఱకు, చతుస్సాగర పర్యన్త పృథివీస్థ లిని జయించెనని చెప్పబడినది. తెలుగు భారతమున కర్ణ దుర్యోధన ప్రాభవములు మూలము సందున్నంత ప్రస్ఫుటముగ గాన రావు. ఆ భాగములు తిక్కన సంక్షేపించిన ఘట్టములలో జేరిపోవుట తెలుగు వారి దురదృష్టము. తిక్కన బుద్ధిపూర్వకముగా, గర్ణ దుర్యోధనుల ప్రాభవము తగ్గించెనని చెప్పుట సరిగాదు. తిక్కన పలుతావుల గర్ణ దుర్యోధనుల నగ్గించి యుండెను. సంక్షేప మొనరించుట—ఆంధ్ర మహాభారతమున తిక్కన అవలం బించిన అనువాద సత్రముల బ్రధానమైనది.

"యస్యా జ్ఞా పరరాష్ట్రే షు కర్ణే నైవ ప్రసారితా"

అని గూడ మూలమున స్పష్టముగ గలదు. అందుచేతనే 'సంధి' విషయమున పాండవులకు బాలొసగని దుర్యోధను సమర్థించు సాహసము కర్ణునకుం జేకూరి నదవి యెంచవచ్చును.

యస్య్య మూర్ధాప నిక్తానాం సహసం మణిమౌళినాం.

ఆహృత్య చకరం సర్వం స్వన్యై వశమాగతం !!

ఆసినో హస్తినా పురే క్షేమం రాజ్య మకంటకం.

అస్వపాలయ దైశ్వ ర్యా త్ కుబేరమపిన స్మరత్

భవనాద్భవనం రాజన్ ప్రయాతు: పృథివీపతే: !

దేవాలయ ప్రవేశేచ పంథాయస్య హిరణ్మయం !!

పతాకావృత సూర్యాంశు: తోరణోచ్చితశోభన:

ప్రాయేణప్పృథివీ బర్తుర్ధ న్యాసా మభవన్ గృహా:!!

ఇత్యాది శ్లోకములు.

దుర్యోధనుండు

ఓడి వచ్చినాడ నుద్ధతి నా కేల
యుడుకు మాని నీవ యుర్వి యేలు
గుఱ్ఱములును నేనుగులు లేని బయలు నీ
తలనె కట్టికొనుము ధర్మతనయ.

అని చెప్పను.[1]

ఆ మాటకు సమాధానముగా ధర్మరాజు, "నీ యీగి నే భూ నాయకుం దగు టొల్ల, నిను దెగటార్చి నేల బాలించెద" నని నిష్కర్ష గ జెప్పను.

చివరకు దుర్యోధనుండు హ్రదము వెడలి కనక పట్టికా మండితంబైన గదా దండంబు విపులాంస పీఠంబున సమర్చుకొని బుట్ట లోపలి భుజగేంద్రుండు రోజునట్లు రోజుచు బయటికి వచ్చెను.

**గదయు దానును రుచిర శ్రుంగమునం బోల్చు**
**పర్వ్వతము గ్రే ణి సేయు నీ పట్టిం జూచి**
**కాలదండంబు చేకొని లీల బోల్చు**
**జముని గా మది దలచిరి జనము లెల్ల.**

ధర్మరాజు సార్ధక నామధేయుడై "మఱియు నొక్క తెఱంగు నీ మనంబున మెచ్చు నచ్చెరువును నెలకొనం బలికెద నాకర్ణింపు మనును.

**ఏరి కొను మీవు నొకని మాయేవ్వరందు**
**వాడు నీతోడ దగ బోరు వాడు వాని**
**జంపి మహి యేలు వానిచే జచ్చి త్రి దివ**
**సౌఖ్య మొందుము చేసితి సమయమేను.**

అని పలికి యుజ్జ్వల వివిధ వర్మంబు లాతని ముందటం బెట్టించి

---

1.మూలమున

క్షీణరత్నాం చ పృథివీం హతక్షత్రియపుంగవాం|
నైతామిచ్ఛామ్యహం భోక్తుం విధవామివ యోషితం||
అని యున్నది.

**విను జీవముతో నిన్నుం**
**జననిచ్చుట యొం డు దక్క సమరంబునం గో**
**రినయది నీ కొసగెద నిం**
**తన చెడియెనె యకట యన్న దమ్ములకూర్మల్.**

అని ధర్మరాజు తన ఔదార్యమును వెల్లడించును. "ఇది సాహసంబు తరియె" "ఒకరుని జంపితేని సకలోర్వియుం గైకొను మంట తిరిగి జూదమాడుట వంటిదే" యని శ్రీకృష్ణుడు ధర్మ రాజును మందలించును. హ్రదమును సమీపించినపుడే శ్రీ కృష్ణుడు, ధర్మరాజుతో "మాయలు గల్గు దుష్టులకుం మాయపు భంగులె మందు గాక నిర్మాయత నుల్లసిల్లేడు. పరాక్రమ లీలలు గొల్చు నెట్లని హితోపదేశము సల్పి యుండెను. ఇంతలో భీమ సేనుండు ముందుకు వచ్చి నిలిచి దుర్యోధనుని గదా యుద్ధమున కాహ్వానించును. భీమ దుర్యోధన గదా యుద్ధ సమయమునకు బలరాముండు తీర్థయాత్రల నుండి తిరిగి వచ్చును. ఇప్పట్టున— బలరాముని తీర్థయాత్ర కథనము — ప్రధాన కథా గమనమున కంతరాయముగ గన్పట్టును. అయినను — అది మహాభారత మున బలుతావుల గన్పించునదే. తిక్కన ఆ తీర్థయాత్రల యథా మూలముగ సంక్షేపించి అనువదించెను. ప్రభాస తీర్థ వర్ణనము, మంకణ మహాముని కథనము కుమారస్వామి వృత్తంబు మున్నగునవి తిక్కన సంగ్ర హించి తెనిగించెను.

తిక్కన భీమసేన దుర్యోధనుల గదాయుద్ధ వర్ణనము మూలము నందలి వన్నె కగ్గకుండ అభివర్ధించెను.

**చండగదాపరస్పర ఘట్టనంబుల**
**మింట బెల్లడరెడు మంటగముల**
**బరమఘోరము ల గు పదతాడనంబుల**
**నోలయువసుంధరా చలనములను**
**నుద్భటక్రోధ సము ద్రే క ముల జూడ్కు**
**లం దుల్లసిల్లేడు నరుణరుచుల**
**దారుణధ్వనులు లగు తర్జన లీలల**
**బరగు పర్వత గుహప్రతిరవముల**

**ననిమిషులదృష్టు మిరు మిట్లు గొనంగ భుజగ**
**పతియు గూర్మ్మంబు సంకట పడగ ధరణీ**
**కిరణములు వె(ల్కబార దిక్కరులు బెదర**
**నొప్పె నత్తోలితాకు మహోగ్ర మగుచు.**

చివరకు — శ్రీకృష్ణప్రచోదితుండై అర్జునుండు 'తన యూరు తలము కరతలంబున నప్పళించె'. భీముడు దానిని 'సన్నగం గైకొని' దుర్యోధనుని తొడలు విఱుగ బొడిచెను. 'గదా యుద్ధమున నాభికి దిగువ భాగంబు నొప్పించుట ధర్మంబు గాదు' గావున బలరాముడు ధార్మికరోషముతో భీమునిపై విజ్రుంభించును.

**నిజరథము మీది హలమును**
**భుజశిఖరమునం దమర్చి భూమి యిద్రువ వా**
**యుజు దెసకు నడచె నుద్భ ట**
**గజరిపుచంద్ర మణరేఖ గతియం దొలయన్.**

శ్రీకృష్ణు డడ్డము వచ్చి '(ప్రతిన నెఱపుటరిపులకు కర్తవ్య' మను ధర్మ సూక్ష్మము వివరించును. అంతియగాక యుద్ధమున పాండవులు చేసిన ధర్మవైరుధ్యము లన్నిటికి సాధారణ సమా ధానము కౌరవు లంతకు ముందు సల్పిన అవినీతుల నెన్నుటయే. బలరాముని సంరంభమును మాన్పిన శ్రీకృష్ణు నధిక్షేపించి చివరకు దుర్యోధ నుండు పొందిన ఆత్మ సంతృప్తి యెన్న దగినది.[1]

**చదివితి నెల్లవేదములు జన్మము లొప్పంగ జేసితిన్ రమా**
**స్పద మగువృత్తి బొల్చి నరపాలకు లెల్లను గోల్వ గంటి దు**
**ర్మదరిపుగాఢ గర్వపరిమర్దన కేళి యొనర్చితిం దగం**
**దుది నని మిత్రబాంధవుల తో (ది దివంబున కేగు టొప్పదే.**

మూలమున దుర్యోధనుండు ఉదాత్తముగ

**'నమే విషాదో భీమేన పాదేన శిర ఆహతం**
**కాకా వా కంకగృధ్రా వా నిధాన్యం తి పదం క్షణాత్||'**

అని చెప్పిన మాట తిక్కన తెనిగింపలేదు.

---

1. ఆధితం సుహుతం దత్తం భూః పభుక్తా ససాగరా
   మూర్ధ్ని స్థితమ మిత్రాణాం కోను స్వంతతరోమమ

తిక్కన అనువాద పద్ధతికి పై పద్యము సుదాహరణపాయముగ నెన్న వచ్చును.

అతని శిరస్సు తన్నినందుకు భీముని ధర్మరాజే మందలించి యుండెను. పై వాక్యములు పలికిన దుర్యోధనునిపై బుష్ప వర్షంబులు గురిసె  దేవదుందుభులు మెరసె. ప్రతి నాయకునకు గూఢ నింతటి న్యాయము చేసిన గ్రంధము మహాభారతము వంటిది ప్రపంచ సారస్వతమున నరుదు.

రధిక త్రయము ఊరుభంగ మొంది పడియున్న దుర్యోధనుని గాంచుట మూలము నందు వలెనె తిక్కన ఉదాత్తముగ రచించెను.

**కడు బెట్టిదం బగు గాలిచే గూలిన**
**మహనీయసాలభూరుహము పోల్కి**
**బ్రబల కిరాత మార్గణములం ద్రె ళ్ళిన**
**రాజితవన్యవారణము మాడ్కి**
**గల్పాం తవాయు సఖస్ఫురణంబున**
**నివిరి పోయిన మహార్ణవము కరణి**
**గాలపర్యయమున దూలి మేదిని మీద**
**బడిన పూర్ణేందు బింబంబు పగిద**

**దుఃస్థుడై యుండియును నొప్పు దొరుగ కున్న**
**యన్నరేశ్వరు గనుగొని యుడలునేడల**
**తోడ మేనులు దూలగ దొట్రు వడుచు**
**జేరి యాతని చుట్టు నాసీ నులైరి.**

అశ్వత్థామ శీలమున నేర్పడిన పరిణామము అద్భుత మైనది. ఒకనాడు పాండవ పక్షపాతియైన అశ్వత్థామ ఈనాడు దుర్యోధనుని కంటె గూఢ నెక్కుడుగ బాంధవుల ద్వేషించుచున్నాడు. దుర్యోధనుండు కన్నుగవ నశ్రులు  రలంగ గరపుముల దుడివి కొనుచు దగ్గుత్తిక దోడరు నెలుగుతో

**మనుజులకు నిట్టి చందము**
**ముని ధాత సృజించినది ప్రమోదము ఖేదం**
**బును వచ్చును బర్యాయం**
**బున దీని నెఱుంగవలదె పురుషం డనఘా.**

అని వేదాంత మార్గమునం బడెను. గాని అశ్వత్థామ మాత్రము 'అరుణానమం దగుచు నవుడు గరచి కఠినాక్షర కలి తంబుగా బాండవుల దెస వీసును రోషంబు నెత్తి పలికి తన్ను శత్రు సంహారమునకుం బనుపు మని అర్థించును. ఆ మాటలకు 'హృష్టుండై యజ్ఞనపతి ఆగ్గురు నందనునకు సేనాధిపత్యాభిషేకం బాచరించును. అప్పుడు

**ఆ రథికోత్తముం డధిక హర్షము బొందుచు నమ్మహీశ్వరున్**
**గారవ మొప్ప గుచ్చి యిరి గౌగిట జేర్చి యుదాత్తసింహనా**
**దారవ ముల్లసిల్లగ బ్రియంబు మెయి గృప యాదవోత్తముల్**
**సేరి కెలంకులం జనగ జెచ్చెర నేగె నుదగమూర్తియై .**

సౌప్తిక పర్వమున నాయకపాత్రధారి అశ్వత్థామ. సౌప్తికము యుద్ధ పర్వములకు అనుబంధప్రాయమైనదే గాని యందలి యితి వృత్తమున వీరరసము కంటె బీభత్స రసమే యొక్కువ పాధాన్యము వహించినది. స్త్రీ పర్వమునం గన్పించు చందో వైవిధ్యమునకు దిక్కన సౌప్తిక పర్వమునందే అంకురార్పణ జరిపెను. ఇందు సంప్రదాయసిద్ధమైన సీస, కంద, చంపక మాలాది వృత్తములతో పాటు తిక్కన సగ్దర, మహాసగ్దరలను బయోగించెను.

సౌప్తిక పర్వము బీభత్స రసమునకు ఉద్దీపన విభావముగా ప్రయుక్తమైన రాత్రి వర్ణనముతో నారంభించుచున్నది.

**అంత బశ్చిమధరణీధరాగ్ర పశ్చి**
**మంబునకుం బోయె మార్తాండ మండలంబు**
**సాంధ్య సమయాకృత్యంబులు సలిపిరపుడు**
**రథికవర్యులు ముప్వురు రాజముఖ్య.**

సలిపి వా రొక్క వటవిటపి సమీపంబున నాసీనులై రాసమ యంబున

**వారి ముఖమండలములతో వారిజములు**
**మొగిడె శోకతమంబుతో నిగిడె దిమిర**
**పటలి బహువిచారములతో బరంగె బొల్చె**
**భూతభేతాళగణములు భూవవర్య.**

**కలుగు గురుసుతున కెట్లుం**
**గలహంబని చూడ నమర గణ మధికకుతూ**
**హలమున వచ్చెనొ యనఁ జు**
**క్రలు దోచెన్ గగనవీధిఁ గౌరవనాథా.**

ఇట్లు రాత్రి యగుట దివాచరంబులైన జంతువు లుపశాంత వర్తనంబులయ్యెఁ. రాత్రి చరంబులైనవి సంచరింపం దొడంగె. డస్సి యుండుటచేఁ గృపుడు కృతవర్మ నిద్రించిరి గాని గురునందనుండు నిద్రింపలేదు. అశ్వత్థామ ఆ వటవృక్షము గలయం గనుంగొను చుండగ

**మిడుఁగుఱుగములు గ్రమ్మినయట్లు నిగిడెడు**
**రోచులు గలమిడిగ్రుడ్లు ధనర**
**మెఱుగారు కెంజాయ మెఱసిన యెరకల**
**మోపున నెసఁగుపెన్ బ్రోతతోడ**
**గాళుల భీషణాకారత వేళ్ళతో**
**లీలమై నెగసిన శైల మనఁగ**
**గరముగ్రమగు మొగ మిరు దెసమురియించి**
**యామిషంబులయిక్క లరసికొనుచు**
**నచటిబయ తెల్ల దానయై యక్క జంపు**
**జందమును ఘోరమైన నిస్వనముఁ జండ**
**గతియు భూతవితానభీకరముగా ను**
**లూక మొక్కటివచ్చె భూలోకనాథ.**

అది రాత్రి. మఱ్ఱిచెట్టు. ఆ చెట్టు కొమ్మలపై కాకిగూండ్లు. ఆ గుడ్లగూబ అక్కాకంబుల నాలోకించి యంగంబుల యుద్భ ట త్త్వంబుడిపికొని గమనంబు తిన్న ధనంబు దలకొన జొచ్చి వాని నాక్రమించి, "కొన్నిటి కంఠముల్ నులుపు గొన్నిటి పక్షముల్ నరుకు గొన్నిటి పొట్టలు వ్రచ్చు కొన్నిటి కొలెముకల్ నుఱుమాడు." ఆ దృశ్యమే అశ్వత్థామ హృదయము నావేశించి యుద్ధ రంగమున అంతిమ విషాదాంత నేపథ్యమును గల్పించినది. సూచ్యార్థ సూచకమైన యీ యులూక విలోకనము సౌప్తిక పర్వమున గల్పించిన విషాదవాతావరణము అత్యద్భుతము. సౌప్తిక పర్వము

నంతటిని దిక్కన యథామాతృకముగనే అనువదించెను. గాని యథాపూర్వము సంక్షేపించెను.

సౌప్తిక పర్వమున మానవ మానస మథనము పరాకాష్ఠ చెందినది. మానవ స్వభావము ఎంతటి నైచ్యమునకుం బాల్పడునో — మహాభారతము లోతులు తడివి చూపినది. అశ్వత్థామ- ఆచార్య పుత్రుడు. మానవుడు దివ్యుడు గాగలడు. స్వర్గారోహణము సలుప గలడు. నరకావతరణము సలుప గలడు. భూలోకము, అటు స్వర్గమునకు ఇటు నరకమునకు సమదూరములో నున్నది. మానవుడు ఆదర్శ ప్రేరితుడై ఈశ్వర ప్రతినిధిగా వచ్చును. పతితుడైనచో, మానవుని కంటె నిక్రుష్టజంతువు ఈ సృష్టిలో వేరొకటి యుండదు. దుర్యోధనుని తలదన్ని పగఁ దీర్చుకొన దలచిన భీముడు, 'ఇంక నమరలోకమైన నరకంబైనన్ సరి మాకు నారాయన' అని బరిదెగించును. అది మానవ స్వభావములోని లోతులు ద్రవ్విన వారికి మహాభారతమును అను శీలించిన వారికి అవగతపూర్వమగు విషయమే. అశ్వత్థామను ఆవేశించిన కసి అతని రాక్షసునిఁ జేసినది. కృపాచార్యుడు అతని వారించుటకుఁ జేసిన ప్రయత్నము, చెప్పిన నీతులు నిష్ఫలము లైనవి. అశ్వత్థామ యెరుకలేనివాడుగాడు. ఒకనాడు పాండవపక్ష పాతియైన అశ్వత్థామ పుడమి 'అపాండవము' కావలెనని కాంక్షించు వాడుగ మారెను. అది మానవ స్వభావములోని విచిత్ర విరోధాభాసము.

అశ్వత్థామ 'యురియాడు చిత్తంబున జింతాపరత్వమున' జిక్కి, చివరకు పక్షివిచేష్టితంబు లోచన గోచరంబైన పిమ్మట కృత నిశ్చయు డయ్యెను. 'అన్ని నీతులు బోధించిన కృపాచార్యుడు గూఢ అతనికిఁ దోడయ్యెను. 'నేనును విప్రకులంబు నందు జనపూజితంబైన వంశంబు నందు జనియించి భాగ్యహీనత వలన రాజోచిత ధర్మంబనుష్ఠించితి" అంగీకృత క్షత్ర ధర్ముడగు వానికి నెట్టివి కర్తవ్యంబులగు' నను అశ్వత్థామ యోజనలు అతని సంకల్ప వికల్పములలోని అంతర్భాగమే. అతడను సరించినది బ్రాహ్మ్యము గాదు. క్షాత్రము గాదు. సర్వధర్మాతీతమైన ఆ కృత్యమునకు మానవ మనస్సులో గలిగిన విపరిణామమే మూల హేతువు. అశ్వత్థామకు భూతాకృతియై శివుఁడు దోచుట— మున్నగు వృత్తములను

అర్ధవాద రూపముగఁ గైకొనిన అతని మనస్సులో రేగిన ఝంఝూ మారుతములు ప్రజ్జలైన అగ్ని పర్వతముల అభివర్ణనయే.

'వివృత విశాలాస్య వివరంబు నిశితదంష్ట్రా నికరంబు ఘోరంబుగాగ' 'క్షురిత శోణితమగు శార్దూల చర్మంబు, నుపవీతము లుగ నురగహారములతో నుగ్రమును సుందరమును నుజ్జ్వలంబు నై భూత మొక్కటి అగ్గరుపుత్రు కట్టెదుర నిలిచె'.

**మహిత శాస్త్రకలిత మార్గంబు విడిచి ని**
**జేచ్ఛ బగర గెలువ నెవ్వడరుగు**
**వాని నయ్యేధర్మవర్తన క్రౌర్యమ**
**యెవ్విధమునఁ జెఱుచు నింత నిజము.**

అని అశ్వత్థామకే తట్టినది.

సౌప్తిక వ్యాపార ఘోరత్వంబు గనుంగొని వినోదించుటకు వచ్చి తన చిత్తంబునకు బెదరు పుట్టించువారె భీషణాకారంబుల, శివపరివారము చుట్టుముట్టి నపుడు ఆత్మీయహర మోసంగ నిశ్చ యించుకొనిన అశ్వత్థామ 'వేరపావంతయులేక వారి గలయన్ వీక్షించి నెమ్మోమునం జిరు నవ్వున్ మది దెంపు సొంపు వెలయం జెల్వంబు రెట్టింప చిచ్చురకం జేరెను.

అమూలకమైన అశ్వత్థామ యొక్క అంగీకాభివర్ణనమును బట్టి మహాభారతము నందలి సౌప్తిక పర్వము నందు గన్పించు మానవ మానసిక భూకంప ప్రకంపనమును దిక్కన గూఢ మూలము నందు వలెనే తెలుగున గూడ నద్భుతముగ వర్ణించెనని గ్రహింప నగును. నిద్రావశుడైన ధృష్టద్యుమ్నుని జంపిన పిమ్మట అశ్వత్థామ కరి తురంగంబులపై కురికి నరుకును. అక్కడ దిక్కన స్రగ్ధ రను రచించెను.

**తుండంబుల్ నుగ్గునుగ్గె తురంగగ జులుకం ద్రుంచుఁ గుంభ స్థలంబు**
**ఖండించున్ మౌక్తికంబు ల్లలయుగఁ జెదరం గాయముల్ వ్రు వేబోవు ల్**
**చండంబుల్ సాంద్ర రక్త స్రవమున బెరయన్ జాల్వడన్ వేయు నెమ్మై**
**శుండాల శ్రేణి మాయించుచు వెలిగి హయస్తోమశాలగతుండై.**

ఇచ్చట తెలుగున తిక్కన కల్పించిన ప్రతియోగము నరయ దగినది. ఉలూక విజ్రుంభణమును జెప్పుచు

**కొన్నిటి కంఠముల్ నులుపు గొన్నిటికాళులు ద్రుంచు నుగ్రతం
గొన్నిటి పక్షముల్ నరకు గొన్నిటి పొట్టలు వ్రచ్చు లీలమై
గొన్నిటి నప్పళించుకొని కొలెముకల్ నుఱుమాడు నిట్టు ల
యన్నిటి నయ్యులాకము రయం బెసగన్ వధియించె భూవరా.**

అట్లే తిక్కన అశ్వత్థామ విజృంభణము వివరించుచు

**కొన్నిటి పాదముల్ నఱకుఁ గొన్నిటి మోరలు చెక్కు తీలమైఁ
గొన్నిటి కంఠముల్ దునుము గొన్నిటి వీపులు ప్రచ్చు నుబ్బునం
గొన్నిటి సర్వగాత్రములు క్రూరవిచేష్టిత విభ్రమంబు దో
పన్నుఁరు మాడుఁ బ్రౌఢబల భాసిత భూరిభుజావిహారుండై**

ఇట్టి ప్రతియోగ ప్రదర్శనము తిక్కన కవితా శిల్పములోని ఒక వైలక్షణ్యము.

అశ్వత్థామ ఉపపాండవులను సంహరించిన ఘట్టమును తెలుగున తిక్కన ప్రత్యేకముగా దీర్చిదిద్దెను. ఇచ్చట తిక్కన వ్రాసిన ఐదు మహాస్రగ్ధరలు ఆంధ్ర వాఙ్మయమున విశిష్టములని చెప్పవచ్చును. ఒకే ఘట్టమున, సమాన సన్నివేశ వర్ణనముల యందు మూలమున పునరుక్తి గోచరించును.

మూలమున ఉపపాండవుల వధ ఒక పట్టిక మాత్రమే. తెనుగున పునరుక్తిని పరిహరించుట మాత్రమేగాక, ఒకే సన్నివేశమును చిత్రించునప్పుడు తిక్కన ప్రదర్శించిన వర్ణనా వైవిధ్యము ఎన్నదగినది. వైవిధ్య చిత్రణము తిక్కన కవితా శిల్పములోని మఱియొక వైలక్షణ్యము. ద్రౌపదేయుల నందఱను అశ్వత్థామ వధించెననుచో నిజమునకు వైవిధ్య చిత్రణమునకు అవకాశము తక్కువ. కాని తిక్కన ప్రదర్శించిన వర్ణనావైవిధ్య వైదగ్ధ్య మెన్నదగినది.

## ప్రతివింధ్య వధ

**చతురంగచ్ఛేదకళీ సరభసకలనాశ్చర్య ధౌరేయనానా
గతులం ద న్నెల్లవారుం గడిదియసుర నాఁగ నతిక్రూరచేష్టో
ద్ధతి యొప్పంజొచ్చి సైన్యాస్త్రముల నతనియస్త్రంబులంద్రుంచి వీఁకం
బ్రతివింధ్యుం గిట్టి రెండై పడఁగ దునిమెఁ దద్బాసమానం గయష్టిన్.**

## శ్రుతసోమ వధ

ఇవ్విధంబున ధర్మ తనయనందనుని నడుము దెగ నడిచి యార్చిపెర్చిన.

**అతిశోకక్రోధవేగ వ్యథితహృదయుఁడై యశ్వసాదిత్వవీరో
ద్ధతిఁ బ్రౌఢస్ఫూర్తి సెల్వొందఁగ సబలముఁ దద్గాత్రమున్ జోన్పఁబూఁచె
న్స్రు తసోముం దల్లఁ బట్టె స్ఫురుసుతుఁ డదియున్ స్రు కుక్కచెన్నారనల్క
న్దృతఖడ్గం బైన జేయు న్సిరముఁ దురగము న్వేల్మిడిం బ్రుంచివైచెన్.**

## శతానీక వధ

ఇవ్విధంబున జిత్రవధంబునకుఁ గోచరుం డైన కిచకాంతక తనయుం గనుంగొని.

**నిను గూడన్ వీడె వచ్చెన్ నృపుడనుచు శతానీకుడాభీల చక్రం
బున నశ్వత్థామ వక్షంబునను రుధిరమున్ బొంగగా. జేయ నప్పా
టున నీడంబోక బల్వేటున నిలంబడ నాటోపమున్ జూపియంతం
దనివో కాదుర్జయుం డాతని శిరమును దద్గాత్రమున్ బాపిలీలన్.**

## శ్రుత సేన వధ

అట్లు సకలసూనుండు సమసిన

**శ్రుత సేనుం డప్పు కోపస్ఫురదరుణమారీచల్ దలిర్పంగఁ జక్కు
రివ్వతయంబుం గెంపునం బొందిన చెలువమును సందీప్త ఘోరంబుగ బై
ట్టతనిం జంచద్దదన్ వేయఁగ నుఱక తదాస్యచ్ఛిదాస్ఫారకేళీ
చతురుండై యక్కుమారున్ జముకడ కనిచెం జండదోర్దర్ప మొప్పన్.**

## శ్రుతకీర్తి వధ

ఇత్తఱింగున వికృతానొంది పడి మృతుండైన సహదేవ సుతం జూచి రోషంబునం బేర్చి

> వితతజ్యానాద మాశావితతి నినిచి దోర్వీర్య మేపార బాణ
> ప్రతతిం ద నొంపవీకం బలక జడియుచున్ బల్విడిం బేర్చి చంచ
> ద్ధతిఁ గీదం దంతి హేలాదళ నరతమృగేంద్ర స్ఫురన్మూర్తి దోఁపన్
> శ్రుతకీర్తిం గిట్టి కంఠత్రుటనవిలసనారూఢి నవ్విప్రుఁ డొప్పెన్.

అవ్విధమున 'మానిసి గుట్టిమేనుంగను పేరెల్లఁ ద్రుంగె'. చివరకు రథిక్రతయము 'రక్త సంసిక్తమైన ధరాతలమున నార్తి బోరలుచు

నూర్పులందంద సందడింప జీవంబు వెడల నున్న' దుర్యోధనుని కడ కరుగు దెంచిరి. ఇచ్చటఁ గూడ తిక్కన యొక మహాస్రగ్ధరనే ప్రయోగించెను.

**కనిశోకం బాత్మలం దగ్గలముగ రథముల్ గ్రక్కునన్ డిగ్గి భూమిఁ**
**దనువుల్ వోవైచి బాష్ప ధ్వమము వొదువు వక్త్రంబులఁ విప్రలాపం**
**బును దైన్యం బావహిల్ల బోరలుచుఁ బోరి నా భూవిభుఁ శాంత దృష్టిం**
**గను గొంచుం జేరి కేలంగముపయి నిడుచుం గౌగిటం జేర్చికొంచుఁ.**

కలశజ తనయుండు 'విధాత కెందు దుష్కరమగు కార్యముం గలదె' అని దుర్యోధనుని దైన్య స్థితికి మిక్కిలి వగచును.[1]

పదునెనిమిది యక్షౌహిణులతో మిగిలినది అటు పంచపాండవులు శ్రీకృష్ణుడు సాత్యకి, ఇటు రథిక త్రయము. దుర్యోధనుడు అశ్వత్థామ నగ్గించి, పునర్దర్శనంబు త్రిదివంబున నయ్యెడు గాక వగలు మాని పాండని రథిక త్రయమును వీడ్కొని ప్రాణములు విడిచెను.

అశ్వత్థామ 'మేన భసిత మలంది' తపస్వియై వ్యాసాశ్రమము చేరును. ధర్మజ ధనంజయ శ్రీకృష్ణులు అతని వెంబడించిరి. అశ్వత్థామ యొక యిషీకంబు పుచ్చుకొని బ్రహ్మశిరో నామకాస్త్రము నావహించి ప్రయోగించెను, అర్జునుడు గూడ బ్రహ్మశిరోనామకాస్త్రమును ప్రయోగించెను. తిరిగి తిక్కన ఉభయాస్త్రములసంఘర్షణను 'మహాస్రగ్ధరలో' నభివర్ణించెను.

**జలధుల్ ఘూర్ణిల్లె నుల్కాశతములు వడియెం జండ భానుండు మాసెం**
**గులశైలంబుల్ వడం కెం గురిసె నురవడిం ఘోరపాషాణ ధారా**
**వలి నాకాశంబు ధాత్రీ వలయముఁ దిరిగెఁ వ్యజనిర్ఘోష మొందుం**
**జెలఁగం జొచ్చెఁ జనం బచ్చెరువును భయముం జెంది నిశ్చేష్టమయ్యెన్.**

అశ్వత్థామ శిరోరత్నమును గ్రహించి ధర్మజాదులు తిరిగి పోవుదురు. ఆ కథలో నెచ్చట స్రగ్ధర మహాస్రగ్ధరలు గానరావు. తిక్కన భావోచిత భాషను మాత్రమే గాక, సందర్భోచితమైన ఛందస్సును గూడ బుద్ధి పూర్వకముగనే ప్రయోగించినట్లు తోచుచున్నది.

---

*1. దైవం హి బలవత్తరం అనునది మూల మహాభారతమునఁ బలు తావుల గనుపించు అభిప్రాయము.*

సౌప్తిక పర్వాంతమున ఆశ్వాసాంత పద్యములలోఁ గూడ స్రగ్ధర గలదు.

మొదటి ఆశ్వాసాంతమున మహాస్రగ్ధర గలదు. సౌప్తిక పర్వమున సాధ్యంతముల నందుకొని యేకధారగ ప్రవహించు బీభత్స భావమునకు స్రగ్ధరలను మహాస్రగ్ధరలను ఉపకరణ ములుగా తిక్కన ప్రయోగించెను. వాతావరణ కల్పనమునకు స్రగ్ధరలు మహాస్రగ్ధరలు ఉపయోగించినవి. ఇవి సౌప్తిక పర్వము నందనుసూత్యముగా నున్న 'లయ' కు శ్రుతిప్రాయముగ ఆశ్వా సాంతమున గల మహాస్రగ్ధర స్రగ్ధరలు ఉపకరించినవి.

ప్రథమాశ్వాసాంతమునఁ గల మహాస్రగ్ధర

పరమజ్ఞేయస్వభావా భవభయహరణ ప్రౌఢనామానుభావా
కరఖేలచ్చక్ర శూలా కలుష హృదయసాంగత్య వైముఖ్య శీలా
కరుణాయత్తాంతరంగా కమలభవమనః కంజసంవాసభృంగా
దురితధ్వాంతప్రదీపాతులనిరసనసంస్తుత్యనిర్వాసరూపా.

**ద్వితీయాశ్వాసాంతమునఁ గల స్రగ్ధర**

సాయంప్రాతర్ధుత ప్రజ్వలితహుత వహ స్వైరనిర్ధూతజాడ్య
స్వాయచ్చేతః ప్రసాద ప్రసృ మరవిమల ప్రౌఢబోధాను మోదీ
మాయా వ్యాపారదూరా ముఖతిహృతినిర్మాణ సంపద్య మానా
శ్రేయోరాజత్రిలోకాశ్రితజనదురిత క్షేపలీలావిలాసా.

ఛందస్సు వలన తిక్కన సాధించిన రసప్రతీతి అనిర్వచనీయము. సహృదయ హృదయైక వేద్యము.

తిక్కన స్త్రీ పర్వమును రెండాశ్వాసములుగ విభజించెను. అందలి విషయమును గూఢ స్థూలముగ రెండు వర్గములుగ విభజింప వచ్చును. విషాద విహ్వలుడైన ధృతరాష్ట్రునికి విదురుడు కృష్ణద్వైపాయనుడు సల్పిన ఆధ్యాత్మిక ప్రబోధము, అట్లే గాంధారిని కృపాచార్యుడు వ్యాసుడు నూరార్చుట, ధృతరాష్ట్రి గాంధారులు పాలికలినికిఁ బోవుట మొదటి ఆశ్వాసము. రెండవ ఆశ్వాసము పాలికలను-స్త్రీల విలాపము.

స్త్రీ పర్వము నందుఁ గన్పించు ఛందోవైవిధ్యము తెలుగు భారతమున మఱియే పర్వము నందును గన్పింపదు. తిక్కన

విరాటోద్యోగములను యుద్ధ పంచకమును వ్రాసిన పిమ్మటఁ దన కవితా గానమునకు మధ్య 'తానం రాగం పల్లవి' గ ఛందోవైవిధ్యమును ప్రదర్శించెననువారు గలరు. ఇటు ఏడు పర్వములు అటు ఏడు పర్వములు అని లెక్క సరిపోపుట కేవలము యాదృచ్ఛికము. తిక్కన స్త్రీ పర్వమును నాయకమణిగ నెంచె ననుటకే యాధారములును లేవు. అయినను—స్త్రీ పర్వమునఁ గన్పించు ఛందో వైవిధ్యమునకు నింతవరకుఁ దృప్తికరమైన వ్యాఖ్యానము చెప్పినవారును లేరు. ఇది భావి పరిశోధనల వలనఁ దేలవలసిన యంశములలో నొకటి.

తరలము, వసంత తిలకము, మత్తకోకిల, ఇంద్రవ్రజ, తరువోజ, తోటకము, ఉత్సాహము, కవిరాజ విరాజితము, దోదకము, మంజుభాషిణి, ఉపజాతివృత్తము, తోదకము, భుజంగప్రయాతము, మానిని, మణిమాల, స్వాగతము, మయూరము, నర్కుటము, బంధురము, ద్రుతవిలంబితము, శుద్ధ విరాటి, లయ విభాతి, స్రగ్విణి, ప్రణవము, జలధరము, మేదిని, క్రౌంచపదము, అంబురుహము ప్రహరణ కలితము, శిఖరిణి, మాలిని, మణిగణ నికరము, లయగ్రాహి, మంగళ మహాశ్రీ, సరసిజము, భాస్కర విల సితము మందాక్రాంతము, స్త్రీ పర్వమున తిక్కన వాడిన వృత్తములు. ఇవిగాక కందము సీసము, ఆటవెలది, తేటగీతులును గలవు. విశేషమేమన, అన్ని పర్వములందును సర్వసాధారణముగా గానవచ్చు ఉత్పలమాల చంపకమాల శార్దూల మత్తేభములు స్త్రీ పర్వము నందు మృగ్యములు.

స్త్రీ పర్వమున ఒక విధముగా నాయికా నాయక పాత్రలుగ బేర్కొన దగినవారు గాంధారీ ధృతరాష్ట్రులు. 'నిర్భర విపద్వి కలాత్ముడైన ధృతరాష్ట్రుడు శోచనీయమైన స్థితికి దిగజారెను. స్వయంకృతాపరాధ మాతని పశ్చాత్తాపముతోఁ గాల్చి సాగినది. ధృతరాష్ట్రుని శీలము పరస్పర విరుద్ధాంశములకు సంగమ స్థానము. అతడు "తెలిసిన మూర్ఖుడు! అతని శీలమునకు స్త్రీ పర్వము నికషోపలము. సంసార గహనమును గూర్చి విదురుని నోట అంతటి మహా ప్రబోధమును వినిన పిమ్మట గూడ అతనికే స్వాస్థ్యము చిక్క లేదు. ధృతరాష్ట్రుడు తన్నుఁ జూడ వచ్చిన పాండవులపై అనురాగము నటించి భీమునిఁ గౌగిలించుకొనును. ఈ

ఘట్టమున 'జగత్సాకల్యవేది' యైన శ్రీకృష్ణుని కిరీటమునకింకొక క్రొత్త తురాయి మొలిచినది. పరేంగిత కుశలుడైన శ్రీకృష్ణుడు భీమునకు బదులు ఇనుప భీముని ధృతరాష్ట్రి కౌగిలి కందింపఁ జేసెను. ధృతరాష్ట్రుడా యినుప ప్రతిమను బొడిబొడి గావించి భీముడే మడిసెననిఁ యెంచి మొసలి కన్నీరు గార్చి విలపింప సాగెను. 'జగతీశ వేదముల్ సదివితి శాస్త్రముల్ వింటి వర్తిల్లితి వృద్ధగోష్ఠి అఖిల పురాణ పర్యాలోచనము సేసితి ఇంకేమి చెప్పవచ్చు' అని శ్రీకృష్ణుడే ధృతరాష్ట్రుని మందలించును. అతడు తెలియనివాడుగాడు. అతని సమాధాన మిట అను సంధేయము. శ్రీకృష్ణునితో "నీ పలుకెల్ల నిక్కమనింద్యగుణా' అని పలికి ధృతరాష్ట్రుడు తన తప్పిదమునొప్పకొనును. పుత్రశోకమాతని కా నిక్రుష్ట బుద్ధి పుట్టించినది. అశ్వత్థామ వంటి వాని శీలములో వచ్చిన మహత్తర విపరిణామము ఇటు స్మర్తవ్యము.

మానవ మానసిక ప్రవృత్తి యొక్క విశ్వరూప ప్రదర్శనము మహాభారతము నందు సాక్షాత్కరించును.

సంసార గహనమును గూర్చి అర్థవాద రూపముగ స్త్రీ పర్వమున గన్పించు ఆఖ్యానము విదుర నీతికి బరాకాష్ఠ మనివించును. ఒక అవనిసురుడు అతి దుర్గ మారణ్యమునఁ జిక్కును. ఘోర మృగాకీర్ణమైన ఆ అడవిలో దెక్కలి కారు దోఁతెంచిన యాతడు దారి గానక విహ్వలుడగును.

అప్పుడా భీషణారణ్యంబున నెదిక్కు సూచిననుఁ దఱచుగా నొడ్డినయురులు దోఁచే ఘోరాకార యుగ నొక్కయువిద యతనిం గౌగిలించుకొనియె. బంచ శిరంబులును నగనిభంబులు నగునాగంబు అనేకంబు లవ్వనంబునం గ్రందుకొనం దిరుగు చుండె. దత్ప్ర దేశంబున నొక్క యుదపానంబు వల్లీవితానంబు చేత సంవృత్తంబై మీదఁ దృణంబులు పరగి నిగూఢంబై యున్న నప్పు రుషుం దానూతం బడి యొక్క బలుదీగం దవిలి తలక్రిందై వేలుచుఁ గొమ్మ నున్న పనసపంటి చందంబున నుండె నట్లయ్యే వస్థ నొందియు నక్కూ పంబులో నొక్క భీమభుజంగంబు నాలుకల గ్రోయ నారుదలలును బంద్రెండ్రు కాళ్ళను గృష్టశబల వర్ణంబును గలమహాగజం బానూతిదరి నున్నతరుపు జేరం జనుదేర నందు

శాఖోప శాఖల నానావర్ణంబులగు మధుకరంబులు మధు సంచయనం బాచరించి వర్తింప సితాసితంబులగు మూషికంబు లమ్మహీరుహంబు మూలంబు నఱకుచుండ.

**ధరణీనాథ వినుము మధువు ధారలెల్లప్రొద్దునం**
**దొరగుచుండ నతఁడు వాని దోహలమున నానుచుం**
**బోరయ దెప్ప దృష్టి వగల ప్రోక రైన యట్టి దు**
**స్తరపుటున్కి కొల్లఁబాటు దన్న డించు కేనియున్.**

ఇట్లున్న యతనికి నా బాహువ్యాళంబులం దొక్కలికాఁరుల యురులవలనను నయ్యుగ్రకామిని కారణంబుననుం బంచ శిరస్కంబు లగుసామజంబుల సందడి నాకూపంబులో నున్న యుద్ధారుణదర్వీకరంబుకతంబునను సూతి దరిం జరించు నగ్గ జంబు ఘోరత్వంబునం జేసియు మూషికంబుల తరువతన హేతుభావంబునను నాచంచలచంచరీకంబుల కారించుటనుం జేతో వృత్తంబు వికలతాయత్తంబై యుండ నతండు జీవితాశయు విడువండు.

సంసార బంధమునఁ దగుల్కొనిన మానవుని జీవిత చరిత్ర- ఇందు అర్థవాద రూపమునఁ బ్రదర్శితము. ఈ పోడువు కథకు భారతము నందే 'విడుపు' గలదు.

'కావున నేతత్స్వరూపం బభివ్యక్తంబుగ వివరింప వలసి యుండు వినుము చెప్పెద నా దుర్గంబు సంసారగహనంబు వాలు మృగంబులుఁ దెక్కలికారులు రోగంబులు కామిని జర పంచ శిరస్కంబు లగుగజంబు లింద్రియ ప్రపంచము లాకూపంబున నున్నయాగం బంతకుండు తీగ జీవితాశ కూపంబునుపాంతంబున నున్నయవనీరుహం బాయువు దానిదెస నడచుసామజంబు సంవత్సరంబు తదీయ శిరంబు లాఱును బుతువులు తత్పా దంబులు పండ్రెండును మాసంబులు తరుమూలంబు నఱకు నెలుకల హోరాత్రంబులు మధుకరంబులు కామంబులు మధుధారలు కామరసంబులు మధుసంచయనం బాయువు వాని వలన మానవులాసక్తు లగుదు రిట్టి సంసారచక్రంబు పరివర్తనంబు బుధు లెఱుంగుదురు. వారు దీని పాశంబులు ద్రెంపం జాలుదు రనెను.

పూర్వోక్త గాధ వినిన వారందఱును ధృతరాష్ట్రుడు వ్యాసునితోఁ జెప్పినట్లు

**మానుషజన్మము మాన్యవివేకా**
**మానసదుఃఖసమాజము నెల్లం**
**దాన ఘటించుచు దైన్యము దెచ్చుం**
**గాన భవం బిది గల్పనె తండ్రీ.**

అనుకోనక తప్పదు.

ధృతరాష్ట్రుడు సపరివారముగ పాలికలను సందర్శించుట హృదయవిదారకమైన ఘట్టము. గతపుత్రికలు, విగత భర్తృకల దీనాలాపములు దుర్భరము లనిపించును.

**చేతులు నడుదల చేర్చు టుత్కట శోక**
**మాకారములు దాల్చి నట్టు లుండ**
**విరిసిన వెన్నెలుల్ వెన్నులఁ బ్రక్కల**
**నెఱసి చూపఱిదృష్టి నీరు సేయ**
**నందంద తొరగెడు నశ్రుజలంబుల**
**పెంపున మోములు ముంపఁబడఁగ**
**నేమియుఁ దోడవులు లేమిఁ బాడఁరియున్న**
**యంగంబులందు దైన్యంబు నెరయఁ**
**బతుల నన్నలదమ్ముల సుతులహితుల**
**బేరుకొని వాతులెండంగ బ్రేము డించి**
**పనవుపలుకులు వినువారి వనటఁ దేల్ప**
**గురు కుమార నారీ జన కోటి వచ్చె.**

పై సీస పద్యము మూలములోని విపుల వర్ణనమునకు తిక్కన యథా మూలముగ సల్పిన యథోచిత సంగ్రహము.

**చెలులైన జోడు బయ్యెద**
**తొలగుటకును సిగ్గువడు వధూజనతతి య**
**త్తల యెదుర నేకవస్త్రం**
**బులతో నంగములు వికృతిఁ బొందఁగ నడచెన్.**

అను అమూలకమైన కంద పద్యము తిక్కన తెలుగున క్రొత్తగ జేర్చినదే.

మూలమున గల

**గాంధీరీ చైవ శోకార్తా భర్తుర్వచన చోదితా।**
**సహకుంత్యా యతోరాజా చైవ స్త్రీ భిస్సమా(న్)ద్రవత్॥**

అను శ్లోకము తిక్కన తెలుగు నుడికారముతోపాటు ఆత్మీయ ముద్రవేసి కందముగ రూపొందించెను.

**ఆరం గూరిన శోకము**
**భారంబున మేను దూలఁ బరవశగతిఁ గాం**
**ధారి యనుదెంచె నవ్వసు**
**ధారమణుని కడకు జనవితానము వొగులన్.**

మహాపతివ్రతయైన గాంధారి పాత్రను మూలము నందలి వన్నె కగ్గకుండ తిక్కన జాగరూకతతో దీర్చిదిద్దెను. ఆమె యనిన యందఱకు భయ గౌరవములు గలవు. భీముడు గూడ "భీతి కంపితుండగుచు గాంధారికి వినతుండై వినయంబున ప్రాణ భయంబు కతన నట్లు సేసితి నీదు పుత్రుడు లావు నేర్పు గలడు" అని దుర్యోధను గూర్చియు, అట్లు ద్రాపుట నటించితి గాని,

**అన్యజనములకొనిత మైనఁ ద్రావు**
**అధికపాతక మని విందు ననుజురక్త**
**మాన నే నంత వెట్టినే యంత పాప**
**కర్ముఁడనె తల్లి యంత నిష్కరుణమతినె.**

అని దుశ్శాసనుని గూర్చియుఁ జెప్పి తప్పించుకొనును.

ధర్మరాజు తెలివితేటలు ఒరుల కబ్బునివి. అతడు గాంధారిం జేరి నమస్కరించి

**నీ పుత్రుఁల జంపించిన**
**పాపాత్ముని క్రూరచిత్తుం బరివాదార్హు న్**
**శాపంబునఁ బొలియింపుము**
**భూపాలకవల్లభాభి పూజిత చరణా.**

"జీవ మేటికి రాజ్య మేటికి జెలుల జుట్టల వబిడ్డలం జావ జూచిన యట్టి ద్రోహికి" నాపుడున్ గాంధారి మఱుమాట లాడఁగ నాలుకాడక దీర్ఘ నిశ్వాసమును బరపి యూరకొనెను.

కుంతీదేవి యుద్ధానంతరము పాలికలను నందే మొదటి తూరి పుత్రుల గలసికొనును. వారలు దొట్రిల్లంజని తచ్చరణంబుల మీద వ్రాలి

**ఏడ్వ నందఱపై జేతు లిడుచుం బెలుచ**
**నేడ్చి యద్దేవి వారల నెత్తి వేరు**
**వేఱ మేనులు నివురుచు వివిధదారు**
**ణాస్త్రశస్త్ర వ్రణప్రచయములు గాంచి**
**అచ్చోటు లంటి చూచుచు**
**వెచ్చని యూర్పులు నిగుడ్చ వేగుచుఁ బోగులున్**
**గ్రుచ్చి కవుం గిటఁ జేర్చును**
**వచ్చితిరే నృపకుమార వరులార యనున్.**

పాత్ర చిత్రణమునఁ దిక్కన చూపిన ప్రత్యేక శ్రద్ధాభినివేశము లుగ్గడింప దగినవి. 'మెత్తని మాటలతో ఎదిరి మనస్సు చూరగొన గలిగి యజాత శాత్రవుడు గా గలిగిన ధర్మరాజు వాక్చాతుర్యము, మహ పతివ్రతయైన గాంధారిలో గన్పించు ధర్మనిష్ఠ మీరని మాతృ హృదయము, కుంతీదేవి పుత్ర వాత్సల్యము తిక్కన తెలుగుఁ దనముతో రంగరించి అభివర్ణించెను.

చరణ ప్రణతుడైన ధర్మరాజు పాదనఖములపై, 'పట్టావృత నయన యగు గాంధారి దృష్టి' యించుక సోకినదట. సునఖుడైన యత డప్పటి నుండి కునఖు డయ్యెను. అది చూచి, 'సవ్యసాచి' జనార్ధనుఁ వెనుకకు జని దాగెనట! ఈ అద్భుత కల్పనలో అంతర్గర్భితమైన హాస్యము చిమ్మచీకటితో నలుముకొనిన స్త్రీ పర్వమున, ధ్రువతారక రోచిస్సులు వెలయించుచున్నది.

స్త్రీ పర్వమున ద్వితీయాశ్వాస మంతయు పాలికలను జేరిన స్త్రీల విలాపము. పృథివి, స్త్రీ బాలవృద్ధావశిష్ట మగునట్లు, యుక్త వయస్కులందరు గురుక్షేత్రమునఁ జేరి మడిసిరి. అట్టి సువిశాల శ్మశాన వర్ణనము వేరొకచో గన్పింపదు. మూలము నందే

విపులముగా నున్న ఆ వర్ణనము తిక్కన తెలుగులో విపులతర మొనరించెను

'నుఱుమైన కాల్వాలంబులు, నఱవఱ లయ యున్నట్టి యరదములు, తఱచగు సూతాంగకములు నొఱగిన రథ్యముల గములు నుల్లములగలంచుచుండినవను వర్ణన యథామూలకము.

మూలములో

**గజాశ్వ నర వీరాణాం నిస్సత్త్వైరభి సంవృతం।**
**సృగాల వల గోమాయుకంకకాక నిషేవితం॥**
**మోదీనం పురుపాదానాం రక్షసాం కులసంకులం॥**
**అశివాభిశ్శివాభిశ్చ సేవితం గృధ్రనాదితం॥**

అను శ్లోకముల బురస్కరించుకొని తిక్కన తెలుగులో నాలుగు లయ విభాతులను నొక సీసమును రచించెను.

తిక్కనకుఁ గల ప్రత్యక్ష రణక్షేత్ర పరిచయమే సుదీర్ఘ రణక్షేత్ర వర్ణనకు మూలకారణమని ఊహింపవచ్చును.

గాంధారి శ్రీకృష్ణునితో "ఇది యంతయు నీచే సాధితంబైన కార్యం బని పలికి," కౌరవ పాంచాలమానినీ జనమును జూపించును. మూలములో విపులముగా నున్న ఆ వర్ణన తిక్కన తెలుగున నొక సీస పద్యములో సంక్షేపించెను.

గాంధారి వెనుక జూపు తలపుగ, దుర్యోధనుడు యుద్ధమునకు ముందు ఆశీస్సు అర్థింప వచ్చినపుడు తాను "ధర్మంబే తల నసూన మగు నిద్ధ జయ మాతలకు నెట్లయిన సిద్ధమగు నంటిన్" అనిన పలుకులు[1] ఆమె శీలమునకు గల్పించిన యున్మీలనము పేర్కొనదగినది.

స్త్రీ పర్వము నందలి చివరి ఘట్టము కుంతీదేవి ధర్మరాజునకు కర్ణుడు తన కగ్రజుండని తెలియ జెప్పుట. ధర్మరాజు అనుభవించిన ఆవేదన వర్ణనాతీతము. అతడు కర్ణుని పరాక్రమము నగ్గించి,

1. యతో ధర్మ స్తతో జయః — మహాభారతమున నంతర్వాహినిగ నెల్లెడ గన్పించు నంతర్వాహినియైన ధర్మ సూత్రము.

**అట్టి కర్ణుని గొంగున నగ్ని డాచి**
**నట్టు లెమ్మెయి డాచి తో యమ్మ చెప్పుము[1]**

"మానిత బలుడభిమన్యుండు పోరమడిసి నప్పుడు నిట్టి మఱుకువ నాత్మ సూనుద" ని అతడు వాపోవును. తరువాత ధర్మరాజు కర్ణున కుదక క్రియలు నిర్వర్తించి, యతని భార్యల రావించి మన్నించి, కర్ణమునకై పుణ్య కార్యము లొనరించును.

స్త్రీ పర్వము నందలి ఛందో వైవిధ్యమున కనుగుణముగ ఆశ్వాసాంత పద్యములలో దిక్కన మందాక్రాంతము ప్రయో గించెను.

**వీణానాద ప్రతిమనిగమావిర్భవత్సారపుణ్య**
**శ్రేణి సంపాదిత విమలతా స్తేమనిర్లేపచిత్త**
**త్రాణ క్రీడాకలనసతతోత్సాద్ధి వ్య భావా**
**ప్రాణాపానాహరణనిపుణ ప్రాపణీయానుభావా.**

మేఘసందేశ నందు విరహ విషాద భావ ప్రతీతికి మందా క్రాంతము కాళిదాస మహాకవిచే గూఢ నుద్దిష్టము. తిక్కన గూఢ స్త్రీ పర్వమునకు పర్యవసానముగ మందాక్రాంతమునే ప్రయోగించుట స్త్రీ పర్వము నందలి ఛందో వైవిధ్యమునకు యథోచిత భావ ప్రతీతియే యుద్దిష్ట ప్రయోజనమును ఊహకు దోహద మొసగుచున్నది.

---

1. తమగ్ని మేవ పస్తేఽణ — అని మూలము పలుతావుల తిక్కన అభి మానమును జూరకొనిన యీ ఉపమ కిక్కడ మాతృక లభించినది. 'చిచ్చోడిం గట్టినయట్టుల' మున్నగు ప్రయోగములు అమూలకములు.

# శాంతి సప్తకము

శాంతి పర్వము అనుశాసనిక పర్వము గలసి మహాభారతము నందు శ్లోక సంఖ్యను బట్టి ఐదవ వంతుగ నున్నది. కురుక్షేత్ర యుద్ధానంతరము మిగిలిన భారతకథ స్వల్పము. విరాటోద్యోగములు, యుద్ధ పర్వములు, యుద్ధ పర్వములకు అనుబంధ ప్రాయమైన సౌప్తిక స్త్రీ పర్వములు కథా ప్రధానముగ దెలుగున వినిర్మించిన తిక్కనకు గథ కంటె యాధ్యాత్మిక విషయములే బహుళముగా నున్న శాంతి సప్తకము నందు సంక్షేపించు నవసరము వెనుకటి కంటె నధికతరమైనది. భగవద్గీతాసారము కతిపయ పద్యములలో, సనత్సు జాతీయము నొక వాక్యములో సంక్షేపించిన తిక్కన, ఆ పద్ధతినే శాంతి పర్వము నందనుసరించినచో శాంతి పర్వ మంతయుఁ దెలుగున గతిపయ పద్యములతో సరిపోయెడిది. అరణ్య పర్వము పంద్రెండేండ్ల కథ. విరాటోద్యోగము సంవత్సరము దాటిన కథ. శాంతి పర్వము, అనుశాసనిక పర్వములలోని యితివృత్తము బహుళముగా భీష్ముడు కొన్ని దినములలో ధర్మరాజు నకు సల్పిన నీతిబోధ. కథా గమనమున బిందు వ్యాప్తి గోచరింపదు. తిక్కన, కథా ప్రధానముగాని శాంతి పర్వమును అనుశాసనిక పర్వమును మిక్కిలి సంగ్రహించెను. శాంత్యానుశాసనిక పర్వములలో ఔత్తరాహ ప్రతులకును దాక్షిణాత్య ప్రతులకును గల భేదము మిగిలిన పర్వముల కంటె మిక్కిలి యెక్కువగాఁ గాన నగును. తిక్కన దాక్షిణాత్య ప్రతినే యనుసరించె ననుభావమునకు అను శాసనిక పర్వము ననుసీలించినచో సందేహమునకు దావు లేకుండ ఋజువగును.[1] కాని శాంతి పర్వమునఁ దిక్కన యే మాతృక నను సరించె ననునది దురదృష్టవశమున దేల్చి చెప్పుటకు వీలు పడుట లేదు. తిక్కన అనుసరించిన మూలప్రతి నిష్కర్షగ జెప్పుటకు వీలులేదుగాని దాక్షిణాత్య ప్రతులలో నొకదానిని అనుసరించె ననియొంచుట కవకాశము లున్నవి గనుక, నాగరి లిపిలో శ్రీ పి. పి. యస్. శాస్త్రి గారి సంపాదకత్వమున వావిళ్ళవారు ప్రచురించిన దాక్షిణాత్య ప్రతి నాధారముగ గైకొన వచ్చును.

1. ఈ విషయము ప్రకరణాంతరమున సవిస్తరముగ గలదు.

ఆ ప్రతిని బట్టి సూక్ష్మముగఁ బరిశీలించినఁ, దిక్కన అట్టి ప్రతినే యనుసరించె ననుట తెల్లమగును. ఒక వేళఁ దిక్కన భారతము తరువాతనే, దాక్షిణాత్య ప్రతులలో నాయా ఘట్టములు ప్రక్షిప్తములు చేరి రూపాంతర మొంది యుండు నను వాదము నిలువదు. ఏలన, దిక్కన సంక్షేపించు పద్ధతిలో, అనువాద విధానముల నెల్లెడ నొక వైలక్షణ్యము ప్రదర్శించుచుండును. అందుచే మాతృక యేదియొ పుత్రిక యేదియొ నిర్ణయించుట సహృదయయలకు అసాధ్యము గాదు. శాంతి పర్వము నందుఁ గూడ తిక్కన దాక్షిణాత్య ప్రతినే యనుసరించెను గాని వావిళ్ళవారి నాగర లిపిలో వేసిన ప్రతి తెలుగు దేశము నందలి ప్రతులకు ప్రాతినిధ్యము వహించుటలేదు.[1]

దాక్షిణాత్య ప్రతిలోని ౧౯౦, ౧౯౪, ౧౯౯ , ౨౦౧, ౨౦౨, ౨౦౫, ౨౦౬, అధ్యాయములు ఔత్తరాహ ప్రతులలోఁ గన్పింపవు. దాక్షిణాత్య ప్రతులలోఁ గన్పింపని దక్షాధ్వరధ్వంసము, వీరభద్రుని దక్షుడు శివుని సహస్రనామార్చనచే శాంతుని జేయు ఘట్టము ఔత్తరాహ ప్రతులలోఁ గలదు. 13 వ శతాబ్ది ప్రాంతపు వాడైన భారత వ్యాఖ్యాత వాదిరాజులు ఈ ఘట్టమును బేర్కొనలేదు. వాయు పురాణమున, ఈ షద్భేదములతో ఈ ఆశ్వాసమంతయుఁ గాన నగును. ఈ ఘట్టము తెలుగు శాంతి పర్వమునఁ గానరాదు. అంతేగాక, పూర్వోక్తములైన ౧౯౦, ౧౯౪, ౧౯౬, ౧౯౯, ౨౦౧, ౨౦౨, ౨౦౫, ౨౦౬ ఆశ్వాసములు, దాక్షిణాత్య ప్రతులలోఁ బెక్కింటఁ గన్పట్టవు గాని శ్రీ టి. ఆర్. కృష్ణమాచార్యులవారు ప్రచురించిన కుంభకోణ ప్రతిలో నున్నవి. వారు పాండురంగ రామచంద్రాచార్యులవారి నుండి సంపాదించిన తెలుగు లిపిలో నున్న సంస్కృత ప్రతిలో నా అధ్యాయములు గలవని తెలిపిరి.

1. “In the case of the Santi Parvan, however, our attempts to get at reliable manuscripts written in Telugu Script have so far proved fruitless. All the manuscripts of the Santi Parvan written in the Telugu Script and available at the famous manuscript libraries at Madras and Tanjore, as well as those belonging to private parties, are invariably representatives of northern section” — P. P. S. Sastri

దక్షాధ్వర ఘట్టము వీరభద్రుని శివసహస్ర నామార్చనతో శాంతుని గావించు ఘట్టము-తిక్కన తెలుగు భారతమున లేదు. ౧౯౦వ అధ్యాయము భోగవతీ నిబంధనుల సంవాదము, తెలుగులో లేదు. ౧౯౧, ౧౯౨ అధ్యాయములు భగవంతుని నిఖిల జగత్కారణత్వ ము, బ్రహ్మోత్పత్తి బ్రహ్మపుత్ర వంశము ఒక పద్యములో సంక్షే పిం చెను. వరాహ, వామనావతార వర్ణనములు, ౧౯౩వ అధ్యాయము, వదలి పెట్టెను. కాని 'ఇట్లు లీలా జన్మం బులం బొంది' అని తిక్కన వ్రాసిన వాక్యములోనవి గతార్థములుగ నెంచవచ్చును. తిక్కన మూలము నందలి ౧౮౪వ అధ్యాయమును వాసుదేవ తత్త్వ కథ నము భీష్ముడు ధర్మజునకు విష్ణుమంత్ర ప్రభావం బెరింగించు ట అనుశీర్షక క్రిందఁ దెనిగించెను. ౧౯౯ అధ్యాయము గరుత్మంతుడు భగవంతుడు తనకుఁ జెప్పిన భగవన్మహిమ వర్ణించుట తెలుగున లేదు. ౧౯౯వ అధ్యాయము ౨౦౦, ౨౦౧ అధ్యాయ ములు జనక పంచశిఖ సంవాదము తిక్కన తెలుగున సంక్షేపించెను. ౨౦౨వ అధ్యాయము సువ ర్చలాశ్వేతకేతూ పాఖ్యానము తెలుగున లేదు. ౨౦౩వ అధ్యాయముదమ ప్రశంస తిక్కన సంక్షేపించెను. ౨౦౪వ అధ్యాయము ముని సనత్కుమార సంవాదము. ౨౦౬వ అధ్యాయ ము, సువర్చలా చారి కథనము తెలుగులో లేవు. తిక్కన దాక్షిణాత్య ప్రతులలోఁ గన్పింపక, కుంభకోణ ప్రతిలో గన్పించు కొన్ని అధ్యా యములను సంగ్రహించి మఱికొన్ని అధ్యాయములను వదలి పెట్టెను. ఇంతే గాక దాక్షిణాత్య ప్రతులలో మోక్షధర్మ పర్వారంభ మున గన్పించు, భృగు చరిత్రము ౧౮౬ నుండి ౧౯౩ అధ్యాయ ములను తిక్కన తెలుగులో శాంతి పర్వము చివర వ్రాసెను. దాక్షి ణాత్య ప్రతులలో గన్పించు మఱికొన్ని అధ్యాయములను గూడ తిక్కన వదలి పెట్టెను.

శాంతి పర్వమునందు వలెనే అనుశాసనిక పర్వమున గూడ దాక్షిణాత్య ప్రతులకును ఔత్తరాహ ప్రతులకును విశేష భేదములు గలవు. తిక్కన తెలుగు భారతమునకు మాతృక దాక్షిణాత్య ప్రతులలో నొకటియే యై యుండుననని నిస్సందేహముగఁ జెప్ప వచ్చును.

1. ఇంద్ర మతంగ సంవాదము దాక్షిణాత్య ప్రతులలో 3 వ అధ్యాయము. ఔత్తరాహ ప్రతులలో ౨౭, ౨౮, ౨౯ అధ్యాయముల

లోఁ గన్పించుచున్నది. తిక్కన ఇంద్రమతంగ సంవాదమును అను శాసనిక పర్వమునందు ఆరంభమునందే గౌతమీ లుబ్ధక సర్ప మృత్యు కాల సంవాదము, అగ్నిదేవుడు సుదర్శనయను కన్యకను వివాహము సేసికొనుట తరువాత మూడవ శీర్ష కగఁ జేర్చెను.

2. గరుడోపాఖ్యానము—దాక్షిణాత్య ప్రతులలో నున్నది. ఔత్తరాహ ప్రతులలోఁ గన్పింపదు. తిక్కన తెలుగు భారతమున అనుశాసనిక పర్వమునందు గరుడోపాఖ్యానము చేర్చెను. ఔత్తరాహ దాక్షిణాత్య ప్రతులలోని తారతమ్యము నరయని అధునాతన విమర్శకులు పలువురు తిక్కన గరుడోపాఖ్యానమును మూలములో లేకపోయినను( జేర్చెనని తలపోయుచున్నారు. గరుడోపాఖ్యాన మును నన్నయ గూడ ఆదిపర్వమునఁ వ్రాసి యుండెను. తిక్కన మూలములో లేని కథను వ్రాయుటకు హేతువు, నన్నయ కంటెదన కవిత మేల్తరమని నిరూపించుకొనుటకే యని యూహించు వారును లేకపోలేదు. శ్రీకృష్ణ భారతమునందు అనుశాసనిక పర్వము నందు గరుడోపాఖ్యానము లేదు. దీనికి హేతువు శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రి గారి భారతము ఔత్తరాహ ప్రతికి ఆంధ్రీకృతి యగుటయే.

శ్రీ కురుగంటి సీతారామయ్యాగారు 'మహాభారతోపన్యాసము' లలో, "అనుశాసనికకాశ్వమేధములు - ఇందు సంగ్రహ కథనము గలదు. సుదర్శనోపాఖ్యానము సంగ్రహించినను మిక్కిలి రసవంత ముగ చేసినాడు. గరుత్మంతుని చరిత్రమును మిక్కిలి రసవంతము చేసెను. కాని—ఇది మాతృకలో కానరాదు" అని చెప్పిరి.1

ఆ యుపన్యాసము నందే, ప్రకరణాంతరమున, వారు— "అందువలననే మాతృకలో లేకపోయినప్పటికిఁ సమయము గల్పించుకొని గరుత్మంతుని చరిత్రను గైకొని వర్ణించినాడు. శ్రీకృష్ణ భారతమున నిది లేదు" అని చెప్పిరి. పలువురు పండితులు ఔత్త రాహ దాక్షిణాత్య ప్రతులలో గల భేదములను గుర్తింపక ఆంధ్ర మహా భారత మాతృకను గూర్చి విమర్శలు చేయుట జరిగినది. తిక్కన గరుడోపాఖ్యానమునకు దాక్షిణాత్య ప్రతులన్నిటి యందు ను మాతృక గన్పించుచున్నది.

1. ఆంధ్ర మహాభారతోపన్యాసములు ప్రచురణ - ఆంధ్ర సారస్వత పరిషత్తు. హైదరాబాదు.

దాక్షిణాత్య ప్రతులలో మళయాళ దేశమున దొరికిన ప్రతులలో గూడ గరుడోపాఖ్యానము గన్పించుచున్నది. అంతేగాక తిక్కన యథా ప్రకారము మూలమును సంక్షేపించుట, ఆంగిక సాత్వికాభి వర్ణనము మున్నగునవి చేర్చుటచే మాతృక సంస్కృత మూలమనియు, పుత్రిక తెలుగు భారతమను నంశము స్వయం వ్యక్తమగు చున్నది.[1]

గరుడోపాఖ్యానము సంస్కృత భారతమున అనుశాసనిక పర్వాంతర్గతమైన ఉపాఖ్యానమునుటకు భారతవ్యాఖ్యాత యైన వాదిరాజులవారి సాక్ష్యమున్నది. గరుడోపాఖ్యానము నుండి వాది రాజ ప్రతీకల నుదాహరించెను.

అట్లే — దాక్షిణాత్య ప్రతులలో నుండి ఔత్తరాహ ప్రతులలో గన్పింపని మఱికొన్ని ఘట్టములు తిక్కన తెలుగు భారతమున గన్పించుచున్నవి. నారద సనత్కుమార సంవాదము, వ్యాససుక సంవాదము మున్నగునవి — దాక్షిణాత్య ప్రతులలోఁ గన్పించునవి — తిక్కన తెలుగు భారతమున సంగ్రహరూప మున గలవు. దాక్షిణాత్య ప్రతులలోమాత్రమే గన్పించుచున్న రుద్ర సనత్కు మార సంవాదము, సనత్కుమారుడు శివమునకు దేహాంతర్గత దైవతముల దెల్పుట, సాంఖ్యయెగంబు తెఱంగెఱింగించుట, తెలుగు భారతమున గూడ గలవు.

అట్లే — ఔత్తరాహ ప్రతులలోఁ గన్పించి దాక్షిణాత్య ప్రతులలోఁ గన్పింపని ఘట్టములు తిక్కన తెలుగు భారతము నందును గన్పింపవు. ఔత్తరాహ ప్రతిలో అనుశాసనిక పర్వమున ముప్పది రెండవ అధ్యాయమున శ్యేనకపోతోపాఖ్యానము గలదు తిక్కన తెలుగు భారతమున అనుశాసనిక పర్వమున నీ కథ గన్పింపదు.

అట్లే దాక్షిణాత్య ప్రతులలో ఔత్తరాహ ప్రతులలోని ౧౦౯, ౧౧౦ అధ్యాయములు మార్గశీర్షము నుండి కార్తికము వరకు ద్వాదశినాడు, ఈశ్వరారాధన సల్పుట వలన, చాంద్రవ్రతము సలుపుట వలన గలుగు పుణ్యమును గూర్చిన వర్ణనము, దాక్షిణాత్య ప్రతులలో గానరాదు. తిక్కన అనుశాసనిక పర్వము నందును గాన

1. ఈ విషయము ప్రకరణాంతరమున విస్తరింపఁ బడినది.

రాదు. అట్లే, ఔత్తరాహ ప్రతులలో గల ౧౯౨ వ అధ్యాయము నుండి ౧౩౦ వ అధ్యాయము వఱకు విష్ణు, బలదేవ, సూర్య, గార్గ్య, వాయు, లోమశ ఋషిర్ధంతి, యములు మతానుసారము ధర్మ నిరూ పణము — దాక్షిణాత్య ప్రతులలో- తిక్కన తెలుగు అనుశాసని క పర్వము నందును గానరాదు. ఇట్లే- ఔత్తరాహ ప్రతులలోని శ్రీకృష్ణ మాహాత్మ్యము ౧౪౭, ౧౪౮, అధ్యాయములు, ఏకాదశ రుద్రుల వివిధ నామములు, ద్వాదశాదిత్యుల వర్ణనము మున్నగునవి దాక్షిణాత్య ప్రతులలో — తెలుగు భారతము నందలి అనుశాసనిక పర్వము నందును గన్పింపవు. దీనిని బట్టి తిక్కన దాక్షిణాత్య ప్రతులలో నొకదానిని మాతృకగా స్వీకరించి శాంత్యానుశాస నికముల ననువదించెనని చెప్పవచ్చును.

శాంతి పర్వము, అనుశాసనిక పర్వములకు మహాభారత మున గల స్థానము విశిష్టమైనది. మహాభారతమును గథా ప్రధాన ముగ గాక తాత్త్విక నైతిక దృష్టులతోఁ జూచువారికి శాంత్యాను శాసనిక పర్వములే మహాభారతమునఁ గొలికి పూసలనిపించును. ఈ రెండు పర్వములలో ఆధ్యాత్మిక తత్త్వ ప్రబోధము, నీతి వివరణమే యితి వృత్తము లగుటచే, గథకుఁ బ్రాధాన్యము లేదు. తిక్కన కథా భాగములను విస్తరించి, మిగిలిన భాగములను సంగ్రహించెను. తిక్కన కావ్యదృష్టితో నెంత విస్తరించిననుఁ గథా భాగ మీ రెండు పర్వముల నత్యల్ప మగుటచే ఆధ్యాత్మిక ప్రబోధమే ప్రాముఖ్య మును వహించుచున్నది

మహాభారత యుద్ధము ముగిసెను.

ప్రపంచ చరిత్రలో లిఖిత సాక్ష్యముతో గనుపించుచున్న మొదటి ప్రపంచ సంగ్రామ మదియే కావచ్చును. అనాటి బృహద్భా రతమున బాల వృద్ధావశేషముగ యుక్త వయస్కు లందరు ఆ మహా యుద్ధమున మడసినట్లే భావింప వచ్చును. ఎచ్చటఁ జూచిన సు విశాల శ్మశానచ్ఛాయలే వికటాట్టహాస విలయతాండవ మొనరించి నవి. కోమల హృదయుడైన ధర్మరాజు మనస్సున భూకంపము లు ద్భవించినవి. ధర్మరాజు శీలమునకు శాంతి పర్వ మంతయు ఉన్మీ లనము గల్పించు చున్నది. యుద్ధానంతరము శాంతి పర్వమున

ధర్మరాజు పొందిన ఆవేదన, పశ్చాత్తాపము అతని శీలమునకు మెఱుగు పెట్టి, అతని సార్థక నామధేయు నొనరించు చున్నది.

ధర్మరాజు శీలముతోపాటు శాంతి పర్వము భీమార్జున నకుల సహదేవుల స్వభావములు ద్రౌపది శీలము స్వయం వ్యక్త మగు చున్నవి. జ్ఞాతి వధ, గురుద్రోహము, నిజసోదరుడైన కర్ణుని మరణము, సకల ప్రజాక్షయము ధర్మరాజును గలవర పెట్టినవి.

ధర్మరాజు మనస్సంక్షోభము మూలమున మిక్కిలి విస్తరించి యున్నది.[1] తిక్కన ధర్మరాజు మానసికావేదనను ఒక సీస పద్యమున మిక్కిలి హృదయంగమముగ సంగ్రహించెను. జ్ఞాతి వధ మాత్రమే గాదు. సకల ప్రజా క్షయముతో పాటు కర్ణుని మరణము గూడ అతని మనస్సు గలచినది.

తల్లి యగు కుంతి నివాపాంజలి సమయమున నిజమును బయటఁ బెట్టి నపుడు, ధర్మరాజు తన "యంత రంగంబు నిప్పులం బోరలి నట్లయ్యె" ననును.[2]

**అతని మేను కుంతి యట్టుల కైవడి**
**యరయ నేను జూచి యాత్మ నెద్ది**
**కారణంబొ యిట్టుగా ననుచుండుదు**
**నేమి సేయువాఁడ నింకఁ జెప్పుమ.**

మూలమున ధర్మరాజు కర్ణుని పాదములు కుంతి పాదములు అను బోలియుండెనని వచించును.[3] ఇట్టి చిరు మార్పులు తిక్కన తెలుగు భారతము నందు పలు తావులఁ గావించెను.[4]

---

1. యుధిష్ఠిర రహస్య పరిశోచనం — అష్టమోధ్యాయః యుధిష్ఠిరస్య నిర్వేదవచనం — నవమోధ్యాయః

2. మూలము సందలి ఉపమ పేర్కొన దగినది. "తూలరాశి మివానిలః"

3. కుంత్యా హి సదృశౌ పాదౌ కర్ణస్యేతి మతిర్మమ.

4. సంస్కృతమున యుధిష్ఠిరుడు భూమిని జయించుటకు కృష్ణుని బాహుబలము బ్రాహ్మణ ప్రసాదము భీమార్జున బలము పేర్కొనును.
యుధిష్ఠిరః: "విజితేయం మహీకృత్స్నా కృష్ణ బాహు బలాశ్రయాత్ బ్రాహ్మణానం ప్రసాదాచ్చ భీమార్జున బలేనచ"
తిక్కన తెలుగులో శ్రీకృష్ణుని 'బాహుబలము' విడిచి, 'కృష్ణుండు మా మీదఁ గృప సేయుటయు బ్రాహ్మణాను గ్రహంబున ననిల పుత్ర పార్థుల పటు బాహుబలమున' మేదినిఁ జేకొరె నను ను.
శ్రీకృష్ణుని బాహుబలము కాక బుద్ధిబలమే పాండవుల రక్షించినది.

సంస్కృతమున ధర్మరాజు కర్ణార్జున సాహాయ్యమున, "నేను" వాసవుని గూడ జయించి యుండెడి వాడ నని చెప్పును.

"కర్ణార్జున సహాయెహం జయేయ మపి వాసవం" కర్ణునితోఁ గలిసి నపుడు అతడే అన్నగారు గనుక, నిక ధర్మరాజునకు గల ప్రాధాన్యమేమి?

మూలము నందలి యేక వచన ప్రయెగమును తిక్కన, 'ఆతండును మేముఁనైన విబుధ ప్రకరంబును మాకు నడ్డమే' యని మార్చెను. తెలుగు నందలి బహువచన ప్రయెగమే ఉచిత మని పించును. తెలుగు భారతమున ఈ ఘట్టము నందు కర్ణుడు కుంతి దేవితో, 'ఆతడు బెరయ నొందెను నను బెరసియుండెను నేపురింతియగాని నీ వెపుడు నీకుఁ దనయురార్వురనకు మనియె' నని చెప్పినట్లు గలదు. మూలమునందు గూడ ఈ భావమే జిగి బిగి గల బింకపు బలుకుబడితో గన్పించుచున్నది.[1]

తెలుగు భారతము నందును మూలము నందును గూడ నీ భావమేలకో ఉద్యోగ పర్వము నందు కుంతి కర్ణ సమావేశమున గన్పింపదు. చివరకు నారదుడు చెప్పిన ఉపసంహార వాక్యములు హృద్యము లైనవి.

**వినుము నరేంద్ర విప్రుడలి వెన్ జమదగ్నిసుతుండు శాప మి**
**చ్చె నమరభర్త వంచనము సేసె వరం బని కోరి కుంతి మా**
**న్చె నలుక భీష్ము డర్ధరధు జేసి యడంచె గలంచె మద్రరా**
**జను చిత మాడి శౌరి విధి యయ్యెఁ నరుం డని జం పెఁ గర్ణునిన్.**

**మన కేటిరాజ్యమెండొక**
**జన పదమున కేగి భైక్ష్య చర్యావిధి జీ**
**వనము నడిపికొని యుండుద**
**మనఘా యిట్లయిన సుఖముల మవుదుమ సుమ్మీ.**

అని అహింసావాదము ప్రతిపాదించిన ధర్మరాజునకు బూర్వపక్షము నెలకొల్పుచు భీముడు మూలమున మిక్కిలి తీక్ష్ణముగ మాటాడును. తెలుగున భీముని సమాధానము నాగరకముగ నున్నది. పాత్ర చిత్రణమున మూల భారతమున

1. సార్జునా వాహతే కర్తే_ నకర్తా_వా హతేఽర్జునే పంచైవ హి సుతా దేవి భవిష్యంతి తవ ధ్రువాః

వాస్తవికత యెక్కువ. తెలుగు భారతమున తిక్కన పాత్రలకుఁ బరిణామో చితి గల్పించి నాగరకముగ తీర్చిదిద్దెను.[1]

సంస్కృతమున భీముడు ధర్మరాజు నధిక్షేపించుచు,

**"శ్రోతియ స్యైవతే రాజన్ మందకస్య విపశ్చితః**
**అనువాకహతా బుద్ధిర్నైషా తత్త్వార్థదర్శినే."**

అని ఘాటుగ విమర్శించును. అంతటితో ఆగక

**"క్రియావిహీనైరథ నైర్మాష్టికై స్సంప్రవర్తితం**
**వేదాభాస మివాజ్ఞానం సత్యాభాస మివాన్ఋుతం."**

అని, ధర్మరాజు నధిక్షేపించును.

మహాభారతమున, అందు విశేషించి శాంతి పర్వమున, జ్ఞానము వలె దోఁచు అజ్ఞానము సత్యము వలె పైకి కన్పించు అనృతమును నిరసించు ఘట్టములు అనేకములు, "ధర్మసూక్ష్మ" నిర్వచనమే మహాభారత ధ్యేయము. శాంతి పర్వమున ధర్మరాజు ప్రవచించిన కర్మ సన్యాసము భైక్షాశనము, మున్నగు వాదముల సమీక్షించినచో మహాభారత రచనా కాలమునాటికే అహింసా వాదము పొందిన ప్రాముఖ్యము; ప్రసరించిన ప్రభావము ఆశ్చర్య జనకమలనిపించును. ధర్మరాజు కర్మ సన్యాస యెగమును ప్రతిఘటించి నిల్చినది భీమార్జున నకుల సహదేవులు; ద్రౌపది. ఇందు భీముని వాదములోని ప్రత్యేకత పేర్కొన దగినది. భీముడు మూలమున ధర్మరాజును మొగమోటమి లేక

**వయం హి బాహుబలినః కృత విద్యా మనస్వినః**
**క్లీబస్య వాక్యే తిష్ఠామో యుద్ధైవాశక్త యస్తథా**

అని అధిక్షేపించును.

తిక్కన తెలుగున భీముని వాదమును హృదయంగమముగ సంగ్రహించెను.

**పనివడి త్రవ్వి కూపమునందు నుదకంబు**
**పానంబు సేయని వాని భంగి**

---

1. ఇట్టి ఉన్మీలనమే తిక్కన విరాటుడు సుదేష్ణ మొదలైన ముఖ్య పాత్రలకే గాక— ఉపాఖ్యానము లందలి అప్రధాన పాత్రలకు గూడ కల్పించెను.

**యున్నతతరు వెక్కి జున్ను సేకూర గొని**
**తేనియ యానని వాని భంగి**
**యాఁకొని యొడలగూర్చి యున్నంబు దళియకు**
**వచ్చిన గుడువని వాని భంగి**
**తమకించి యొక భంగి దనవశంబుగఁ జేసి**
**మానినిఁ గవయని వాని భంగి**

**గాదె కురువరేణ్య ఘనశక్తి సౌర్య సం**
**పన్నులైన పగఱ బంధనమున**
**నోర్చి పూజ్య రాజ్య మొల్లక యడవికి**
**నేగు టివ యెఱుంగు దిత్తఱింగు.**

ఈ సీస పద్యమునకు మూలములో మాతృకలగు శ్లోకములు గలవు. మూలములోని ఉపమలే సీసము నందును సాక్షాత్కరించును.

**యథాహి పురుషః ఖాత్వాకూపం ప్రాప్యచోదకం**
**పంకదిగ్ధో నివర్తేత కర్మే దం న స్త థో పమం**
**యథారుహ్య మహావృక్షం అసంహృత్య తతోమధు**
**అప్రాశ్య మరణం గచ్ఛేత్ కర్మేదం న స్తథోపమం**
**యథాన్నం క్షుధితోలబ్ధ్వాన భుంజేత యదృచ్ఛయా**
**కామీ చకామినీం లబ్ధ్వా కర్మేదం న స్తథోపమం**
**యథా మహాంతమధ్వానం ఆశయా పురుషోవ్రజేత్**
**సనిరాశో నివర్తేత క ర్మే దం న స్తథోపమం**
**యథా శత్రూన్ ఘాతయిత్వాపురుషః కురుసత్తమ**
**ఆత్మానం ఘాతయేత్ పశ్చాత్ కర్మేదం న స్తథోపమం**

నూతిని త్రవ్వి నీటిని పొందలేక బురదను పూసికొనుట మూలము.

ఉదక పానము సలుపక పోవుట తెలుగున తిక్కన చేసిన చిరుమార్పు. మూలము నందలి ఉపమాన పరంపరలలో నాల్గింటిని గైకొని తిక్కన నైదవ దానిని విడిచి పుచ్చెను.

**కేవల నిష్కర్మతా మో**
**క్షా వహ మగునే ని గిరులు నవనీజములున్**

**భూవర ముక్తిం బడయం**
**గా వలవదె యడవి నునికి కైవల్యదమే.**

అను భీముని మాట కర్మ సన్యాసయెగమునకు గొడ్డలి పెట్టు. మూలములో నీ పద్యమునకు మాతృక గలదు.

**యది సన్యాసతస్సిద్ధం రాజన్ కశ్చిదవాప్నుయాత్**
**పర్వతాశ్చద్రుమాశ్చైవ క్షిప్రం సిద్ధి మవాప్నుయుః**
**ఏతేహి నిత్య సన్యాసా దృశ్యంతే నిరుపద్రవాః**
**అపరిగ్రహవంతశ్చ సతతం చాప్రభాషిణః**

కాని తిక్కన మూలమునకు వ్యాఖ్యానప్రాయముగ

**ఫలముల యె డ బ్రహ్మార్పణ**
**కలన పరుం  డగుచు గార్య కర్మము నడపన్**
**వలయుం తత్త్వజ్ఞానము**
**దలకొనినం గర్మశమము దా నై కలుగున్.**

అని చేర్చెను. పై పద్యమునకు మూలమున మాతృక మృగ్యము. దీని వలన మూలమున భీమునితో గన్పించు వాద తీవ్రత, వాక్చాతుర్యములకు దెలుగున నిష్కృతి లభించుటయే గాక, స్వభావ సిద్ధముగ సమన్వయ వేదాంతమైన తిక్కన వ్యక్తిత్వముగూడ స్వయం వ్యక్తమగు చున్నది.

తెలుగున ద్రౌపది తన యభిప్రాయము తెలుపు నపుడు, "నిజ విశాల లోచన రోచులు పరగ, వినయంబాననంబున నతి శయిల్ల" పలికినది. ఇది తిక్కన తెలుగున జేర్చినదే. మూలము నందు ద్రౌపది భీమునివలెనే ధర్మరాజునకుఁ బూర్వ పక్షము నెలకొల్పును.

**"కౌరవులు తమ దురితమునఁ దా రెరిసిరి కల్యషంబు దానఁ గలదే?"**
**ఉచిత దండ వృత్తి నుర్వీ ప్రజాభి రక్షణము నో పి చేతగాక**

రాజ వంశజునకు ధర్మువా భూసురార్థంబులైన శమాదు లాత్మ నిడుట? అని చెప్పుటతో నాగక, ద్రౌపది అని యంత నిలువక చనువు మె ఱసి మేలంపు జందంబున

**వైదికకర్మచారి జనవత్సల నీమదిఁ బట్టుకొన్న యు**
**న్మాదము హీనమానవు మనంబునఁ బుట్టిన వెర్రి వోలె న**

**స్యాదు లఁ దీర్చు టొప్పదు నిజానుజవర్గముమీద గల్గు స**
**త్యాదర సాంద్రసారకరుణామృత మానఁగ నిమ్ము నెమ్మదిన్.**

అని యుద్బోధించును.

"అని యంత నిలువక చనవు మెఱసి మేలంపు జందంబున" అను వాక్యము మూలములో లేదు. తిక్కన తెలుగున నధికముగ జేర్చిన దే. తిక్కన పాత్ర చిత్రణమున వహించిన ప్రత్యేక శ్రద్ధ గమనింప దగినది. విగత పుత్రికయైన ద్రౌపది క్షాత్ర మొలుకు నట్టు మాటాడి నది. ఆమెకు అహింసావాదముపై గౌరవము లేకపోవుట 'దండ' నీతి పై అకుంఠిత విశ్వాసముండుట. మూలము నందు వలెనే తెలుగు న గూడ నిరూపితము. కాని దయార్ద్ర హృదయుడైన ధర్మరాజుపై సానుభూతి గూడ లేకుండ మూలమున ద్రౌపది

**కురుతే మూఢ ఏ వం హి యచ్ఛ్రేయో నాధిగచ్ఛతి**
**ధూ పైరంజన యోగైశ్చ నస్యకర్మభిరేవచ**

అని పలుకును. తెలుగున తిక్కన ద్రౌపది వాక్చాతుర్యమునకు ని ష్కృతి గల్పించుటకు, 'మేలంపు చందంబున' నట్లనెనని చేర్చెను.పాపము ధర్మరాజు 'అనింత బాంచాలితో మఱు మాట లాడక యున్న' నర్జునుండు తిరిగి యుద్బోధింప నుపక్రమించెను. అర్జునుడు హేతువాదమును నాశ్రయించెను.

**'కాయలఁ బండ్ల నీళులను గల్గవె సూక్ష్మపు జంతువుల్**
**ప్రాణములు నిల్వగనేర వహింస నేరికిన్'**

అని అర్జునుడు అహింసావాదమును ఖండించును.[1]

"నిర్విణ్ణమానసుండైన" ధర్మరాజునకు శాంతి ప్రసాదించి కర్మ మార్గమునకఁ బురికొల్పుటకే శాంత్యాను శాసనికము లందలి ధర్మ ప్రబోధ మంతయుఁ గల్పింప బడినది. ధర్మరాజు, సంసారము 'అసటి కంబము వలె నిస్సార' మనియు, "తృష్ణ యడచి కర్మవృత్తి విడిచి నిరాలంబచిత్తుడైన యతాడో సుఖ, దోప దుఃఖాకరంబులగు ధనంబులు గోరెడు నతడు? యని ప్రశ్నించి

---

1.మూలమున నర్జునుండు గూడ 'కటువుగనే' పరమత ఖండనము సలుపును.
అనిష్ఠప్రాయాః కాషాయం ఈహర్థ మితి విద్ధి తం
ధర్మధ్యజానాం మందానాం వృత్త్యర్థమితి మే మతిః
కాషాయై రజినైశ్చైరః నగ్నాన్ ముండాన్ జటాధరాన్
విభూతి సాధూన్ మహారాజ యథాలోకాన్ జితేంద్రియః
అని జనక భార్య చెప్పినట్లు, అర్జునుడు చెప్పిన యితిహాసము.

**విమలజ్ఞానులు శమమును**
**దమమును ద్యాగంబు శాశ్వతప్రచురానం**
**దమునకు మూలము లంద్ర ని**
**జముగాఁ గైకొందు రవి ప్రసన్నవివేకుల్.**

అని తీర్పు చెప్పును.

శాంతి పర్వము నందలి ఉపాఖ్యానములను నీతి ధర్మ ప్రబోధమును సమదృష్టితోఁ జూచినచో సమన్వయ మేర్పడును. అందుచేతనే దానికి శాంతి పర్వమను నామధేయము గూడ సార్థక మనిపించును.

౧. అప్పటికి యుద్ధము జరిగిపోయినది. ప్రజాక్షయ మైన మాట భూతార్థము. ఇక చేయగలిగినదేమున్నది? గతజల సేతు బంధనము వలనఁ బ్రయోజనము శూన్యము. అప్పుడు అహింసా ప్రబోధ మొనర్చి ప్రయోజనము లేదు. అందుచే అందలి నీతి బోధ కర్మాచరణమునకు విశేష ప్రాముఖ్య మొసంగక తప్పదు.

౨. శాంతి పర్వము నందలి ఇతిహాసములు ఉపాఖ్యానములు, సంవాదములు పురాణ ప్రసిద్ధములైన ధర్మ ప్రబోధములు. వానిని వివరించిన వ్యాస నారదాది మహర్షులు వాని నుటంకించిరే గాని వానికి వారే గ్రంథకర్తలు గారు.

3. మహా భారతము నన్నయ చెప్పినట్లు "విశ్వజనీ నమైన" సంకలన గ్రంథము. శాంత్యానుశాసనిక పర్వము లందలి సంవాదము లన్నియు సాంగోపాంగమైన సవిస్తర సంకలనమునకు ఉదాహరణములు.

౪. భిన్న వాదములు సమీక్షించుటలో శాంత్యానుశాసనిక పర్వము లందు గాన్పించు - అన్యోన్య వైరుధ్యము - సంకలనము నందలి ఉదారతకు లక్ష్యభూత మగును గాని, అది స్వవచో వ్యాఘాతమని యెంచరాదు.

౫. భీష్ముడు శాంత్యానుశాసనిక పర్వములకు కథా నాయకుడు గాడు. గ్రంథకర్త యునుగాడు. కేవల మొక సంకలన కర్తయే. అందుచే, అయా ఉపాఖ్యానము లందలి భావములను బట్టి భీష్ముని శీలమును నిర్ణయించుట పొసగదు.

శాంతి పర్వము నందు తిక్కన సంక్షేపానువాద పద్ధతిని సర్వత్ర పాటించెను. మూలములోని అధ్యాయములను ఒకటి రెండు పద్యములలో సంగ్రహించిన పట్టులు గూడ గన్నిగలవు. శ్రీ పి. పి. యస్. శాస్త్రి గారి సంపాదకత్వమున వెలువడిన దాక్షిణాత్య ప్రతికిని (వావిళ్ళవారి నాగర ప్రతి) తిక్కన అనుసరించిన ప్రతికిని భేద మున్న దనుట భూతార్థము. తిక్కన నిస్సందేహముగ దాక్షిణాత్య ప్రతినే యనుసరించెను. ఆ ప్రతికిని వావిళ్ళవారి నాగర లిపి ప్రతికిని భేదముల కంటె సామ్యములే యెక్కువ. తెలుగులో గన్పించని అధ్యాయములను మినహాయించినచో వావిళ్ళవారి దాక్షి ణాత్య ప్రతికి తెలుగు భారతము సంక్షిప్తాను వాదము.

శంఖ లిఖితోపాఖ్యానము తిక్కన యథామూలముగనే తెనిగించెను. ఉప సంహారమున నిష్పద్భేదము గలదు. లిఖితుండు బాహుదా నది తోయముం గ్రుంకులిడగనే విక్రుత్త బాహువులు యథాపూర్వముగమొలచినవి. విస్మితుండగు లిఖితునితో శంఖుడు, "దీనికి నచ్చెరువందనేల యిది మదీయ తపో విభవంబున దైవ కృతంబైన విశేషము" అని చెప్పుటతో తెలుగున కథ ముగియు చున్నది.

సంస్కృతమున లిఖితుడు, "అట్లైన లిఖితుడు," "అద్భుత మైన నీ తపో విశేషము చెప్పున నీవిదివరకే యేల నన్ను పూతుని చేయలేదు." అని ప్రశ్నించును. దానికే శంఖుడు అది తన ధర్మము కాదనియు రాజె దండధరుఁ డనియుఁ జెప్పును.

ఋషుల వాక్యము లాలించియుఁ దిరిగి ధర్మరాజు, "మేదినీ భరణ మర్థంబే గురుద్రోహికిన్" అని వాపోవును. భారతీయులలో యుగయుగముల నుండి జీర్ణించిన సుప్రసిద్ధ వేదాంతమునకు భారతము నందు మాతృక గలదు. ఆ వేదాంతమునే వ్యాసుడు ధర్మరాజున కుపన్యసించును.

**సంధ్యంశ జన్మంబు సౌందర్యమును బలం**
**బును సుభగతయును భోగములును**
**భవితవ్యతానురూపంబులు పేదలై**
**పెంచుట కలయంగఁ బెల్లు పుట్టు**
**దురు ప్రజలంతయు సిరి గలవారు గో**

**రంగఁ బుట్టరు దరిద్రపు జనంబు**
**లాకటం దిని రలు నరిగించుకొందురు**
**భోజ్యసంపన్నులు భోజనంబుఁ**

**బూర్ణముగఁ జేయఁజాలరు భూపవర్య**
**వెలది జూ దంబు పానంబు వేట యతిని**
**పేవితములుగఁ దగ దని చెప్పువినుచు**
**వలను గలవార చెడుదురు వాని వలన.**

అట్టివి దైవ కృతంబులు గావున నిష్టానిష్ట ప్రాప్తులకుం గార ణంబులు గనికొనలేవు బాంధవలాభంబును దద్వియోగంబును వఱఽదం గాష్ఠంబులు సంగతంబులై పదంపడి పాసిన చందంబు.

**మాతృపిత్రు దార పుత్రక భ్రాతృశతస**
**హస్రకంబులు సంపృతి ననుభవింప**
**బడియె నందులో నెవ్వరి కడలు వాడు**
**నురుడ నిత్యత యూహించు టరయ నురవు.**[1]

చివరకు శ్రీకృష్ణుడు పాండవాగ్రజు చేరం జని యభివంద నం బాచ రించి యతని కరంబు పట్టికొని వదనంబు విరిదమ్మి చందంబు నొంద మధురాక్షర విన్యాసంబుగ నిట్లనియె.

**పురుషవ్యాఘ మనంబు గుంద వగలం బొందంగ నీ కేల సం**
**గర కేలిన్ భవదీయబంధు లతిలోకంబైన పెం పొప్పఁ బో**
**యిరి నాకంబున కట్లు గాక కల గాదె రాజవృత్తంబు దా**
**నరయాన్ రాజుల యేల యే జనులు నిత్యాయుష్మలే చెప్పుమా.**

"రాజుల యేల యే జనులు నిత్యాయుష్మలే చెప్పుమా?" అనునది అమూలకము. 'యుద్ధము లేనిచో బ్రదికి యుందురె మర్త్యులు శాశ్వతంబుగన్' అనునది తిక్కన నాటి వీరులు నమ్మిన వేదాంతమే.

మూలమున శ్రీకృష్ణుడు ధర్మరాజునకు షోడశ మహా రాజుల గాథలు, సువర్ణష్ఠీవి వృత్తాంతము వినిపించును. ఇవి అభిమన్యు ఘట్టమున ధర్మరాజు బుషుల వలన వినిన గాథలే. ఒక్కొక్క మహారాజు చరిత్ర ఒక సీస పద్యములో సంగ్రహించి, చివరకు

1. కులే జన్మ తథా వీర్యం ఆరోగ్యం రూప మేవచ

"అట్టి మరుత్తుండు నిత్య పదవి నుండ నేర్చెనయ్య"

"సుహెూత్రుం డవ్విభుడు డెగియె ననుట వినమె యధిప"

"అంగు డతడు నవ్యలోకగతుడు గాడె"

"ఆ శిబికి నుర్వి నునికి సెల్లె నెట్లు"

"దశరథ రాముండు గా లవశత నొందె గాదె యధిప"

"భూతి భూరి యుతంబుగ భాసురులకు నొసగినట్టి భగీరథుండున్నవాడె"

"ఆ దిలీపునిఁ జూపుమా ధరిత్రి నిపుడు మనుజనాథ"

"మాంధాత్రుఁ డింద నిలిచెనె నరేంద్రముఖ్య"

"యయాతి నెగడె, శాశ్వతుఁ డయ్యెనే నృపాల యమ్మహీశ్వరుండు"

"అంబరీషుఁ డేమి యయ్యెఁ జెపుమ"

"శశిబిందుఁ డొనరించి నెగడె నతడు పడయ జాలెనె యొన్నడుఁ జెడని యొడలు"

"పుణ్యుఁడై నెగడె గయుఁడు భూవరోత్తమ యతఁడెందుఁ బోయె జెపుమ"

"ప్రచుర పుణ్యాత్ముఁడన నొప్పె రంతి దేవుఁ డవ్విభునకు వలసె లోకాంతరంబు"

"భరతుఁ డన్నరేంద్ర చంద్రుండును జన్నవాడ"

"జనంబు పోషించె బృధుడు, అమ్మహాభావునకు నతులయశమ కాక సుస్థిరమయ్యెనే కాయమనఘ."

"జామదగ్న్య వినమే యా మహాత్ముఁడును ససంతోష విభ్రాంతి గలిగె నేని బ్రదుకలేదు."

ఒక్కొక్క సీస పద్యము ఒక స్వయం సంపూర్ణమైన పద్య కథానికయై తిక్కన తెలుగు భారతమున వెల్లివిరిసినది. దిలీప

మహారాజు గాధను సంగ్రహించిన సీస పద్యము ఉదాహరణముగ స్వీకరింప వచ్చును.

**అర్థి విశ్వావసుం డాదిగాఁ గలుగు గం**
**ధర్వులు హృద్యవాదన మొనర్ప**
**నప్సరోనికురుంబ మాటలు బాటలు**
**నై వినోదింపంగ నమరగణము**
**బహువిధాలంకార భంగుల విన్నాను**
**పులు సూప దివ్యములు నుతింప**
**మనుజలోకం బెల్లఁ గనకాన్నవస్త్రభూ**
**షణదానములఁ దృప్తి సనఁగ నశ్వ**

**మేధసమితిఁ జేసి మెప్పించె నింద్రుని**
**శతతమాధ్వరమున నతడు హయము**
**నాసపడిన నిచ్చెఁ నా దిలీపునిఁ జూపు**
**మా ధరిత్రి నిపుడు మనుజనాథ.1**

సువర్ణష్ఠీవి కథకు, ఉపోద్ఘాతప్రాయముగ శ్రీకృష్ణుడు చెప్పిన పర్వత నారదుల వృత్తాంతము మూలము నందలి వన్నె కగ్గకుండ, నెడ నెడ ఆత్మీయతా ముద్రలు వైచి తిక్కన తెలుగున హృద్యముగ ననువదించెను. స్రుంజయుడు, నారదుని అతని మేనల్లుడు పర్వతుని మిక్కిలి పూజించి, తన కూతురు సుకుమారిని వారి సపర్యలకు నియోగించును. 'అన్నెలంతతో నీవు దేవోపచారంబుల వీరి నారధింపు' మనును.[2] అమ్మునులు సుఖంబున్న సమయంబున

**అల్లదనంబున యనువు మైకొనఁ జూచు**
**నడపు కాంతికి వింత తొడవు గాగ**
**వెడ వెడ నూగారి వింతయై యేర్పడు**
**దెరనివళులలో నారు నిగుడ**
**నిట్టలు ద్రోచుచు నెలవుల కలమేర**
**లెల్లను బిగి యెక్కి యేర్పడంగ**
**దెలుపును గప్పును వెలయంగ మొరు గెక్కు**
**తారకంబుల గల్కి తనము దొడర**

**జరణములును నడుముఁ జన్నులుఁ గన్నులు**

1. కాని యీ పద్యము అన్నియుఁ దిక్కన ద్రోణ పర్వమున రచించినవే.
2. మూలమున "పితృవత్" అని గూడ గలదు.

**జవ్వనంబు చెన్ను నివ్వటిల్లు**
**చునికిఁ దెలుప స్రుంజయునిపుత్రి మెలగు వి**
**ధంబు నారదునకుఁ దగులొనర్చె.**

ఈ సీస పద్యము తిక్కన స్వకపోల కల్పితమే మూలమున

**తస్యాస్తేనోపచారేణ రూపేణాప్రతిమేన చ**
**నారదం హృచ్ఛయస్తూర్ణం సహ నైవాన్యపద్యత**

మూలమున నారదుని వలవంత, పర్వతుడు

"తపసా చేంగిత్తైస్చైవ పర్వతో ధ బుబోధ హ" అని యున్నది. తిక్కన తెలుగున,

**వెడబడు చిత్తవృత్తియును వెల్వె ల బారెడు నానంబునై**
**యనిశముఁ గుందు మామఁ గని యల్లుఁ డితం డితు లేల వంతఁ బోం**
**దెనొ యను చింత నొంది తన దివ్య మతిం బరికించి,**

కాంచెనని వ్యాఖ్యానప్రాయముగఁ దెనిగించెను.

ధర్మరాజు హస్తినాపుర ప్రవేశము పట్టాభిషేకము తిక్కన యథా మూలముగనే తెనిగించినను, ఎడనెడ తెలుగుదనమును జొప్పింపక పోలేదు. ధర్మరాజు రాజధాని యైన హస్తినాపురమును బ్రవేశించినపుడు తిక్కన మూలము నందలి పూర్ణ కుంభములు మొదలగు వానితో పాటు, క్రముక కదళీ స్తంభములు చేర్చెను. అంతేగాక, ఆంధ్ర ప్రబంధ ధోరణి కనుపుగ, "కస్తూరి కలయంపులను గర్పూరపు ముగ్గులను, బ్రాలంబ మాలికలను" గూడ చేర్చి తెలుగు ముద్ర వేసెను.

**దిగ్విజయంబునం దేజస్వి యయ్యె న**
**జాతశత్రుం డనజను నితండె**
**రాజసూయమహా ధ్వరము సేసి విపులఁ**
**గనకరత్నాదులం దనిపె నితడె**
**నిత్యవ్రతంబుగఁ సత్యంబు పాలించు**
**నిష్ఠయఁ స్ఖలితగా నెఱపె నితడె**
**ధర్మైకనిరతుడితం డొక్కరుడు చువ్వె**
**యని పలుక్కటకుఁ బాత మయ్యె నితడె**

**బలముఁ దగవును ధర్మంబు వెలయఁ బగఱ**

**ననవశేషంబుగఁ దొగటార్చె నితఁడె**
**యనఁగ మఱియును వివిధకర్ణనల హర్ష**
**వచనముల నుల్లసిల్లు రవంబు మిగిలె.**

అట్టి యెడ జాడం బఱతెంచిన పౌరజానపదులనోట తిక్కన ఇట్టి వర్ణనము సలుపుట పరిపాటి.

పై సీస పద్యమునకు మూలమున మాతృక మృగ్యము.[1]

ధర్మరాజు ఏనుంగు మొగసాల రథము డిగ్గినట్లు తెలుగున గలదు. అమూలకమైన యీ యేనుంగు మొగసాల తిక్కన కాలమునాడు రాజవేష్మము నందలిదే.

అట్లే పట్టాభిషేక సమయమున ధర్మరాజు తీర్చిన కొలువు తిక్కన కాలమునాటిదే.

**విద్వత్సమూహంబు వివిధ దేశాధీ**
**శ సంఘంబుఁ గార్య విచార పరులు**
**నర్థార్జనాది కృత్యంబుల వారలు**
**బహుపరిచర్యలఁ బరఁగు జనులు**
**వైశ్యప్రముఖ పౌర వర్గంబులును ముఖ్య**
**హలికాది జానపదా వలులును**
**వైణిక గాయక వాంశికాదివినోద**
**కరులును వారసుందరులు లోను**
**గాఁగఁ దగినవారు గాంచి యవ్విభుని స**
**త్కారములఁ బ్రమోదితంబు లగుచు**
**భావములు దలిర్ప సేవించి యుండఁ న**
**క్కొలువు సాల నొప్పెఁ గురువరేణ్య.**

పై సీస పద్యమునకు మూలమున మాతృక మృగ్యము.

అభిషిక్తుడైన ధర్మరాజు శ్రీకృష్ణుని స్తుతించుట మూలమున విస్తారముగ గలదు. శాంతి పర్వమునఁ బలుతావుల శ్రీకృష్ణస్తవ ములు గలవు. తిక్కన వాని నన్నిటిని యథోచితముగ సంగ్ర హించెను.

---

1. హస్తినా పురమునకు రాయబారిగ నేతెంచిన శ్రీకృష్ణుని గూర్చి పౌరుల నోట నిట్టి సీస పద్యమునే తిక్కన వ్రాసెను. అమూలకమైన ఆ సీస పద్య మిట అనుసంధేయము.

పట్టాభిషేకానంతరము ధర్మరాజు, దుర్యోధనుని యిల్లు, భీమునకు, దుశ్శాసనుని యిల్లు అర్జునునకు నివేశములుగ నిచ్చును.

ఆ గృహ వర్ణనము మూలములో గలదు.[1] ఆ తెలుగు పద్యము తిక్కన అనువాద విధానమునకు నికాషాయమాణముగ నెన్నవచ్చును.

**బహురత్నమయ ఘన ప్రాసాదమండప**
**దాసదాసిజనోద్వాసితంబు**
**దత్తుల్య వైభవ తదధికధనధాన్య**
**ముఖవస్తుసంచయ సుఖకరంబు**
**గిన్నరవల్లభ గృహసమానత్వమ**
**హెూ విభూతి స్ఫురణాంచితంబు**
**సర్వ సంపత్పూర్తి చారు వామాక్షి ప్ర**
**చార సంశోభిత స్థల చయంబు**

**నైన వాని రారాజు నిల్ల నిలజునకు**
**దుస్స సేను మందిరము ప్రార్థునకు వరుస**
**తోడ దుర్మర్షణునియును దుర్ముఖునియు**
**నిండ్లు గవలకు సంప్రీతి నిచ్చె నృపతి.**

శాంతి పర్వమున ప్రథమాశ్వాసమున ధర్మరాజు పట్టాభిషేకమైన పిమ్మట ద్వితీయాశ్వాసము నుండి ధర్మ ప్రబోధమే యితివృత్త మగును. శ్రీకృష్ణుడు, భీష్ముని ప్రస్తుతించి, "అతం డస్తమించిన సకల జ్ఞానంబులు నవాశ్రయంబులై పోనుంగు పడుం గావున, నాతని పోలికం బోయి నిశ్శేష నిరస్త సంశయుడవు గావలయు" నని ధర్మరాజు నుద్బోధించును.

మూలమున భీష్ముడు సల్పిన శ్రీకృష్ణ స్తవము విస్తరించి యున్నది. తెలుగున సంగ్రహముగ గలదు. మూలమున దశావ తార వర్ణనలో బుద్ధావతార వర్ణన గూడ గలదు.[2] తిక్కన కృష్ణావతారము

1.తతో దుర్యోధన గృహం ప్రాసాదైరుపశోభితం బహురత్న సమాకీర్ణం దాసిదాస సమాకులం
అని దుర్యోధన గృహమును గూర్చియు,
ప్రాసాద మాలా సంయుక్తం హేమతోరణ సంయుతం
అని దుశ్శాసనుని గృహమును గూర్చియు మూలవర్ణనము.
తిక్కన ఈమూలమును ఒక సీస పద్యముగ, క్రమాలంకార సంశోభితముగ తీర్చి దిద్దెను.
2.దానవాంస్తు వశే కృత్వా పునరుద్ధత్వ మాగతః| సర్గస్య రక్షార్థాయ తస్మై బుద్ధాత్మనే నమః||

తరువాత కల్క్యవతారము వర్ణించి బుద్ధావతారమును విడిచి పెట్టెను.[1]

ఈ "స్తవరాజమునకు" మూలము నందు వలెనే తెలుగున గూడ విపుల ఫలశ్రుతి గలదు. ఇట్టివి మహాభారతమున కాలాంత రమునఁ జేరిన ప్రక్షిప్తములని కొందరు పండితుల అభిప్రాయము. కాని, యిట్టి వానిని తిక్కన విడిచిపుచ్చక తెనిగించెను.

శ్రీకృష్ణుడు ధర్మరాజునకుఁ జెప్పిన పరశురామ చరిత్రము తిక్కన యథా మూలముగ సంగ్రహించెను.

శ్రీకృష్ణుడు భీష్మునితో సల్పిన సంభాషణము మిక్కిలి హృదయంగమమైనది. "దేహంబు పీడ ఘనము మనః పీడ కంటె నందురు బుధు లోక ముల్కి యొడలిలో నున్న నలత సేయు నెమ్మెయి బహు సాయక కలితమైన యంగంబు నొవ్వడుగ నేల" యని శ్రీకృష్ణుడు భీష్ముని సంభావించును. మూలమున భీష్ముడు సల్పిన శ్రీకృష్ణస్తవమును

**"కర్తయును భర్తయును సం**
**హర్తయు జగములకు నివ యాశ్రితజనఘో**
**రార్తినిరాసనిపుణసం**
**కర్తన యెగీశ్వరేశ కృష్ణ వరేణ్యా."**

అని మఱియు ననేక ప్రకారంబులం బ్రశంసించి" అని తిక్కన సంక్షేపించెను.[2]

ఆనాడు శ్రీకృష్ణ ధర్మజులు భీష్ము వీడ్కొని, పురమునకు బోవు నప్పుడు చంద్రోదయ మయ్యెను.

**దినమున నెల్ల నుష్టకరుదీప్తులు పర్వి రసంబు బీల్వ వం**
**దిన సకలౌషధీ ప్రవితతిం దెలి వెందఁగఁ జేయు నేర్పుగ**
**ల్గిన తన రశ్మిజాలమున లీలఁ జకోరములున్ మదింపఁ జే**
**య నుదయ పై వెలింగె నమృతాంశుడు సేనకుం దన్ను సేయుచున్**

---

1. తిక్కన వాదములో బౌద్ధులను జైనులను జయించి కాకతి గణపతి దేవు మెప్పు పొందె నను జనశ్రుతి — సోమదేవరాజీయాదులలోని గాథయు నిట స్మర్తవ్యములు.

2. మఱియు ననేక ప్రకారంబులం బ్రశంసించి" అను ప్రయోగము, తిక్కన అనుసరించిన మూల ప్రతిలో గూడ శ్రీకృష్ణస్తవము విస్తరించి యున్న దను సంశయము బుజువు చేయుచున్నది.

పై పద్యము యథా మూలముగనే తిక్కన అనువదించెను. అందు తిక్కన అధికముగ జేర్చినది, 'చకోరములన్ మదింప జేయ' అను ప్రయెగము మాత్రమే.[1] 'వారా రాత్రి గడపిరి ప్రభాతం బగుటయు' మాధవుడు మేలుకొనెను.

శాంతి పర్వమున చంద్రోదయు సూర్యోదయ ఘట్టములు వచ్చినను, తిక్కన నిగ్రహము ప్రదర్శించెనే గాని, విరాటోద్యోగ పర్వము లందు వలె ప్రబంధోచిత ప్రలోభము చూపలేదు.

ఆ నాడు భీష్ముడు శ్రీకృష్ణ ప్రచోదితుడై ధర్మరాజునకు ధర్మ ప్రబోధము సల్పుట కుద్యమించును. శ్రీకృష్ణుడు

**ధర్మరాజునకు నీ చెప్పెడు**
**ధర్మస్థితి వాక్య సమితి తాత్పర్యముతో**
**నిర్మలులై కొనియాడెడు**
**ధార్మికులకు నుభయజగదుదాత్తత గలుగున్.**

అని ప్రవచించును.

భీష్మ ప్రబోధము సర్వతో ముఖముగ సాగినది. అందు ధర్మ సూక్ష్మమును గ్రహింపక, సందర్భశుద్ధిని పాటింపక పోయినచో అపార్థములకు తావేర్పడ గలదు. అందుచే అమూలకమైన శ్రీకృష్ణుని హెచ్చరిక తిక్కన ఔచిత్యమునకు నిదర్శన మని చెప్ప వచ్చును.

భీష్ముని ప్రబోధము నందు లౌకికమే ప్రాధాన్యము వహించి నట్లును భీష్ముని రాజనీతి కుటిల మనియు పైకి కనుపింప వచ్చును గాన, 'తాత్పర్యముతో నిర్మలులై కొనియాడెడు ధార్మికు లకు నుభయ జగదుదాత్తత' గల్పించునను హెచ్చరిక శ్రీకృష్ణుడు చేయవలసి వచ్చినది.

---

1. తతః పురిస్తా ద్భగవాన్ నిశాకర
స్స ముత్థితస్తా మభిహర్ష యంశ్చ మాం
దివాకరాపీత రసాస్త ధౌషధః
పునస్స్వకైనైవ గుణైర్న యెజయన్.

భీష్మ ప్రబోధ మంతయు యథామాతృకముగనే తిక్కన తెలుగున సంగ్రహించెను. ఒకటి రెండు వాక్యములలో మూలము నందలి అధ్యాయములను సంక్షేపించిన ఘట్టములు కొన్ని యెడల గలవు.

భీష్మ ప్రబోధము రాజ ధర్మ పర్వ మనియు మోక్ష ధర్మ పర్వ మనియు మూలమున విభజన గలదు. అందుచేతనే శ్రీకృష్ణుడు 'తాత్పర్యముతో గొని యాడెడు ధార్మికులకు ఉభయ జగదుదాత్తత గలుగుననిచెప్పెను. సూక్ష్మముగ బరికించినచో మూలము నందే రెంటికిని చక్కని సమన్వయము గలదు.

మహాభారతము నందు ఇహపరముల యథోచిత ప్రాధా న్యము సంఘటితమైన సంగతికి ఆశ్వమేధ యాగా నంతరమునఁ గల సక్తు ప్రస్థోపాఖ్యానము ఉజ్వల నిదర్శనము.

భీష్ముడు ధర్మరాజునకు సల్పిన ప్రబోధము బహుముఖ ములు సాగినది. అందుకొన్ని నవ్యులకు గూడ నవ్యాతినవ్యము అనిపించు భావములు గలవు. రాజు గూడ మానవుడే. అతని శరీరమునఁ గూడ ఇతరుల శరీరము లందు వలెనే రక్తము మాంసముఁలేయున్నవి. ఆయిన ఒకడు రాజు — ఇంకొకడు కానేల? ప్రాథమిక ప్రశ్న సంస్కృత మహాభారతమునందే ఉదయించినది.

ధర్మరాజు మూలమున

**తుల్యపాణి భుజగ్రీవస్తుల్య బుద్ధిం ద్రియాత్మకః**
**తుల్య దుఃఖ సుఖాత్మాచ తుల్య దృష్టి శిరోధరః**
**తుల్య శుక్రాస్తి మజ్జా చతుల్య మాంసాస్తగేవచ**
**నిశ్వాసోచ్ఛ్వా స తుల్యశ్చ తుల్య ప్రాణి శరీరవాన్**
**సమాన జన్మ మరణ స్స మస్సర్వైర్గుణై ర్ణ ణాం**
**విశిష్ట బుద్ధీ న్సూ రాంశ్చ కథ మేకోఽధి తిష్ఠతి**
**కథ మేకో మహీం కృత్స్నాం శూర వీరా ర్య సంకులాం**
**రక్ష త్య పిచలోకస్య ప్రసాద మభి వాంఛతి.**

ఈ ప్రశ్నము సంస్కృతములో నిశితముగ నున్నది. తిక్కన తెలుగున సారాంశమును ఒక సీస పద్యమున సంగ్రహించెను.

**రాజనామమునకు భాజనం బై మహ**
**ద్రుతతత చరిత్రుం డగు పురుషం డొకడు**
**గలిమికి మూలంబు ఘనవిశేషము గల్గ**
**నో పు గౌరవకుల దీప జనన**
**యది యెరిం గింపవే యవయవంబులుఁ బ్రాణ**
**మానసంబులు జన్మ మరణములు శ**
**రీర యాత్రలు నెల్ల వారికి నెట్ల ట్ల**
**కాని విభేదంబు గాన మిట్టి,**

**రా జొకండు శూర తేజస్విబుద్ధిమ**
**జ్జనుల నెట్లు దనవశంబు సేయ**
**నిలుపఁ జెఱుప నెల్ల యిలయును నేల దై**
**వనిభుం డగుచు మ్రొక్కు గొనఁగఁ జాలు.**

కృతయుగమున రాజు లేడు.

**విను తొల్లి కృత యుగంబున**
**మనుజుల యెడ దండనీతి మంతం డై రా**
**జన నొకండు గలిగి యరయుట**
**ఖండిత మై మొదలుకొని ర కార్యంబులకున్.[1]**

రాజ పదవి గూడ సామాజిక వ్యవస్థగనే తొలుత ఆవిర్భ వించిన దని మహాభారతము నందుంటుట గమనింప దగిన విశేషము. విష్ణుమానస పుత్రుఁడైన విరజుని కథ ఉల్లేఖించి భారతము సామాజిక వ్యవస్థకు పురాణోచితమైన రూప కల్పన దిద్ది నది. రాజు లేకున్న

**"మీల యట్టుల బలవంతు లల్పుఁల**
**దమకు నాహారముగ గొంద్రు "[2]**

అనునది సంస్కృత మహాభారతము నాటికే సిద్ధాంతముగ రూపొందిన భావము.

మూలమున

**గుప్తాత్మా స్యాద్ దురాధర్ష స్స్మి త పూర్వాభి భాషితా**

**ఆ భాషితశ్చ మధురం బ్రత్యాభాషేత మానవాన్
కృతజ్ఞో దృఢ భక్తిస్యాత్ సంవిభాగి జితేంద్రియః
ఈక్షితః బ్రతివీక్షేత మృదు చర్శు చ వల్గుచ**

అను శ్లోకములను

**అతడును మందహాస సహితాలపనంబును సత్యభాషణ
(వతమును సంవిభాగనిరవద్యతయున్ సమభావముం గృత
జ్ఞతయు జితేంద్రియత్వము బ్రసాద ఫలంబును గల్గి భూమికం
బి[తుసము(ద్రై విరోధిజన భీషణ సారత నొప్పఁ బెం పగున్.**

అని తెనిగించెను.

శాంతి పర్వమున దండ నీతికిఁ గల ప్రాధాన్యము పేర్కొన దగినది. భీష్ముఁడు దండ నీతిని బహుప్రకారముల స్తుతించి, మకుటాయమానముగ 'దండంబు సాక్షాద్ధే వుండట్లగుటఁ దెలిపెడు నది యొక్క యుతిహాసంబు గలద'ని దండోత్పత్తి కథనమును జెప్పెను. అట్లే శీలము, ఆశ మున్నగు వానిని గూర్చి మూలమున గల విపుల వివరణము తిక్కన తెలుగున మిక్కిలి సంక్షేపించెను.

## అర్థవాద రూపక పద్య కథానికలు

శాంతి పర్వమున రాజనీతి వివరణమున భీష్ముఁడు చెప్పిన కథలు తిక్కన యథామాత్రికముగ తెనిగించెను. ఇందలి పాత్ర ములు బహుళములుగ తిర్యగ్జంతువులు. తిక్కన అవలంబించిన సంక్షేప పద్ధతి—అర్థవాద రూపకములైన యీ కథానికలకు గరు వతనము చేకూర్చినది. ఈ కథలు యథాక్షరముగ స్వీకరింప వలసినవి గావు. ఈ కథలలోని అంతరార్థము పాత్రుల ప్రసంగ ములు సన్నివేశముల వెనుక నున్న అర్థవాదమే ముఖ్యము గనుక సంగ్రహించినను కథలలోని సొగసు చెడదు. ఇవి యన్నియు భీష్ముండు ధర్మరాజునకు "ధర్మసూక్ష్మత" యెరింగించుటలో నంతర్భాగములే. శ్రీకృష్ణుడు చెప్పినట్లు, తాత్పర్యముతో నిర్మలులై కొనియాడెడు వారికి, ఈ కథానికలు ఉభయ జగదుద్ధత గూర్చ గలవు.

1. నైవ రాజ్యం న రాజాఽసీన్న చ దండో న దాండికః
2.జలే మత్స్యా నివ ఽభక్ష్యఽ దుర్బలం బలవత్తరాః

తిక్కన అర్థవాద రూపకమైన యా గాథలను స్వయం సంపూర్ణములైన "పద్య కథానికలు" గ తీర్చిదిద్దెను.

౧. వ్యాఘ్ర గోమాయు సంవాదము

౨. సముద్ర సరిత్సంవాదము

3. కుర్కుర కథ

౪. దీర్ఘదర్శి మొదలగు మత్స్యముల కథ

౫. మూషిక మార్జాల సంవాదము

౬. గృధ్రజంబుకోపాఖ్యానము

౭. పవన శాల్మలీ సంవాదము

౮. కపోతోపాఖ్యానము.

తిక్కన చెప్పినట్లు, "ఈ కథల పూర్వా పర వాక్యంబుల యందలి తాత్పర్యంబు" నిరూపించుకొనవలసి యున్నది.

వ్యాఘ్ర గోమాయు సంవాదము, ఒక మనోహర పద్య కథానిక. అహింసా వ్రతమును గై కొనిన గోమాయువును వ్యాఘ్రము మంత్రిగ నుండ ప్రార్థించును.

**నీ వాశ్రయంబో నుండఁదవు**
**గావే విను భోగపరము గాకున్నది మ**
**ద్భావం బటు గావున నా**
**కి వచనము లింపు సేయ విద్ధగుణాఢ్యా.**

అది యట్లుండ భోగంబులుగ నున్న నేమి నీకం గార్యా కార్యంబులు నా యెఱింగిన తెరంగున నుపదేశించుచు మైత్రి వాటించి యునికి గర్హణీయంబై భవదీయ మూలభృత్యులసూయ సేసి భేదింతురు దాన నొప్పమి వచ్చు నీవు వారలు గలంచినఁ గలంగ కుండుటకును నా బుద్ధి పాటించుటకును సమయంబు సేసి నన్ను మన్నించికొని యుండు మట్లైన నీకథ వర్తించి యుండెద ననటయు నా వ్యాఘ్రం బాభంగి నడపం గలయది యయ్యెను. ఆ నక్కను మంత్రిగ గొనెను. తరువాత

**పులి నమలేడు మాంసము వైర**
**వలవడం దా మపహరించి యా నక్రకు ని**

**మ్ముల నిల్వఁగాంచిన**
**నిలయంబున గొంది బెట్టి నేర్పారంగన్.**

పులి నక్క ననుమానించు స్థితి యేర్పడినది.

పులి భృత్యులు, 'తానటె మాంసము దినదటె, యీ నక్కయు బేలు పెట్టె నిన్నాళ్లే' ని వెక్కిరించిరి. పులి నక్కకు మరణ దండన విధించినది. చివరకు యదార్థము బయలు వడినది. పులి తల్లి బుద్ధి చెప్పినది.

**అనవుడు నక్క రాఁ బనిచి యప్పు లి గౌ గిట జేర్చి బాష్పము**
**ళ్ల నుఁగవఁ గ్ర మ్మ నుంబలుకులం దగం బెద్దయు గారవించిన**
**న్వినుము మృగేంద్ర మున్నటుల నీవు సభన్ నను వీడు మంచి వా**
**డని కొనివాడి యిష్టు దెగ టార్చితి పెంపును నాదు మానమున్**

అని పలికి యగ్గోమాయువు వెండియు

**ననను నీవు పదస్థునిగా**
**ననఘా చేయంగ దలచి నప్పుడ నీ భృ**
**త్యుని కాయము కఱపులం బడ**
**కునికియు నా బుద్ధి విను టయును మఱవమికిన్.**

బాస సేయవే యని, అరణ్యమునకుం బోయి ప్రాయెపవేశ దీక్షతో బరమపదించెను.

<u>ఉదధి సరిత్ సంవాదము—చిన్న కథ</u>

సముద్రునకు సరస సల్లాప సమయమున నదులు ప్రబ్బ లి మొక్కలు నమ్రంబై తమ కెదిరింపక యుండును గాన వాని పెకలింప మనియు నెదిరి నిలుచు నున్నత తరువుల సమూల ముగ పెకలింతు మనియు జెప్పెను.

**అరి నృపాలు పెంపు నాత్మీయ శక్తియు**
**నెఱిగి మూర్ఖ వృత్తి నెదురుపడక**
**యుచితవృత్తి నతని యుద్ధతి మేవడి**
**గడపి హీనబలుడు పెడక నిలుచు.**

"కుర్కుర గాథ"—కట్టు కథలలో నెన్నదగినది. ఒక మహర్షి . అతని కడ ఒక కుక్క. ఒక దుప్పి ఆ కుక్కపై గవియును. ఆ మహర్షి కరుణించి ఆ కుక్కనే తన తపో మహిమచే దుప్పిగ మార్చును.

**అట్లు బెబ్బులి వచ్చి యడరిన బెబ్బులిఁ**
**గా జేసి గెలిపించెఁ గరుణమెఱయ**
**నొక మత్తకరిఁ జూచి యెటమై నొదిగిన**
**నుద్ధతకరిఁ జేసి యొసగె జయము**
**సింహంబు దెస భీతిఁ జెంది పార్తెం చిన**
**ఘనసింహముగ జేసి గర్వ మిచ్చెఁ**
**శరభంబు ధాటికిఁ జకిత మైన నుదగ్ర**
**శరభంబు జేసి యుత్సాహిఁ జేసె**
**నిట్లు దివస క్రమంబున నెక్కుడైన**

**సత్త్వముగ జేయగా గుక్క శరభ భావ**
**మండిత యయి తిరుగుచు నుండి పూర్వ**
**వాసనా నీచ మగు మనో వర్ధనమున.**

కుక్కకు, మునీశ్వరునే సంహరించిన దాను శాశ్వతముగ శరభమై యుండ వచ్చును గదా యని దుర్బుద్ధి పుట్టెను.

**ఆ విచారంబు దివ్యబోధ్యాఢ్యు డైన**
**యమ్మునీశ్వరుఁ డెఱింగి యా యధమ జాతి**
**యున్నత స్థితి యెరు గునే మున్న పోలెఁ**
**గుక్క యయి యుండఁగా కన్న గుక్క యయ్యెఁ.**

మూషిక మార్జాల సంవాదము పరాకాష్ఠ చెందిన రాజనీతికి నిదర్శనము.

అడవి. ఒక మఱ్ఱి చెట్టు. ఆ చెట్టుపై ఒక మార్జాలము, చెట్టుక్రింద లాగల మూషికము వసించు చున్నవి. ముంగిస, గూబ, మూషికమును దిన గాంక్షించు చున్నవి, గాని యివి మార్జాలము నకు భయపడి మఱ్ఱిదాపునకు వచ్చుటకు జంకినవి. ఇట్లుండ నొక్కనాడు మార్జాలము ఒక బోయ పన్నిన ఉరిలోఁ జిక్కినది. మూషికము చెట్టెక్కిన గూబకుఁ జిక్కును. లాగల నున్న, ముంగిస వశ మగును.

ఎఱలకై వచ్చి యిట్లు దోఁచిన నయ్యోలుక యా రెంటి బారికిం దప్పి పోవ రామి దలంచి బెగ్గలించియు ధైర్యంబు కలిమిం గార్యం బూహించి యప్పిల్లి గొండొక సేరం జనుచు దానితో నిట్టనియె.

**ఊరి ద్రెవ్యఁ గొఱికి యిప్పుడ**
**వెద వారగ నీకు నేను విడుగర సేయం**
**దొరకొనుట నీదు భాగ్యం**
**బరిత్వము దొఱంగి మైత్రి యలవఱుపు మదిన్.**

అనును. పిల్లికి గత్యంతరము లేదు గనుక అందులకు సమ్మతించినది. ఎలుక, పిల్లి పొదిగిటి నిశ్శంకముగ నుండుట చూచి, గూబ ముంగిసయుఁ దొలగి పోయినవి. కాని, మూషికము వెనువెంటనే మార్జాలమును రక్షించుటకై ఉరి చేరులు కొరుక లేదు. పిల్లి, ఎలుకను కృతఘ్నత కూడదని హెచ్చరించినది. ఎలుక చెప్పిన సమాధానము పేర్కొన దగినది. ఊరి బన్నిన మాలని రాక చూచి, చేదులు కొరికెడ వని చెప్పినది.

**మాలని రాక చూచి భయ మర్థిత మైన మనంబుతోడ న**
**క్కాలము నందుఁ నీకుఁ జనగా వలయున్ వేస ౖమా నిపైకి నా**
**యాలయమున జొరన్ సమయమప్పుడ నాకును గాన యత్తఱన్**
**మేలొనరింతు నమ్ము మిది నిక్కము గర్జము నీ వెరుంగవే.**

పిల్లి యెంత వేగిర పడినను ఎలుక చెప్పిన సమాధాన

మొక్కటే.

"ఉచిత కాల భావ్యమైన యత్న విధి కథా సమగ్ర ఫలము నిచ్చు." చివరకు బోయ వచ్చును. ఎలుక ఊరి కొరుకును. పిల్లి చెట్టెక్కును. ఎలుక కన్నము లోనికిఁ జారును. కాని కథ కంచికిఁ బోదు. తిరిగి పిల్లి కన్నము దగ్గరకు వచ్చి తనతో మైత్రిగ నుండు మని ఎలుక నర్థించును. కాని, ఎలుక పిల్లితో "నీ మాట లుచితంబులు నా మాటలు వినుమ" ని యిట్లనియె.

**అరులను మిత్రులం దెలియ నారయు చెంతయు సూక్ష్మకృత్యమ**
**వ్వైరవతి దుర్లభం బరులు వీ రన నుండియు మిత్ర భావముం**
**బోరయుటయున్ సుహృజ్జనుల పోలికి గల్లియు శత్రుతాగుణ**

**స్ఫురణ మొకప్డు సూపుటయుఁ జాతుము గాదె ధరిత్రి నెల్లెడన్',**

అని పిల్లిని వీడ్కొలిపెను.

పూజని యను శకుని, రాజపుత్రుడు తన బిడ్డను చంపుటచే అతని కన్నులు పొడిచివేయును. రాజు బ్రహ్మదత్తుడు పూజని యందు దోసము లేదనియు దిరిగి పంజరమును జేరు మనియుఁ బిలుచును. కాని, పూజని

**విను చల్లని మాటలలో**
**మునిగి యలుక గుప్పతిలు సముద్ర జలములో**
**నన యుండి యార కెప్పుడు**
**గన గన మనుబాడబాగ్ని కరణి నరేంద్రా.**

అని పలికి, నిజేచ్ఛం జనియె.

ధర్మరాజు మాటలతోఁ జెప్పవలె ననిన 'నెవ్వని యెడ విశ్వసింప కున్నం జిత్తంబునకు విశ్రామంబు గలదు. విశ్వసించిన దురితంబులు దొడరు? 'అట్లగుటం జేసి పరమ కర్తవ్యం బెయ్యే దియె నిశ్చయించుటకే' యా అర్థవాద రూపకములైన కట్టు కథలు.

ఇవి కేవలము కట్టు కథలు గావు. నిజమున కవి మార్జాల ములును గావు. మూషికములు గావు. లోక వృత్తాంత దర్శకము లైన ఆ యుపాఖ్యానములు మానవ స్వభావమునకు మణి దర్పణము లెత్తు చున్నవి. అట్టిదే మూడు చేపల కథ.

దీర్ఘదర్శి, ప్రాప్తకాలజ్ఞుడు, దీర్ఘసూత్రుడు అను చేపలు మహాభారతము నందు మాత్రమే గలవు గాని, మఱియే మడుగునందును లేవు. కాని ప్రపంచము నందెల్లడ సర్వకాల సర్వావస్థల యందును మానవ సంఘమున నా మూఁత్తెరగుల మనుష్యులు--- దీర్ఘదర్శి, ప్రాప్తకాలజ్ఞుడు, దీర్ఘసూత్రుడు గానవచ్చు చుందురు.

అర్థవాద రూపకము లైన ఆఖ్యానములతో పాటు ప్రత్యక్ష ప్రబోధము గూడ శాంతి పర్వమున విస్పష్టముగ గన్పించును. శత్రువులను జయించిన పిమ్మట, 'జ్ఞాతినికాయుడై రాజు మదినజ

్రసము నమ్మక సర్ప సంయుతంబై తనరారు రమ్య నిలయం బున నున్నటు లుండగాదగున్.'[1]

**వినుము తతి వేచి రిపు మూ(**
**పున మోవఁగ వలయు సమయమున గనికొని గ్ర**
**క్కు నఁ గడప శిలాస్థలి వై**
**చిన చాడ్పున నేర్పు మెఱయఁ జెరుచుట యొప్పున్.**
**వహేద మిత్రం స్కంధేన యాపదర్ధస్య లంభనం**
**అద్రైన మాగతే కాలే బింధ్యాత్ఘట వినాశ్మని||** —మూలము

అట్లే, కణి కోప దేశము నంతటికి మూలమున మాతృకలు గలవు.

**ఒల్లని కార్యం బాసల**
**నల్లన కాలగతిఁ గడపు నది కాలముచేఁ**
**బెల్లొదవు విఘ్నములు భా**
**వల్లభునకు నభేద్యుఁ డై జనులయెడన్.**

అను పద్యమునకు

**ఆశం కాలవ తీం కుర్యాత్ కాలం విఘ్నేన యెజయేత్**
**విఘ్నం నిమిత్తతో బ్రయాయ్నిమిత్తం చాపి హేతుమత్**

మూలమున ఇట్టివే మఱికొన్ని నీతులు గలవు. రాజనీతికి కౌటిల్యము అపరిహార్యమని ప్రాచీనుల భావము. తిక్కన సంగ్రహను పద్ధతిలో ఆ శ్లోకములు తెలుగున నవతరింప లేదు.

తిక్కన వదలిన శ్లోకములు, తెనిగించిన శ్లోకములకు సహో దర ప్రాయములే.

**బక వచ్చింతయే దర్ధా న్ సింహవచ్ఛ పరాక్రమేత్|**
**వృక వచ్ఛా వలుంపేత శశివచ్ఛ వినిష్పతేత్||**
**యె రిణా సహ సంధాయ విశ్వస్త స్స్వ పతే సుఖం|**
**స వృక్షాగ్రే వసుప్రోవా పతితః ప్రతి బుధ్యతే||**
**ఆ శంకమపి శంకేత నిత్యం శంకితాన్|**
**భయం హ్యా శంకితాజ్ఞాతం సమూలమపి కృంతతి||**

1. సర్వాద్వేష్మ గతాధివ—మూలము

**పు(తో వా యదివా (భాతా పితావా యది వాసుహృత్|**
**అర్థస్య విఘ్నం కుర్వాణా హంతవ్యా భూతి మిచ్ఛతా||**

పై శ్లోకములు తిక్కన వదలి పెట్టెను.

మూషిక మార్జాల సంవాదము వంటిదే గృ(ధ జంబుకో పాఖ్యానము, విదిశా పట్టణమున నొక మృత బాలుని కళేబరమును (బేత భూమికిఁ గొనిపోవుదురు. గద్ధ చెప్పిన మాటలు, "జనన మరణముల్ వింతలె చన్న శిశువుతోడ నందఱుఁ జనుటకుం బూని యుండురె పొందు పీనుంగు వైచి" వారు పోబోవు నపుడు ఒక నక్క వచ్చి చెప్పిన మాటలు, 'అక్కటా బాలుని నజ్జవదను నిటు వైచి పోవఁ గాళ్లెట్లాడె నేడ్వుడు శోకంబు వోవ." అప్పట్టున గృ(ధ జంబుకంబులకు వివాద మేర్పడును. ఉభయుల మాటలకు స్వార్థమే మూలకారణ మనుట సుస్పష్టము. శవము పగటి వేళ్లైన గద్ధ పాలు. చీకటి పడిన నక్క సొమ్ము. నక్కకు గాని గద్ధకు గాని మృత బాలుని పైన గాని, తద్బాంధవులపై గాని యావంత సానుభూతి లేదనుట తెల్లము. (గద్ధ-నక్కల వాదోపవాదములు అరయ దగినవి.

**అనవుడు నెగ వెక్కి యా బిడ్డవెచి పో**
**యెడు వారలకు నడ్డపడుచు నక్క**
**వినుఁడు రాఘవుడు నేర్పున (బదికింపడె**
**మృతుడైన భాసుర సుతుని మగుడ**
**సృంజయు కొడుకు సచ్చిన నారదుండు (ప్రభా**
**వంబున (గమ్మర వానిఁ దేడె**
**యట్టుల యొక సిద్ధఁ డమరుండు మీ యేడ్పు**
**లాలించి దయ బాలు నసువు లోసగె**

**నేని మేల కాదె యిది యేల పోయెద**
**రనిన వారు మగిడి యరుగుదెంచి**
**శిశువు శవము చుట్టుం జేరి పెల్లెడ్చిరి**
**పనవి పవవి యంత నిసుడు (గుం కె.**

అప్పుడు శంకరుండు (ప్రత్యక్షమై శిశు (ప్రాణంబు లోసంగి యా గృ(ధ జంబుకంబులకు నాకలి యొన్నండును లేకయుండ

బ్రసాదించి అంతర్హితుండయ్యె. కథ కల్యాణాంతమైనది. గృధ్ర జంబుకంబులకు నాకలి లేకుండ గల్పించుటలో పాత్ర చిత్రణ మున పాటింప బడిన పరిణామౌచిత్యము హృదయంగమము.

ఐహిక నీతి పరాకాష్ఠ చెందిన ఉపాఖ్యానములే గాక ఆదర్శప్రేరితమై దివ్యత్వము నావిష్కరించు కపోతోపాఖ్యానము గూడ భీష్మ ప్రోక్తమైనది. శాంతి పర్వమునందున్నది. పాషాణ హృదయ మును గూడ నవనీత పేశల మొనరుచ్చు కపోతోపాఖ్యానము నీతి కథలలో తలమానికము. లౌకిక నీతి ప్రబోధకమైన గృధ్ర జంబుకో పాఖ్యానములను మూలము కంటె సంగ్రహించిన తిక్కన కపోతో పాఖ్యానమును మాత్రము విస్తరించెను.

"పాపాత్ముఁ డొక బోయ పక్షుల వధించి మహాటవి జరించి పెను వానయును గాలియును ముట్టి రాతిరి యగుటయు నొక చెట్టు క్రింద శిలయ సెజ్జ గాగ శీతార్తుఁడై యుండె." ఆ చెట్టు పై నున్న కపోతంబు తన వల్లభ రాకపోవుటం జేసి విలపించును. ఆ విలాపములు బోయ వలలో నున్న కపోతి విని, "పతి మదికి నింత యెక్కిన యతివ గదా పుణ్యవతి" యని సంతోషించి, పతి కిందన తెరం గెరింగించి విధి కృత్యంబునకు వగవం బని లేదని తమ చెట్టు దగ్గరకు వచ్చిన బోయకు అతిథి సత్కారము సేయు మని ప్రబోధించును. ఆ కపోతము 'శోకము' డిగ్గ విడిచి

**ఓయన్న దస్సినాఁడవు**
**మా యింటికి నతిథి వైతి మసలక నీకం**
**జేయ వలయు నాతిథ్యం**
**బేయది భవదీప్సితార్థ మొటిగింప వనా.**

ఆ 'పక్షి వైరి సితున సకలాంగకంబులుఁ బ్రతున్నము లయ్యెడు దీనిఁ బాపవే' యనిన విహంగమంబు పొంత పల్లియకుఁ బోయి ముక్కన పుల్లతల యింగలంబు కొనివచ్చి యతనికిఁ జలి మంట నేర్పరచును. అంతేగాక అతని కాహారముగ తానా అగ్నిలో బడును. బోయ పశ్చాత్తప్తుడై, వలలోని పులుగుల విడిచి పుచ్చును. కపోతి నాథుం డగ్గిలో బడుటచే శోకమున మునిగి విలపించెను. కపోతి విలాపము మూలమునఁ గలదుగాని తిక్కన తీర్చిన తెరగు వేరు. అశ్రు జల తరంగితాస్య యగుచు కపోతి విలపించును.

**అక్క పోతి నాథుం డగ్గిలో బడుటకు**
**శోకవహ్నిఁ జిత్త మాకులముగ**
**నెలుగు రాలు పడగ నిట్లని పలవించె**
**నశ్రుజలతరంగి తాస్య యగుచు.**

అని వెండియు

**ఇగురు జొంపంబుల నింపారు విరులను**
**బలు పైన పొదల క్రేవలకు దార్చి**
**సెలయేరు  లందలి తెలినీటఁ దనుపుసొం**
**పెలసిన గిరుల తెప్పలకుఁ జేర్చి**
**మావి మ్రోకల నెల దీ వల జెన్నొందు**
**తోటల కడ నలి తోడఁ జెంది**
**యలరు నెత్తమ్ముల కలిమిఁ జెల్వగు డిగ్గి**
**యలతీర భూములఁ నల్లఁ బొంది**

**నన్ను మనమునఁ దెల్పి యానంద మొందఁ**
**గేలి సలిపెడునీదగు లీల మఱవ**
**నా వశంబె ప్రాణేశ ప్రాణంబు లిపుడ**
**నిన్ను కూర్చి యే తెంతు నీ సన్న కడకు**

అని కపోతి సహగమనము సలుపును. పై సీస పద్యమునకు మూలమున మాతృక మృగ్యము.

తిర్యగ్జంతుగత మైన శృంగారాభి వర్ణనము రసాభాస మనియు అట్టిది కావ్యమున ఉపాదేయము కాదనియు అలంకారిక మతము. ఈ ఉపాఖ్యానము అర్థవాద సహితము లైనవి. ఇందలి తిర్యగ్జంతు పాత్రములు మానవ తుల్యములు. అంతేగాక, ఆలంకారికుల మతములో రస నిష్పత్తి అసాధ్య మని చెప్పబడి తిర్యగ్జంతుగత శృంగారము నందు కూడ ప్రతిభావంతులైన మహా కవుల చేతులలో రసవంతము కావచ్చును. కుమార సంభవమున కాళిదాసు చేతనాచేత వివక్ష లేకుండ సర్వ ప్రకృతిని శృంగార మయముగ అకాల వసంతాగమన ఘట్టమున నభివర్ణించుట ఇప్ప ట్టున అను సంధేయము.

పుణ్య వర్ణనుడైన బోయ కపుడు పక్షి యుగ్మము వర్ణనము దోచుటయు అతడు, 'కట్టెదిరి కాననం బెల్ల ముట్టి, మండు చున్న దవానలంబున సంప్రమోదిత చిత్తుడై యొడలు దొఱగి దేవత్వంబు వడిసి యొప్పె"ను.

బలి చక్రవర్తి, ఖరరూపంబున మరుగుపడి యున్నప్పు డాతని కడకు ఇంద్రుడుద్ధతుడై యేగి,

**ఉముక దినుచు నిట్టు లుండి నీ తొల్లింటి**
**లీలఁ దలంచి యుమ్మలింతో లేదో**
**యున్నరూపు సెప్పు వన్న గార్దభరూప**
**ధారనైక నిపుణ దానవేంద్రా.**

అని పలుకును. బలి చెప్పిన సమాధానము పేర్కొన దగినది.

**ఎలమియు వాడుటయును దన**
**వలచిన యట్టివె యొరుంగ వా విధిచరితం**
**బులు బలవంతంబు లగుట**
**వలదె వివేకంబు పెద్ద వారికి నింద్రా.**

అని చెప్పి

**ఇటు గర్విం చుట నీచత**
**యెట వోయెదో పొమ్ము మాను మీ వలవని త్రు**
**ళ్ళుట వజ్రము నీవును బిడి**
**కిటి తాఁకున నొజరగు దేను గినిసితినేనిన్.**

అని హెచ్చరించెను.

బలి చేసిన ఈ హెచ్చరికలో తానే కూడదని చెప్పిన యౌద్ధ త్యము గర్వము లేదా?

సమన్వయ సంధాత యైన తిక్కన, కల్పించుకొని అమూలకమైన 'ఇది మేలపు మాట సుమీ' యను వాక్యము చేర్చెను.

**ఇది మేలపుమాట సుమీ**
**మది నుద్ధతి లేదు నాకు; మహితాశ్చర్యా**
**స్పద మగువిధాతృ చెయ్దం**

**బది నీవును దస్సువోదు త్రుళ్లడుటుగుమీ.**

ఉపాఖ్యానములందలి అప్రధాన పాత్రల శీలాను శీలనమున గూడ తిక్కన మిక్కిలి జాగరూకత వహించుట సర్వత్ర గానఁగును.

ఇంద్రుడు చివరకు బలి చెప్పిన కాల ప్రకార కథనము విని, అతని వివేకంబున కచ్చెరు వొంది, యుచిత రీతి వీడ్కొని చనును.

**అమృత పానంబుఁ జేసిన యంత కంటె**
**నద్దనుజపతి మధుర వాక్యామృతమున**
**సంభృతానందుఁ డై సురేశ్వరుడు దనదు**
**పురమునకు నేగి సుఖ మొండె గురువరేణ్య**

అమూలకమైన పై పద్యము తిక్కన క్రొత్తగ జేర్చినదే.

**కాలగతి గనుట శాంతికి**
**మూలంబై యంతరంగమున కాత్మమయ**
**త్వాలంబనంబు నిచ్చుఁ ద**
**దాలీనం డైన పురుషం డక్షోభ్యుడగున్.**

కాలగతి నర్థము చేసి కొనుటయే పరమ వేదాంతము. ఆ తత్త్వము నాస్వాదించుట నిశ్చయముగా అమృతపానముకంటె మేలనిపించును.

మోక్ష ధర్మ పర్వము నంతటిని, యథోచిత సంగ్రహ పద్ధ తి ని యథా మూలముగనే తిక్కన అనువదించెను. విద్యావిద్యల తత్త్వము, హంస గీతలు, వేదవ్యాస శుక సంవాదము, మున్నగునవ న్నియు మూలమునకు సంక్షిప్తానువాదములే. శుకుడు హిమ వంతంబున కేగి నప్పుడు మందాకిని పొంత

**నగ్నలై యప్సరస్ స్త్రీ జనములు సలిల**
**కేలి సలుపుచునుండి శంకింప కమ్మ**
**హాత్ము గనుఁగొను చెప్పటి యట్ల నిర్వి**
**కారవృత్తి వర్తించిరి కౌరవేంద్ర.**

శుకుని వెదుకుకొనుచు వేదవ్యాసుడు వెంట జను దెంచును.

ఇట్లు నిలిచిన యవ్వేదవ్యాస మునీశ్వరుం గాంచి జలవిహారంబు సలుపు నయ్యప్సరోజనంబులు సిగ్గునగ్గలిక గ్రందుకొన నందఱు నంబరంబులు ధరియించి రద్దివ్యబోధ మహనీయుండు నిజ తనయు చను నప్పుడు వారు శంక లేక యునికి గని యతని ముక్త తయుఁ దన సక్తతయు నిరూపించి ప్రియంబును లజ్జయు నొక్క టఁ బొడమనుండె.

శాంతి పర్వమున ఉపసంహార ప్రాయముగ చెప్పిన సంవాదము ఉదాహరింప దగినది.

ధర్మరాజు ధర్మముల నెల్ల విని పరమ ధర్మమెద్దియె బోధింపు మని భీష్మ నర్థించును.

**అమరతటినీ సుతున కిట్టు లనియె రాజ**
**ధర్మ ముఖ్యంబులగు సర్వధర్మముల సు**
**దాత్తకృప నెఱిగించి తత్త్వ్య త్త మంపు**
**ధర్మ మెయ్యది సెప్పుము ధర్మనిత్య.**

అనుటయు నా దేవవ్రతుం డన్నర దేవోత్తమున కిట్లనియెన్.

**అరయఁగ ధర్మ తంత్రముల యందు నిరర్థము లేదొకండు నే**
**వ్వరి మది యెందు బ్రాలెఁ దగ వారలు దానిన పూని యాచరిం**
**తురు రదియ వారి కిష్ట ఫల దోహన కార్య మొనర్చు నెల్లెడం**
**బురుషమల( జూడమే తమకు( బోలిన ధర్మములన్ వెలుంగగన్.**

అని చెప్పి అహింసాశాలియైన భృగువు చరిత్ర, ఉంఛవృత్తి మహిమ నభివర్ణించును.

భృగు చరిత్రలో బ్రాహ్మణుడు

**వీనును నెట్టుల మోహ**
**ధీనుడ నై యాత్మ గాంచు తెఱ గొలయుటకుం**
**బూని పడుదు నెయ్యదియె**
**కానం దెరు వాశ్రుభ ప్రకలనంబునకున్.**

**కొందఱు బ్రహ్మచర్యమున గొందఱు భవ్యగృహస్థధర్మమున్**
**బొందుటఁ గొంద అర్థతపమున్ వనభూమిఁ దగం జరించుటం**
**గొందఱు నిష్క్రి యత్వమున గొందఱు యజ్ఞవిధానశాలితం**

**గొంద అనూనదానముల గోరి యొనర్తురు నిత్యసౌఖ్యమున్.**

భారత మణి దర్పణమునందు ప్రతిబింబితమై తిక్కనకు స్వీయ సమన్వయ సిద్ధాంతమే గోచరించినది. మహాభారతము నందలి ఆధ్యాత్మిక తత్త్వమునకు మూల కందమైన శాంతి పర్వము ధర్మా ద్వైత మూర్తియే.

<u>అంతరార్థములు గల సంకేత కథలు</u>

వేద సంప్రదాయమును ననుసరించి సంకేతమైన యర్థ వాదము లనేకములు భారతమున నున్నవి. అనుశాసనమునందు నిట్టివి విశేషముగ నున్నవి. వీనిలో ముఖ్యములన నిట్లు వర్గీకరింప వచ్చును.

| | | |
|---|---|---|
| ౧. భృగు ప్రతర్దన సంవాదము ... | అధ్యా. | ౯ |
| ౨. వసిష్ఠాదుల యుత్పత్తి ... | " | ౨౬ |
| 3. ఋషుల గోత్రములు ... | " | ౨౬ |
| ౪. తిలోత్పత్తి ... | " | ౫౫ |
| ౫. తిల ప్రభావము ... | " | ౫౭ |
| ౬. సువర్ణోత్పత్తి ... | " | ౭౪ |
| ౭. అగ్ని వృత్తాంత కథనము ... | " | ౭౪ |
| ౮. శమ వృక్ష గర్భము ... | " | ౭౪ |
| ౯. భృగ్వంగిరసాదుల ప్రభావము ... | " | ౭౪ |
| ౧౦. దేవ, ఋషి , గిరి, నది, తీర్థ కథనము | " | ౧౩౯ |

ఈ విధముగా నిట్టి కథ లిందు కొల్లలుగ నున్నవి. ఈకథలు బ్రహ్మాండ పిండాండ సమన్వయమునకు సంబంధించిన యర్థవాదములు. ఇవి వేద సంప్రదాయమునకు సంబంధించినవి. ధ్యానము, యెగము వలన మాత్రమే గమ్యమైనవి. వీనిని కేవల కథా ప్రధానముగ ననువదింప వలసినదేగాని మఱియొక విధముగ నసాధ్యము. తిక్కన యదేవిధముగ ననువదించినాడు. ఇందలి

యంతరార్థములకు సంబంధించిన పదముల ప్రయోగ వైచిత్రి తెనుగున విడువ బడినది. ఉదా. తిలదాన సందర్భాముున

**మధ్య దేశే మహాన్ గ్రామో బ్రాహ్మణానాం బభూవహ।**
**గంగా యమున యెర్మధ్యే యామునస్య గిరోరను॥ ౫౭ —3**

ఇందు గంగా యమునల నడుమ, యమున గిరి చేరువను అను రెండవ పాదము కథలోని వేదార్థమున కెంతయు నావశ్యకము. జీవుల శరీరమున నొక భాగము నిది శ్లేషగ నుద్దే శించును. సంప్రదాయము లేక భారతము చదువుకోను వారికి ఇది యనువదించినను లేకున్నను నొక్కటియే. అందువలన "మధ్య దేశము, గ్రామము, పర్వశాల" యను మూడు శ్లేష శబ్దములను మాత్రము సూచించి బుద్ధిమంతుల దృష్టిని మూలమునకు మరల్చుచు సంగ్రహముగ సామాన్యార్థములతో ననువదించినాడు. అ. ౨. ప. ౪౧౦ నుండి ౪౧౬. మిగిలిన కథలను బరిశీలించినను నెల్లే విదిత మగును. ఈ సూక్ష్మము తెలియక కూలంకషముగ మఱల ననువదించుట కేవరైన బూనినను సాధించునది యింతకన్న నెక్కుడు లేదు.

ఈ పర్వమునఁ గావ్య శిల్పమునకు, రసపోషణకుఁ దావుగల ఘట్టములలో గరుడుని కథయు, భీష్మ నిర్యాణమును ముఖ్యము లు. ఈ రెండును తిక్కనచే బ్రత్యేకముగ దీర్చి దిద్ద బడినవి. గరుడోపాఖ్యానము మూలమున నొక ప్రత్యేక గ్రంథము. తిక్కన భారతానువాదమున నిది యొక ప్రత్యేక రసవత్కావ్యము. దీనిని వేరుగ దీసి చదివినచో స్వయం సంపూర్ణ మైన యొక కావ్యము. ఇందు సంభాషణ చమత్కృతి, రసపుష్టి, పాత్ర సృష్టి, ఉత్తమ కథా కథనము, నాటకీయమైన ఘట్టముల నిర్మాణము కలవు. తిక్కన మహాకవి తన సర్వకవితా శక్తులతో విశ్వరూప ప్రదర్శనము చేయుట యిందుఁ జూడ నగును. గరుడుని పాత్ర చిరస్మర ణీయము. అతడు తల్లి దాస్యమునకు వగచి తల్లి కడ ననుజ్ఞ గైకొనుట, సవతి తల్లితోఁ గడు లౌక్యముగా మాటాడుట, ఆమె యార్యకు సహజ వైరాగ్య లక్షణమువలన గూఢముగ సహనమూని వర్తించుట, ఋషుల యెడలఁ జూపిన వినయము మున్నగు గుణముల చిత్రణము మఱియొక కావ్యమున గనలేము.

మూలమున గరుడోపాఖ్యానము పురాణ సహజమైన ఉపాఖ్యానక మార్గమున నున్నది. ఈ రచనలో కేవలము సత్త్వగుణమే సిద్ధించినది. తిక్కన రచన కావ్య మార్గమున నడచుచు గడుంగడు గడుసరి పోకడలు పోయినది

భీష్ముఁడు సిద్ధి పొందు ఘట్టము మూలమున రస సంపూర్ణము. భీష్ముడంత నిర్లిప్తుడై కృష్ణుని యందు లక్ష్యముంచి శరీరమును తొడుగును వదలినాడో చదువరుల కంత శోక సంవిగ్నమానసత సిద్ధించు నట్లు వ్యాసుడు చేసినాడు. భీష్ముడు కృష్ణునితో "జీవ భూతోఽనురూపస్వం పరమాత్మా సనాతనం" అనుచు ధన జీవభూతుడుగ నెఱిగి న్యాసము చేసికొనిన తరువాత కూడ

**త్వద్భక్తం త్వద్గతస్వాంతం అదారమపరిగ్రహమ్**
**త్రాయస్వపుండరీకాక్ష పురుషోత్తమ నిత్యశః।**

అని మ్రొ క్కు చుండుట చదివిన వారికి గుండెలు తరుగు కొనిపోక మానవు. ఇట్టి ఘట్టములు కావలెను తిక్కనకు!

**"దేవ దేవ జీవాత్మక దేవ వంద్య**
**శంఖ చక్ర గదా పద్మ చారుహస్త**
**వాసుదేవ త్రివిక్రమ వరద పరమ**
**పురుష ప్రణతి యొనరిచ్చెదఁ గరుణఁ జూడ".**

తెనుగున భీష్ముడు భక్తిజ్ఞానములకు భేదము నశించిన యొకానొక యనుభూతి ముద్దగ గనుపించును.

"అదారమపరిగ్రహం" అను మూలమునకు " ఆలు బిడ్డ లేని యట్టి వాడ" ననుట కడు సుగమముగ నున్నది. కృష్ణుడు భీష్మన కనుజ్ఞ నొసంగిన చోట మూలము నందు వలె గాంభీర్యము, భక్తవత్సలత యను పరస్పర విరుద్ధ గుణములకుఁ బొత్తు కుదిరినది. భీష్ముడు యొగ మార్గమున ప్రాణములను ధారణ చేసి శరీరమును జారవిడుచుట మూలమున ౧౪౬వ యధ్యాయమున వివరముగఁ జిత్రింపఁ బడినది. తిక్కన దీనినే స్పష్టతరముగ సుదీర్ఘమగు వచనమునఁ (అ. ౫ . ప. ౪౬౮) దీర్చిదిద్దినాడు.

ధర్మజాదులు భీష్మునకు నగ్ని సంస్కారాదులు చేయుట మూలమున కన్న రసవంతముగ నున్నది. వాస్తవికమైన రచన యొక్కడ రాణించునో యనుదాని యౌచితి కవి బ్రహ్మకుం దెలిసి నట్లె వరికిం దెలియును?

గంగాదేవి కృష్ణాదులం జూచి దుఃఖించు ఘట్టమును జదువరులు కన్నీటిలోఁ దోగియాడుచుం జదువుదురు. తెనుగు దనమనఁగా "అంతవాడు శిఖండిచే నట్టు లగుటగనియు" (అ. ౫ . ప ౪౭౭) అను పద్యములోనిదే. లోకమునకు మాతృ ప్రేమకు సరిపోయిన ప్రతిబింబ మీ రచన. అంతవాడు తన కుమారుడను భావ మామె కెంత దుఃఖ కారణమయ్యెనను విషయము మొదలుగా గంగ జీవితములోని, భూలోకావతరణ గాథ యంతయు నొకమాఱు కనులకు గట్టుట యిచ్చుట జరుగును. అమె నూరడింపఁ గలవాడు శ్రీకృష్ణుడొక్కడే! అతని సంభాషణ మిచ్చుట ననువదించి మొరుగులు దిద్దఁ గలవాడు తిక్కన యొక్కడే!

"గత పరమికాం సిద్ధిం తవ పుత్రోన సంశయః" ౧౫౬ —30 యని గంగ కభయ హస్తము పట్టఁ గల సామర్ధ్య మింకెవ్వరికి గలదు?

"నీవు శోకంబు దక్కు మునీసుతుండు

పరమగతి నొందె...... " అ. ౫ . ప. ౫౮౦

ఇచ్చుట తిక్కన రచన మరియు నిరాడంబరము, హృద్యము, చమత్కార శూన్య పవిత్రము, రసబంధురము.

తిక్కన విరాటోద్యోగ పర్వములను శ్రద్ధతో ననువదించి మిగిలిన వాని యందంత శ్రద్ధవహింప లేదను నొక జన సామాన్య శ్రుతి పండితలోకమున నున్నది. ఇది యసత్యమని శ్రద్ధాళువులకుఁ దెలియును. గ్రంథములోని ఘట్టములోఁ గావ్యత్వమున కనుకూలమైన ఘట్టములు బహుళమా విరళమా యను విషయమును దిక్కన యనువాద గుణముగ భ్రమపడుట కూడదు. రసవంతములైన ఘట్టములను విరాటోద్యోగ పర్వముల యందెంత రసవంతముగా దీర్చి దిద్ది నాడో యంతకన్న శ్రద్ధగా శాంత్యను శాసనములలో దీర్చిదిద్దినాడు. భీష్మ నిర్యాణ ఘట్టము కన్న వేఱు నిదర్శనము అక్కరలేదు. చిన్న కథ యైన గౌతమీలుబ్ధక

సర్ప సంవాదమును రసవన్మార్గమునఁ దీర్చి దిద్ది కావ్యముగా జీవపాత్రలతో దీర్చిదిద్దుట తిక్కన చేతిలోని విద్య. ఇక సాంఖ్య యోగాది విషయములు వేదాంతము, తత్త్వము, పూర్వ శాస్త్ర రహస్యములు గల తావులందెల్లఁ గొంత కుంచింపఁ జేసిన మాట సత్యము. చేయవలసిన పద్ధతియే యది. నన్నయ్యభట్టు నిట్లె చేసినాడు. తిక్కనయు నంతే. కావ్యత్వమునకు భారము కలుగ కుండఁ జూచుట వీరి ప్రణాళిక. సంప్రదాయము చెడక సారాంశ మును స్పష్టముగ ననువదించి వివరములు వలసిన వారికి మూలమును నిర్దేశించుటయే జరిగినది.

అనుశాసనిక పర్వము గౌతమీ లుబ్ధక సర్ప మృత్యు సంవాదముతో నారంభించుచున్నది.

"గౌతమి యనంగ శమాన్వితా యొక్క భాసురాంగన యురగంబుచే సుతుండు కాలవశత్వముఁ బొంది యుండగన్" శోక మగ్నురైనది. ఈ కథ యందు మృత్యువే ప్రత్యక్షమై మృత బాల కుని చావునకు సర్పము కాదని సాక్ష్యము చెప్పును. యముడును బ్రత్యక్షమై మృత్యుదేవత మాట బలపరచును ఈ కథ చెప్పి భీష్ముడు

**కారు దుర్యోధనుఁడు నీవు గారణములు**
**బాంధవుల రణమరణ సంప్రాప్తి కనఘ**
**వారు దమతమ కర్మముల్ కారణములు**
**గాఁగ నెట్లయి రేల శోకంబు నీకు.**

అని ధర్మరాజు నోదార్చును. ఈ అవశ్య భవితవ్య వేదాంత మే భారతీయుల జీవచ్ఛవముల చేసినదను నింద ఆంగ్ల విద్యాధి కులు పలువురు భారతముపై మోపుచున్నారు.

ఘోర భారత సంగ్రామము జరిగిపోయినది. బ్రదికి యున్న ధర్మరాజు దుఃఖ నిర్వాణుడైనాడు. ఈ మాటలు భీష్ముడు యుద్ధమునకు ముందే చెప్పి యున్నచో పై విమర్శకుం దావుం డును. అంతియగాక భీష్ముడు యుద్ధమును నివర్తించుటకై శక్తి వంచన లేకుండ పాటుపడినవాడు. తాను శరతల్ప గతుడైన పిమ్మట గూడ సంధికిఁ బ్రయత్నించెను. భీష్ముఁడీ వేదాంతమును

యుద్ధానంతరము ఆర్ద్ర హృదయుఁడైన ధర్మరాజు మనశ్శాంతి కొఱకే ప్రపంచించె నను మాట విమర్శకులు మరువ దగదు.

అగ్ని దేవుడు సుదర్శన యను కన్యకను వివాహ మాడు ఘట్టమున తిక్కన యథామూలముగ సంక్షేపించినను, ఆత్మీయతా ముద్ర వేసిన పట్టులు లేకపోలేదు. "మను వంశంబున బుట్టి సర్వజనతా మందారమై నేలఁ బాలించిన దుర్యోధనుఁ డను రాజు కూతురు సుదర్శన యను కన్యక.[1]

రాజు సుదర్శనను అగ్ని హోత్రంబునకుఁ బరిచర్యకై నియమించును.

"పనిచిన నప్పొలంతి యప్పనుల వెంట మెలంగుచుండె.

**అర్చించునప్పు డయ్యంగన కెంగేలి**
**జిగిసొంపు చిత్తంబు దిగిచికొనఁగ**
**నరసి కన్గొనునప్పు డయ్యింతి కనుంగవ**
**పోలపంబు రాగంబు వొదరఁజేయ**
**నన్యులఁ బనిఁ బంచు నప్పు డమ్ముద్దియ**
**పలుకుల తీపు గోర్కులం గెరల్ప**
**నల్లన యూఁదె డు నప్పు డక్కొ మ్మవా**
**తెఱతావి ధైర్యంబుఁ ద్రి ప్పు కొలుప**
**మరుఁడు దోడ్తో డఁ దేఁకువ మాలి కదిసి**
**తూఁపుగమల క్రొవ్వాఁడిమి సూప సంత**
**కంత కగ్గల మగు వల వంతఁ దూలి**
**పోయెఁ బావకుఁ డేమి సెప్పుదు నరేంద్ర.**

పై సీస పద్యమునకు మూలమున మాతృక మృగ్యము.[1]

ఇట్లు మదనాగ్ని నుదిలికొని యగ్నిదేవుం డక్కాంతతో నే కాంతంబున నిట్లనియె.

---

1.మూలమున మనువంశ వృక్షము అభివర్ధితము. తిక్కన ఒక మాటతోఁ దేల్పివేసెను.

**చిగురుటాకుల గాసి సేయు నీ యడుగుల**
**చెలువంబు సూడ్కుల జేర్చికొనియె**
**మారేడు  పండుల గారాము సెరచుని**
**యెల చన్నుగవ వేడుకలం బొనర్చె**
**నునుదీప జీరికిఁ గొననినీమై దివ్య**
**మురిపంబు దెందంబు మరులు కొలిపె**
**నెర సందురుని సిగ్గు వఱుపంగఁ జాలునీ**
**నెమ్మొ మ్మ దాలిమి వమ్ము సేసె.**
**నాతి నీకు నై పెక్కు బన్నములు పడితి**
**నంగజుని చేత వల్లభ వగుము నాకు**
**నావుడును సిగ్గగదిరి యాననము వంచి**
**యలతి యెలుగున నిట్లను నా లతాంగి.**

మూలమున గూడ అగ్నిదేవుడు సుదర్శనతో ననిన మాట లభివర్ణిత ములు గాని ఆ తెన్ను వేరు.

మూలము నందు అగ్ని చెప్పిన మాటలు

**భజ మామన వద్యాంగి కామాత్ కమలలోచనే।**
**రంభోరు మృగశాబాక్షి పూర్ణచంద్రనిభాననే॥**
**తవేదం పద్మ పత్రాక్షం  ముఖం దృష్ట్వా మనోహరం।**
**భ్రూ లతాలలితం కాంతం అనంగో బాధతేహిమాం॥**
**లలాటం చంద్రలేఖాభం శిరోరుహ విభూషితం।**
**దృష్ట్వాతే పత్ర లేఖాంగం అనంగో బాధతే భృశం॥**
**దంత ప్రకార నియతా వాణీ తవ సురక్షితా**
**తామ్ర పల్లవ సంకాశా జిహ్వేయం మే మనోహరం**
**బాలాత పేనాకులితం సస్వేదపులకోద్గమం**
**బింబాధరోష్ఠవదనం విబుద్ధమివ పంకజం**
**అతీవచారు విభ్రాంతం ముద మావహతే మమ**

1. పర్వత నారదో పాఖ్యానమునఁ గూడ తిక్కన చేర్చిన అమూలక పద్యము ఇప్పట్టున స్మర్తవ్యము.

మొదలగు మూల శ్లోకములకును తెలుగున తిక్కన వ్రాసిన సీస పద్యమునకును పోలిక లేదు.

అనుశాసనిక పర్వమున అధునాతన విమర్శకుల దృష్టిని విశేషముగ నాకర్షిం చిన ఘట్టము గరుడోపాఖ్యానము. దీనికి రెండు ముఖ్య కారణములు గలవు.

౧. నన్నయ భట్టు గూడ గరుడోపాఖ్యానమును రచించి యుండెను. నన్నయ తిక్కనల కవితా శిల్పములోని తారతమ్య ముల నరయ గోరు వారి కుతూహలమున కీ ఘట్టము దోహదము గల్పించినది. నన్నయ వర్ణించిన కర్ణ జననము మున్నగు మరి కొన్ని ఘట్టముల గూడ తిక్కన తిరిగి వర్ణించెను గాని అవి తారతమ్యము లరయుటకు దగినంత విస్తృతములు గావు.

౨. అనుశాసనిక పర్వమున మూలమున గరుడోపాఖ్యానము లేదనియు, దానిని బుద్ధి పూర్వకముగ తిక్కన తెలుగునఁ జేర్చె ననియు కొందఱు తలపోసిరి. [1]

3. తిక్కన గూడ గరుడోపాఖ్యానమును తీర్చి దిద్దుటలో తిక్కన ఉపాఖ్యానముల కంటె ఎక్కువ శ్రద్ధ వహించినట్టు గోచరించును. నన్నయ ఆ ఘట్టమును రచించి యున్న సంగతి తిక్కన కవగత పూర్వమే గనుక, భావి యుగ ములవారి కుతూ హలమును అతడూహించుకొని యుండును.

గరుడోపాఖ్యానమును బురస్కరించుకొని నన్నయ తిక్కన ల తారతమ్యము లెన్నుట విషయాంతర మగును. అదియును గాక ముఖే ముఖే సరస్వతీ యను సూక్తి చొప్పున ఆ మహాకవు లిరువు రును భిన్న ప్రజ్ఞలఁ బ్రదర్శించి గరుడోపాఖ్యానమును హృదయం గమముగఁ దీర్చిదిద్దిరి. తిక్కన కవితా శిల్పమే ప్రస్తుత లక్ష్యము.

"కశ్యపు భార్యలు కద్రువ వినతనా గలరు." కద్రువకు వేయి గుడ్డుల లో నాగము ఉద్భవించెను. వినత గర్భమున నుద్భవించిన రెండండము లెంత కాలమునకు పగులక పోవుటచే నామె యొక య్యండ మవియ నడిచె.

**పులుఁ గొక్కడు పూర్వాంగము**
**గలిగి జనించుటయు వానిఁ గని యానతిఁ గ**
**న్నుల నశ్రుజలంబులు పే**
**ల్లొలుకగ శోకమున మునుగు నుల్లముతోడన్.**

నివ్వెరపడి యుండ నయ్యండజంబు, తల్లితో, 'మత్సరమున జాపలంబునను నిట్లు చేసిన నీవు నీ సపత్నికి వరపుడవై చరింపుమ'ని శాప మిచ్చును.

శాపము పొందిన వినత

**వెలువెలఁ బాఱుచు వడకుచు**
**నలుకుచు దనమోముఁ జూచు నయ్యంగన న**
**ప్పులుఁగు కృపఁ జూచి తల్లి**
**వలవ దడల నిది విధాతృ వశ మయి వచ్చెన్.**

వెలువెల బాఱుచు వడకిన వినత వర్ణనము మూలమున లేదు. అమూలకమైన ఆంగికాభి వర్ణనము తిక్కన కవితా శిల్పము నందలి వైలక్షణ్యములలో నొకటి. ఆ పిమ్మట గరుడుడు జన్మించును. అక్కాలంబున వినోదంబునకై కద్రువ, వినత సాగరమునకు వినోదార్థ మరుగుదురు.

'కద్రూశ్చ వినతాశ్చైవ గచ్ఛతాం సాగరం ప్రతి' అని మూలములో గల ఒక్క వాక్యము పురస్కరించుకొని తిక్కన ఒక సీస పద్యము వ్రాసెను.

**చంచులఁ జిగురాకుఁ జించి యాడుచు నలి**
**నెలుగించు గండుఁగోయిలల సొంపు**
**నలరుఁ దేనియ గ్రోలి యన్ను సోలంబుల**
**మురియు తేటుల నునువ్రోత యింపుఁ**
**దని పఠ్ఠరస మాని తమలోనఁ జెలగుచు**
**బలికెడు రాచిల్క పదువు రంగుఁ**
**గొలకుల కెలకులఁ గూడి క్రీడించు చుం**
**డెడు సంచతండంబు నట బెడంగుఁ**

---

1. ఈ విషయము ఇంతకు ముందే నవిస్తరముగ జర్చింప బడినది.

**దరఁగఁ దేలుచు బూదీవ దగులఁ బడుచు**
**వచ్చు చిరు గాలి సోఁకును మెచ్చి మెచ్చి**
**తగిలికొని యాడుచును వినతయును గద్రు**
**వయును మున్నీటి చేరువ వనమునందు.**

పై సీస పద్యములోని వర్ణన మంతయుఁ దిక్కన స్వకపోలకల్పనమే.

మూలమున, వారిరువురు అచ్చట ఉచ్చైశ్రవమును జూచిరి.

**ద దృశా తే తు తే యాంతం ఉచ్చై శ్రవ సమంతికాత్।**
**స్తా త్యోపవృత్తం త్వరితం పీతవంతంచవాజినం॥**

అని మూలమున గలదు.

తిక్కన తెలుగున

**కరువున బోసిరో విధుని కాంతి సుధాబ్ధి తరంగఁ దెచ్చి గం**
**డరు వెనరించిరో హరుజటాస్థలికిం దొడ వైన యేటి వె**
**న్నురవున జేసిరో యన మనోఽజ్ఞసితచ్ఛవి నుల్లసిల్లు సుం**
**దరతురగోత్తమంబు దపు దవ్వులఁ గాంచిరి చారులోచనల్.**

అని తన తెన్నున వ్రాసెను.

కద్రువ వినతల వాదోపవాదములు మూలమున గలవు గాని తెలుగున గన్పించు సంభాషణ చారిమ తిక్కన గల్పించినదే.

**వినత హయ మింత యొప్పునె**
**యనూనధవళ ప్రభాఢ్యమై యని పలుకన్**
**విని కద్రువ యపరాంగం**
**బున నీలిమ దోఁచె ననియెఁ భూపవరేణ్యా.**

**అనవుడు నమ్మృగాక్షి యిటు లాడితి నవ్వుల కాదితో నిజం**
**బునకునొ నీదు చూపునకుఁ బోలిన భంగియొ చెప్పు మన్న న**
**వ్వనిత దరస్మితస్ఫురిత వక్త్రముతో నిది యేటిమాట న**
**ల్లనియెడ గాన రాదె తెమలం బలుకం బని యేమి నాపుడున్.**

వినత దెలియం జూచి

**కాదని పూని పల్కుటయుఁ గద్రువ పన్నిదమేమి దీనికి**
**న్యాదిది యేల రిత్తయనినన్ విని యా సతి నిక్కమేని నీ**
**వేది పణంబుగా దలచి యేర్పడఁ జెప్పితి దాని కేను సం**
**వాదము సేయుదాన గరువంబుగ నొక్కటి నిశ్చయింపుమా.**

అనిన విని కద్రువ వినతవదనంబునఁ జూడ్కి నిలిపి.

**నీవు గెల్చిన దాస్యంబు నీకు నేను**
**జేయఁగలదాన నేను గెల్చినను నీవు**
**నాకుఁ జేయంగ గలదాన వీ కడింది**
**పన్నిదముఁ సఱ మని తెగంబాఱి పలికె.**

లేని నీలిమ యున్నదని పలికి వాదులాడు కద్రువకు దరస్మిత స్ఫురిత వక్త్ర్యము" తిక్కన కల్పించినదే. అసత్యమును కప్పిపుచ్చుటకు విదగ్ధ వనితల వక్త్రములు విరిసెడి దరస్మితమును జక్కగ పట్టుకొనుటలో అందె వేసిన చేయి తిక్కన.

గరుత్మంతుడు సవతి తల్లితో నెరపిన సముచిత ప్రసంగమున తిక్కన సంభాషణ చారిమకు లక్ష్యభూతమైనదే.

యౌవన దర్పమున విహరించుచున్న గరుత్మంతునిఁ జూచి యొకనాడు నారదుఁ డిట్లనియె.

**దాసి యై  సవతాలికిఁ దల్లి పనులు**
**సేసి నలఁగంగ నద్దెసఁ జింత వంత**
**లేక నీ వెట్లు  దిరుగుట లెస్స యగునె**
**యద్భుతోజ్వల తేజ కశ్యపతనూజ.**

పిమ్మట జననికి దాస్యము దాపురించిన కథ గరుత్మంతునకు నారదుఁడు చెప్పెను.

**చెప్పినఁ గోపమున్ వగపు జిత్తమునం గదురంగ మేలుమే**
**లప్పు హితంబు సేసెఁ జెలియల్ మనుచున్నది పెంపుతోడ నం**
**చప్పుడ వాయువేగమున నయ్యెడకుం జని మాట యెద్దియుం**
**జెప్పక తల్లికిం బ్రణతి సేసె విషాధభరార్త మూర్తియై.**

తెలుగున గరుత్మంతుడు కద్రువ పాలికిం బోయి 'పరమ వినితిమై నెఱగి బాంధవ మారగ నల్ల' ని నిట్లనెను. మూలమున

కద్రూ మేవ స ధర్మాత్మా వచనం ప్రత్యభాషత అని గలదు. అంతేగాక సంస్కృతమున గరుత్మంతుడు కద్రువతో

'యది ధర్మేణ మేమతా జితా యద్వ ప్య ధర్మతః'

జ్యేష్ఠా త్వమసి మే మాతా'అనును.

'నీ చెలియల్ చరించు నివ్వరవుడపుం జరిత్రమున వచ్చునె నీకొక పెర్మి" అనియు

**"నీకును నేను బుత్త్రు డన నెమ్మిఁ దగన్**
**నను జూచి రైన" "దాస్య కృతి నా జనయిత్రికి**
**నివ్విధంబునన్ రాకయు దైవకృత్యమ"**
**"మనంబునఁ బొంగుదు విడ్చు గల్గినన్"**

అని గరుడుఁడు కద్రువను బ్రార్థించును.

తెలుగు గరుడుని వాక్చాతుర్యము మెచ్చ దగినది.

గరుడుడు గజ కచ్ఛపములఁ దినబోవును. గజకచపముల వృత్తాంత మొక మనోజ్ఞ సన్నివేశము. మనుష్య లోకమున గూడ నీ గజకచ్ఛపము లెడ నెడ గన్పింపక పోరు. అది విషయాంతరము. యథాక్షరముగ స్వీకరించినను ఈ కథ అత్యంత రమణీయము. గజ కచ్ఛపముల పరస్పర వైరము తిక్కన హృదయంగమముగ చిత్రించెను.

**అందొక కచ్ఛప ప్రవరు డత్యధికం బగుకాయమున్ బలం**
**బుం దనరన్ వసించు జలమున్ గొనువాంఛ గజంబు వోయినం**
**జెందఁగ నీక సంగరముఁ జేయుఁ బెనంగుచు నీరు (దావు గో**
**రుం దెగి యుండు నిట్ల పగ రోష మెలర్పఁగ నాఁడు నాఁటికిన్.**

గజ కచ్ఛపముల పోరు మూలములో గూడ గలదు. తిక్కన మూలమునకు మెఱుగు పెట్టెను.

**దంతి సనంగ భూరిమద ధారలగాలి యొరింగి కూర్మ మ**
**త్యంత సమృద్ధతిం గొలని కడ్డపడన్ వెస వచ్చె వచ్చినన్**
**దంతియు నీరు వట్టున నుద గ్ర పు గోపము సందడింప దు**
**ర్దాంతసముద్యమం బెసఁగ దానిపయిం గవిసెన్ మహోగ్రమై.**

చివరకు ఆ రెంటిని గరుడు డెగ దన్ను కొనిపోవును.

గరుడుడు దేవేంద్రుని జయించి వెరగపడి తన్నుఁ జూచు చున్న కద్రువకు అమృత భాండము చూపి, "నీ మాట ప్రకారము అమృతము తెచ్చితిని. నీ యెడ బాటు సెల్లె. వినతం దోడ్కొని పోయెదం, మనమునన్ విభ్రాంతి లేకుండుమి" అని చెప్పును. ఆమెకు 'విభ్రాంతిగనే' యున్నది. ఆమె అమృతము 'తెమ్మ' ని నది గాని 'ఇమ్మ'న లేదు. మాట చొప్పున వినతకు దాస్యము తప్పినది. ఆమే నింటికిం బంపించి, 'అమృతంబుం గ్రమ్మఁ రన్ గ్రక్కునం గొని పక్షీంద్రుడు వేయి యింద్రు డెలమిం గూరంగ నిచ్చెందగన్",

ఉపసంహారము నందు నన్నయ కథకు, తిక్కన కథకు భేద మున్నది. ఆ భేదము సంస్కృత మూలానుసారముగ సంక్ర మించి నదే.

గరుడుని సంభాషణ చాతుర్యము ఎన్నదగినది. గరుడుడు, దేవేంద్రున కమృతం బొసంగి, వెనుకటి యుద్ధమును మరపించు తియ్యని మాటల దేల్చెను.

**కొడుకులం బంచి దెల్పెసగు గుర్ర ము వాలము నందు నల్ల గ**
**ల్గెడు క్రియం దీర్చి పన్నిదము గెల్చిన కద్రువ నేను మాటమై**
**నొడిచితిఁ దల్లి దాసి యగు టొర్వక తండ్రి యనుజ్ఞ మీ కెదు**
**ర్పడిన దురుద్ధతిన్ మఱచి బాంధవ సత్కృతి నాదరింపుడీ.**

గరుడుడు దేవేంద్రుని వీడ్కొని మరలుటతో మూలమున గథ ముగిసినది. మూలమున భీష్ముఁడు ధర్మజుతో.

**ఏషతే పాండవ శ్రేష్ఠ గరుడోఽథ పత త్రిరాట్**
**సువర్ణో వైనతేయశ్చ కీర్తితో భ్రదముస్తు తే.**

అని చెప్పుట ఉవ సంహార వాక్యము.

తెలుగున గరుడుడు

**అజుఁ డుపలాలింప నద్దేవు కావించు**
**వరభోజనంబులఁ బెరిగె నితఁడె**
**ఘనకాయజవసత్త్వ గజకచ్ఛపముల నొ**
**క్కె ట్టు న లీలమై నెత్తె నితఁడె**

**విపుల భూరుహశాఖ విఱిగిన మునిహితా**
**ర్థంబుగా జంచున దాల్చె నితఁ డె**
**సురసేనతోఁ బురందరుని నిర్జించి య**
**దీప్తుఁ డై యమృతంబు దెచ్చె నితఁ డె.**

**తల్లి దాస్యంబు దనబాస దప్పు కుండఁ**
**బాపి యాసుధ మరల నపాౕకశాస**
**నునకు దయ నిచ్చె నీతఁడే యనుచు సిద్ధ**
**సాధ్య లగ్గింప గరుడుఁడు సనియె మగిడి.**

పై సీస పద్యమునకు మూలమున మాతృక మృగ్యము.

అశ్వమేధ పర్వమున గూడ, ఇతివృత్తము నాలుగు వంతుల మూడు పాళ్లు అధ్యాత్మిక ప్రబోధమే. భీష్మ మరణానంతరము, ఉదక కర్మ మాచరించి ధర్మరాజు, 'ఉమ్మలికంబునం బొగుల నుల్లముతోఁ బోరి లోచనంబులం గ్రమ్మఁగ నశ్రువారి ధృతి గౌరవ మేధ', మూర్ఛిల్లును.

భీముడు

**పట్టి యతండు దనదు పై చీర యాస్తర**
**ణంబు సేసి భూస్తలంబునందుఁ**
**బెట్టె మానసములు పెద్దయు సలదురి**
**యర్జునాది సోదరాల వొదివే.**

కృష్ణుండుచిత వచసంబుల నా భూపాలుం బ్రబోధించె.

ధర్మరాజు శోక విహ్వలుఁడైన విషయము మూలమున గలదు. గాని పై పద్యము తిక్కన తెలుగున అధికముగ జేర్చినదే. తరువాత వేదవ్యాసుఁడు ధర్మరాజునకు మరుత్తుని చరిత్రము నెఱింగించును. తరువాత శ్రీకృష్ణుని ఉపదేశము. శ్రీకృష్ణుడు ధర్మరాజును గతమును విస్మరింపుమనియు, కురుక్షేత్ర యుద్ధ మొక యుద్ధము గాదనియు మానసిక సంగ్రామ క్షేత్రమున విజయ ము సాధింపు మనియు హెచ్చరించును.

**'భీష్మాది యుద్ధ తంత్ర మారయంగ యుద్ధంబు గాదందు బుట్టు కీడు మేలేమియనువు జిత్తగింపకుండు,**

దాని నెట్లు యుద్ధంబు గాదనియె దంచేని అది మిథ్యా యుద్ధంబు సత్య యుద్ధం బాకర్ణింపుము.

**"అమ్మాయి బంధుమిత్రుల సహాయతకల్మి ప్రయోజనంబు లే**
**దమ్మహనీయ యుద్ధమున కాత్మయ తోడు మనంబు శత్రుఁడీ**
**నెమ్మెయి నైన శాంతి ఘటియింపుము లో పగఁ దీర్చు మందు శాం**
**తమ్ముచుమీ మనో విజయితన్ వెలుగొందుము శాంతబుద్ధివై"**

తిక్కన మూలమును సంగ్రహించినను, వ్యాఖ్యాన ప్రాయ ముగ సారాంశమును మాత్రము స్పష్ట ప్రతీతితో వ్యక్త మొనర్చెను.

అశ్వమేధ పర్వమున శ్రీకృష్ణుడు అర్జునునకుఁ దత్త్వజ్ఞాన స్థిరీ కరణము సల్పును.

అర్జునుడు శ్రీకృష్ణుని

**అనికిఁ దొడంగు నప్పుడు మదాత్మ గలంగినఁ గొన్ని తత్త్వబో**
**ధన మహనీయవాక్యములుదాత్త కృపం దగ నీవు సెప్పితే**
**మనమునఁ వాని యర్థములు మాధవ నిల్పఁగఁ జాలనైతి న**
**వ్వీసుత వచస్సుధారసము వీనుల నిం కొక మాఱు నింపవే.**

అని అర్థించును.

కాని శ్రీకృష్ణుడు తిరిగి భగవద్గీతోప దేశమునకుఁ బూను కొనడు. భారతమున గల్పింప బడిన యా సన్నివేశము మిక్కిలి అర్థ వంతమైనది. ధర్మము నిత్యచైతన్య పూరితమైనదను విషయము భారతమునందు సుస్పష్టముగ జెప్పబడినది. ప్రకరణాంతరమున భగవద్గీతోపదేశమునకు శ్రీకృష్ణుడు పూనుకొనలేదు.

అతఁడు

**బ్రహ్మ పదవేదనమునకుఁ బరమ హేతు**
**భూతములు నాఁటి వాక్యముల్ బుద్ధిఁ దన్న**
**హార్థములు నిల్పవైతి శక్యంబే యింక**
**నవ్వచనములు సెప్పఁగ నలఘుశౌర్య.**

అని చెప్పి, ఉపదేశాంతరమునకుఁ గడగును.

ఆ ప్రబోధమునందలివే బ్రాహ్మణగీతలు.

శ్రీకృష్ణుడు ద్వారకా నగరంబున కేగుచు మార్గ మధ్యమున నుదంకాశ్రమమున విడియును. నన్నయ ఉదంకోపాఖ్యానమునకు ను తిక్కన ఉదంకోపాఖ్యానమునకును జాల ప్రకరణ విభేదము గలదు. తిక్కన సంక్షేపముగ నుదంకుని పూర్వగాథను- నన్నయ వ్రాసిన దానిని వర్ణించును గాని యది మిక్కిలి స్వల్పము.

అశ్వమేధ పర్వము నందలి యుదంకుని గాథలో నొక విశేష మున్నది. మహర్షియైన ఉదంకునకు మహాభారత యుద్ధము జరుగుట భవ్యముగా గన్పింపలేదు. శ్రీకృష్ణ డంతటి వాడు సంధి చేయక యుపేక్షించుట యత దోర్వలేదు. అందుచే, అతడేమియు నెఱుగని వాని వలె, శ్రీకృష్ణునితో 'పక్షపాతితా దురితము లేని నీవు జనతోపవిధాన విచారదుండవై కురుపాండవులకు సంధి చేసి సమస్త రాజన్య సంక్షయము తప్పించితివి కదా' యని నిందా గర్భితముగ బ్రశ్నించును. శ్రీకృష్ణుడు తన సంధి విఫలమైన తెరుగును కురుక్షేత్ర యుద్ధ కథనమును ఉదంకునకు వినిపింపగ, అతడు రోష కషాయితంబులగు తారకంబు లుద్వ తృ తంబులు సేయుచుం బలుకును.

**కౌరవకులమున మిథ్యా**
**చారుడ వై త్రుంచి తకట శక్తుండ వయ్యున్**
**నేరిమిమైఁ జేయవ పొం**
**దారగ నిక్కల్పి షమున కంతటికిఁ దగన్.**

తన్నుఁ శపించుట కుద్యుక్తుడైన ఉదంకునకు శ్రీకృష్ణుడు విశ్వ రూపము చూపును. ఉదంకాది ఉపపాత్రలను బోషించుటలో గూడ తిక్కన మిక్కిలి జాగరూకత వహించెను.

వ్యాసుడు హిమవత్పర్వతంబున నున్న పాండవుల కడకు వచ్చును.

**బాలార్క ద్యుతిపుంజపింజరజటా భారంబు బ్రావృడ్ఘన**
**శ్రీలీలం బ్రహసించు నంగమును రోచిస్ స్వారదండంబు ను**
**న్మీలన్మీల మృగాజినాంబరము నై నిర్వాణదాన క్రియా**
**శీలుండైన పరాశరాత్మజుడు విచ్చేసెం గృపాలోలు డై.**

వ్యాసుఁ డప్పు డచ్చటకు వచ్చినట్లు ప్రకరణాంతరమునఁ

గలదుగాని పై పద్యమునకు మూలమున మాతృక మృగ్యము.

"యయౌ వ్యాసం పురస్కృత్య త్రత రత్న నిధిం ప్రతి" అని మాత్రమే మూలమున గలదు. పాండవులు అశ్వమేధము సల్పుటకై హిమవన్నగమునందు ప్రక్షిప్తమైయున్న రత్ననిధులను దర లించుకొని కొంపోవుదురు.

పరీక్షితుడు జన్మించి నపుడు, హస్తినాపురమును అలంక రించినట్లు మూలమున నొక వాక్యము గలదు.

**'అలంచక్రుశ్చ మాల్యైర్మోర్ఘ్వగరం నాగసాహ్వయం'**

తిక్కన తెలుగున

**కస్తూరి నీళ్లతల కలయంపులను గప్పు**
**రంపు మ్రొగ్గల బహురత్న తోర**
**ణముల దోరపు ముత్తియముల నొనరిచ్చన**
**ప్రాలంబ మాలికా పంక్తులను బ**
**సిండి పూర్వకుంభముల విశిష్ట మరక**
**తప్రకరమయకదళికా స్తంభములను**
**గరముదోరంబు జిత్రరేఖంబుగా న**
**లంకరించిరి పురముఁ గులప్రదీప.**

దండు అని వర్ణించును.[1] ఆ వర్ణన అర్వాచీన ప్రబంధములకు ఒజ్జ బంతి తీర్చినది.

యాగాశ్వము వెంట అర్జునుడు నడచును. మహాభారత యుద్ధానంతరము తిరిగి అర్జునుడు గాండీవము ధరింపవలసి వచ్చినది. కాని 'భూప వితతి యెల్లనుం దెగియె భారత యుద్ధమ నందు బాలురం దివిరి వధింపగాదు కృప దిన్నదనం బెసంగం జరింపుమా' అనునది అజాతశత్రు వాజ్ఞ.

---

1. ఇట్టి అలంకార వర్ణనయే ధర్మరాజు పట్టాభిషేక సందర్భమున శాంతి పర్వమున గలదు.

**చంపకుమీ రాజుల నను**
**కంపాతిశయంబు మోరయంగా నడపుము నీ**
**పెం పనుకుసుమమునకు నా**
**పం పొనరించుటయ సౌరభముగ నెఱుంగుమీ.**

అని యాగదీక్షితుడైన ధర్మరాజు ప్రవచనము.

పై పద్యమునకు మూలమున మాతృ క మృగ్యము.

'పెంపను కుసుమమునకు; నా పంపొనరించుటయే దానికి సౌరభమను' మనోహర భావము ననుశీలించినచో రుచి తెలిసిన సహృదయులు తలలూప తప్పదు.

అర్జునుడు త్రిగర్తులతో యుద్ధము సేయవలసి వచ్చినది. 'వలవదు పొండనంగ' వారు వినలేదు. అప్పుడతడు

**"ఏర్ర నవ్వ్వ తన మోమును తమ్మికి లేతయెం డయై**
**చెలువము చెన్ను వింతలుగ జేయగ'**

యుద్ధమున కుప్రకమించెను.

అశ్వమేధ పర్వమున, ఆధ్యాత్మిక విషయముల యందు సంగ్రహమున కలవాటు పడిన తిక్కన ఘంటము తిరిగి విజృంభించినది. అర్జునుడు సింధుదేశాధికులతో సల్పిన యుద్ధమున హృదయము గరిగించు సన్నివేశము గలదు. అర్జునురాక వినగనే సైంధవుని కుమారుడు హృదయ మాగి మరణించును. సోదరి యైన దుస్సల నెవ్వగతో, మనుమని దోడ్కొని అర్జునున కెదురేగి, పౌత్ర ప్రాణభిక్ష నర్ధించును. అర్జునుడు, శోకాక్రాంతుండై, చిత్త మడల.

**"రాచ కొలమిది గాల్పనే క్రౌర్యమూల**
**మని తలంచుచు నాత దయ్యుతివతోడ,**
**నధమవృత్తి సుయెధనుండంత కంటె**
**నేమిఁ గొఱగాము మా చేత నింత పుట్టె "**

నని చెల్లెలు దుస్సల మస్తకంబు తన యక్కున జేర్చి యామెను వీడ్కొలుపును. ఈ ఘట్టము చదివిన వారి కన్నులు చెమ్మగిలక మానవు.

అర్జునుడు బ్రభువాహునితో యుద్ధముచేసి మరణించుట సంజీవనిచే అతని పునరుజ్జీవనము మూలమునందలి వన్నె కగ్గ కుండ తిక్కన తెలుగున యథామూలముగ ననువదించెను. అర్జునుడు జైత్రయాత్ర ముగించుకొని పురప్రవేశము సల్పునపుడు, జనులు సంతోష మధుర భాషణములు సల్పిరి. ఆ భాషణములను తిక్కన యథామూలముగ తెనిగించి,

మఱియును

**నృపు లోహటింప జంత్రపు మీను నేసి చే**
**కొనియె బాంచాలుని కూతు నితఁడె**
**సురసేనతోఁ బురందరు గెల్చి భుజగర్వ**
**మేపాఱ ఖాండవం బేర్చె నితఁడె**
**యొక్కటి బవరాన నీసాను మెప్పించి**
**పాశుపతాస్త్రంబు బడసె నితఁడె**
**యింటిమై భీష్మాది యెధుల కురుపతి**
**ధృతిఁ బాపి గోపులఁ దెచ్చె నితఁడె**

**ప్ర తిన సేసి విషమసమరమునఁ బ్రొద్దు**
**గ్రుం క నీ కాగి సైంధవుఁ గూల్చె నితఁడే**
**యనుచు సందడిగఁ గ్ర మ్మి యట్టు లెత్త**
**చూచె జనలోక మానవ్యసాచి బ్రీతి.**

అను సీస పద్యమును జేర్చి తెలుగు భారతమున ఆత్మీయతాముద్ర వైచెను.[1]

1. తెలుగు భారతమున తిక్కన యిట్టి ముద్ర వేయుట కిది నాలుగవ పర్యాయము.
1. శ్రీకృష్ణుడు సంధికి హస్తినాపుర ప్రవేశ ఘట్టము
2. ధర్మరాజు పట్టాభిషేకమునకు హస్తినాపురమునకు వచ్చుట
3. గరుడుని సిద్ధ సాధ్యు లభివర్ణిం చుట
పై సందర్భముల తిక్కన చేర్చిన అమూలకమైన సీస పద్యము లిట అనునంధేయములు.

అశ్వమేధ పర్వమునకు ఉపసంహారప్రాయమైన సక్తుప్ర స్తో పాఖ్యానము, మహాభారతము నందలి ఉపాఖ్యానములలో దల మానికము. వేదాంత గవేషణలో మహాభారతమున గల విశాల దృష్టికి సక్తు ప్రస్తోపాఖ్యానము ఉజ్జ్వల నిదర్శనము. ధర్మరాజు హృదయ పవిత్రత, అశ్వమేధయాగమున అతడునర్చిన దానములు సదస్యులకు 'హర్ష పులకాంకురముల్' గల్గించెను. ధర్మరాజు తన సర్వస్వమును అర్థుల కిచ్చివేసెను. అట్టియెడ ఒక నకులము సగము బంగారు తలతో విప్రజనంబు నడుమ నిలిచి, "సక్తు ప్రస్తు నలఘు ధర్మంబు నేమియుఁ బోలదీ యశ్వ మేధ" మనును.

ఆ సక్తు ప్రస్తుడు ఉంఛ వృత్తిచే జీవించిన బ్రాహ్మణుడు. ఒకసారి క్షామము దాపురించినది. భార్యయు, తనయుండు నతని పత్నియు నలువురు రేపు దొడంగి పడమటి జామునకు వెదకి తెచ్చిన పూరికొలుచు ప్రస్త మాత్రంబు సక్తు వయ్యె. దానిని పండి వారు సమముగ బంచుకొని కుడువబోవు సమయమునకే అతిథికి యేతెంచును. ఆ బ్రాహ్మణుడు అతిథికి

**అడుగులు గడ్గి ప్రీతి యొసలారఁగ దద్దయు నెమ్మిఁ బల్కి ర**
**ప్పుడు మది పల్లవింప మునిపుంగవుఁ డాతని కాత్మభాగ మె**
**క్కు డగు వినితిఁ జూపి బుభ కుంజర నిర్ధరితార్జనంబునం**
**బడసిన యట్టి సక్తు పు కృపారతి నాకలి దీనఁ దీర్పవే.**

అని తన భాగము సమర్పణంబు సేసిన నమ్మహి సురోత్తముండా సక్తువు నుపయొగించి తృప్తింబొందలేదు. పిమ్మట సక్తుప్రస్తుని భార్య, కొడుకు కోడలు గూడ తమతమ భాగముల నిత్తురు.

**"వినుము ప్రభాత దానములు విస్తుత యజ్ఞములున్ సధర్మతా**
**వినుతికి నెక్కడ జాలవు వివేక నిధి పరిశుద్ధిఁ శోభితా**
**ర్థనమునఁ దెచ్చికొన్నది వరం బగు భాత్ర ము నర్ఘ కాలమున్**
**గని లఘువస్తు వేని నొసగం గను డు జ్జ్వలధర్మ మారయన్."**

ఆ సక్తువు గంధంబును నతిథి పాద్యజల క్లేదంబునుం బొరసి మదీయ మస్తక మొక పార్శ్వము కనకమయమయ్యె. నాడు దొడంగి యేను దాన విధి స్థలంబులకును బుణ్యాశ్రమ భూములకును వివిధా ధ్వర ప్రదేశములకుం జనుచుండుదు. తక్కటి ప్రక్క

పసిండి గాకుండె. లోకోత్తర చరితుండైన అజాత శత్రుం డశ్వ మేధంబు సేయుచున్నవాడు నా కోర్కి  సిద్ధించుననని పెద్దయు నాసతో నరుగుదెంచితిగాని యుంచుక విశేషణంబునుం గాన.". అని ఎలుగెత్తి చాటును.

సార్వభౌముని అశ్వమేధ యాగమునకు నిరుపేద సక్తు ప్రదానము తీసిపోదు. పవిత్ర హృదయమే ధర్మమునకు విలువ గల్గించును. "హింసాత్మకమైన యజ్ఞముకంటె  అహింసా మహితం బైన తపో యజ్ఞం బధికం బని వైశంపాయనుడు ఆశ్చర్య చకితుడైన జనమేజయున కెరింగించును.

'వత్సర త్రయము ప్రాతగిలిన బీజంబు లిపుడు యజ్ఞ సాధన ములు' ఇది వైశంపాయనుని వ్యాఖ్యానము. వైశంపాయన వ్యాఖ్యానమున కతీతమైన వేదాంత మీ యుపాఖ్యానమున నిమిడి యున్నది. తిక్కన యెట్టి యజ్ఞ మొనరించి సోమయాజి యయ్యెనో తెలియదు. తిక్కన సక్తు ప్రస్తోపాఖ్యానమును హృద యంగమముగ నభివర్ణిం చెను.

అనుశాసనిక పర్వమున దాక్షిణాత్య ప్రతు లన్నిటిలోఁ గన్పించుచున్న వైష్ణవ ధర్మము తిక్కన యేలకో వదలివేసెను. ఔత్తరాహ ప్రతులలో వైష్ణవ ధర్మ పర్వము లేదు. ఒకవేళ తిక్కన అనుసరించిన దాక్షిణాత్య ప్రతిలో వైష్ణవ ధర్మ పర్వము లేకపోయి యుండ వచ్చును. వాదిరాజులవారు వైష్ణవ ధర్మ పర్వము నుండి ప్రతీకల నుదాహరించిరి.

ఆశ్రమవాస పర్వమున రెండాశ్వాసములు గలవు. రెండా శ్వాసముల గలసి ౩౬౨పద్యము లున్నవి. మౌసల పర్వము ఏకాశ్వాసము, ౨౨౯పద్యములు. మహాప్రస్థానిక పర్వము ఏకా శ్వాసము, ౮౦పద్యములు. స్వర్గారోహణము ఏకాశ్వాసము, ౯౮పద్యములు. అనగా పై నాలుగు పర్వములును గలసి ౭౬౬ పద్యములు. విరాట పర్వమున మొత్తము ౧౬౨౩ పద్యములు గలవు. దీనిని బట్టి పై నాలుగు పర్వములును గలసి విరాట పర్వమున సగము కంటె తక్కువగ నున్న వనుట స్పష్టము. మూలమున గూడ ఆ పర్వములు చిన్నవే. తిక్కన పై నాలుగు పర్వములను యథోచితముగ సంగ్రహించి కథా ప్రధానముగ యథా

మూలముగనే యనువదించెను. ఈ పర్వములను సంగ్రహించుట లోఁ దిక్కన శాంత్యనుశాసనికముల వలె ఎక్కువగా సంక్షేపింపక, యుద్ధపర్వముల కంటె నెక్కుడు మూలమునకు జేరువగ నడచె ను. ఈ పర్వముల లందు తిక్కన స్వతంత్రించిన ఘట్టములు మి క్కిలి అరుదు. పాత్ర చిత్రణము నందును సంభాషణల తీర్చి దిద్దు ట యందును తిక్కన యథాప్రకారము ప్రత్యేక శ్రద్ధ వహించెను.

అచ్చటచ్చట చేసిన చిరు మార్పులు గాక, తిక్కన ఆశ్రమ వాసాది పర్వములను యథామాతృకముగనే అనువదించెనని చెప్పవచ్చును. మూలమున ఈ పర్వముల అన్నిటిలో గలిసి సుమారు ౧౬౦౦ శ్లోకములు మాత్రమే గలవు.

ఆశ్రమవాస పర్వము ధర్మరాజు శీలానుశీలనమునకు మిక్కిలి యుపకరించును. అతడు గాంధారీ ధృతరాష్ట్రులు మనస్సు నొచ్చకుండ, బిడ్డలు లేని లోటు గన్పించకుండ ప్రవ ర్తించెను. 'ధర్మజుఁ గొలువం జనుదెంచిన యట్టి వివిధ జన పతులు మును ధృతరాష్ట్రుని గొలుతురు.'

ధృతరాష్ట్రుడు, "గుళ్లు జెఱువులు గట్టించుఁ గోరి యూళ్లు లగ్రహారముల్ గావించు"ను. మూలమున నగ్రహారముల గూర్చి గలదు గాని చెరువులు, గుల్లలు తెలుగున తిక్కన చేర్చినవే. ధర్మరాజు శీలమునకుఁ బ్రతియెగమైనది భీముని శీలము. భీము డనిన ధృతరాష్ట్రునకు, ధృతరాష్ట్రు డనిన, భీమునకు లోలోపల సరి పడెదిది గాదు.

**హృదయముల నొండొరులదెస నిట్టివార**
**లయ్యు నతఁడు నతండు నన్యోన్యభాష**
**ణముల యప్పుడు మృదులవిన్యాస మొప్ప**
**నాడుదురు చుట్టములు మెచ్చునట్లుగాఁగ.**

ధృతరాష్ట్రు డేకతంబ యున్నయెడ వృకోదరుం డతనికి నింత నంత నుండి గాంధారియు వినుచుండ[1]

---

1. అథ భీమస్తు సుహృన్మ్యధ్యే బాహుశబ్దమథా కరోత్
సంశ్రవే ధృతరాష్ట్రస్య యుద్ధం సంవర్ణ యన్నివ
అను మూలమునకుం దిక్కన తెలుగు సైత భావానువాదము.

**"అంధుని కొడుకుల యందొక్కని దప్పి**
**పోనీక త్రుంచితి భూరి శక్తి**
**దర్పితంబైన మదీయ బాహు పంజరము, సా**
**చ్చిన రిపురాజన్య సింహములకు**
**వెడలంగ వచ్చునే వెంగలుఁలై వారు**
**గయ్యంబు సేసిరి గాక"**

అని పలుకు చుండును.

మూలమున భీముడు

**స్మృత్వా దుర్యోధనం శత్రుం కర్ణా దుశ్శాసనా వపి|**
**ప్రోవాచేదం సుసంరబ్ధో భీమస్య పరుషం వచః||**

అని గలదు. భీముడప్పుడు దుర్యోధన దుశ్శాసనులతో పాటు కర్ణుని గూడ జేర్చి దూషించే ననుట తిక్కన తెలుగున విడిచి పుచ్చెను. కర్ణుడు కౌంతేయుండను సంగతి భీమునకుఁ దెలియనిది గాదు గనుక, తిక్కన చేసిన మార్పు ఉచిత మని పించును.

'దర్పితంబైన మదీయ బాహు పంజరము సాచ్చిన రిపురాజన్య సింహములకు వెడలంగ వచ్చునే' యనునది తిక్కన కల్పనము. మూలమున "నాగరాజకోరోపమౌ " అను విశేషణము భీముని భుజములకు ప్రయుక్తము.

భీముని ఎత్తిపొడుపు మాటల సంగతి ధర్మనందనుండు ధనంజయుండుఁ గుంతియు ద్రౌపదియు నెఱుంగరు. కవ లొక్కక్క మా రి మ్మాటలు విని సంతసిల్లుదురు, ధర్మనందను తెఱం గెఱుంగుటం జేసి పుయిలోడి తారేమియు నాడరు.

'ధృతరాష్ట్ర గాంధారులు; కాలపర్యాయం గనికొని దెందంబు గంధ నూరకుండుదురు. మూలమున నీ భావమే గలదు. కాని సంస్కృతపు నుడికారములోని చిక్కదనము, ప్రౌఢ పద గుంఫనము వేరు. ఇంకొక భాషకు అట్టి ప్రయెగ సౌలభ్యమల వడదు.

**'సా చ బుద్ధిమతీ దేవీ కాలపర్యాయవేదినీ**
**గాంధారీ సర్మధర్వజ్ఞా తాన్యలీ కాని శుశ్రువే.**

అనునది మూలము.

ధృతరాష్ట్రుడు, పదునైదేం డ్లట్లు గడపి వనవాస గమనో న్ముఖుఁడగును. ధృతరాష్ట్రుడు, పౌరుల యనుజ్ఞ గైకొను నపుడు శాకల్యుడు (శంబు?) ప్రజా ప్రతినిధియై నెఱపిన భాషణము మిక్కిలి సముచితమైనది. అతడు మీ మహాన్వయంబున మహీవిభుల యందొప్పుమి వెదకి యైనఁ గానము, మము మీరు గన్నట్టి ప్రజల నెట్ల ట్ల రక్షించిరి రాదరమున.

**"వినుము దుర్యోధనుండు సేసిన యనర్థ**
**మొక్కటియు లేదు" అని మాత్రమే గాక**

భీష్మ ద్రోణ కృపద్రౌణి కర్ణ కృతవర్మ శల్యు లెక్క దిక్కును భీమార్జున నకుల సహదేవ ద్రుపద విరాట సాత్యకి లొక్క దెసయునై విధి ప్రేరణంబునం బోరిరి వారి వలన నఖిల క్షత్రియ సంక్షయం బావహిల్లె నది యొక్క దుర్యోధను చేతన యయ్యెనె యట్లుం గాక రణంబు రాజుల కుత్తమ ధర్మంబు కాదె యందుల మరణంబును సుగతికరణ కల్యంబు నీ సుతుండు సహాయులుం దానుసుం బుణ్యలోక సౌఖ్యంబున బొంది యున్న వాఁడు ధర్మాచరణశాలివగు నీకును సుగతిప్రాప్తి సులభంబయగు నిట మీదటికి మా భాగ్యంబునం జేసి పరమ కృపాభరితు లైన పాండవులు మాకు రక్షకులుగఁ బడసితి మాకర్ణింపుము.

**స్వర్గమైనను బాలింప జాలువారు**
**వీరలకు భూమిపాలన విధి యనంగ**
**నెంతపని వీరి చేతికి నిచ్చితిపుడు**
**మమ్ము నెల్ల విధంబుల మనిచి తధిప.**

అని పలుకును. శాకల్య బ్రాహ్మణ ప్రవచనములోని సంభాషణ చాతుర్య మంతయు మూలములో గూడ గలదు.

కుంతి గూడ, అక్క గారికి భావగారికి పరిచర్య సేయుటకై వనమున కరుగుట ఉగ్గడింప దగిన సంగతి విదుర సంజయాదు లును ధృతరాష్ట్రు ననుగమించిరి,

వనవాసమున నున్న ధృతరాష్ట్రుని జూచుటకై సపరివారముగ ధర్మరాజేగును. వ్యాసమహర్షియు గూడ నేతెంచును. వ్యాసుడు ధృతరాష్ట్రా దులకు భారత రణ మృతుల రావించి చూపును.

ఇది యొక అద్భుత ఘట్టము. తిక్కన మాటలలోఁ జెప్పవలెననిన, 'సకల జనుల నద్భుత రసమున మునుగఁ జేసె నేమనగ వచ్చు నా సంయమీంద్రు మహిమ!" శారీరక పునరుత్థానము అసంభవము కాదని వాదించువారు అధునాతనులలో గలరు. 'చూచినవారు' సాక్ష్యము చెప్పుచున్నారు. జన్మాంతరము, ఆత్మ యొక్క అస్తిత్వము మున్నగు వాదముల మాట యటుంచి భౌతికముగ 'టెలివిజన్' వలె నదియొక వాస్తవ భ్రాంతిని గల్పించు ఇంద్రజాలిక ప్రక్రియ గావచ్చును. ఏమైనను, ఇట్టి 'అతిలోక' సంఘటనకు గూడ భారతమున దృష్టాంతరము లభించుట విశేషము.

మూలమున మృతవీరుల పునరుత్థాన కథ విన్న జనమే

జయుడు మిక్కిలి అచ్చెరువంది వైశంపాయనుని

**'కథం ను త్యక్త దేహానాం పున స్త ద్రూపద దర్శనం'**

అని ప్రశ్నించి తాను తండ్రియగు పరీక్షితుని జూడ గోరును. తపో బలమున నచ్చటికి వ్యాసు దేతెంచి జనమేజయునకు పరీక్షితని, శమీక శృంగి మహర్షులను జూపించును. ఆ వృత్తాంతము మూలమున రెండధ్యాయములు. వానిని తిక్కన తెనిగింపలేదు. విదురుడు మృతుడై అతని ఆత్మ ధర్మరాజులో లీనమగుట, గాంధారీ ధార్తరాష్ట్రులు, కుంతి దావానలమున మ్రగ్గుట తిక్కన యథామూలముగనే తెనిగించెను.

మౌసల పర్వము ఏకాశ్వాసము తిక్కన యథా మాతృక ముగ ననువదించెను. మూలమున నీపర్వమున 300 శ్లోకము లున్నవి. తెలుగున ౨౨౫పద్యములు గలవు. ఇందు సీసములును గలవు. తిక్కన ఈ పర్వమును, మిగిలిన పర్వములవలె ఎక్కువగ సంగ్రహింపక యథామూలకముగనే తెనిగించెను.

మహాభారత యుద్ధము జరిగి ముప్పది సంవత్సరములు దాటిన పిమ్మట గూడ, యాదవులలో దాని దుష్ఫల విపరిణామములు గన్పింపక పోలేదు. కృతవర్మ కౌరవుల పక్షమునను సాత్యకి పాండవుల పక్షమునను బోరిన సంగతి మరువదగినది గాదయ్యేను. ఆ అగ్గి రాజుచునేయుండి, ఒకనాడు ప్రజ్వలించినది.

"ఘూర్ణి తారుణంబులయిన నేత్రముల సాత్యకి కృతవర్మ వదనంబు గనుగొని, అవమాన మేర్పడు నట్టి భంగిఁ బెలుచ నవ్వి, అరాతి బృందంబు నిద్రావశ త్వంబు బొందుటఁ బాపు వోని దుష్ట దశ నొంది యుండంగఁ దుచ్చుఁడేని నడరి వధియింపగా జాలఁ డనిన రాజ తనయుం డంత పాపంబు సేయునె" అని అధిక్షేపించును.

**అన విని దోష చిహ్న వికృతాననుఁ డై కృతవర్మ సాత్యకిం**
**గనుఁగొని సిగ్గు లేక యొరు కయ్యముఁ నీ కిటు లుగ్గడింపగా**
**జనునె కిరీటి చే నయరక శాంతత నొందిన సోమదత్తనం**
**దనుతల ద్రుంపవే మఱచితా యిసిరో యిది పోరిపాడియే.**

అనియె. తత్ఫలితము మధ్యపాన మత్తుడైన సాత్యకి తల నఱికుట అల్లే సర్వ యాదవులు మడిసిరి. అర్జునుడు వచ్చి రామకృష్ణులకు అగ్ని సంస్కార మొనర్చి, జలధిలో మునుగ సున్న ద్వారకాపురి వీడి, వెడలును. అర్జునుడు, సకల ప్రజలతో శ్రీకృష్ణుని భార్యల దోడ్కొని వెడలి నపుడు వన నిధి పురమును ముంచెను.

**అపుడు రెండవ జలనిధి యనగ జాలి**
**యుద్భుతోద్భూతవాక్యచయంబు పేర్మి**
**మ్రోయు నాజన సంఘంబు మురవిరోధి**
**మఱది నడపించే ధర్మిత మార్గఁ దగుచు.**

పై పద్యమునకు మూలమున మాతృ క మృగ్యము.

మహాభారతము నందలి అద్భుత వృత్తములలో బోయ లర్జును నొప్పి యాదవాంగనల సొమ్ముల నపహరించుట యొకటి. లోకోత్తర ధనుర్ధరుడైన అర్జునుడు బోయలచే నిర్జితు డయ్యేను. అతడు అతి ప్రయత్నమున 'నా బోయల సమర వృత్తము.

**నెట్టకేలకు నొకయెడ మాన్చి రుక్మిణి**
**యాదిగాఁ గల కృష్ణ నగ్ర మహిమ**
**లెనమంద్ర బలదేవు వనితల మఱియును**
**గతిపయ యాదవాంగనలఁ గాచె**
**అప్పుడు కాలపర్యయమున కాశ్చర్య**
**మును విషాదముఁ దన మనములోన**

చిరిగొన అర్జునుడు హస్తినాపట్టణమునకు తిరిగి వచ్చెను.

పాండవులు యాదవ వంశీయుడైన 'వ్రజని బంద్రప్రస్త మున, పరీక్షితుని హస్తినాపురమున పరీక్షితుం జట్టము గట్టి మహాప్రస్థానమున కుపక్రమించెదరు.

మహాప్రస్థానమున ఉపొద్ఘాత ప్రాయముగ నున్న ధర్మజార్జు న సంవాదము ఉదాత్తమైనది. యుధిష్ఠిరుడు, ప్రస్థానంబునకు మది యొలయ నన్నరుతోడ, "అఖిల భూతంబుల ననఘ పాకంబుఁ బొందించుఁ గాలుండు, మదీయ బుద్ధి, కర్మ సంత్యాగ కలనంబు కార్య మిప్పు డను నిశ్చయ మొందె" [1] అనును. కర్మ పరిత్యాగ వాదము ధర్మరాజు నోట శాంతి పర్వము నుండి వినుచున్నదే. అలనాడు అది ధర్మరాజు అభిప్రాయము. ఈ నాడది అతని నిశ్చయము. అలనాడు అర్జునుడు కర్మసన్యాస విముఖుడు. ఈనాడు అతని పాత్రలో ఏర్పడిన క్రమపరిణామము వికాసము. అర్జునుని సమాధానములోఁ బ్రతి ఫలించెను.

**కాలము నే మన వచ్చును**
**గాలముఁ గాలంబ పొలుఁగా కొంటికి నీ**
**లీలలు గలవే లెస్సగ**
**నాలోఁకించి తిది హితము నభిమతము నగున్.**

పాండవులు పౌర జనానుమతి గైకొను నపుడు, వారిలో కొందఱు కొందఱ నివేసనంబు లధికాభి లాషంబున నొత్తికొనుట కారణంబుగ వివాదంబు పుట్టిన సహదేవుండు కలియుగంబు

---

1. యుధిష్ఠిరః—
కాలః పచతి భూతాని సర్వాణ్యేవ మహామతే:
కర్మ జ్ఞాన మహం మన్యే త్వమపి ద్రష్ట మర్హసి

ప్రవేశించుటం జేసి కాదే యిట్టివి పుట్టెడు నని తలంచి నవ్వి, నరనాధునకుం జెప్పిన నప్పార వోత్తముండు నవ్వుచు మన మనువులు సాలునని సర్వాభరణంబు లూడ్చి వల్కలాజినంబులు ధరించినం దమ్ములు ద్రౌపదియు నట్లు చేసిరి. సహదేవుని నవ్వులో ధర్మరాజు నవ్వులో సకల భూత చరిత్రలోని అంతరార్థ పరిగ్రహణము ఇమిడి యున్నది.

మహాప్రస్థానమున ధర్మరాజాదుల వెంట నొక కుక్క యరిగెను ద్రౌపది తమ్ములు గతప్రాణులై యవనిబడినను ధర్మ రాజు అంకురరిత స్థైర్యముతోఁ బురోగమించెను. దేవేంద్రుడు ధర్మరాజున కెదురు వచ్చి స్వాగతము సలిపి విమాన మెక్కుమ నును ధర్మరాజు దేవేంద్రునితో నన్ను నత్యంత దృఢ భక్తి నాశ్రయించి పురమేను వెడలు నప్పుడు మొదల్ గా దోన చను దెంచె నీభవ్య సారమేయ మిది యటరావలదె, నా మనంబు నిష్ఠుర వృత్తికోర్వజాల దస్తోక పుణ్య నిరతాత్మ" యనును. ఆ సారమేయ రూపమున ధర్మజు ననుసరించినది యముడే. 'సిద్ధులు వినుతి సేయ దైవతా వాసమునకు నా ధర్మజుండు సనియె.'

స్వర్గారోహణము ౯౦ పద్యముల చిరు పర్వము. అందు ధర్మరాజు మానుష భావము మిక్కిలి సహజముగ అభివర్ణిత మైనది.

స్వర్గలోకమున

**"ఉన్నతాసీను డభ్యుదిత సరసి**
**జాప్త సంకాశుఁ డమృతాశనాం గనాది**
**వృతుడు వీరలక్ష్మీ విరాజితుడు సతత**
**యుక్త సుఖసాధనుండు దుర్యోధనుండు.**

అట్లొప్పియున్న యతనిం గని ధర్మనందనుండు

**ఇతఁ డతిలోఁ భోపహతమానసుడు దీర్ఘ**
**దర్శిగాఁ డితనికతమునఁ జేసి**
**నిఖిలదేశంబుల యఖిల నృపాలురు**
**ద్రుంగిరి దంతితురంగ సహిత**

**ముగ ననవద్యాంగి విగతకల్మష ధర్మ**
**చారిణి సాధ్వి బాంచాలి నార్య**
**జనములు గనుంగొన సభలోన నవమాన**
**పెట్టినతులువ యే నిట్టివాని**
**తోడ గలసి మెలగుదునె మహితాత్మకు**
**లార యెచట నున్న వారు భీమ**
**ఫల్గునులును గవలుఁ బాంచాలియును నన్ను**
**నచటి కనుపవలయు ననుచు మరలె.**

మరలినఁ జూచి నారదుండు నవ్వుచు నతని కిట్లనియె.

అమూలకమైన నారదుని నవ్వులో స్వర్గమర్త్య లోకముల అంతర మంతయు నణిగి యున్నది,

ధర్మరాజు ఆకాశ గంగావగాహనంబు సలిపిన పిమ్మట మర్త్యభావ సంకలితమై యున్న యతని హృదయము, దివ్యత్వము నావిష్కరించుకొనెను.

భారత మందలి ఫలశ్రుతి తిక్కన యథామూలముగనే తెనిగించెను.

**వ్యాస మునీంద్ర సార కరుణాతిశయంబున భారతార్థ ము**
**ద్భాసిత మైనయట్టి నుత భాగ్యనకున్ సకలాగమార్థ సం**
**వాసన మావహిల్లు జన పంక్తులు కీర్తన సేయ శశ్వదు**
**ల్లాసముఖానుభూతి నచలస్థితి నొప్పు నతం డుదాత్తుండై.**

మూలమున ఏకపాద మాత్ర శ్రవణము బ్రహ్మహత్యా పాపమును బోగొట్టు ననియు, ద్విపాద శ్రవణము అశ్వమేధయాగ ఫలము నొనగూర్చు ననియు గలదు.[1]

తిక్కన ఆ శ్లోకమును దెనిగింపక

**ఆద్యంతంబును నీయన**
**వద్యకథ వినంగ గనిన వారికిఁ బాయున్**

1. అప్యేక పాద శ్రవణాద్ బ్రహ్మహత్యా వినశ్యతి
భక్త్యా ద్విపాద శ్రవణాద్ అశ్వమేధ ఫలం లభేత్

**సద్యంబ బ్రహ్మహత్యా**
**పద్యము మొదలైన పాప వర్గం బెల్లన్.**

ఆద్యంత శ్రవణమునే ప్రోత్సహించెను.

సంస్కృత భారతము విజ్ఞాన సర్వస్వముగ నుద్దేశింప బడినట్లు మూలమునే ఆంతరంగిక సాక్ష్యము గలదు. మూలము నందలి శ్లోకము పేర్కొన దగినది.

**ధర్మే చార్థేచ కామేచ మోక్షేచ భరతర్షభ|**
**యదిహాస్తి తదన్యత్ర యన్నేహాస్తి న తత్ క్వచిత్||**

అను మూల శ్లోకమును తిక్కన

**అమల ధర్మార్థ కామమోక్షముల గుఱిచి**
**యొలయు తెరు వెద్ధియును నిందుఁ గలుగనదియ**
**యొండెడల గల్గు దీన లే కుండు చెప్ప**
**దక్కుకంటన లేదు వేదజ్ఞులారా.**

అని యథామాతృ కముగ తెనిగించెను.

ఈ శ్లోకము నందలి భావమునే నన్నయ

**ధర్మతత్త్వజ్ఞులు ధర్మశాస్త్రం బని**
**యధ్యాత్మవిదులు వేదాంత మనియు**
**నీతివిచక్షణుల్ నీతిశాస్త్రం బని**
**కవివృషభులు మహాకావ్య మనియు**
**లాక్షణికులు సర్వలక్ష్యసంగ్రహ మని**
**యైతిహాసికు లితిహాస మనియుఁ**
**బరమ పౌరాణికుల్ బహుపురాణసముచ్చ**
**యం బని మహిఁ గొనియాడుచుండ**

**వివిధవేదతత్త్వవేది వేదవ్యాసుఁ**
**డాదిమునిపరాశరాత్మజుండు**
**విష్ణుసన్నిభుండు విశ్వజనీనమై**

**పరగుచుండఁ జేసె భారతమ్ముఁ.**

అను పద్యమున వ్యాఖ్యానప్రాయముగ విస్తరించి సంస్కృత భారత ప్రశంస సల్పెను. ఈ ప్రశంస సంస్కృత భారతమునకు వలె యథాక్షరముగ దెలుగు భారతమునకును అన్వయించును.

మహాకవిత్వదీక్షావిధినంది పదునేను పర్వములఁ దెనుగుఁ బాస జగద్ధితముగ వినిర్మింపఁ బూనిన తిక్కన జీవితములో నపర సంధ్యానమయ మది. ఐతిహ్యము కూడ దిక్కన పూర్ణ పురుషా యుష జీవి యనియు, గన్నులు గనిపింపని వృద్ధాప్యమున గురునాథుని లేఖకునిగ స్వీకరించి భారతము చెప్పెనని కమ్మని కథలు చెప్పుచున్నది. అప్పటికి తెలుగు మహాభారతము రెండు వందల యేండ్ల నుండి మూలంబడి యున్నది. పండు వృద్ధు తిక్కన పదునేను పర్వములు పరిపూర్తిఁ చేయ గలడా? ముగ్గిన పండు ఎప్పుడు రాలిపోవునే! మహాకవిత్వ దీక్షావిధినొంది మహాకవి తిక్కన సల్పిన సాహిత్య తపస్సు ఫలించినది. పదునేను పర్వములు జనసంప్రార్థంబులై యుండ దుద ముట్టన్ రచియించి యొప్పెను.

చిట్టచివరి పద్యము చెప్పు నవుడు తిక్కన యనుభవించిన యానంద తన్మయ మెట్టిదో! ఊహింపవచ్చును. మహాభారతము సంపూర్తి చేసి ఫలశ్రుతిగూడ జెప్పిన మీద శౌనకాదిమునులు కథకు డగు సూతు నర్చించిరి. ఇదిచివరిమాట.

**"పరమపదా ప్తి హేతువగు భారతసంహిత శౌనకాది భూ**
**సురవరు లింపునం గరగు చొప్పునఁ జెప్పిన వారు మోదసం**
**భరితతఁ బొంది యక్కథకు నర్చితుఁ జేసి రర్మిలిన్"**

ఈ చంపకమాలలో ఈ మూడు పాదములతో మహాభారత ము పదునేను పర్వములు పూర్తియెనవి. చతుర్థపాదపూరణమునకై ఇక నేమి వ్రాయవలెను? వెను వెంటనే

**హరిహరనాథ సర్వభువనార్పిత నం దయ జూడు మెప్పుడున్"**

అని కృతార్థుడై తిక్కన, హరిహరనాథునకు ధన్యవాదము అర్పించెను. చరమ పాదము నందలి ప్రత్యక్షరమునందు పదు నేను పర్వముల 'తెనుంగు బాస దుదముట్ట; బుధసంతోషంబు నిండార' రచించి నట్టి తిక్కన జీవిత సాఫల్యము, తెలుగు వాణి కేర్పడిన ధన్యత్వము తొలుకాడు చున్నవి. ఈ చివరి పాదమున తిక్కన మహాభారత రచన సంపూర్తి చేసిన శుభ ముహూర్తమున ననుభవించిన నిర్భరానంద తన్మయత్వము నేటికిని తెనుంగు దేశ మున వెల్లివిరియుచునే యున్నది.

## ఆంగిక సాత్వికాభి వర్ణనము — చిత్తవృత్తి నిరూపణము

తిక్కన పాత్రల చిత్తవృత్తి కనువగు ఆంగిక సాత్వికాభివర్ణనము సల్పుటలో సిద్ధహస్తుడు. ఎడనెడ వాచకాహార్యాభి వర్ణనము కద్దు. అందుచే తిక్కన నాటకీయ శయ్యకు మూల పురుషడని చెప్పుదురు. నన్నయ ప్రసన్న కథాకవితార్థ యుక్తితో కథను బహుళముగ ప్రథమ పురుషలో చెప్పును. తిక్కనకు సంభాషణ చారిమ యందనురక్తి యెుక్కువ. కథను పాత్రల ముఖముననే సంభాషణము ద్వారా నడపును. అనిన నన్నయలో ఉత్తమ పురుష పద్యములు గాని తిక్కనలో ప్రథమ పురుష పద్యములుగాని లేవని చెప్పుట గాదు. ప్రాధాన్య వివక్షచే దిఙ్మాత్ర వివరణమే పై అభి(ప్రాయము.

౧. ఆంగిక సాత్వికాభి వర్ణనముచే తిక్కన, పాత్రలను సాహిత్య ప్రియంభావుకుల మనః ఫలకములందు శాశ్వతముగ హత్తుకొని పోవునట్లు, సహృదయుల మనో నేత్రముల యెదుట సాక్షాత్కరించునట్లు చేయగలడు.

౨. తిక్కన మనోధర్మ పరిజ్ఞాత. చిత్తవృత్తుల కనువగు ఆంగిక సాత్వికాభినయ వర్ణనచే తిక్కన సష్టించిన పాత్రలు ——కేవలము సారస్వతములోని కృతకపాత్రులుగ గాక —— మట్టిబొమ్మలుగా గాక —— తోలు బొమ్మలుగ గాక —— సజీవ పాత్ర ములుగ గోచరించును,

3. తిక్కన తన పాత్రలకు ప్రాణ ప్రతిష్ఠ చేయ గలడు. ఆ యా పాత్రలు పలుకు ప్రత్యక్షరము మాటున, భ్రూవిక్షేపము లలో, నయనద్యుతులలో, జీవనాడి వలె స్ర వించు రక్తపు ఆటుపోటు కన్పించును.

౪. ప్రతిక్షణ పరివర్త మానగుచున్న ఆంగిక సాత్వికావస్థలను వర్ణించుటచే తిక్కన స్థిరభంగిమలను గాక చలద్భంగిమములనే చి(త్రించును.

అందుచే తిక్కన వర్ణన ఛాయాగ్రహణము వలె గాక చలన చిత్రము వలెనుండును.

౫. అందుచే "అపారే కావ్య సంసారే కవిరేవ ప్రజాపతిః" అన్నట్లు తిక్కనకు గల కవి బ్రహ్మ బిరుదు సార్థకమైనది.

తిక్కన భారతము నందెల్లెడ, పాత్రల చిత్తవృత్తి కనువగు ఆంగిక సాత్వికాభి వర్ణనము గన్పట్టును. ఈ వర్ణన మూల భారతము నందు మృగ్యము. తిక్కన కవితా శిల్పమునకు విశిష్టతనాపాదించు ప్రధాన వైలక్షణ్యము నిదియే. తిక్కన ప్రయెగించిన నవ్వులు గూడ ఈ ఆంగిక సాత్వికాభినయ వర్ణనము నందంతర్భాగమే. తిక్కన సజీవపాత్ర సృష్టికి ప్రధాన సాధనము నిదియే. కాని, తిక్కన ప్రయెగించిన నవ్వుల నేరి పృథక్కరించి చూపవచ్చును గాని, ఆంగిక సాత్వి కాభినయ వర్ణన మంతయు నాతని కవితా శిల్పములో పడుగు పేకగ నల్లుకొని పోయి ప్రస్తరించుట కనువగ నుండదు. అంతే గాక, ఇంచుమించు తిక్కన రచనలో నధిక భాగము నుదాహరింపవలసివచ్చును.

పాత్రల చిత్తవృత్తి కనువగు ఆంగికసాత్వికాభినయము, వర్ణించు ప్రజ్ఞ తిక్కనకు పుట్టుకతోడ నేర్పడినదనిపించును. ఇతరులకు ప్రయత్న సాధ్యము అది తిక్కనకు సహజ సిద్ధము. పోతన కనుప్రాశము వలె రామరాజభూషణునకు శ్లేష వలె తిక్కనకీ యాంగికసాత్వికాభినయ వర్ణనము వశమైనది.

సాక్షాత్కరించిన హరిహరనాధునే తొలుత తిక్కన యా ప్రజ్ఞతో నారాధించెను.

**కరుణారసము వొంగి తోరగెడుచాడ్పున**
**శశిరేఖ నమృతంబు జాలువాఱ**
**హరినీలపాత్రిక సురభిచందన మున**
**గతి నాభి ధవళపంకజము మెఱయ**
**గుఱి యైన చెలువున నెఱసిన లోకర**
**క్షణ మన గరళంబు చాయ దోఁప**
**బ్రథమాద్రిఁ దోతెంచు భానుబింబము నా ను**
**రమ్మున గౌస్తుభరత్న మొప్ప**
**సురనదియును గాళిందియు బెరసినట్లు**
**కాంతిపూరంబు శోభిల్ల శాంతమూర్తి**
**నామనంబు నానందమగ్నముగ జేయ**

**నెలమి సన్నిధి నేసె సర్వేశ్వరుండు.**

ఏనును భక్తిమయం బగు సాష్టాంగదండప్రణామం బాచరించి కొండొక దొలంగి వినయావనతుండ నై లలాటోపరిభాగమున నంజలిపుటంబు ఘటించి నయనంబులు నవయవంబులును బ్రమదాబాష్ప సలిల విలులితంబులును బులకపటల పరికలితంబు నుంగా నంతంత నిలిచిన నద్దేవుండు.

**అనుకంపాతిశయంబున**
**దనదక్షిణ నేత్రమును సుధారోచియు కా**
**నను వింత లేక చూచి వ**
**దనమున దరహాసము దళు కొత్తంగన్.**

"డగ్గుత్తిక వెట్టి" "ఘూర్ణ మానమానసుండగుచు" "బాష్పజలంబులు మగుడు నింకించుచు" "పాంచాలి నాలోకించి ఖిన్నాంతఃకరుణుడగుచు" "అతనికి బుట్టిన యుత్తలపాటు గొంత దిందు వడంగ," "తన మది కరుణయు భేదంబును బిరిగొనుచుండ" "అనిన విని సంప్రీతచేతస్కుండై" విస్మయంబు గదుర" అని హర్షోత్కర్షంబున మనమలరగ బల్కి" ఇట్లుదాన తమకంబున వడిగొనుచు "అని తలంచుచు కీచకుని మాటలు గీటునం బుచ్చి" "అనుచు సింహ బలుండు తనయంతరంగంబున నంతకంత కగ్గలించు తమకంబున దన్ను దా నెరుంగక" "ఎలుంగు సలింప నిట్లనున్" "అపాంగంబుల దొరగు కన్నీరు చెవులు కొలంకులు నిండ నెవ్వగలు నివ్వటిలం దలపోయుచుండి" "ద్రుపదరాక తనయ యిట్లను దన మనమున నిండాడిన సమ్మోదమ్ము వెలి విడిసి బెడయంగన్". "మృదంబునఁ దేలి" "శోక విస్మయ పణీత చేతస్కులై యున్నంత" "ఎలమి వారల గనుగొని యిట్టులనియె" అన విని విరాటుండదరి పడి "హర్ష నిర్భరాత్ముడై శతానీకుఁ జూచి" "ఇట్టులను భ్రూకుటి ఫాలములంకరింపగన్" "ససంభ్రమంబుగా నిట్లనియె". "ఎలుగు వడక" "సవినయంబుగా నిట్లనియె" అని పలికి సంరంభంబున నినసుతు డెట్లులను "అంత కటకటబడి యెధుల కలయం గనుగొని ద్రోణుఁ డిట్లనియె. "క్రోధ ఘూర్ణమాన తారకుండగుచు నిట్లనియె". బొమ ముడి వడ నెక్కొని "ఆ ఖండల నందనుండు కెంపు కనుగవ గదురన్" "నయ ముల్లసిల్లగన్" "విషాద వేద నాదోదాయమాన మానసం

డగుచు" "హర్షసంభ్రమమున" "అనిన విని అద్భుత రసాక్రాం తంబగు నంతరంగంబునం గలుగు సందేహ వేళంబు వినయ సంభ్ర మంబుల నిగుడ పీ కునికిం జేసి చిక్కు వడియున్న నిజ జన కుని జూచి "వినయంబు మిగుల" "అంగకముల బులక లెగయ" "ప్రీతి గడలు కొనంగన్" "సంభ్రమమును నాదరమును భక్తియును నాత్మ దలకొన" మున్నగు ప్రయెగములు తెలుగు భారతములోని టంకపు పాడులే యైనను,[1] పాత్రల మనఃప్రవృత్తులను ప్రతి ఫలిం చు చున్న ముఖములకు తిక్కన యెత్తిపట్టిన మణిదర్పణములు. వివిధ సన్నివేశములలో నానా పాత్రల చలత్ భంగిమలకు చెఱగి పోని శాశ్వత ప్రతిబింబములు తిక్కన తెలుగు భారతమున నిలిచి యున్నవి.

విరాట నగరమున కేగునపుడు మార్గాయాసముచే డస్సిన ద్రౌపది ధర్మరాజుతో నిట్లనియె.

**డప్పి జనించె (వేళులపుటంబులు పాక్క దొడంగె గోళ్ళలో**
**జిప్పిల జొచ్చె నెత్తురులు చిత్తము నాకుం దగున్ వశంబు గా**
**దప్పర మిచ్చ టచ్చటను నాసల వచ్చితి నెంతదవ్వొ కో**
**యిప్పటి భంగి నొక్కడుగు నేగెడు దానికి నోర్వ నెమ్మయిన్.**

ఈ ఆంగికాభి వర్ణన మంతయు మూలనమున లేదు.

విరాటుడు ఉత్తరను నట్టువోజ్జయగు బృహన్నల కప్పగించును.

**తిగిచి కవుంగిలించి జగతీవిభుఁ డక్క మలాయతాక్షి నె**
**మ్మొగమము మొగంబునం గదియ మోపు గతాంగుళులం గపోల మిం**
**పుగ బుడుకుం బోరింబోరి నపూర్వ విలోకనమాచరించుఁ గ**
**ప్పగుమృదుమౌళి నుజ్జ్వలనఖాంకురచేష్ట యొనర్చు నర్మిలిన్.**

ఇవ్విధంబున గాదిలి కూతు నుపలాలించుట మూలమున లేదు.

సింహబలుడు ద్రౌపదిని జూచి కామించును.

**వెఱవక ననుం జూచు వీఁ డనియెడగలు**
**పించిన నొందొంద చెమట వెడమ**

1. సంస్కృత భారతమున ఆటంకపు పాడులవసరము లేదు. వైశం పాయనః ధర్మజః; అర్జునః, భీమః ఉత్తరః అని కథ యంతయు సంవాద రూపమునసే నడుచును.

**నను చితకృత్యంబు లాచరించువిధాతృ**
**బలిమికి నివ్వె ర పాటు దోప**
**నిచ్చట దిక్కు లేరెవ్వరు నా కను**
**భయమున మేన గంపంబు పుట్ట**
**జేయంగ నెమియుపాయంబు లేమి నా**
**ననమున వెల్లదనంబు గదుర**

**నున్న పాంచాలిగనుగోని యున్నరాధ**
**ముడు వివేకవిహీనుండై మదితు డగుచు**
**మదవికృతియ కాఁదన మదిఁ దలంచి**
**రాగసాగరపూర నిర్మగ్నుఁడయ్యె.**

స్వేదము, స్తంభము, కంపము మొదలగు అనుభావములు ద్రౌపదికి గల్లుటకు కారణాంతరము లున్నవి. కాని, కామార్తుండైన కీచకుడు వానిని మన్మధావస్థలుగా భావించును.

తిక్కన మనోధర్మ పరిజ్ఞానముల కీ పద్యము గీటురాయి.

కామార్తుడైన కీచకుడు తనకు సైరంధ్రిని గూర్పుమని అక్కనైన సుదేష్ణనే అర్ధించును. ఆమె అతనికి సయమునను భయమునను బుద్ధులు సెప్పి చూచినది. కాని లాభము లేకపోయి నది. అతడు అసలే గర్వోన్మత్తుడు. దానికి తోడు ఇపుడు మోహంధుడు. అవే, "వీని కెమ్మెయిం జాఁవు నిజంబు మన్మధుని శాతశతంబుల నైన నక్కటా" అని దుఃఖించినది.

**అని మనమునఁ దలపోయుచు**
**దన తమ్మని నల్ల నెత్తి దందది దొరఁగం**
**జనుదెంచునశ్రుపూరము**
**కనుగవలో మ్రింగికొనుచు గామిని పలికెన్.**

ఆమె దందది దొరగం జనుదెంచిన అశ్రుపూరమును కను గవలో మ్రింగినది. అల్పాక్షరముల అనల్పార్ధ రచనకు, ఉత్తమ పాత్ర చిత్రణకు, కవితా సమాధికి, తెలుగు నుడికారములోని తీరు తీయములకు, చిత్తవృత్తి కనువగు ఆంగికసాత్వికాభివర్ణనమునకు ఈ కంద పద్యము ఉజ్జ్వలోదాహరణము.

వచ్చిన కన్నీరు కనుగవలో మ్రింగికొనుట — పాపము సుదేష్ణ! అనిపించును. చెప్పినను వినిపించుకొనని గర్వోన్మత్తుండు. ఆమె నిస్సహాయత—భ్రాతృవాత్సల్యముతో కలిసి కన్నీరుగా రూపాంతరము చెందినది. ఇట్టి వర్ణనము — ఆంధ్ర సాహిత్యమునందే గాక — విశ్వసాహితీ జగత్తులో గూడ అపరూపములే.

సుదేష్ణ సైరంధ్రిని కీచకు నింటికిఁ బోయి కల్లు దెమ్మనను. సైరంధ్రి తప్పించుకొనఁ జూచినది. లాభము లేకపోయి నది.

"మన మురియాడుచుండ ననుమానముతోన సుదేష్ణఁ జూచి," యామె యిచ్చిన కాంచన చషకంబు పుచ్చుకొని చారు విలోచన అర్థమూర్తియె బయలు దేరినది.

**అలమటఁ బొందు మాయవిధి యా యని దైవము దూఱు నిత్తఱిం**
**గలరొకో నాకు దిక్కను మొగంబున నశ్రులు వెల్లిగొల్పు దో**
**ట్రిలంబడు జల్లనం జెదరు డెందము గూడఁగ దెచ్చి నన్నుఁగే**
**వలమున ముట్ట నెవ్వరికి వచ్చు ననుం గలగున్ వెనుంబడున్.**

అట్టియెడ

**దైన్యంబుతలపోత దలకొన్న జెలువ కా**
**నన మున వెల్లిదనంబు గదిరె**
**భయరసవేగంబు పైకొని ముట్టినఁ**
**గాంతకు దనులత గంప మడరె**
**బెగడంత కంతకు మిగిలిన నింతికిఁ**
**బదముల నట దోట్రు పాటు బెరసె**
**దల్లడం బొందినఁ దన్వికి నవయవం**
**బుల నెల్ల ఘర్మాంబుకళిక లెసఁగె**

**దలంకు పుట్టఁ గొంకు గొలందికి మీఁరవె**
**న్నాటు దోఁచె ముట్టుపాటు దొడరె**
**వెరగుపాటు దనికి నెర నాడె నువ్వనె**
**వ్వగలువగల నీనె దిగులు వొదిమె.**

ద్రౌపది చిత్తవృత్తిని, ఆమెలో ఏర్పడిన ఆంగికావస్థా విపరిణామములను తిక్కన అత్యద్భుతముగ వర్ణించెను.

కీచకుని యాగడము నంతయు స్వయముగఁ జూచుచున్న విరాటునితో పరాభవఖిన్నయైన పాంచాలి మొరవెట్టుకొనును. అతడు కీచకుం గినియగా సత్యము లేనివాడు. ఊగ్రు డైన భీముని ధర్మరాజు నయనాకారంబున వారించి యుండెను, గాని, యాతనికి గూడ మిక్కుటమైన దోషము వచ్చి యున్నది. కాని అది సమయము గాదు. అందుచే "నిర్వికారుడై, యెప్పుడుఁ దాను బల్కు నెలుగేర్పడ ద్రౌపదితో" నామెను సుదేష్ణ సదనమునకుఁ బొమ్మనును. ఆ సన్నివేశము నిర్భరావేశపూరితమైనది.

**అప్పుడు ధర్మసూతి హృదయంబు కలంగ లలాటభాగమున్**
**గప్పఁగ ఘర్మవారి యధికం బగుదోషము నొంది యుండియుం**
**దప్పఁగ ద్రోచికొంచుఁ దన ధైర్యము పెంపున నిర్వికారుడై**
**యెప్పుడుఁ దాను బల్కు నెలుఁ గే ర్పడద్రౌపదితోడ నిట్లనున్.**

మూలమున యుధిష్ఠిరస్య కోపాత్ తు లలాతే స్వేద ఆసవత్ అని మాత్రమే గలదు. సంస్కృతమున ధర్మరాజునకు తెలుగున ధర్మరాజునకు స్వేదము మాత్రమే సమానధర్మము. తెలుగు ధర్మరాజు నిగ్రహము, నిర్వికారత, తన్మూలమున ఆ పాత్రమున కేర్పడిన ఉన్మీలనము—తిక్కన కల్పించినవే.

**తలకు నలందురున్ నవయు దాపభరంబున వెచ్చనూర్పు మే**
**నలయఁగ నొల్లుబోవు వెగడందు గలంగుఁ బరిభ్రమించుఁగోం**
**దలపడుఁ దల్లడం బడరి ధైర్యము దూలిన బెగ్గడిల్లు వి**
**చ్చలవిడిఁ బేర్చు నెవ్వగలసందడి దెందము గంది చేడ్పడున్.**

మఱియు నక్కో మలివలని ప్రేము డిం దగిలి

**పొడసూపిన నైన వడిఁ బట్టసమకట్టి**
**పరికించి కానక బమ్మరించు**
**మెలగినయట్లైనఁ బలికింపఁ దలచి ని**
**రూపించి లేమి నశ్రువులు వహించు**
**గదిసిన యట్లైనఁ గౌగిలింపఁ గదంగి**
**యారసి బొంకైన నలత నొందు**

**నొడఁబ్రడ్డయమ్మైన నడరిపై కొనఁ జూచి**
**చెన్నట్టి యగుట నిశ్చేష్ట బోరయు**

**లలితవివిధవిహారంబులకు లతాంగి**
**యెలసి సొలసినయట్లైన నెలమిఁ గలసి**
**యభిమతక్రీడ సలుపంగ నప్పళించి**
**వెదకి రిత్తబయల్ గని విహ్వలించు.**

భీముని పాత్రకు తిక్కన కల్పించిన ఉన్మీలనము పేర్కొన దగినది కీచకుని సంహరించుటకు నర్తనశాలకు భీముడు తరలును.

**గమనమువీక వేరుక వికారము పుట్టఁక సంగరోత్సవో**
**ద్యమ రభసాతిరేకము బయల్పడుటించుక లేక రోషసం**
**భ్రమమొక యింత యైనఁ దళుకున బరభావనిరూప్యము గాక ద్రౌపది**
**రమణుడు వోయె విక్రమధురంధరతం దగ నాట్యశాలకున్.**

కీచక వధానంతరము సోదరుని మృత కళేబరమును గాంచి ఉపకీచకులు విలపించుటను తిక్కన చిత్రించిన అద్భుత చిత్రములలో నొకటి.

**కడువేస వచ్చి రూపరిన కాయము నున్న తెఱంగు జూచి భి**
**ట్టడలు మనంబులం గదిరి హాయనువారును జోద్యమందిమ్రా**
**న్పడియెడువారును నగ్ర జునిపైఁ బడి మూర్ఛల బొందువారు న**
**య్యెడ కరుగంగ నొర్వక మహిం బెఱచో బలవించువారు నై.**

ఉపకీచకులు ద్రౌపదిని గూడ అన్నగారి చితిపైఁ బెట్టి దహింప యత్నించిరి. భీముడామె అర్తనాదముల విని పరేత భూమి యొద్ధ, ఒక యున్నతావనీజంబు వెరికి రౌద్రాతిరేక మదర నిల్చియుండెను.

**వికట భ్రూకుటిఫరో షపా ల కలిత స్వేదోద్బలుండుం జల**
**ద్వికృతోష్ఠద్వయుడుం బ్రమర్దనదశావిద్భావ సభావితాం**
**గకుడుం జిత్రవిదా హదోహలసమగ్ర క్రోధవేగుండై నై**
**బక విధ్వంసకుడయ్యెడన్ నిలిచె శుంభన్మూర్తి విస్ఫూర్తితోన్.**

మూలములో లేని యా చిత్రణము తెలుగువారి సొంత సొత్తు

దక్షిణ గో(గ్రహణమున సుశర్మ బారినుండి తన్ను విడిపించిన పాండవులను విరాటుడు సంభావించును.

**ఆదరము సంభ్ర మంబును**
**మోదంబును దనమనమున ముప్పిరిగొన నా**
**భూదయితుడు వివిధప్రియ**
**వాదంబుల గారవించె వారలనెల్లన్.**

'అంతిపురమ్ములోన గల అంగన లందరి ముందర' యెత్తున గొందు కౌరవుల నెల్ల' యని దర్పములు పలికిన ఉత్తరుడు భీష్మ ద్రోణ కృపాది ధన్వి నికరాభిలమైన కౌరవ సైన్యమును జూచును. మూలమున "ఉత్తరః" అని మాత్రమే యున్నను తిక్కన

**కని యుత్తరుండు గురుపా**
**రిన మేనును దలకు మనము రిచ్చవడినఁ చూ**
**పున నై తొట్రు పడుచు ని**
**ట్లనియె దిగులు సొచ్చి యా బృహన్నలతోడన్.**

ఉత్తరుడు, ఆననంబు పల్లటిల్ల మానసంబు తల్లడిల్ల

**శరములు శరాసనమయ న**
**య్యరథమముపై డిగ్గవిడిచి యతిరభసమునన్**
**ధరణికి లంఘించి వెసం**
**బురిదెసకును లజ్జ వీడి బోవంబాఱెన్.**

పురుహూత పుత్రుండు పదశతమాత్ర ప్రదేశ పలాయితుం డైన భూమింజయు నెయిది పట్టుకొనిన నతండు

**వెలవెల బాఱుచు వేగడొందు బెదవుల**
**తడి యాఱి నెంతయుఁ దల్లడిల్లుఁ**
**జల్లన నంగంబు లెడ్ల నిండ జెమర్చు**
**బదములుఁ గరములుఁ గుదియపడకు**
**హృదయంబు తటతట నదరఁగ బెలుకురు**
**దీనదృష్టుల మోముఁ దేరి చూచు**
**నెలుగు దిగ్గధికఁ దొత్రెల నేడ్చు విడుమని**
**ప్రార్థించు మాట గీడ్పాటుదోప**

**నిష్క శతసుద్ధ హేమంబు నిర్మలోజ్జ్వ**
**లాష్ట వైడూర్యములుఁ దురగాఢ్య రథము**
**గరటిదశకంబు నొకయూరు బురము నొచ్చి**
**నపుడ యిచ్చెద నీ కను నార్తుఁ డగుచు.**

మానవవమానసమును క్షీరసాగరము వలె మధించిన ఇంగితజ్ఞుడు మహాకవి తిక్కన

మూలములో లేని యిట్టి చలద్చంగిమల వర్ణనములు, తిక్కన కవితాశిల్పమునకు అనన్య సామాన్యవైలక్షణ్యమును ఆంధ్రమహాభారతమునకు దేశభాషల యం దెనఁ లేని గౌరవము సిద్ధింప జేసినవి.

ఉత్తరాభిమన్యులు మంగళతూర్యంబుల మధ్య తెరయెత్తి నపుడు పరస్పరాలోకనము సల్పిరి.

**వరుచూడ్కి ముద్దియ వదనంబుపైఁ బాఱి**
**తివుటమై నునుఁగాంతి తీపు గ్రోలు**
**సుందరిరత్నంబు చూపు మనోరమ**
**నడుగుల యొప్పుపైఁ నల్ల నడరు**
**బతివిలోకనములు పడతుక మైదీవ**
**గలయంగ బలుమఱు మెలగుచుండు**
**వెలది కటాక్షముల్ విభునిపైఁ గ్ర మమున**
**నెగసిమోమునఁజోకి మగిడివచ్చు**

**నొండొరువుల లేఁజెమ్మట నూని వ్రేగు**
**పడిన చాడ్పున నవయవభంగులందుఁ**
**దగిలి మఱుపున దడయ నిద్దఱ విశాల**
**నయనదీప్తులు నెఱుకువ బయలుపడగ .**

మనోధర్మ పరిజ్ఞాతైన తిక్కన కన్నులకు క్షణములో వేయి ఛాయా చిత్రములు తీయగల శక్తి గలదు.

విదురుడు ధృతరాష్ట్రునకు నీతి నుపదేశించును, మో మోటమి విడిచి, "వినుమీను లోలతన్ గ్రక్కున నా మిషంబు చవి గాలము మ్రింగిన చాడ్పు నూవె" "తమ్ముని భాగ మీక నీ వెక్కటి మ్రింగ జూచె దది యెట్లరుగన్" అని సూటి ప్రశ్న వేయును.

**"అనిన విని నిరుత్తరుండయ్యు**
**మనుజేంద్రుడు గొంత సేపు మ్రా న్పడి తలపుల్**
**పెనఁగొన నిదాహనిమ్**
**దమ వలయగ విదురతోడ దా నిట్లనియెన్.**

ధృతరాష్ట్రుడు పడిన మనోవేదన — అతని ముఖము నందు ప్రతిఫలించినది. రాజ్యము లేని ధర్మరాజు ఎవ్వరిగొని కౌరవులపై నెత్తిరా గలుగు వాడని ధృతరాష్ట్రుడు సంజయుని ప్రశ్నించును.

"అనిన విని సంజయుండు వెచ్చ గూర్చి రిచ్చవడి మూర్చపొయిన చందంబున దెందంబు మొగుడం జేష్టలు దక్కి యుండి కొండొక సేపునకు జిత్తంబొక్కింత చేసికొని యక్కటా భూపాలుండింత చేల యగునే యుధిష్ఠిరుండెవ్వరిం గాని యెత్తి వచ్చువాడని యడుగుచున్నావా. డింత యెరవంగని వాడెంత సెప్పినను దెలియ నెర్చునే" అని తలపోయును.

ధృతరాష్ట్రుడు భీముని పరాక్రమము దలపోయుచు

**భూమలలక్కన్ ముదివడ్డ రౌద్రరస ముప్పొంగం దనర్పన్ భుజా**
**గ్ర ముళిం దెవ్వడు నాకు మా అనుచు శౌర్యస్ఫూర్తి శోభిల్ల దు**
**ర్దమతీలంగవియంగ భీము గని ధైర్యంబేది కౌరవ్యఁ సై**
**న్యము లంతంత గలంగ బారినటు లై నా మోమునన్ వ్రే ల్మిడిన్.**

ధృతరాష్ట్రుని మనో నేత్రమునకు సాక్షాత్కరించిన భీముని రౌద్రా కృతి తిక్కన పద్యమును చదివిన సహృదయుల మనో నేత్రముల ముందును పొడ గట్టును.

ద్రౌపది కృష్ణునితో దను మున్ను పడిన భంగపాట్లు చెప్పునపుడు

**ధర్మనందను పలుకులు దనకు హృదయ**
**తాపమొనరింప మోమున దైన్యమొంద**

**నున్న పాంచాలి యిట్లని యొ య్య బలికెఁ**
**గనలి శౌరితో గద్గద కంఠి యగుచు.**

"వాడిసూది మొన యించుక మోపిన యంత మాత్రమున్ భూమి పాండు నృప పుత్రుల కిత్తునె" యని దుర్యోధనుడు తన నిశ్చయము దెలుపును.

**అనిన విని కిన్క బూనిన యలతి నగవు**
**చెలువు మొగమున కొక క్రొత్త పాలుపొనర్ప**
**బుండరీకాక్షుడగు టెల్ల బోయి యప్పు**
**డరుణ కమలాక్షుడగుచు మురాంతకుండు.**

దుష్టచతుష్టయము శ్రీకృష్ణని బంధింప దలపోసిరి. అయ్యె వ సరంబున

**ఆడకువ లేమి నల్క యూరి యాడుట నొండొరులు గూడ కుండుటన్**
**బుడిబుడి మాట లాడుటను బోషుచు వచ్చుచుం (గందు గ్ర మ్మఆం**
**బడుటను దెల్లమైన మును పన్నుగం దా బరికించి యుగ్రిక్కన**
**ప్పుడు హరిఁ బట్టు సంకులము వుట్టుట సాత్యకి నిశ్చ యించుచున్.**

శ్రీకృష్ణుడు చక్రము ధరించి భీష్మునిపై కురుకును.

**పులిం బోడగన్న వెల్ల గమివేలే సుయెధనునగ్ర సైనికుల్**
**దలఁకి కలంగి నివ్వేఆగు దన్కిన జేష్టలు దక్కి చిత్తరూ**
**పుల క్రియనుండి రకుక్రరు విభుండును మాఱు దలంప లేని కొం**
**దలమునఁ బొందుడెందమునఁ దానును రూపటి యుండె వెల్లనై.**

అని ఆంగికాభినయము చేర్చును. పై పద్యమునకు మాతృక మూల ములో లేదు.

ద్రోణాచార్యుని మరణము విని ధృతరాష్ట్రుడు విలపించును. అనిన విని యాంబికేయుండు హృదయంబు జల్లనఁ జెదర వదనంబు వెల్ల నయి మొగుడ నివ్వెఆగంది కొండొక సేపు నిశ్చేష్టితుండై యుండి గద్గదవికలకంఠుం డగును.

మూలమున ధృతరాష్ట్రుని విలాపము విస్తరించియున్నది. దానిని "అని పలుమాటలాడి యొల్లం బోయి యాలోలన కొంత దెప్పిరి యంగబులు వడంకుచుండ మఱియు నమ్మానవేశ్వ

రుండు సూతనందనునకిట్లనియె" అని తెలుగున తిక్కన సంక్షే పించెను. యుద్ధ మధ్యమున

**"ఘనతరకోప వేగమునఁ గన్నుల నిప్పులు రాల సత్య జి**
**త్తమవు వృక్రాంగమున్ విశిఖ ధారల ముంచె గురుండు"**

ద్రోణుని వర్ణించునపుడు అతని కోపము, కన్నుల నప్పులు రాలు నట్లుండుట తిక్కన పలుమరు వర్ణించెను.

అభిమన్యు పరాక్రమ కథనము విని ధృతరాష్ట్రుడు సంజ యునితో ననిన మాటలివి.

**మనమున ఖేదము మోదముఁ**
**బెనగొనియెడు మద్బలంబుఁ బీడించెడు నా**
**మనుమడని వినికి నాతని**
**యనిపని యటమీఁద నెట్టు లయ్యెంజెపుమా.**

వృష సేనుం డభిమన్యుం దాకి 'రభసంబున నతనిం బటు శరంబుల' నొంచును.

'నొంచినఁ గెంపు సొంపునఁ గనుంగవ యొప్పఁగ సూతుఁద్రుంచి విల్ద్రుంచి

మేను నొప్పించినఁ జేరితోడ నఱపీసుగు నీడిచి కొంచు' తురగములు పారిపోయెను.

రుక్మరథుండు అభిమన్యుని దలపడి తొమ్మిది యమ్ము లురమ్మున భుజమ్ముల రెండును నాటించి వెండియు వేయ గడంగు నెడ నా సుభద్రాసూనుండు.

**శరముతోడ నొక్క కరము చాపముతోడ**
**నొకటి బొమలు గదిసియున్న యుగ్ర**
**రేఖతోడ దల ధరిత్రిపైఁ బడ నేసె**
**రయము మెఱయు బటు శరత్రయమున**

దుశ్శాసన సూనుండు సరభసంబుగ గలిసి అభిమన్యుని నొప్పించినం జంచదరుణ కమల లోచనుండగుచు సౌభద్రుండ తనిఁబ్రదీప్త సప్త నారాచ నిపాత పీడితుం జేసెను.

సైంధవ వధకు ముందు ప్రతిజ్ఞ చేయుచున్న అర్జునుని వర్ణన మరయ దగినది.

**అప్పుడు గరచి యెర్ర నగు నానసంబుతో**
**బొమలు ముడిచి చెమట పొడమ మేను**
**కంప మొంద గనలు గదిరిన కిరీటి న**
**వ్వెసక మెసగ నన్నుకిట్టు లనియె.**

అర్జుని ప్రతిజ్ఞ విన్న సైంధవుడు, 'ఏ నొకరుండ నే తనకు నెగ్గొనరిచితి' నని చింతించును. మఱియును

**పెదవులు దడుపుచు గాల్లున్**
**గుదివడ వడకుచు మనంబు గొందలపడగా**
**నిదియేటిమాట లాడెద**
**దుది బార్థుడు గానకుండ దొలఁగన వలయున్.**

అర్జునుడు స్వప్నమున గైలాసమున కేగి పాశుపతంబు వడయును. అప్పుడు పార్థుండు 'పులకపటల పరికలితదేహుం' డగును. భవునిచే సాదరానుజ్ఞవడసి, శౌరి ఫల్గునులు అతనికిఁ బ్రణమిల్లి బహుల రోమహర్షసంభృత గాత్రులై యరుగు దెంచెదరు. సైంధవ వధానంతరము కృష్ణార్జునులు ధర్మరాజు కడ కేగుదురు. ధర్మరాజు

**రథము డిగ్గి హర్ష్యాశులు గ్రమ్మదేర**
**నెదురుకొనుటయు సంభ్రమమెసక మెసంగ**
**బార్థుడును గేశవుండును బాదచారు**
**లై రయంబున జని మ్రొక్కిరవ్విభునకు.**

ఇట్లు ప్రణమిల్లిన

**నరపతి యానందాశ్రులు**
**గర సరసిరుహముల నొత్తి కను దనియగ న**
**య్యిరువుర బూనుచు మేనులు**
**గరుపారగ గుచ్చి యొక్క కౌగిట జేర్చెన్.**

సాత్యకియును భీముడును "దనువుల గ్రొత్త గంట్లు గొమరారనద్ధరణీపతి చరణంబులకుం బ్రణతులైరి.

భీముడు దుశ్శాసనుని సంహరించు పట్టున తిక్కన భీమ సేనుని రౌద్రాకృతిని గన్నులకు గట్టినట్లు వర్ణించుట పూర్వోక్తము.

అర్జునుడు వృషసేనుని సంహరించిన విధముగూడ బేర్కొనదగినది.

**భృకుటిస్ఫూర్జితఫాలభాగుడగుచుం బొంగారి యా సూతపౌ**
**త్రకుకోదండము బాహుదండములుం జిత్రస్ఫూర్తి దున్మాడిమ**
**స్తక ముగ్రోద్ధతిం గ్రూరభల్లవిలసద్ధారాహతిం ద్రుంచె బా**
**ణకళాదుర్ధమునంరుండు పతియు న్నా ధేయుడుంజూడగన్.**

దుర్యోధనుని మరణ వృత్తాంతము ధృతరాష్ట్రుని కెరిగించు టకై యేతెంచును, సంజయుడు

**పారిబోరి మోము బాష్పజలపూర్ణము గ్రమ్మగ నూర్ధ్వ బాహుడై**
**చరణయుగంబు దొట్టువడ సంభృతశోకత రాజవీధి నె**
**వ్వరి గనియైన హే మహిత వైభవ! హేధృతరాష్ట్ర పుత్రా! హే**
**కరిపురనాథ! యంచెలుగు గద్గదికందగులంగ నేడ్చుచున్.**

యుద్ధానంతరము ద్వైపాయన హ్రదసమీపమున సంజ యుండు దుర్యోధనుని గాంచినట్లు ధృతరాష్ట్రునికెరింగించును.

**"అతనిం గాంచితి నత్డుకు లదర నడలు**
**చూడ్కి నామోము చక్రగా జూడకోర**
**వేవం జూచుచు దీనతం బొందు నునికి**
**గని మనంబున శోకంబు గదుర నేను.**

ఒక్కంత సేపు వలుకు వెలువరింప జాలక యూరకుండి యొట్టకేలకెలుంగు దెచ్చుకొని పారాశర్యప్రసాదంబున బ్రదికిన తెఱంగు సెప్పిన నమ్మహీకాంతుండును గొంత ప్రొద్దు నిశ్చేష్టితుం డై యుండి పదంపడి నాదెస జూచి మనదెస బ్రదికిన వారు గలరే యనిన గృపాచార్యాదిరథిక త్రయంబును జేరుకొని వారలు బ్రదికి పోయిరి తక్కొరుండును బ్రదుకుట లేదని యెరింగించిన నిష్ఠూర్పు నిగిడించుచు నామూఁపుపైన జేయిడెను.

సంజయుడు శిబిరమునకు వచ్చినపుడతడు గాంచిన దృశ్యము హృదయవిదారకమైనది.

**కలగొన బాఱుచున్ సతులు గన్నుల నశ్రుజలంబు లొల్క వీ**
**పులపయి పెన్నెఱుల్ విరియ బొడ్మగ లాలలు రోదనధ్వనుల్**
**సెలగగ మోములం దలలు జేతులుం గెంపుగ మోది కొంచు భ**
**ర్తల సహజన్మలన్ సుతుల దండ్రుల బేర్కొని యార్తి నొందుచున్.**

స్త్రీలు నేలం బడి పొరలుచు లేచుచునికి నా దృశ్యము అత్యంత కరుణంబై యుండెను.

ద్వైపాయనప్రదములో నుండి, బుట్టలోపలి భుజగేంద్రుడు రోజునట్లు రోజుచు దుర్యోధనుడు బయల్వెడలును. అతని గనుంగొని పాంచాలురును బాండవులును

**చిరుతనగవుతో నొండొరు చేత లప్ప**
**ళించి నిర్భరసంతోషలీల నొప్పి**
**రమ్మహీనాథుడయ్యపహాస మెరిగి**
**బొమలు ముడివడ గనుంగవ బొడమం గెంపు.**

కోపావేశంబు నొంది యుద్వృత్త తారకంబుల నెల్ల నాలోకించి, "మిమ్మిందరను మహిభాగమున గూల్చెద, నా గద బలు పెట్టులైన నగు డందాకన్"

**అనుచు బోటుల దొరుగురక్తాంబుధార**
**లంగమెల్లను గప్పిన నప్పు డొప్పె**
**గావిసెలయేరు లెల్లెడ గలయ బర్వ**
**బొలుచుకులపర్వతంబు చాడ్పున నతండు.**

ఘోరాకారుండై నిలిచెను.

శాంతి పర్వారంభమున నందు, నిర్వేదవిహ్వలుండైన ధర్మరాజుతో, నర్జునుడు అశ్వమేధయాగము చేసి పరిపూతాత్ముడవు గమ్మని యుద్బోధించును.

ధర్మరాజు

**వెడ వెడ నప్పులుకులు చెవి**
**నిడి కొండొక సేపు చింత యెసకంబున పా**
**ల్పడి యూరకుండి చిత్తం**
**బడలున జిక్కువడ నెట్టులను నర్జునుతో.**

పై ఆంగికసాత్త్వికాభివర్ణనము మూలమున లేదు. తిక్కన జంతువుల యాంగికసాత్త్వికానుభావ వర్ణనములు గూడ మనుష్యుల కట్లే సల్పుట శాంతి పర్వమున వ్యాఘ్రగోమాయు సంవాదమున గాననగును.

**అనవుడు నక్క రా బనిచి యప్పులి గౌ గిట జేర్చి బాష్పము**
**ల్గనుగవ గ్రమ్మనుంబలుకులం దగ బెద్దయు గారవించిన**
**న్వినుము మృగేంద్ర మున్నుటుల నీవు సభన్ నను వీడు మంచివా**
**డని కొనియాడి యిప్పు దెగటార్చితి పెంపును నాదుమానమున్.**

ఎడ నెడ టంకపు బోడుల వలె నతికిన అలతి యలతి మాటలతో గూడ తిక్కన ఆంగికసాత్త్వికానుభావవర్ణనము సలుపు చుండును.

సంజయుడు, పాండవుల యొద్దకు రాయబారియై యరిగి తిరిగి వచ్చి కౌరవ సభ చొచ్చి, సముచిత ప్రదేశంబున గూర్చుండి "తన మాటలు వినుటకు జిడిముడి పడుచున్న కొలువు గల యం గనుగొని" పలుకును.

"ధృతరాష్ట్రుండర్జునుడేమనియెనని యడిగిన నతనికి సంజయుం డిట్లనియె.

**నరుడలుక వొడమియును సు**
**స్థిరుడై తన యొఱ్ఱి సెరల చెలువున గెందా**
**మరలందెగడెడు కన్నుల**
**నరుణచ్ఛవి నెఱయ నిష్ఠులనియె నరేంద్రా"**

ద్రుపదుని పురోహితుడు ధృతరాష్ట్రుని "పేరోలగంబున సమస్త సేనాపతులంగలయం గనుంగొని," తన రాయబారము విన్పించును.

"ఆకౌరవేంద్రుండు ధృతరాష్ట్రుడు యుద్ధమునకు ముందు కొండొక సేపు చింతించి నిట్టూర్చి నిగిడించి" సంజయున కిట్లనియె. సంజయుని వలన భీష్ముని మరణ వార్త విని "చిత్తంబు జల్లని యొల్లంబోయి మూర్చిల్లి కొండొక సేపునకు శిశిరవిధా నంబుల సెదదేఱి ధృతరాష్ట్రుండు గన్నీరు దొరంగ గద్గద కంఠుండై" వలవించును.

"ప్రమదంబానకకాంతి గోత్ర వరుపం" "గదాద్యాయు ధోగ్ర మరిచి ప్రకరంబునుగలిసి చిత్రస్ఫూర్తి శోభిల్లగ" భీముడు సమరక్రీడకు వచ్చెను.

శ్రీకృష్ణుని విశ్వరూప ప్రదర్శనమును "గనుంగొని ధనంజయుండు విస్మయరోమహర్షణ ప్రహర్షోత్కర్షంబులతో" దండ ప్రణామంబు చేసి నిలుచును.

శ్రీకృష్ణుడు అభిమన్యుమరణానంతరము చెలియలి మందిరమునకరిగి, పురపుర బొక్కెడు నా సుభద్ర గాంచి యిట్లనియె"

**"కడువడి వీరధన్యుడు ద్రిగర్తులు వొంగగ దృష్టకేతువిల్**
**నడిమికి ద్రుంచినన్ మొగమునం దళుకొత్తెడు కెంపుసొంపుతో**
**జిడిముడిపాటు లేక యతి శీఘ్రమునన్ ఘనశక్తి నాత డె**
**క్కుడు ముదమొప్ప నానృతి గూలగ వైచె సురల్ నుతింపగాన్."**

భీముడు కౌరవసేనలం జెండాడుచున్నపుడు కర్ణుడు అడ్డు పడి, 'దర్పము సిగురొత్త' ముప్పది శరంబుల నొంచును. "గెంపు సొంపు వక్త్రమునకునొప్ప సేయగ" భీముడాతని విల్లుద్రుంచి సారథి ప్రాణముల గొనును.

గరుడుడు "ఉద్భటరోష మహోగ్ర మూర్తియై" విజృం భించును.

అధిక్షేపింపంబడి కర్ణుండు గోపించి కెంపారు కన్నుల నా శల్యునాలోకించెను.

"అలుక పెంపునం గన్నుల నిప్పుల రాల మరలి కనుంగొని" జామదగ్న్యుండు కర్ణునితో బలికెను.

"అనిన విని మొగంబు మురకటించుకొనుచు గద్రువ గరుత్మంతున కిట్లనియె!"

మున్నగునవి తిక్కన యొడనెడ నతుకుచుండును.

# ఆంధ్ర మహాభారతమున ప్రతిఫలించిన తిక్కన నాటి తెలుగు సంఘము

తిక్కన అనుసరించినది సంస్కృత భారతమే యైనను, తెలుగు నానుడులు, పలుకు బడులు తెలుగు భారతమున తామర తంపరలు. తిక్కన భారతము తియ్యని తెలుగు దనముతో గుబాళించుటకు మఱియొక హేతువు అందు ఎడనెడ ప్రతి ఫలించుచున్న తెలుగు సాంఘిక వృత్తములు. తెలుగు సంప్ర దాయములు. తిక్కన వ్రాసినది ద్వాపరయుగము నాటి కథ, మూలము సంస్కృత భారతమే యైనను, అచ్చటచ్చట తెలుగు దనము తొంగి చూడకుండుట సహృదయులు గుర్తింపగలరు. ఇవి సంస్కృత భారతమున దాక్షిణాత్య ప్రతిలో గాని — ఉత్తరాహ ప్రతిలో గాని కన్పింపక పోవుట చేతను, ఇతర సాక్ష్యముల వల్లను, ఆంధ్ర సాంఘిక వృత్తములుగా సులువుగా గుర్తింపదగినవి.

## <u>రాజ లాంఛనములు</u>

ధర్మరాజు సన్యాసి వేషమున విరాటుం గొల్వ వచ్చెను. విరాటుడతనితో మూర్ధాభిషిక్తుని లక్షణములను గుర్తించును. గాని రాజ లాంఛనములు గన్పించుట లేదని వర్ణించెను. ఉండ వలసిన రాజ చిహ్నములను విరాటుని నోట తిక్కన అభివర్ణించెను.

**కరచరణాద్యంగకంబు లేలొకొ రత్న**
**భూషణ ప్రకరంబు పొందు దొఱగి**
**నుభయపార్శ్వంబుల నిభఘటలేలొకొ**
**చనుదెవు సమదాళి సమితి మొఱయ**
**బాయు తొలంగు మందాయత వేత్రహ**
**స్తుల మొత్తమేలొకొ తోడ రాదు**
**ధవళాతపత్రముల్ దఱచుగా నేలొకొ**
**పట్టరు మౌక్తిక ప్రభలు వెలుగ**

**నితడు రా జగు రాజనునింత మాత్ర**
**గాదు మూర్ధాభిషిక్త వర్గంబు దనదు**
**చరణయుగ్మంబు గొలిపింప జాలు సార్వ**

**భౌమపదవికిం దగియె డుభంగి వాడు.**

ఎత్తు గీతికి మూలమున మాత్రిక కలదు. గాని, పై సీస పద్యము తిక్కన నాటి రాజమర్యాదలు ప్రతిఫలించుచున్న అద్దాల మేడ.

పింగళి సూరన నాడు గూడ తిక్కన చెప్పిన "పాయు తొలంగు మంచు" రాజుతోడ వచ్చు ఆయతహస్తులుండెడివారు, లక్ష్మీ దేవి విష్ణుమూర్తి కొలువు కూటమునకు వచ్చునపుడు కళా పూర్ణో దయమందలి వర్ణన యిట అనుసంధేయము. తెలుగు వేత్ర హస్తులకు జడిసి నారదాది మహామునులు మాత్రమే గాక బ్రహ్మ దేవుడంతటి వాడు గూడ దెబ్బలు తప్పించుకొనుటకు రొప్పుచు రోజుచు దూరముగా పరుగెత్తవలసి వచ్చినది.

**"హెచ్చిన సంభ్రమంబున ననేకులు బద్ధల వార లెక్క డన్**
**వచ్చియొ మోదిరా కొలువు వారు గకాపికలై చనన్ వడిన్ "**

... కళాపూర్ణోదయము

పాండురంగమహాత్మ్యయమునందుం గూడ తెనాలి రామ కృష్ణ కవి "సూత్రవతీశ దోర్వేత్రదత్తవకాశామరంబయ్యె గటాక్ష విహృతి" అని వర్ణించెను.

ఈ రాజ మర్యాదలే తిక్కన ప్రకరణాంతరమున రచించిన సీస పద్యమునందును ప్రతిఫలించుచున్నవి.

ఉత్తర గోగ్రహణ ఘట్టమున, దుర్యోధనుం డర్జునుచే నోడి పోవును. అప్డు ధర్మజుడు తనని ఉపాలంభించును.

**ఏనుంగునెక్కి పెక్కే నుం గులిరుగడ**
**రాఁ బుర విధుల గ్రాల గలదె**
**మణిమయంబైన భూషణజాలముల నొప్పి**
**యొడ్డోలగంబున నుండ గలదె**
**కర్పూరచందనకస్తూరికాదుల**
**నింపుసాంపార భోగింపగలదె**
**యతిమనోహరలగు చతురాంగనల తోడి**
**సంగతి వేడ్కలు సలుపగలదె**

**కయ్యమున నోడిపోయిన గౌరవేంద్ర!**
**వినుము నా బుద్ధి మరలి యా తనువు విడిచి**
**సుగతి వడయుము తొల్లింటి చూఱగలదె!**
**జూదమిచ్చుట నాడంగ రాదు సుమ్ము.**

ఇవి యన్నియు తిక్కన నాటి తెలుగు సంఘమునందలి రాజభోగములు.

**<u>గోవిక ర్తనము</u>**

సంస్కృతమున భీముడు ధర్మరాజుతో తాను వంటల వాడై విరటు గొలిచెదనని చెప్పు నప్పుడు తాను గోవి కర్తనము చేయ గలనని చెప్పును. తెలుగు భీముడు గోవికర్తనము సలుప లేదు.

**<u>అంతఃపుర పరిచారికాకృత్యములు</u>**

ద్రౌపది సైరంధ్రి యగుదు నని చెప్పును. సంస్కృత సైరంధ్రి కేశకర్మ యందు కుశల.[1]

తెలుగు సైరంధ్రి నేర్వ వలసిన విద్యలను తిక్కన పెద్ద సీస పద్యములో వివరించును.

**కలపంబు లభినవ గంధంబులగ గూర్చి**
**తనువున నలదుదు ననువుగాగ**
**మృగమదపంకంబు మృదువుగా సారించి**
**తిలకంబు వెట్టుదు జెలువు మిగుల**
**బువ్వులు బహువిధంబుల గట్టి ముడి కొక్క**
**భంగిగా నెత్తులు వట్టియుత్తు**
**హారముల్ మెఱయ నొయ్యారంబుగా గ్రుచ్చి**
**యందంబు వింతగా నలవరింతు**

**వివిధ శిల్పముల బ్రవీణ నై మఱియును**
**వలయు పనుల వెంట మెలగ నేర్తు**
**మత్స్యరాజమహిషి మనమున మక్కువ**
**నెలకొనంగ నిట్లు గొలువ నేర్తు.**

1. కుశలాకేశకర్మణి అని మాత్రమే సంస్కృత భారతమున గలదు.

అవి అన్నియు, అలనాటి రాజాంతఃపురము నందలి పరిచారికలు చేయు పనులే యని గుర్తింప వచ్చును.

అలనాటి రాణులకు పరిచారిక లుండుట తిక్కన స్వయముగ నెరిగిన విషయమే. అందుచేతనే ప్రకరణాంతరమున ద్రౌపది శ్రీకృష్ణునితో తన భంగపాటు చెప్పుకొనినపుడు "యెలుంగు రాలు పడనేయ్చిన యాజ్ఞసేనిం గృపాయత్త చిత్తుండై నారాయణుండూ రార్చి కూర్చుండ నియమించి కన్నీరు దుడువను బెన్నెరివేణి ముడువనుందగు వారి నియెగించును" ఆమె విలపించుట మూలములో గలదు గాని శ్రీకృష్ణుడు "కన్నీరు దుడుచును బెన్నెరివేణి ముడువ నుం దగు వారిని నియోగించుట" తిక్కన తెలుగు భారతములో అధికముగా చేర్చినదే.

## **అభినయ విశేషములు**

అర్జునుడు నట్టువొజ్జయై ఉత్తరకు

**"దండలాసక విధమును గుండలియును**
**ప్రేంఖణంబు తెఅం గు ను ప్రేరణియును"**

నేర్పుదునని విరాటునితోఁ జెప్పును. మూలములో లేని యీ నాట్య విశేషములు తిక్కన సమకాలీనులు నేర్చినవే.

## **తాంబూల ప్రదానము**

విరాటుడు నట్టువొజ్జయైన బృహన్నలకు నుత్తర నప్పగించుచు "కర్పూర తాంబూలంబు వెట్టి చిత్రంబులగ చీనాంబరంబులిచ్చి మణిమయంబులగ నాభరణమ్మ లొసగి" సమ్మానము సల్పెను. సంస్కృత విరాటుడు చేయని యీ మర్యాదలన్నియు తిక్కన నాటి రాజస్థానములకు సంబంధించినవే. తిక్కన పలుమారులు రాజులు కర్పూర తాంబూల మొసగుటను వర్ణించును. రాజ నియెగమునకు తెలుగు దేశమున చిరకాలము తాంబూల ప్రదానమే అంకురార్పణ జరిపెడిది.

## <u>కుస్తీ పట్లు</u>

భీముడు మల్లునితో చేసిన యుద్ధ వర్ణనము మూలమున గలదు. కాని తెలుగులో గల కుస్తీ పట్ల వివరము సంస్కృతమున లేదు. భీముడు

**ఉపతాయిలో దన కొదవిన తోరహ**
**త్తము సూపి వ్రేయక సమదవృత్తి**
**బాసి క్రమ్మఱ జేరు బలువిడి వాడుపై**
**నడరిన జరగక యవనిం గ్రుంగి**
**నిలుచు నొత్తురువున వలచిన యప్పుడు**
**గానిపొపు నవలీలం గూల వైచు**
**జళికి పట్టిసమను సన్నపు విన్నాణ**
**ములు దొరకొన్నను ముట్టఁగొనడు**

**కాలిదొస జొర వచ్చుట గానిపించి**
**యుడుగు సీసాన బట్టియు నుప్పళించు**
**బోవ నిచ్చు మగుడనేచి పోర జేరు**
**నెడల సరిసేయ నగుతడవిక హత్తు.**

మఱియు ననేక గతుల యోజలు మెఱయుచు గొండొక సేపు విరాటునకు వినోదంబు సలిపెను.

ఉపతాయి, తోరహత్తము, ఒత్తరువు, జళికిపట్టిసము సీసాన బట్టుట. సంస్కృత భీమునకు తెలియని ఈ కుస్తీ పట్లన్నియు తెలుగు భీమునకు క్రొత్తగా తిక్కన నేర్పినవే. మూలమున భీముడు మల్లుని సంహరించి నట్లున్నది. తెలుగు భీముడు మల్లుని జయించి వదలి పెట్టెను.

## <u>పురాతన బాణ శాలలు</u>

ప్రభాతకాలవర్ణనమున “కడివోయి తొరగిన విరుల మీన కేతున పురాతన బాణ శాలలుంబోని లతామండపంబులు” గలవు. ఆ నాడు ప్రతి రాజస్థానము నందు పురాతన బాణశాల లుండేడివి. ఈ ఉపమానము ఇరువదియవ శతాబ్దిలోనివారి కంటె తెలుగు దేశమున పదుమూడవ శతాబ్ది నాటి వారికే యెక్కువ సుగమము.

## జీతపుటూళ్లు

రాజులు రాజసేనా ప్రతిఫలముగ జీతపుటూళ్లను ఇచ్చుచుండుట తిక్కన నాడే గలదు. ఈ జీతపుటూళ్లకే తరువాత జాగీర్లను పేరు వచ్చినది. దక్షిణగోగ్రహణమున కుపపత్తిగ సుశర్మ తన జీతపుటూళ్లు మత్స్యదేశమునకు సమీపమున నున్నవనియు, విరాటుడు సంతతంబు వానిని గాసి సేయుననియు దానికి ప్రతీకారచర్యగా దాను దక్షిణ గోగ్రహణంబు సల్పుదుననియు నివేదించును.

## వీడుకోలు తాంబూల ప్రదానము

తిక్కన నాటి తెలుగు సంఘమున తాంబూల ప్రదానము వీడుకోలును భరత వాక్యమును గూడ బలికెడిది.

ధృతరాష్ట్రుడు పాండవ దూతయైన ద్రుపదపురోహితుని సత్కరించి పంపించినట్లు మూలమున గలదు.

**"సతం సత్కృత్య కౌరవ్యః ప్రేషయా మాస పాండవాన్"**

తెలుగు పద్యము తిక్కన నాటి తెలుగు మర్యాదను ప్రతిఫలించు చున్నది.

**నీవు మున్నెగుమని యతనికి విభూష**
**ణాంబరమ్ములతో దమ్మలంబుఁ బెట్టి**
**వీడుకోలిచ్చి పుచ్చిన విప్రవరుడు**
**పాండు జనపాల తనయులపాలి కరిగె.**

ఇంతేగాక యుద్ధమునకు ముందు దుర్యోధనుని పంపున ప్రత్యేకముగా దమ్మ పరుషవాక్యములతో నిందింప వచ్చిన ఉలూకుని గూడ ధర్మరాజు "తాంబూలాభరణంబు లిచ్చి వీడు కొలిపెను."

## అతిథి మర్యాద: మజ్జనము

శల్యుండు, తాను సుయోధను పక్షమున జేరినను, ధర్మరాజును జూచి మన్నన దెలుప వచ్చును.

ధర్మరాజు "అతనికి సముచితంబులగు మజ్జన భోజనంబు లొనరించి" సభావించును. మూలములో "పూజయామాస విధి వచ్ఛల్యం ధర్మభృతాం వరః" అని మాత్రమే గలదు. మజ్జనము తెలుగువారి ప్రత్యేక మర్యాద.

ఇట్లే సంజయుడు రాయబారిగా వచ్చినపుడు అర్జునుడు ధర్మతనయానుమతంబున సంజయునకు సపరివారంబుగా సముచిత ప్రకారంబున మజ్జనభోజనంబులొనరించి, మాల్యాను లేపనాద్యుపచారంబులు సేయించి, మణి భూషణ చిత్రాంబరంబు లొసంగి వీడుకొల్పిన నతండును బాంధవులను వాసుదేవుని విడ్కొని చనియె."

సంస్కృతమున అనుజ్ఞాతః పాండవేన ప్రయయౌ సంజయస్తు" అని మాత్రమే గలదు. సంజయునకా మర్యాదలన్నియు తిక్కన సొంతముగా చేసినవే.

## <u>యుద్ధ సంప్రదాయములు</u>

### <u>యుద్ధవేశము</u>

తిక్కన భారత వీరులు తరచు యుద్ధమునకుం బెండ్లికి బోవునట్లు పోవుదురు. శంఖుడు దక్షిణ గోగ్రహణయుద్ధమున ప్రియంబున బెండ్లికిబోవునట్లు రథమెక్కి తాకెను. మనుష్యులేగాక ఏనుగులు, రథములు అశ్వములనుగూడ అలంకృతము లగును. వివాహాలంకరణమే యుద్ధోచితాలంకరణము. అది తిక్కన నాటి వీరయుగమర్యాద. 'కర్ణ ఝులం ఝుళా సముద్ధూతబలోత్తరేణు పరిధూసరితాంబరమైన వారణ వ్రాతము' గొల్చిరా మదిరాశ్వుడు యుద్ధ భూమిని జేరెను. విరాటుని యాజ్ఞచే శతానీకుడు పాండవు లను యుద్ధ సన్నద్ధులం జేయునప్పుడు వారిని "అంగరాగ మాల్యాంబరా భరణంబుల నలంకృతులం" జేసెను. యుద్ధానంతరమున గృత్తములై యున్న బాహుదండంబుల" నంగుళీయక రుచు లడరు తలంబులు నురగ నివాసంబుల ననుకరించుచున్నవని తిక్కన వర్ణన. వీరులు "జోడు పక్కెర కైరవు బిరుదు రవణంబు మొదలైన సవరణంబులం జూడ నక్కజంబుగా" యుద్ధమునకు బయలుదేరిరి.

ఉత్తర గోగ్రహణమున "విచ్చుచ్చుందు బ్రేల్మిడిం బోడిసేసి న కేయూరంబులగు బాహుదండంబులను సకుండలంబులగు కర్ణ పాశంబులను సకిరీటంబులగు శిరోభాగంబులను భూభాగం బలం కరించి యప్పుడావహిల్లిన సాగరంబునకు రత్నాకరత్వం బలవరించె"

సాత్యకి ధర్మజు పునుపున సైంధవ వధకుద్యుక్తుడైన అర్జునునకు సాయమగుటకు బోవునపుడు "పెండ్లికిం బోవు లీలందే రెక్కి, యాప్యాయనమధుపానంబున నెలమింబొంది" యేగును. యుద్ధమున "మధు సేవ" తిక్కన నాటిదే.

## ఆడియాలములు: సిడంబులు

యుద్ధములో నోడిపోయి, పారెడి సేనను వెన్నంటి తఱిమి "బిరుదుల తోడి గొడుగులును, ఆడియాలంబులతోడి సిడంబు లును వైపించుకొని," వదలివేయుట అలనాటి ఆచారము. ఉత్తర గోగ్రహణమున అర్జునుండట్లు చేసెను.

పరాజితుల బిరుదులు విజేతలు దాల్చుట తిక్కన నాటి వీరుల సంప్రదాయము, దక్షిణాపథ చరిత్రకు సుపరిచితము.

## నామాంకితంబులైన బాణంబులు

కర్ణుడు నిజనామాంకితంబులైన నారాచంబుల నన్నర పతుల గరుల నరుల దురంగంబుల నరదంబుల రూపు మాపెను. బాణములపై వీరులు తమ నామాక్షరములు చెక్కించుకొనుట ప్రాచీన భారతీయ సంప్రదాయము తిక్కన నాడును నున్నట్లున్నది.

## ప్రస్థాన భేరి

దండయాత్ర ఆరంభించు సమయమున సైనికులందఱు బయలుదేరుటకై ప్రస్థానభేరి మ్రోగించుట తిక్కన నాటి సేనా మర్యాద. ఇట్టు ప్రస్థానభేరి సెలంగిన సకల సైన్యంబులు దండనాథ సహితంబుగా సన్నద్ధంబులయ్యె. మూలములో లేకపోయినను, పాండవుల సైన్యము కురుక్షేత్రమునకు దరలు

నప్పుడు తిక్కన ప్రస్థానభేరి నినాదమును ఒక సీసపద్యమున అభివర్ణించెను.

**బీఱెండ తాంకున భీటలు వాఱిన**
**పచ్చిగోడల మాడ్కిం బగిలె దిశలు**
**కాగిన యెసతుల కరణి బోరింబోరి**
**శతనిధులుప్పొంగి పొరలం బడియె**
**గలముపై గీలించి గాలి కెత్తిన చాప**
**వో లె మిన్నంతయు మొరటిల్లె**
**గులపర్వతావళి గులిశభయంబున**
**బెదరి వాపోవుచుండిరి సెలంగ**

**ధాత్రి కమ్మరిసారెవిధమున దిరిగె**
**చిత్రరూపుల భంగి నిశ్చేష్టితంబు**
**లయ్యె సర్వభూతములు బ్రయాణభేరి**
**భూరినిష్ఠుర ఘోరభాంకార మడరి.**

## యుద్ధభటులు: సంగీత సాహిత్య వినోదములు

పగలెల్ల యుద్ధము చేసిన యుద్ధభటులు రాత్రులందు సంగీతసాహిత్య వినోదముల ప్రొద్దు పుత్తురని తిక్కన వర్ణించెను.

కురు పాండవ సేనలు పంచమ దివసమున ప్రొద్దుగుంకు వఱకుం బోరి తమ తమ యావాసములకు నరగిరుభయ సైన్య జనంబులును దీవియలు వెలుగంగన్

**రెండు వీళ్ల జనంబులు రేలు వివిధ**
**హృద్య సంగీతములను సాహిత్య మధుర**
**లలిత గోష్ఠివినోదంబులను ప్రమోద**
**భరితులై ప్రొద్దు పుత్తురు భరతముఖ్య.**

మూలమున లేని యీ వర్ణన తిక్కన కాలము నాటి తెలుగు సైనికుల వినోదమే యని యెంచవచ్చును.

శ్రీకృష్ణదేవరాయల కాలములోగూడ యుద్ధ యాత్రలలో కవులు గాయకులు నటులు వేశ్యలు గూడ నుండెడివారని

తెలియుచున్నది. అట్లె తిక్కన కాలము నాడును జరిగి యుండ వచ్చును.

## విజయ దుందుభులు:

యుద్ధమున సుశర్మ విరాటుని బట్టుటtoడనే, అతని సైనికులు "విజయ దుందుభులు" మ్రోగించిరి. విరాటుని సైన్యము భయద్రుతగతిం బాఱినది. గెలుపు ప్రకటించుటకు తిక్కన కాలమున నా వాద్య విశేషమును మ్రోగించెడువారు.

## విజయెత్సవము:

జంఘాలురు ముందుబోయి గెలుపు చాటంబంచెడు వారు. శోభనధ్వజోన్నయనంబును, మంగళతూర్య నాదంబులును, బరస్పర గంధ సలిల సేచనంబును, గీతవాద్య నృత్తంబులును, అలనాటి జయెత్సవములు. ఉత్తరుని విజయమును జాటం బంపుడని విరాటుడు మంత్రులకాజ్ఞాపించును.

పతాకాద్యుత్సవములు నిందు నొక భాగములే.

## పెండ్లి వేడుకలు:

తిక్కన అభిమన్యు వివాహమును తెలుగు దేశములోని సంపన్న రాజకుటుంబములందలి వివాహముగనే వర్ణించెను. మూలమున ని పెండ్లి మూడు శ్లోకములలో ముగిసినది. తిక్కన

భారతమున తెనుగు పెండ్లి ముచ్చటల తీరుతీయము లన్నియు వెల్లివెరిసినవి.

**కలువడములు మణితోరణ**
**ములుం గట్టిరి క్రముక కాండమోదాస్తంభ**
**బులు నాటిరి కుంకుమమున**
**గలయ నలికి ముగ్గులిడిరి కర్పూరమునన్.**

పరిణయాగతము కన్నులకుం గట్టునట్లు తిక్కన వర్ణించెను.

**అమలరత్న ప్రదీపావళి మెఱుంగడం బనిచి మణిస్తంభపంక్తిం గ్రొత్త**
**జిగి ధళకొత్తనట్లుగం దొడయించి విచిత్రవితానముల్ సెలుపు మిగుల**
**గట్టించి నూత్నముక్తాదామములతోడ గుసుమమాలిక లెడ గ్రుచ్చి వేల**

**గీలింప నియమించి కేవలమంగళభూరుహపల్లవ తోరణములు**
**సంఘటింప నియోగించి చందనమునం**
**బరిణయాగతములుకంగ బాణి యాణి**
**గలుగు ముత్తియముల గ్రుగ్గగా నొనరుచ్చ**
**జతురపుణ్యాంగసాజనతిం బొనరెచ్చ.**

విరాటుడు పెండ్లికూతురు నలంకరించుటకు నేర్పుగల చెలికత్తెలను బుచ్చెను.

436

**ఉత్తరనలంకరింపనుం**
**దాత్రాభరణాదివస్తుతతి యొసగి నరేం**
**ద్రోత్తముడు నేర్పుగలచెలి**
**కత్తియలంబుచ్చె ప్రీతి గదలుకొనంగన్.**

పెండ్లికొడుకు భద్రగజారూఢుడై 'మణి గణంబులు, సంబ రనికరంబులుం బుష్పపుంజంబులు, ఫల ప్రచయంబులు' విస్తరిల్లిన క్రంత మంగళ తూర్య నాదంబులు విప్రాశీర్వాదరిబులు మాగధ గానంబులు వంది జనవాక్య సంతానంబులు జెలంగ విరాటు మందిరంబున కేతెంచినపుడు శంఖ జయఘంటావంశి వాది నిక్వణంబులతోడ నతని నెదుర్కొని సేసలు జల్లిరి.

వివాహమహోత్సవమున సుముహూర్త సమయమున మంగళ తూర్య రావంబులు సెలంగ తెర యొత్తిరి ఆచ్చపు తెలుగు వేడుక తలఁ బ్రాలు పోసుకొనుటయు తిక్కన వదల లేదు.

**లలితతనూవిలాసముల లజ్జకతంబునం జేసి మున్ను విచ్చులవిడి బట్టగా వెఱపు సాలక యోరలు వాఱుచూపులన్ లలి దళప్రాలు వోయు నెడలం దగ వొందిన నూలుకొల్పి యుమ్మల బచరింతురొండొరుల మోహనమూర్తులపై వధూవరుల్.**

తలఁ బ్రాల సమయము మందార వృక్షము కల్పలతలు ఇండొండి పై విరులు గురిసినట్లున్నదనుట మనోజ్ఞ వర్ణనము. విరాటుడు అల్లునకు అరణముగా భద్రసామజ సప్తశతియు దాసదాసి జనంబులు లక్షయు మున్నగు కానుకల నిచ్చెను.

వివాహమున తుదివేడుక బట్టలు పెట్టుట. మత్స్య మహి నాథుండు మణి భూషణంబులు రుచితాంబరంబుం గర్పూరాది సుగంధ ద్రవ్యంబులు దాంబూలంబుల తోడి పళ్లేరంబులం బచరించి పాండవులకు వాసుదేవ పూర్వకంబుగా బురోహిత ప్రకరంబునకుం గట్ట నిచ్చె!

**<u>పూతలు పువ్వులు</u>**

పాండవులు అజ్ఞాత వాసానంతరము తమ్మెఱింగింప దలపోసి నగరి కరిగిరి. అప్పుడు వారు తెలుపులగు బీదలను బూతల బుప్పల నొప్పిరి. చందన చర్చ, పువ్వులు తిక్కన కాలమున మాననీయ వేషమున అపరిహార్యములు.

**<u>పణిహారులు</u>**

రాజుల యొద్ద ద్వారపాలకులుగ పణిహారులుండెడు వారు. మూలములోలేని చోటులలో గూడ తిక్కన పణిహారుల ప్రశంస దెచ్చెను. శ్రీకృష్ణుడు అర్జునుడు కలిసి అభ్యంతర గృహంబున నున్న సంగతి సంజయుండు' మున్న పణిహారుల వలన' నెరింగెను.

**<u>ఊరేగింపు</u>**

విజయెత్సవ సమయములలో, గొప్పవారి ఆగమన సందర్శమున ఊరేగింపు జరిగెడిది. శ్రీకృష్ణుడు "తన రాకకు నలం కృతంబును బ్రమోద చాపల సుభగ జనంబును నైన పురంబు సొచ్చి రాజమార్గంబున నరుగు నవసరంబున మౌక్తిక మిళితంబులు బహుగంధ లుళితంబులు నగు నక్షత ప్రకరంబులును బుష్పనికరంబులునుం జల్లుచు నిరుగెలంకుల రమ్యహర్మ్యంబు లపై నిలిచి సొలిచి కనుంగొను నంగనా జనంబులు తిక్కన సాటి వారలే.

**<u>వైద్య,-శస్త్ర చికిత్స</u>**

శ్రీకృష్ణుడు ధృతరాష్ట్రునితో తాను "దుర్మాంసము గోయు వైద్యుని క్రమంబున" కంసుని ద్రుంచి వంశమునుగాపాడితినని చెప్పెను. మూలములో లేని ఈ ఉపమానమును బట్టి భారత

కాలమున నున్నను లేకపోయినను తిక్కన కాలమున శస్త్ర చికిత్స బహుళ వ్యాప్తిలో నున్నదని యెంచ వచ్చును.

పాండవులు ఉదక కర్మానంతరము మాసమాత్రము గంగా తీరమున అనుచిత్యం బపసయించుటకు నిలిచిరి. మూలము

**"త్రతత తే సుమహాత్మానో న్యవసన్ కురుసత్తమాః**
**శోచం నిర్వ ర్త యిష్యంతో మాసమాత్రం బహిఃపురాత్"**

తెలుగులో సమస్తలంబునం బటకుటిర సంవిధానంబు సేయించి నిలిచి నట్లున్నది. మూలములో లేని యీ పట కుటీరములు తిక్కన నాటివే.

## <u>అందలములు</u>

శాంతి పర్వమున ధర్మరాజు పట్టాభిషేక మహోత్సవ మునకు హస్తినాపురమున కేగునపుడు కుంతీ ప్రముఖ కురు స్త్రీ జనంబుల నందలంబుల నిడికొని, విదురుండుచిత వాహనారూఢై తరలెనను వర్ణన గలదు. మూలములోని నేని అందలములు తిక్కన సమకాలము నాటివే.

## <u>ఏనుంగు మొగసాల</u>

రాజవేశ్మమునకు ముందు ఏనుంగు మొగసాల లుండెడివి. శాంతి పర్వమున ధర్మరాజు పట్టాభిషేక మహోత్సవమునకు హస్తినాపురమున కేతెంచి నపుడు 'ఏనుంగు మొగసాల' కడ రథము డిగ్గను. అమూలకమైన యా యేను గు మొగసాల తిక్కన కాలము నాటిదే.

# "రస" శబ్దప్రయోగము

తిక్కన రస శబ్దమును పలుమారులు ప్రయోగించెను. "రసము" అని వాచ్యము చేయుట కావ్యశిల్పమునకు ఆపకర్షయే యని కొందఱు విమర్శకుల అభిప్రాయము. కాని, ఒక శబ్దమునకు నానార్థములుండుట పలుభాషలలో పరిపాటి. రస శబ్దమును కేవల నవరస సంబంధముగా స్వీకరించువారు గలరు. మరికొందరు ఆర్ద్ర భావము అను అర్థములో వాడువారును గలరు నవరస వాదమును అలంకారికు లందరు అంగీకరింపలేదు. అంతేగాక రసము లెన్ని? అను వాదమునకు సర్వ్వ జనామోదమును బొందిన సమాధాన మింతవరకు నేర్పడలేదు.

**"అనంతో వై రసాః"**

అని ఊటంకించువారును గలరు.

తిక్కన యే అర్థములో రస శబ్దమును ప్రయోగించెనో నరయవలసి యున్నది. కవి హృదయము నరయకుండ విమర్శ సల్పుట పాడిగాదు.

తిక్కన రస శబ్దమును తొలుదొల్త హరిహరనాథుని పరముగనే ప్రయోగించెను. హరిహరనాథుడు

**అనుకంపాతి శయంబునం**<br>
**దన దక్షిణ నేత్రమును సుధారోచియ కా**<br>
**నను వింతలేక చూచి వ**<br>
**దనమున దరహాసరసము తళుకొత్తంగన్.**

440

ఇచ్చుట నవరస విశేషమగు నర్థములో స్వీకరించుటకు వీలులేదు. అందుచే వాచ్యతాదోషము అను విమర్శకు గూడ తావులేదు. హరిహరనాథుడు కన్నులు అనుకంపాతిశయ సుధా సంభరిత ములు. అతని మోమున దళుకొత్తినది దరహాస రసము. ఆ ఆర్ద్ర భావ పర్యాయతనే తిక్కన రస శబ్ద పూర్వకముగా సంతరించెనని స్వీకరించుటయే భావ్యము.

వెనువెంటనే హరిహరనాథుడే తిక్కనను గూర్చి 'మత్పాద నిరంతర స్మరణ తత్పరభావము గల్కి నాత్మ సమ్మోదము బొంద కావ్య రసముం గొనియాడుచు నుండె దెప్పుడున్' అని చెప్పినట్లు గలదు.

కీచకుండు ద్రౌపదిని పరాభవించిన దృశ్యమును గాంచి భీమసేనుడు కోపోద్రిక్తుడై, యచ్చెరువునున్న నున్నత వృక్షంబు పెరుక బూనును. ధర్మరాజు "నిగూఢ భాషణముల" అనిలజు "కోప రసంబు పెర్మి" సెఱిచె.

కీచక వధానంతరము తన్నుం జూచి "పులి గనుగొన్న లేడులును బోలె విభీతి గలంగు" పౌరులను జూచి సైరంధ్రి యంతరంగమున నిండిన హస్యరసంబు మోముపై వెలివిరియంగ నీక చనెను.

కౌరవ సేనం జూచిన అర్జునుడు ఉత్తర గోగ్రహణ కాలమున 'ఇట్లను గేవల వీర రస మయాత్మకు డగుచున్' అతడు వివిధ బాణపరంపర వెల్లి గొలిపె భయరసము వట్టువెట్టున వార.

విరాటుడు కంకాదుల పాండవులుగా నొరుంగుటతో అద్భుత రసా క్రాంతంబగు నంతరంబుతో నుండెను.

ఉత్తరాభిమన్యుల వివాహ మహోత్సవ మందు వధూ వరులు హోమ సమయముల సౌఖ్యరసము పెన్నిట్ట పారి బోరి గ్రమ్మదేర సమ్మదాంబుధి తేలిరి.

శ్రీకృష్ణుని విశ్వరూప ప్రదర్శనమును గాంచి సకల జనంబులు అద్భుత భయానక రసంబుల జొత్తిల్లు చిత్తంబుల తోడం గదలకుండిరి.

ధృతరాష్ట్రునకు కన్నులు వచ్చినవి. తన దృష్టి యథా ప్రకారము సలుపు మని యాతండు పురుషోత్తము నర్థించును. "జను లెల్ల నృపాలు సితవిశాలాక్షుం గనుం గొను చుండి నపుడు తమ నెమ్మనములాశ్చర్య రస నిమగ్నంబు లుగాన్."

యుద్ధకథనము విన కౌతూహలియైన జనమేజయునకు వైశంపాయనుడు "అనుమోద రసార్ద్ర హృదయుడై" కథ చెప్ప నారంభించెను.

భీష్ముడు "వీర రసాంబు పూరమును విశ్రుత బాహు మహోగ్ర సత్త్వము" మున్నగు గుణములు గలవాడని ధృతరాష్ట్రుడాతని మరణ వార్త విని పలవించును.

సంజయుడు వేదవ్యాసునకు మ్రొక్కి, "భక్తి రసైకాస్వాదన సుకరానందోత్పాదన దివ్యమతి" యయి యుద్ధ కథనము నకు గడంగును.

అభిమన్యుడు రౌద్ర రసోల్లసితమూర్తియై పద్మవ్యూహ మును జొచ్చును. సైంధవ వధ ఘట్టమున, కర్ణుడు సాత్యకి భీమార్జునుల మువ్వురను నొనాడ జేసెను ఆతఁైర గద్భుతరసము వెల్లిదేర్చె జనములన్.

సైంధవుని తల పాశుపతాస్త్రము గొంపోయి అడవిలో తప స్విగ నున్న అతని తండ్రి యొడిలో బడవైచును. అప్పుడాతడు కన్నులు దెరువకయే దిగ్గన లేచిన ఆ తల భూమిపై బడును. అతడే అంతకు ముందు తనయుని తల నేలపై బడవేసిన వాని తల ప్రక్కలగునట్లు శపించి యుండెను. కావున

**పగిలి యాతని తల నూఱు పరియ లయ్యె**
**శౌరి విజయుని నగ్గించె సకలభూత**
**ములు మహాద్భుతరసమున ముని గెనపుడు**
**సంహరించెనయ్యస్త్రమా సవ్యసాచి.**

కురుక్షేత్ర మృతవీరుల పునరుత్థానము "సకల జనుల నద్భుత రసమున మునుగ జేసె".

పూర్వోక్తమైన ఉదాహరణములను బట్టి రస శబ్దమును ప్రపంచార్థమున స్వీకరించుటయే కవి హృదయముగా దోచుచున్నది.

# నవ్వులు

తిక్కన యెన్ని విధముల నవ్వులనో ప్రయోగించెను.[1]

తిక్కనకు సాక్షాత్కరించిన తొలినవ్వు హరిహరనాథుని వదనమునందే. ఆది దివ్యత్వము తళుకొత్తిన పరిహాసము.

**"అనుకంపాతిశయంబునం**
**దన దక్షిణనేత్రమును సుధారోచియు కా**
**నను వింతలేకచూచి వ**
**దనమున దరహాసరసము తళుకొత్తంగన్,**

హరిహరనాథుడు తిక్కనను జూచి పలికెను.

సుయోధనుడు "వాడి సూదిమొన యించుక మోపిన యంత మాత్రమున్ భూమి యొనర్చ పాండున్నృపపుత్రుల కిత్తునే" అని తన నిశ్చయము తెలిపెను.

**"అనిన విని కిన్క బూనిన యలంతి నగవు**
**చెలువు మొగమున కొక కొత్త పొలుపొనర్ప**
**బుండరీకాక్షుడగు చెల్లబోయి యప్పు**
**దరుణ కమలాక్షుడగుచు మురాంతకుండు"**

నవ్వు మొగమున కొక క్రొత్త పొ లుపు దెచ్చును. నిజమే; నవ్వు తెలుపలేని భావమేది?

నవ్వు నవరసజని.

నవ్వు ఖాతహృదయవిషయసూచిక.

తిక్కన ఎన్ని విధముల నవ్వులనో గుర్తించెను. తిక్కన వాడిన నవ్వుల నెరికూర్చిన అతడెట్టి మనోధర్మ పరిజ్ఞాతయో తెల్లమగును.

"కలకల నవ్వు" "పకపక నవ్వు" "పిన్ననవ్వు" "కన్నుల నవ్వు" "వెకిలి నవ్వు" "అనాదరదరహసము" "నవ్వుగాని నవ్వు"

1. శ్రీ ఆంధ్ర శేషగిరిరావుగారు భారతిలో కొన్ని నవ్వుల నేరి ప్రచురించిరి.

"రుచిస్మితము" "సుందర మందహాసము" మున్నగు నవ్వుల నెన్నిటినో తిక్కన ప్రమోగించెను. నవ్వు ఆనందము కంటెను ఒకప్పుడు దుఃఖమునే యెక్కువ సూచింపవచ్చును. అది వీడువలేని నవ్వు కావచ్చును. తిరస్కారము చూపు, నవ్వు; మాటలకంటె ఈటెలకంటె ఎక్కువ వాడి కలది.

తిరస్కారము గాని అనురాగము గాని మాటలకంటె కన్నుల నవ్వులే బాగుగ వ్యక్తీకరింపగలవు. అట్టి నవ్వు గ్రుచ్చికొనిన ఆ గాయము మాన్పుటకు మందు లేదు. శిఖండి భీష్ముని నెదుర్కొని నపుడా మహావీరుడు "మరలి చూడకతని నుద్దేశించి పలికె దరహాసముతో"— "నీవు శరకోటి వేసం బరగించితేని నే నవ్వుదు గాని కోపము మనంబునం బుట్టదు సూ శిఖండినీ! జగదేక వీరుడగు భీష్ముని నవ్వున కేవరు భాష్య మొనరింపగలరు?

భీష్ముడు బాణముల నేయకున్నను శిఖండి యొడలు భగ్గుమన్నది. భీష్ముని బాణముల కా నవ్వునకున్న శక్తి యుండునా? అంపకోల పై బడుచున్నను ఎత్తిన ధనువు తునియలైనను తిక్కన చిత్రించిన వీరులు "అల్లని నవ్వులయగ" మరియొక ధనువు నెత్తుకొని యుద్ధమున కుపక్రమించిన యుదాత్తమూర్తులు.

ద్రోణుడు, అభిమన్యుని పొగడుచుండెను. "అనిన వెలుక బాణి యతిధీరమగు నాననమున నవ్వుగాని నవ్వు మొఱయ" దుర్యోధనుడు ద్రోణుని సమీపించి "ధనువు వట్టినవారికి నెల్ల నొజ్జయైన గురుని యుపేక్షజేసి తనకున్ సమరోద్ధతి చెల్లెగాక ఈ వెరవడి గానలేడు తన వీరమగా గోని విప్రవిగడున్" అని పెదవి విరుచును. ఏ చిత్రకారుడైన దుర్యోధనుని పెదవుల విరిగిన ఆ 'నవ్వుగాని నవ్వు' చిత్రింపగలడా? భువనేశ్వరములో ప్రేమలేఖను వ్రాయుచున్న శిల్పప్రణయిని పెదవులపై చిందు లాడు చిరునవ్వు; "మోనోలిసా" అను చిత్రలేఖనమున వయస్విని కెమ్మోవిపై 'లియోనార్డో డార్వింసి' చిత్రించిన దరహాసముద్ర; గాంచి ప్రపంచము మురిసిపోవుచున్నది. అక్షరప్రపంచమునందు తిక్కన చిత్రించిన చిరునవ్వులు జగన్మోహనములు. విచిత్రమనే విశేష విషయసూచికలు. అత్యద్భుతములు.

షేక్స్పియరు మహాకవి యొకచో "కులుకు నవ్వుల వెన్నెల వెలుగులు వెల్లివిరియు పెదవుల వెనుకనే విషము తొలుకు హృదయము దాగియుండ వచ్చును" అని హెూచ్చరించెను. ఇతరులకున్నది; తనకు లేదు అను దేవిరింపు కంపుగుండెతో కువిలెడి కుత్సితాధరములపై విరిసెడి అసూయాశాపాశావిలమైన ఆకలి చిచ్చరకంటి చిరునవ్వు, శ్వాసనమున విరిసిన వెన్నెలవలె బీభత్సావహముగనే యుండును.

నవ్వునకు తిక్కన వంటి వ్యాఖ్యాత "న భూతో నభవిష్యతి," అనిపించును.

ద్రౌపది. తాను సైరంధ్రిగ అజ్ఞాతవాసమును గడపెదరని చెప్పుదురు.

'అనవుడు ధర్మనందరుండు ద్రుపదనందన కిట్లనియె.

**మన వంశంబును వృత్తం**
**బును బెంపును గావ జాలు పుణ్య సతివి దు**
**ర్జ నులగు తులువల తలపులు**
**గనుగొని యేమరిక మెలగగా వలయు రూమీ.**

అని ధర్మరాజు హెచ్చరించును. పతివ్రతయైన ద్రౌపది అత్మాభిమానమును ఈ హెచ్చరిక రెచ్చగొట్టినది.

"అనిన విని యూజ్ఞసేని యానాదరమందస్మిత సుందర వదనారవిందయయి ఆతని కిట్లనియె."

ధర్మరాజు హెచ్చరికగాని - ఆమె నవ్వుగాని మూలములో లేవు. అనాదర సూచకమైన మందహాసముతో గూడిన ద్రౌపది వదనారవిందము అందగించినదనిన తిక్కన వర్ణన అత్యంత రమణీయము. మెరపుదీగె వలె మిరుమిట్లు గొల్పి క్షణ మాత్ర దృశ్యమానమైన ఆంగికావస్థను చిత్రించు నేర్పుతో రంగరించి యిట్టి నవ్వులను వర్ణించుట తిక్కన కవితా శిల్పములోని వైలక్ష్యము.

విరటుడు మారువేషమున వచ్చిన ధర్మరాజును జూచి, కేవలమొక సన్యాసియని విశ్వసింపజాలక, "ఉన్నరూపు" నెరింగింపుమని కోరును.

ధర్మరాజు.

**ఉన్నరూప పలుకునన్నదు లెక్కడ,**
**గలరు తోచినట్లు పలుకు పలుకుము**
**నైన చందమయ్యో నంతియ కాకంత**
**పట్టి చూడ గలదె యొట్టివారు**

అని మందహాసంబు సేయుచు మరియును.

**ద్విజుడ గురువిషయజారుడ**
**సుజనప్రియు డైన ధర్మసురు సఖుడ బరి**
**ప్రజనాశ మకలితుండ మ**
**నుజవల్లభయెగ్యబహువినోదకరుండన్.**

అని డొంకతిరుగుడు సమధానము చెప్పను.

సత్యవతము చెడకుండగనే అసత్యము చెప్పగల ధర్మరాజు గా దక్షిత ఆ మందహాసములో దాగియున్నది. ఆ సంభాషణమునకు—అందలి ద్వంద్వార్థమునకు గూడ సంస్కృత భారతమున మాతృకలనదగిన శ్లోకము ఉన్నవిగాని—"మందహాసము" మాత్రము తిక్కన స్వకపోలకల్పనమే. భాష భావములను వ్యక్తము చేయుటకు సర్వసామాన్యముగా నుపయెగించును. అప్పుడప్పుడు, కొందరు తమ భావములను దాచుకొనుటకే భాషను వాడుదురు. ఎదుటివారికి తెలియక పోయినను వారి సంగతి వారికి తెలియును. అట్టివారు మాటాడు నపుడు పెదవుల విరిచెడి మందహాసమును ఇంగితజ్ఞుడైన తిక్కన సదా గుర్తించుచుండును.

విరటుడు కంకుని తన సింహాసనమునే స్వీకరింపుమని కోరును.

అనిన విని దరహాసితవదనుండగుచు బాండవాగ్రజుం డతని కిట్లనియె.

**ఏను హవిష్యము కుడుతును**
**భూనాయక నాకు శయ్య భూమియ యుమ్మై**
**బూని వ్రతంబులు సలిపెడు**
**వానికి నిన్నియును నిష్టు వలయునె చెపుమా!**

అని తప్పించుకొను సామర్థ్యము ధర్మరాజు దరహాసితములో అంతర్గర్భితమై యున్నది. తాను సింహాసనమునకు అనర్హుడైన వాడు. విరాటుడో తన్ను గూర్చి సవ్యముగనే గ్రహింపగలిగెను. తన రాజ ఠీవిని వర్చస్సును మారువేషము గూడ మరుగుపుచ్చ లేదను సంతోషము. అయినను అజ్ఞాతవాసము అవశ్యకర్తవ్యము. ఇట్టి భావ పరంపర, ఒక్కుమ్మడి ధర్మరాజు హృదయములో రేగినది. ఇది అంతయు అతని "దరహాసితవదనము"లో నిమిడి యున్నది.

భావనిర్భరసన్నివేశముల చిత్రించునపుడు తిక్కన వాడిన నవ్వులు గభీర హృదయసూచికలు.

ఇచ్చటే ద్రౌపదిని చూచి సుదేష్ణ గూడ—

**"సురగరుడ ఖచర విద్యా**
**ధర కిన్నర యక్ష సిద్ధ తరుణులలో నీ**
**వరయగ నొక్కత వగు ది**
**ప్పురికిం జనుదేరగతము బొంకక చెపుమా"**

అని అడిగినది.

**అనుటయు ధరహాసితము మో**
**మునకుం దొడవుగా బలుకు ముద్దియ యే గృ**
**హ్నని దేవి సత్యభామకుఁ**
**బనిసేయుదున దొల్లి పిదప పాంచాలి కడన్.**

అని సమాధానము చెప్పను. మాటలతో చెప్పటకు వీలులేని భావమును తిక్కన నవ్వులలో కుదించును.

పరాభవఖిన్నయైన ద్రౌపది కీచకుని పరిమార్ప భీముని పురికొల్పుటకు నొక యర్ధరాత్రి మహానస గృహమునకు పోవును. ఉద్రేక స్వభావుడైన భీముడు శీఘ్రకోపి. కాని కోపము చల్లారిన తరువాత అతని శాంతమును ధర్మరాజు శాంతమునట్టిదే. ఆమె

చెప్పిన సుదీర్ఘోపన్యాసమును శాంతముగా వినుచున్న భీముని రెచ్చగొట్టుటకై ఆమె

**వాని దెగ జూడవైతేని వాయుపుత్ర**
**నీవు గనుగొనఁ నురినైన నీరమైన**
**నగ్నివైన విషంబునైన నేను**
**మేను దొరగుచు నెట్టు నీ యాన సుమ్ము**

అని బెదిరించినది.

**"అనిన వృకోదరుండు చిరునవ్వు నవ్వుచు నిట్లనియె".**

వృకోదరుని ఆత్మప్రత్యయమునకు ఆ చిరునవ్వే అపరిహార్య మైన చిహ్నము.

కీచకునకు నర్తనశాలను సంకేతముగా చెప్పి ద్రౌపది భీముని దగ్గరగ జేరి

**"నా కోఱత దీర్చి వచ్చితి**
**నీ కొఱతయు యింక సూతునిం దెగ జూడన్**
**లోకము వంచింపం దగు**
**చీకటి రే యొదవ నేమి సేసెదో చెపుమా.**

అనిన దరహాసితవదనుండగుచు వృకోదరుం డిట్లనియె.

**నన్నడుగ నేల నీవును**
**నన్నీచుడు నేమి మాట లాడితిరది నా**
**కున్నట్టు లెఱుంగ జెప్పము**
**నిన్నే మెప్పించువాడ నీరజవదనా!**

ఈసారి భీముని నవ్వులోని అంతరార్థము వేరు.

భీముని దరహాసములో అతని కృతనిశ్చయత్వము ముద్రితమై యున్నది. భీముడు నర్తన శాలకుం బోయి "అచ్చట విరాట నందన లీలా పర్యంకం బరసి," "తానా తల్పంబున నుండె", కీచకుడు వచ్చి, "యా విశాల నయనగా దలచి" సరస సల్లాపము లకు దిగును. భీముని యొడలు భగ్గు మన్నది.

**"నను ముట్టి నీవు వెండియు**
**వనితల సంగతికి బోవు వాడవే యైనం**
**దనువే బడసిన ఫలమే**
**కనియెద విదె చిత్త భవ వికారము లెల్లన్.**

అనుచున్" గ్రక్కున లేచి రోష కఠినంబౌ హాస మా సూతు నెమ్మన ముద్వేగము బొంద జేయ బలసామ్రగ్రిన్ సముజ్జృంభణంబున వానిం దలవట్టి" వంచెను.

భీముని రోష కఠినమైన ఆ హాసము వ్యాఖ్యానమున కందునది గాదు.

కీచక వధానంతరము నిరపాయముగ అంతఃపురము చొచ్చిన ద్రౌపదిని ఉత్తర మొదలగు కన్నియ లభినందించిరి. బృహన్నల గూడ ఆ వృత్తాంతము నంతయు సవిస్తరముగ గోరును.

**కన్నియల కాటగఱపుచు నున్న నీకు**
**నకట సైరంధ్రి యిప్పు డేమయ్యె నేని**
**భేద మెద యించుకయు లేమి గాదె**
**సన్మితాననంబుతో నన్నిటు లడుగు చెల్ల.**

అని శత్రు సంహార సంజనితమైన అతని సంతోషస్మితమున కామె అపార్థము గల్పించును. అంత అర్జునుడామేతో, "రిపు మర్ద నంబు తనకు వెరవు గాకునికి గుప్త సాభి జ్ఞానంబుగా దెలిపిన బలసూదను సూను పలుకులువిని" పాంచాలి అంతస్మిత కమనీయ కపోల యైనది. ఆమె అంతస్మితములోని అంతరార్థము అనిర్వచ నీయమైనది. అంతేగాదు అంతస్మితముచే ఆమె కపోలము కమనీయమైనది. చిరునవ్వు మొగమునకు చెలువును సమకూర్చుట సహజమే. ఇది అంతస్మిత మగుటచే కపోలములో సొయగముతో చెలువొందినవి. పైనకు కనిపించని ఆమె చిరునవ్వు కపోలములకు కాంతి యొసగినది. అంతస్మిత కమనీయ కపోలముల వర్ణన కన్నంబాడి కావేరి వద్ద గల విద్యుద్దీప గర్భిత జల యంత్రములను స్ఫురణకు దెచ్చును.

అజ్ఞాతవాస సమయమున బాంధవుల వెదకి గానక, చారులు తిరిగి వత్తురు. దుశ్శాసనుడు,

**వలవదు రోయం బాంధవుల వా రొక యూఆట లేని త్రిమ్మటః**
**బల మది వన్యసత్త్వముల పాల్పడి చచ్చినచోటు బూరియు**
**న్మో లవదె యింతకిం కిట మనోముద మస్తలితంబు గాగ వి**
**చ్చలవిడి రాజ్యలక్ష్మి దగుచందమునం గొనియాడు మున్నతిన్.**

అని అనును.

అనిన విని దరహసితవదనుండగుచు గుంభ సంభవుం డిట్లనియె - జగదేక వీరులైన పాండవులు వన్యసత్త్వముల పాల్పడి చచ్చుట - ఆ చచ్చిన చోట పచ్చ గడ్డి మొలుచుట!! ఆ మాటలు వినిన నెవ్వరికైన నవ్వు వచ్చును. శిష్యులైన పాండవుల పరాక్రమము ప్రత్యక్షముగా నెరిగిన శిష్యవత్సలుడు ద్రోణుడు. అతనికి దుశ్శాసనుని మాటలు విన్నప్పుడు కోపము కంటె నవ్వు వచ్చుటయే సహజము.

**క్షాత్త్ర సమగ్రు లార్యసుత గౌరవ దీప్తులు వర్ణనీయ సౌ**
**భ్రాత్త్ర లుదాత్త దైవబలభవ్యులు దివ్య సమాను లప్పృథా**
**పుత్త్రులు వారి నాపదలు వొందునె యెపిన నింక నైన నీ**
**ధాత్త్రి గడంగి యారయువిధంబులు సెప్పుడు నేర్పు లేర్పడన్.**

అను ద్రోణుని మాటలను ఆ దరహాసితమే చెప్పక చెప్పుచున్నది.

సుశర్మ దక్షిణ గోగ్రహణము సల్ప, నగరములోని వీరు లందరును యుద్ధమునకు బోయిరి. విరాటుని కొడుకు ఉత్తరుడు మాత్రమూ అంతఃపురములో నిలిచి యుండెను. అంతలో ఉత్తర గోగ్రహణము. గోపాలురు వచ్చి యుత్తరుని 'కాంతా జనములలో', శౌర్యశాలి, కాతర పరిరక్షకుడు అను రాజోచిత బిరుదావళులు పఠించి అగ్గించిరి. ఇక ఉత్తరుడు ఉప్పొంగి పోయ దర్పములు పలుక సాగెను. "ఎత్తును గొందు కౌరవుల నెల్లను" "తగు సారథి దొరకొనినం బగతుర భంజించు టెంతపని" మున్నగు ఉత్తరకు మార ప్రజ్ఞలు విన నప్పుడు, కౌరవుల సంగతియు, నుత్తర కుమారుని సంగతియు దెలిసిన ద్రౌపది, "సామరప్యాపహాస" తరళ హృదయమైనది. ఆమె బృహన్నలను సారథిగ సూచించును. పేడివాని సారథిగం

జేసికొనుట కా మహావీరునకు రోతపుట్టినది. కాని తప్పనిసరి యగుటచే నాతడు ఉత్తరను బృహన్నల కడ కంపెను.

ఉత్తర బృహన్నలను అన్నకు సారథిగ రమ్మని వేడినది.

జగదేకవీరుడగు అర్జునుడు ఉత్తరునకు సారథి గావలెనట; అతడమ్ముద్ధియ పలుకులు ముద్దు సేసి

**నగుచు బృహన్నల యిట్లను**
**జగతీశ్వరపుత్రి నాకు సారథ్యమునే**
**ర్పు గలదె నీ మాటకు నే**
**మిగులంగా వెఱతు బోదము మీ దట్టుండెన్.**

**భవదీయ ప్రార్థనచే**
**దివిరి పరమదుష్కరములు దీర్చి యయిన ను**
**త్సవ మొనరించెద సార**
**థ్యవిధం బొక డనగ నేల యంబుజవదనా.**

అని ఆమె కోరిక కియ్యకొనును.

ఇచ్చట బృహన్నల నవ్వులో నిమిడియున్న అంతరార్థమునకు వ్యాఖ్యానమే ఉత్తర గోగ్రహణ ఘట్టమంతయు.

కౌరవ సేనం జూచి, భయపడిన యుత్తరుడు, సారథి యగు బృహన్నలతో " రయంబునం దేరు మరల్పు, ప్రాణములు తీపన మున్ వినవే బృహన్నలా" యనును.

అనిన శతమఖ తనయుడు దరహాసితవదనుం డగును.

ఆ దరహాసితములో ఉత్తరకుమార ప్రజ్ఞ లన్నియు — కౌరవసేనం జూచుటతోడనే కరిగిపోవుటను గాంచిన వేళాకోళము మాత్రమేగాక అర్జునుని ఆత్మవిశ్వాసమును నణిగి యున్నది.

బృహన్నలయే అర్జునుడని తెలిసికొనిన ఉత్తరుడు—

**చిరకీర్తిప్రియుం డగున**
**న్నరునకుం బది గలవు భవ్య నామములు మనో**
**హరముగ నవి సెపుమా యొం**

**డరయక యే నమ్మోదను బృహన్నల నిన్నున్.**

అని అడిగెను. ఎంతటి గొప్ప ప్రశ్నము!

"అనుండు నతండు నస్మితాసనుండగుచు" ఆ పదే పేళ్లను జెప్పెను.

అర్జునుడు డా యుధములు ధరించి తానే రథికుడై

**తలచుట్టు చుట్టె , గుండల**
**ములు నుష్ణీ షంబుఁ జిత్తమున భక్తి మెయిుం**
**దలప నవి వచ్చె వెంద్రుక**
**లలవడగా బాచి ముడిచె నమర దృఢముగన్.**

అర్జునుడు "ఎల నవ్వోలయు వదనమున గరువంపు జెన్ను దలకొనగా , కౌరవ వీరులను వేర్వేర పరిచయము గావించెను. యుద్ధము చేయ వచ్చినది అర్జునుడే యని గుర్తించి అశ్వత్థామ "సస్మితుం డగుచు" కర్ణుని నవలోకించి

**నిను నీవ పొగడికొని పలి**
**కిన పలుకులు పెక్కు గలవు క్రీడి యనికి వ**
**చ్చిన వాడిదె పులివలె మా**
**ర్కొనరాదే కర్ణసేనకుం బ్రియ మొసగన్.**

అశ్వత్థామ స్మితములో నెంతటి యాసడింపు అంతర్లీనమై యున్నది! కౌరవసేన యంతయు నొక్కట గరటి ఘటా ఘోటక ధట్ట రథయూథ పదాతివితతి సంరంభ శుంభత్సేనా సమూహ సహితంబుగా ద్రోచినడచిన

**ధరణి వడంకె దివిన్ దన్నిన భానుని గానరాద బం**
**ధురవివిధ ప్రకారపటుతూర్యరవంబుల బొంగె దిక్కులా**
**స్ఫురిత మహాయుధోగ్రరుచి పుంజవిజృంభణ ఘోర మయ్యె నం**
**బరమ సహస్రనేత్ర ముఖ దైవతమండల దుర్నిరీక్ష్యమై.**

అట్టియెడ అర్జునుడు "ఉద్భుటహాస్యోల్లాస భాసుర ముఖం డయ్యె నట. యుద్ధ మధ్యమున ఉత్తరుడు, "అశక్య మింకిట రథ వ్యవహారము నిర్వచింపగన్" "పుట్టినంతనుండి యిట్టిది యొన్నుడు గాన" నని ఆశ్చర్యచకితుం డగును.

అనిన అర్జునుండు "కొండొక నవ్వులయంగ జూచి"[1] యతనితో బదులు పల్కెను.

అశ్వత్థామకు అర్జునునకు యుద్ధము జరుగుచున్నది. అశ్వత్థామ ఘనతీవ్రవశరంబున కవ్వడి నారి ద్రుంచెను.

**కురు సేనలోన నిట్లె**
**వ్వరుం జేసిన వారు లే రవార్యభుజావి**
**స్ఫురణోదగ్రుండు గదే**
**గురుపుత్త్రుండ నుచు నమరకోటి నుతించెన్.**

అర్జునుడు, చిరు నగ వొప్పగాండివము సెచ్చెర సజ్యము చేసి, తిరిగి రణమున కుపక్రమించెను. అశ్వత్థామ సామర్థ్యమునకు ఉపహారప్రాయముగా నర్పించినదే అర్జునుని చిరునవ్వు.

తరువాత అర్జునుడు కృపాచార్యునితో యుద్ధము చేయ వలసి వచ్చినది. అర్జునుడు కృపాచార్యుని ధనువు ద్రుంచి, సూతుని తల నఱికి, అశ్వములను జంపి "లోచనముల నవ్వు" మొఱయ నాతని జూచెనట. పెదవులపై చిందులాడు నవ్వు కంటె గూడ లోచనముల మెఱయు నవ్వు విలువైనది. ఆ నవ్వులో గురు దక్షిణ యిమిడి యున్నది.

అట్టియెడ దుశ్శాసన శకుని దుర్ముఖ వివింశతి వికర్ణులు దన్నుం బొదివికొనిన వారల రథరథ్య కేతువర్మంబులు జర్జరితంబులుగా నేసి గాసిచేసిన నందరుం గనుకని బరవం దొడంగి బార్థుండును బ్రహ సో ల్లాసభాసి యగుచు నుత్తరుం గనుం గొ నెను.

అర్జునుడు యుద్ధమధ్యమున నోహటించిన ఉత్తరుని జూచి నవ్వుచు నేను గలుగ నీ కోహటింపనేల యని యూరార్చును.

గోపాలుడు వచ్చి ఉత్తరగోగ్రహణ యుద్ధమున ఉత్తరుని విజయ వార్త విరాటున కెరింగించిరి. విరాటుడు బ్రహ్మానంద సంభరితుం డయ్యెను. ఎవ్వరు నెక్కాలము నెట్లు సేసిరి. అని ఉత్తరు నగ్గించుచు మురిసిపోవుచుండును.

1. ఈ నవ్వునకు మాత్రము మూలమున 'ఈ పదివ ప్రహాస్య' అని గలదు

కంకుడు

**కురుపతిభీష్మకర్ణకృపకుంభజముఖ్య మహోగ్రయోధవి**
**స్ఫురణము నోర్వ జాలి రణభూమి భుజాబల ముల్లసిల్ల ను**
**త్తరుడ జయించెనేని వసుధావర యింతటికంటె నింక న**
**చ్చెరువును గల్గునే ధర బ్రసిద్ధికి నెక్కడె యాతం డొక్కడున్.**

అనును. అనిన విని విరాటుండు "సక్రోధహా సోల్లాస విక్కృతా నను డయ్యె" ను. కోపము—ఈసడింపు కలిసిన నవ్వు చాల అరుదు. తిక్కన, నవ్వు మొగమునకు వింత చెలువము నిచ్చు ననియే పలుతావుల చెప్పెను. నిజమే. ఆ నవ్వుకు క్రోధము, ఈర్ష్య కారణమైనచో "విక్కృతాననుడగును". విరాటుడు కన్నుల నిప్పులు రాలుచుండగా,

**నా కొడుకు పోటుమాటలు**
**నీ కేటికి బోసగ నాడనేరవు మా ర్ష్యో**
**ద్రేకముల బలుకుచుండుట**
**మాకు సహింపంగరాదు మానుము విప్రా.**
**అనినం జలమున గుంతీ**
**తనయాగ్రజుం డిట్టు లనియె దరహాసం బా**
**ననమున ముసుగువడంగ న**
**జ్జననాయకుతోడ నిట్టు శంకిత భంగిన్.**

ఇచ్చట ధర్మరాజు ఆననమునకు మేలిముసుగైన దరహాసము మిక్కిలి అద్భుతమైనది.

అజ్ఞాతవాసము ముగిసినది. పాండవులు తమ్మె నెఱింగించుటకుం దలపోసి నగరి కరిగి, ధర్మరాజు సింహాసనమున భీమాదులాత్మసముచితాసనముల గూర్చొనిరి. విరాటుడు కొలువు దీర్పనేగుదెంచి, విస్మయంబు నొంది యెల్లిదముగ దలచుచు

**ఇది యేమి కంక నీవు**
**న్మదవృత్తిని శంక దక్కి నాగద్దియ పై**
**బదిలంబుగం గూర్చుండితి**
**వదియును గా కిపుడు దిగ వహంకారమునన్.**

సంక్రందను నందను మందహాసమునకు పొడి మాటలతో వ్యాఖ్యా నము చెప్పుట అసాధ్యము. అనన్యసామాన్యమైన తిక్కన మాటల లోనే చెప్పుట మంచిది.

**నడదీవియలు సేసె నగరికి మాణిక్య**
**మకుటముల్ పూనిన మనుజపతులం**
**దగునాజ్ఞసూయాణముగ నొనరించె మం**
**చిగ నేలనాలుగు చెఱంగులకును**
**బ్రీతార్థిజనుల సచేతనత్యాగధ్య**
**జములుగా నన్ని దేశములం బఱపె**
**దిక్కులన్నింటను దెలుపారుపూత గా**
**వించె నుజ్జ్వలయశో విభ్రమంబు**
**రాజసూయాధ్వర ప్రవర్త కుడు నిత్య**
**సత్యభాషా మహావ్రతశాలి పాండు**
**రాజదుగ్ధపయోనిధి రాజు ధర్మ**
**రాజు సమ్ము మత్సార్వవనీ రమణ యితడు.**

**ఈత డజాతశత్రుడు మహిం దగ దిగ్విజయంబు సేసె వి**
**ద్యాతిశయార్థి వాసవు మహాసనమైనను నెక్క నర్హుడు**
**ద్వ్ తితమూర్తి కౌరవకులోద్వహు డార్యనికాయసంతత**
**ఖ్యాతచరిత్రు డీచిరుత గద్దియకుం దగడే నరేశ్వరా.**

అసాధారణమైన నిర్భర భావోద్వేగమును చిక్కబట్టు "భార మిత్రులు" తిక్కన ప్రయోగించిన నవ్వులు.

శల్యుడు పాండవసేనలో జేరుటకు వచ్చుచుండగా మార్గ మధ్యమున దుర్యోధనుడు చేసిన మర్యాదలకు సంప్రీతుండై యాతని పక్షమునం బోరాడునట్లు వర మొసగెను. కాని, తాను పాండవుల జూచి తిరిగి హస్తినగరమున కేతెంచదనని చెప్పను. దుర్యోధనుడు "అట్లుకాక వేగ మటవేయి మరలుండు, వరము మఱవకుండవలయు" నని వేడును. "దరహాసముతో ప్రమదేశ్వ రుండాలింగనము సేసి సంధియపడ కీ వరుగుమని" పలికెను. శల్యుడు దుర్యోధనుని పక్షము చేరుట వింతలలో వింత. అతని మనస్తత్త్వము గూడ వింతయైనది. అతడు పాండవులకు మేన

మామ. అతడు పాండవుల పక్షములో చేరుట వింతగాదు. దుర్యోధ నుని పక్షమున జేరుటలో యాదృచ్ఛికముగ అతడిచ్చిన వరము మాత్రమే కారణము కాదేమో!

మహాభారత యుద్ధములో జేరిన వారందరు వ్యక్తిగత హేతువులను బురస్కరించుకొని, అటూ యిటూ చేరినవారలే శల్యునకు సారథ్యము అభిమాన కళ. ఆందాతనికి శ్రీకృష్ణునితో విద్యామత్సరము గలదు. తన సారథ్య కౌశలము ఆ మహా యుద్ధమున బ్రదర్శించుటకు పాండవపక్షమున జేరిన వీలులేదు. జయాపజయములతో నిమిత్తము లేకుండ తమ తమ విశేష సామర్ధ్య విశేషములను ప్రదర్శించుకొనుటకు జేరిన వారలు ఉభయ సేనల వీరులు బహుళముగ గలరు. దుర్యోధనునకు ఆ విషయము తెలియనిది. మద్రేశ్వరుని దరహాస ముద్ర మిక్కిలి అర్థవంతమైనది. నహుషుడు దేవేంద్ర పదవి బొంది గర్వితుడై శచీదేవిని గూడ గాంక్షించును. ఆమె బృహస్పతి శరణు జొచ్చును. మునులు పరాంగన గోరుట పాపమని చెప్పుదురు. అతడు, దేవేంద్రుడు గౌతమ భార్యను గోరునపుడు మీరేల యాతనికి బుద్ధి చెప్పలేదని యెదురు ప్రశ్నించును. మునులు చేయునదిలేక బృహస్పతి పాలి కరుగుదెంచిరి. శచి భయపడెను. ఆమె మాటలు విని పురుహూత పురోహితుండు దరహాసిత వదనుండై

**నహుషుడు మహేంద్రపదవీ**
**సహితుడు శచికిన్ వరింప జను నాతనిలో**
**కహితంబు గాగ బుచ్చెము**
**మహాత్మ తచ్చిత్తమున యమర్షం బడంగన్.**

బృహస్పతి ఎత్తిపొడుపంతయు అతని దరహాసితములో బ్రస్ఫుటమైనది.

శ్రీకృష్ణుడు రాయబారియై కౌరవసభకు బోవుటకు ముందు భీముడు గూడ “ఎవ్విధమునైనను సంధి చేయవలయు” ననియు “అన్నదమ్ములమై యుండి ఒరులు తలయెత్తి చూడ నొండొరులతోడ బెనగ నేటికి నీవేల పెద్దవారి బుద్ధి విని పంచి కుడుచుట పోల దుక్కు” అనును.

అనుటయు "చిన్న నవ్వు" నగి యంబుజనాభుడు పల్కెను. భీముడు సంధి వాక్యములు పలుకుట "అగ్గి చల్లనగుటగాదె" అను అర్థమే శ్రీకృష్ణుని పిన్న నవ్వులో నిమిడి యున్నది. అంతేగాక

**వేఱ పెట్టిదియె యొన్నుడు**
**నెఱుంగని నీ యట్టివాని కెవ్వరొకో యా**
**పిఱికితన మింత యలవడం**
**గఱపిన వారనుచు శౌరి కలకల నవ్వెన్.**

దానికి దరహాసితవదనుం డగుచు భీమసేనుడు వసుదేవ సూనున కిట్లనియె.

సహజముగా నుద్రేక స్వభావుడైన భీమసేనుడు గూడ సంధి మాటలాడిన అతని రెచ్చగొట్టుటకు శ్రీకృష్ణుని "కలకల" నవ్వు, అగ్గికి ఆజ్యమైనది.

దుర్యోధనాదులు శ్రీకృష్ణుని బంధింప జూతురు. అట్టియెడ "దరహాసంబు" చేసి శ్రీకృష్ణుడు విశ్వరూప ప్రదర్శనము చూపించును. ఆ దరహాసము శ్రీకృష్ణుని విశ్వరూప ప్రదర్శనమునకు విషయసూచిక.

దుర్యోధనుడు, పాండవుల బలమునంతటిని సమయించుటకు ఒక్కొక్కరి కెంత కాలము పట్టునని భీష్ముని ప్రుచ్ఛ సేయును. భీష్ముడు "ఏను నా సాలేదు కొలంది సెప్పెద దక్కటి వారలు దమతమ చాలుటలు దారచెప్పెదరని" పాండవ సేనల సంహరించుటకుం దన కొక నెల పట్టునను.

అట్లే దుర్యోధనుడు ద్రోణు నడుగును. ఆచార్యుండు మందస్మితానందగుచు "ఏను ముదిసిన వాడ మహిష" అయినను మీ తాత సాలి నన్నిదినంబులు సాలవచ్చునని పలుకును. అశ్వత్థామ పది దినములనును. కర్ణుడు తా నయిదు దినములలో అప్పాండవ సేనా సాగరము నిపుర జేయుదునను. అతని ప్రతినకు గాంగేయుడు కలకల నవ్వును.

అట్లే ధర్మరాజు గూడ తమతమ యెపిన చందంబుల జెప్పు తన పక్షమునందున్న వీరుల గోరి, కర్ణ ప్రతిన వినిపించును. అర్జునుడు దరహాసోల్లాసభాసిత వదనుండై తాను శ్రీకృష్ణుని

తోడ్పాటుతో బాశుపతాస్త్ర ప్రయోగమున త్రిలోకంబుల నొక్క నిమేషంబునం జూర్ణంబుగావింతు ననెను. త్రిజగత్సంహార సామర్థ్యము ఆ దరహాసొల్లాసభాసిత వదనములో బ్రతి ఫలించి నది.

యుద్ధారంభమునందు, కౌరవసేన ఏకాదశాక్షౌహిణులు. పాండవసేన ఏడక్షౌహిణులు మాత్రమే. ధర్మరాజు ఎదిరి పెద్దసేన నాలోకించి కొండొక విన్ననై అర్జునుతో కౌరవసేన ఘనమయి తోచుచున్నది చూచితే? అనును. అర్జును డన్న మోగంబు జూచి పిన్ననవ్వు నగి సమాధానము చెప్పును.

సంఖ్యాబలము కాదు గదా యెల్లడ గణనీయము. పిరికి తనమునకు విరుగుడు మందు — ఆ పిన్న నవ్వు.

ధర్మరాజు, కురుక్షేత్ర యుద్ధరంగమున పాదచారియై భీష్మని కడకేగి నమస్కరించును. భీష్మడాతని ఆశీర్వదించి 'నీ తలంపేమి యనిన' 'నతడు నిన్నుం బోరగెలుచు విధము బోధింపు మనుటయు' శాంతనవుడు సస్మితాస్యుడయ్యెను.

భగవద్గీతోపదేశమునకు ముందు, అర్జునుడు "ఏను కార్ప ణ్యదోషోపహార స్వభావుడను ధర్మ సమ్మూఢ చేత స్కుండనై నిన్ను శరణుసొచ్చి యడిగెద" నను.

అర్జును విషాద యెగమును వినిన శ్రీకృష్ణుడు కలకల నవ్వి 'నరున కిట్లనియెను'

నారాయణుని ఆ కలకల నవ్వు భగవద్గీతకు ఉపోద్ఘాతము నిర్వహించినది.

మొదటి దినమున, "వీకమై దుశ్శాసనుడు నకులుని దాకును." అక్కుమారుడు దరహాసాభిరాముడై భల్ల మొక్కటి దొడ్గి అతని విల్లు దునుమును.

ధర్మరాజు శల్యుని దాకును. శల్యుడు ధర్మరాజు మహనీయ చాపమనివారణ ద్రుంచిన నాతడు శీఘ్రశీల నొండు విల్లుగొని కన్నుల నవ్వుచు బాణ ప్రయెగ మొనరించును.

దుర్యోధనుడు భీమునితో యుద్ధము చేసి మూర్ఛిల్లి తెప్పరిల్లిన పిమ్మట పోయి భీష్మని ఉపాలంభించును. మూడు లోకముల గెలువ గల నీవు 'పాండవుల కల్గగ నొల్లమి సెప్పరైతిరే,' అనిన విని "చిరునవ్వు నవ్వుచు" భీష్మడు పాండవులను దేవేంద్రుడు గూడ గెలువలేడని చెప్పను.

తన్ను తాకిన అశ్వత్థామను జూచి, అభిమన్యుడు "అల్ల నవ్వుచు" యుద్ధమునకుపక్రమించును.

శల్యసుతుడు అభిమన్యునితోపాటు ధృష్టద్యుమ్నను "ఉన్నడ్డై నొప్పించిన గెంపొదవిన మో మలతి నవ్వు నొప్పన నొప్పెన్." భీముడు, కౌరవ కుమారుల దాకును. దుర్యోధనుడు "తమ్ములు వీగినం" భీము నెదిర్చి తనువు తూటులు సేసిన, భీముడు సూతు బిల్చి వేగమ్మ రథముపై కరిగి కన్నుల నిప్పులు రాల నవ్వను. కురుక్షేత్రమున భీముడు దుర్యోధను నెదుర్కొనుట. భీముడు నవ్విన కన్నుల నిప్పులు రాలినవను వర్ణన తిక్కన చలన చిత్రణమున కుదాహరణ ప్రాయము.

భీష్మని దాకుటకు అర్జునుం డేగు చుండును. రారాజు సంతసింప అశ్వత్థామ అర్జును నాపి 'షడ్బాణ విద్ధాంగుం' జేయును. కిరీటి నవ్వుచు దదియంబైన చాపంబు ద్రుంచును.

భీముడు ద్రోణాచార్యుని మూర్ఛిత్తు జేయును. అశ్వత్థామ దుర్యోధనుడును గలిసి అతని నెదుర్కొందురు. భీముడు విల్లు వదలి ఎల నవ్వు చెన్నగ గదాఘోరాకృతిం దేరు డిగ్గి యుద్ధమున కుపక్రమించును.

ఇరావంతు మరణము విని అర్జునుడు శోకించును. ఇట్లు పుత్ర శోకానల సంతప్త చిత్తుండగు సవ్యసాచిం జూచి గోవిందుండు మందస్మితంబు సేయును. రెండవ మారు తనపై లంఘించి వచ్చు శ్రీకృష్ణుని జూచి భీష్మడు 'ఉల్లము వికాసము నొందగ నల్ల నవ్వి వేగమ జనుదెమ్ము వికస్వర పుండరీకలోచన' యని ఆహ్వానించును.

ద్రోణుని విజృంభణమునకు గలంగిన కౌంతేయసేనం గనుంగొని దుర్యోధనుడు కలకల నవ్వుచు గర్ణునకు జూపించును.

భీముని గూడ 'వీడు రాజ్య విభవ కాంక్ష యెల్ల దగ టారగ బారెడు నట్లు సూడుమీ' యని చూపించును.

భగదత్తుడు సుప్రతీకముపై పాండవసేనను గొల్లల సేయును. ఒక మూల సంశప్తకులతో యుద్ధము సేయుచున్న అర్జునుడు శ్రీకృష్ణునితో రథమును సుప్రతీకము వైపు మరలింప గోరును. రథమును శ్రీకృష్ణుడు మరలింపగ, వెనుకనుండి, 'పార్థ పార్థ యిట్టు వో దగునే యే మనికి బిలువ బిలువ' నని వెంట బడుదురు. అర్జునుడు "మోమునం గినుక మునుంగు నవ్వులయ" ద్రిగర్తుని చాపదండ కేతనములు ద్రుంచి యతని మూర్ఛితు జేయును.

అర్జునుడు భగదత్తుని సంహరించిన యనంతరము శకుని వచ్చి తాకును.

అతండు మాయావి యగుట ననేకమాయలు గల్పించిన మొగిళ్లు వరగి పాషాణ వృక్షవివిధాయుధంబులు వివ్వచ్చుపై గురిసేం బదంపడి తమం బదరె బిదప నీళ్లు వెల్లిగొనియె మరియు మహోరగశార్దూలాదిక్రూర సత్త్వంబులు గవిసె వాని నెల్లను దోడ్తోన దివ్యాస్త్రవేది యగు నా సవ్యసాచి యడంగించి యల్లని నగవుతో నిట్లనియె.

**మాయలు జూదము తోడన**
**పోయెంగా కింక నిచటం బోసగునె యివి మ**
**త్సాయకము లడ్డసాళ్లే**
**నీ యాచవి లేదు పొమ్ము నిలువక మామా.**

అభిమన్యుడు పద్మవ్యూహమును జొచ్చుటకుద్యుక్తుడై సారథిం గనుంగొని మన యరదంబు ద్రోణానీకంబుపై బరపు మనుటయు నా సుమిత్రుం డర్జున పుత్రున కిట్లనియె.

**బాలుడవు నీవు కుంభజప్రముఖ సైన్య**
**పతులు ప్రౌఢులు పెక్కులు బవరములకు**
**జొచ్చి యెరుం గని నీ చేత జచ్చువారు**
**గారు బహువిధసమర కర్కశులు వారు.**

అనవుడు అభిమన్యుడు అల్ల నవ్వి సారథిని 'పెలుచం దరిమిన' అతడు రథంబు బోనిచ్చును.

కౌరవ వీరు లందరు నొక్కుమ్మడి అభిమన్యునిపై గవి యుదురు. వారు రథ నేమి గజ ఘంటా తురంగ కింకిణీ స్వన సింహనాద మేదుర రోదోంతర రౌద్రంబుగా సౌభద్రుం జుట్టు ముట్టిన నతండు అట్టహాసంబు సేసి లాఘవ లక్ష్యశుద్ధి చిత్రత్వ ధృఢత్త్వంబులు మెరయ యుద్ధమొనరించును.

దుశ్శాసను డభిమన్యుచే భంగపడుట చూచి రాధేయు డాతని తలపడి పోరి డస్సిపోవును. వెనువెంటనే కర్ణుని తమ్ముడభిమన్యుని దాకి అతనిపై అశ్వములపై సూతునిపయి బాణముల గుప్పించును. “కమల చారు ముఖంబున నెఱ్ఱ నవ్వు చెన్నయి విలసిల్ల” భల్లమునన అభిమన్యు డతని శిరంబు దునుమాడును.

అభిమన్యు విజృంభణంబ నివార్యంబగుట కర్ణుడు ద్రోణుని జేరి ‘గాండీవి గలనం గదిసి యొరుంగు దమకాదె యతనిచే ఇంత బెట్టిదంబు గాదని చెప్పిన విని యల్లన నగి గురుం డతని కిట్లనియె.

అభిమన్యునకుం దోడుగా నరుగు పాండవులకు సైంధవు డడ్డుపడెనని విని, అర్జునుడు పరవశుడై యొక్కింత సేపునకు సెద దేరి

**అపుడు గఱచి యొట్టనగు నానానంబుతో**
**భూమలు ముడిచి చెమట పొడమ మేను**
**కంప మొందం గనలు గదిరిన కటికి న**
**వ్వేసక మెసంగ నన్ను గిట్టులనియె.**

అర్జునుడు స్వప్నమున గైలాసంబున కేగును. “అన్నర నారాయణుల దైసం బ్రసాద మందస్మిత సుందర విలోకనంబు లొలయ ఆయ్యిందు ధరుండు మధుర స్వరంబున నిట్లనియె.”

సైంధవ వధ కుద్యమించి యుద్ధ సన్నద్ధుడైన అర్జునుడు ధర్మరాజునకు మ్రొక్కగ, అతడు తమ్ముని కౌగిలించుకొని ‘దరస్మిత రుచిరాననుండై’ దీవించును.

సైంధవ వధకై ఉత్సహించి పోవుచున్న అర్జునునకు దుశ్శాసను డడ్డుపడినను “కవ్వడి పెలుచ నవ్వి” దేవదత్తం బొత్తి గాండీవ జ్యానినాదంబు రోదసీ కుహరంబు మేదురంబుగా బరపును.

సైంధవ సంహారమునకై పలువురు వీరుల దాటి పోవుచున్నపుడు ఎదురైన ద్రోణాచార్యునితో అర్జునుడు, "మేలు దలంపు శోభనము మేకొని చేయుము నాకు బాండు భూపాలుని ధర్మనందనుని పంకజనాభుని యట్లకావే" అని ప్రార్థన సల్పెను.

**నను నశ్వత్థామను నీ**
**వనఘా సరికూర్మి బెనిచి తట్లగుటను ద్రో**
**హిని సైంధవు జంపగ బా**
**నిన నాయుచిత ప్రతిజ్ఞ నెఱపుము కరుణన్.**

అని ప్రతిమాలు కొనును.

**అనుడు బిన్ననవ్వోలయంగ నస్త్రగురుడు**
**నరునిపై జూడ్కి సాఖించి నన్ను గెలువ**
**కెట్లు సైంధవు జేరెదం చేసే రధ్య**
**ములును హరియును నతడు నమ్ముల మునుంగ.**

అని బాణముల నేసి "రుచిస్మిత మహితుం డగుచు" అర్జును వింటి నారిని ద్రెంచెను.

పిమ్మట శ్రుతాయుధుడు రభసంబున నెదిర్చి నిల్వగ "బార్థుడేల నవ్వులయ" నతని సారథి గూర్చి యశ్వముల జంపి విరథునిం జేయును.

సైంధవ వధ ఘట్టమున కురుసేనల నుగ్గు నుగ్గు చేసి కురుసేనం గనుపు కొట్టి నవ్వుచున్న కవ్వడిం గనుంగొని కమల నాభుండు, హరులిత్తఱి నీళులు ద్రావక తెప్పిఱి వెట్లొకో శత్రు సైన్య భీకరమూర్తి' అనును. అది యుద్ధమధ్యము. సంగ్రామ క్షేత్రాంత రమున "నీళు లొదవిన హయముల్ నిన్ను గెలిపించునని" శ్రీకృష్ణుడు చెప్పగా అర్జునుడు "కన్నుల నగి" దివ్యాస్త్రమలతో ధరపగిల్చికొల నుత్పాదించి బాణములతో గట్టు కట్టును.

**హర్ష మందస్మితముతోడ నమ్మురారి**
**యపుడ హయముల మేయు వెట్టునట్లు సేసి**
**తఱిమి నీళులు ద్రావించి తడవి మగుడ**
**దెచ్చె మనయోధు లెల్లను బిచ్చలింప.**

సైంధవుడున్న చోటు చేరిన మహోత్సాహముచే "మంద స్మిత సుందర వదనేందు లగుచు హరియు నరుడు" ముందున కురవడించిరి. సైంధవ రక్షణకై నియుక్తులైన పెక్కండ్రు వీరు లొక్కుమ్మడి నర్జుననపై పొదువుడు, "కినుక మానిన నవ్వు రౌద్ర రసంబు నలంకరింప" నత డందరిపై బాణవర్షము ముంచును.

సైంధవ వధానంతరము శ్రీకృష్ణుడు "ఉద్ధత మంద స్మితాస్యుడగుచు" ధర్మతనయు గానఁబోవంగ వలయు" నను.

ద్రోణుని యైదవనాటి యుద్ధమున "చంపం జాలుడు నే నొకండన భుజాశక్తిన్ నరున్" అని విజృంభింప సాగును. కృపాచార్యుడీ మాటల విని, 'అలంతి నవ్వుతో' గర్వమునకు ఘోష యాత్రను ఉత్తర గోగ్రహణమును జ్ఞాపకము చేసి 'క్రొవ్వులు వల్కకు సాలు నిన్నియున్' అని మందలించును.

సేనాపతియైన కర్ణుని దాకి నకులుడు నొప్పించును.

**అలుక వోడమి కర్ణుండు న**
**కులు చాపము ద్రుంచి సూతు గూల్చి తురంగం**
**బులం జంపి చక్రరక్షుల**
**తలలు నటికి సిడము ద్రుంచి దరహాసముతోన్.**

తరువాత నకులుడు కర్ణునితో యుద్ధమొనరింపలేక పాఱును.

**వెనుకొని రాధేయుడు నిజ**
**ధను వాతనికంధరమున దగిలిచి నలి బ**
**ట్టిన నింద్రచాప పరిగత**
**ఘనాకృతిని బొలిచె నతడు కౌరవనాథా.**

కర్ణుడు, అర్జును రథమును జూపిన వారికి "పసదన" మొసగదనియు, నిద్దరు కృష్ణులం జంపి వారి ధనముల నిచ్చెద నియు ప్రగల్భములు వలుక "ప్రహాస భాసుర ముఖుండై" మ్రదవిభుడు, "ఎవ్వరు సూపనేల నరు నిప్పుడ కాంచెదు రిత్త వారికం గ్రొవ్వన నుజ్జ్వ లార్థములు గొండని యావల దిట్టు లిచ్చెనన్ నవ్వ జనంబు" అని కల్పించుకొని సమాధానము చెప్పను.

"వినుము కర్ణ, కర్ణులు వేవురైనం గిరీటిని గెలువం జాలుదురే" అని శల్యుడనుటయు, కర్ణుండు "ఎట్టినైన కన్నుం గవ తోడి నవ్వు నవ్వుచు నిట్లనియె."

ధర్మరాజు "హతసారథికం బగు రథంబు దొలగం దోలు కొని పోయినం దోడన తవిలి నిలువరించి "హాసభాసితుండగుచు" నయ్యుంగపతి యతనితో నిట్లనియె.

భీముడు శ్రుతవర్మాది కురుకుమారుల బెక్కండ్ర జంపి విజృంభించి నపుడు రోష రంజితముఖుండయి కర్ణుడు అతని దాకును.

**రయమున బంచవింశతిశరంబులు మేన నిగిడ్చి భల్లసం**
**చయహతి విల్లు సక్కడచి సస్మితవక్త్ర సహస్రపత్త్రల**
**క్ష్మీ యతిశయిల్ల రథ్యములం జెందిన మారుతి యేచి విద్విష**
**ద్భయద గదారుచిస్ఫురిత బాహువిలాసవిభాసమానుడై.**

అశ్వత్థామ, మార్గణోజ్జ్వలం బగు దక్షిణకరంబున నా ఫల్గును బిలిచి "హాస భాసితముఖుండగుచు" గుపితుండగు నతని కిట్లనియె.

కర్ణుడు పాండవ సేనార్ణవమున మంధరనగము ననువమర సిరము మేరయ దిరుగ జొచ్చినం జూచి అర్జును డాతని దిక్కున రదము వోనిమ్మని జెప్పును.

నలిన నాభుడు దరహాసితంబుతో ధవళహయములు మెరయ నద్దిక్కు సత్వరముగ దేరువోవ నిచ్చె.

ధర్మరాజు పై విజృంభించిన కర్ణున కడ్డముగ నకుల సహదేవులు నిలిచి పోరిరి. కర్ణుడు 'చిఱు నవ్వులయ' వార లిరువుర నిగ్రహించెను.

పరాభవఖిన్నుడైన ధర్మరాజు యుద్ధము విరమించి శిబిరము చేరి సెజ్జపై నేకాంతముగ శయనించి యుండ, అతని సేమ మరయుటకై కృష్ణార్జునులు వచ్చిరి. 'వారలు రాధేయు వధించి వచ్చిరి కా'దలంచి దెందంబలర మందస్మితంబుతో నభినందించును. నాటికేయమైన యీ మందస్మితము మరుక్ష

ణములో కెంజాయ రంజిల్ల కన్నులతో మహారోషావేశముగా మారి పోయినది.

భీముడు దుశ్శాసనుని దాకి 'నిన్నిటు సేర దెచ్చుటం జేసి విధాత నాకు గృప సేయుట గానగ వచ్చె దమ్ముడా' అనును. 'ఏల రిత్తమాట వేటుపోటు తలకు వచ్చి' యని దుశ్శాసను డాక్షేపింపగ, భీముడు "దరహాసమున గెంపు గదుర" ఆతని దాకును.

కర్ణార్జునులు ఎక్కటి కయ్యమునం దాకిరి.

**అలిగి కడంగి సూతసుతుం డచ్యుత పార్థుల దీవ్ర బాణపం**
**క్తుల బొదువం బరాక్రమకుతూహలి యువ్విజయుండు పిన్న న**
**వ్వొలసి ముఖాంబుజంబునకు నొప్పుగం దద్రథ రథ్య కేతుసూ**
**తులను దదియగాత్రమును, దూపులవెల్లి మునుంగ జేసినన్.**

కర్ణార్జునులు లొండొరుల మిగిలి యెక్కటి కయ్యము సల్పుచుండుట జూచి శ్రీకృష్ణుడు 'చక్రమిచ్చెద నితని మస్తకము దునుము' మనిన నగుచు కిరీటి బ్రహ్మాస్త్రమును బ్రయోగించెను.

ఆ ధనంజయుం డతని వింటి నారి వికలంబుగం జేసి

**చిరునగవుతోడ మైమఱు**
**వఱువుల్లగ జేసి యతని యంగము దోగం**
**బఱపె రుధిరంబు బెడిదపు**
**మెఱుగు వెడదయంపగమి నమిత్రులు దలకన్.**

ప్రాణము నొడ్డి పోరు నప్పుడు గూడ వీరులకు తిక్కన తన చిరునవ్వు ముద్రవేయక విడిచిపుచ్చలేదు.

ద్వైపాయన హ్రదమున దుర్యోధను డున్నట్లు తెలిసికొని పాండవు లచ్చటి కేతెంచిరి.

**కలకల నవ్వుచం బెలుచం**
**బలుకుచు దమకెలకులందు బాంచాలకుమా**
**రులు సనుదేరగ బాండు సు**
**తులు వచ్చిరి సంతసంబుతో మడువునకున్.**

దుర్యోధనుడు హ్రదమలో నుండి బయల్వెడలుట గాంచి పాంచాలురును బాంధవులును చిఱుత నగవుతో నెండొరు చేతులప్పళించి నిర్భర సంతోషలీల నొప్పిరి.

శివుని పరివారములోనివారు' సాత్త్విక వ్యాపార ఘోరత్త్వంబు గనుంగొని వినోదించుటకు వచ్చి, అశ్వత్థామ చిత్తంబునకు బెదరు పుట్టించు వారై భీషణాకారంబుల నుల్లసిల్లిన నా ధైర్యధుర్యుండు.

**వెఱపావంతయు లేక వారి గలయన్ వీక్షించి నెమ్మోమునం**
**జిరు నవ్వున్ మది దెంపుసొంపు వెలయం జెల్వంబు రెట్టింప నం**
**దరు గీర్తింప రథంబుమీది ఘనకోదండంబు చే నంది చి**
**చ్చురు కం జేరె నుదాత్తభంగి మహనీయెత్సాహ సందీప్తుడై.**

శివునకు ఆత్మోపహార మొసంగ సంకల్పించుకొనిన అశ్వత్థామ నెమ్మోము నందలి చిరునవ్వు, అతని మదిలోని తెంపు సొంపు వెలయించి ఉదాత్త భంగి అతడు చిచ్చుఱకం జేరెను. తిక్కన సమకాలీనమైన సహగమనములు - జంపుడు గుళ్లలో గండకత్తెరల కాహుతియగుటను జూచినవాడు గావున మది తెంపు సొంపు వెలయించి, చెలువము రెట్టింప నందఱు కీర్తించు చిరు నవ్వును వర్ణింప గలిగెను. ఈ చిరునవ్వులో దిక్కన అనుభవ ముద్ర జీవనాడివలె స్పందించుచున్నది. "ఇట్లెదుర నిలిచిన భక్తవత్సలుండగు భవానీవిభుండు దరహాసితముఖుండగుచు ఆశ్వత్థామకు ఖడ్గమును బహుమానికరించెను.

ధృతరాష్ట్రుడు ఇనుప భీమునిం దన కౌగిటం బోడి పొడి గావించి మెఱమెచ్చునకై భీమునిం బేర్కొని హాహాకారంబు లెసంగ రోదనంబు సేసినఁ జిరునవ్వునం దన వదన కమలం బొప్ప గమలనాభుం డతని కిట్లనియె. సంస్కృత మహాభారతము చెప్పిన మహాప్రాజ్ఞుడు తెలుగు భారతమున 'త్రికాలవేది' యైన శ్రీకృష్ణుడు పరేంగితజ్ఞుడై ఇనుప రూపమునే ధృతరాష్ట్రుని కౌగిట నమరు నట్టి ఏర్పాటు చేసి యుండెను. వంచింపబోయి వంచితుడైన ధృతరాష్ట్రుని గాంచి నపుడు శ్రీకృష్ణుని వదన కమలమున నొప్పిన చిరునవ్వు దర్శనీయము. ఆంధ్ర భారతమున అక్షర రూపమున వెలసిన ఆ చిరునవ్వు యుగయుగాంతరములు సహృదయులు సందర్శించి మురిసిపోవుదురు గాక.

శాంతి పర్వమున పట్టాభిషేకమునకు ముందు ధర్మరాజు కురుక్షేత్రమున జరిగిన సకల ప్రజా సంక్షయమునకు నిర్విణ్ణ హృదయుడై 'భైక్షచర్యావిధి జీవనము నడుపుద' మనును. ఆ మాటలు విని "యింద్రాంశ సంజనితత్త్వ కలిత తేజోధనుండగు ధనంజయుండు దనయుష్మలత్త్వంబున నవ్వాక్యంబులు దుస్సహంబులైనం బదరి దరస్మితంబున దద్వికారంబు గప్పి యప్పుడమి రేని కిట్లనియె."

పట్టాభిషేకానంతరము, ఒక్కనాడు రేపకడ ధర్మరాజు ధ్యానాసక్తుడై యున్న శ్రీకృష్ణుని కడ కేగి యతని స్తుతించును. పాంచజన్య ధరుండు బుద్ధియు మనంబు నింద్రియంబులను గోచరత్త్వ సంప్రాప్తంబులు గావించి కొంచెపు నగవున నెమ్మొగం బొప్ప నప్పుడమి రేని నాలోకించెను.

అనుశాసనిక పర్వమున కద్రువ, వినత సాగరతీరమున విహరించుచున్న ఉచ్చైశ్రవమును గాంచిరి. వినత ఆ తురగోత్తమము యొక్క మనోజ్ఞ సితచ్ఛవి ప్రస్తుతించెను. 'ఎడ్డె మనిన తెడ్డె మను' వారందురు గద. కద్రువ 'అపరాంగమున నీలిమ దోచె' నను. వినత "నీవనినది నవ్వులాటకా నిజమా యని రెట్టింప, కద్రువ తన అసత్యము మొగముపై దోచకుండునట్లు దరస్మితమున మాటు పెట్టి, ఇది యేటి మాట నల్లని యెడ గానరాదె తెమలం బలుకం బనియేమి" అని గద్దించును. అసత్య మాడు నప్పుడు, విదగ్ధ వనితలందు దోచు దరస్మితస్ఫురిత వక్త్రమును తిక్కన 'తెలుగు భారతమున' ఛాయాచిత్రముగ దీసి దింపెను.

యాగాశ్వము వెంటబోవుచు అర్జునుడు తిరిగి గాండీవము ధరింపవలసి వచ్చినది. కాని అజాత శత్రుడైన ధర్మరాజు, శత్రువుల చంప వద్దనియు సామముచే జయము సాధించుకొని రమ్మని ఆజ్ఞాపించును. సంశప్తకులు అశ్వమున కడ్డము వచ్చినపుడు, అర్జునుడు "ప్రియంబులుగావొకో మీకు బ్రాణముల్ వలవదు పాండని" చెప్పును. వారు అతని మాటల సరకు గొనరు. అంత అర్జునుడు

**"ఎఱ్ఱ నవ్వు తన మోమున దమ్మికి లేత యెండ యై**
**చెలువము చెన్ను వింతలుగ జేయగ"**

యుద్ధమున కుప్రకమించెను.

మౌసల పర్వమున సాత్యకి కృతవర్మ నధిక్షేపించు ఘట్టమున, ఘూర్ణితారుణంబు లయిన నేత్రముల సాత్యకి కృతవర్మ వదనము గనుగొని, అవమాన మేర్పడు భంగిపెలుచ నవ్వి" చచ్చిన వారితో సమానమగు నిద్రామత్తుల సంహరించుటకు "తుచ్ఛుండు" గూడ పాల్పడ డనియు ఇక రాజసుతుని మాట చెప్పనేల యని అధిక్షేపించును.

అవమానించుటకు నవ్వు వజ్రాయుధము.

మహాప్రస్థానమున కేగు నపుడు ధర్మరాజు శౌరల యనుమతి వేడును. శౌరలలో ఏకవాక్యత కుదురక వివాద ముదయించెను. కలి యుగంబు ప్రవేశించుటంజేసి కాదే ఇట్టివి పుట్టెడు నని సహదేవుండు నవ్వుకొనుచు ధర్మరాజునకుం జెప్పును. ధర్మరాజును నవ్వుచు మన మనవులు సాలునని వల్క లాజినంబులు ధరించి, మహాప్రస్థానమున కుద్యుక్తులైరి.

స్వర్గమున దుర్యోధనుని జూచి ధర్మరాజు కలత నొందును. ధర్మరాజు పుణ్యాత్ములైన పాండవులు కన్పింపకపోవుట! మీదు మిక్కిలి "అతిలోభప మానసుడగు" దుర్యోధనుడు కన్పించుట! ధర్మరాజు 'ఈ తులువ, యే నెట్టివాని తోడ గలిసి మెలగుదునె' యని మరలును.

ధర్మరాజునకు ఇంకను మర్త్యలోక వాసనలు పూర్తిగా వదల లేదు. నారదుండు నవ్వుచు ధర్మరాజు

**'ఇది పుణ్య లోకము మది నీసురోష**
**మను మనే వికృతులు తగునయ్యా'**

అని ప్రబోధించును.

నారదుని నవ్వులో అనిర్వచనీయమైన స్వర్గ మర్త్య లోకముల తారతమ్య మంతయు నణగి యున్నది.

తిక్కన ప్రయోగించిన కడపటి నవ్వు దేవేంద్రుని ముఖమున విరిసిన దరహాసము. ధర్మరాజు తనతో వచ్చిన కుక్కను

విడిచి స్వర్గారోహణము సలుప జాలనని దేవేంద్రునకు విన్నవించును.

ధర్మరాజు ధర్మనిష్ఠ గాంచిన దేవేంద్రుని ముఖమున దరహాసము విరిసినది.